بسم الله الرحمن الرحيم

صحفا مطهرة فيها كتب قيمة

పవిత్రమైన ఈ పుటలలో సమస్త సత్యవేద (సారమును) గలదు.

ఖుర్ ఆన్ షరీఫ్

సవివరణ ఆంధ్రానువాదము

లఘువ్యాఖ్యాన సహితము

RAHIMIA BOOK DEPOT
رحیمیہ بک ڈپو
گنٹور
GUNTUR

★

మొహమ్మద్ ఖాసింఖాన్ ఎం. ఏ.

ప్రథమ సంపుటము

హైదరాబాదాంధ్ర సాహిత్య పరిషత్తు
హైదరాబాద్ (దక్కన్)
1945

ద్వితీయ ముద్రణము

1000 ప్రతులు

అన్ని హక్కులు గ్రంథకర్తవి

వెల 5-0-0

بسم الله الرحمن الرحيم

ప్రథమ ముద్రణమునకు

తొలిపలుకు

ఇప్పటికి పదకొండేండ్లక్రిందట డాక్టర్ చిలుకూరి నారాయణరావుగారు, ప్రకటించిన 'ఖుర్ ఆన్' ఆంధ్రానువాదము చూచుట తటస్థించినది. కొన్ని పేజీలు చదువుసరికి అది సరియైన అనువాదము కాదనిపించి వెంటనే మూలమును చూడగా నా అనుమానము స్థిరమైనది. శ్రీ నారాయణరావుగారి అనువాదము బహు దోషభూయిష్ఠమును, ఇస్లాంమత సంప్రదాయ జ్ఞానశూన్యమును అని నేనప్పుడు ౧౯౩౦, జులై ౧౨వ తేదీ ఆంధ్రదినపత్రికయం దొక దీర్ఘవిమర్శన వ్యాసమును వ్రాసితిని. నిజాంరాష్ట్రాంధ్ర పితామహులగు శ్రీ మాడపాటి హనుమంతరావుగారా వ్యాసమును చదివి దానిని శ్లాఘించుచు నాకొకఉత్తరము వ్రాసిరి. అందు ఖుర్ ఆన్ గ్రంథఆంధ్రానువాదము నేనే చేసిన బాగుండు ననియు, అట్లు చేసినచో తాము సాయమొనర్తుమనియు, అత్యంతోత్సాహ జనకమగురీతి నభిప్రాయమిచ్చిరి. అదివరకు ఖుర్ ఆన్ షరీఫు ననువదించవలె నను భావమైన లేని నాయందా లేఖ ఒక క్రొత్త అభిలాషను అంకురింపజేసెను. మహత్తరమైన ఈ కార్యమునకు నేను తగుదునా తగనా అను వివేచనమైనను చేయక వెంటనే తదనువాదమునకు వలయు పరికరములను సంపాదింప సాగితిని. ఇట్లు ప్రారంభమైన ప్రయత్నమునకు ఫలమే ఈ యనువాదము.

ఖుర్ ఆన్ గ్రంథము ౩౦ కోట్ల జనసంఖ్యగల ముస్లిమ్ ప్రపంచమునకు వేదము. ఈ జనసంఖ్య ఒక దేశమునందుగాని, ఒకఖండము

నందుగాని పరిమితము గాక ఆసియా, యూరప్, ఆఫ్రికా, అమెరికా ఖండములందు వ్యాప్తమైయున్నది. ప్రపంచమందలి సమస్త నాగరికతలతోడను ముస్లిములకు సంబంధమున్నది. తూర్పున చైనా జపాను దేశములు మొదలుకొని పశ్చిమమున ఆసియా మైనరు వరకు గల సమస్త ఆసియాఖండ దేశములందును ముస్లిములు ప్రతిదేశ జనసంఖ్యయందును ఒక ముఖ్యాంశమై యున్నారు. ముస్లిము సంఘ మొక అంతర్జాతీయ సంఘము. ఖుర్ఆన అందుచేతనే ఒక ప్రపంచసందేశమును వినిపించుచున్నది.

ఖుర్ఆన్ అనగా "గ్రథిత మొనర్పబడినది, లేక పఠింపబడినది" అని అర్థము. శ్రేష్ఠతమమగు ఉపదేశవాక్యము లిందు గ్రథిత మొనర్పబడుటచేతను, నిత్యపఠనమునకై ఇది ఉద్దేశింపబడుటచేతను, ఈ గ్రంథమున కీపేరు వచ్చినది. ఇది అరబీభాషయందు భగవదాజ్ఞచే శ్రీ మొహమ్మద్ ప్రవక్త హృదయ ఫలకమున నవతరించిన గ్రంథరాజము. శ్రీ మొహమ్మద్ ప్రవక్త ఈ గ్రంథమును సాంతముగ రంజాన్ మాసములో దర్శించిరి. అందుచేతనే ఈ మాసము పవిత్రమాసముగ పరిగణింపబడుచున్నది.

ఖుర్ఆన్ గ్రంథము 'సూరా' లనబడు ౧౧౪ అధ్యాయములుగ విభజింపబడినది. 'సూరా' అనగా అంతస్తు. ఈ సూరాలు రెండు విధములైనవి: దీర్ఘములు, హ్రస్వములు. దీర్ఘాధ్యాయములు పెక్కు 'రుకూ' లుగా విభజింపబడినవి. 'రుకూ' యందును పెక్కు 'ఆయత్' లు కలవు. 'ఆయతు' ను నేను 'సూక్తి' అని అనువాదమున వాడితిని. 'ఆయత్' అనగా 'గుర్తు, చిహ్నము' అని అసలర్థము. కాని 'భగవత్సూక్తి' లేక 'మహాత్మ్యము' అను అర్థములో ఇక్కడ వాడబడినది. పఠన సౌలభ్యమునకై ఖుర్ఆన్ గ్రంథమును ౩౦ భాగములుగ విభజించిరి. కాని ఇందు విషయవిభజనములేదు. ఖుర్ఆన్ గ్రంథమునందు మొత్తము ౬౩౬౦ సూక్తులు కలవు.

శ్రీ మొహమ్మద్ ప్రవక్త ౨౩ ఏండ్ల దీర్ఘకాలములో ఈ గ్రంథమును దర్శించిరి. ఇందులో కొంతభాగము మక్కాపట్టణమునందును, మరికొంతభాగము మదీనాపట్టణమునందును ప్రోక్తమైనది. శ్రీ ప్రవక్త ఈ కాల పరిమితిలో ౧౩ ఏండ్లు మక్కాపట్టణమునందును, ౧౦ ఏండ్లు మదీనా పట్టణమునందును ఉండిరి. అందుచే ఇందలి ౯౩ అధ్యాయములు మక్కాయందును, ౨౧ అధ్యాయములు మదీనాయందును ప్రోక్తమైనవి. ఇదంతయు శ్రీ ప్రవక్తచేతనే సంకలిత మొనర్పబడెను. ప్రవక్త శిష్యులలో అగ్రగణ్యులును, ప్రథమ ఖలీఫాయు నగు హజరత్ అబూబకర్ శ్రీ ప్రవక్త పఠించుచుండెడి క్రమము ననుసరించి పెక్కు ప్రతులు వ్రాయించి ప్రపంచమునందలి ముస్లిమ్ కేంద్రము లన్నిటికిని పంపించిరి. ఈ విధముగ ఖుర్ఆన్ గ్రంథములో పాఠభేదములుగాని, ప్రక్షిప్తములుగాని, శిలకాండములుగాని లేవు. ఒక్క అక్షరమైనను భేదము లేకుండా ప్రపంచమంతటను ఒకే గ్రంథము ప్రచారములో నున్నది. ఇట్లు పాఠభేదము ఈషన్మాత్రమైనను లేక స్వచ్ఛమైన మూలపాఠము గల గ్రంథము ఖుర్ఆన్ ఒక్కటే యని చెప్పవచ్చును. "ఈ గ్రంథము నాచే ప్రోక్తమైనది. నేనే దీనికి సంరక్షకునిగ నుందును." (౧౫ : ౯) అని ఖుర్ఆన్ లో భగవద్వాక్కు.

ఖుర్ఆన్ పెక్కు నామములతో వ్యవహరింపబడుచున్నది. ఈ నామములు ఖుర్ఆన్ లోనే కలవు. అందులో ముఖ్యమైనవి: 'ఫుర్ ఖాన్' (సత్యాసత్యములను విచక్షణచేసి చూపునది), 'అజ్జికర్' (జ్ఞాపకము చేయునది), 'అల్-ముహైమిన్' (వెనుకటి సత్యవేదములను సంరక్షించునది) ఇవి ముఖ్య నామములు. ఖుర్ఆన్ యొక్క పరమార్థము ఈ నామములయందు ప్రతిఫలించుచున్నది.

ఖుర్ఆన్ గ్రంథము ఒక క్రొత్త వేదము కాదు. ఇస్లాం మతమొక క్రొత్త ధర్మమును కాదు. సత్యమువలె రెండును అనాదిసిద్ధములైనవే. అదే విషయము ఖుర్ఆన్ లో మాటిమాటికి చెప్పబడినది:—

"సత్యమును నిరూపించుటయే (ఖుర్ ఆన్) ఉద్దేశము."

"నిశ్చయముగ నీకు (మొహమ్మద్ ప్రవక్తకు) పూర్వము సమస్త దేశములకును ప్రవక్తలను పంపియుంటిని. ఇప్పుడు నీకు వెలువరచుచున్న గ్రంథము (ఆ గ్రంథములను తారుమారొనర్చి వాని ననుసరించుచున్న) వారి సంశయములను బాపి వారెక్కడ పొరపడిరో చూపుటకు మాత్రమే." (౧౬ : ౬౩, ౬౪).

"ప్రవక్తా! నీతో వాదముచేయువారితో నిట్లు చెప్పుము: మేము మీకు ప్రకటించిన సత్యమును, మీ ప్రవక్తలు ప్రకటించిన సత్యమును విశ్వసింతుము. మీ దేవుడును మా దేవుడును ఒకడే. మేము అతనికే విధేయులము." (౨౯ : ౪౬)

"ఇప్పుడు మీవద్దనున్న సత్యమును నిరూపించుచు ఇది వెలువరచబడినది." (౨ : ౪౧; ౨ : ౮౧; ౨:౧౦౦; ౬:౯౩; ౩౫ : ౩౧.)

"సత్యముతో గూడిన గ్రంథమును మేము వెలువరచితిమి. ఇది ఇంతకుముందున్న గ్రంథములందలి సత్యమును నిరూపించి చూపునది. (అంతేకాదు; ఆగ్రంథములందలి సత్యము కలుషితము కాకుండ) కాపాడునది. అందుచే ఎవరు సత్యమార్గమున నున్నారో ఎవరా మార్గమును తప్పి చరించుచున్నారో భగవత్ప్రోక్తమగు జ్ఞానమునుబట్టి నిశ్చయింపుము. అంతేకాని తుచ్ఛమగు మీ వాంఛల ననుసరించి మీకు ప్రోక్తమైన ఈ సత్యమును నిరాకరింపకుడు. మీ యెల్లరకును (అన్ని జాతులకును) ఒక్కొక్కరికి ఒక్కొక్క ధర్మమును, ఒక్కొక్క మార్గమును నియామక మొనర్చితిని. భగవంతు డిచ్ఛించియుండినచో మిమ్ముల నందరను ఏక జాతీయుల నొనర్చి యుండెడివాడు. కాని మీకు వెలువరచిన దానినిబట్టియే మిమ్ములను పరీక్షించుటకై ఇట్లు చేసెను. అందుచే సత్కార్యములు చేయుటయందు ఒకరికంటె ఒకరు ముందడుగు వేయుడు. అందరును భగవంతుని సమక్షమునకే మరలవలసియున్నది.

మీరు ఏయే విషయములందు భేదభావమును చూపిరో భగవంతుడు మీ కెఱింగించును." (౫ : ౪౮)

"ఇది వేదజ్ఞానమును విస్పష్టముగ విప్పి చూపును. దీన సందేహ మేమియును లేదు." (౧౦ : ౩౭.)

ఇస్లామ్ మత పరమార్థమును గుఱించి ఖుర్ ఆన్ మరియు ఇట్లు చెప్పుచున్నది:—

"(ఓ ప్రవక్తా!) ఇట్లు చెప్పుము. మేము భగవంతుని యెడ విశ్వసింతుము. మాకు ప్రోక్తమైన దాని (ఖుర్ ఆన్ గ్రంథము) యెడను విశ్వసింతుము. అంతే కాదు. ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్‌హాకు, యాకూబు, ఇంకను ఇతరజాతుల ప్రవక్తలకును పంపబడిన వేద గ్రంథములను విశ్వసింతుము. ఈ ప్రవక్తలయెడ మే మెట్టి భేదభావమును చూపము. భగవంతునకే మేము వినతుల మగుదుము. (౩ : ౮౩.)

"భగవంతుడు ఏ సహజస్థితియందు ప్రకృతిని సృష్టించి అందు మానవుని సృజించెనో యట్టి ప్రకృతి సహజమైన యీ మతమువైపునకే మీ ముఖములను ధర్మజిజ్ఞాసువులై త్రిప్పుడు. అదే సత్యమగు మతము. భగవంతుని సృష్టి మార్చ నలవికానిది. కాని పెక్కురు దీని నెఱుగరు.

"అట్లు భగవంతున కున్ముఖులైనవారై, అతని యెడ మీకుగల విధులను జాగ్రత్తగ నెరవేర్పుడు. ప్రార్థన సలుపుడు. బహు దైవతారాధకులు కాకుడు. తమ మతము నందు విభాగములు కల్పించి, పక్షములుగా చీలి, ప్రతి పక్షమును తమ తమ విభేదములను చూచి తమలో తాము సంతోషించుకొను వారితో కలియకుడు." (౩౦ : ౩౦-౨)

ఇట్లు ఇస్లాం ఇటీవలి ఒక మతము కాదనియు, అది సనాతనమైనదనియు, మానవప్రకృతి యందే అది వేరు పాదుగొని యున్న

దనియు, ఖుర్ ఆన్ గ్రంథము ౧౩౬౦ ఏండ్ల క్రిందట ప్రోక్తమైన ఒక గ్రంథము కాదనియు, అది అత్యంత సనాతనమై, వివిధ కాలములందు వివిధ ప్రవక్తలకు సమస్త దేశములందు ప్రోక్తమైన సత్యవేద గ్రంథమనియు, ఇతర వేదగ్రంథములకు పోషకముగ వచ్చినదనియు ఖుర్ ఆన్ వాక్రుచ్చుచున్నది. ఖుర్ ఆన్ కు ఇతర మతముల యెడ ద్వేషముగాని వైషమ్యముగాని లేదు. అది సర్వ మతములకు మార్గదర్శకము. అది సర్వ మతములను సమన్వయించును. అది యొక విశ్వ సందేశము నిచ్చుచున్నది; ఒక విశ్వమతమును బోధించు చున్నది. దేశ కాల జాతి వర్ణ భేదములు లేని ఒక మహాత్సందేశము నిచ్చుచున్నది. సర్వ దేశములందును, సర్వ జాతులకును, సర్వకాలములందును ఆచరణ యోగ్యమగు సందేశమది.

ఖుర్ ఆన్ కేవలము వేదాంతముకాదు: కేవల మొక నీతి శాస్త్రము కాదు; కేవల మొక ధర్మశాస్త్రముకాదు; కేవలము కర్మ కాండలకు సంబంధించినదియు కాదు; అది యొక సంపూర్ణ సత్య గ్రంథము. మానవ జీవితమునందలి అన్ని దశలకును వలయు సర్వ ధర్మములును అందు విశదీకరింపబడి యున్నవి.

ఖుర్ ఆన్ గ్రంథమునందలి సందేశము ఒక విస్పష్టసందేశము. ఒకే మంత్రము నాధారము చేసికొని మూలసిద్ధాంతములందే పరస్పర విరుద్ధములగు సిద్ధాంతములను ప్రతిపాదించు వ్యాఖ్యానములు చేయుటకిందవకాశము లేదు. ఒకే వేదము నాధారముగా వేయి మతములను కల్పించుట కిట సాధ్యము కాదు. ఖుర్ ఆన్ ఈ విషయమును స్పష్టముగ నిట్లు చెప్పినది:—

"ఖుర్ ఆనును గురించి వారు లోతుగ నాలోచింపరేల? అది భగవత్ప్రోక్తమే కాకపోయినచో అందు పరస్పర విరుద్ధములగు విషయము లుండవా ?" (౪ : ౮౨.)

ఖుర్ ఆన్ గ్రంథము శ్రీ మొహమ్మద్ ప్రవక్త మాహాత్మ్యమని చెప్పబడినది. ఖుర్ ఆన్ లో గల శక్తి అసమానమైనది. ఈ గ్రంథము అరేబియా ప్రజలయందు కొలదికాలములో తెచ్చిన మార్పు, చరిత్రయొక్క గొప్ప విచిత్ర సంఘటనములలో నొకటి. ఒక్క అరేబియా ద్వీపకల్పమునందేకాక ప్రపంచమునందలి అధిక భాగములలో ఈ సందేశము కల్గించిన పరివర్తనము ప్రపంచ విప్లవములలో నగ్రగణ్యమైన దనవచ్చును. ఇస్లామ్ మతమున కంతగా ననుకూలురుకాని పాశ్చాత్యక్రైస్తవ పండితు లీ విప్లవమును గురించి చెప్పిన ఈ క్రింది వాక్యములను గమనింపుడు :

"From time beyond memory, Mecca and the whole peninsula had been steeped in spiritual torpor. The slight and transient influences of Judaism, Christianity, or philosophical inquiry upon the Arab mind had been but as the ruffling here and there of the surface of a quiet lake; all remained still and motionless below. The people were sunk in superstition, cruelty, and vice............... Their religion was a gross idolatry; and their faith the dark superstitious dread of unseen things...............Thirteen years before the Hejira, Mecca lay lifeless in this debased state. What a change had these thirteen years now produced! .... Jewish truth had long sounded in the ears of the men of Medina; but it was not until they heard the spirit-stirring strains of the Arabian Prophet that they too awoke from their slumber, and sprang suddenly into a new and earnest life."[1]

(ఊహాకందరాని ప్రాచీన కాలమునుండియు మక్కా చుట్టునుండు దేశభాగమంతయు మతవిషయమున మైకములో నుండెను. యూద క్రైస్తవ మతములును, తత్వజిజ్ఞాసయు అరబ్బుల మనములపై తాత్కాలికమై స్వల్పమైన ప్రోద్బలము కలిగి

1, Sir W. Muir's *Life of Mohamet*, Ch. VII.

శాంతపరోవరజలముపైనున్న స్వల్పతరంగజాలమువలె నుండి క్రింద నంతయు నిశ్చలముగను నిశ్శబ్దముగను ఉండెను. ప్రజలు మూఢవిశ్వాసములలోను, క్రౌర్యమునందును, దుశ్శీలమునను మునిగియుండిరి. వారి మతము తుచ్ఛప్రతిమారాధనమై యుండెను. వారు మూఢవిశ్వాసములలో మునిగి దయ్యములను నమ్ముచుండిరి. హిజరతుకు పూర్వము పదమూడు సంవత్సరముల క్రిందటివరకు మక్కా నిర్జీవమై యిట్టి హీనస్థితియందుండెను. ఈ పదమూడేండ్లలో ఎట్టి అద్భుతమైన మార్పు కలిగెను!........అంతకు పూర్వము చిరకాలము యూదమతము మదీనా ప్రజల కర్ణపుటముల యందు ప్రతిధ్వనించియే యుండెను. కాని ఆత్మను కలంచు అరబు ప్రవక్త ఖుర్ ఆన్ సూక్తుల మధురరవము వినినప్పుడే వారు తమ అజ్ఞాన దీర్ఘనిద్రనుండి లేచిరి. గంభీరమైన ఒక నూతన జీవితము వారు హఠాత్తుగ ప్రవేశించిరి.)

"A more disunited people it would be hard to find, till suddenly, the miracle took place! A man arose who, bv his personality and by his claim to direct Divine guidance, actually brought about the impossible..............namely, the union of all these warring factions."[1]

(ఈ హఠాత్పరివర్తనము జరుగక పూర్వము వీరియంత సంఘీభావ శూన్యమగు జాతి మరియొకటి లేకుండెను. ఒక యత్యద్భుతవ్యక్తి బయలు వెడలి పరమేశ్వర ప్రేరణచే జరిగిన వ్యక్తిప్రాబల్యముచే ఈ పరస్పర యుధ్యమాన జనములలో నసంభవ నైక్యతను కల్గించుట మిక్కిలి యాశ్చర్యకరమైన విషయము.)

"And yet we may truly say that no history can boast events that strike the imagination in a more lively manner, or can be more surprising in themselves, than those we meet with in the lives of the first Musal:n ans, whether we consider the Great Chief, or his ministers the most illustrious of men; or whether we take an account of the manners oi the several countries he conquered; or observe the courage, virtue, and sentiments that aqually prevailed among his generals and soldiers."[2]

1. *The Ins and Outs of Mesopotamia*, P. 99.
2. *The Life of Mohamet*, by the Count of Boulainvelliers (English Translation) P. 5.

(ఆది ముసల్మానుల చరిత్రమును చదివి, వారి నాయకాగ్రేసరుని, అత్యంత ఉత్తమ మానవులగు ఆయన మంత్రులను, ఆయన జయించిన దేశములందలి ఆచార వ్యవహారములను, ఆయన సేనానులలోను, సైనికులయందును సామాన్యముగ కన్పట్టు శౌర్యస్థైర్యములను, సచ్ఛీల సద్భావములను పరికించినచో, ఇట్టి ఆశ్చర్యకరమగు సన్నివేశములు చరిత్రమునం దెచ్చటను కానరావని సగర్వముగ నొక్కి వక్కాణించ వచ్చును. చూచిన అది అంతయు నమ్మ శక్యము కాకుండును.)

"That the best of Arab writers has never succeeded in producing anything equal in merit to the Quran itself is not surprisin. "[1]

(అరబీభాషయందు దత్యుత్తమశ్రేణికి చెందిన గ్రంథకర్తలెవ్వరును ఖుర్ ఆన్ కు సమానమైన గొప్పగ్రంథమును వ్రాయలేక పోయిరనుట వింతకాదు.)

"Itis the one miracle claimed by Muhammad-his standing miracle, he called it-and a miracle indeed it is."[2]

(మొహమ్మద్ ప్రవక్త తనదిగా చెప్పిన ఏకైక మహాత్మ్యమిదియే(ఖుర్ ఆనే.) శాశ్వతముగ నిల్చియుండు మహత్వ మిది యని ఆయన చెప్పిరి. నిస్సందేహముగ అదొక అద్భుత మహత్తే.)

"Never has a people been led more rapidly to civilization, such as it was, than were the Arabs through Islam."[3]

(అరబుజాతి ఇస్లామ్ మతముద్వారా నాగరికతను పొందినంత సత్వరగమనముతో మరేజాతియు నాగరికతను పొందలేదు.)

"The Quran is unapproachable as regards convincing power, eloquence, and even composition."[4]

(హేతువాదముచే ఒప్పించుట యందుగల శక్తికిని, అద్భుతధారకును, శయ్యా పాటవమునకును ఖుర్ ఆన్ తో సరితూగగల గ్రంథము మరొకటిలేదు.)

1. Palmer's Introduction to English Translation ofthe Quran, P. iv.
2. Bosworth Smith, *Life of Mohammad*.
3. H. Hirshfield, *New Researches*, P. 5.
4. *Ibid*, P. 8.

" And to it was also indirectly due the marvellous development of all branches of Science in the Moslem world. "[1]

(ముస్లిమ్ ప్రపంచమున సర్వశాస్త్రములు అత్యద్భుతముగ అభివృద్ధినొందుటకు ఖుర్ ఆన్ ప్రోద్బలమే పరోక్షకారణము.)

" Here therefore its merits as a literary production should perhaps not be measured by some preconceived maxims of subjective and aesthetic taste, but by the effects which it produced in Muhammad's contemporaries and fellow-countrymen. If it spoke so powerfullt and convincingly to the hearts of his hearers as to weld hitherto centrifugal and antagonistic elements into one compact and well-organized body, animated by ideas far beyond those which had until now ruled the Arabian mind, then its eloquence was perfect, simply because it created a civilized nation out of savage tribes, and shot a fresh woof into the old warp of history. "[2]

(ఏవో మనలో జీర్ణించియున్న కావ్యాభిరుచులను వరవడిపెట్టుకొని ఈ గ్రంథముయొక్క రచనను పరీక్షించుట యుక్తముకాదు. ప్రవక్తయొక్క సమకాలికులయందును, దేశీయులయందును ఇది యెట్టి మార్పు కలుగజేసెనో అను అంశమును బట్టి దీని గొప్పతనమును గణించవలెను. అది శ్రోతల హృదయములలో శక్తివంతముగను, దృఢ విశ్వాసము కల్గునట్లుగను నడించి, వారిలో నిండియుండిన స్వార్థపరత్వమును వైషమ్యమును రూపుమాపి, వారిని ఐకమత్యబంధముల బంధించి, కట్టుదిట్టములు కల్గిన ఒక జాతిని సృష్టించి, ఆజాతియందపూర్వమగు ఒక మహోదారభావమును కల్గించినదన్నచో, ఈ గ్రంథముయొక్క ప్రవచనపాటవము అసమానమైనదని చెప్పకతప్పదు. అనాగరిక తెగల నైక్యమొనర్చి ఒక గొప్ప నాగరిక జాతిని సృష్టించి వారి చరిత్రకామూలముగ నూతనత్వము కల్గించుటయే ఈ గ్రంథమహత్వమునకు తార్కాణము.)

" But if we consider the variety and heterogeneousness of the topics on which the Quran touches,

1. *Ibid*, P. 9.
2. Dr. Steingass, in Hughes' *Dictionary of Islam*, art. " *Quran*."

uniformity of style and diction can scarcely be expected; on the contrary, it would appear to be strangely out of place. Let us not forget that in the book, as Muhammad's newest biographer, Ludolf Krehl expresses it, 'there is given a complete code of creeds and morals, as well as of the law based thereupon. There are also the foundations laid for every institution of an extensive commonwealth, for instruction, for the administration of justice, for military organization, for the finances, for a most careful legislation for the poor: all built up on the belief in the One God, who holds man's destinies in His hand.' Where so many important objects are concerned, the standard of excellence by which we have to guage the composition of the Quran as a whole must needs vary with the matter treated upon in each particular case. Sublime and chaste, where the supreme truth of God's unity is to be proclaimedl appealing in high-pitched strains to the imagination of a poetically gifted people where the eternal consequences of man's submission to God's holy will, or of rebellion against it, are pictured; touching in its simple, almost crude, earnestness, when it seeks again and again encouragement or consolation for God's messenger and a solemn warninng for those to whom he has been sent; in the histories of the prophets of old: the language of the Quran adapts itself to the exigencies of every-day life, where this every-day life, in its private and public bearings, is to be brought in harmony with the fundamental principles of the new dispensation. "[1]

10. Hughes' *Dictionary of Islam*, art. "*Quran*."

(ఖురాన్ గ్రంథమున వివరింపబడిన వివిధవిషయములను గమనించినచో, భావ వైశ్యైక్యతలు అసంభవములు. మరియు అవి అనవసరములనికూడతోచును. "నమ్మకములకును, మతమునకును, ప్రవర్తనకును, శీలమునకును ఖుర్ ఆన్ లో ఒక సంపూర్ణ ధర్మశాస్త్రము నిర్మింపబడినది. వానిపై ఆధారపడిన న్యాయశాస్త్రమును ఇందు కలదు. విద్యా విషయమునకును, న్యాయ విచారణమునకును, సైనిక శిక్షణమునకును, వేయేల ప్రజాస్వామ్యముతో కూడిన యొక సంపూర్ణ రాజ్యాంగమునకు వలయు విషయములన్నియు, ఒకే పరమేశ్వరుడనియు, మానవుని భావ్యభివృద్ధి యంతయు ఆయన హస్తగతమై యున్నదను మూలసూత్రములపై ఆధారముచేసి ఈ గ్రంథమున ఉద్ఘాటింప బడినవి." అని చెప్పిన ప్రవక్తయొక్క ఆధునిక జీవిత చరిత్రకారుడగు Rudolf Krehl వాక్యముల జ్ఞప్తియందుంచుకొనవలసి ఉన్నది. ఇంత వైవిధ్యముగల గ్రంథమును ఏక వాక్యత గాగల గ్రంథముగ పరిశీలింప సమకట్టినపుడు, విషయముయొక్క ప్రత్యేకత ననుసరించి ఆయా భాగములు విడివిడిగా పరీక్షింపవలసి యున్నది. ఏకేశ్వర సూత్రము నుద్ఘాటించునపుడుదాత్తత కలిగి పరమేశ్వరుని పవిత్రాజ్ఞాను వర్తిత్వమును, తత్తిరస్కరణ ఫలితమును చర్చించునపు డుత్తమ కవిత్వమును విను నలవాటుకల శ్రోతలను నమ్మింపజాలు ఓజఃకాంతులు కలిగి, వెనుకటి ప్రవక్తల చరిత్రములను విమర్శించి మొహమ్మద్ ప్రవక్తను ప్రోత్సహించి ఆయనను, వినువారిని మాటిమాటికి మందలించు నపుడు హృదయాకర్షకత్వమును సుహృత్సమ్మతత్వమును కలిగి, ఆ మహాగ్రంథములోని భాష ప్రతిదినమానవాంతరంగ బహిఃప్రవర్తనావసరములకు తగియుండి, తత్ప్రవర్తనమును నూతన మత సూత్రములతో మేళవించుచున్నది.)

ఖుర్ ఆన్ యొక్క శైలిని గుఱించి ఒక్క విషయము చెప్పవలెను. ఖుర్ ఆన్ గ్రంథము వచనమున నున్నది. ఐనను అందొక విధమైన మాధుర్య ముట్టిపడుచున్నది. శబ్దమాధురికిని, శైలీ సారళ్యమునకును ఖుర్ ఆన్ అసమానమైనవి. అరబీభాష తెలియనివారికి కూడ అదొక మధురగానమువలె కర్ణపేయమై యుండును. ఛందోబద్ధము కాకపోయినను ఒక సుఖాస్పదమగు లయ ఆ భాషలో పొడకట్టును. వేయేల అదొక అత్యద్భుత భాషాసృష్టి.

ఇట్టి మహత్తరమగు ఖుర్ ఆన్ గ్రంథము సరిగా బోధపడవలెనన్న కొంత వ్యాఖ్యాన మవసరమనిపించినది. మన దేశములో మొద

టినుండియు ఇస్లామ్ మతము యెడ పెక్కు అపోహ లుండుటచే ఆ అపోహలను పోగొట్టుటకుకూడ ఈవ్యాఖ్యాన మవసరమైనది. ఈసందర్భమున నేను గావించిన వ్యాఖ్యాన విధానమును వివరించుట ఉచిత మనుకొందును. పరమత దూషణముగాని, పరమత ఖండనముగాని ఈ వ్యాఖ్యానోద్దేశము కాదు. వేదములును, ఉపనిషత్తులును ప్రతిపాదించిన మతమునకు ఖుర్ ఆన్ గ్రంథ ప్రతిపాదితమగు మతముతో ఎంతవరకు సమన్వయము కుదురును? సమన్వయము కానిచోట్ల అట్లు విరుద్ధముగ నుండుటకు కారణ మేమైయుండును? ఈ విషయములను విమర్శా పూర్వకముగ వివరించుటయే నా ఉద్దేశము. భగవంతుడొక్కడే. సత్యము కూడ ఒక్కటే. భగవత్ప్రోక్తమగు సత్యజ్ఞానము కూడ ఒక్కటే. అట్టియెడ మతములు వివిధములగుటకు అవకాశ మెక్కడనున్నది? ఇప్పుడు మనకు కన్పించుచున్న మత విభేదములు సత్యమును మనము గ్రహించుటయందును, గ్రహించినను దాని ననుసరించుటయందు గల లోపములవల్ల కల్గినవేగాని స్వతస్సిద్ధమైనవి కావు. పూర్వాచారముల యెడలను, సంప్రదాయముల యెడలను బానిసత్వము మానవ సహజమగు ఒక దౌర్బల్యము. విశాలదృష్టియు, స్వచ్ఛమైన దృక్పథమును, నిర్లిప్తమగు వివేచనాశక్తియు, అన్నిటికంటె నధికముగ ధర్మజిజ్ఞాసయు ఉన్నప్పుడే ఆ దౌర్బల్యము నశించును. అప్పుడే స్వచ్ఛమగు సత్యము దృగ్గోచరమగును. అట్టి సత్యసందర్శనమునందు తోడ్పడుటయే నా ఈ అల్ప ప్రయత్నముయొక్క ఉద్దేశము. జిజ్ఞాసువులు దీనిని సద్భావముతో పఠింతురుగాక !

ఖుర్ ఆన్ గ్రంథ ఆంధ్రానువాదమును వ్యాఖ్యాన సహితముగ ౧౨ సంపుటములలో ప్రకటింప దలచినాను. పండ్రెండవ సంపుటము ఖుర్ ఆన్ గ్రంథమునకు ఒక సమగ్రమైన పీఠికయై యుండును.

దైవానుగ్రహమున ఈపని పూర్తియైన తర్వాత శ్రీ మొహమ్మద్ ప్రవక్త ఉపదేశ వాక్కులను ఒక గ్రంథముగను, వారి జీవిత చరిత్ర మొక గ్రంథముగను వేర్వేరుగ ప్రకటింతును.

భాష సాధ్యమైనంతవరకు సుబోధకముగను సుస్పష్టముగను ఉండుటకై వ్యాకరణము నంతగ పాటింపక పోతిని. ఏదేని ఒక సూక్తముగాని, ఒక శబ్దముగాని స్పష్టముగ లేనప్పుడు దాని అర్థమును విడదీసి స్పష్టముగ నుండునట్లు బ్రాకెట్లలో ఇంచుక టైపుభేదముతో అచ్చు వేయించితిని. ఈ యనువాదము ప్రతిపదార్థము కాక సవివరణానువాదమని అట్టపైననే సూచించితిని.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌గారు ఉర్దూభాషలో రచించిన 'తర్జుమానల్ ఖుర్ ఆన్' అను ఖుర్ ఆన్ గ్రంథముయొక్క 'సవివరణ ఉర్దూ అనువాదమును' నేనెక్కువగ ననుసరించితిని. మౌలానా అబ్దుల్ హక్‌గారు రచించిన 'తఫ్సీరెహక్కానీ' అను ఉర్దూభాషయందు ఖుర్ ఆన్ భాష్యము నాకెక్కువగ ఉపకరించినది. ఇవికాక మౌలానా అష్రఫ్ అలీ థానవీగారి యొక్కయు, హజరత్ షా రఫీయుద్దీన్‌గారి యొక్కయు ఉర్దూ అనువాదములును, అల్లామా యూసుఫ్ అలీగారి యొక్కయు, మౌల్వీ మొహమ్మదలీగారి యొక్కయు ఆంగ్లానువాదములు నాకెంతయో ఉపకరించినవి. ఈ గ్రంథకర్తల కెల్లరకును నా కృతజ్ఞతలు.

ఆర్ష గ్రంథజ్ఞానము నాకెక్కువగ బ్రహ్మశ్రీ కనుపర్తి మార్కండేయశర్మగారు ఆంధ్రమున వెలువరచిన ఉపనిషద్భాష్యములవల్ల కలిగినది. తరువాత సర్ యస్. రాధాకృష్ణయ్యగారి "ఇండియన్ ఫిలాసఫి" రెండు సంపుటములును, ప్రొఫెసర్ దాస్ గుప్తాగారి "హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ" రెండు సంపుటములును, ప్రొఫెసర్ పి. సి. బారువాగారి

"ప్రీ బుద్ధిస్టిక్ ఇండియన్ ఫిలాసఫి" అను గ్రంథమును, ప్రొ. మాక్సుముల్లరు సంపాదితములైన వేదానువాదములును, "సేక్రెడ్ బుక్స్ ఆఫ్ ది ఈస్ట్" అను పెక్కుసంపుటములును, మేజర్ బి. డి. బసుగారు సంపాదించిన 'సేక్రెడ్ బుక్స్ ఆఫ్ ది హిందూస్' అను గ్రంథావళియు మిక్కిలి ఉపకరించినవి. ఈ గ్రంథకర్తల కేనెంతయు కృతజ్ఞుడను.

* * *

హైదరాబాదు - దక్కన్,
౧౮, రంజాన్, ౧౩౬౦.
౧, ఆజూరు, ౧౩౫౧ ఫసలి.

ఇట్లు,
మొహమ్మద్ ఖాసింఖాన్.

ద్వితీయ ముద్రణ పీఠిక

ఈ సంపుటములో ఉన్న పదిభాగము (సిపారా) లలో మొదటి రెండుభాగములు తొలిముద్రణములో ప్రథమసంపుటముగను, మూడు భాగములకు పైగా ద్వితీయ సంపుటముగను, మిగిలినది తృతీయ సంపుటముగను ప్రచురించియుంటిని. ఇప్పుడు ముప్పదిభాగముల సంపూర్ణగ్రంథమును పదేసిభాగముల మూడుసంపుటములుగ వెలువరచుచున్నాను. అందిది మొదటిసంపుటము. ఈ కూర్పులో కొన్నిసవరణలు, మార్పులు చేసితిని; వ్యాఖ్యానభాగములో అక్కడక్కడ కొన్ని విశేషాంశములను చేర్చితిని.

'తఫ్సీరె ఇబ్నెకసీర్' అను గొప్ప అరబీభాష్యమును పెక్కు ఇతరఉద్గ్రంథములను చదివి అందలి పెక్కు విశేషాంశములను వ్యాఖ్యానభాగమున చేర్చితిని. అభిప్రాయభేదములనుకూడ ఉల్లేఖించితిని.

విద్వద్వర్యులు, ఉదారులు, భాషాభిమానులు నైన శ్రీ కట్ట మంచి రామలింగారెడ్డిగారు ఈ సందర్భమున నాకొసగిన ప్రోత్సాహమునకు మిక్కిలి కృతజ్ఞుడను. నాతో ముఖపరిచయ మైన లేసికాలమునసైతము వారునాయెడ చూపిన అవ్యాజానురాగము సాటిలేని వారి ఔదార్యమును చాటుచున్నది.

ఖాన్ బహాద్దుర్ నవాబ్ అహమద్ నవాజ్ జంగ్ బహాద్దుర్ గారి దాతృత్వ మీ ద్వితీయముద్రణమును సాధ్యమొనర్చినది. వారికి భగవంతు డితోధికముగ సంపదలిచ్చుగాక !

మొహమ్మద్ ఖాసింఖాన్.

ఖుర్ ఆన్ షరీఫ్

بسم الله الرحمن الرحيم

అధ్యాయము ౧

ఫాతిహా
లేక
ప్రారంభము

(మక్కాలో అవతరించినది)

(7 సూక్తులు)

1. కరుణామయుడును వరప్రదాయకుడును అగు అల్లాః నామ స్మరణముతో (ప్రారంభించుచున్నాను.)

2. సమస్త స్తుతులును సర్వలోకపరిపోషకుడగు అల్లాః కే.

3. (అతడు) వరదుడు; దయామయుడు;

4. అవసానదినమున (మే మొనర్చు పాపపుణ్యములను విచారించి తత్తదుచితఫలమును నిర్ణయించు) న్యాయాధిపతి.

5. (ఈశ్వరా!) నిన్నుతప్ప మరెవ్వరిని మే మారాధింపము; నీ సహాయమునే మే మపేక్షింతుము. (మరెవ్వరిసహాయము మా కక్కర లేదు.)

6. (ప్రభూ! మోక్షము లభించు) తిన్నని మార్గమును మాకు చూపుము.

7. నీ అనుగ్రహమునకు పాత్రులైనవారి మార్గమునే మాకు చూపుము; నీ ఆగ్రహమునకు గురియైనవారి త్రోవనుండి మమ్ము తప్పింపుము.

అధ్యాయము ౨

బఖరా

లేక

గోవు

(మదీనా నగరమున అవత౯ంచినది)

(౨౮౬ సూక్తులు)

కరుణామయుడును వరప్రదాయకుడును అగు
అల్లాహ్‌నామస్మరణముతో (ప్రారంభించుచున్నాను)

మొదటి ఖండము

1. అలిఫ్ - లామ్ - మీమ్.౧

2. ఇది భగవత్ప్రోక్తమగు గ్రంథము. దీన సంశయ మేమియును లేదు. సన్మార్గప్రవర్తకుల కిది మోక్షమార్గమును చూపును.

3. అతీంద్రియములైన తత్వములను * విశ్వసించువారును, ౨,౩ ప్రార్థనమునందు నిశ్చలబుద్ధి కలవారును,౪ మేము ప్రసాదించిన సంపదను (ధర్మమార్గమున) వ్యయపరచువారును,౫

4. నీకు (శ్రీ మొహమ్మద్ ప్రవక్తకు) ఈయబడిన భగవద్గ్రంథము నందును, పూర్వప్రవక్తల కీయబడిన భగవద్గ్రంథముల యందును (శ్రద్ధాపూర్వకముగ) విశ్వాసముంచువారును,౬ మరణానంతర జీవితముపై విశ్వాసము గలవారును ౭.

5. వీరే భగవన్మార్గమున నడచువారు. వీరే (ఈ లోకమునందును, పరలోకమునందును) జయశ్రీని పొందువారు.

---

* మన చర్మచక్షువులకు కాన్పింపని తత్వములని అర్థము. ఉదాహరణమునకు భగవంతుడు, దేవదూతలు, మరణానంతర జీవితము ఇత్యాది.

6. కాని ఎవరు నిశ్చలమగు ఆస్తిక్యబుద్ధిని విడనాడి తిరస్కారమును చూపిరో వారిని నీవు భయపెట్టినను భయపెట్టకపోయినను ఒకటే. వారింక విశ్వసింపరు.౮

7. వారి హృదయములును చెవులును ముద్రాబద్ధములు కావింపబడినవి. వారి కండ్లు పొరలు గ్రమ్మినవి.౯ వారు ఘోరశిక్షకు పాత్రులగుమరు.

రెండవ ఖండము

8. మరికొంద రున్నారు; వారిట్లందురు: "మాకు అల్లాహ్ యందును కర్మపరీక్షాదినము నందును విశ్వాసము కలదు."

9. కాని వాస్తవముగ వారి కట్టి విశ్వాసము లేదు. వారు అల్లాహ్‌ను విశ్వాసవంతులను మోసగింపజూచువారు. కాని వారు తమ్ము తామే మోసగించుకొనుచున్నారు. కాని వారు (ఈ సూక్ష్మమును) గ్రహింపరు.

10. వారి హృదయములు అవిశ్వాస జాడ్యపీడితములు. భగవంతు డా జాడ్యమును ప్రకోపింపజేసినాడు. ఇట్టి వారికై ఘోరశిక్ష వేచియున్నది. ఎందుకనగా వా రసత్యవాదులు; మోసగాండ్రు.

11. "ప్రపంచములో దౌర్మార్గ్యమును వ్యాపింప జేయకుడు" అని వారితో చెప్పినపుడు, వారు "మేము లోక సంస్కర్తలము" అని (డంబములు) పల్కుదురు.

12. (జ్ఞాపకముంచుకొనుము.) నిశ్చయముగ వారే దౌర్మార్గ్యమును విస్తరింపజేయువారు. అది వారికి తెలియదు.

13. "మీరు కూడ విశ్వాసవంతుల వలె సన్మార్గము ననుసరింపుడు" అని వారితో చెప్పినపుడు, వారు "ఏమీ! మేము ఈ బుద్ధిహీనులవలె విశ్వసింతుమా?" అందురు. జ్ఞాపకముంచుకొనుము: వాస్తవముగ వారే బుద్ధిహీనులు; వారికది తెలియదు.

14. (ఈ సందేశమును) విశ్వసించినవారితో కలిసినప్పుడు "ఆ సందేశమునందు మాకు కూడ నమ్మకము కలదు" అని వారందురు. కాని దుర్మార్గులగు తమ సహచరులను కలిసినప్పుడు "మేము మీలోని వారమే; వారిని పరిహాసించుటకు మాత్ర మట్లు చెప్పితిమి" అందురు.

15. కాని వాస్తవముగ వారే పరిహాసపాత్రు లగుచున్నారు. వారి పరిహాసమునకు ఫలము భగవంతుడు వారికిచ్చును. వారల్లే అంధకారపథముల నడచుచుందురు.

16. జ్ఞానమును విక్రయించి అజ్ఞానమును కొన్న మూఢులు వీరు. దీనివలన వారికేమియు లాభము కలుగకపోవుటయేకాక వారు జ్ఞానమార్గమును సహితము కోల్పోయిరి. (ఈవిధముగ వారు రెంటికిని చెడిన రేవడలైరి.)

17. ఒకడు అగ్నిని ప్రజ్వలింపజేసెను. నలుదిక్కుల కాంతివర్విన పిదప హఠాత్తుగా దేవుడా కాంతిని హరించెను. అంధకారము మిగిలెను: వారంధప్రాయులైరి. వారి స్థితికిది ఉపమానము.౧౦

18. వారు చెవిటివాండ్రు, మూగవాండ్రు, గ్రుడ్డివాండ్రు. అట్టి వారు సన్మార్గమునకు రాలేరు.

19. (వారిస్థితికి మరియొక దృష్టాంత మీయవచ్చును.) వర్షదము లగు కారుమబ్బులతో (ఉరుములు మెరుములు నుండును. మేఘావృతమైన ఆకాశమున) చీకటి క్రమ్మియుండును. ఉరుములు (భూమిని కంపింపజేయును.) మెరుములు (కన్నులు మిరుమిట్లు గొల్పును.) పిడుగులు (భయము గొల్పును. ప్రపంచమంతయు నీటి కొఱకు నోరు తెరచికొని యున్నప్పుడు దేవుడు వర్షమును కురిపించుటకై మేఘములను పంపగా, వర్షము వలన కలుగు లాభమును గ్రహించలేక,) మేఘము ఉరుము చున్నప్పుడు వీరు మృత్యుభయమును పొందుచున్నారు. చెవులలో వ్రేళ్ళను దూర్చుకొనుచున్నారు. వారే స్థితియందున్నను భగవంతుడు వారి నావరించియే యున్నాడు.

20. మెఱుపు వారి కన్నుల మిరుమిట్లు కొల్పును. మెరిసినప్పుడు ఆ వెలుతురులో కొన్ని అడుగులు ముందుకువైచి చీకటి ముసురుకొని రాగా వారాగిపోదురు. (కటికిచీకటి! ముందడుగిడలేరు! గుండెలదురు! అయ్యో! వర్షము వలన కలుగు భాగ్యమునకు ప్రపంచ మంతయు ఆనందించుచుండగా ఈ నిర్భాగ్యులిట్లు తల్లడిల్లుచున్నారు.) దేవుడిచ్ఛించుచో వీరు అంధులుగను బధిరులుగను ఉండవలసినవారే. (వీరు చెవులలో వ్రేళ్లు దూర్చుకొని మెరుములను చూచి అడలవలసిన అవసరము లేకుండెడిది.) దేవునకు సమస్త వస్తువులపైనను అధికారము కలదు.

మూడవ ఖండము

21. మానవులారా! మిమ్ములను మీ పూర్వులను సృష్టించిన మీప్రభువును సేవింపుడు. దుష్పథమునుండి మీరు రక్షింపబడుదురు.౧౧

22. మీరు విశ్రాంతిని బడయుటకై భూమిని సృజించినాడు. నభోమండలము నుండి భూమిపై వర్షమును కురిపించుచున్నాడు. దాని వలన పచ్చనిపైరులచే భూమి శోభాయమాన మగుచున్నది. ఆహారార్థము వివిధములైన ఫలము లుత్పన్న మగుచున్నవి. ఇదంతయు చేయుచున్నది ఏకేశ్వరుడే నని మీకు తెలియదా? మరియు (అద్వితీయుడగు) అతనితో నితరులను కలిపి అతనికి సమానులని పేర్కొనకుడు.౧౨

23. నాచే నాప్రవక్తకు ప్రోక్తమైన ఈ సందేశమున మీకు సందేహమున్నచో దీనికి సమానమైన ఒక అధ్యాయమును రచించి తీసికొనిరండు. మీరు సత్యవాదులే యగుచో భగవంతుడు తక్క తక్కిన సహాయు లెవ్వరైననున్న వారిని కూడపిల్వుడు. (అప్పుడైనను వ్రాయగలరేమో.)

24. మీరట్లు చేయలేరు. అది నిశ్చయము. అట్టిచో (సత్యము నేల నిరాకరింతురు?) (పాపిష్ఠులగు) మానవులును, పాషాణములును ఇంధనములుగా గల అగ్నిజ్వాలలకు భయపడుడు. అవి సత్యమును నిరాకరించు వారికై సిద్ధముగనున్నవి.౧౩

25. (ప్రవక్త మీకు వినిపించు) సందేశమును విశ్వసించు సత్కార్యాచరణపరులకు ఈ సువార్తను తెలుపుము. నిర్ఝరులు ప్రవహించు ఆనందోద్యానములువారికై సిద్ధముగనున్నవి. స్వర్గఫలమును పొందుచూ వారు "మాకిట్టి ఫలమే పూర్వమివ్వబడినది." అనిచెప్పుదురు. వారికట్టి ఫలమునే దేవుడు ప్రసాదించును. వారికక్కడ పరమ పవిత్రలగు సతుల సహవాసభాగ్యము లభించును. వారు నిత్యము అక్కడ (ఆ ఆనందధామమున)నే వసింతురు.

26. (సామాన్యజ్ఞానదుర్గ్రాహ్యమగు మహత్తర విషయములను మీకు బోధించుటకై) భగవంతుడు ఎంతటి చిన్నవస్తువులనైనను—దోమనైనను సరే—దృష్టాంతములుగ తీసికొనుట చిన్నతనముగ కొనడు. విశ్వాసము కలవారు ఈ దృష్టాంతముల యథార్థ భావమును గ్రహించి ఇదంతయు ఈశ్వర ప్రోక్తమగు సత్యమనియే నమ్ముదురు. విశ్వాసము లేనివారు "ఈ దృష్టాంతము అర్థమేమి?" అని (పరిహాసగర్భితముగ) అందురు. (ఆ ఉపమానములవలన) అనేకులు దారితప్పుదురు. (వారు దౌష్ట్యముననే నిమగ్నులై యుందురు) దానివలన అనేకులకు సన్మార్గము లభించును. మౌర్ఖ్యముచే సత్యమును గ్రహింపనివారిని తప్ప మరెవ్వరిని భగవంతుడు దారితప్పింపడు.

27. (అసత్యవాదులును అధర్మాచరణపరులును ఎట్టివారు?) దైవనిర్ణీతమైన ధర్మమునకు సమ్మతించి, తరువాత దానిని నిరాకరించువారు; ఐక్యము కలిగించవలసినదని భగవదాజ్ఞయైన పట్ల, విభేదము కలిగించువారు; (తమ దుష్కర్మలచే) దేశమునందు (అంతః) కలహములను కలిగించువారు—(ఇట్టి దుష్కార్యములవలన) తమకుతామే నష్టపడుదురు.

28. (మానవులారా!) జడస్థితియందున్న మీకుప్రాణదాన మొసగిన దేవుని ఎట్లు నిరాకరించగలరు? అతడే మీ జీవితాంతమున మిమ్ము మరణింపజేసి తిరిగి ప్రాణదానమొసర్చును. మీరు తుదకు ఈశ్వర సాన్నిధ్యమునకే మరలుదురు.

29. ఈ భూమిపైనున్న సమస్త వస్తుజాలమును మీ కొఱకై సృజించినది అతడే కదా? తరువాత మీకొఱకతడు ఏడూర్ధ్వలోకములను * సృజించెను.౧౮ అతడు సర్వజ్ఞుడు. అతనికి సమస్త వస్తువులను గూర్చియు సంపూర్ణజ్ఞానము కలదు.

నాల్గవ ఖండము

30. (ఓ ప్రవక్తా!) నీ ప్రభువు దేవతల నుద్దేశించి "భూమిపై నా ప్రతినిధి నొకనిని సృష్టింపదలచితిని" అనెను. అప్పుడు దేవతలు, (నమ్రులై) "దౌర్మార్గ్యము నవలంబించి రక్తమును స్రవింపజేయు జీవిని ప్రతినిధిగా నియమింతువా? నీ మహిమను నీ పావిత్ర్యమును మేము సదా కీర్తించుచున్నాము" అనిరి.

("నేను ఏ సత్యమును నిర్దేశించి ఈ సృష్టికార్యమును చేయుచున్నానో అట్టి నా మహాభావమును మీరు తెలిసికొనలేరు. "మీకు తెలియనిది నాకు తెలియును." అని దేవుడు వారికి సమాధాన మొసగెను.

31. దేవుడు ఆదమునకు (మానవునకు) సర్వవస్తు పరిజ్ఞానమును ♦ ప్రసాదించెను. ౧౨ అప్పుడా సర్వవస్తుజాలమును దేవతలకు చూపించి, మీరు నిజమునే చెప్పుచున్నచో ఈ వస్తువుల (తత్వములను) పేర్కొనుడు" అని అడిగెను.

32. అప్పుడు దేవతలు(నమ్రులై) "భగవంతుడా! సమస్తమహత్తు నీదేను. నీవు మాకు ప్రసాదించినది తప్ప మాకు మరే ఇతర జ్ఞానమును లేదు. నీవు సర్వజ్ఞుడవు; ప్రజ్ఞానిధివి" అనిరి.

33. అప్పుడతడు ఆదము నుద్దేశించి, "ఆదమ్! ఈ వస్తువుల స్వరూపమును దేవతలకు బోధింపుము" అని ఆజ్ఞాపించెను.

ఆదమ్(సమస్త వస్తుస్వరూపమును) బోధించెను.

---

* ఏడాకాశములనియు అర్థము కలదు.

♦ 'సమస్త వస్తువులపేర్లు' అని ప్రతిపదార్థము.

అప్పుడు దేవు డిట్లనియె: "భూమ్యాకాశములందున్న సమస్త రహస్యములను నే నెఱుగుదునని మీకు చెప్పియుండలేదా? మీరు ప్రకటించునదియు దాచునదియు అంతయు నే నెఱుగుదును."

34. "ఆదమునకు సాష్టాంగపడుడు" అని దేవతలకు నే నాజ్ఞాపించితిని. ఇబ్లీస్ తప్ప తక్కిన వారందఱును సాష్టాంగపడిరి. ఇబ్లీస్ గర్వించి ఈశ్వరాజ్ఞను తిరస్కరించెను. వాడు విశ్వాసహీనుడు.౧౬

35. అప్పుడు ఆదమున కిట్లాజ్ఞాపించితిని: "ఓ ఆదమ్! నీవును నీ భార్యయు ఈ స్వర్గోద్యానమును నివసింపుడు. మీ ఇచ్చవచ్చినట్లు ఇక్కడ పుష్కలముగ లభించువస్తువులను సంతుష్టికరముగ తినుడు,; (శాంతిప్రదమైన జీవితమును గడుపుడు.) ఇక్కడ ఒకచెట్టున్నది. దాని పొంత పోవలదు సుమా. మీరు దానికడకు పోతిరా చెడిపోదురు. మీరు మీ హద్దుల నతిక్రమించినవా రగుదురు."

36. కాని సైతాను (వారినిగ్రహశక్తిని తొలగించి) ధర్మస్థానము నుండి వారిని పడద్రోసెను. అప్పుడు నేనిట్లంటిని: "ఇంక మీరిక్కడి నుండి తొలగిపొండు. మీరు పరస్పరము శత్రువులు భూమిపై మీకు నివాసమును, కొంతకాలమువరకు సరిపోవు ఆహారమును కలదు."

37. ఆదమ్ తనప్రభువు కడనుండి (అధ్యాత్మ) జ్ఞానవాక్యములను పొందినవాడై ఆ సర్వేశ్వరుని (పశ్చాత్తప్త హృదయముతో)ప్రార్థించెను. (దేవుడతనియెడ కరుణించెను.) దేవుడు దయానిధి. కరుణించుటలో అతనికి సమాను లెవ్వరునులేరు.

38. అప్పుడు నేనిట్లాజ్ఞాపించితిని: "మీరిక్కడనుండి ఇకపొండు. (క్రొత్త జీవనము నవలంబింపుడు.) నిశ్చయముగ నా కడనుండి మీకుధర్మప్రబోధము కల్గును. దాని ననుసరించినచో మిమ్ము భయశోకములంటవు.

39. కాని దానిని నిరాకరించి అవిశ్వాసమును చూపినవారు నరకాగ్నికి ఇంధనములగుదురు; వారికందే నిత్యనివాసము."

ఐదవ ఖండము

40. ఓ ఇస్రాయీల్ వంశీయులారా! నా అనుగ్రహములను జ్ఞప్తికి తెచ్చుకొనుడు. (నా ఆజ్ఞలను శిరసావహించి సన్మార్గప్రవర్తకులమై యుందుమను) మీ ప్రతిజ్ఞలకు బద్ధులై యుండును. నేనుకూడ (సన్మార్గ ప్రవర్తనులకు ఇహపరలోకములందు జయశ్రీ నొసగుదునన్న) నా వాగ్దానమును నెరవేర్తును. నేనుతప్ప మరెవ్వరును లేరు. నాకుతప్ప మరెవ్వరికిని భయపడకుడు. (నాయందు భయభక్తు లుంచుడు.)

41. నాచే ప్రోక్తమైన ధర్మము ననుసరింపుడు. మీకింతకుముందిచ్చిన ధర్మముతో దీనినిపోల్చుకొనుడు. దానిని నిరారించుటకుమాత్రమే ఇది (నూతనముగ) ప్రోక్తమైనది. ఈ ధర్మము నిరాకరించుటలో ముందడుగు వేయకుడు. నా ధర్మమును తుచ్ఛమగు మూల్యమునకు అమ్మివేయకుడు. నేనుతప్ప మరెవ్వరునులేరు. అందుచేనాకుతప్ప మరెవ్వరికిని భయపడకుడు.

42. సత్యమును అసత్యముతో కప్పివేయకుడు. తెలిసియూ సత్యమును దాచకుడు.

43. ప్రార్థనమును స్థిరచిత్తులై యుండుడు. 'జకాతు' ౧౭ నీయుడు. నతులొనర్చెడివారితో మీరును వినతులుకండు.

44. ప్రజలకు సన్మార్గము నుపదేశించి, భగవత్ప్రోక్తమగు గ్రంథమును చదివియూ మిమ్ములను మీరు మరచియుందురా? (మీరు ఇతరుల కుపదేశించినది స్వయముగ నాచరింపవలెనను) జ్ఞానము మీకు లేదా? (ధర్మగ్రంథమును చదువుచుండిన మీరే ఇట్లు చేతురా?)

45. ఓర్పు వహించి, ప్రార్థనముల సల్పి భగవత్సహాయమును కోరుడు. దైవభీతిపరులకు తప్ప తక్కినవారి కిది కష్టతర సాధ్యమే. కాని సాత్వికులకును, 46. తమకు దేవుని సాన్నిధ్యభాగ్యము కలుగుననియు తుద కతని కడకే మరలువార మనియు దృఢవిశ్వాసము కల

వారికిని ఇది సులభము. (తామసులకును, విశ్వాసహీనులకును మాత్రమే అది కష్టసాధ్యము.)

ఆరవ ఖండము ౬

47. ఓ ఇస్రాయీల్ వంశీయులారా! నా అనుగ్రహములను జ్ఞప్తికి తెచ్చుకొనుడు. ప్రపంచములోని సమస్త జాతులలోను మిమ్ముల నుత్తమజాతిగా నొనర్చితిని కదా!౭

48. జాగ్రత్త! ఒక దినము వచ్చును. నాడు ఎవరూ ఎవరికిని సహాయము చేయరారు. ఒకరివెంటబెట్టుకొని రక్షించుట కెవ్వరును రారు. ఏవ్యక్తి పాపములకు నేదియు పరిహారముగా గ్రహింపబడదు. మరే విధమైన సహాయమును ఎవరికిని లభింపదు. ౮

49. జ్ఞాపక ముంచుకొనుడు. మీరు ఫిర్ఔన్ సంతతివారికి బానిసలై యుండిరి. వారు మిమ్ములను పలువిధముల హింసించిరి. మీ మగ శిశువులను సంహరించి స్త్రీలనే విడిచిపెట్టుచుండిరి. అది భగవంతుడు మీకు పెట్టిన ఒక కఠినపరీక్షయై యుండెను. మీకు వారి బాధల నుండియు (ఆ దుర్భర పారతంత్ర్యమునుండియు) ముక్తినిచ్చితిని.

50. మీరు చూచుచుండగనే మీకై సముద్రమును విడదీసి, ఫిర్ఔన్ సమస్తసైన్యమును సముద్రగర్భమున ముంచివైచి మిమ్ములను రక్షించితిని.

51. మూసాకు నేను నలువది రాత్రుల ఆజ్ఞ యొసగినప్పుడు (అతడా నలువది దినములు మిమ్ములను విడిచి తూర్ పర్వతమునకు వెళ్ళిపోయెను.) అతడు లేకుండుట చూచి మీరు గోవత్సమును పూజింపసాగిరి. సత్యమార్గమునుండి తొలగిపోతిరి.

52. కాని (నాకరుణాళుత్వము నప్పుడైనను మీరు గుర్తించి) కృతజ్ఞులై యుందురేమోనని, మీతప్పును నేను మన్నించితిని.

౭ "(నా సందేశము లోకమునకు చాటుటకు) ఇతరజాతు లన్నిటికంటె మిమ్మే ఎక్కువగ అనుగ్రహించితిని" అని యూసుఫ్ అలీగారు దీని వివరణార్థమును వ్రాసిరి.

53. అప్పుడు ధర్మాధర్మ విచక్షణమునకును, మీకు ఐహికాముష్మికసాధన మగుటకును ఒక మహాగ్రంథమును మూసాకు ప్రసాదించితిని.

54. (మూసా తూర్ పర్వతమునుండి తిరిగి వచ్చుసరికి మీరు గోవత్సమును పూజించుటయందు నిమగ్నులై యుండిరి.) అప్పుడుమీతో మూసా ఇట్లనెను: "ఓజాతీయులారా! (ఇదేమి!) గోవత్సమును పూజించి మిమ్ములను మీరు పతితుల నొనర్చుకొంటిరి. ఇప్పుడైనను పశ్చాత్తాపపడి భగవత్సాన్నిధ్యమునకు మరలుడు. మీవిషయ వాంఛలను చంపుడు. ♦ భగవంతుని సమక్షమున మీకదే శ్రేయస్కరమైనది. నిశ్చయముగ భగవంతుడు క్షమాసముద్రుడు, కరుణామయుడు."

55. అప్పుడు మీరిట్లనిరి: "ఓ మూసా! భగవంతుని ప్రత్యక్షముగా చూచువరకు మేము విశ్వసింపము."

అప్పుడే మీరుచూచుచుండగనే పిడుగురిమెను. మీరువిభ్రాంతులై స్పృహతప్పి పడిపోతిరి.౨౦

56. కృతజ్ఞులగుదురేమోనని మృతులైన మీకు జీవమొసగితిని.

57. మీకు నీడ నిచ్చుటకై మేఘములను పంపితిని. 'మన్నా' 'సల్వా' అను ఆహారముల పంపితిని. "మీకై పంపబడిన ఈ దివ్యాహారము నారగింపుడు" (అని మీకాజ్ఞాపించితిని. దీనితరువాత కూడ మీరు కృతఘ్నతా గుణము విడువరైరి.) ఐతే దీనివలన నష్టముకలిగినది మాకు కాదు. వారు తమకు తామే నష్టపరచుకొనిరి.

58. (ఇదికూడ జ్ఞప్తికితెచ్చుకొనుడు. మేమప్పుడు మీతోనిట్లంటిమి) "ఈపురమును ప్రవేశింపుడు. సంతుష్టికరముగ భుజింపుడు. నగర ద్వారమును ప్రవేశించునపుడు ప్రణమిల్లి, "ప్రభూ! మోయలేని మా

♦ "(దుష్టులగు) మీలోని వ్యక్తులను చంపుడు" లేక ఈ "విగ్రహారాధనమును చేయుటకు మిమ్ము ప్రేరేపించినట్టియు, దానిని మీలో ప్రవర్తింపజేసినట్టియు, వారిని చంపుడు" అనియు అర్థము చెప్పవచ్చును.

"భారమును తొలగింపుము" అని ప్రార్థింపుడు. మీ తప్పుల నప్పుడు క్షమింతును. మీలో పరోపకారపరులకు ఇంకను ఎక్కువగా శుభములను ప్రసాదింతును.

59. కాని వారిలోని దుర్మార్గులు కొందరు నాచే ప్రోక్తమైన వాక్కుల నొకదానికొకటి మార్చి (దౌర్మార్గ్యమున మగ్నులై పోయిరి. అట్టి దుర్మార్గులకొఱకు ఆకాశమునుండి ఒక శిక్షను పంపించితిని. తిరిగి తిరిగి దౌష్ట్యము నొనర్చువారికదే శిక్ష. ౨౧

ఏడవ ఖండము

60. (ఇదికూడ జ్ఞాపక ముంచుకొనుడు.) తన జాతికొఱకు మూసా నీరు కావలెనని కోరినప్పుడు మేమిట్లాజ్ఞాపించితిమి: నీచేతి కఱ్ఱతో ఆ కొండరాతిపై కొట్టుము." (మూసా ఆ ఆజ్ఞను శిరసావహించెను.) అప్పుడు దానినుండి పండ్రెండు సెలయేళ్ళు ఉత్పన్నమాయెను. అన్ని తెగలును తమకొఱకు ప్రత్యేక జలాశయములను కనుగొనెను. (నిర్జలమును, సస్యహీనమును అగు ఆప్రదేశమున మీకై అన్నపానీయములను పుష్కలముగ కల్పించితిని, ఇక) తినుడు; త్రాగుడు. భగవంతుడు ప్రసాదించిన ఈ సమస్త వస్తుజాలమునుండి లాభమును పొందుడు. (ఈ వస్తుసంపదయందలి లోభమోహములకు లోనై) దేశమున కలహములను మాత్రము పెంపకుడు.

61. మీచరిత్రలో ఈ ఘట్టమునుకూడ జ్ఞాపకముంచుకొనుడు. మీరు మూసాతో, "ఓ మూసా! మేమెప్పుడును ఒకేవిధమగు ఆహారమును తిని యుండజాలము. (ఈజిప్టులో నున్నప్పుడు మేము తినుచుండిన) వివిధములైన కూరగాయలు, గోధుమలు, పప్పు, ఉల్లి, వెల్లుల్లి మొదలైన సమస్త ఆహారపదార్థములును మాకు కలుగునట్లు భగవంతుని ప్రార్థింపుము" అంటిరి. అప్పుడు మూసా ఇట్లనియె: "(మీ మరుపు యెంత శోచనీయము!) తుచ్ఛమగు ఈ కోరికను తీర్చుకొనుటకై శుభోదర్కమగు

(ఈ మహదాదర్శమును) విడనాడజూతురా? (మీ దౌర్భాగ్య మట్లున్నసరే) ఇక్కడనుండిపొండు; నగరమార్గమును పట్టుడు. అక్కడమీరు నోరార్చుకొనుచున్న వస్తువులన్నియు లభించును. (కాని దానితోపాటు బానిసత్వము కూడ ప్రాప్తమగును.)

ఇట్లు ఇస్రాయీల్ సంతతికి దుర్దశ ప్రాప్తమాయెను. భగవదాగ్రహమునకు గురియై వారధోగతికి పాలైరి. భగవత్సందేశముల నిరాకరించుటకును, (సత్యసందేశహారులగు) ప్రవక్తలను అన్యాయముగ వధించుటయందాసక్తులై యుండుటకును ఇదే ఫలము. (భగవదాజ్ఞాబద్ధులగుటకు బదులు నిరంతరము) ఆజ్ఞోల్లంఘనము చేయుటయే దీనికి కారణము. (సత్యముయొక్క) పొలిమేరలను దాటి వారు నిరంకుశులైపోయిరి.

ఎనిమిదవ ఖండము

62. (వాస్తవముగ మోక్షము సత్యమునందు మీకుగల విశ్వాసముపైనను, స్వకీయమగు కర్మలపైనను ఆధారపడియున్నది; కాని జన్మము, వంశము, మతాచారములు—వీటిపై ఆధారపడిలేదు. సత్యమును) విశ్వసించువారు ఎవ్వరైన నగుదురుగాక, యూదులగుదురుగాక, క్రైస్తవులగుదురుగాక, (గ్రహముల పూజించు) సబాయీ లగుదురు గాక, (మరేమతస్థులైనను కానిమ్ము.) దేవునిపైనను, కర్మపరీక్షా దినమునందును విశ్వాసముంచి, సత్కార్యాచరణము చేయువారైనచో దేవుడు వారికి దానిఫలము నిచ్చును. వారి కేవిధమగు భయము గాని శోకము గాని అంటదు.

63. మరియు (మీ చరిత్ర) యందలి ఈ ఘట్టమునుకూడ జ్ఞాపకముంచుకొనుడు.) మీకడనుండి ప్రతిజ్ఞ గైకొని, తూర్ పర్వతశిఖరమును మీపైకె మహత్తరమొనర్చి, * "మీకు మార్గదర్శకముగ నుండుట

* 'తూర్ పర్వతమును మీపైకెత్తి' అనియు కొందరనువదించిరి. మౌలానా అబుల్ కలాం ఆజాద్, మౌలానా మొహమ్మద్ అలీ, అల్లామా యూసుఫ్ అలీ గార్ల అనువాదమిచట అనుసరింపబడినది.

కీ గ్రంథమును ప్రసాదించితిని. ధృఢనిశ్చయులై దాని ననుసరింపుడు. దానిలో చెప్పబడినదంతయు నిరంతరము స్మరించుచుండుడు. దీనివలన మీరు రక్షింపబడుదురు" అని చెప్పితిని. 64. కాని మీరు తిరిగి వాగ్భంగ మొనర్చిరి. (దుష్టమార్గము నవలంబించితిరి.) భగవంతుడు కరుణించనిచో మీ రప్పుడే అధఃపతితులై యుందురు.

65. మరియు మీలోనివారే కొందరు సబ్బాతు విషయమున దౌష్ట్య మొనర్చిన సంగతి నిశ్చయముగ మరచియుండరు. మీ వలెనే వారును విధ్యుక్తములను నెరవేర్చుటయందు ఏవో సాకులను పన్నితప్పించుకో జూచిరి.) తుచ్ఛములగు కోతులు కండని వారుశపింపబడిరి. (వారల్లే మర్కటస్వభావు లైరి.) ♦

66. వారి సమకాలికులకును వారి తర్వాత రాబోవు వారికిని ఇది యొక గుణపాఠముగ నుండునట్లు చేసితిమి. సత్యమార్గాచరణ పరుల కిది యొక పాఠము.

67. ఇదికూడ స్మృతికి తెచ్చికొనుడు. "ఒకఆవును బలి ఇవ్వవలెనని మిమ్ములను భగవంతు డాజ్ఞాపించుచున్నాడు." అని మూసా తన ప్రజలతో చెప్పెను. "నీవు మమ్ముల పరిహాసించుచున్నావా?" అనివారు మూసాకు ప్రత్యుత్తర మిచ్చిరి. "నేను అజ్ఞానిని కాకుండునట్లు భగవంతు నాశ్రయించు చున్నాను" అని మూసా చెప్పెను.

68. ఇది విని వారిట్లనిరి : "(ఇదియే నిజమైనచో) బలి పశువు ఎట్టిది కావలయునో మాకొఱకు భగవంతునడిగి తెలిసికొమ్ము."

మూసా ఇట్లనియె : "అది అతివృద్ధకాని, మిక్కిలి లేతదికాని కాకూడదు. మధ్యవయస్సులో నుండవలెను. ఇప్పుడు మీకీయాజ్ఞ ననుసరించి చేయుడు."

♦ ఇక్కడ స్వభావమేగాని స్వరూపము కోతులదికాలేదని ప్రాచీన భాష్యకారులలో ముజాహిద్ మున్నగువారును, ఆధునికులలో మౌలానా అబుల్ కలాం ఆజాద్, మౌలానా మొహమ్మద్ ఆలీ మున్నగు వారును వ్రాయుచున్నారు.

69. దానికి ప్రజలిట్లనిరి : "ఆగోవు ఎట్టివర్ణము కలదిగానుండవలెనో మాకొఱకు భగవంతునడిగి చెప్పుము."

మూసా ఇట్లనియె : "అది పసుపుపచ్చ వర్ణము కలదిగా నుండవలెను. చూపరులకు నయనానందకరముగ నుండు దట్టమైన పచ్చనిరంగు కలది."

70. (ఇన్ని విషయములు తెలిసికొనికూడ) వా రిట్లనిరి : "అది యేదియో స్పష్టముగ నెఱిగింపుమని మాకొఱకు భగవంతుని ప్రార్థింపుము. ఎందుకనగా మాకు గోవులన్నియు ఒకవిధముగనే కాన్పించుచున్నవి. ఈశ్వరాజ్ఞ యైనచో మేము సరియగు మార్గమున నడిపింపబడుదుము."

71. మూసా ఇట్లనియె : "నేల దున్నుటకుగాని, నీరు తోడుటకుగాని, మోటలాగుటకుగాని మచ్చికపరుప బడనిదియు, ఆరోగ్యవంతమును, నిర్మలమును, స్వచ్ఛమును అగుగోవు కావలెను."

అది విని ప్రజలు (పచ్చని ఆవు అనుటలో సరియైన అర్థమును గ్రహించుకొని) ఇట్లనిరి : "ఇప్పుడు మాకు సత్యమును ఉపదేశించితివి."

(వారు భగవంతుని ఆజ్ఞను శిరసా వహించిరి.) మనఃపూర్తిగా కాకపోయినను గోబలి గావించిరి.

తొమ్మిదవ ఖండము

72. (మరియు మీచరిత్రమునందలి ఆఘట్టమునుకూడ జ్ఞాపకముంచుకొనుడు.) మీరొక మనిషిని సంహరించితిరి. తర్వాత మీలో మీరు హత్యానేరము నొకరిపై నొకరు మోపుకొనుచు పోరాడసాగిరి. కాని మీరు దాచగోరిన (సత్యమును) భగవంతుడు బయలుపెట్టెను.

73. మే మప్పు డిట్లాజ్ఞాపించితిమి. (మీ కెవనియెడ అనుమానమున్నదో) వానికి సంహరింపబడినవాని (శరీర భాగము) నేదేని నొకదానిని తాకింపుడు. (అట్లు చేయగనే నిజము బయల్పడెను. హంతకుడు

పట్టువడెను.) దేవుడీవిధముగనే మృతులను సైతము సజీవులను చేయును. అప్పుడైనను మీరు జ్ఞానవంతు లగుదురేమో నని భగవంతుడు తన మహత్తు నిట్లు మీకై వ్యక్తముచేయును.

74. అప్పుడు (నిరంతర దుష్కార్యాచరణముచే) మీ హృదయములు బండబారి పాషాణప్రాయము లాయెను. పాషాణముల కన్నను కర్కశతరము లాయెను. కొన్ని రాళ్ళనుండి సైతము సెలయేళ్ళు ప్రవహించును; కొన్ని శిలలు పగిలినప్పుడు వానినుండి జలముత్పన్నమగును; మఱికొన్ని దైవభీతికి (కంపించి) క్రిందపడుచున్నవి. (కాని మీ హృదయములు మాత్రము దైవభీతిచే చలింపవు.) దైవనియమము మీరు చేయు కర్మలనేమరి యుండదు. (మీప్రతి కర్మను అది పాలించుచున్నది. మీ కర్మానుసారము మీరు ఫలము ననుభవింప వలసినదే,)

75. (ఓ ప్రవక్తా!) నీ సందేశమును వారు విశ్వసింతు రనియే ఆశించుచున్నావా? వారిలో కొందరు దైవసందేశమును విన్నవారుసైత ముండిరి. దాని అర్థమునుకూడ గ్రహించిరి. కానితర్వాత దానిని వారు (బుద్ధిపూర్వకముగ) మార్చివైచిరి. (స్వలాభాపేక్షచేతను, కొన్ని యెడల తమ భావములతో సమ్మిళితము చేయుటకు వారట్లు చేసిరి. తాము చేయుచున్నపని దుష్టమని వారికితెలియును. అట్టిస్వభావముగల ప్రజలు నీవు చాటుచున్న సత్యమును స్వీకరింతురనియే ఆశింతువా?)

76. (నాయెడలను, నీ సందేశముయెడలను) విశ్వాసము కలవారిని కలిసినప్పుడు వీరు తాముకూడా విశ్వసించితి మనియే చెప్పుదురు. కాని తమవారితో ఏకాంతగోష్ఠి నున్నప్పుడు "మీకు దేవుడు ప్రసాదించిన మహాజ్ఞానమును వీరందరికిని ప్రకటింతురేల? (వాటినే ఆధారముగాగొని మీకువ్యతిరేకముగ వారు భగవంతుని సమక్షమున వాదింతురుకదా! వారి ఉద్దేశమును మీరుగ్రహించలేరా?" అనికొందురు. 77. (కేవలము తమపంతమును నెగ్గించుకొనుటకు వీరు సత్యమును దాచివేయజూతురు. తెలిసియుండియు వితండవాదముల నేతురు. వీరియవివేకమెంత శోచనీయ

మైనది? ఇదిసామాన్యవిషయముకాదు.) భగవంతునకు తెలియని దేదైన కలదా? వారు పైకి చెప్పునదియు, లోలోన దాచునదియు సర్వమును దేవునకు తెలియునని వారెఱుగరా?

78. (ఇది వారి విద్వాంసులు ప్రవర్తించువిధము. కాని) వారిలో కొందరు విద్యాహీనులును కలరు. వారు భగవద్గ్రంథము నెఱుగరు. వారసత్యములనే ఎఱుగుదురు. వారివన్నియు స్వకపోలకల్పితములగు ఊహాలే.

79. తాము స్వహస్తములతో గ్రంథములను వ్రాసి "ఇది దైవప్రోక్తము" అనువారు ధిక్కృతులగుదురుగాక! కించిల్లాభము నపేక్షించి వారట్లు చేతురు. దేనిని వారిచేతులు వ్రాసెనో దానికొఱకును, దాని వలన వారు గడించినదాని కొఱకును వారు దుఃఖభాజను లగుదురుగాక!

80. మరియు వారిట్లందురు : "మమ్ములను నరకాగ్ని దగ్ధము చేయదు. (ఎందుకనగా మేము ముక్తిపొందిన జాతివారము.) మేము ఒకసారి అగ్నిలో వేయబడినను (నిత్యమందుండుటకు కాదు; పాపమాలిన్యమును తొలగించుకొనుటకై) తాత్కాలికముగ మాత్రమే అందుందుము.

(ఓ ప్రవక్తా! వారితో స్పష్టముగ) ఇట్లుచెప్పుము : మీరట్లని భగవంతునికడ వాగ్దానము గైకొనిరా?—అట్లైనచో భగవంతుడు వాగ్భంగము గావింపడు.—లేక మీకు తెలియని యొక విషయమును గుఱించి భగవంతునిపై నిందమోపుదురా?

81. మోక్షము ఏయొక ప్రత్యేకజాతియొక్క గాని ఒకప్రత్యేక ప్రజయొక్కగాని సొత్తు కాజాలదు. ఏజాతికి, ఏదేశమునకు చెందినవ్యక్తియైనను దుష్కార్యాచరణముచే పాపసమావృతుడైనచో, అతడు నరకము పాలగును. నిత్యము నరకమనుభవించును. 82. అట్లు కాక ఏవ్యక్తి విశ్వాస

మార్గము ననుసరించి సత్కార్యాచరణము చేయునో అతడు స్వర్గమునకు అర్హుడగును. వానికి స్వర్గమునందే నిత్యనివాసము.

పదియవ ఖండము

83. ఇస్రాయీలీయులకడ నుండి మేమొక ప్రతిజ్ఞ గైకొంటిమి. (అది) : దేవునితప్ప ఇతరులను ఎవ్వరిని ఆరాధింపరాదు. . తల్లిదండ్రులకు కృతజ్ఞులై ఉండవలెను. బంధువులయెడలను, తల్లిదండ్రులు లేని పిల్లలయెడలను పేదసాదల యెడలను ఉపకారబుద్ధి కలిగి ఉండవలెను. అందరితోడను ప్రియభాషులై యుండవలెను. నిత్యము ప్రార్థనా విధులను సల్పుచుండవలెను. జకాతునియ్యవలెను."

అప్పుడు మీలోకొందరు తప్ప తక్కినవారందరును తర్వాత మాటతప్పిరి. ధర్మాచరణ దృష్టియే మీకు లేకపోయెను. మీరు ధర్మ నిరాకరణమునందు చాలదూరము పోయిరి.

84. అటులనే మీకడనుండి మరియొక ప్రతిజ్ఞను గొంటిని : మీ వారి రక్తమును స్రవింపజేయకుడు. మీ వారిని పురములనుండి వెడలగొట్టకుడు." మీ రావిధముగ ప్రతిజ్ఞలను చేసితిరి. ఇప్పుడుకూడ మీరే దీనికి సాక్షులు.

85. అయినప్పటికి మీరు మీ ప్రజలనే నిష్కారణముగ సంహరించుచున్నారు. మీలో మీరు కక్షలు ఏర్పడి ఒక పక్షమువారు మరొక పక్షమువారిని అధర్మముగను అన్యాయముగను వారిని ఇండ్ల నుండి వెడలగొట్టి బాధించుచున్నారు. ఎంతటి అన్యాయమునకును ఒడిగట్టి వారి శత్రువులకు సహాయము చేయుచున్నారు. కాని వారు ఖైదీలైనపుడు ధనమిచ్చి విడిపించి తెత్తురు. (ఇది చాల పుణ్యకార్యమని వారి ఊహ). కాని అన్యాయముగ వారిని ఇండ్లనుండి వెడలగొట్టుట అధర్మము కాదా? మీరు భగవద్గ్రంథము నందలి కొంతభాగమును స్వీకరించి కొంత

భాగమును నిరాకరింతురా? ఇహలోకమున పరాభవము తప్ప మీలోని ఇట్టి దుష్కార్యాచరణ పరులకు మరొకలాభ మేమున్నది? తీర్పుదినము నాడు వారికి కఠినశిక్ష లభించును. మీసమస్తకర్మలను భగవంతుడు పరికించుచునే యున్నాడు.

86. వీరు (శాశ్వతమైన) పారలౌకిక సుఖమునకు బదులు (తాత్కాలికమగు) ఐహికసుఖమును కొనువారు. (ఇట్టివారికి మోక్షప్రాప్తి యెన్నడును కలుగదు.) వారిశిక్ష యొంతమాత్రము తగ్గదు. వారికెట్టి సహాయమును లభింపదు.

పదునొకండవ ఖండము

87. నిశ్చయముగ మూసాకు మేము జ్ఞానగ్రంథమును ప్రసాదించితిమి. (అది మీ మార్గదర్శకత్వమునకు.) ఆయన తర్వాత ఒకరి వెనుక నొకరిని నెందరినో ప్రవక్తలను పంపించితిని. తుదకు మర్యమ్ కుమారుడగు ఈసాకు స్పష్టమగు సత్యమునిచ్చి పంపి అతనికి పరిశుద్ధాత్మ బలమును ప్రసాదించితిని. (కాని మీరా ప్రవక్తల నందరిని ధిక్కరించితిరి. భగవంతుని సందేశమును నిరాకరించితిరి.) మీ స్వార్థములకు అనుకూలముగ లేని సత్యసందేశముతో ప్రవక్తలు మీవద్దకు వచ్చినపుడు మీరు దుర్గర్వప్రమత్తులై వారిని నిరాకరించిరి. కొందరిని వధించిరి. (మీరిట్లే అకార్యాచరణమున నిమగ్నులై యుందురా?)

88. (ఈ దుస్స్వభావమునకే వారు గర్వించుచు)ఇట్లందురు: "మా హృదయములపై గాటముగా ముసుగులు వేయబడి యున్నవి. (ఏ క్రొత్త మాటయు మా హృదయములయందు చొరజాలదు. ఇది విశ్వాసదార్ఢ్యము వల్లకాదు. అట్లైనచో అది ప్రశంసార్హమే. కాని అది దేవునియందలి నిరాకరణబుద్ధి యందుత్పన్నమైనది.) దానిచే వారు శపితులైరి. (అందుచేతనే వారు ధర్మసందేశమును విననైన వినరు. ఒకసారి వినినను దానిని స్వీకరింపరు.) వారు విశ్వసింపరు.

89. ధర్మమార్గమును చూపునట్టి ఈశ్వరప్రోక్తమగు ఒకగ్రంథము వారికి ప్రాప్తమయ్యెను. అది ఇంతకుముందు వారికడనున్న గ్రంథమును నిర్ధారించునదియై యుండెను. ఏ గ్రంథముపేరు చెప్పివారు విశ్వాసవంతులపై తమకు విజయము కలుగుటకై ప్రార్థనలు చేయుచుండిరో అట్టి గ్రంథము ప్రత్యక్షమైనప్పుడు దానినిసైతము నిరాకరించిరి. (దానికి విరుద్ధముగకూడ నడుముకట్టి నిలిచిరి. తెలిసియుండియూ) సత్యమును నిరాకరించినవారికి భగవచ్ఛాపము కల్గును.

90. ఎంతటి తుచ్ఛపు మూల్యమునకు వారు తమ ఆత్మలను అమ్మినైచిరి? భగవంతుడు తన ఇచ్ఛవచ్చిన వారిని అనుగ్రహించి సత్యమును ప్రసాదించినాడను ఈర్ష్యచే వారు (తెలిసియుండియూ) భగవత్ప్రోక్తమగు ఆసత్యసందేశమును నిరాకరించిరి. * (వారు తమ దుష్ప్రవర్తనముచే మొదటనేభ్రష్టులైఇప్పుడు ద్విగుణీకృతాగ్రహమునకుగురియైరి.) వారు పదేపదే భగవదాగ్రహమునకు పాత్రులైరి. సత్యమును నిరాకరించినవారికి పరాభవశిక్ష ప్రాప్తమగును.

91. "భగవత్ప్రోక్తమగు యీ గ్రంథమును విశ్వసింపుడు'' అని వారితో చెప్పినచో వారిట్లందురు :

"ఇంతకుపూర్వము మాకు ప్రాప్తమైన భగవద్గ్రంథమునే మేము విశ్వసింతుము. (మరేగ్రంథమును మేము విశ్వసింపము.)"

తమ భగవద్గ్రంథమును నిర్ధారించు సత్యగ్రంథమైనను సరే, వారు దానినేకాదు, తమ గ్రంథము కాని మరి దేనినైనను నిరాకరింతురు.

* భగవత్ప్రోక్తమగు సత్యము తమజాతివారికే గాని ఇతరులకు లభ్యమగుట అసంభవమని యూదులు తలచెడివారు. యూదజాతికి చెందని మరియొకనికి అనగా శ్రీ మొహమ్మద్ ప్రవక్తకు భగవద్గ్రంథము లభించెనను ఈర్ష్యచే వారు ఖుర్ ఆన్ భగవద్గ్రంథమని తెలిసియుండియు దానిని నిరాకరించిరి.

(ఓ ప్రవక్తా!) వారి నిట్లడుగుము : "మీరు నిజముగ (మీ భగవద్గ్రంథమునందు) విశ్వాసము కలవారేయైనచో(తౌరాత్ గ్రంథము కలదుకదా అనుకారణముచేమీరు ఖుర్ ఆనుపై విశ్వాస ముంచవలసిన అవసరములేదని తలచువారైనచో) మీరు ఇంతకుముందు (తౌరాత్ గ్రంథమును అనుసరించుడని బోధించిన) ప్రవక్తలను ఏల వధించిరి?

92. మూసా మీకడకు చిక్కులులేని స్వచ్ఛమగు భగవత్సందేశముతో వచ్చెను. అతడు లేని సమయమున మీరు గోవత్సమును పూజింపసాగిరి. మీరిట్లు (సత్యమునునిరాకరించి) అధర్మమునకుపాల్పడిరి.

93. మహోన్నతమైన సినాయీ పర్వతశిఖరముల క్రింద సత్యవర్తనులై యుండునటుల మీకడ ప్రతిజ్ఞను గైకొంటిని. అప్పుడు మీరిట్లాజ్ఞాపింప బడితిరి: "మీ కీయబడిన ఈ గ్రంథమును స్థిరచిత్తులై అవలంబింపుడు. దీని యాజ్ఞలను శిరసా వహింపుడు."

అప్పుడు మీరు (నోటితో) "వింటిమి" అనిరి. (కాని మనస్సుతో) "మేము దీనిని అనుసరింపము" అనిరి.

విశ్వాసరాహిత్యమువలన మీ హృదయములలో గోవత్సము యెడ మోహము దృఢముగ పాదుకొనెను. (ఓప్రవక్తా!) వారితో నిట్లనుము : "మీరు ఏమతము నవలంబించుచున్నా మనుచున్నారో, ఆ మతము ఇదే యైనచో అది కడు శోచనీయమైనది. మీ మతము మిమ్ములను దుష్టమార్గమున నడిపించుచున్నది."

94 (మోక్షము మాసొమ్మే అని వారనుచున్నారు. ఓ ప్రవక్తా! వారితో) ఇట్లనుము :

ఇతరు లెవ్వరికిని కాక మీ కొక్కరికే సాలోక్య ప్రాప్తికలుగును * నమ్మకమునందే మీకు గట్టి విశ్వాస మున్న యెడల—(మీరు

* 'దారుల్ ఆఖిరతు ఇన్దల్లాహి' అను ఇక్కడి మూలమునకు 'భగవంతునికడ తుది నివాసము' అని ప్రతిపదార్థము. వేదాంతపరిభాషలో ఇది సాలోక్యమునకు సరిపోవును.

ఇహమును విడచి పరమునే వాంఛింప వలసియుండెడివారు.) మీరు సత్యవ్రతులైనచో (నిర్భీతులై) మృత్యువును వాంఛింపుడు.

95. (ఓపవిత్రవక్తా! నీవు చూచెదవుగాక;) వారిన్నాళ్లు కూడబెట్టి యుంచిన దుష్కర్మలు వారినట్లు చేయనియ్యవు. భగవంతుడు దుష్టులను బాగుగ నెఱుగును.

96. (ఇంతేకాదు) జీవితము యెడ వారికిగల తృష్ణ మరెవ్వరికిని లేదు. బహుదైవతారాధకులకైనను ఇంత తృష్ణ లేదు. వెయ్యేండ్ల జీవితమును ఆశించువారును వారిలో కలరు. వారెంతకాలము జీవించినను భగవంతుని శిక్ష తప్పించుకోలేరు. వారు చేయు పనులన్నిటిని భగవంతుడు చూచుచునే యున్నాడు.

పండ్రెండవ ఖండము

97 (ఓ ప్రవక్తా!) భగవదాజ్ఞానుసారము జిబ్రీల్ నీహృదయమునకు వ్యక్తీకరించిన (ఈ సత్యము) భగవత్ప్రోక్తము. ఇది ఇంతకుముందు వ్యక్తీకృతమైన సత్యగ్రంథములను నిరూపించుచున్నది. విశ్వాసవంతులకు ఉపదేశము (మోక్షవిజయముల) శుభసందేశము ఇందుకలదు. ఎవరిద్వారా ఈ సత్యగ్రంథము ప్రోక్తమైనదో అట్టి) జిబ్రీలుకు ఎవడుశత్రువో వానితో నిట్లనుము :

98. "భగవంతునకును, అతని దూతలకును, అతని ప్రవక్తలకును జిబ్రీల్, మీకాయీలులకును ఎవడు శత్రువో భగవంతుడు కూడ అట్టి నాస్తికులకు మిత్రుడు కాజాలడు."

99. నిశ్చయముగ సత్యప్రకాశకములగు చిక్కులులేని వాక్కులను మేము ప్రవచించితిమి. సత్యమార్గమును తప్పి తప్పుత్రోవల భ్రమించువారుతప్ప మరెవ్వరును వానిని నిరాకరింపరు.

100. వారు సత్యమునకు కట్టుబడియుందుమని యెప్పుడు ప్రతిజ్ఞ చేసినను వారిలో ఏదో ఒకపక్షము ప్రతిజ్ఞాభంగ మొనర్చియే తీరెను.

వాస్తవ మేమనగా వారిలో పల్వుర హృదయములు భగవద్భక్తివిశ్వాసశూన్యములై యున్నవి.

101. దేవునికడనుండి ఒకప్రవక్త వారికడ ఇంతకుముందేయున్న పవిత్రగ్రంథమును దృఢపరచుచూ వచ్చినప్పుడు (వెనుకటి) భగవద్గ్రంథము కలవారిలో కొందరు దానిని త్రోసివైచి యేమియు నెఱుగనట్లే నటించిరి.

102. వారు (భగవద్గ్రంథము యొక్క) ఉపదేశమును విడిచి (మంత్రకాండ్రగు) దుష్టులు సులైమాన్ రాజ్యకాలము నాటివనిచెప్పి అభ్యసించు (మంత్రతంత్రములను) అనుసరించుచున్నారు. వాస్తవ మేమనగా (ఇది సులైమానుపై అపవాదము) సులైమాను ఎన్నడును అవిశ్వాసి కాలేదు. ప్రజలకు చేతబడి (మున్నగు మంత్రతంత్రములను) నేర్పుచుండెడి ఆ దుష్టులే అవిశ్వాసులు. బాబిలోనియాలో హారూత్, మారూత్ అను ఇద్దరు సుప్రసిద్ధ పురుషులకు (దుష్ట) విద్య (దైవ) ప్రోక్తమైన దనుటయు అసత్యము. 'మే మొకపరీక్ష మాత్రము. (మీరు ఈ విద్యను నేర్చుకొని) అవిశ్వాసులు కాకుడు' అని వారు చెప్పుచు నేర్పిరనుట. వారట్టి (దుష్ట) విద్యను ఎవరికైన నేర్పర కదా! (వారట్టి మంత్రతంత్రములను అసలు ఎవ్వరికి నేర్పనేలేదు.) వారికడ నేర్చుకొనిన (శాస్త్రజ్ఞానమును వారి దౌష్ట్యమునకై వినియోగించి) భార్యాభర్తలను ఎడబాపుట (మున్నగు దుష్కార్యముల) కు గడగిరి. భగవంతుని యనుజ్ఞయైన తప్ప వారు ఎవరినిదానితో హింసింపజాలరు. వారు నేర్చుకొను (చేతబడిమున్నగు మంత్రతంత్రములు) వారికి నష్టము కలిగించునవియే గాని లాభకారులుకావు. (ధర్మమును విక్రయించి) మంత్రతంత్రములను ప్రీతిగా గొనువానికి పరలోకఫలము కలుగదని వారికి తెలియును. వారు దేనికి తమ ఆత్మలను అమ్మివైచిరో అది మిక్కిలి తుచ్ఛమగు మూల్యము. ఇది వారికి తెలిసియే యుండినచో (వారికెంత శ్రేయస్కరముగ నుండెడిది!)

103. వారు విశ్వాసవంతులై సత్ప్రవర్తకులై యుండినచో భగవంతుడు వారి నెంతయో బహూకరించి యుండును. (కాని వారు నశ్వరమగు ప్రాపంచిక లాభమునకై శాశ్వతమగు మోక్షమును వదలుకొనిరి) వారి విషయమును గ్రహించియుండిన (ఎంత బాగుండెడిది!)

పదుమూడవ ఖండము

104. విశ్వాసవంతులారా! మీరు ద్వ్యర్థకములగు మాటలనాడకుడు. *మర్యాదగా పలుకరింపుడు. ప్రవక్త పలుకులను శ్రద్ధతో నాలకింపుడు. (జ్ఞాపకముంచుకొనుడు.) విశ్వాసహీనులకు ఘోరమగు శిక్షకలదు.

105. మీకు భగవంతుడు శుభము లొనగూర్చుట విగ్రహారాధకులకును, క్రైస్తవ యూదులలో విశ్వాసహీనులకును రుచింపదు. కాని భగవంతుడు తన ఇచ్ఛవచ్చినవారి ననుగ్రహించును. భగవంతుని అనుగ్రహము అపరిమితమైనది.

106. మేము రద్దుపరచునట్టియు, మరపించునట్టియు ఆజ్ఞలకు మారుగా అట్టివైనను లేదా వానికంటె మేలైనవియు నగు ఆజ్ఞలను ప్రసాదింతుము. భగవంతుడు సర్వశక్తిమంతుడని మీ రెఱుగరా?

107. భూమ్యాకాశముల సర్వప్రభుత్వము భగవంతునిదే యనియు, భగవంతుడు తక్క మరెవ్వరును మీకు సంరక్షకులుగాని సాహాయ్యులు గాని లేరనియు మీకు తెలియదా?

* "'రాయినా' అనకుడు. 'ఉన్ జుర్‌నా' అనుడు." అనిఇక్కడ మూలమునకు ప్రతిపదార్థము. "రాయినా" అనగా 'మమ్ములనాలకింపుడు' అనిఅర్థము. రాయినా అనుశబ్దము ఇంచుక ఉచ్చారణ భేదముతో "అతడుబుద్ధిహీనుడు" అనుఅర్థమునిచ్చును. నిందాగర్భితముగ మాట్లాడుట వంచనముకదా. అందుచే అట్టి శ్లేషార్థమునకు అవకాశమిచ్చు భాష మాట్లాడక 'ఉన్ జుర్‌నా' (మావైపునకు మరలుడు) అను స్పష్టమైన రీతిని మాట్లాడవలెనని ఖుర్ ఆన్ ఉపదేశించుచున్నది. మనస్సులో ఒకటిపెట్టుకొని పైకి మరొక అర్థము వచ్చునట్లు మాట్లాడుటను ఖుర్ ఆన్ నిషేధించుచున్నది.

108. పూర్వము మూసాప్రవక్తకు అప్పటిప్రజలు చేసిన వ్యర్థప్రశ్నలవంటివే మీరును మీ ప్రవక్త నడుగుదురా? (వ్యర్థవాదములు సేతురా?) శ్రద్ధావిశ్వాసములకు బదులు ఎవడు తిరస్కారమార్గము నవలంబించునో వాడు ఋజుమార్గమును కోల్పోయినవాడు. (మోక్షమార్గమును తప్పినవాడు.)

109. క్రైస్తవ యూదులలో పల్వురు మిమ్ములను శ్రద్ధావిశ్వాసములను విడిచి తిరస్కారమార్గము నవలంబింప జేయుటకు ప్రయత్నింతురు. వారికి సత్యము తెలియును. ఐనను అసూయాభావముచే వారు మిమ్ములను సన్మార్గమున నుండగా జూచి యోర్వజాలరు. (వారితో అనవసరముగా జగడమాడుటలో కాలమును వ్యర్థపుచ్చకుడు.) ఓర్పువహించి వారిని క్షమింపుడు. భగవంతుడే (ఈవిషయమున) తీర్మానించును. (సత్యమునకు జయమునుప్రసాదించి ఏదిసత్యమో ఏది అసత్యమోవెల్లడించును.) నిస్సంశయముగ భగవంతునకు సర్వవస్తువుల పైనను అధికారము కలదు.

110. ప్రార్థనను సల్పుడు. దానమునీయుడు. (దీనివలన మీఆధ్యాత్మికశక్తి బలపడును.) మీరు చేసికొనిన పుణ్యకార్యముల ఫలము భగవంతుడు మీకిచ్చును. మీరు చేయుచున్నదంతయు భగవంతుడుచూచుచున్నాడు.

111. యూదుడు కానిచో ఎవడును స్వర్గమును ప్రవేశింప నేరడని యూదులందురు. అట్లే క్రైస్తవులు కానివారు స్వర్గమును ప్రవేశింపనేరరని క్రైస్తవులందురు. ఇట్లే ప్రతిమతస్థులును తమతమ మతము నవలంబించనివారు స్వర్గమును (ప్రవేశింపజాలరని అందురు. కాని, ఓప్రవక్తా!) ఇవి కేవలము వారి అజ్ఞానజన్యమైన కోరికలు (కాని సత్యములు కావు.) "మీ మాట సత్యమైనచో నిరూపింపుడు" అనివారి నడుగుము.

112. (మోక్షద్వారము ఎల్లప్పుడును తెరువబడియేయున్నది. అది యొక ప్రత్యేకమతస్థుల మార్గముకాదు. ఎవరైనను సరే ఏ మతమునకుచెందిన వారైనను సరే; ఏనామమున పిలువబడుచున్నను సరే.) భగవంతునకు తనను, తన సర్వస్వమును అర్పించుకొని సత్కార్యాచరణము చేయు వాడైనచో భగవంతుడు అతనిని బహూకరించును. అతనికెట్టి భయముగాని ఎట్టి చింతగాని అవసరములేదు.

పదునాల్గవ ఖండము

113. క్రైస్తవుల మతము సత్యమైనది కాదని యూదు లందురు యూదుల మతము అసత్యమైనదని క్రైస్తవులందురు. అట్లయ్యు ఇరుమతముల వారును ఒకే గ్రంథము నవలంబింతురు. (వాస్తవముగ ఇద్దరి మతమును ఒకటే) వీరు చెప్పినట్లే అజ్ఞానులు (విగ్రహారాధకులు) కూడ చెప్పెదరు. (తమ మతమే సత్యమని వారు నమ్ముదురు.) భగవంతుడు వారి తగవులను అవసాన దినమున తీర్చును.

114. భగవంతుని ప్రార్థనాలయములలో భగవన్నామమును స్మరించుటను నిరోధించుట యందును, వాటిని ధ్వంసము చేయుట యందును ఆసక్తుడైనవానికంటె దుష్టుడు మరెవ్వ డుండును? దైవభీతి కలుగనంత కాలము ఇట్టి దుష్టులు ప్రార్థనాలయములలో అడుగు పెట్టుటకు అర్హులుకారు. ఇట్టి వారికి ఈలోకమున పరాభవమును, పరలోకమున కఠిన యాతన కలుగ గలదు.

115. ప్రాక్పశ్చిమములు రెండున్ను భగవంతునివే. (ముఖము ఒకే వైపునకు మాత్రమే త్రిప్పవలెనను నియమములేదు.) ఎటు ముఖముత్రిప్పినను భగవంతుడు ఎదురుగనే ఉన్నాడు.* భగవంతుడు (తన మహాచ్ఛక్తిచే) సర్వమును నిండియున్నాడు. (అతడు) సర్వజ్ఞుడును కూడ.

* "వజ్ హుల్లాహి" అను ఇక్కడి మూలమునకు 'భగవంతుని ముఖము' అని అర్థము. 'ఎటు ముఖము త్రిప్పినను భగవంతుని ముఖమావైపున నున్నది' అని దీని ప్రతిపదార్థము. భగవంతుడు సర్వతోముఖుడు అని దీని భావార్థము.

116. (క్రైస్తవులు) ఇట్లందురు: "భగవంతుడు ఏసు క్రీస్తును తన కుమారునిగ స్వీకరించినాడు." మహాద్యుతడతడు! భూమ్యాకాశములలో ఉన్న సర్వస్వమును అతనిదేకదా! (అతడొక కుమారుని స్వీకరించుటేల?) సమస్తము అతని ఆజ్ఞకు బద్ధమైయున్నదికదా!

117. భూమ్యాకాశములను అత్యద్భుతముగ సృష్టించిన అతడు, ఏదైనను చేయగోరినచో "అగుము" అని ఆజ్ఞ మాత్రమిచ్చును. (తదాజ్ఞానుసారము) వెంటనే అది అగును.

118. జ్ఞానములేనివా రిట్లందురు: "భగవంతుడు మాతో ఏల మాట్లాడడు? అథవా తన చిహ్నమేని ఒకటి యేల పంపడు"? ఇంతకు ముందుకూడ అజ్ఞానులిట్టి మాటలనే పల్కిరి. వారి హృదయములొకే విధమైనవి. (వీరికి చిహ్నములే కావలసినచో ఆ చిహ్నములను గ్రహించు శక్తి వారు సంపాదించుకోవలెను. చిహ్నములను గ్రహించుశక్తి ఉన్నచో) విశ్వాసవంతుల కొఱకు ఎన్నేని చిహ్నములను ప్రత్యక్షీకరించితిని.

119. (ఓ ప్రవక్తా! విశ్వాస సదాచారముల ఫలముయొక్క) సువార్తను తెలుపుటకును, (సత్యనిరాకరణ కెట్టి శిక్ష కలుగునో చెప్పి) హెచ్చరించుటకును వాస్తవముగ నిన్ను పంపితిని. (ఈ సందేశము వినియు సన్మార్గమునకు మరలని) నరకవాసుల బాధ్యత నీకులేదు. (సత్యసందేశమును వినిపించుటయే నీ విధి.)

120. యూదులు గాని క్రైస్తవులు గాని ఎన్ని మహాత్మ్యములు చూపినను వారి మతమును నీవు అవలంబించనంత కాలము నిన్నుచూచి వారుసంతోషింపరు.(ఎందులకనగా వారు తమతమ సంఘాచారము లందలి దురభిమానమునే మతమని నమ్ముచున్నారు.) నీవువారితో (స్పష్టముగ)ఇట్లు చెప్పుము: ఏది సత్యమగు భగవంతుని మార్గమో అదే సత్యమగు ధర్మమార్గము. (అంతే కాని మీరు కల్పించుకొన్న మతములును, ధర్మములును, సంఘములును కావు.) జ్ఞాపకముంచుకొనుము: నీకు సత్య జ్ఞానము లభిం

చిన తర్వాత కూడ నీవు వీరి ఇచ్ఛానుసారము ప్రవర్తించితివేని (ఇది భగవదాజ్ఞకు విరుద్ధము.) నీవు భగవంతుని రక్షణను సహాయమును కోల్పోదువు.

121. దైవదత్తమగు గ్రంథము ప్రసాదింపఁబడినవారు (యూదులలోను క్రైస్తవులలోను కొందరు) దానిని సరిగా పఠించి దాని ననుసరింతురు. దానియెడ శ్రద్ధావిశ్వాసములను కూడ చూపుదురు. ఎవరు శ్రద్ధా విశ్వాసములను చూపరో వారే నష్టపడుదురు.

పదునేనవ ఖండము

122. ఓ ఇస్రాయీలీయులారా! మిమ్ములను సర్వజాతుల పైనను నాయకత్వమిచ్చిన నాయనుగ్రహమును జ్ఞప్తికి తెచ్చుకొనుడు.

123. ఒక ఆత్మ మరొక ఆత్మకొఱకు ఎంతమాత్రమును బాధ్యత వహింపని ఆ దినమునకు భయపడుడు. నాడు (మీ పాపములకు) ప్రతిగా ఏదియు గ్రహింపబడదు; (శిక్షనుండి) తప్పించుటకు ఎవరు అడ్డువచ్చినను లాభముండదు. మరేవిధముననను నాడు సహాయము లభించదు.

124. ఇబ్రాహీమును కొన్నివిషయములలో* పరీక్షించి నప్పుడు అతఁడు ఆ పరీక్షయందుత్తీర్ణుడాయెను. భగవంతుడు అప్పుడిట్లనెను: "నీకు నేను మానవులపై నాయకపదవి నిచ్చెదను." దానికి ఇబ్రాహీం ఇట్లు విన్నవించుకొనెను: "ప్రభూ! మరి నా సంతానమునకో?" దానికి భగవంతుడిట్లనెను: "దుర్మార్గము ననుసరించువారికి నా వాగ్దానము చెల్లదు.",

125. అప్పుడు నేను ఆ ఆలయమును మానవులకు కేంద్రముగను♦ శాంతిపవిత్రతల స్థానముగను చేసితిని. ఇబ్రాహీం నిలువబడిన స్థలము

* 'కలిమాత్' అను ఇక్కడి మూలమునకు 'మాటలు' అని శబ్దార్థము. 'కొన్ని విషయములలో' అని దాని భావార్థమున ననువదించితిని.

♦ 'నీ సంతానమైనంత మాత్రమున నాయకత్వము లభించదు. సన్మార్గులైన వారికే నా వాగ్దానము చెల్లునుగాని ఇతరులకు కాదు, అని అర్థము.

ప్రార్థనకుచితమైనస్థలమగునట్లుగా నాజ్ఞాపించితిని. మరియు ఇబ్రాహీమునకును, ఇస్మాయీలునకును, ఇట్లాజ్ఞాపించితిని: "నా ఆలయమును, ప్రదక్షిణము చేయువారి నిమిత్తమును, ప్రార్థనచేయువారి కొఱకును, సాష్టాంగపడువారి కొఱకును, శుభ్రపరచి యుంచుడు"♦

126. ఇబ్రాహీమ్ ఇట్లనెను: "ప్రభూ! ఈ పట్టణమును సురక్షితమైన దానిగా చేయుము. భగవంతుని యందును, తుది దినమునందును విశ్వాసముకల ఇక్కడి ప్రజలకు ఫలవృక్షములను ప్రసాదింపుము" దానికి భగవంతుడిట్లనెను: (" నా అనుగ్రహము అందరకును సమానముగనే లభించును. కాని) అవిశ్వాసులకు కలుగు ఫలము (నశ్వరము). అది కొద్ది కాలమునకు మాత్రమే. తరువాత వారు నరకయాతనలకు పాలగుదురు. అది ఎంతటి ఘోరమగు గమ్యస్థానము!"

127. ఇబ్రాహీము ఇస్మాయీలులు కాబాకు పునాదివేసి దేవునిట్లు ప్రార్థించిరి: "ప్రభూ! (ఈ మా నివేదనను) మాకడనుండి స్వీకరింపుము. నిశ్చయముగ నీవు సర్వము వినువాడవు, సర్వము తెలిసిన వాడవు.

128. "ప్రభూ! మమ్ముల ఋజుమార్గప్రవర్తకుల నొనర్పుము) నీకు వినతులైన వారినిగా చేయుము. మాసంతతినుండి నీకు నమ్రులై యుండు ఒక జాతిని పుట్టింపుము. మాకు సరియైన భక్తి మార్గము చూపుము. మా తప్పిదముల క్షమింపుము. నీవు క్షమాపూర్ణుడవు; దయానిధివి.

129. "ప్రభూ! వారిలో ఒక ప్రవక్తను పుట్టింపుము. అతడు నీ సందేశమును వినిపించి దైవదత్తమగు గ్రంథము, జ్ఞానమును వారికి నేర్పి, వారిని పరిశుద్ధుల నొనర్చును. నీవు సకల శక్తిమంతుడవు; సర్వజ్ఞుడవు."

♦ ఇక్కడ ఆలయమనగా 'కాబా'. ఇది మక్కాలోనున్నది. దీనిని ఇబ్రాహీం ప్రవక్త నిర్మించిరి.

పదునారవ ఖండము

130. తన్నుతాను తుచ్ఛపరచుకొన్నవాడు తప్ప మరెవ్వడు ఇబ్రాహీముయొక్క మతమునుండి విముఖులు కాగలడు? వాస్తవముగ అతడు నాచే (ఇహమున) పావిత్ర్యమునకై ఎన్నుకొనబడిన వాడు. నిశ్చయముగ పరలోకమునను అతడు పుణ్యాత్ములలో పరిగణింపబడును.

131. (ఇబ్రాహీమ్) తన ప్రభువుచే "వినతుడవు కమ్ము" అని ఆజ్ఞాపింపబడినప్పుడు అతడు : (ప్రభూ!) సర్వలోకాధిపతియు, పోషకుడును అగునీకు నాఆత్మ సర్వస్వమును సమర్పించుకొనుచున్నాను" అనెను.

132. అదేవిధముగ ఇబ్రాహీము తన పుత్రులకును, (అతనిమనుమడగు) యాఖూబు తన పుత్రులకును ఉపదేశించిరి. వారిట్లనిరి : "పుత్రులారా! భగవంతుడు మీకొఱకై ఈ సత్యమతమును నిర్దేశించినాడు, భగవదిచ్ఛకు లొంగినవారు* కాకుండ మరణింపకుడు."

133. యాకూబుకు మరణ మాసన్నమైనప్పుడు మీరుండిరా? అప్పుడతడు తన కుమారులతో ఇట్లనెను : "నా మరణానంతరము మీరెవరిని ఆరాధింతురు?" దానికి వారంపరిట్లనిరి : "నీ వారాధించుచున్న భగవంతుని, నీ పెద్దలారాధించుచుండిన భగవంతుని, ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్‌హాకులు ఆరాధించుచుండిన భగవంతుని—ఆ ఏకేశ్వరునకే మేము వినతుల మగుదుము."

134. వీ రిప్పుడు మరణించిరి. (వారిపుణ్యకర్మలు మీ దుష్కార్యములకు ప్రతిహారము కాజాలవు.) వారు చేసికొనిన పుణ్యముల ఫలము వారిది. మీ చేతల ఫలమును మీరనుభవింతురు. వారి కర్మలకు మీరు బాధ్యులుకారు.

135. యూదు లిట్లందురు : "మీరు యూదులుకండు. మీకప్పుడు సత్యమగు ధర్మము లభించును." అట్లే క్రైస్తవు లిట్లందురు :

* "ముస్లిములు" అని అరబీ మూలము

"మీరు క్రైస్తవులు కండు. అప్పుడే మీకు సత్యమగు ధర్మములభించును." కాని నీ విట్లనుము : "కాదు. మేము ఋజుమార్గ ప్రవర్తకుడగు ఇబ్రాహీము మతమునే అవలంబింతుము. అతడు బహుదైవారాధకుడు కాడు."

136. (ఓ విశ్వాసవంతులారా!) ఇట్లనుడు : "మేము భగవంతుని యందును, మాకు ప్రోక్తమైన (ఖుర్ఆన్) గ్రంథమునందును, ఇబ్రాహీం, ఇస్మాయీల్, ఇస్‌హాక్ ప్రవక్తలకును యాకూబ్ సంతతివారికిని ప్రోక్తమైన గ్రంథములందును, మూసాకును ఈసాకును ప్రోక్తమైన గ్రంథములందును (ఇంతేకాదు) ప్రపంచమున ఉద్భవించిన సమస్తప్రవక్తలకు ప్రోక్తమైన ఉపదేశములందును విశ్వసింతుము. ఈ ప్రవక్తలలో ఎవ్వరియెడను మేము భేదభావమును చూపము. ఏకేశ్వరునకే మేము వినతుల మగుదుము.

137. నీవు విశ్వసించినట్లే వారుకూడ విశ్వసించినచో (జగడము లన్నియు సంతరించును) వారు సత్పథమున నున్నవారగుదురు. అట్లుకాక నిరాకరించినచో వారు ప్రతిఘటనమును, దౌర్జన్యమును చేయుచున్నారన్నమాట. మీరు వారిని లెక్కగొనకుడు. వీరి ప్రతిఘటనమును ఎదుర్కొనుటకు భగవంతుడు మీకు శక్తిని ప్రసాదించును. భగవంతుడు సమస్తమును వినుచున్నాడు. అతడు సర్వజ్ఞుడు.

138. (వారితో ఇట్లుచెప్పుము:) భగవంతుని సంస్కారమును పొందుడు. భగవంతునికంటె ఎక్కువ సంస్కారమును కలిగించువాడెవ్వడు? * మేమా భగవంతునే ఆరాధింతుము.

* క్రైస్తవులు బాప్టిజమ్ అను ఒక మతసంస్కారమును జరుపుదురు. అది జరిగినప్పుడే ఒకవ్యక్తి క్రైస్తవమతమును ప్రవేశించునని వారి నమ్మకము. హృదయముయొక్క సంస్కారము కావలెను గాని బాహ్యసంస్కారములు కావు మోక్షద్వారమును తెరచునవి అని ఖుర్ఆన్ బోధించుచున్నది, అట్లే ఉపనయనాది సంస్కారములకును దీని ననువర్తింపజేయవచ్చును. భగవంతునియందలి భక్తివిశ్వాసములే నిజమైన సంస్కారములు.

139. ఇట్లనుము : "భగవంతుని విషయమై మాతో వివాదము సల్పుదురా? భగవంతుడు మాకునుమీకును ప్రభువే. మీచేతలు మీకు మా చేతలు మాకు. ♦ మేము భగవంతుని హృదయ పూర్వకముగ నారాధింతుము.

140. ఇబ్రాహీము, ఇస్మాయీలు, యాకూబు, అతని సంతతి వారును క్రైస్తవులును యూదులును అందురా? వారితో ఇట్లుచెప్పుము "మీరు బాగుగా ఎరుగుదురా లేక భగవంతుడెఱుగునా? మీరుచేయు దానినన్నింటిని భగవంతుడు చూచుచునే ఉన్నాడు."

141. (ఏది ఎట్లనను) వీరు గతించినఒకజాతి. వారు చేసినదాని ఫలము వారిది, నీవుచేసినదాని ఫలమునీది. వారి కర్మలకు నీవు బాధ్యుడవుకావు.

రెండవ భాగము

పదునేడవ ఖండము

142. బుద్ధిహీను లిట్లందురు. "ముసల్మానులు ఇంతవరకు ఒక దిక్కు మొగమై ప్రార్థనలు సలుపుచు ఇప్పు డాదిక్కు నేలమార్చిరి"? (ఓ ప్రవక్తా!) వారితో నిట్లనుము. "తూర్పైనను పడమరైనను అన్ని దిక్కులును భగవంతునివే. అతడు తన ఇచ్ఛవచ్చిన వారికి తిన్ననిమార్గము చూపును."

143. మీరు మానవు లందరికొఱకును సత్యసందేశము నిరూపించి చెప్పువారని మీకుఒక ఉత్కృష్టజాతి గౌరవము ప్రసాదించితిని. మీ సత్యసందేశమునకు ప్రవక్త సాక్షియై యుండును.

♦ "మీరుచేయు మంచిచెడ్డల ఫలితము మీకును మేముచేయు మంచిచెడ్డల ఫలితము మాకును లభించును" అని భావార్థము.

ఇన్నాళ్ళు మీరు ఏదిక్కు మొగమై ప్రార్థనల సలుపుచుండిరో, దానినింతకాలము స్థిరపఱచి యుంచుటలో ఉద్దేశము నిజముగా ప్రవక్తను ఎవ్వరనుసరించుచున్నారో, ఎవ్వరు వెనుజూపుచున్నారో తెలిసికొనుట. నిస్సందేహముగ సన్మార్గ ప్రవర్తకులకు తప్ప తక్కిన వారందరకును ఇది ఒక కఠినపరీక్ష. ఇట్టివారి విశ్వాసమును భగవంతుడు నిష్ఫలమొనర్పడు. నిశ్చయముగ భగవంతుడు ప్రేమమయుడు; కరుణాళువు.

144. ఓ ప్రవక్తా! నీవు స్వర్గముకేసి మొగమెత్తుచుండుటను మేము చూచుచున్నాము. మేము నీ ముఖమును నీ ఇష్టము వచ్చిన ఒక 'ఖిబ్లా' వైపుకు త్రిప్పుచున్నాము.[౩౮]

ఆ పవిత్రప్రార్థనాలయము కాబావైపునకు మీ ముఖములను త్రిప్పుడు. మీ రెక్కడున్నను దానివైపునకే ముఖము త్రిప్పుడు. ఈ సత్యసందేశమును పొందినవారు ఇది భగవంతునికడనుండి వచ్చిన సత్యమని ఎఱుగుదురు. వారు చేయుదానిని భగవంతుడు ఏమరి యుండడు.

145. యూదులకును క్రైస్తవులకును మీరెన్ని నిదర్శనములు చూపినను సరే, వారు మీఖిబ్లాను అంగీకరింపరు. మీరుకూడ వారి ఖిబ్లాను అంగీకరింపరు. వారు సహితమేదేని ఒకే ఖిబ్లాను స్వీకరించినవారుకారు. వారిలో ఒక తెగవారి 'ఖిబ్లా'ను మరొకతెగవా రంగీకరింపరు. ఇదంతయు తెలిసియుండియు మీరు వారిననుసరించినచో మీరు భగవదాజ్ఞ నతిక్రమించిన వారగుదురు.[౩౯]

146. వాస్తవ మేమనగా యూదులును క్రైస్తవులును వారి పండితులును తమసంతతి నెట్లు గుర్తుపట్టుదురో నిన్ను (ఇస్లాంప్రవక్తను) అట్లే గుర్తుపట్టుదురు. అట్లయ్యు వారిలో కొందరు తెలిసియుండియు సత్యమును దాచిపుత్తురు.[౪౦]

147. ఈ సత్యము భగవదాజ్ఞయై యున్నది. అందుచే మీరు దానివిషయమై సంశయాత్ములై వాగ్వివాదములను చేయకుడు.

పదునేనిమిదవ ఖండము

148. ప్రతి యొక్కరికి ఒక్కొక్క దిశకలదు. వారా దిశకు తమ ముఖమును త్రిప్పుకొందురు. మీరు సన్మార్గము దిశ సాగుడు. సన్మార్గమున ఒకరిని మించి ఒకరు ముందుండుటకు ప్రయత్నింపుడు. మీరు ఎక్కడున్నను భగవంతుడు మిమ్ములను కనిపెట్టును. నిశ్చయముగ భగవంతుని శక్తికి మించినదేదియు లేదు. (అతని శక్తి ప్రతివస్తువును ప్రతి దిశను ఆవరించియున్నది.)౩౭

149. ఓ ప్రవక్తా! మీరెక్కడనుండి వచ్చినను (అనగా ఎక్కడున్ననుసరే, ఏ దిశనున్ననుసరే) పవిత్ర ప్రార్థనాలయము కాబా ఉన్న దిశకు ముఖములను త్రిప్పుడు. ఇది మీ భగవంతుని కడనుండి వచ్చిన సత్యమగు ఆజ్ఞ. మీరుచేయు ఏపనినైనను భగవంతుడు ఏమరియుండడు.

150. మీరు ఎక్కడనుండి వచ్చినను సరే (ప్రార్థనాసమయమందు మాత్రము) మీ ముఖమును కాబా వైపునకు త్రిప్పుడు. మీరు ఏ ప్రదేశమున ఏదిక్కున నున్నను మీ ముఖములను కాబా వైపుకు త్రిప్పుడు. ఇదెందు కనగా మీకు వ్యతిరేకముగ ప్రజల కెట్టి వివాదమును ఉండరాదని. కాని అన్యాయపరులు (ఎట్లున్నను పగబూనువారే.) (వారి పగ మీ కెట్టి హానియు కలిగింప జాలదు.) అందుచే వారికి భయపడకుడు. నాకు మాత్రము భయపడుడు. (నాకు మీరు భయపడినచో మిమ్ములను విశ్వములో మరేశక్తియు భయపెట్టజాలదు.) నేను మీకు వాగ్దానమిచ్చిన నా అనుగ్రహమును మీరు ఒడయుదురు. మీరు సన్మార్గ ప్రవర్తకులగుదురు.

151. మీలోనుండి ఒకనిని నా సందేశమును వినిపించు ప్రవక్తగా పంపితిని. అతడు నా ప్రవచనములను మీకు వినిపించు చున్నాడు. మీ (హృదయములను) సంస్కరించుచున్నాడు. మీకు జ్ఞానమును గఱపు

చున్నాడు. జ్ఞానగ్రంథమును నేర్పుచున్నాడు. మీకు తెలియని విషయములను తెల్పుచున్నాడు. (ఇట్లే మీపై అనుగ్రహమును కురిపించి మిమ్ములను సన్మార్గప్రవర్తకులను చేయుదును.)

152. అందుచే నన్ను స్మరింపుడు. నేను మిమ్ము స్మరింతును. నాకు కృతజ్ఞులై యుండుడు. కృతఘ్నులు కాకుడు.

పందొమ్మిదవ ఖండము

153. ఓ విశ్వాస వంతులారా ! ఓర్పుతోడను, నమ్రతతోడను సహాయము నర్థింపుడు. ఓర్పువహించువారితో భగవంతుడున్నాడు.

154. భగవన్మార్గమున మరణించినవారిని గూర్చి చచ్చిరని చెప్పకుడు. అట్లుకాదు. వారు జీవించియున్నారు. కాని మీరు గ్రహింపరు.

155, 156. భయమును, ఆకలిని, ధనధాన్య ప్రాణనష్టమును కల్గించి మిమ్ములను నిశ్చయముగ పరీక్షింతును. ఏదేని కష్టము కలిగినప్పుడు "మా సమస్తము భగవంతునిదేను. మన కందరకు భగవంతుని యొద్దకే మరలవలసి యున్నది" * అనునట్టి ఓర్పుగల వారికి (ఓ ప్రవక్తా!) శుభవార్తను తెల్పుము.

157. ఇట్టివారే భగవంతుని కృపకును అనుగ్రహమునకును పాత్రులైనవారు. సన్మార్గగాములుకూడ వీరే.

158. సఫా, మర్వా పర్వతములు భగవంతుని మహత్తును ప్రకటించు చిహ్నములు. అందుచే మీరు కాబాను దర్శించ బోయినప్పుడెల్ల ఈ పర్వతముల ప్రదక్షిణముచేయుట పాపకార్యముకాదు. స్వచ్ఛమగు హృదయముతో ఏ సత్కార్యము చేసినను భగవంతుడతనికి సంపూర్ణ ఫలమిచ్చును. భగవంతుడు వరదుడు; సర్వజ్ఞుడు.

---

* ఏదేని ఆపద సంభవించినప్పుడును, మరణవార్త విన్నప్పుడును ప్రతి ముస్లిము ఈసూక్తమును పునశ్చరించును. "ఖాలూ ఇన్నా లిల్లాహి వఇన్నా ఇలైహిరాజెఊన్" ఇది ఈ సూక్తమునుండి పునశ్చరణ మొనర్చు భాగము.

159. స్వచ్ఛమగు సత్యమును, సన్మార్గమును చూపుటకై పంపబడిన సందేశమును సమస్త మానవలోకమునకు తెలియునట్లును వారికి ఆచరణయోగ్య మగునట్లును సవివరణముగ భగవద్గ్రంథము నందు విప్పి చెప్పినను (లోకభయముచే) సత్యమును దాచువారు భగవంతునిచే శపితులగుదురు. (అంతేకాదు) సమస్త శాపములును వారికి తగులును.

160. (కాని పశ్చాత్తాపద్వార మెప్పుడు తెఱచియేఉన్నది.) పశ్చాత్తాపపడి తమ ప్రవర్తనము మార్చుకొని, (భగవత్సందేశమును దాచుటకుమారు లోకమునకు) చాటుచో అట్టివారి పశ్చాత్తాపమును నేను చిత్తగింతును. నేను క్షమించువాడను; దయానిధిని.

161. కాని భగవన్మార్గమును ధిక్కరించి, ఆమరణాంత మట్లేయుండి మరణించిన వారికి భగవంతుని యొక్కయు, దేవదూతల యొక్కయు, మానవులయొక్కయు శాపములు తగులుగాక!

162. వారాస్థితియందే నిరంతర ముందురు. వారి శిక్ష ఎన్నడును తక్కువకాదు. వారికి వ్యవధి లభించదు.

163. మీ ఈశ్వరుడు ఏకేశ్వరుడు. (ఏకేశ్వరుడుతప్ప) ఈశ్వరుడు మరొకడులేడు. అతడు సమస్త వరప్రదాయకుడు; దయానిధి.

ఇరువదవ ఖండము

164. భూమ్యాకాశముల సృష్టియందు, రేయింబవళ్ళ మార్పులయందు, మానవుని లాభమునకై (వస్తుసంచయమును మోసుకొని) సముద్రయానముచేయు ఓడలయందు, మేఘములనుండి వర్షించునీటియందు, మృతినొందిన మృత్తిక ఆనీరు జీవప్రదానముచేయు విధమునందును, భూమిపై బహువిధములగు జంతుసంతతి వ్యాపించిన తెఱగునందు, పవనముల మార్పునందు, భూమ్యాకాశముల మధ్య మేఘములు (తమతమ నిర్ణీత స్థలములలో) బంధింపబడియున్న తెఱగునందును బుద్ధిమంతుల కొఱకు (భగవంతుని అస్తిత్వముయొక్కయు అతని దయాళుత్వము యొక్కయు) గొప్పచిహ్నములు స్పష్టముగఉన్నవి.

165. కొందరు భగవంతునకు సమానుల కల్పించి ఈశ్వరార్హమగు ప్రేమతో వారిని ప్రేమింతురు. విశ్వాసవంతులు మాత్రము భగవంతునే ప్రియతమునిగ భావింతురు. ఈ దుర్మార్గులగు (విశ్వాసహీనులు) తమవంటి ఇతరుల కీయబడిన శిక్షనుచూచినచో భగవంతుడే సర్వశక్తిమంతుడనియు దౌష్ట్యమును శిక్షించుటలో అతడు కఠినుడనియు తెలిసికొనియుందురు.

166. వీరు కల్పించుకొనిన (ఈ దేవతలు) తమ అనుయాయులగు వీరిని వారికర్మమునకు విడిచిపెట్టినప్పుడును, తమవంటి వా రనుభవించుచున్న శిక్షను వారు కండ్లార చూచినప్పుడును, వారి బంధములు తెగినప్పుడును (కానివారికి తెలియదు).

167. ఆ దేవతల అనుయాయులగు వీరు ఇట్లందురు : "మేము (భూలోకమునకు) మరలినచో వీరిప్పుడు మమ్ములను విడిచి పోయినట్లే వీరినికూడ మేము విడిచిపెట్టుదుము." ఈ విధముగ భగవంతుడు వారి కర్మఫలమును వారికి దుఃఖము కల్గునట్లు చూపును. వారు నరకాగ్నినుండి బయటకు రారు.

ఇరువది యొకటవ ఖండము

168. ఓ మానవులారా! భూమిపైనున్న వస్తువులలో ధర్మవిహితములును, మంచివియు నగు వాటినే భుజింపుడు. శైతాను అడుగుజాడలను వెంబడింపకుడు. వాడుమీకు బహిరంగ శత్రువు.

169. వాడు మిమ్ములను చెడుగును సిగ్గుమాలిన తనమును అవలంబించుమనియే ప్రోత్సహించును. మీ రెఱుగని అంశములను గుఱించి దేవునిపేరు చెప్పి అబద్ధములు చెప్పుటకై మిమ్ములను పురికొల్పును.

170. "భగవదాజ్ఞానుసారము ప్రవర్తింపుడు." అనివారితో చెప్పినప్పుడు వారిట్లందురు: "అట్లుకాదు. మా తండ్రులనుసరించిన మార్గమునే

మే మనుసరింతుము." ఏమీ వారి తండ్రులు బుద్ధిహీనులైనను, సన్మార్గగాములు కాకపోయినను సరే(వారిమార్గమునేగుడ్డిగాఅనుసరింతురా?)౪౧

171. (వాస్తవమేమనగా) ఎవరు (భగవత్ప్రసాదితమగు బుద్ధిని సంస్కారమును విడిచి) సత్యతిరస్కార మార్గమును పట్టిరో వారి తార్కాణమిట్టిది: ఒక పశుపాలకుడు పశువులను పిల్చుచు ముందు నడుచు చుండును. ఆ పిలుపు కేకలు తప్ప మరేదియు పశువులకు వినిపించదు. (పశువులకు వాటిని గోపాలకులు పిల్చు కూత తప్ప మరే మాటయు అర్థముకాదు. గ్రుడ్డిగా వెనుకటివారిని అనుకరించు వారి స్థితియు ఇట్టిదే. వారు పసులకాపరివెంట పశువులు పోవునట్లు పోవుదురు: స్వయముగ ఆలోచించి మంచిచెడ్డల విచక్షణము చేయరు.) వారు (పశువులవలె జ్ఞానశూన్యు లగుటయేకాక) చెవిటివాండ్రు, నోరులేని వారు, గ్రుడ్డివాండ్రై యున్నారు. వారు అవివేకులు.

172. ఓ విశ్వాసవంతులారా! మీ కీయబడిన వస్తువులనుండి మంచివాటినే గ్రహించి తినుడు. మీరు భగవంతు నారాధించు వారైనచో అతనికే కృతజ్ఞతల నర్పింపుడు.

173. తమంత తాము చచ్చిన (మృగపక్షులను) రక్తమును, పందిమాంసమును, భగవంతుని పేరతప్ప మరే ఇతర దేవతకు బలియీయబడిన దే ఆహారములైనను మీకు నిషేధింపబడినవి. కాని ఇచ్ఛతో కాక ఆపత్కాలమున (ప్రాణసంరక్షణార్థమై) మితము తప్పక భుజించినచో అది పాపముకాదు. ఎందుకనగా భగవంతుడు క్షమించువాడు; దయానిధి.

174 తుచ్ఛమగు మూల్యమునకై భగవత్ప్రోక్తమగు గ్రంథమందలి ఒక భాగమును దాచివైచినవారు అగ్నిని భుజింతురు. తుది దినమున భగవంతుడు వారిని పలుకరించడు. అట్టివారిని భగవంతుడు పరిశుద్ధుల నొనర్పడు. వారికి బాధాకరమగు శిక్షను విధించును.

175. సన్మార్గమునకు బదులు చెడుత్రోవయు, క్షమాపణము నకు బదులు శిక్షయు సంపాదించుకొనువారు వీరే. నరకాగ్నిని చొరబూను వీరు ఎంతటి సాహసులు!

176. ఇదెందుకనగా భగవద్గ్రంథమునకు వ్యతిరేకులైనవారు ఒక గొప్ప పగబూనియున్నారు.

ఇరువదిరెండవ ఖండము

177. తూర్పువైపునకుగాని, పడమటివైపునకుగాని ముఖమును త్రిప్పుటయే ధర్మప్రవర్తనము కాదు. భగవంతునియందును, తుదిదినమునందును, దేవదూతలందును, భగవద్గ్రంథమునందును, ప్రవక్తలయందును, విశ్వాసముంచుటయు; బంధువులకును, అనాథబాల బాలికలకును, నిరుపేదలకును, మార్గస్థులకును, బిచ్చగాండ్రకును ఇచ్చుటకును, ఖైదీలను విడిపించుటకును, భగవంతుని ప్రేమకై తనకున్న ధనమును వ్యయపరచుటయు; ప్రార్థన సలుపుటయు; జకాతు నిచ్చుటయు—ఇది నిజమగు ధర్మ ప్రవర్తనము.

వాగ్దానమిచ్చి దానిని పాలించువారును, కష్టకాలములో ఓర్పు వహించువారును—వీరే ధర్మప్రవర్తకులు. వీరే దౌష్ట్యమునుండి తప్పి చరించువారు.

178. ఓ విశ్వాసవంతులారా! వధింపబడినవారి విషయములో ప్రతీకారము తీసికొనుటకై మీ కనుజ్ఞ ఇవ్వబడినది. ఒక స్వచ్ఛంద మానవుడు వధింపబడుచో అతనికి బదులు అతడే వధింపబడవలెను. ఒక బానిస వధింపబడుచో బానిసయే వధింపబడవలెను. స్త్రీ వధింపబడినచో స్త్రీయే వధింపబడవలెను.

ఒకప్పుడు వధింపబడిన వాని వారసుడగు అతని సోదరుడు, వధించిన వానిని క్షమించినచో (రక్తమునకు మారుగా రక్తశుల్కమును గ్రహించుట కొప్పుకొనినచో) ఆ వారసునకు ధర్మప్రకారము (రక్తశు

ల్కము) నియ్యవలెను. వధించినవారు సంతోషముతో ఇవ్వవలెను. ఇది మీ కష్టములను తగ్గించుటకొఱకు భగవంతుడు చూపిన అనుగ్రహము. దీని పిదప ఎవ్వరైనను తమ హద్దులను మీరుచో ఘోరమగు శిక్షకు పాత్రులగుదురు.

179. (ఓ వివేకవంతులారా!) ఈ ప్రతీకార ధర్మములో (ప్రాణమునకు ప్రతి ప్రాణము విధింపబడినను ఇదినిజముగ మరణముకాదు.) మీకై జీవితమున్నది. మీకు చెడుగునుండి తప్పి చరించుటకును (దౌర్జన్యమంతమొందుటకును ఇట్లు విధింపబడినది.)

180. (ఓ విశ్వాసవంతులారా!) మీలో ఎవరికేని మరణమాసన్నమగునప్పుడు అతనికున్న ధనమును, ఆస్తిని తన తల్లిదండ్రులకును బంధువులకును విడిచిపెట్టి ఉచితమగు మరణశాసనములు వ్రాయుటవిధి. భగవద్భీతి పరులకిది అవశ్యకర్తవ్యము.

181. అట్లు (మరణించినవాడు చేసిన విభజనమును) వినియు దానిని ఎవడు మార్చునో అట్లు మార్చినవానిదే పాపమగును. భగవంతుడు సర్వమును వినువాడు; సర్వజ్ఞుడు.

182. కాని మరణశాసనమును వ్రాసి చనిపోయినవాడు అన్యాయమున కొడిగట్టుకొనెనని గాని, ధర్మోల్లంఘనము చేసెనని గాని అనుమానమున్నచో (వారసులనుఒప్పించి) వారిలో ఒడంబడిక కుదిర్చినచో అది పాపకార్యముకాదు. నిశ్చయముగ భగవంతుడు (మానవసహజమైన దౌర్బల్యమును) క్షమించువాడు; కృపానిధి.

ఇరువదిమూడవ ఖండము

183. విశ్వాసవంతులారా! మీ పూర్వులకువలె మీకు కూడ ఉపవాసము విధివిహిత మొనర్పబడినది. దీనివలన మీకు చెడుగు అంటకుండును.

184. (ఈ ఉపవాసము) కొన్ని నిర్ణీత దినములయందు (మాత్రమే విధింపబడినది.) కాని మీలో రోగగ్రస్తులై యున్నవారును, ప్రయాణమునం దున్నవారును, (వారికి వీలైన) ఇతర దినములలో ఉపవాసముంచి ఆ దినములను పూర్తి చేసుకొనవలెను. ఉపవాసముండ నశక్తులైన వారు ఒక బీదవానికి అన్నముపెట్టిన చాలును. ఎవ్వరైనను సంతోషముతో ఇంకను ఎక్కువ సత్కృతి నాచరించినచో (ఇంకను ఎక్కువ మందికి అన్నము పెట్టినయెడల) అతనికి ఎక్కువపుణ్యము లభించును. మీరు జ్ఞానవంతులైనచో ఉపవాసము చేయుటయే ఉత్తమము.

185. ఈ రంజాన్ నెలలో ఖుర్ఆన్ అవతరించినది. మానవులకది మార్గదర్శకమైనది; సన్మార్గముయొక్క స్వచ్ఛమగు నిదర్శనములు కలది; సత్యాసత్యముల వేరుపరచి చూపునది. అందుచే మీలో ఆరోగ్యవంతులైనవా రుపవాసమొనర్పుడు. రోగగ్రస్తులైనవారు, ప్రయాణమునందున్నవారు (వారికి వీలైనప్పుడు) శక్తి యున్నప్పుడు తప్పియున్న దినములను ఇతర దినములయం దుపవాసముండి పూర్తి చేసికొనవచ్చును. (సత్యమైన ధర్మమార్గము కఠినమైనది కాదు.) భగవంతుడు మీకు సౌలభ్యమునే కలిగింపగోరును. మీకు కష్టము కలిగింపగోరడు. అందుచే (నిర్ణీత దినముల) సంఖ్య పూర్తి చేసికొనుడు. మీరు కృతజ్ఞులై యుందురని మిమ్ముల ఋజుమార్గమున నడిపించిన భగవంతుని మహత్తు కొనియాడుడు.

186. (ఓ ప్రవక్తా!) నా సేవకులలో ఎవడేని నన్నుగుఱించి (నన్ను చేరు మార్గమును) అడిగినచో నేను చాల దగ్గరగ నున్నానని అతనితో చెప్పుము. నా భక్తుడు నన్ను పిలిచినప్పుడు నేనా పిలుపు వినుచున్నాను. ఆ పిలుపున కుత్తరమిచ్చుచున్నాను. అందుచే వారును నా పిలుపున కుత్తర మీయవలెను. నాయందు విశ్వాసముంచి ధర్మమార్గమున నడువవలెను.

187. ఉపవాసదినములలో రాత్రులయందు మీ భార్యలను గవయుట మీకై ధర్మవిహిత మొనర్పబడినది. మీకు వారు అవగుంఠనముల * వంటివారు. అట్లే మీరును వారికి అవగుంఠనముల వంటివారు. అట్లు చేయకూడ దనుకొని మీ అంతరాత్మల ప్రబోధమునకు వ్యతిరేకముగ మీరు ప్రవర్తించుచుండిరి (భార్యలను గవయుచుండిరి.) (వాస్తవముగ కిది అపరాధము కాదు. అట్లని మాత్రము మీరనుకొనుచుండిరి.) అందుచే భగవంతుడు తన అనుగ్రహముచే మీ పాపరాహిత్యము నంగీకరించినాడు. మీ తప్పిదమును క్షమించినాడు. ఇప్పుడు స్వేచ్ఛగా మీభార్యలను కలియుడు. భగవంతుడు మీ కనుగ్రహించినవాటిని ఉపయోగింపుడు.

188. ఉదయంపు తెలిరేఖ రేనలుపునుండి వేరుపడు వరకు (రాత్రులయందు) తినుడు, త్రాగుడు. తర్వాత రాత్రివరకు ఉపవాసమును పూర్తిచేయుడు. కాని మీరు మసీదులలో ఉండవలసివచ్చినపుడు మాత్రము మీ భార్యలను కూడకుడు. భగవంతు డేర్పరచిన హద్దులివి. అందుచే అప్పుడు మాత్రము వారిని చేరబోకుడు. చెడుగు లంటకుండుటకై భగవంతుడు స్వచ్ఛము సందేహరహితము నగు ఆజ్ఞల ప్రసాదించినాడు.

ఒకరి ఆస్తి నొకరు అన్యాయముగ మ్రింగివేయకుడు. అధికారుల తమవైపు త్రిప్పుకొనుటకై ధనము నుపయోగించి (లంచములనిచ్చి) ఇతరుల ఆస్తుల అన్యాయముగ వశపరచుకొనకుడు.

---

* "దుస్తులవంటివారు" అనియు చెప్పవచ్చును. దుస్తులు మన దేహమును గుప్తముగను, సురక్షితముగను ఉంచును. మన సిగ్గును కాపాడును. స్త్రీ పురుషు లొకరి కొకరు దుస్తుల వంటి వారని చెప్పుట ఎంతయో హృదయంగమముగను భావపూర్ణముగను ఉన్నది.

ఇరువదినాల్గవ ఖండము

189. (ఓ ప్రవక్తా!) లోకులు నిన్ను నెలపొడుపుల గూర్చి అడుగుచున్నారు. వారితో ఇట్లనుము: ఇవి మానవులకొఱకు కాలమానముగా నిర్ణయింపబడినవి. యాత్రామాసముల నిర్ణయము దీనినిబట్టి జరుగును. (అంతేకాని చంద్రుని గుఱించిన మూఢాచారములన్నియు గర్హితములు.) తమ ఇండ్లలో వెనుకగుమ్మముద్వారా ప్రవేశించుట పుణ్యకార్యము కాదు. స్వధర్మనిర్వహణమే సత్కృతిగాని (ఇట్టి మూఢాచారముల నాచరించుటకాదు.) అందుచే (ఇట్టి మూఢాచారములకు గురికాక) మీ యిండ్లలో ప్రవేశించినపుడు ముంగలిగుమ్మము ద్వారా ప్రవేశింపుడు. భగవదాజ్ఞోల్లంఘనము చేయకుడు. (అప్పుడే) మీకు విజయము కల్గును.

190. మీతో యుద్ధము చేయుచున్నవారితో మీరుకూడ భగవన్మార్గమున యుద్ధముచేయుడు. కాని మితిమీరకుడు. హద్దుల నతిక్రమించినవారిని భగవంతుడు ప్రేమింపడు. [౪౩]

191. (మీతో యుద్ధముచేయువారు) ఎక్కడ దొరికిన అక్కడ వధింపుడు. మిమ్ములను వారెక్కడనుండి వెడలగొట్టిరో మీరును వారిని అక్కడనుండి వెడలగొట్టుడు. (రక్తపాతము మంచిది కాకపోయినను) దౌర్జన్యము స్థిరపడుట (తాత్కాలికమగు) రక్తపాతముకంటె చెడ్డది. పవిత్ర ప్రార్థనాలయపు హద్దులలో శత్రువులు మీతో యుద్ధముచేయనంతవరకు మీరును యుద్ధము చేయకుడు. వారు యుద్ధముచేసినచో మీరుకూడ యుద్ధము చేయదగును. భగవంతుని నిరాకరించినవారి (దౌర్జన్యమున) కిదియే ప్రతీకారము.

192. ఒకసారి వారు యుద్ధము మానుకొనినచో భగవంతుడు క్షమించువాడు, కృపానిధి.

193. వారి దౌర్జన్యమణగువరకు వారితో యుద్ధముచేయుడు. మతము భగవంతునకు సంబంధించినది. (వారి మత పరివర్తనమునకై యుద్ధము చేయవలదు. ఎందుకనగా) మతే విషయములో భగవంతుడే బాధ్యత వహించును. ఒకసారి వారు యుద్ధము మానుకొనినచో మీరు కూడ యుద్ధము మానుకొనుడు. దౌర్జన్యము చేయువారితో తప్ప ఇతరులతో పోరాడకూడదు.

194. (పవిత్రమాసములందు యుద్ధము గురించి:) పవిత్రమాసముల వారు గౌరవించినచో మీరును గౌరవింపుడు. వారా మాసముల గౌరవించక యుద్ధము చేసినచో మీరును యుద్ధము చేయుడు. ఈ విషయములో వారి చేతకు ప్రతిసేత చేయవలసినదే. అన్యాయముగ కయ్యమునకు కాలుద్రవ్వి మీ కెవ్వరైన హింస యొనర్చుచో దానికి సమానమైన హింస మీరు కూడ చేయుడు. భగవంతునకు భయపడుడు. ధర్మపరులకు భగవంతుడు తోడుండునన్న మాట మరువకుడు.

195. భగవన్మార్గమున మీ ధనము ఖర్చుపెట్టుడు. స్వహస్తములతో నాశమును పొందకుడు. పరోపకారము చేయుడు. పరోపకారశీలురనే భగవంతుడు ప్రేమించును.

196. యాత్రయు దర్శనమును * దేవుని కొఱకు చేయుడు. ఒకసారి మీరు (యాత్రకు పోవుచు) మార్గమధ్యమున ఆపివేయబడుచో మీకు ఏది సులభముగ లభించునో దానిని (ఉపాయనముగ) పంపుడు. ఈ ఉపాయనము గమ్యస్థానము చేరునంతవరకు, శిరోముండనము చేసికొనకుడు. కాని రోగగ్రస్తులైనపక్షమునను, ఏదేని శిరోరోగముచే బాధపడుచుండిన పక్షమునను అట్టివారు (తమ కేశములకు బదులు) ఉపవాసమైన ఉండవలెను, లేదా దానమైన చేయవలెను, లేదా బలి యీయవలెను.

* "ఉమ్రా" అను ఇక్కడి మూలమునకు "దర్శనము" అని అనువదించితిని. హజ్ లేక యాత్రకు ఒక నిర్ణీతకాలమున్నది. ఉమ్రాకు నిర్ణీతకాలము లేదు. ఇందులో కాబా దర్శనము ప్రధానము.

(యుద్ధము మొదలైనవి లేని) శాంతి పరిస్థితులలో ఎవ్వరైన యాత్రయు దర్శనమును కలిపి చేయదలచినచో అట్టివారు తమకు లభించిన జంతువును బలి ఇయ్యవలెను.

బలి జంతువు లభించనిచో యాత్రాదినములలో మూడు దినములు ఉపవసింపవలెను. మరలివచ్చి మరి ఏడుదినము లుపవసింపవలెను. ఇట్లు పది దినములు పూర్తియగును. మక్కాలో ఇండ్లులేనివారికై యీ ఆజ్ఞ (ఇవ్వబడినది.) భగవంతుని యెడ మీ ధర్మముల చక్కగా నిర్వహింపుడు. అధర్మపరులను భగవంతుడు కఠినముగ శిక్షించును.

ఇరువది ఐదవ ఖండము

197. యాత్రచేయు మాసములు సుప్రసిద్ధమైనవి. ఈ మాసములలో యాత్రచేయ బూనవారు యాత్రలో ఉన్నట్లే. యాత్రలో ఉన్నప్పుడు స్త్రీ సంగమము చేయరాదు. అసభ్యమగు మాటలాడరాదు. జగడములాడరాదు. మీరుచేయు సత్కృతులనన్నిటిని భగవంతుడెఱుగును. యాత్రకు వెళ్లునప్పుడు మార్గమున అగు ఖర్చులకై ఏర్పాటుల చేసికొని మీరు బయలుదేరుడు. అన్నిటికంటె గొప్పవిషయము పుణ్యశీలము. ఓ వివేకవంతులారా! భగవంతునకు భయపడుడు. (దానివలననే పుణ్యశీలము కల్గును.)

198. మీరు (యాత్రాకాలములో) భగవంతుని అనుగ్రహమును బడయగోరిన అది పాపముకాదు. (అనగా భగవంతుడనుగ్రహించు వాణిజ్యలాభము పొందిన పాపముకాదు.)

మీరు 'అర్‌ఫాత్' మైదానమునుండి తిరిగి వెళ్ళుచు 'ముజ్దలఫా'* దగ్గర భగవన్నామస్మరణ మొనర్పుడు. మీ కుపదేశింపబడిన రీతిని

* జిల్‌హజ్ నెల 9 వ తేదీ సాయంకాలము అరఫాత్ మైదానమునుండి మరలివెళ్ళుచు రాత్రికి యాత్రికులు ఆగు ఒకస్థలము. అరఫాత్ మైదానము మక్కాకు 12 మైళ్ళ దూరమున నున్నది. యాత్రికులందరు నిక్కడ సమావేశ మగుదురు.

మననమొనర్పుడు. ఇంతకుముందు నిశ్చయముగ మీరు కుమార్గము ననుసరించినవారై యుండిరి. (వివిధ మూఢాచారములను అనుసరించు చుండిరి.)

199. జనులు ఎక్కడినుండి మరలుచున్నారో మీరును అక్కడి నుండి మరలుడు. మీ పాపముల క్షమించుటకై భగవంతుని ప్రార్థింపుడు. నిశ్చయముగ భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

200. మీరు యాత్రావిధుల నన్నిటిని తీర్చుకొని పూర్వము మీరు మీ తాతతండ్రుల ఘనతను కొనియాడుచుండినట్లే ఇప్పుడు భగవంతుని స్మరింపుడు. అంతకంటె అధికముగ స్మరింపుడు.

(ఇహలోకసౌఖ్యములనే ఆరాధించువారు కొందరున్నారు.) "ప్రభూ! మాకు ప్రాపంచిక సౌఖ్యములనే ప్రసాదింపుము" అనువారును కలరు. పరలోక సౌఖ్యములు మరి వారికి లభింపవు.

201. (ఇహ పరముల ఆశించువారు మరి కొందరున్నారు.) వారిట్లందురు: "ప్రభూ! మాకు ఇహమునను పరమునను కూడ సౌఖ్యమును ప్రసాదింపుము. మమ్ములను నరకయాతనలనుండి రక్షింపుము."

202. వారిచేతల ననుసరించి వారికి ఫలము లభించును. సత్కృతులకు ప్రతిఫలమిచ్చుటలో భగవంతుడు జాగుచేయడు.

203. యాత్రయొక్క నిర్ణీత దినములలో* భగవత్స్మరణములో మగ్నులై ఉండుడు.

మరలుటలో తొందరపడి ఎవరైన రెండు దినములలోనే మరలినచో అది పాపముకాదు. ఉండిపోయినను ప్రమాదముకాదు. కాని ఇది కేవలము పుణ్యశీలుర కొరకే. భగవంతునియెడ మీకు గల విధులను జాగ్రత్తగ నెరవేర్పుడు. (ఏదో ఒకనాడు మరణింపవలెననియు) అతని సమక్షముననే తిరిగి కూడవలెననియు మరువకుడు.

* జిల్ హజ్ నెల ౧౦ వ తేదీ మొదలు ౧౩ వ తేదీ వరకు.

204. లౌకిక జీవనము విషయములో కొందరి మాటలు మీకాశ్చర్యము కల్గించును. వారు తమ అంతరాత్మయొక్క పారిశుద్ధ్యమునకు భగవంతునే సాక్షిగా పల్కుదురు. (వాస్తవముగ వారి హృదయములలో ద్వేషము అవిశ్వాసము నిండియున్నవి.) వారు అత్యంత కఠిన శత్రువులు.

205. వారికి ప్రభుత్వము లభించినప్పుడు తమ అధికారము నంతటిని దేశములో చెడుగును వ్యాపింపజేయుట యందును, వ్యవసాయమునకును ఇతరకృషికిని ఫలితమైన (ధనధాన్యముల) ధ్వంస మొనర్చుట యందును, మానవ సంతతిని నశింపజేయుట యందును వినియోగింతురు. వినాశ విధ్వంసములకు భగవంతుడెన్నడును ఇష్టపడడు.

206. "భగవంతునకు భయపడుడు" అని వారితో చెప్పినప్పుడు వారు గర్వము వలన పాపమార్గమునకే ఈడ్వబడుదురు. అట్టివారికి నరకమే ప్రీతిగొల్పును. నిశ్చయముగ అది ఎంతయు దుష్టమగు ఆశ్రయము.

207. భగవంతుని ప్రీతికై తమప్రాణములను సైతము ధారపోయువారు కొందరున్నారు. ఇట్టి భక్తులను భగవంతుడు ప్రేమించును.

208. ఓ విశ్వాసవంతులారా! (ముస్లిమ్ పదవి నొందుటకు కేవలము నోటితో నేను ముస్లిమునైతినని చెప్పుట చాలదు.) సంపూర్తిగ (భగవంతునకు తమ సర్వస్వము) సమర్పింపుడు. సైతాను (అధర్మము) అడుగుజాడల వెంబడింపకుడు. సైతాను మీకు బహిరంగ శత్రువు.

209. స్పష్టమగు నిదర్శనములు లభించిన తర్వాత కూడ మీరు సంశయాత్ములై దిగజారినచో భగవంతుడు సర్వశక్తిమంతుడనియు సర్వజ్ఞుడనియు ఎఱుగుడు.

210. (వీరు విశ్వసించుటకై ఇప్పుడు స్పష్టపరుప బడిన నిదర్శనములు సరిపోకపోయినచో) వీరు దేనికై నిరీక్షించు చున్నారు? మేఘముల నీడలలో నిలువబడియుండగా దేవదూతలు వరుసలుతీరియుండ భగవంతుడు ప్రత్యక్షము కావలయునందురా? కావలసినదంతయు నిర్ధారణ మైపోయినది. సమస్తమును భగవంతుని చేతులలో నున్నది.

ఇరువది ఆరవ ఖండము

211. (వీరు వెనుకటి చరిత్రను ఉదాహరణముగా ఏల గ్రహింపరు?) ఇస్రాయీలీయుల నడుగుడు, వారి కెన్ని స్పష్టమగు చిహ్నములను ప్రసాదించితిమో? (ఇహపర సౌఖ్యములకై యున్న సమస్తద్వారములనువారికై తెరచితిమి. ఐనను వారు సన్మార్గము ననుసరింపరైరి. వారు భగవదనుగ్రహమును గ్రహింపరైరి.) భగవంతుని వరముల బడసి వానిని మార్చివైచినచో భగవంతుడు కఠినముగ శిక్షించువాడు.

212. సత్యమును నిరాకరించువారి దృష్టిలో కేవలము ప్రాపంచిక జీవితమే ప్రధానమైనది. వారు విశ్వాసవంతుల (ప్రస్తుతకష్టములను) చూచి పరిహసించుచుందురు. వాస్తవముగ (ప్రాపంచిక వస్తువులు నిజమైన ఘనతకు కారణములు కావు.)పుణ్యపురుషులు అవసాన దినమునాడు వీరికన్న ఉన్నత స్థితిలోనుందురు. (నేడెవరు దారిద్ర్యము ననుభవించు చున్నారో వారే భగవదనుగ్రహము వలన రేపు ధనధాన్యములతో తులతూగ గలరన్న విషయము వారికి తెలియదు.) భగవంతుడు తన కిష్టులైన వారికి అపరిమితమగు ధనధాన్యములను ప్రసాదించును.

213. సమస్త మానవజాతియు నొకేజాతి, ౯౬ (కాని తర్వాత పెక్కు కారణములచే వారిలో పలుశాఖలు ఏర్పడెను.) భగవంతుడు వారికై ఒకరి తర్వాత నొకరిని ప్రవక్తల పంపెను. వారు (ఏకేశ్వరుని యందు విశ్వసించుటయందును, సత్కార్యాచరణ మొనర్చుటయందును గల పుణ్యముయొక్క) శుభవార్తను తెల్పుచు (దుష్కర్మాచరణమువలన

గలుగు దుర్గతిని జెప్పి) భయపెట్టుచు వచ్చిరి. సత్యమును బోధించు భగవద్గ్రంథముకూడ వారి కియ్యబడెను. అది వారిలో (వివిధ శాఖలలో గల విభేదములను పరిష్కరించునదియై యుండెను. (సమస్త మానవలోకమును భగవన్మార్గమున ఐకమత్యము కలిగించుట దాని ఉద్దేశమైయుండెను.) ఈ విధముగ వీరు విభేదములు కల్పించుకొనినది సత్యము **తెలియక**యు, సరియగు బోధన లేకపోయియుకాదు. భగవంతుడు వెలువరచిన **సత్యము** వారి ముందుండెను. (దానిలో పరస్పర విద్వేషమునకును **విభేదము**నకును స్థానమే లేకుండెను.) ఐనను వారు పరస్పర విద్వేషము **వలనను**, అసూయాభావము వలనను విభేదములను కల్పించుకొనుచుండిరి. (మతముయొక్క ఏకైకమార్గమును ఐకమత్యముతో అనుసరించుటకు బదులు వివిధ మతములందును, వివిధ సంఘములందును విడిపోవుచు వచ్చిరి.) తుట్టతుదకు మానవులు విభేదముల గల్పించుకొనిన విషయముల విప్పిచెప్పి విశ్వాసవంతులకు (భగవంతుడు) సత్యముయొక్క నిజస్థితిని తెల్పెను. భగవంతుడు తన కిష్టులైన వారికి ధర్మముయొక్క ఋజుమార్గమును చూపును.

214. ఏమీ మీరు (మేము విశ్వాసవంతులమని కేవలము నోటితోచెప్పి) స్వర్గమును ప్రవేశింతుమని తలచుచున్నారా? (పుణ్యపురుషులగుటకు సద్వర్తన మవసరమే లేదని తలచుచున్నారా ఏమి?) మీకు (పుణ్యపురుష లియ్యవలసిన) పరీక్ష మీ పూర్వులకువలె ఇంకను రానే లేదు. వారి కన్నివిధములగు కష్టములు సహింపవలసివచ్చెను. పడరాని ఇడుములు, దుస్సహకష్టములు వారిని మొదలంట కంపమెత్తించెను. దానికి తాళలేక ప్రవక్తయు అతని అనుయాయులు "(ప్రభూ!) నీ దివ్యసాహాయ్య మెప్పుడు లభించును?", అని మొఱపెట్టుకొనిరి. (అప్పుడు హఠాత్తుగ భగవత్సాహాయ్యము 'భీతిల్లకుడు' ఇదిగో ఈశ్వర సహాయము సమీపముననే ఉన్నది' (అనుచు వచ్చెను.)

215. (ఓ ప్రవక్తా!) ఎట్లు వ్యయపరుపవలెనని వారు నిన్నడుగుదురు. వారితో ఇట్లనుము: మీ ధనమునుండి మీ రెంత వ్యయము చేయగలరో అంత వ్యయపెట్టుడు. మీ తల్లిదండ్రులు, బంధువులు, అనాథబాలికలు, పేదవారు, (కష్టములలో చిక్కుకొన్న) బాటసారులు మీ ధనమునకు పాత్రులు. మీరుచేయు సత్కృతులు భగవంతు డెఱుగును.

216. (ధర్మ సంరక్షణార్థము) యుద్ధము చేయుటకై మీ రాజ్ఞాపింపబడిరి. అది మీకు అయిష్టముగ నున్నది. (ఒక్కొక్కప్పుడు) మీకు శ్రేయస్కరమైన విషయము మీ కయిష్టముగ నుండవచ్చును. అట్లే మీకు హానికరమగు ఒక విషయము మీకు ప్రేమాస్పదము (కూడ) కావచ్చును. (మీ కేది మంచిదో, ఏది చెడ్డదో) భగవంతునకు తెలియును. (మీరు స్వల్పబుద్ధులు) మీకు తెలియదు.

ఇరువదిఏడవ ఖండము

217. (ఓ ప్రవక్తా!) పవిత్రమాసములో యుద్ధము చేయుటను గురించి నిన్ను జను లడుగుదురు. వారితో ఇట్లనుము: ఆ మాసములో యుద్ధముచేయుట చాల తప్పు. కాని భగవన్మార్గమున మానవుని నిరోధించుట, కాబాలోనికి వెళ్ళకుండ అడ్డుపడుట, మక్కావాసులను వారి నివాసములనుండి వెడలగొట్టుట—ఇవి భగవంతుని దృష్టిలో అంతకంటె చెడ్డవి. విద్వేషములు రగుల్కొల్పుటయు, హింసించుటయు సంహారముకంటె దుష్టమైన పనులు.

మీరు మీ మతము విడిచిపెట్టువరకు అట్లు చేయుట వారికి సాధ్యమైనచో వారు యుద్ధము చేయుచునే యుందురు. (కాని ఎవరు భయముచే) సత్యమగు తమ మతమును విడనాడి, అవిశ్వాసముతో మరణింతురో వారు చేసిన సమస్త (పుణ్య) కర్మలు ఇహమున పరమున కూడ వ్యర్థమగును. వారు నరకజ్వాలల పాలగుదురు. నిరంతరము వారందే వసింతురు.

218. కాని ఎవరు విశ్వసింతురో (తమ శ్రద్ధా విశ్వాసములందు దృఢనిశ్చయులై యుందురో,) ఎవరు తమ గృహములను విడువవలసి వచ్చి అట్టి పలాయనముయొక్క కష్టములను సహింతురో, ఎవరు భగవన్మార్గమున యుద్ధమొనర్తురో, అట్టివారు నిస్సందేహముగ భగవదనుగ్రహమునే ఆశింతురు. భగవంతుడు సర్వము క్షమించువాడు; కరుణానిధి.

219. (ఓ ప్రవక్తా!) జనులు నీతో మద్యపానము గురించియు జూదము గూర్చియు అడుగుదురు. వారితో ఇట్లనుము: ఈ రెండును మిక్కిలి పాపకార్యములు. ఇందుగల కొలదిలాభముకంటె వానివలన కలుగు నష్టమే ఎక్కువ.

(ఓ ప్రవక్తా:) ధర్మార్థమై యెంత ఖర్చుపెట్టవలెనని జనులు నిన్నడుగుదురు. నారితో ఇట్లు చెప్పుము: (అన్నవస్త్రాదులకు మీ అవసరములు తీరగా) మిగిలినది ఖర్చుపెట్టుడు.

ఇహపరములను గురించిన విషయములపై మీ రాలోచించుకొ గల్గుటకై భగవంతుడిట్లు తన ఆజ్ఞలను స్పష్టపరచును.

220. అనాథులను గురించి వారు నిన్నడుగుదురు. వారితో ఇట్లు చెప్పుము: "వారికై (అనాథ బాలబాలికలకై) ఏది మంచిదో అదే చేయవలెను. మీ రొకసారి వారితో కలసిమెలసి యుండగోరినచో (వారిని తమ వంశములోనికి తీసికోదలచినచో) వారు మీకు సోదరుల వంటివారు. (వారు పరాయివారు కారు.) ఎవరు నష్టమును కలిగించునట్టివారో, ఎవరు మంచిని చేయగోరునట్టివారో వారిని భగవంతు డెఱుగును. భగవంతు డిచ్ఛించినచో మీరు కష్టములలో చిక్కుకొని యుందురు. నిశ్చయముగ భగవంతుడు సర్వశక్తిమంతుడు; సర్వజ్ఞుడు.

221. (ఏకేశ్వరుని) యందువిశ్వసించువరకు విగ్రహారాధకురాండ్రను పెండ్లియాడకుడు. నిశ్చయముగ విగ్రహారాధకురాలు నీకు ప్రియమైనదైనను ఆమెకంటె విశ్వాసవతియే ఉత్తమురాలు.

అశ్లే విశ్వాసవతులను విగ్రహారాధకులకిచ్చి వారు విశ్వసించు వరకు వివాహ మొనర్పకుడు. (ఓ యువతీ!) విగ్రహారాధకుడు నీకెంత ఇష్టుడైనను విశ్వాసవంతుడగు బానిస విశ్వాసహీనునికంటె ఉత్తముడని తెలిసికొమ్ము.

(విశ్వాసహీనులు) మిమ్ములను నరకాగ్నివైపున కాహ్వానింతురు. భగవంతుడు మిమ్ములను స్వర్గమునకు ఆహ్వానించుచున్నాడు. తన యిష్టముచే క్షమించుచున్నాడు. మానవుల బోధకై తన సందేశమును విస్పష్టమొనర్చు చున్నాడు.[౪౬]

ఇరువదిఎనిమిదవ ఖండము

222. స్త్రీల రజోదర్శన కాలములను గురించి వారు నిన్నడుగుదురు. వారితో ఇట్లు చెప్పుము: "రజోదర్శనకాలము మంచిదికాదు. అందుచే ఆ కాలమున వారు పరిశుద్ధలగు వరకు వారిని గవయకుడు. వారు పరిశుద్ధలైన తర్వాత భగవదాదేశానుసారము వారిని గవయుడు. భగవంతుడు తన కున్ముఖులైన వారిని, (సన్మార్గప్రవర్తకులను) పరిశుద్ధలను మాత్రమే ప్రేమించును."

223. మీ భార్యలు మీకై క్షేత్రములవంటివారు. అందుచే మీ క్షేత్రములయందు తగు రీతిని వ్యవసాయ మొనర్పుడు. మీ భావికై మంచికృషి సల్పుడు. (సంతానము బడయుటకై ప్రయత్నింపుడు.) భగవంతునకు భయపడుడు. ఒకానొకనాడు చావవలసి యున్నదనియు భగవంతుని సమక్షమునకు మరలవలసి యున్నదనియు మరువకుడు. (ఓ ప్రవక్తా!) విశ్వాసవంతులకు (రాబోవు సౌఖ్య[illegible]ల) శుభవార్తను తెల్పుము.

224. ఎవరికైనను ఉపకారము చేయుటయందుగాని, సన్మార్గము ననుసరించుటయందు గాని, మనుష్యులలో పరస్పరము మైత్రిని కుదుర్చుట

యందుగాని, భగవన్నామముతో మీరు కావించుకొనిన ప్రతిజ్ఞలు ఇట్టి సత్కార్యములకు ఆటంకములగునట్లు చేయకుడు. భగవంతుడు సర్వమును వినువాడు; సర్వమును తెలిసినవాడు.

225. మీ ప్రతిజ్ఞలలో వ్యర్థమగు వానిని భగవంతుడు గణింపడు. మీ హృదయములలో ఉన్న విషయములను భగవంతుడు గణించును. దానిని గురించి మిమ్ముల నడుగును. భగవంతుడు మహాక్షమి; దయానిధి.

226. తమ భార్యలకడకు వెళ్ళమని ప్రతిజ్ఞ చేసినవారు (తొందరపడి వారితో సంబంధములను తెగ్రించికొనరాదు.) నాల్గు నెలలపాటు ఆగవలెను. ఈ వ్యవధిలో వారు తమ భార్యలను చేరబోయినచో భగవంతుడు వారి పాపమును క్షమించును. అతడు కరుణానిధి.

227. (అట్లుగాక) వారు విడాకుల నిచ్చుటకు నిశ్చయించుకొనినచో (ఇది జ్ఞాపకముంచుకొనుడు) భగవంతుడు సర్వమును వినువాడు; సర్వము తెలిసినవాడు.

228. విడాకులివ్వబడిన స్త్రీలు మూడు మాసములు మూడుసార్లు రజోదర్శనమగువరకు (ద్వితీయ వివాహము చేసికొనకుండ) ఆగవలెను. వారు (స్త్రీలు) నిజముగ భగవంతునియందు అవసానదినమునందు విశ్వాసము కలవారైనచో వారి గర్భములందు భగవంతుడు సృష్టించిన (పిండముల) దించుకొనకుండ నుందురు.

(విడాకులిచ్చిన) భర్తలు ఈ వ్యవధిలో (తమ భార్యలతో) మైత్రి చేసికొనగోరుచో వారిని తిరిగి స్వీకరించుటకు (ఇతరులకంటె) వారికే ఎక్కువ అధికారమున్నది.

చూడుడు. పురుషులకు స్త్రీలపై ఎట్టిహక్కులు కలవో స్త్రీలకును పురుషులపై అట్టి హక్కులే కలవు. అందుచే వారితో మృదురీతిని వ్యవహరింపుడు. నిశ్చయముగ స్త్రీలపై పురుషులకు ఒక ప్రత్యేకమగు

ఆధిక్యత ఇవ్వబడినది. (కానీ) జ్ఞాపకముంచుకొనుడు; భగవంతుడు సర్వ శక్తిమంతుడు; సర్వజ్ఞుడు.

ఇరువదితొమ్మిదవ ఖండము

229. రెండుసార్లు మాత్రము విడాకులు చెప్పవచ్చును. తర్వాత (భర్తకు రెండే మార్గములుకలవు.) వారిని స్నేహభావముతో తమకడ నుంచుకొనుటయు, లేకపోయినచో వారిని దయతో పోనిచ్చుటయు. వారికి నీవింతకు ముందిచ్చిన ఏవస్తువైనను తిరిగి తీసికొనుట నీకు ధర్మము కాదు. ఒకసారి భార్యాభర్తలిద్దరును భగవంతుడేర్పరచిన హద్దులలో ఉండజాలమను అనుమాన మున్నచో భార్య తాను భార్యాత్వ బంధముల నుండి విడిపించుకొనుటకై (తన హృదయపూర్వకముగ) తనకున్న దాని నుండి ఏదైన నిచ్చివేయుచో నది దోషముకాదు. ఇవి భగవంతుడేర్పరచిన హద్దులు. వానిని అతిక్రమించకుడు. ఈ హద్దుల నతిక్రమించిన వారే అధర్మపరులు.

230. ఒకసారి పూర్తిగ విడాకులిచ్చినపిదప ఆమె మరొక భర్తను పెండ్లాడి (అతనివలన కూడ విడాకులు పొంది) న గాని నీకు వివాహయోగ్యురాలు కాదు. రెండవ భర్తకూడ ఆమెకు విడాకులిచ్చిన యెడల ఈసారి భగవంతు డేర్పరచిన హద్దులలో నుండగలమను విశ్వాసమున్నచో ఆమె తిరిగి తన మొదటిభర్తను పెండ్లాడుట దోషముకాదు. ఇవి భగవంతు డేర్పరచిన హద్దులు. వివేకవంతుల కొఱకు ఇది స్పష్టపరుప బడినది.

231. మీరు తమ స్త్రీలకు విడాకులిచ్చినప్పుడు వారి నిర్ణీత కాలము పూర్తియైన వెంటనే విడాకుల నియ్యక యథాపూర్వముగ భార్యలుగా నుంచుకొనుడు. లేదా పూర్తిగ విడాకులనిచ్చి ఔదార్యముతో వారిని స్వేచ్ఛగ పోనియ్యుడు. వారిని బాధించు నుద్దేశముతో నుంచుకొనకుడు. అట్లుంచుకొనినచో దానివలన మీరు హద్దుల నతిక్రమించినవారగుదురు. ఇట్లెవరు చేయుదురో వారు తమకు తామే ద్రోహము చేసికొనిన వారగుదురు. నేడు పెండ్లాడి రేపు విడాకులిచ్చి విషయలోలత్వమున మగ్నులై యుండి భగవంతుని సందేశములను పరిహసింపకుడు. మీకు సన్మార్గమున నడిపించుటకై (పంపబడిన) భగవద్గ్రంథము, జ్ఞానము మరువకుడు. భగవంతునిచే విహితమైన ధర్మముల నాచరించుటలో శ్రద్ధ వహింపుడు. భగవంతుడు సర్వమును తెలిసిన వాడని ఎఱుగుడు.

ముప్పదియవ ఖండము

232. మీరు మీ భార్యలను విడాకులిచ్చిన తర్వాత వారు నిరీక్షించవలసిన నిర్ణీతకాలాంతమున తమకునచ్చిన ఇతర పురుషులతో ద్వితీయ వివాహ మొనర్చుకొనుటకు (వారికి హక్కుగలదు.) వారు తమ క్రొత్త భర్తలతో పరస్పరాంగీకారముతో ఉచితమగు రీతిని వివాహమాడినచో అది దోషమని ఎంచకుడు. భగవంతునియందును, అవసాన దినమునందును విశ్వాసముకలవా రందరకును ఈ ఆజ్ఞ మూలముగా ఉపదేశ మొసగబడుచున్నది. ఇది మీకు ఉత్తమ మైనదియు పవిత్రమైనదియు నగుపద్ధతి. భగవంతుడు సమస్తమును ఎఱుగును కాని మీ రెఱుగరు.

233. (తనభార్యకు విడాకులిచ్చిన పక్షమున ఆమెకుశిశువుండినచో) తల్లి చనుబాలే ఆ శిశువునకు త్రాగింపదలచినచో తల్లి పూర్తిగ రెండేండ్లపాటు పాలు త్రాగించవలెను. శిశువు తండ్రి ఆమెకు అన్న వస్త్రములను ఉచితమగురీతి నిచ్చి పోషింపవలెను. ఎవరికిని అతని శక్తికి మించిన భారమును వహించు విధిలేదు. శిశువు కోసరమై తల్లియు నష్టపడ కూడదు; తండ్రియు నష్టపడకూడదు. (తండ్రి చనిపోయిన పక్షమున ఆ భారమును వహించుట) అతని వారసునివిధి.

అట్లుకాక పరస్పరాంగీకారముచే తల్లిదండ్రులు శిశువును (నిర్ణీత కాలమునకు) ముందే పాలువిడిపించినచో అదిదోషముకాదు.

తల్లికి బదులు **మీ** శిశువులకొఱకై మీరు దాదులను ఏర్పాటు చేయగోరినచో **మీరా**దాదులను దేశాచారప్రకారము ఎంత ఇచ్చుటకు వాగ్దానమిచ్చిరో **అంత** ఇచ్చినంతకాలము దోషముకాదు.

దేవునిచే విహితమైన ధర్మములను నిర్వహించుటలో శ్రద్ధాళులు కండు. మీరుచేయు సమస్తమును **భ**గవంతుడు చూచుచునే యుండునని ఎఱుగుడు.

234. మీరు మరణించిన తర్వాత విధవలగు **మీ** భార్యలు నాల్గు నెలల పది దినములు (ద్వితీయ వివాహ మొనర్చుకొనకుండ) వేచి యుండ వలెను. ఈ గడువు పూర్తియైన పిదప ధర్మానుసారము వారేమి చేసినను దోషమురాదు. మీరుచేయు సమస్తమును భగవంతుడెఱుగును.

235. (మీరు వివాహము చేసికోదలచిన విధవా స్త్రీలకు) వివాహము చేసుకొమ్మని తన అభిప్రాయమును సంకేతముగ వెలిబుచ్చుట పాపముకాదు. వివాహము చేసుకోవలెనను మీ అభిప్రాయమును గోప్యముగను ఉంచవచ్చును. మీ భావములు వారినైపున కొరగునని భగవంతు డెఱుగును. కాని దొంగతనముగ వివాహము చేసికొందు నను వాగ్దానము చేయరాదు. ధర్మవిహితమైన పద్ధతిని వారితో మాట్లాడుము.

(విధవా స్త్రీలు) తమ నిర్ణీత నిరీక్షణకాలము పూర్తియగు వరకు వివాహ బంధమును ప్రవేశింపకూడదు.

మీ హృదయములో (గుప్తమైయున్న భావములను) భగవంతు డెఱుగునని తెలిసికొనుడు. అందుచే భగవంతునకు భయపడుడు. భగవంతుడు క్షమించువాడనియు పాపములను మన్నించు వాడనియు తెలిసికొనుడు.

ముప్పది యొకటవ ఖండము

236. మీరు స్త్రీని ముట్టకపూర్వమును (మహర్) ధనమును నిర్ణయించక పూర్వమును విడాకు లివ్వగోరుచో (మహర్) ధనము నామె కివ్వనక్కరలేకయే విడాకులియ్యుడు. దీనిలో పాపములేదు.

కాని ఇట్టిపరిస్థితులలో (ఒక స్త్రీని మీరు పెండ్లాడుటకు సిద్ధమై తర్వాత నిరాకరించుటచే ఆమెకు కలిగిన నష్టమునకు పరిహారముగా) ఆమెకు లాభము కలుగునట్లు చేయవలెను. అట్టిలాభ మామెకు ధర్మ విహితమగు పద్ధతిని లభింపజేయవలెను. పేదవాడు తనస్థితి ననుసరించి ఇవ్వవలెను. సుకృత మొనర్చువారికిది విధివిహితము.

237. కాని మీరు స్త్రీని ముట్టకపూర్వమును, ఆమె (మహర్ ధనమును నిర్ణయించిన తర్వాతను విడాకు లివ్వగోరినచో ఆ నిర్ణీత ధనమునందలి సగము ధనము నామె కీయుడు. ఆ స్త్రీ తానా ధనమును స్వేచ్ఛతో విడిచిపెట్టిన లేక ఆమెపై అధికారము గల పురుషుడు విడిచిపెట్టినను (మీ రా ధనమును సైత మామె కీయనక్కరలేదు.) మీరు అట్లు క్షమించుట పుణ్యకార్యము. పరస్పర సాహాయ్యమును చేసికొనుటను మరువకుడు. జ్ఞాపక ముంచుకొనుడు. మీరు చేయుచున్న దంతయు భగవంతుడు చూచుచునే యున్నాడు.

238. ప్రార్థనలయెడ శ్రద్ధవహింపుడు. ప్రత్యేకముగ (ప్రత్యక్షమునను పరోక్షమునను) అత్యుత్తమమగు ప్రార్థన యెడల శ్రద్ధవహింపుడు. నిజమైన నమ్రతతో భగవంతుని సమక్షమున నిలువబడుడు.

239. మీకు శత్రుభయమున్నచో (అట్టి యెడ మీరు విధివిహితమగు రీతిని ప్రార్థన సలుపజాలకుండినచో) మీరు పాదచారులై యున్నను, అశ్వారూఢులైనను ఎట్టి స్థితియందున్నను, ఎట్లు వీలుపడిన నట్లు ప్రార్థన సలుపుకొనుడు.

మీరు సురక్షితులై యున్నప్పుడు భగవంతు డుపదేశించినట్లు ప్రార్థనలను సల్పుడు. (ఆ పద్ధతి) మీకు ఇంతకు ముందు తెలియకుండెను.

240. చచ్చుటకు ముందు మీ భార్యలు ఒక్క సంవత్సరము పూర్తిగా మీ ఇల్లు విడిచిపెట్టకుండునట్లు వారికై ఒక్క సంవత్సరమునకు వలయు అన్నవస్త్రములను విడిచిపెట్టి వెళ్ళుడు. ఒకసారి (స్త్రీలు) తమంత తాము (ఇల్లువిడిచి) వెళ్ళిపోయి ధర్మవిహితముగ (ద్వితీయ వివాహ మొనర్చుకొనినచో) అది పాపముకాదు. భగవంతుడు సర్వశక్తిమంతుడు; సర్వజ్ఞుడు.

241. విడాకు లివ్వబడిన స్త్రీల పోషణమునకై ఆచారానుసారము ఇవ్వవలెను. ధర్మాచరణపరులకిది విధి.

242. మీకు బాగుగా తెలియుటకై భగవంతుడు తన ఆజ్ఞల నిట్లు స్పష్టపరచును.

ముప్పది రెండవ ఖండము

243. (ఓ ప్రవక్తా !) వేలకొలది సంఖ్యగలవారై యున్నను మృత్యుభయముచేత తమ ఇండ్లను విడిచిపెట్టి పారిపోయిన వారిని గురించి నీవు ఆలోచింపలేదా? (భీరులై అట్లు వారు పారిపోయినప్పుడు) భగవంతుడి ట్లాజ్ఞాపించెను : (మీరు మృత్యుభయముచే పారిపోయిరి గాన) మృత్యువువాత పడుదురుగాక. (వారి భీరుత్వముచే శత్రువులు వారి నోడించగల్గిరి.) తర్వాత భగవంతుడు వారిని సజీవుల నొనర్చెను. (వారిలో ధైర్యసాహసములను పూరించెను. వారు శత్రువుల నెదుర్కొని విజయమును బడసిరి.) నిశ్చయముగ భగవంతుడు మానవులయెడ అపారమగు కృపను చూపువాడు. పెడత్రోవల పోయినవని తిరిగి ఋజుమార్గమునను మరల్చువాడు.) కాని పల్వురు కృతజ్ఞతను చూపరు.

244. భగవన్మార్గమున యుద్ధము చేయుడు. భగవంతుడు సర్వము వినువాడనియు సర్వము తెలిసినవాడనియు నెఱుగుడు.

245. సంతోష పూర్వకముగ భగవంతునకు అప్పిచ్చువారెవరు? వారికి భగవంతుడు అప్పును రెండింతలు నూరింతలు చేసి తీర్చును. దారిద్ర్యము, సంపద — రెండును భగవంతుని చేతిలో నున్నవి. భగవంతుని సమక్షమునకే మీ రందరును మరలవలసి యున్నది.

246. (ఓ ప్రవక్తా!) మూసా తర్వాత ఇస్రాయీలీయుల నాయకు ఆ వృత్తాంతమును గుఱించి నీవు యోచించలేదా ? ఇస్రాయీలీయనాయకులు తాము భగవన్మార్గమున యుద్ధము చేయుదుమనియు, అందుకై తమకొఱకు ఒక పాలకుని నియమించ వలసినదనియు తమ ప్రవక్తను కోరిరి. అప్పుడు ప్రవక్త వారితో ఇట్లనెను: "తీరా యుద్ధము చేయుడని మీ కాజ్ఞాపించినప్పుడు మీరు యుద్ధము చేయ నిరాకరించవచ్చును." ఇస్రాయీలీయ నాయకులు దాని కిట్లనిరి : "మే మక్లేల చేయుదుము? మేము మా యిండ్లనుండి వెడలగొట్టబడితిమి. మా సంతతినుండి వేరుచేయబడితిమి. అట్టియెడ మే మేల భగవన్మార్గమున యుద్ధము సల్పుటకు వెనుదీయుదుము?"

తర్వాత వారికి యుద్ధముచేయుట కాజ్ఞ ఇవ్వబడెను. అప్పుడు వారిలో కొద్దిమందితప్ప తక్కినవా రందరును వెనుజూపిరి. భగవంతుడధర్మపరుల నెఱుగును.

247. వారితో ప్రవక్త ఇట్లు చెప్పెను: "మీపై భగవంతుడు తాలూతును పాలకునిగా నియమించినాడు. (అందుచే అతడు చెప్పినట్లు వినుడు. అతని నాయకత్వముక్రింద యుద్ధమునకు సిద్ధపడుడు. అప్పుడు తాలూతు ఆధిపత్యమును అంగీకరించక) వారిట్లనిరి: "అతడెట్లు మాకు పాలకుడు కాగలడు? అతనికంటె ఎక్కువ సమర్థులును యోగ్యులును

ఐనవారు మాలో ఎందరో కలరు. అంతేకాక అతడు ధనవంతుడు కూడ కాడు."

దానికి ప్రవక్త ఇట్లనెను: భగవంతుడు తాలూతు మీకంటె ఉత్తముడని అతనిని పరిపాలకునిగా నియమించినాడు. భగవంతుడు అతనికి మీకంటె ఎక్కువగ విద్యా బలముల ప్రసాదించినాడు. (ప్రభుత్వమునకై కావలసిన ఈ రెండుగుణములే గాని ధనము వంశము కావు.) భగవంతు డెవ్వరి కీయగోరునో వారికే భూపరిపాలన మిచ్చును. అంతేకాని మీరు అధికార మిచ్చినంత మాత్రమున ఎవ్వడును ప్రభువు కాజాలడు.) భగవంతుడు మహాప్రదాత; సర్వజ్ఞుడు."

248. వారి ప్రవక్త వారితో నిట్లనెను: అతని రాజ్యచిహ్న మేమనగా భగవంతుడు మీ హృదయములను శాంతిప్రపూర్ణ మొనర్చును. దేవదూతలు (మీకై శాంతిని) మోసికొనివత్తురు. ప్రశస్తమైన (ఈ శాంతిని) మూసా ప్రవక్త అనుయాయులును, (హారూను) అనుయాయులును విడిచిపోయిరి. మీరు విశ్వాసవంతులే యైనచో ఇందులో మీ కొఱకు నిశ్చయముగ ఒక చిహ్నము కలదు.

ముప్పదిమూడవ ఖండము

249. కొన్నాళ్ళ తర్వాత తాలూతు ససైన్యుడై యుద్ధమునకు వెడలుచు (తన అనుచరులతో) ఇట్లనెను: "(దారిలో ఒక నదివచ్చును.) భగవంతుడు మిమ్ముల నా నది నీటితో పరీక్షింపనున్నాడు. అందుచే జ్ఞాపకముంచుకొనుడు. ఈ నది నీరు త్రాగినవారితో నాకెట్టి సంబంధము ఉండదు. ఈనీటి రుచియైనను చూడనివాడే నా మిత్రుడగును. ఒకసారి ఎవ్వరైనను (ఆపద్ధర్మముగ) ఒక దోసిలినీరు త్రావినచో అభ్యంతరము లేదు."

కాని (సైన్యము నదియొద్దనకు చేరిన వెంటనే) కొలదిమంది తప్ప తక్కినవారందరు నీరు త్రాగిరి.

తాలూత్ తనకు వశవర్తులైన సైనికులతో నదినిదాటి వెళ్ళుచుండగా (తాలూతును ధిక్కరించిన) వారు ఇట్లనిరి: "మేము తాలూతును అతని సైన్యములను ఎదుర్కొను నంతటి శక్తిగలవారము కాము." కాని తా మొకనాడు తప్పక భగవంతుని సమక్షమునకు మరలుదుమను విశ్వాసముగలవారు ఇట్లనిరి: "(మీరు శత్రువులయొక్క ఎక్కువసంఖ్య, మీ కొలది బలముచూచి అధైర్య మేల పడుచున్నారు?) భగవత్సాహాయ్యముచే ఎన్నిసారులు ఒక చిన్నసైన్య మొక పెద్దసైన్యము నోడించలేదు? ఓర్పు వహించువారితో భగవంతుడున్నాడు."

250. వారు తాలూతుతోడను అతనిసైన్యములతోడను యుద్ధము చేయుటకు రంగమున దిగి (భగవంతుని ప్రార్థించుచు) నిట్లనిరి: (ప్రభూ! మేము బలహీనులమను విషయము నీకు తెలియును.) అందుచే మాపై క్షమావర్షము కురిపింపుము. యుద్ధరంగమున మా పాదములు దృఢముగ పాదుకొల్పుము. విశ్వాసహీను లగువారి ప్రతిపక్షులైన మాకు సాహాయ్య మొసగుము."

251. అట్లే వారు భగవదాజ్ఞలచే శత్రువుల తరిమివైచిరి. దావూదు తాలూతును సంహరించెను. తర్వాత భగవంతుడు దావూదుకు రాజ్యము వివేకము ప్రసాదించెను. నేర్పవలసినదంతయు నేర్పెను. (ఈ విధముగ ఒక చిన్న సంఘముయొక్క క్షమా ధైర్యములు ఇస్రాయీలీయుల పతిత జాతిని ఔన్నత్యమునకు తెచ్చెను.) వాస్తవ మేమనగా మానవులలో ఒకజాతి మరొకజాతిచే ఓడింప బడకపోయినచో భూమిపై అరాజకము ప్రబలి యుండెడిది. కాని భగవంతుడు జీవులయెడ అత్యంత దయకలవాడు.

252. (ఓ ప్రవక్తా!) ఇదంతయు నిశ్చయముగ భగవత్ప్రోక్తము. సత్యముతో నీకిది బోధించుచున్నాను. నిశ్చయముగ నీవు ప్రవక్తలలో ఒకడవు.

మూడవ భాగము

253. (నా) ప్రవక్తలగు వీరిలో కొందరిని తక్కినవారికంటె అధి
కుల నొనర్చితిని. భగవంతుడు వారిలో కొందరితో మాటలాడెను.
(అనగా వారికి భగవత్ప్రోక్తమగు గ్రంథము లభించెను.) కొందరికి ఇత
రులకంటె (వారి కాలపరిస్థితుల ననుసరించి కొన్ని విషయములలో) ఉన్నత
స్థానముల నిచ్చెను. (ఓ ప్రవక్తా!) నీకు పూర్వము మర్యమ్ కుమారు
డైన ఈసాకు నేను విస్పష్టమగు ఉపదేశములు♦ ప్రసాదించితిని. పరి
శుద్ధాత్మ* సహాయము చేకూర్చితిని. దేవు డిచ్ఛయించినచో ఈ ప్రవ
క్తల తర్వాతి తరములవారు (సన్మార్గముయొక్క) విస్పష్ట బోధనల
పొందియు, పిదప విభేద విద్వేషములలో తగుల్కొని పరస్పరము తగువు
లాడుకొనకుందురు. (కాని మానవునకు భగవంతుడు సంకల్పశక్తియు
కర్మాధికారము ప్రసాదించి స్వతంత్రు నొనర్చినాడు. ఇట్లతని కిచ్చిన
స్వేచ్ఛా శక్తిచే) ఈ ప్రవక్తలపిదప కొందరు పరస్పరము విరోధములు
పెంచుకొని(సత్యమార్గమునఐకమత్యము కలిగియుండక)కొందరుమాత్రమే
సత్యమునందు శ్రద్ధాళువులైరి; కొందరు సత్యము నిరాకరించి (దుర్మారు
లైరి.) భగవంతు డిచ్ఛయించినచో వారు పరస్పరము జగడములాడు
కొని యుండరు. కాని భగవంతుడు తానెట్లిచ్ఛయించిన అట్లుచేయును.

ముప్పదినాల్గవ ఖండము

254. ఓ విశ్వాసవంతులారా! (నశ్వరమగు మీ జీవితవ్యవధి
అంతమై) ఆ (తుది) దినము వచ్చుటకుముందే మీకు నేనిచ్చియుండిన

♦ "సత్యచిహ్నములు" అనియు కొంద రర్థము వ్రాసిరి.

* 'రూహిల్ ఖుదసి' అను మూలమునకు "ఈశ్వర ప్రేరిత జ్ఞానము" అనియు
"ఇంజీల్" లేక భగవద్గ్రంథము అనియు కొంద రర్థము వ్రాసిరి.

(ధన ధాన్య సంపదల) నుండి (మీ ప్రాపంచిక సౌఖ్యములకే కాదు; భగ
వన్మార్గమునకూడ) ఖర్చుపెట్టుడు.[౮౧] రాబోవు ఆ దినమున (ఈ ప్రపం
చమునందు వలె) క్రయవిక్రయములు సాగవు. (వెల యిచ్చి మోక్షమును
మీరు కొనజాలరు.) ఎవ్వరి బాంధవ్యమైనను స్నేహమైనను సరే నాడు
పనికిరాదు. ఎవరి శిఫార్సుగాని రక్షణగాని నాడు లాభింపదు. (నాడు
కేవలము మీ కర్మలే మీకు పనికివచ్చును. మీ కర్మలే మీకు మోక్షము
నిచ్చునని జ్ఞాపక ముంచుకొనుడు. ఈ సత్యమును నిరాకరించు) అవి
శ్వాసులు—నిశ్చయముగ వారు (తమకు తామే) నష్టపరచుకొను
చున్నారు.

255. అల్లాః తప్ప ఆరాధింప దగిన దేవుడెవ్వడును లేడు. అతడు
(ఆదిమధ్యాంతములు లేని) నిత్యుడు; స్వయంపూర్ణుడు; (సమస్త సృష్టికి
అతడే మూలాధారము. అతని అస్తిత్వము దేనిపైనను ఆధారపడిలేదు;
అతడు అనంతుడు.) అతనికి కునుకుగాని కూర్కుగాని లేదు. భూమ్యా
కాశములలో ఉన్న సమస్తమునకు అతడే స్వామి. (అతని అదుపాజ్ఞ
లకే సమస్తమును లొంగియున్నది.)

అతడు అనుజ్ఞ ఇచ్చిన తప్ప ఎవరు అతని సమక్షమున (మోక్షము
నిప్పించుటకు) శిఫార్సుచేయ బూనుకొనగలరు? మానవుని భూత భవి
ష్యద్వర్తమానముల నాత డెఱుగును. (భగవంతుడు) మానవునకు ఎంత
జ్ఞానమును ప్రసాదింపదలచి ఇచ్చెనో అంతేతప్ప మరే ఇతరజ్ఞానము అత
నికిలేదు. భగవంతుని జ్ఞానము భూమ్యాకాశముల (సమస్త వైశాల్యము)
నావరించి యున్నది. వాటిని కాపాడుటయందు అత డెంతమాత్రము
అలసట చెందడు; భగవంతుడు మహా మహిమోపేతుడు; మహాద్య
శుడు.[౮౨]

256. మతము విషయములో నెట్టి బలాత్కారము చేయ దగదు.[౨౦] (శ్రద్ధా విశ్వాసములు హృదయపూర్వకముగ కలుగవలెను కాని బలాత్కారమున కలుగవు.) సత్యము అసత్యము స్పష్టముగ వేరుచేయబడి యున్నవి. (సత్యాసత్య విచక్షణము కష్టముకాదు. ఇప్పుడు సత్యాసత్యములు రెండును మీ ముందున్నవి. ఈ రెంటిలో దేనిని గ్రహింతురో గ్రహింపుడు!) తప్పుదారిని నడిపించు సైతానును తిరస్కరించి, ఎవరు భగవంతునియెడ విశ్వాసము చూపిరో వారికి నిశ్చయముగ దృఢతమమైన పట్టుగొమ్మ లభించినట్లే. (ఈ పట్టుగొమ్మ) ఎన్నటికిని విరుగనిది. (ఇది జ్ఞాపకముంచుకొనుడు). భగవంతుడు సమస్తము వినువాడు; సర్వము తెలిసిన వాడు.

257. విశ్వాసవంతులకు భగవంతు డేడుగడ; వారి నతడు చీకటి నుండి వెలుగులోనికి తెచ్చును.

అవిశ్వాసులకో దుష్టులు సహాయులు; వారు వారిని వెలుగు నుండి చీకటిలోనికి నడిపింతురు. వారు నరకాగ్నియం దుండువారు. వారి కందే నిత్యనివాసము.

ముప్పదిఐదవ ఖండము

258. (ఓ ప్రవక్తా!) ఇబ్రాహీముతో భగవంతునిగూర్చి వివాద మొనర్చిన వారిని గూర్చి యోచించితివా? భగవంతు డతనికి రాజ్యము నిచ్చుటచే (అధికార ప్రమత్తతచే గర్విష్ఠియై) అతడా వాదనకు దిగెను.[౨౧]

అప్పుడు వానితో ఇబ్రాహీమ్ ఇట్లనెను: "(సమస్త జీవులకును) ప్రాణము నిచ్చి తిరిగి మృత్యువును కలిగించునట్టివాడే నా భగవంతుడు."

దానికి అతడిట్లు ప్రత్యుత్తరమిచ్చెను: "బ్రతికించువాడను చంపు వాడను నేను. (నా యిష్టము వచ్చినవారిని చంపి నా ఇచ్ఛ వచ్చిన వారిని బ్రతుకనిచ్చువాడను నేను.)"

దానికి ఇబ్రాహీమ్ ఇట్లు బదులుచెప్పెను: "అట్లైనచో భగవంతుడు తూర్పున (భూమిపై) సూర్యు నుదయింప జేయుచున్నాడు. నీవు పడమట నుదయింపజేసి చూపుము. (అప్పుడు నీవు శక్తిమంతుడ వను కొందును.)"

(రాజ్యగర్వముచే భగవంతునియందు) విశ్వాసమును విడిచిపెట్టిన అతడు దానికి నిరుత్తరుడాయెను. అధర్మ ప్రవర్తకులకు భగవంతుడు (మోక్షవిజయముల) సన్మార్గమును చూపడు.

259. ఓ ప్రవక్తా! కప్పులు సైతము శిథిలమైన ఇండ్లుగల పట్టణముగుండా వెళ్ళుచుండిన ఆ మనుష్యుని స్థితినిగూర్చి యోచింపుము.[౨౨] (శిథిలావస్థలోనున్న ఆ పట్టణమునుచూచి) అత డిట్లనెను. "ఇది ఇట్లు విధ్వంసమైన పిదప దీనిని భగవంతు డెట్లు పునరుజ్జీవింప జేయును"

తర్వాత భగవంతు డామనుష్యుని నూరేండ్లపాటు మృతునొనర్చి యుంచెను. పిదప అతనికి ప్రాణదాన మొసగెను. అప్పుడు భగవంతు డతని నిట్లడిగెను: "ఎంతకాల మీస్థితియం దుంటివి?" దానికి ప్రత్యుత్తరముగ అతడిట్లు విన్నవించెను: "ఒక దినమో లేక కొన్ని ఘడియలో." భగవంతుడిట్లు సెలవిచ్చెను: "అట్లు కాదు. నూరేండ్లు నీవా స్థితియం దుంటివి. నీ అన్నపానములవంక చూడుము. సంవత్సరములపాటు ఇవి పడియుండినట్లు అందెట్టి చిహ్నములును కన్పించుటలేదు. (నీకు వాహనమైన) గాడిదనుకూడ చూడుము. మానవులలో నీవొక దృష్టాంతముగ నుండుటకై (ఇట్లు చేసితిమి.)

మరియు దేహముయొక్క అస్థులనుగూర్చి యోచింపుము. ఎట్లు వాటినొక అస్థిపంజరముగా తయారుచేసితిమి! ఎట్లు (వానినొక అస్థిపంజరముగా చేసి) నిలబెట్టితిమి. (ఎట్లు ఒకసంపూర్ణజీవి వ్యక్తమగునట్లు) దానిపై మాంసమును తొడిగింపజేసితిమి!

అప్పుడా మనుష్యునకు ఈ సత్యము తేటతెల్లమయ్యెను. వెంటనే అతడిట్లు చెప్పసాగెను: "నిస్సంశయముగ భగవంతుడు సర్వశక్తిమంతుడని నేను తెలిసికొంటిని."

260. ఒకప్పుడు ఇబ్రాహీమ్ ఇట్లనెను: "ప్రభూ! నీవు మృతుల నెట్లు జీవితుల నొనర్తువో నాకు చూపుము."

(దానికి) భగవంతు డిట్లనెను: "ఏమి! నీకు దీనియందు విశ్వాసము లేదా?"

ఇబ్రాహీమ్ ఇట్లు విన్నవించుకొనెను: "నాకు నిశ్చయముగ విశ్వాసమున్నది. ఐనను నాకు మనస్తృప్తి కలుగవలెనని (ఇట్లు ప్రార్థించితిని)"

దానికి భగవంతుడిట్లు సెలవిచ్చెను: "అట్లైన నాల్గు పక్షులను పట్టుకొమ్ము. అవి నీవెంట వచ్చునట్లు వాటిని మచ్చికపరుపుము. తర్వాత నాల్గింటిలో ప్రతి ఒక్కొక్కదానిని ఒక్కొక్క కొండపై దూరముగ కూర్చుండబెట్టుము.[౨౬] అప్పుడు వాటిని పిలువుము. (అవి ధ్వని వినగానే) నీదగ్గఱకు ఎగిరివచ్చును. (బుద్ధిలేని సామాన్యపక్షులు నీతో కొన్నాళ్ళు మచ్చికపడినంత మాత్రాన నీధ్వనిని గుర్తుపట్టి నీవు పిలువగనే నీవెంట పరుగెత్తుకొనిరాగా సత్యబోధనవల్ల మానవులు నీవైపునకు వచ్చుట ఆశ్చర్యమా?) జ్ఞాపకముంచుకొనుము. భగవంతుడు సర్వశక్తిమంతుడు; సర్వజ్ఞుడు.

ముప్పదిఆరవ ఖండము

261. దేవుని మార్గమున తమ ధనమును వెచ్చించువారి సుకృతి నిట్లు పోల్చవచ్చును: ఒకగింజ భూమిలో నాటబడినది. (నాటినగింజఒకటే యైనను) మొక్క మొలిచి దానికి ఏడు కంకులాయెను. ప్రతి కంకియందును నూరుగింజ లుత్పన్నమాయెను. అట్లే ఒకటి ఖర్చుపెట్టిన

దానికి శతాధికమగు ఫలమును భగవంతుడిచ్చును.[౨౮] తనకు ప్రియులైన వారికై వారి సుకృతమును భగవంతుడు ద్విగుణీకృతమొనర్చును. భగవంతుడుఅమితముగ నిచ్చువాడు.సర్వజ్ఞుడు.

262. (కాని హృదయపూర్వకముగను, సన్మార్గమునను చేయు దానమే దానము. అందుచే) భగవన్మార్గమున వ్యయపరచువారు ఎవరు తమ దానమును గూర్చి మాటిమాటికి గొప్పగా చెప్పుకొనరో, ఎవరు (ప్రతి గృహీతకు మనోవాక్కాయ కర్మముల) ఎట్టి కష్టమును కల్గించరో (అట్టివారిదే నిజమగు దానము.) భగవంతుడు వారికి దాని ప్రతిఫలమిచ్చును. వారికెట్టి భయముగాని దుఃఖముగాని అంటదు.

263. మృదు వాక్కుయు, క్షమయు, హింసాపూర్వకమైనదానముకంటె శ్రేష్ఠమైనవి. భగవంతుడు ఎట్టి కామ్యములును లేనివాడు; మహాక్షమి.

264. ఓ విశ్వాసవంతులారా! దానము చేసితిమని మాటిమాటికి చెప్పికొనియు, (ప్రతి గృహీతను) నొప్పించియు దాన ఫలమును వ్యర్థము చేయకుడు. లోకమునకు ప్రదర్శించుటకై ధనమును వ్యయపెట్టువాని వలెను, భగవంతునిపైన తుదిదినమునందు విశ్వాసము లేనివానివలెను, సుకృతము వమ్ముచేయకుడు. వారు కొద్దిగా మన్నుకల కఠినశిలవంటివారు. దానిలో విత్తనము నాటబడినను పెద్దవర్షము కురిసినప్పుడు ఆ మట్టియు విత్తనము కూడ కొట్టుకొనిపోవు (కఠిన) శిల మాత్రము మిగులును. (వీరి స్థితియు నిట్టిదే!) అట్టివారు (దానాది సత్కర్మలచేత) గడించిన దంతయు (నిట్లు) పోగొట్టుకొందురు. విశ్వాసమార్గమును విడనాడిన వారికి భగవంతుడు మోక్షమార్గము తెరువడు.

265. కాని తమ ధనమును ఎవరు (లోకమునకు చూపుటకుకాక) భగవంతుని ప్రీతికొఱకును, తమ ఆత్మల స్వాస్థ్యమునకును ఖర్చుపెట్టుదురో వారిదాన మొక ఉన్నత భూఖండముపై సారవంతమగు నేల

నాటిన ఆరామము వంటిది. బాగుగ వర్షించెనా అది ద్విగుణీకృతముగ ఫల పుష్ప సంభరితమగును; అట్లు మంచివర్షము కురియక ఏకొన్ని చినుకులు పడినను అది శుష్కింపక ఫలపుష్పముల నిచ్చును. (దానికి ఏకొద్ది నీరైనను చాలును. అది ఫలపుష్పశోభితమై యుండగలదు.)

(జ్ఞాపక ముంచుకొనుడు.) మీరు చేయుచున్న దంతయు భగవంతుని దృష్టినుండి గుప్తమై లేదు.

266. మీలో ఎవరైన జరాభారముచే క్రుంగిపోయి, శక్తిహీనులై, వ్యవసాయకార్యములు నిర్వహింపజాలని పసిపిల్లలు గలవారై యున్నప్పుడు, ఖర్జూర వృక్షములు ద్రాక్ష పందిళ్లు కలిగి కాలువలు ప్రవహించుచున్నదై సమస్త ఫలసంభరితమై యున్న మీతోట వేడి తుపానుగాడ్పులచే అకస్మాత్తుగ మాడి చెడిపోవుటను ఎవరు చూడగోరెదరు? (తన జీవితకాల మంతయు కేవలము లోకమునకు చూపుటకై దానధర్మములు చేసి పరలోకమున ఇవన్నియు పనికివచ్చునని భ్రమించు వానికి ఇది ఒకతార్కాణము. కాని మీరు కావించిన దంతయు అవసాన దినమున పై యుదాహరణమందలి తోటవలె మాడిపోవును. అనగా భగవంతుడు అట్టివారి దానధర్మములు స్వీకరింపడు.) మీరు పర్యాలోచింతురని భగవంతు డిట్టి ఉదాహరణములనిచ్చి విస్పష్టవాక్యములలో మీకు బోధ కలుగజేయును.

ముప్పదిఏడవ ఖండము

267. ఓ విశ్వాసవంతులారా! మీరు కష్టపడి సంపాదించిన దానినుండియు, మీకై మేము భూమియం దుత్పత్తిగావించిన వానినుండియు మంచివస్తువులనే ఖర్చుపెట్టుడు. (మీరు భగవన్మార్గమున దానముచేయ గోరుచో మంచివస్తువునే దానముచేయుడు.) (మీకు పండిన ఫలధాన్యముల నుండి) పొల్లును దానముచేయుట కుద్దేశింపకుడు. (పారవేయుటకు

బదులు, భగవన్మార్గమున దానముచేసి పుణ్యమునైన గడింతుముగాక! అను ఉద్దేశముతో అట్లుచేయకుడు.) మీకే అట్టి పొల్లువస్తువుల నిచ్చినచో కండ్లుమూసుకొని తీసుకొందురేమోగాని సంతోషపూర్వకముగ స్వీకరింపరుకదా! (మీ కయిష్టమగు వస్తువు మీ బీదసోదరుల కిష్టమగునని మీ రెంతురా? జ్ఞాపకముంచుకొనుడు.) భగవంతునకు కామ్యములు లేవు. అతడు సర్వ స్తుతిపాత్రుడు.

268. దారిద్ర్యభీతి గొల్పి సైతాను మిమ్ములను చెడునడవడి నలవరచుకొన ప్రోత్సహించు చున్నాడు. కాని భగవంతుడు మీ పాపములను క్షమించి మీయెడ అనుగ్రహమును చూప వాగ్దాన మొసగుచున్నాడు. (అందుచే సైతాను ఉరుల జిక్కక భగవన్మార్గమున నడువుడు. జ్ఞాపకముంచుకొనుడు:) భగవంతుడు వరదుడు; సర్వజ్ఞుడు.

269. తన ఇచ్చవచ్చిన వారికతడు విజ్ఞానమును ప్రసాదించును. అట్లు విజ్ఞానము ప్రసాదింప బడినవాడు మహాభాగ్యమును గాంచినవాడనుట నిశ్చయము. వివేకవంతులు తప్ప ఇతరులీ సందేశమును గ్రహించలేరు.

270. దానపూర్వకముగ ఎట్లు ఖర్చుపెట్టినదియు, మొక్కుబడిగ ఏది నివేదించుకొనినదియు, భగవంతు డంతయు ఎఱుగునని నమ్ముము. దుర్మార్గుల కెవ్వరును సాహాయ్యులై రారు.

271. మీరు బహిరంగముగ దానముచేసినను మంచిదే. కాని రహస్యముగ పేదసాదలకు దానమిచ్చుట మిక్కిలి ప్రశస్తము. మీ చెడుగులు కొన్నిటి నది తొలగించును. మీరు చేయునదంతయు భగవంతుడు బాగుగ నెఱుగును. (అతడు సర్వజ్ఞుడు.)

272. (ఓ ప్రవక్తా!) ప్రజలు (అందరును) నీ ఉపదేశమును (తప్పక) స్వీకరించు బాధ్యత నీపై లేదు. (వారికి సన్మార్గము చూపుటయే

సీవిధి.) భగవంతుడే తన ఇచ్ఛవచ్చిన వారిని సన్మార్గగాములను చేయును. (మరి సీవు ప్రజలతో ఇట్లు చెప్పివేయుము.) "మీరు ప్రశస్తమగు రీతిని దానము చేయుచో (దానివలన నాకేమియు లాభముకలుగదు.) మీ ఆత్మలకే అది లాభము చేకూర్చును. భగవత్ప్రీతికై మాత్రమే మీరు దానము చేయుడు. మీరు ఏది దానము చేసినను దాని ప్రతిఫలము మీకు పూర్తిగ లభించును.[౨౫] (ఇట్టిదానము చేయుటవలన లాభమే కలుగును గాని) దానివలన మీకెట్టి నష్టమును కలుగదు.

273. భగవన్మార్గమున నుద్యుక్తులై నిరుపేదలైనవారే అసలు దానమునకు పాత్రులు. వారు (సంపాదనమునకై వర్తకము మున్నగు వృత్తుల స్వీకరించి) దేశసంచారము చేయ నవకాశము లేని వారు. (కాని వారు నిర్లిప్తులగుటచే తమ దారిద్ర్యమును ఎవ్వరితోనుచెప్పుకొనరు.) అజ్ఞానులు వారిని సంపన్నులనియే భావింతురు. ఎందుకనగా వారు (అభిమానముచే ఎవ్వరిముందును) చేయి చాచరు. మీరు వారి (ముఖ) చిహ్నములను చూచియే వారిస్థితిని గ్రహించగలరు. కాని వారు ప్రజలను పీడించి (దానము) నడుగరు. మీరుచేయు ఏ సత్పాత్ర దానమైనను భగవంతుడు నిశ్చయముగ నెఱుగును.

ముప్పదిఎనిమిదవ ఖండము

274. రేబవళ్లు బహిరంగముగను రహస్యముగను దాతృత్వమున తమ సంపదనుండి వ్యయపరచు వారికి వారి ప్రభువుకడ బహుమానము కలదు. వారికి ఎట్టి భయముగాని శోకముగాని అంటదు.

275. (బీదసాదలకు సాయమొనర్చుటకు బదులు వారికి అప్పులనిచ్చి వారికడనుండి) ఎవరు వడ్డీని తీసుకొని పొట్టపోసికొందురో వారు స్థిరముగ నిలువజాలరు. వారు నిలువబడినను (దుర్గర్వముచే) పిశాచమావేశించి ఉన్మాదులైన వారివలె నిలువబడుదురు. ఎందుకనగా (వడ్డీ

అన్యాయార్జనమని అంగీకరింపక) వారు ఇట్లందురు: "(క్రియ విక్రియములతోకూడిన) వర్తకముకూడ (అప్పిచ్చి) వడ్డీ తీసికొనుటవంటిదే!" కాని భగవంతుడు వర్తకమును ధర్మయుక్తమొనర్చి వడ్డీని నిషేధించినాడు.[౨౬] (రెండును ఒక్కటే ఎట్లగును?) అందుచే (ఇప్పుడు) ఈ భగవదాజ్ఞ యైనతర్వాత ఎవరు వడ్డీ తీసుకొనుట మానివేతురో- ఇంతకుముందు (వడ్డీ తీసుకొనుట వలన కలిగిన) ధనమును వారుంచుకొనవచ్చును- వారి వ్యవహారమును భగవంతుడు పరిష్కరించును. అట్లుగాక ఎవరు అదే పాపమును చేయుదురో వారు నరకాగ్ని పాలగుదురు. అందే వారికి స్థిరనివాసము.

276. భగవంతుడు వడ్డీని సర్వశుభములనుండియు రిక్తమొనర్చినాడు. దాతృత్వమును సర్వశుభోపేత మొనర్చినాడు. కృతఘ్నులను, క్రూరులను భగవంతుడు ప్రేమింపడు.[౨౭]

277. (భగవంతుని యందు) విశ్వాసవంతులై సత్కార్యాచరణ మొనర్చి, నిత్య ప్రార్థనలయందు దృఢమనస్కులై జకాతు నిచ్చుచుండినచో భగవంతుడు వారిని బహూకరించును.[౨౮] వారికి భయముగాని శోకముగాని అంటదు.

278. ఓ విశ్వాసవంతులారా! మీరు నిజముగ విశ్వాసవంతులైనచో దైవభీతి గలిగి (మీ ఋణస్థులనుండి) మీకు రావలసిన వడ్డీ మిగుళ్ళను విడిచిపెట్టుకొనుడు.

279. మీరట్లు చేయనిచో మరి భగవంతుని తోడను, ప్రవక్త తోడను యుద్ధము చేయుటకు సిద్ధపడుడు. (భగవదాజ్ఞల నతిక్రమించుట భగవంతునితో యుద్ధము చేయుటవంటిదే.) అట్లుకాక మీరు అతిక్రమణ మార్గమును విడిచి పశ్చాత్తాపపడి సన్మార్గమునకు వచ్చినయెడల మీ అసలు మొత్తములు మీకు లభించును. మీరన్యాయము చేయనిచో మీకును అన్యాయము జరుగదు.

280. ఋణస్థుడు కష్టపరిస్థితులలో నున్నచో అతనికి తెరిపియై (తీర్పుజాలినంతవరకు) వ్యవధి నిండు.౨౮ మీరు (ప్రబోధమనస్కులై ఔదార్య దాతృత్వములతో) ఋణమును క్షమించినయెడల (అంతకంటె) మీకొఱకు ప్రశస్తమైనది (మరొకటిలేదు.)

281. మీరు భగవంతుని సముఖమునకు తేబడు ఆ దినమునకు భయపడుడు. నాడు ఎవరు గడించినది వారనుభవింపవలసినదే. నాడెవరికిని అన్యాయము జరుగదు.

ముప్పది తొమ్మిదవ ఖండము

282. ఓ విశ్వాసవంతులారా! ఒక నిర్ణీతకాలమునకై మీరు పరస్పరము అప్పు ఇచ్చి పుచ్చుకోలు వ్యవహారము జరిపినచో దానిని (ఆ ఒడంబడికను) వ్రాతమూలముగ భద్రపరుపుడు. ఇరుపక్షములమధ్య న్యాయబుద్ధితో ఒడంబడిక పత్రము వ్రాయు వ్రాయసకాడొక డుండవలెను. వ్రాయసకా డెన్నడు వ్రాయ నిరాకరింపరాదు. భగవంతుడతని కెట్లు లేఖనవిద్య ప్రసాదించెనో అట్లే అతడు (అతని వ్రాత పొరపాట్ల వలన తరువాత తగవులు సంభవించకుండ) వ్రాయవలయును. ఋణస్థుడు దస్తావేజు మాటలబురు చెప్పుచుండగా (వ్రాయసకాడు వ్రాయుచుండవలెను.) అప్పుడతడు దైవభీతిని మనస్సున నిల్పి తా నివ్వవలసిన మొత్తము నెంతమాత్రమును తగ్గింపక సరిగా చెప్పవలెను. ఒకసారి ఋణస్థుడు బుద్ధిహీనుడుగాని బలహీనుడుగాని యైనపక్షమునను, తాను దస్తావేజును వ్రాయించజాలని పక్షమునను, అతని సంరక్షకుడు అతనికై న్యాయముతప్పక వ్రాయించవలెను. (అటుపిమ్మట) మీ నుండి ఇద్దరిని సాక్షులుగా లభించకపోయినచో ఒక పురుషుని, ఇద్దరు స్త్రీలను మీఇష్టమువచ్చిన వారినుండి ఏర్పాటు చేయ

వచ్చును. ఒకసారి ఆ ఇద్దరిలో నొక స్త్రీ పొరపడినను మరొక స్త్రీ జ్ఞాపకము చేయవచ్చును.

సాక్షులు (సాక్ష్యముచెప్పుటకై) పిలువబడినపుడు వారుఁరా నిరాకరింపరాదు. మొత్తము చిన్నదైనను పెద్దదైనను అది చెల్లింపబడ వలసిన తేదీతోసహా వ్రాయుటకు వెనుదీయకుడు. భగవంతుని దృష్టిలో ఈపద్ధతి ఎక్కువ న్యాయయుక్తమైనది. (ఎందుకనగా దీనివలన) మంచి ప్రమాణము లభించుటయేగాక, తరువాత మీకు సందేహములు కలుగకుండుట కిది మిక్కిలి అనుకూలమైనది.

ఒకసారి అప్పటికప్పుడు వ్యాపారవస్తువులు ఒకరి చేతినుండి మరొకరి చేతికి మారి (నగదు బేరమైన పక్షమున) వ్రాత మూలకముగ పత్రముంచుకొనకుండుట దోషముకాదు. కాని మీ రొకరి వస్తువుల నొకరు ఒకదాని బదులొకటి మార్చుకొనునప్పుడు సాక్షుల నుంచుకొనుడు. వ్రాయసకానికి గాని, సాక్షులకుగాని ఎట్టి ఆపదయు రానీయకుడు. అట్లుకాక వారికి (హాని) కలిగించినచో తప్పక అది భగవదాజ్ఞోల్లంఘనమే. * భగవంతునియెడ భయభక్తులు కలిగియుండుడు. ఎందుకన అల్లాః మీకు (ధర్మము) నుపదేశించుచున్నాడు. అతడు సర్వస్వము నెఱిగినవాడు.౭౦

283. ఒకప్పుడు మీరు ప్రయాణములోనుండి, వ్రాయసకాడు లభింపని పక్షమున ఏదేని ఒక వస్తువును కుదువబెట్టి (దానిని ఋణదాత) స్వాధీనము చేయుడు. మీలో ఒకడు మరొకనిని నమ్మి కుదువపెట్టినచో అతడు తనకడ దాచిపెట్టిన సొత్తును తిరిగి (కుదువపెట్టిన వానికి) ఇచ్చివేయవలెను. తన ప్రభువైన అల్లాః యెడల భయభక్తులు కలిగియుండవలెను.

* "పాపకృత్యము" అనియు అర్థము చెప్పవచ్చును.

సాక్ష్యమును దాచకుడు. ఎవడట్లు (సాక్ష్యమును) దాచునో నిశ్చయముగ వాని హృదయము పాపపంకిల మైనది. మీరు చేయున దంతయు భగవంతు డెఱుగును.

నలుబదవ ఖండము

284. భూమ్యాకాశములలోనున్న సమస్తము భగవంతునిదే యైయున్నది. మీ హృదయములలో నున్నది, దానిని మీరు దాచి యుంచినను వెలిబుచ్చినను భగవంతు డెఱుగును. దాని ప్రకారము మీకర్మల నతడు గణించును. (మీ హృదయములలోని పాపములను లోకమునకు తెలియకుండ దాచగలరు. కాని భగవంతునకదంతయు సుస్పష్టమే.) తరువాత తన యిచ్ఛవచ్చినవారిని భగవంతుడు క్షమించును. తన యిచ్ఛవచ్చిన వారికి శిక్ష నిచ్చును. సమస్త వస్తువులపైనను భగవంతునకు సంపూర్ణాధికారము కలదు.

285. ప్రవక్త తనకు తన ప్రభువుచే ప్రోక్తమైన ఈ వచనములను విశ్వసించుచున్నాడు. విశ్వాస వంతులుకూడ అట్లే విశ్వసించుచున్నారు. వారందరు అల్లాను, అతని దేవదూతలను, అతని (చే ప్రోక్తమైన) గ్రంథములను, అతని ప్రవక్తలను అట్లే విశ్వసించు చున్నారు. (వారిట్లందురు:) "ఏ ప్రవక్తయెడను మేము భేదభావమును చూపము. (అందరియెడను సమాన గౌరవ విశ్వాసములను చూపుదుము.)" మఱియు వారిట్లందురు: "(ప్రభూ! మేము నీ ఉపదేశములను) వింటిమి. మేము నీకు విధేయుల మగుచున్నాము. నీ క్షమార్పణమునే మేము వేడుచున్నాము. ప్రభూ! నీవే మాకు తుది గమ్యము."

286. ఏ వ్యక్తి పైనను అతనిశక్తికిమించిన భారమును భగవంతుడు వేయడు. ప్రతి ఆత్మయు అది గడించిన ప్రతి సత్కృతియొక్క

ఫలమును అనుభవించును. అట్లే ప్రతి దుష్కృతి ఫలమును కూడ అనుభవించును.

(విశ్వాసవంతు లిట్లు ప్రార్థన సల్పుదురు:)

"ప్రభూ! మా మరుపులకును, మాతప్పిదములకును మమ్ముల శిక్షింపక క్షమింపుము.

ప్రభూ! మాకుపూర్వము వారిపై వేసినట్టి బరువును మాపై మోపకుము.

ప్రభూ! బలహీనులమగు మాపై మోయశక్యముకాని భారమును వేయకుము.

ప్రభూ! మా పాపములను తుడిచివేయుము. మమ్ము క్షమింపుము. మమ్ము కరుణింపుము. నీవేమాకు పోషకుడవు. విశ్వాసహీనులకు వ్యతిరేకముగ మాకు సాహాయ్యము చేయుము."

بسم الله الرحمن الرحيم

అధ్యాయము 3

ఆలె ఇమ్రాన్

లేక

ఇమ్రాన్ వంశము

(మదీనాయందు ప్రోక్తమైనది.)

(౨౦౦ సూక్తులు: ౨౦ ఖండములు)

కరుణామయుడును వరప్రదాయకుడును అగు

అల్లాః నామస్మరణముతో (ప్రారంభించుచున్నాను.)

1. అలిఫ్ - లామ్ - మీమ్.

2. అల్లాః తప్ప ఆరాధింపదగిన దేవుడెవ్వడును లేడు. అతడు (ఆదిమధ్యాంతములులేని) నిత్యుడు. స్వయంపూర్ణుడు. (సమస్త సృష్టికి నతడు మూలాధారుడు. అతని అస్తిత్వము దేనిపైనను ఆధారపడిలేదు.)

3. అతడే సత్యసంపూర్ణమగు (ఖుర్ ఇన్) గ్రంథమును నీకు ప్రవచించినాడు. (ఈ గ్రంథము) ఇంతకుముందు ప్రవచింపబడిన సత్య గ్రంథములను నిర్ధారించుచు ప్రవచితమైనది. (ఇది వెనుకటి గ్రంథములకు వేరైనదికాదు. అవి అసత్యగ్రంథములని చెప్పునదియు గాదు. నీకంటె పూర్వులగు) మానవుల ఉపదేశమునకై భగవంతుడు తౌరీతు, ఇంజీల్ గ్రంథములను ప్రవచించెను.౬౦ ఆ భగవంతుడే సత్యాసత్య విచక్షణముచేయు (ఖుర్ ఆన్) గ్రంథమును వెలువరచెను.

4. ఎవరు భగవత్సూక్తులను * నిరాకరించి (అసత్యము ననుసరింతురో) వారు కఠినశిక్షకు పాత్రులగుదురు. భగవంతుడు మహామహిమోపేతుడు. పాపులను కఠినముగ శిక్షించువాడు.

* ఇక్కడ 'ఆయాత్' అను మూలశబ్దమునకు 'చిహ్నములు' అనియు అర్థము చెప్పవచ్చును. ఖుర్ ఆన్ సూక్తులు 'ఆయాత్' అనబడుచున్నవి. 'భగవదుపదేశ వాక్యములు' అనియు దీనికి అర్థము చెప్పవచ్చును.

5. భూమియందుగాని ఆకాశములందుగాని భగవంతుని ఎదుట ఏదియు గుప్తముగ లేదు.

6. మిమ్ములను గర్భకోశములలో తన ఇచ్ఛవచ్చినట్లు రూపములను సవరించువాడతడే. అతడుతప్ప మరే దేవుడును లేడు. అతడు మహామహిమోపేతుడు; ప్రజ్ఞానిధి.

7. భగవంతుడే (ఈ ఖుర్ ఆన్) గ్రంథమును ప్రవచించెను. ఇందులో కొన్ని సూక్తులు (శబ్దస్వరూపము నందుగాని, అర్థమునందుగాని చిక్కులులేని స్పష్టమైన మౌలిక సూక్తులు. అవి) మూలసిద్ధాంతములను ప్రతిపాదించునవి. ఇవి ఈ గ్రంథముయొక్క పునాదులు. ♦ రెండవ తరగతివి దృష్టాంత రూపకములు.౬౨ ఎవరి హృదయములలో వక్రతా వైపరీత్యములు కలవో అట్టి వారీ దృష్టాంత రూపకమగు (సూక్త) భాగమునే అనుసరింతురు. అందు చిక్కులు కల్పింపగోరి లేనిపోని గూఢార్థములను లాగి (క్రిందు మీదు చేయుదురు.) ఆ సూక్తుల గూఢార్థములను భగవంతుడు తప్ప మరెవ్వరు నెఱుగరు. నిశ్చయజ్ఞానముగల వివేకులగు విద్వాంసులు ఇట్లందురు: "మేము భగవద్గ్రంథమును విశ్వసింతుము. భగవద్గ్రంథము పూర్తిగ భగవంతునిచేతనే ప్రోక్తమైనది." నిశ్చయబుద్ధిగలవారు తప్ప తక్కినవారీ భగవత్సందేశమును గ్రహింపరు.

8. (నిశ్చయబుద్ధియు శ్రద్ధాభక్తులునుకలవారు) ఇట్లందురు: ప్రభూ! మాకు సన్మార్గమును చూపిన పిదప తిరిగి మా హృదయములను

♦ "ఉమ్మున్" అను ఇక్కడి మూలమునకు 'తల్లి' 'మాతృక' అని అర్థము. ఇక్కడ "ఉమ్ముల్ కితాబ్" అనగా "గ్రంథమునకుతల్లి" లేక "గ్రంథమునకు మాతృక" అని అర్థమువచ్చును. అనగా ఈ సూక్తులు మూలసిద్ధాంతములను ప్రతిపాదించునవి. తక్కిన ధర్మములన్నియు వీటిపైననే ఆధారపడియున్నవి. దీనిపై వ్యాఖ్యానమును చూడుడు.

డోలాందోళిత మొనర్పకుము. నీ సాన్నిధ్యమునుండి మాకనుగ్రహమును ప్రసాదింపుము. నీవే పరిమితము లేని శ్రేయస్సును కూర్చువాడవు.

9. "ప్రభూ! నిశ్చయముగ వచ్చు ఆ తుదిదినమున మానవులనందరను ఒకే చోట కూడబెట్టువాడవు నీవే. భగవంతు డెన్నడును వాగ్భంగ మొనర్పడు."

రెండవ ఖండము

10. విశ్వాసమును ధిక్కరించు వారికి వారి ఆస్తిపాస్తులు గాని వారి సంతతిగాని భగవంతుని సమక్షమున నేమియు చేయజాలవు. (ఇట్లు ధిక్కరించు) వారు నరకాగ్ని కింధనములగుదురు.

11. (వీరి ప్రవర్తనము) ఫిర్‌జౌను ప్రజలయొక్కయు వారి పూర్వులయొక్కయు ప్రవర్తనమువలె ఉన్నది. వారు భగవంతుని చిహ్నములను ధిక్కరించిరి. భగవంతుడు కూడ వారి దుష్కర్మల ఫలము వారికి కుడువబెట్టెను. భగవంతుడు కఠినముగ (పాపులను) శిక్షించువాడు.

12. విశ్వాసమును ధిక్కరించువారితో నిట్లుచెప్పుము: "మీరు త్వరలో పరాజయము నొందుదురు. నరకమునందు కూడబెట్టబడుదురు. (నరకవాసుల) నివాసమెంత ఘోరమైనది!"

13. యుద్ధరంగమున కలిసిన ఈ రెండు సైన్యములందు (మీకప్పుడే ధర్మవిజయమున) కొక తార్కాణము గోచరించినది. ఒక సైన్యము భగవన్మార్గమున పోరాడుచుండెను. మరొకటి భగవంతునకు వ్యతిరేకముగ. (బదర్ యుద్ధరంగమున భగవన్మార్గమున పోరాడు) వారు తమకంటె రెండింతల సైన్యమును శత్రుపక్షమున నుండుటను కండ్లార చూచిరి. ఆ భగవంతుడు తన కిష్టులగు వారికి (దైవికశక్తి) నిచ్చి

సహాయ మొనర్చును. చూచుటకు కండ్లున్న వారికి దీనియందొక గుణపాఠము కలదు.

14. స్త్రీలు, పుత్రులు, వెండిబంగారముల రాసులు, ఉత్తమజాతి గుఱ్ఱములు, పశుసంపద, సస్యసంపన్నమగు భూమి—ఇవే ఐహికజీవితముయొక్క సంపదలు. కామ్యములగు ఈ వస్తువులయందలి మోహమే మానవుని దృష్టిలో ప్రియమైనది. (కాని జ్ఞాపకముంచుకొనుడు.) భగవంతుని సమీపమునకు పోవుటే అత్యుత్తమమగు గమ్యము. (అదేమీరు వాంఛింపదగినది.)

15. (ఓప్రవక్తా! వారితో) ఇట్లు చెప్పుము: "మీకే ఐహికవస్తువులకంటె ప్రశస్తమైన దేదో చెప్పుదునా? దైవభక్తిపరుల కొఱకు వారి భగవంతునికడ స్వర్గారామములు కలవు. అందు నిర్ఘరులు ప్రవహించుచున్నవి. వారందు నిత్యనివాసులై యుందురు. అందు వారికి పవిత్రులగు సతులు లభింతురు. (అన్నిటికంటె ప్రశస్తమైనదగు) భగవంతుని అనుగ్రహము వారికి కల్గును. (జ్ఞాపకముంచుకొనుడు) దైవభక్తిపరులు నిరంతరము భగవంతుని దృష్టిలో నుందురు.

16. (దైవభక్తిపరులగు) వారు ఇట్లందురు: "ప్రభూ! మేము విశ్వాసమార్గమునకు వచ్చితిమి. ఇక మా పాపములను క్షమింపుము. మమ్ములను నరకాగ్నినుండి రక్షింపుము."

17. ఎవరు క్షమాపూర్ణులై, (నిశ్చయదార్ఢ్యమును ఆత్మసంయమనము కలవారో*) ఎవరు (మనోవాక్కాయకర్మముల) సత్యవంతులో, ఎవరు భక్తిశ్రద్ధలతో ప్రార్థనము సల్పుదురో, ఎవరు (భగవన్మార్గమున)

---

* 'సాబిరీన్' అను మూల శబ్దమునకు "క్షమ, నిశ్చయదార్ఢ్యము, ఆత్మసంయమనము కలవారు" అని అర్థము.

వ్యయపరతురో, ప్రభాత వేళలందు క్షమార్పణమునకై (భగవంతుని) ప్రార్థింతురో (వారేదైవభక్తపరులు.)

18. అల్లాః ఒక్కడే ఆరాధింప దగినవాడు; మరెవ్వరును ఆరాధనమునకు యోగ్యులు కాజాలరు. దీనికి భగవంతుడే సాక్షి. అల్లే దేవదూతలును, నిశ్చయజ్ఞానము కలవారును (దీనికిసాక్షులు.)భగవంతుడు న్యాయమును పాలించువాడు. అల్లాః తప్ప మరెవ్వరును ఆరాధనమునకర్హులుకారు. అతడు సర్వశక్తిమంతుడు; సర్వజ్ఞుడు.

19. నిశ్చయముగ భగవంతునికడ నిజమైనమతము ఇస్లామ్ (యూదులు క్రైస్తవులు మున్నగు) జ్ఞానగ్రంథము నెఱిగిన వారు తమ విజ్ఞానము కల్గిన తర్వాతకూడ ఈ సత్యమును స్వీకరించకపోవుటకు కారణము వారి పరస్పర మాత్సర్యమే. భగవత్ప్రవచితమగు ఈ సందేశమును ♦ ఎవరు విశ్వసింపరో వారిని భగవంతుడు సత్వరముగ శిక్షించును.

20. మరి వీరు నీతో వివాదమునకు దిగినయెడల (ఓ ప్రవక్తా వారితో) ఇట్లనుము :

"నా ఆత్మ సర్వస్వమును నేను భగవంతున కర్పించితిని. నన్ననుసరించు వారందరును అల్లే అర్పించిరి."

జ్ఞానగ్రంథముల ననుసరించువారితోడను, విద్యావిహీనుల తోడను ఇట్లనుము: "మీరుకూడ నావలనే వినతులగుదురా?"

వారట్లు వినతులగుచో వారు సన్మార్గమున నున్నవారు; అట్లు కాక వారు వ్యతిరేకించినచో నీ విద్యుక్తము ఈ సందేశమును బోధించుట మాత్రమే. దైవభక్తిపరు లెప్పుడును భగవంతుని దృష్టియందు ఉందురు.

మూడవ ఖండము

21. ఎవరు భగవత్సందేశమును నిరాకరించి, అన్యాయముగ ప్రవక్తలను చంపి, న్యాయముగను ధర్మముగను ప్రవర్తింపుడని ప్రబోధించు

♦ 'భగవచ్చిహ్నములను' అని కూడ అర్థము చెప్పవచ్చును.

వారిని వధించి (దుర్మార్గులై ప్రవర్తింతురో) వారికి అత్యంతమగు కఠిన శిక్ష కలుగునని తెలియజెప్పుము.

22. ఇట్టివారేమిచేసినను ఇహమున పరమున కూడ వమ్మే యగును. వారి కెవ్వడును సహాయము చేయరాడు.

23. (ఓ ప్రవక్తా!) భగవద్గ్రంథముయొక్క ఒక భాగము మాత్రమే ప్రసాదింపబడిన వారిస్థితిని గమనించలేదా? * సత్యగ్రంథము వారి సంశయములు తీర్చి సత్యాసత్య విచక్షణము చేయుననియు, అందుచే దానిని స్వీకరించుడనియు వారాహ్వానింపబడిరి. కాని వారిలో కొందరు విముఖులైరి. (భగవద్గ్రంథమును) నిరాకరించిరి.

24. వారిట్లు నిరాకరించుటకు కారణమేమనగా (వారి విశ్వాసమిది. అది వారి మాటలవలన తెలియును.) వారిట్లందురు: "మమ్ములను నరకాగ్ని అంటదు. (ఒకసారి అంటినను) అది యొక పరిమిత కాలమునకే. (కాని శాశ్వతము కాదు.)" స్వకపోల కల్పితమగు వారిగ్రంథమే మతవిషయమున వారినిట్లు మోసగించుచున్నది. ♦

25. కాని నిశ్చయముగ వచ్చు ఆ దినమున వారి నందరిని ఒకచో కూడబెట్టినప్పుడు వారేమిచేయుదురు? నాడెవరుచేసిన కర్మముల ఫలము వారి కివ్వబడును. ఎవ్వరికిని అన్యాయము జరుగదు. (దుష్కృతులకు శిక్షయు, సత్కృతులకు బహుమానమును సరిగా ఇవ్వబడును. అంతేకాని జాతి కుల మత వంశ పక్షపాతముగాని అభిమానముగాని చూపబడదు.)

* మూసాప్రవక్త కివ్వబడిన 'తౌరీతు' గ్రంథమును, ఈసా ప్రవక్తకు ప్రవచితమైన 'ఇంజీల్' గ్రంథమును సర్వసంపూర్ణమగు ధర్మగ్రంథములు కావు. అవి ఆయా కాలములకును జాతులకును గల అవసరములకు అనుగుణముగా ప్రోక్తమైనవి.

♦ వారు తమ అసలు గ్రంథములందు స్వకపోల కల్పితములను చేర్చిరి. అవే వారిని సందేహములందును వివాదములందును పడవేసెను.

26. (ఓ ప్రవక్తా!) ఇట్లనుము: "సమస్త శక్తులకును సమస్తాధికారములకును ప్రభుడవగు ఈశ్వరా! నీకు ప్రియులైనవారికి శక్తిని అధికారము నిత్తువు. నీకిష్టులు కానివారిని అధికారమునుండి తొలగింతువు. నీకు ప్రియులైనవారికి గౌరవమును ప్రసాదింతువు; నీకిష్టులు కానివారిని హీనాతిహీనమగు దశకు తెత్తువు. సర్వ శ్రేయశ్శుభములును నీ హస్తగతములు. సమస్త వస్తువులపైనను నీకు శక్తికలదు.

27. "రాత్రిని పగటియందును, పగటిని రాత్రియందును చొనుపువాడవు నీవే. మృత (పదార్థము) నుండి జీవము నుత్పన్నము చేయువాడవు నీవే. జీవులను మృతులను చేయువాడవు నీవే. నీకిష్టులైన వారికి పరిమితము లేని ధనధాన్యసంపదల నొసగువాడవు నీవే."

28. విశ్వాసవంతులు (సోదరసమానులగు తమతోడి) విశ్వాసవంతులను విడిచి విశ్వాసహీనులను సహాయులుగను స్నేహితులుగను స్వీకరింపదగదు. మీరట్లు (విశ్వాసహీనులను) సహాయులుగ గైకొనుచో భగవత్సహాయ మెద్దియు మీకు కలుగదు. మీరు వారి దౌర్జన్యము నుండి తప్పించుకొనుటకు ఆత్మసంరక్షణమునకై (వారితో సఖ్యము చేసికొనిన చేసికొనుడు) భగవంతుడుకూడ (తన ఆజ్ఞల నుల్లంఘించుట వలన కలుగు దుష్ఫలితములనుండి) భయపెట్టు చున్నాడు (అని మరువకుడు). తుదకు భగవంతునికడకే (అందరును) మరలవలసి యున్నది.

29. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: మీ హృదయములలో నున్నది మీరు వెలిబుచ్చినను దాచియుంచినను భగవంతుడంతయు నెఱుగును. ఆకాశములందును భూమియందును గల సమస్తము నతడెఱుగును. భగవంతునకు సర్వ వస్తువులపైనను అధికారము కలదు.

30. ప్రతిజీవికిని అతడొనర్చిన సమస్త సత్కృతులును, సమస్త దుష్కృతులును అతనిముందు ప్రత్యక్షమగు ఆ దినమునుండి తానె

తయో దూరముగ నుండగోరును. భగవంతుడు (తన ఆజ్ఞల నుల్లంఘించుటవలన కలుగు దుష్ఫలితములనుండి) భయపెట్టు చున్నాడు. (ఈభయపెట్టుటయు మీయందనుగ్రహముచేతనే. ఎందుకన) తన భక్తులయెడ భగవంతుడు పూర్ణానుగ్రహము గలవాడు.

నాలుగవ ఖండము

31. (ఓ ప్రవక్తా! వారితో) నిట్లనుము: "మీరు భగవంతుని ప్రేమించుచో నన్ననుసరింపుడు. భగవంతుడు మిమ్ములను ప్రేమించి మీ పాపములను క్షమించును. భగవంతుడు మహాక్షమి. కరుణానిధి,

32. (ఓ ప్రవక్తా!) వారితో నిట్లనుము: "భగవంతునకును అతని ప్రవక్తకును విధేయులు కండు." అట్లుచేయక వారు ధిక్కరించి విముఖులైనచో (జ్ఞాపకముంచుకొనుడు.) అట్టివారిని భగవంతుడు ప్రేమింపడు.

33. భగవంతుడు ఆదమునకును, నోహాకును, ఇబ్రాహీము వంశమునకును, ఇమ్రాను వంశమునకును ప్రపంచ మంతటియందును ఔత్కృష్ట్యమును ప్రసాదించెను.

34. ఒకరినుండి ఒకరు ఉద్భవమైన వీరందరును ఒకే జాతికి చెందినవారు. భగవంతుడు (ప్రార్థనముల) వినువాడు; సర్వము తెలిసినవాడు.

35. ఇమ్రాన్ భార్య * ఇట్లు ప్రార్థించెను: "ప్రభూ! నా గర్భముననున్న శిశువునకు (సంసార బాధ్యతలనుండి) స్వేచ్ఛనొసగి నీ ప్రత్యేక సేవకై అర్పణము చేయుచున్నాను. నాకై దీనిని స్వీకరింపుము. నీవు సమస్తమును వినువాడవు. సర్వజ్ఞుడవు.

36. ఆమె ప్రసవమైనపిదప ఇట్లు విన్నవించెను: "ప్రభూ! నేను స్త్రీ శిశువును కంటిని. (ఇక నేనేమిచేయుదును.)" పుట్టినదానిని

* "ఇమ్రాన్ వంశపుస్త్రీ" అనియు అర్థము చెప్పవచ్చును.

గురించి భగవంతుడు బాగుగ నెఱుగును. (శిశువు స్త్రీ యైనప్పటికిని మహిమాఢ్య కాగలదై యుండెను. కాని ఆమెతల్లి పురుషశిశువును భగవంతునకు కైంకర్యము చేయగోరి యుండగా స్త్రీ శిశువు జన్మించెనే యని వాపోయెను.) (నేను వాంఛించిన) కుమారుడు ఈ కుమార్తె వంటివాడు కాడు. (ఐనను) నేనీ శిశువునకు 'మర్యమ్' అని పేరుపెట్టి, ఈమెను ఈమె సంతతిని నీ సంరక్షణక్రింద కైంకర్యము చేయుచున్నాను. ధిక్కృతుడగు సైతానునుండి వీరు నీచే రక్షింప బడుదురుగాక !

37. ఆమె ప్రభువు ఆ శిశువును తన కృపా సంపూర్ణతతో స్వీకరించెను. ఆమె బాగుగా ప్రవర్ధమాన మయ్యెను. జకరియా రక్షణక్రింద కామె ఇవ్వబడెను. అతడు ఆమెను చూచుటకై ఆమె (దైవధ్యాన మగ్నయైయుండు) గదిని ఎప్పుడు ప్రవేశించినను ఆమెకై ఆహారము సిద్ధముగ నుండుటను చూచుచుండెను. ఆమెను అతడిట్లడిగెను: "మర్యమ్ ! ఈ ఆహారము నీ కెక్కడ నుండి వచ్చుచుండును?" ఆమె దాని కిట్లనెను : "ప్రభువు కడనుండి. ఎందుకన తనకిష్టులైన వారికి భగవంతుడు పరిమితములేని ఆహారము నిచ్చును."

38. అక్కడ జకరియా భగవంతునిట్లు ప్రార్థించెను : "ప్రభూ (మర్యమ్‌వంటి) పవిత్రమగు సంతతిని నాకు ప్రసాదింపుము. నీవు మా మొరల నాలించువాడవు."

39. అతడిట్లు ఆగదియందు నిలువబడి ప్రార్థించుచుండగా దేవదూత లతని నిట్లు సంబోధించిరి: "నీకు యహాయా అను సుపుత్రుడు కాగలడని భగవంతుడు శుభవార్తను పంపుచున్నాడు. అతడు భగవద్వాక్కు * (సత్యము) ను నిరూపించును. అతడు నాయకుడును, జితేంద్రియుడును, పవిత్రచరిత్రులలో ఒక ప్రవక్తయునై యుండును.

* "ఈసాప్రవక్త" అనియు దీని అర్థమును కొందరు వ్రాసిరి.

40. (దానికి జకరియా) ఇట్లనెను: "ప్రభూ! నేను వృద్ధుడను; నా భార్య వంధ్య : నాకు కుమారుడెట్లు కల్గును?"

దానికి భగవంతుడిట్లు సెలవిచ్చెను: "ఇట్లే భగవంతుడు తన ఇచ్ఛవచ్చినట్లు చేయును."

41. జకరియా ఇట్లు విన్నవించెను: "ప్రభూ! ఈ విషయమున నాకేదైన ఒక చిహ్నమును ప్రసాదింపుము."

దానికి భగవంతుడిట్లు సెలవిచ్చెను : "నీవు మూడు దినముల వరకు మౌనవ్రతమూనుము. (అవసరమైనచో) సంజ్ఞలు మాత్రము చేయుచుండుము. భగవన్నామస్మరణమునందు మగ్నుడవై యుండుము. ప్రాతస్సంధ్యలయందు భగవంతుని మహత్తును కొనియాడుచుండుము."

ఐదవ ఖండము

42. మర్యమ్‌తో దేవదూత లిట్లనిరి : "ఓ మర్యమ్! నిన్ను భగవంతుడు ఎన్నుకొని, పావిత్ర్యము నొసగి, ప్రపంచము నందలి స్త్రీలలో ఔత్కృష్ట్యమును ప్రసాదించెను.

43. "ఓ మర్యమ్! ఇతర భక్తులతో నీవును భగవంతునకు సాష్టాంగపడుము. వినయ వినమితవగుము. ఇతర భక్తులతో పాటు శ్రద్ధాభక్తులతో భగవద్ధ్యానమును మగ్నవై యుండుము.

44. (ఓ ప్రవక్తా!) నీకీ ప్రవచనముద్వారా వెలువరచుచున్న ఈ విషయములు గుప్తమైనవి. (ఏసుప్రవక్తతల్లి మర్యమునుతీసుకొని ప్రార్థనాలయమునకు వెళ్ళినప్పుడు అక్కడి పురోహితులు) మర్యమ్ ఎవరి వంతుకు రావలెనో పరిష్కరించుటకు బాణములతో చీట్లువేసినపుడు నీవక్కడ లేవుకదా? తర్వాత వారు (మర్యమునకు రక్షకులగువిషయములో) పరస్పరము వివాదపడినప్పుడుకూడ నీవక్కడలేవు.

45. దేవదూతలు (మర్యముతో) ఇట్లనిరి : "ఓ మర్యమ్! (నీకొక కుమారుడు కల్గును) భగవంతుడు తన మహద్వాక్కు ద్వారా శుభవార్తను పంపుచున్నాడు. మర్యమ్ కుమారుడైన 'ఈసామసీః' అని అతడు పిలువబడును. అతని కిహపర లోకములందుకూడ గౌరవస్థానము లభించును. భగవత్సాన్నిధ్య భాగ్యము గన్నవారిలో నతడొకడై యుండును.

46. అతడు బాల్యమునను, పెద్దవయస్సునను (నడివయస్సునను) ప్రజలతో మాట్లాడును (ప్రబోధించును). అతడు పుణ్యులలో ఒకడై ఉండును.

47. అప్పుడు (మర్యమ్) ఇట్లు విన్నవించెను : "నా ప్రభూ! నన్నే పురుషుడు నింతవరకు స్పృశింపలేదు; నాకు పుత్రుడెట్లుకల్గును?",

(దానికి భగవంతుడు) ఇట్లనెను : "భగవంతు డిచ్ఛించినచో అట్లే సృష్టించును. అతడేదైనను చేయగోరినప్పుడు (కేవలము) 'అగుము' అని (మాత్రము) చెప్పును. అది (తత్ప్రకారము) వెంటనే అగుచున్నది.

48. (దేవదూతలు మరియు నిట్లనిరి:) 'భగవంతుడు అతనికి (నీ కుమారునకు) భగవద్గ్రంథము ప్రసాదించును; విజ్ఞానమును (ప్రసాదించును) తౌరీత్ ఇంజీల్ గ్రంథవిజ్ఞానమును గరపును.'

49. ఇస్రాయీలీయుల కొరకై అతనిని ప్రవక్తగనియమించును. (నితడీసందేశముసచ్చును.)

"భగవచ్చిహ్నముల గొని నేను మీ భగవంతునికడనుండి వచ్చితిని. మీకొఱకు నేను పక్షి ఆకృతిగల ఒక మట్టిబొమ్మను తయారుచేసి దానిని ప్రోక్షింతును. అది భగవదాజ్ఞచే పక్షియై పోగలదు. మఱియు భగవదాజ్ఞచే అంధులకు దృష్టిని, కుష్ఠురోగుల కారోగ్యమును కలుగజేతును. మృతులకు భగవదాజ్ఞచే జీవచైతన్యము నొసగుదును.

మీరేమి తినునదియు, మీయిండ్లలో పదిభద్రపరచుకొని ఉంచు కొన్నదియు మీకు చెప్పగలను. మీరు విశ్వసించుచో ఈ మహాత్మ్యము లందు భగవచ్చిహ్నము కలదు.

50. "నాకు ముందువచ్చిన తౌరీతు గ్రంథమును నిర్ధారించుటకై (నేనువచ్చితిని) మీకై నిషేధింపబడిన కొన్నివస్తువులను విధివిహితముల నొనర్చుటకు నేను మీ భగవంతుని చిహ్నమును గైకొని మీకడకు వచ్చితిని. అందుచే భగవంతునియెడ భక్తి ప్రపత్తులుకలిగియుండుడు; నన్ను ననుసరింపుడు.

51. "భగవంతుడే మీకును నాకును ప్రభువు, పరిపోషకుడు. అందుచేభగవంతునే ఆరాధింపుడు. ఇదియే(భగవంతుని)ఋజుమార్గము."

52. వారిలో అవిశ్వాసమును గాంచి ఈసా వారి నుద్దేశించి ఇట్లనెను : "నాకీ భగవత్కార్యమున సహాయపడగల్గువారెవ్వరు?" ఆయన అనుయాయులగు కొందరిట్లనిరి: "మేము భగవంతుని (కార్యమున) సాహాయ్యులమై యుండగలవారము. మేము భగవంతునియందు విశ్వసింతుము. నీసాక్షిగా మేము భగవంతునకు సర్వమును అర్పించిన వారమగుచున్నాము*.

53. "మాప్రభూ! నీవు వెలువరచిన సత్యమును మేము విశ్వసించుచున్నాము. మేము నీప్రవక్త (యగు ఏసు) ననుసరింతుము. మమ్ముకూడ సత్యమును ధృవపరచువారిలో గణింపుము."

54. కాని (విశ్వాసహీనులగు యూదులు ఏసుకు వ్యతిరేకముగ) కుట్రలు పన్నిరి. భగవంతుడుకూడ రహస్యోపాయములకు తగు ప్రతీకార మొనర్చెను. ఉపాయశాలులలో భగవంతుడే ఘనుడు.

* "ముస్లిమూన్" "ముస్లిములు" అని అరబీమూలము.

ఆరవ ఖండము

55. (ఏసు శత్రువులకు పట్టుబడి ఆందోళిత మనస్కుడై యుండి నప్పుడు) భగవంతుడిట్లు సెలవిచ్చెను: "ఓ ఈసా! * నీవు (సహజముగనే మరణించునట్లు చేయుదును. (నీ శత్రువులచే జిక్కి నీవు బలవన్మరణము నొందకుండ చేయుదును). (అంతేకాదు) నాసమక్షమున నీకుచ్చస్థితిని ప్రసాదింతును; నీ శత్రువుల అపవాదములనుండి నిన్ను పరిశుద్ధునొనర్తును. నిన్ననుసరించినవారికి నీశత్రువులపై ప్రళయకాలము వరకు ఆధిక్యము నిత్తును. అప్పుడు మీరందరును నాసమక్షమునకే మరలివత్తురు. మీరు పరస్పరము వివాదపడుచున్న విషయములను ఆనాడు నేను పరిష్కరింతును.౫౫

56. "ఎవరు విశ్వాసమార్గమును నిరాకరింతురో వారిని ఇహమున పరమున కూడ మిక్కిలి కఠినముగ శిక్షింతును. వారి కెవ్వరును సహాయము చేయరారు."

57. "ఎవరు విశ్వాసమార్గముననుండి సత్కృతుల నొనర్తురో వారిని భగవంతుడు పూర్తిగ బహూకరించును. దుర్మార్గులను భగవంతుడు ప్రేమింపడు."

58. (ఓప్రవక్తా!) నీకు వినిపించుచున్న దిదంతయు విజ్ఞానసందేశము; భగవత్ప్రోక్తము.

59. భగవంతునికడ ఈసాకు తార్కాణము ఆదమ్. (భగవంతుడు) ఆదమును మట్టితో సృష్టించి "అగుము" అని మాత్రమనెను. అంతట నతడాయెను.౫౯

* 'ఏసు' లేక "జీసస్ క్రైస్ట్" అనునామము అరబీలో 'ఈసా' అని వ్రాయబడును. తెలుగులో యెక్కువగ 'ఏసు' అనియు 'ఏసుక్రీస్తు' యనియు మనము వాడుచున్నాము.

60. సత్యము భగవంతునికడనుండియే వచ్చును. అందుచే సంశయాత్ములలో నొకడవు కాకుము.

61. ఇట్లు సంపూర్ణ విజ్ఞానము మీకు లభించిన పిదప కూడ ఎవ్వరైనను మీతో (ఏసు మానవమాత్రుడను) ఈ విషయమున వివాదపడినచో వారితో నిట్లనుము: (ఏసు మానవుడే ననుటకు నాకు నిస్సందేహమగు నిశ్చయజ్ఞానము కలదు. మీరుకూడ అతడు భగవంతుడను నిశ్చయవిశ్వాసము కలవారైనచో) రండు; (ఇట్లు మన వివాదమును పరిష్కరించుకొందము.) మా పుత్రులు, మీపుత్రులు, మాస్త్రీలు, మీస్త్రీలు, మేము,మీరు ఇట్లుమనమందరము(ఒక మైదానమున)సమావేశమగుదము. అట్లు కూడి భగవంతుని సమక్షమున 'అనృతవాదులు శాపహతు లగుదురుగాక!' యని ప్రార్థింతము."౬౧

62. ఓ ప్రవక్తా! ఈ చెప్పబడినదంతయు నిస్సంశయముగ సత్యకథనము. అల్లాః తప్ప ఆరాధింపదగిన భగవంతుడు మరొకడు లేడు. భగవంతుడు అందరికంటె అధికుడు. ప్రజ్ఞానిధి.

63. (వీరు పరిష్కారమున కీ పద్ధతి నంగీకరింపక) వెనుదీయుచో భగవంతుడు నిశ్చయముగ తగవులమారులను బాగుగ నెఱుగును (అని వారితో చెప్పుము.)

ఏడవ ఖండము

64. (ఓ ప్రవక్తా! వారితోనిట్లు) చెప్పుము: "భగవద్గ్రంథము లివ్వబడిన ప్రజలారా! (ఓ క్రైస్తవులారా! యూదులారా!) (వ్యర్థవాదముల మానుడు.) మీకును మాకును సాదృశ్యము గలట్టి (యు) (మీరును మేమును అంగీకరించినట్టివియు నగు మూలసిద్ధాంతముల) వైపునకు రండు: (అవి) భగవంతునితప్ప మరెవ్వరిని ఆరాధింపము; (భగవంతునకు) సమానులను కల్పింపము. మాలో కొందరియెడ (భగవదర్హమగు) భక్తి

ప్రపత్తులతో ప్రవర్తించుచు భగవంతుని విడిచి వారిని పోషకులుగను ప్రభువులుగను భావింపము." (ఈ మూలసిద్ధాంతములను సైతము నిరాకరించి) వీరు మొగము త్రిప్పుకొనినచో వారితో నిట్లు చెప్పుము: "మీరే సాక్షులై యుండుడు. (సత్యము నిరాకరించినవారు మీరు;) భగవంతునకు మాత్రమే లొంగినవారము మేము. (స్వీయమనఃకల్పితులగు తుచ్ఛదేవతలకును, తోడి మానవులకును, వారెంతటి మహాత్ములైనను శిరస్సు వంచము.)"[౭౦]

65. భగవద్గ్రంథమును పొందిన (ఓ క్రైస్తవ యూదులారా!) ఇబ్రాహీమ్ (యూదుల మతస్థుడనియు, కాదు, క్రైస్తవ మతస్థుడనియు) ఆయనను గుఱించి మీరేల వివాద పడెదరు? యూద క్రైస్తవ మతముల మూలగ్రంథములగు ఇన్జీల్ తౌరీత్ గ్రంథము లప్పటికి వెలువడనే లేదుకదా? అవి (ఇబ్రాహీమ్ ప్రవక్త) తర్వాత (ఎంతోకాలమునకు) కదా వెలువడినవి? (మీమతములే అప్పుడు లేనప్పుడు ఇబ్రాహీమ్ ప్రవక్త మీ రెండు మతములందేదో ఒకమతము ననుసరించినవా డెట్లు కాగలడు?) మీరు (ఈపాటి) గ్రహింపజాలరా?

66. మీకు కొద్దియో గొప్పయో తెలిసియున్న విషయములను గూర్చి సైతము మీరు వివాదపడువారు. అట్టిచో మీకేమియు తెలియని విషయములగూర్చి మీరేల వివాదపడెదరు? సర్వము నెఱుగువాడు భగవంతుడు. మీరేమియు నెఱుగనివారు.

67. ఇబ్రాహీమ్ యూదుడును కాడు, క్రైస్తవుడును కాడు. అతడు సత్యమార్గ ప్రవర్తకుడు; ముస్లిమ్ (భగవదిచ్ఛకు శిరస్సును వంచినవాడు.) అతడు బహుదైవతారాధకుడు కాడు.[౭౧]

68. (జ్ఞాపకముంచుకొనుడు) మానవులలో ఎవరు ఇబ్రాహీమ్ మార్గము ననుసరింతురో వారే నిస్సందేహముగ అతనికి సన్నిహితులు.

ఇబ్రాహీమ్ భగవత్ప్రవక్త. అతని మార్గానుయాయులు విశ్వాసవంతులు. నిశ్చయముగ విశ్వాసవంతులను భగవంతుడు రక్షించును.

69. భగవద్గ్రంథము పొందిన (క్రైస్తవ యూదులలో) కొందరు మిమ్ములను సత్యమార్గమునుండి తప్పింపగోరుదురు. కాని (వారు మిమ్ములను చెడగొట్టగోరి) తామే పతితులగుదురు. ఐనను వారు గ్రహింపరు.

70. భగవద్గ్రంథమును పొందిన (ఓ క్రైస్తవ యూదులారా!) మీకు సాక్షులైయున్న ఈ భగవచ్చిహ్నములనేమి మీరేల నిరాకరింతురు?

71. భగవద్గ్రంథమును పొందిన (ఓ క్రైస్తవ యూదులారా!) తెలిసియుండియు మీరు సత్యమును అసత్యముతో కప్పి సత్యము నేల ప్రచ్ఛన్న మొనర్తురు?

ఎనిమిదవ ఖండము

72. (చూడుడు) భగవద్గ్రంథ మివ్వబడిన వారిలో (క్రైస్తవ యూదులలో) ఒక పక్షమువారు (తమ అనుయాయులతో) ఇట్లందురు: (విశ్వాసవంతుల మోసగించుటకై) (మీరిట్లు చేయుడు): ఉదయమున వారి భగవద్గ్రంథముయెడ విశ్వాసము చూపి సాయంకాలమున దానిని నిరాకరింపుడు. (మీరు నిరాకరించుటను చూచి ఇస్లామును విడిచి విశ్వాసవంతులగు) వారుకూడ మరలి పోవచ్చును."

73. (తమ అనుయాయులతో మరియు వారిట్లందురు:) "వారు మీ మతము ననుసరించు వరకు వారిని నమ్మకుడు."

(ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "నిజమైన సన్మార్గము భగవత్ప్రతిపాదితమగు మార్గము."

(వారు తమ అనుయాయులతో ఇట్లనుచున్నారు:) "మీకు ప్రోక్తమైన ధర్మమువంటి ధర్మము మరెవ్వరికిని ప్రోక్తమైనదని మీరొప్పుకొన

కుడు. మీకు వ్యతిరేకముగ భగవంతుని సముఖమున ఎవ్వరేది చెప్పినను చెల్లునని ఒప్పుకొనకుడు."

(ఓ ప్రవక్తా! వారితోనిట్లు) చెప్పుము: (మీరీ దంబము తేలపల్కెదరు?) సమస్త అనుగ్రహములను ప్రసాదించువాడు భగవంతుడు (కదా!) తన ఇచ్ఛవచ్చిన వారి కతడనుగ్రహించును. భగవంతుడు అందరి యెడలను జాగ్రత వహించువాడు. (తన అనుగ్రహమునకు ఎవరు పాత్రులో, ఎవరనర్హులో అతడే నిర్ణయించును.) అతడు సమస్తము నెఱిగినవాడు.

74. తన మహదనుగ్రహము కురిపించుటకై తన ఇచ్ఛవచ్చినవారి నతడెన్నుకొనుచున్నాడు. భగవంతుని అనుగ్రహము మహా మహిమోపేతము.

75. భగవద్గ్రంథమును పొందిన (క్రైస్తవ యూదులలో) కొందరు (న్యాయబుద్ధి కలవారున్నారు.) వారికడ మీరు వెండి బంగారు రాసులను సైతము భద్రపరుప పెట్టినచో మీకవసరము వచ్చినప్పుడే వారిచ్చివైతురు. వారిలో మరికొందరికడ మీరొక్క దీనారము దాచిపెట్టుకొన్నను గొంతుపై నిలబడినగాని వారు మీకు తిరిగి ఇవ్వరు.[౭౨]

(వీరీ దుర్వ్యాపారము) ఎందుకు చేయుదురనగా "విశ్వాస హీనులతో వ్యవహరించునప్పుడు ధర్మయుతముగ ప్రవర్తించుట మాకు విధివిహితము కాదు" అని వారందురు. కాని వారు భగవంతుని యెడ అపవాదు కల్పించి అబద్ధము చెప్పుచున్నారు. నిజమేదియో వారికి తెలియక పోలేదు.[౭౩]

76. ఎవరు తమ వాగ్దానములను తప్పక పూర్తిచేతురో, ఎవరు సత్ప్రవర్తకులో (అట్టివారే జాతికి ఏ మతమునకు చెందినవారైనను సరే వారిని భగవంతుడు ప్రేమించును,) సత్ప్రవర్తకులనే భగవంతుడు ప్రేమించును.

77. ఎవరు భగవంతుని ఒడంబడికను, తమ వాగ్దానములను అతిస్వల్పమూల్యమునకైనను అమ్మివైతురో వారికి పరలోక (సౌఖ్యములందెట్టి) భాగము లభింపదు. తుదిదినమున భగవంతుడు వారితో సంభాషింపడు; వారిని (దయాదృష్టితో) చూడడు; వారి (పాపములను తుడిచివైచి) పరిశుద్ధులనొనర్పడు. వారికి ఘోరశిక్ష కలుగును.[౭౪]

78. క్రైస్తవ యూదులలో (వారి పండితులు) కొందరు కలరు. వారు భగవద్గ్రంథము చదువుచు దానిలో ప్రక్షిప్తములను కల్పించి (అర్థమును తారుమారొనర్తురు. వారు చదువుచున్నది) భగవద్గ్రంథమందలి ఒక భాగమనియే మీకు భ్రమ కల్గునట్లు చేతురు. కాని అది భగవద్గ్రంథమందలి భాగము కాదు. వారిట్లందురు: "ఇదంతయు భగవత్ప్రోక్తము." కాని అది భగవత్ప్రోక్తమెంతమాత్రము కాదు. వారు భగవంతునిగూర్చి అబద్ధములు చెప్పుచున్నారు. వారబద్ధము చెప్పుచున్నదియు వారికి తెలియును.[౭౫]

79. (మానవబోధకై) భగవంతు డొకమానవునకు భగవద్గ్రంథమును, అధికారమును, ప్రవక్తృత్వమును ప్రసాదించినప్పుడా మానవుడు ప్రజలతో "భగవంతుని విడిచి నన్ను పూజింపుడు" అని చెప్పుట సాధ్యముకాదు. తద్వ్యతిరేకముగ (అతడిట్లనును:) "నిజమైన సర్వసంపోషకుడగు భగవంతునే మీరారాధింపుడు. ఎందుకనగా మీరే భగవద్గ్రంథమును బోధించుచున్నారు. దాని పఠన పాఠములయందు నిమగ్నులైయున్నారు."[౭౬]

80. (పవిత్రుడైనవాడు) ఎవడును దేవతలను, ప్రవక్తలను దైవతములుగ భావించుడని ఆజ్ఞాపింపడు. ఏమి! మీరు విశ్వాసులై (భగవదాజ్ఞలకు శిరస్సులను వంచిన) పిదప మిమ్ములనతడవిశ్వాసమార్గమున నడపించునా?

తొమ్మిదవ ఖండము

81. చూడుడు! భగవంతుడు (ఇస్రాయీలీయులనుండి) ప్రవక్తలను గూర్చి ♦ ఇట్టి ఒడంబడిక గైకొనెను :

"మీకొక గ్రంథమును, విజ్ఞానమును ప్రసాదింతును. తర్వాత మీదగ్గర నున్నదానిని స్థిరపరచుచు మీకడకొక ప్రవక్త వచ్చును. మీరతనియందు విశ్వసించి అతనికి చేయూత నొసగుడు."

(తర్వాత) భగవంతుడిట్లు సెలవిచ్చెను: "మీరు దీని కంగీకరించి ఈ ఒడంబడికకు బద్ధులై యుందురా?"

వారంద రిట్లనిరి: "మే మొప్పుకొంటిమి."

అప్పుడు భగవంతుడిట్లు సెలవిచ్చెను: "అట్లైనచో మీరు సాక్షులై యుండుడు. నేను కూడ మీతో సాక్షినై యుందును."

82. దీని తరువాత కూడ ఎవ్వరైనను సత్యమార్గమును నిరాకరించినచో వారు బుద్ధిహీనులగు దుర్మార్గులు.

83. భగవంతుని మతము విడిచి వీరు వేరొక మతము వెతకగోరెదరా? వాస్తవమునకు భూమ్యాకాశములందలి సమస్త జీవులు ఇష్టమున్నను, ఇష్టము లేకపోయినను భగవంతుని నియమములకు లొంగి యున్నవికదా? తుదకు అందరును భగవంతుని సమక్షమునకు మరల వలసియే యున్నది.

84. (ఓప్రవక్తా! వారితోనిట్లు) చెప్పుము: "మేము భగవంతుని యందును, మాకు ప్రోక్తమైన ఈ సత్యమునందును, ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్‌హాక్, యాకూబు, యాకూబ్ సంతతియందలి (ప్రవక్తల) యందును; మూసాకును, ఈసాకును, భగవంతుడంపిన

♦ 'ప్రవక్తలద్వారా' అనియు అర్థము చెప్పవచ్చును.

ఇతరప్రవక్తలకును ఈయబడిన దాని (గ్రంథముల) యందును విశ్వసింతుము. వారిని భేదభావముతో చూడక (సమానగౌరవదృష్టితో చూచెదను.) (ఒకరినిగౌరవించి ఒకరిని ధిక్కరింపము). మేము భగవంతునకే వినతుల మగుదుము.

85. (ఎవరు, ఎప్పుడు, ఎక్కడ చెప్పినను సత్యమైనచో దానిని స్వీకరించి తత్ప్రవక్తను గౌరవింప బోధించు) ఇస్లాం మతమును ఎవడు విడనాడ గోరి మరొక మతమును వాంఛించునో అట్టివాని మతమును భగవంతుడు స్వీకరింపడు. అట్టివారు తుదిదినమున సమస్త పారలౌకిక ఫలమును కోల్పోయినవారిలో ఉందురు.

86. ఒకసారి విశ్వాసమార్గము ననుసరించి, ప్రవక్త సత్యప్రవక్తయేయని అతనికి వచ్చిన స్పష్టచిహ్నముల (కన్నులార) చూచి, సాక్ష్యమిచ్చి, విశ్వాసమును విడనాడువారికి భగవంతు డెట్లు మార్గదర్శి కాగలడు? అధర్మ ప్రవర్తకులకు భగవంతుడు మార్గదర్శిత్వ మొనర్పడు. (అది భగవంతుని నియమము.)

87. భగవంతుని యొక్కయు, దేవదూతల యొక్కయు సమస్త మానవకోటి యొక్కయు శాపములే వారికి బహుమానము.

88. వారు (ఆ స్థితి) యందే నిరంతరముందురు. వారి శిక్ష యెంతమాత్రమును తగ్గదు. వారి కెన్నడును విశ్రాంతి లభింపదు.

89. ఐతే ఎవ రీస్థితియందుకూడ పశ్చాత్తప్తులై, తమదోషములను సవరించుకొందురో (వారిని భగవంతుడు కరుణతో క్షమించును.) భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

90. ఎవరు ఒక్కసారి విశ్వాసమార్గము ననుసరించి, తర్వాత సత్యమును నిరాకరించి, విశ్వాసము ధిక్కరించుటయందు క్రమక్రమముగ ప్రబలు లగుదురో వారి పశ్చాత్తాపము సైతము స్వీకరింపబడదు.

ఎందుకనగా వారు (ఉద్దేశపూర్వకముగ) దుష్పథముల ననుసరించినవారు.

91. ఎవరు విశ్వాసమార్గమును ధిక్కరించి, ఆ స్థితియందే మరతురో తమ (పాపమున) కు ప్రాయశ్చిత్తముగ భూమియందలి బంగారము నంతను ఇచ్చియు ముక్తినందలేరు. ఘోరశిక్ష వారికై వేచియున్నది. వారి కెవ్వరును సహాయులు లభింపరు.

నాల్గవ భాగము

పదవ ఖండము

92. మీకు ప్రియమైన వస్తువులను భగవన్మార్గమున వ్యయపెట్టినగాని మీకు సుకృతి లభింపదు. మీరు వ్యయపరుచుచున్న దానినంతటిని నిశ్చయముగ భగవంతు డెఱుగును.

93. ఇస్రాయీలీయులకు (సాధారణముగ తిండికై ఉపయోగించు) ఆహారపదార్థము లన్నియు భోజ్యములే యైయుండెను. కాని ఇస్రాయీలీయులు * తౌరీత్ గ్రంథము (తమకు) ప్రోక్తము కాకపూర్వము తమపై తాము కొన్ని ఆహారపదార్థముల విషయములో నిషేధమును విధించుకొనిరి. (కాని భగవంతుడు వాటిని నిషేధించి యుండలేదు. ఓ ప్రవక్తా! ఈ విషయమున యూదులు నీతో వివాదము చేసినచో వారితో) ఇట్లనుము: "మీరు నిజము చెప్పుచున్నా మనుచో తౌరీత్ గ్రంథమును తీసుకొని

* 'ఇస్రాయీల్' అనియు అర్థము చెప్పవచ్చును. అప్పుడు "తౌరీత్ గ్రంథము ప్రోక్తము కాకపూర్వము ఇస్రాయీల్ తనపై తాను కొన్ని ఆహారపదార్థముల విషయములో నిషేధమును విధించుకొనెను" అని వాక్యము చదువవలెను.

రండు. దానిని విప్పి చదువుడు. (మీరు నిషేధము లనుకొనుచున్న వస్తువులు అందు నిషేధింపబడినవో లేదో చూడుడు.)''♦

94. దీని తర్వాతకూడ ఎవరు ఒక అబద్ధమును సృష్టించి దానిని దేవునకు ఆపాదింతురో వారు నిశ్చయముగ అధర్మపరులు.

95. (ఓ ప్రవక్తా! వారితో) ఇట్లనుము: "భగవంతుడు సత్యమును ప్రవచించెను. (మీ మనస్సులలో సత్యముయెడ గౌరవము ఏమాత్రముండినను) మీరు సన్మార్గ ప్రవర్తకుడగు ఇబ్రాహీమ్ ప్రవక్తమార్గము ననుసరింపుడు. అతడు బహు దైవతారాధకుడు కాడు.

96. నిశ్చయముగ (భగవదారాధనమునకై కేంద్రముగ) మొట్టమొదట మానవజాతికై ఏర్పరచిన ప్రార్థనాలయము మక్కాయందలి (కాబా ప్రార్థనభవనము). ఇది పవిత్రమైనది. సర్వప్రపంచమునకు సన్మార్గము చూపునది.

97. ఇందు స్పష్టమగు చిహ్నములు కలవు: ఇబ్రాహీమ్ (నిలువబడి ప్రార్థన సలిపిన) స్థలము. (ఇది నాటినుండి నేటివరకు శిథిలము కాక ఎప్పటియట్లున్నది.) దీనిని ఎవరు ప్రవేశింతురో వారు సురక్షితులై యుందురు. (అందుచే) అక్కడకు వెళ్ళగలిగిన శక్తిగల ప్రతివ్యక్తికిని భగవదిష్టార్థము ఆ ప్రార్థనాలయమును దర్శించుట విధివిహితమైనదిగా నిర్ణయింపబడినది. దీని తర్వాత ఎవరైనను (ఈ స్థలముయొక్క పావిత్ర్యమును గణించక) దీనిని నిరాకరించినచో (జ్ఞాపకముంచుకొనుడు) భగవంతున కభిలషితార్థము లేవియు లేవు. ప్రపంచములో అతడు వాంఛించునదేదియు లేదు.

♦ ఇది ఒక ఇస్రాయీలీయుల (Jews) కేకాక మనదేశపు బ్రాహ్మణులకును చెల్లును. వారవలెనే వీరుకూడ వేదాది ధర్మగ్రంథములందు లేని పెక్కు నిషేధములను ఆహార విషయమునందు కల్పించుకొనిరి.

98. (ఓ ప్రవక్తా! వారితో) ఇట్లనుము : "భగవత్ప్రోక్తమగు గ్రంథ మివ్వబడిన ఓ ప్రజలారా! మీరు (తెలిసియుండియు) భగవంతుని ఈ చిహ్నముల నేల నిరాకరింతురు? మీరు చేయుచున్న దంతటికిని భగవంతుడు సాక్షియై యున్నాడు."

99. (మరియు) ఇట్లనుము: భగవత్ప్రోక్తమగు గ్రంథముగల ఓ ప్రజలారా! అల్లాః యొక్క ధర్మమార్గమున నడువగోరు వానిని మీ రేల ఆటంకపరతురు? మీరు సాక్ష్యులై యుండియు వారినేల వక్రమార్గమున నడిపింప గోరెదరు? మీరు చేయుచున్న దానికి భగవంతుడు ఏమఱి లేడు."

100. ఓ విశ్వాసవంతులారా! భగవత్ప్రోక్తమగు గ్రంథము గలవారిలో ఒకపక్షము వారిమాట వినినచో విశ్వాసవంతులైన మిమ్ముల వారు ధర్మమార్గమునుండి తప్పించివైతురు.

101. భగవత్ప్రోక్తమగు ఈ వచనములు వినిపింప బడుచున్నవి మీ కేకదా? ప్రవక్తకూడ మీమధ్యనే ఉన్నాడుకదా? మరి మీ రెట్లు విశ్వాసమును నిరాకరింతురు? ఎవరు దృఢనిశ్చయులై భగవంతు ననుసరింతురో వారికి తిన్నని మార్గము తప్పక లభించును.

పదునొకండవ ఖండము

102. ఓ విశ్వాసవంతులారా! భగవంతునియెడ ఉచితమగురీతిని భయభక్తులతో ప్రవర్తింపుడు. ముస్లిములు కాకుండ మరణింపకుడు.

103. (చూడుడు) అందరు కలసి ఐకమత్యముతో భగవద్రజ్జువు * దృఢముగ పట్టుకొనుడు. (మీలోమీరు విభేదములు కల్పించుకొని) విడివిడిగా చెదరిపోకుడు. మీకు భగవంతుడు చూపిన అనుగ్రహమును కృతజ్ఞతతో స్మరింపుడు: మీరు (ఒకరికొకరు) శత్రువులై యుండిరి. భగవంతుడు మీ హృదయములను కలిపి తన అనుగ్రహముచే మిమ్ముల సోదరుల నొనర్చెను. (మీస్థితి ఇట్లుండెను:) మీ రొక అగ్నిగుండపు అంచుపై నుండిరి. (కొంచెము కాలుజారిన మీరందు పడియుండెడివారు.) భగవంతుడు మిమ్ము దానినుండి రక్షించెను. దీనివలన మీరు సన్మార్గము ననుసరింతురని ఈవిధముగ అల్లాః తన సందేశమును మీకొఱకు విస్పష్ట మొనర్చును.

104. మీలో సన్మార్గమునకు పిలుచువారును, మంచిని విధించువారును, చెడుగును నిషేధించువారును కొందరి ఒకసంఘ ముండవలెను. ఇట్టివారికి సంపూర్ణమగు సాఫల్యము కల్గును.

105. (చూడుడు) భగవద్గ్రంథముయొక్క విస్పష్ట బోధ కల్గినప్పటికిని పరస్పర విభేదములు కల్పించుకొని (ఐకమత్యముతో సత్యమగు భగవన్మార్గమున కూడియుండుటకు బదులు) వివాదపడి (చీలిపోయిన) వారివలె కాకుడు. ఇట్టివారికి ఘోరశిక్ష కలుగును.

106. ఆ (ప్రళయ) దినమునాడు ఎందరి ముఖములో (సత్కృతి వలన కలిగిన) శుభ్ర (తేజస్సుచే విభ్రాజమాన) మగును. ఎందరి ముఖములో (పాపపంకిలముచే) నల్లపడును. నల్లపడిన ముఖములు కలవారు (ఇట్లు ప్రశ్నింపబడుదురు:) "ఒకసారి విశ్వసించి మీరు తిరిగి అవిశ్వాస మార్గము బట్టిరా? మరి మీ అవిశ్వాసమునకు (ఉచితమగు) ఈ శిక్ష ననుభవింపుడు."

107. శుభ్ర (మగు తేజస్సుచే) (విభ్రాజమాన) మగు ముఖములు కలవారు భగవంతుని అనుగ్రహ (చ్ఛాయలక్రిందకు) గైకొన బడుదురు. వారికందే (నిత్య) నివాసము.

* ఇక్కడ 'హబ్లిల్లాహి' అను మూలమును "భగవద్రజ్జువు" అని నేననువదించితిని. 'భగవంతునితో కావించుకొనిన ఒడంబడిక' అనియు దీనికి అర్థము చెప్పవచ్చును. 'హబ్లిల్లాహి' అనగా ఖుర్ ఆన్ గ్రంథమనియు చెప్పవచ్చును. ఎందుకన మానవునకును భగవంతునకు మధ్యగల బంధము ఖుర్ ఆన్ గ్రంథము.

108. (ఓ ప్రవక్తా!) ఇవి భగవత్ప్రవచనములు. యథాతథముగ మీకివి వినిపింపబడుచున్నవి. భగవంతుడు జీవుల కన్యాయ మొనర్ప గోరడు.

109. (జ్ఞాపకముంచుకొనుడు :) భూమ్యాకాశములందున్న సమస్తము భగవంతునిదే. భగవంతుని కడకే సమస్త వ్యవహారములు (తీర్పునకై) మరలును.

పండ్రెండవ ఖండము

110. (ఓ విశ్వాసవంతులారా!) మానవుల (సంస్కారమునకై) పంపబడిన జనులలోకెల్ల మీరు అత్యంత శ్రేష్ఠులు. మీరు మంచిని విధించి, చెడుగును నిషేధించి, భగవంతునియందు విశ్వాసముంచువారు. ఇంతకుముందు భగవద్గ్రంథ మివ్వబడిన వారు విశ్వసించి యుండినచో వారికది ఉత్తమమై యుండెడిది. వారిలో కొందరు విశ్వాసవంతులుగను ఉన్నారు. కాని పల్వురు దుర్మార్గము ననుసరించినవారు.

111. మీకు వారు (ఎంతహాని కల్గింపగోరియు) ఇంచుక చిరాకుతప్ప మరేహానియు కల్గింపజాలరు; మీతో యుద్ధమొనర్చియు తుదకు వెనుజూపుదురు. (మూర్ఖులగు) వారికి ఎట్టిసహాయము లభింపదు.

112. భగవంతుని వాగ్దాన కారణమునగాని, మానవుల వాగ్దాన కారణమునగాని (వారికి ఆశ్రియము లభించిన) తప్ప, తక్కినచో ఎక్కడున్ననుసరే వారికి (యూదులకు) అధోగతి కల్గును. వారు భగవదాగ్రహమునకు పాత్రులైరి. వారి కధోగతి కలిగెను. ఎందుకనగా వారు భగవత్సందేశమును నిరాకరించి అన్యాయముగ ప్రవక్తలను చంపిరి; అవిధేయులై (తమ) హద్దుల నతిక్రమించి నందుకు వారి కివ్వబడినశిక్ష ఇది.

113. వారందరును ఒకేవిధమైనవారు కారు. భగవత్ప్రోక్తమగు గ్రంథము లభించిన వారిలో (క్రైస్తవ యూదులలో) సన్మార్గ ప్రవర్తకులును కొందరు కలరు. వారు భగవత్సూక్తులను రాత్రులందు పారాయణము సేతురు. (భగవంతునకే) వినతులగుదురు.

114. వారు భగవంతునియందును, తుది దినమునందును విశ్వసింతురు; మంచిని విధించి చెడుగును నిషేధింతురు; సత్కార్యాచరణమునందు ఒకరికంటె ఒకరు ముందడుగు వేయుదురు. వీరు సత్పురుషులు.

115. వారుచేయు దేమంచి యైనను (దానిఫలము) వారికి నిరాకరింపబడదు. సన్మార్గ ప్రవర్తకులను భగవంతు డెఱుగును.[22]

116. ఎవరు సత్యమును నిరాకరించిరో వారి ధనసంపదలుగాని, సంతానముగాని వారిని భగవంతుని (ఆగ్రహము) నుండి తప్పింపజాలవు. వారు అగ్నికింధనము లగుదురు. వారికందే (సత్య) నివాసము.

117. (అవిశ్వాసులు) ఏమి ఖర్చుపెట్టినను ప్రాపంచిక జీవితములో అది (వమ్మై నిష్ఫలమగుటలో) వారిస్థితి ఈ (క్రింది) తార్కాణమునకు పోలియున్నది: (కష్టపడి పెంచినవారి) చేలకు అతి శీతలమగు గాలి సోకి (ఆ చేలను) విధ్వంస మొనర్చెను. (అదేవిధముగ మీరుచేయు దానాదులు సైతము వమ్మగును.) వారు ఆత్మవినాశ మొనర్చుకొనిరి. భగవంతుడు వారికి (ఎట్టి) అన్యాయమును చేయలేదు. వారు తమకుతామే చెడగొట్టుకొనిరి.

118. ఓ విశ్వాసవంతులారా! మీ (సంఘము) లోని వారు కానప్పుడు వారితో ఎక్కువ గాఢమైత్రి సలుపకుడు. మిమ్ము వారు చెడగొట్టుట కెంతమాత్రము వెనుదీయరు. మీ వినాశమునే వారు కోరుదురు. వారప్పుడే అపరిమిత ద్వేషమును వెళ్ళగ్రక్కిరి. వారి హృదయములలో అంతకంటె అధికమైన ద్వేషము గుప్తమైయున్నది. మీరు జ్ఞానవంతులైనచో నిశ్చయముగ భగవత్సందేశము మీకు విస్పష్టపరపబడినది.

119. చూడుడు! వారిని మీరు ప్రేమింతురు. కాని వా మిమ్ముల ప్రేమింపరు. మీరు భగవత్ప్రోక్తమగు గ్రంథము నంతట్ని పూర్తిగ విశ్వసించువారు (కదా). వారు మిమ్ములను కలిసినప్పుడు ఇట్లందురు: "మేము (మీవలెనే) విశ్వసించుచున్నాము." కాని వారో టరిగ ఉన్నప్పుడు మీయందలి కోపద్వేషములచే గోళ్ళు రక్కుకొందురు (వారితోనిట్లు) అనుము: "మీ ఆగ్రహమున మీరు నశింపుడు. మీ హృదయములలో ఉన్న సమస్త రహస్యములను భగవంతు డెఱుగును."

120. మీకు శ్రేయశ్శుభము లొనగూడినచో వారు దుఃఖిత లగుదురు. మీకాపద తటస్థించినచో వారానంద పరవశు లగుదురు మీ రోర్పు వహించి సత్ప్రవర్తకులై మెలగినచో వారి కుతంత్రములు మిమ్ము రవ్వంతయు బాధింపవు. వారుచేయుచున్న సమస్తమును నిశ్చయముగ భగవంతు డెఱుగును.౭౮

పదమూడవ ఖండము

121. (ఓ ప్రవక్తా! ఆసమయము జ్ఞాపకముతెచ్చికొనుము.) నీవు ప్రాతఃకాలముననే ఇల్లు విడిచి (ఒహోద్) మైదానమున ముసల్మాను లను యుద్ధమునకై పంక్తులను తీర్చుచుంటివి. అల్లాః సమస్తము విను వాడు; సర్వజ్ఞుడు.౭౯

122. మీలో రెండు తెగలు ధైర్యము కోల్పోయి భగవం తుడు వారి సహాయ మొనర్చుచున్నను వెనుజూప నిశ్చయించెను విశ్వాసవంతులు ఎల్లవేళలందును భగవంతునే నమ్మియుండవలెను.

123. బదర్ యుద్ధరంగమున మీరు మిక్కిలి బలహీనులై యున్నప్పుడు భగవంతుడు మీకు సహాయ మొనర్చెను. (అప్పుడుమీరు జయముగొందురను అనుమానమైనలేకుండెను.) అందుచే అల్లాఃకే భయ

పడుడు. భగవదాజ్ఞల నతిక్రమింపకుడు. అప్పుడే మీరు భగవంతునకు కృతజ్ఞులై యుందురు.

124. (ఓ ప్రవక్తా! ఆ సమయముకూడ జ్ఞాపక ముంచుకొనుము:) నీవు (యుద్ధరంగమున) విశ్వాసవంతులతో ఇట్లనుచుంటివి: (శత్రువుయొక్క మూడువేలమంది సైనికుల నెదుర్కొనుటకై) మూడువేల దేవదూతల దింపి భగవంతుడు మీకు సహాయమొనర్చిన అది మీకు చాలదా?"

125. తప్పక అట్లే మీరు ఓర్పు వహించి, సన్మార్గప్రవర్తకులై యుండినచో, అప్పుడు మీపై హఠాత్తుగ శత్రు వెత్తి వచ్చిన యెడల, మీ భగవంతుడు (మీకు మూడువేల దేవదూతల తోడనేకాదు) ఐదువేలమంది భయంకర దేవదూతల పంపించి సహాయము చేయును. (మీ శత్రువులబలము మిమ్మేమియు చేయజాలదు.)

126. (జ్ఞాపకముంచుకొనుడు.) మీకు (విజయ) శుభవార్త నిచ్చుటకును, దానివలన మీకు మనస్థైర్యము కల్గించుటకును చెప్పిన మాట ఇది. తోడ్పాటేదైన నరే అది భగవంతుని కడనుండియే వచ్చును. భగవంతుడు సర్వశక్తిమంతుడు; ప్రజానిధి.

127.(మీకు భగవంతుడు యుద్ధమున సహాయముచేయుట మరియు నిందుకొఱకు:) అవిశ్వాస వంతుల సంఘము యొక్కయు బలము యొక్కయు ఒక భాగమును నశింపజేసి వారిని నీచపరచి వారు (ముసల్మానులను సమూలముగ నశింపజేయవలెనను తమకోరికను నెరవేర్చు కోలేక) భగ్నాశులై మరలి పోవునట్లు చేయుటకు.

128. (ఓప్రవక్తా! సత్యమునకు శత్రువులగు) వీరుక్షమింపబడుట శిక్షింపబడుటను గుఱించిన ఈ వ్యవహారములో నీ కేమియు జోక్య

ము లేదు. (భగవంతుడుతన ఇచ్చవచ్చినవారిని పశ్చాత్తప్తులైనచో క్షమిం
చును. తానుతలచినచో శిక్షనిచ్చును:) ఎందుకన వారు దుష్టులు.౧౩

129. భూమ్యాకాశము లందున్న సమస్తము భగవంతుని
కొఱకే యున్నది. తన ఇచ్చవచ్చిన వారి నతడు క్షమించును; తన ఇచ్చ
వచ్చిన వారిని శిక్షించును. భగవంతుడు మహాక్షమి; కరుణాళువు.

పదునాల్గవ ఖండము

130. ఓ విశ్వాసవంతులారా! వడ్డీ తినకుడు. (అప్పు యొక్క
అసలులో కలిసి) అది రెండింతలు నాల్గింతలై పోవును. భగవంతునకు
భయపడుడు. (భగవదాజ్ఞల నతిక్రమింపకుడు.) అప్పుడే మీకు జయశ్రీ
లభించును.

131. అవిశ్వాసులకై సిద్ధపరుపబడిన నరకాగ్నికి భయపడుడు.

132. భగవంతునకును అతని ప్రవక్తకును విధేయులై యుండుడు.
మీరు కరుణింపబడుదురు.

133. భగవంతుని క్షమార్పణవైపునకు సత్వర గమనమున
సాగుడు; స్వర్గమువైపునకు సాగుడు. సమస్తాకాశములును భూమియు
కలిసి యెంతవిశాలముగ నున్నవో అంత విశాలమైన దా స్వర్గము
సన్మార్గ ప్రవర్తకుల కొఱకు (అది) సిద్ధపరుపబడినది.

134. ఎవరు భాగ్యవంతులుగ నుండినను, పేదరికమునందున్నను
(యథాశక్తితమ కున్నదానిని) ఖర్చుపెట్టుదురో; ఎవరు క్రోధమును నిరో
ధించి (క్రోధపారవశ్యమున నిరంకుశులై పోవరో); ఎవరు తమ తోడి
మానవుల (తప్పులను) క్షమించివేయుదురో (అట్టివారే సన్మార్గ ప్రవర్త
కులు. వారికొఱకే స్వర్గముసిద్ధపరుపబడినది.) భగవంతుడు సన్మార్గ ప్రవర్త
కులను పరోపకార పారీణులను ప్రేమించును.౧౪

135. ఎవరు ఏదైన ఒక గొప్ప పాపమొనర్చి లేక ఆత్మ

వంచన మొనర్చుకొని పశ్చాత్తప్తులై భగవత్స్మరణము గావించుచు
తమ తప్పిదములను మన్నించుటకై (భగవత్సమక్షమున దీనులై) వేడు
కొందురో; తాము చేసినది తప్పని తెలిసియూ, అందే పట్టుదలవహించి
యుండరో అట్టివారు సన్మార్గ ప్రవర్తకులు. భగవంతుడుతక్క మరెవ్వరు
పాపములను క్షమించును?

136. నిశ్చయముగ ఇట్టిసజ్జనులకే భగవంతుడు క్షమార్పణము
బహుమతిగా అనుగ్రహించును. (అంతేకాదు; వారికొఱకు) స్వచ్ఛమగు
నిర్ఝరులు ప్రవహించుచున్న స్వర్గోద్యానము నిత్యనివాసమునకై ప్రసా
దించును.) (భగవన్మార్గమున) పనిచేయువారికి కలుగు ఫలమెంత శ్రేష్ఠ
మైనది!

137. చూడుడు. మీకు పూర్వము కూడ ప్రపంచములో
(జాతుల జీవన్మరణముల, ఔన్నత్య పతనముల) నియమములు, జీవిత
విధానము లుండెను. (అదే ధర్మమిప్పుడును పనిచేయుచున్నది. మీరు
కూడా దానికే లోనై యున్నారు.) మరి దేశాటనము చేయుడు. (భగవ
దాజ్ఞల) ధిక్కరించిన వారిగతి తుదకేమైనదో చూడుడు.౧౫

138. ఇది మానవులకొక స్పష్టమైన బోధన; సన్మార్గ ప్రవర్త
కులకిది మార్గదర్శకమును, ఉపదేశమునై ఉన్నది.

139. మీరు ధైర్యము కోల్పోకుడు; దుఃఖింపకుడు; మీరు
పూర్తిగ విశ్వాసవంతులే యైనచో అందరికంటె మీదే పైచేయి
యగును.

140. మీరు (ఒహోద్ యుద్ధరంగమున) గాయపడి యుండినచో
మీ శత్రువులకుకూడ (బదర్ యుద్ధరంగమున) అట్టిగాయములే తగి
లెను. (అట్టిచో మీరా పరాజయమున కింత ఖిన్నులగు చున్నారేల?)

వాస్తవ మేమనగా (జయాపజయముల) కాలములను ఒకప్పుడొక మునకును మరొకప్పుడింకొక పక్షమునకును) మేము మార్చుచుందుము (అంతేగాని దీనికొఱకై దుఃఖింపబనిలేదు.) మరియు (ఈపరాజయము ఉపా హీనమునుకాదు.) ఎందుకనగా దీనివలన ఎవరు నిజమైన విశ్వాస కలవారో (ఎవరుకారో) తేలెను. (అది వారికొక పరీక్షయైనది.) భగ తుడు దీనికి మిమ్ములనే సాక్షులుగా గ్రహించెను. భగవంతుడు దుర గ్గుల ప్రేమింపడు.ూ2

141. (దీనివలన) విశ్వాసవంతుల నుండి వంచకులను తొలగిం టయు, విశ్వాసహీనులను నశింపజేయుటయు నైనది.

142. (ఓవిశ్వాసవంతులారా? కేవలము విశ్వసించితిమని చెప్పిన మాత్రమున) మీరు స్వర్గమును ప్రవేశింతురనుకొందురా? స్వకర్మలచే విశ్వాసముయొక్క దార్ఢ్యమును నిరూపింప నవసరము లేదందురా?) అల మిమ్ములనుపరీక్షించి ఎవరు భగవన్మార్గమున పూర్తిగ శ్రమించువా ఎవరుకష్టకాలములందు నిశ్చలమనస్కులై యుండువారో చూపు మింకను రానైనలేదు.

143. మరణము నెదుర్కొను సమయము రాకపూర్వము (భగవన్మార్గమున) మరణించుటకు మీరువ్విళ్ళూరు చుండిరి. మరి ణము మీకన్నులముందు వచ్చినప్పుడు మీరు చూచుచు ఉండిపోయి

పదునైదవ ఖండము

144. మొహమ్మద్ కేవల మొక ప్రవక్తమాత్రమే. అ ముందెందరో ప్రవక్తలు గడచిపోయిరి. అట్టిచో (మొహమ్మద్) ఒ సారి చనిపోయిన గాని మరణించిన గాని మీరు వెను జూపుదురా అట్లు వెనుజూపినవాడు (తనకుతానే నష్టపరచుకొనుచున్నాడు.) భగవం నకేమాత్రము నష్టము కల్గింపడు. (అట్లు తమ ధర్మము నేమఱక) కృ జ్ఞులై యుండువారిని భగవంతుడు బహుమానించును.ూ2

145. భగవదాజ్ఞ లేనిదే ఏప్రాణియు మరణింపదు. (ప్రతిప్రాణి కొఱకును జీవిత) కాలము నిర్ణయింపబడినది. (మరి మరణభీతిచే మీరేల వెనుకకు మరలిరి?)

ఎవడు ఐహికలాభము నిచ్ఛించునో వానికిఐహిక ఫలమిత్తుము. అట్లుగాక ఆముష్మిక ఫలమును ఆశించువారికి ఆముష్మిక ఫలమే ప్రసా దింపబడును. కృతజ్ఞులై యుండువారిని మేము బహూకరింతుము.

146. మున్ను ఎందరు ప్రవక్తల గూడి భగవద్భక్తి పరులు (భగవన్మార్గమున) యుద్ధము చేయలేదు? భగవన్మార్గమున ఏవైన కష్టములు వచ్చినప్పుడు వారు ధైర్యము గోల్పోరైరి. దుర్బల (హృద. యులు) కారైరి. భగవంతుడుఓర్పువహించి స్థితప్రజ్ఞులైన వారిని ప్రేమిం చును.

147. (ఎన్నికష్టములు వచ్చినను) వారినోట ఈమాటలు మాత్రము వెడలుచుండెను : "ప్రభూ! మాతప్పిదములను క్షమింపుము. మాకర్మ లలో (నీఆజ్ఞలకు వ్యతిరేకముగ) ఏవైన హెచ్చుతగ్గులైనచో వాటిని కూడ క్షమింపుము. (భగవన్మార్గమున) మమ్ములను చలింపని పాదములు కలవారిగా నొనర్పుము. సత్యమును నిరాకరించిన ఈ ప్రజల (దౌర్జన్యము నెదుర్కొనుటకై) మాకు తోడ్పడుము."

148. (విశ్వాసమునందును, సత్కార్యాచరణము నందును ఇంత నిశ్చలచిత్తులైన) వీరికి భగవంతుడు ఐహికఫలము చేకూర్చుటయే కాక (అంతకంటె) ప్రశస్తమగు పారలౌకిక ఫలమును ప్రసాదించెను. సత్కా ర్యాచరణ పరులను భగవంతుడు ప్రేమించును.

పదిఆరవ ఖండము

149. ఓ విశ్వాసవంతులారా! (శత్రువుయొక్క బలమునుచూపి మిమ్ములను భయపెట్టియుద్ధమునందు పాల్గొనవలదని మీకుబోధించు) అవి

శ్వాసుల మాట వినినచో వారు సత్యమార్గమునుండి మిమ్ముల త్రి
వేయుదురు. దానికి ఫలితముగ మీరు (విజయ మోక్షముల మార్గము
విడిచి) పతితులై నష్టపోదురు.

150. ఈ ధర్మశత్రువులు మీమిత్రులు కాజాలరు.) మీ పోషకు
అల్లాః యొక్కడే. (మరి భగవంతునందే మీసమస్తాశల నుంచుడు.) స
యులలో భగవంతుడే ఎక్కువ సహాయము చేయువాడు.

151. సత్యమును నిరాకరించు వారిహృదయములలో మేము
త్వరలో అడలు పుట్టింతుము. ఎందుకనగా వారు అల్లాఃతో సమాను
కల్పించి (వారిని కొలుచుచున్నారు.) (అట్లుచేయుటకువారికడ) భగవం
డెట్టి అధికారము పంపియుండలేదు. (ఐనను అట్లుపూజించు) వారిని
సము నరకాగ్ని. దుర్మార్గుల నివాసము కఠోరమైనది.

152. భగవంతుడు తనసహాయ వాగ్దానమును పూర్తిచేసె
అప్పుడు మీరు భగవదాజ్ఞచే శత్రువులను వధించుచుండిరి. (మీరుఅన్ని
విధముల జయమును పొందుచుండిరి.) కాని మీకు అత్యంత ప్రియమ
విజయము లభించిన పిదప మీరు దుర్బల హృదయులై (మీకివ్వబడిన
ఆజ్ఞను గురించి మీలోమీరు వివాదపడసాగిరి.(ఒకపక్షమువారు ఇప్పు
రంగముపై నిలువవలసిన అవసరమేమున్నది? అనిరి. మరొకపక్షము
వారు 'కాదు. మేముచివరివరకుస్థిరులమై యుద్ధమున నిల్చియుందు'మనిరి.)
తుదకు (తమనాయకుడైన ప్రవక్త) ఆజ్ఞానుసారము వర్తింపరైరి.

మీలో కొందరు ఈ ప్రపంచమును (దోపిడిసామగ్రిని) ఆశించిరి.
మరికొందరు పారలౌకిక సుఖమునే ఆశించిరి. అప్పుడు భగవంతుడు
శత్రువులకు విముఖులనొనర్చి మిమ్ము (దీనివలన) పరీక్షింపగోరెను. (ఈ
విధముగ మీవిజయము పరాజయముగమారెను.)మీరిట్లు చేసినను భగ
వంతుడు మీతప్పిదమును క్షమించెను. విశ్వాసవంతులయెడ భగవంతు
డపార కృపను చూపును.

153. మీరు (యుద్ధరంగమునుండి అడలిపోయి) వెనుక తిరిగి
చూడకుండనైతము పారిపోవుచుండిరి. ప్రవక్త మిమ్ములను మీ వెనుక
నుండి పిల్చుచుండెను. (మీకు గుణపాఠముగ ఉండుటకై) భగవంతుడు
మీకు దుఃఖముపై దుఃఖముకల్గించెను. (ఇకముందు) మీ చేతులనుండి
జారిపోయిన దానికొఱకు దుఃఖింపకుడు. వచ్చిన (దుఃఖమునకును) వా
పోనకుడు. మీరు చేయుచున్నదంతయు భగవంతుడెఱుగును.

154. దుఃఖము తర్వాత భగవంతుడు మీకు శాంతిని ప్రసా
దించెను. మీలోకొందరు (పూర్తిగ నిర్భీతులై) నిద్రచే మైమరచిరి.
మరికొందరకు ప్రాణభీతి వదలనేలేదు. వారు భగవంతుని గూర్చి అంధ
కారయుగమునందెట్టి మూఢభావములు కల్గియుండిరో అట్టిభావము
లనే ప్రకటింపసాగిరి. వీరిట్లనిరి: "ఈ జరిగినదానిలో మా అధికార మే
ముండెను?" (ఓ ప్రవక్తా! వారితో) ఇట్లనుము: "అధికారము సర్వస్వ
మును నిశ్చయముగ భగవంతునకేకలదు. (భగవంతుడే ప్రతివిషయము
నను కార్యకారణ సంబంధము కల్పించినాడు.)" (వాస్తవమేమనగా) వారి
హృదయములలో ఉన్నదానిని వారు నీతో చెప్పక దాచియుంతురు.
వారిట్లు చెప్పుదురు : '(ఆవ్యవహారములో) మాజోక్యమేదైన యుండి
యుండినచో మేము వధింపబడక పోదుము.' (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు)
చెప్పుము : మీరు మీ ఇండ్లయందుండి పోయియుండినను (యుద్ధము
నందు) వధింపబడ నిర్దేశింపబడినవారు ఇల్లువిడిచివెళ్ళి తమనిర్ణీత వధ్య
స్థలమును తప్పక చేరియుందురు.

(ఒహోద్ యుద్ధములో జరిగినదంతయు భగవదిచ్ఛ ననుసరించి
జరిగినది.) దానివల్ల మీ హృదయములలో దాగియున్న భావములకు
ఒకపరీక్ష కల్పించుటయు మీ హృదయములలో పెరిగిన అపవిత్రత
తొలగించుటయు భగవదిచ్ఛయై ఉండెను. హృదయములలో గుప్తమై
ఉన్నదంతయు భగవంతుడెఱుగును.'

155. ఇరుపక్షముల సైన్యములు ముఖాముఖి ఎదుర్కొనిన నాడు మీలో వెనుజూపి పారిపోయినవారు వారి దౌర్బల్య కారణమున సైతాను వారిని దారితప్పించెను. (అంతేకాని వారి విశ్వాసములో కొదువ కల్గలేదు.) నిశ్చయముగ భగవంతుడు వారిని క్షమించెను. భగవంతుడు మహాక్షమి. (మానవుని తప్పులను దౌర్బల్యములను) ఎక్కువగ సహించువాడు.౨౪

పదునేడవ ఖండము

156. ఓ విశ్వాసవంతులారా! అవిశ్వాసమార్గము నవలంబించిన వారు తమ బంధువులు ప్రయాణము కట్టిపోయి నప్పుడును, యుద్ధము చేయబోయినప్పుడు వారిని గుఱించి (ఇట్లందురు) : "వారు (ఇల్లు విడిచి పెట్టిపోకయు, యుద్ధము చేయకయు) మాతో ఉండి యుండినచో చావక ఉండియుందురు. (వారి నెవ్వరు) వధింపకుండ నుందురు." ఓ విశ్వాసవంతులారా! మీరు వీరివలె కాకుడు. (భగవంతునియందు భక్తి విశ్వాసములు గలవారి కిట్టి భయమే యుండదు. ఐనను మీకిట్లుపదేశ మొనర్చుటకు కారణము, మీ నిర్భయత్వమును, విశ్వాసదార్ఢ్యమును, నిశ్చలతనుచూచి) అవిశ్వాసుల హృదయములలో మచ్చరపు మచ్చపడునట్లు చేయుట. (జ్ఞాపక ముంచుకొనుడు:) మరణము, జీవితము కూడ భగవంతుని హస్తగతములు. మీరు చేయునదంతయు భగవంతుడు చూచు చు నే యున్నాడు.

157. ఒకసారి మీరు భగవన్మార్గమున చనిపోయినను, వధింపబడినను, (అవిశ్వాసులగు) వీరు గడించి కూడబెట్టియుంచిన దానికంటె భగవంతుడు ప్రసాదించిన క్షమాకారుణ్యములు శ్రేష్ఠతరమైనవి.

158. మీరు చనిపోయినను, వధింపబడినను భగవంతుని సమక్షమున మీరందరు సమావేశ పరుపబడుదురు.

159. (ఓ ప్రవక్తా!) వీరియెడ నీవింత దయతో ప్రవర్తించుటయు వారిపై భగవంతుని దాక్షిణ్యమే. నీవు వారియెడ కటువుగను, హృదయకాఠిన్యముతోడను ప్రవర్తించియుంటివా వారందరు నీకడనుండి పారిపోయి యుందురు. అందుచే వారి తప్పుల క్షమింపుము. వారిని సంరక్షింపుమని (భగవంతుని) ప్రార్థింపుము. (యుద్ధము, శాంతి మున్నగు) ముఖ్య విషయములలో వారితో మంత్రణముసేయుము. మీరావిధమున నిశ్చయించుకొనిన భగవంతునియందు నమ్మకముంచుడు. (మీరు నిశ్చయించుకొనినదానిని తప్పకచేయుడు). తను నమ్మియుండు వారిని భగవంతుడు ప్రేమించును.

160. భగవంతుడు మీకు సహాయము చేసినచో మిమ్ముల నెవ్వరును ఓడింపలేరు. అట్లుకాక భగవంతుడే మిమ్ములను విడిచివైచెనా మీకు మరెవరు సహాయము చేయగలరు? అందుచే విశ్వాసవంతులు భగవంతునే నమ్ముకొని యుండవలెను.

161. భగవంతుని ప్రవక్త ఎన్నడును విశ్వాసద్రోహము చేయడు. విశ్వాస ద్రోహము చేయువాడు (లోకుల కన్నులలో ఎంతకారము కొట్టినను) తుదిదినమునాడు (తన విశ్వాసద్రోహమును) దాచి యుంచలేడు. దాని నతడక్కడకు తెచ్చును. నాడు ప్రతిజీవియు తాను గడించిన దాని ప్రతిఫలమును పూర్తిగ పొందును. ఎవరికిని నాడు అన్యాయముజరుగదు.

162. భగవంతుని సంతోషపరచు మార్గము నవలంబించినవాడును, (తన దుష్కార్యములచే) అల్లాః ఆగ్రహమునకు పాత్రుడైనవాడును ఒకటే ఎట్లగుదురు? (అల్లాః ఆగ్రహమునకు పాత్రుడైన) వాని నివాసము నరకము. అది ఎంత దుష్టనివాసము!

163. వారు భగవంతుని సమక్షమున వివిధతరగతులుగ ఉన్నారు. ఎవరికర్మ లెట్టివో వారిని (ఆవిధముగ) భగవంతుడు చూచుచున్నాడు.

164. వారినుండియే ఒక ప్రవక్తను పుట్టించుట విశ్వాసవంతులకు భగవంతుడు చూపిన మహదనుగ్రహము. (ఆ ప్రవక్త) వారికి భగవ(త్ప్రో)క్తమగు వాక్కులను వినిపించుచున్నాడు; వారిని (సమస్త దోష)ములనుండియు) పరిశుద్ధుల నొనర్చుచున్నాడు; భగవద్గ్రంథము బోధించుచున్నాడు; జ్ఞానము నిచ్చుచున్నాడు. అంతకుముందు వారు స్పష్టమగు దౌష్ట్యమున మగ్నులై యుండిరి.

165. (ఒహోద్ యుద్ధరంగమున) మీకొక ఆపద తటస్థించినప్పుడు—(బదర్ యుద్ధరంగములో) మీ శత్రువులపై ఇంతకు రెండింతలు ఆపద మీరు తెచ్చిపెట్టియుండిరి. (ఐనను) మీరిట్లు మొరపెట్టుకొంటిరి : "ఈ (ఆపద మాపై ఎక్కడనుండి) వచ్చిపడినది?" (ఓ ప్రవక్తా! వారితో) ఇట్లనుము : (ఆపద ఐతే వచ్చిపడినమాట వాస్తవమే. కాని) మీరు చేతులతో తెచ్చిపెట్టుకొన్నదే కదా ఇది. (మీరు దౌర్బల్యము చూపక, భగవదాజ్ఞోల్లంఘనము చేయకపోయినచో ఈ ఆపద తటస్థించకుండెడిది.) జ్ఞాపకముంచుకొనుడు; భగవంతుని శక్తికి సమస్తమును లోబడియున్నది.

166 7. రెండు సైన్యములు ఒకదాని నొకటి (ఒహోద్ యుద్ధరంగములో) ఎదుర్కొనినప్పుడు జరిగినదంతయు భగవదాజ్ఞానుసారమే జరిగినది. (జయాపజయముల నియమ మిదే విధముగ నిర్ణయింపబడినది.) విశ్వాసవంతుల పరీక్షకై ఈ సంఘటన జరిగినది. వంచకులకు కూడ (ఇదొక పరీక్ష) దీనివల్ల వారి వంచకబుద్ధి (తెలిసిపోయెను).

"రండు; భగవన్మార్గమున (బయటకు వచ్చి) యుద్ధముచేయుడు; లేదా (పట్టణములో ఉండి దానిపై శత్రువులదాడి) జరుగకుండ స్వయం సంరక్షణము చేసికొనుడు" అని వారితో చెప్పబడెను.

(దానికి వారిట్లు జవాబు) చెప్పిరి : "యుద్ధము తప్పక జరుగునని మాత్రము తెలిసియుండినచో* మేము తప్పక మీకు తోడైయుందుము." (ఈ మాటలు వారన్న) నాడు వారు విశ్వాసమునకంటె అవిశ్వాసమునకే ఎక్కువ చేరువనుండిరి. వారు పైకి చెప్పిన ఆమాటలు నిజముగ వారి హృదయములలో లేనివి. వారు (తమ హృదయములలో) దాచునదంతయు భగవంతు డెఱుగును.

168. తాము (యుద్ధరంగమునకు పోక) ఇండ్లలోనుండి (యుద్ధరంగమునకు పోయిన) తమసోదరుల నుద్దేశించి వారిట్లందురు : "వారు మామాట వినియుండినచో వధింపబడకుండ ఉందురు." (ఓ ప్రవక్తా! వారితో) ఇట్లు చెప్పుము : మీరు చెప్పుచున్నది నిజమే ఐనచో మీకు మృత్యువాసన్నమైనప్పుడు దానినుండి తప్పించుకొనుడు."

169. (ఓ ప్రవక్తా!) భగవన్మార్గమున వధింపబడిన వారినిగురించి వారు చనిపోయిరని భావింపకుము. వారు బ్రతికియే యున్నారు. వారు తమ భగవంతుని సమక్షమున (ఆధ్యాత్మికమగు) ఆహారమును బడయుచున్నారు.

170. భగవంతుడు అనుగ్రహముతో ప్రసాదించిన దానితో వారు♦ సుఖముగ ఉన్నారు. వారితో ఇంకను (వెళ్ళి) కలియక ప్రపంచమున వారి వెనుక దిగబడినవారు కూడ—వారికెట్టి భయశోకములును లేవని సంతోషముతో ఉన్నారు.

171. వారు భగవంతుని ప్రసాదమునకును అనుగ్రహమునకును ఆనందపరవశు లగుచున్నారు. విశ్వాసవంతుల సత్కార్యముల ఫలమును భగవంతుడు వ్యర్థమొనర్పడు.

---

* 'మాకు యుద్ధము చేయుటయే వచ్చియుండినచో' అనియు, 'యుద్ధమే జరిగినచో' అనియు మూడువిధముల దీని అర్థము చెప్పవచ్చును.

(మూజిహుల్ ఖుర్ ఆన్ పుట 70)

♦ అనగా భగవన్మార్గమున మరణించిన యోధులు.

పదునెనిమిదవ ఖండము

172. భగవంతునియొక్కయు, అతని ప్రవక్తయొక్కయు పిలుపునకు తలయొగ్గి క్షతగాత్రులయ్యు యుద్ధమునకు సిద్ధపడినవారిని, వారిలో సత్కార్యాచరణ పరులును, దైవభీతిపరులును అగువారిని భగవంతుడు బహూకరించును.

173. వీరితో కొందరిట్లనిరి: "వారు (మీ శత్రువులు) మిమ్ములను ఎదుర్కొనుటకై (ఒకపెద్ద సైన్యమును) కూడబెట్టినారు. అందుచే వారికి భయపడుడు. (వారి నెదుర్కొనుటకు బయటకు రాకుడు.") (కాని ఈమాట విని వారు భీతాపహులగుటకు బదులు) వారి విశ్వాసము మరింత దృఢతరమాయెను. వారు (నిర్భయులై ఇట్లు) చెప్పసాగిరి: "మాకు అల్లాః (ఆశ్రయముండిన) చాలును. (భగవంతుడు) అత్యుత్తముడగు వ్యవహర్త. (మా వ్యవహారములను చక్కబెట్టుటకు భగవంతుని కంటె మంచి వ్యవహర్త మాకులేడు.)

174. (తర్వాత నిర్భీతులై యుద్ధరంగమునకు బయలుదేరి) వారు భగవంతుని బహుమానమును, అనుగ్రహమును బడసి (విజయముతో) మరలిరి. వారి నెట్టిబాధయు స్పృశింపలేదు. వారు భగవంతుని ఇష్టమునకై పాటుపడిరి. (ఇది భగవదనుగ్రహము). భగవంతుడు గొప్ప అనుగ్రహము చూపువాడు.

175. దుష్టుడగు సైతానే తన మిత్రులకు భయపడుడని మిమ్ము బోధింపవచ్చును. మీరు విశ్వాసవంతులైనచో వారికి, (సైతాను అనుయాయులకు) భయపడక నాకే భయపడుడు. (మీరు భగవంతునకు మాత్రమే భయపడినచో మిమ్ము ఈ ప్రపంచపు ఏశక్తియు భయపెట్టజాలదు.)

176. (ఓ ప్రవక్తా!) తొందరపడి అవిశ్వాసమార్గమున పోవువారిని చూచి ఖిన్నమనస్కులు కాకుడు. వారు భగవంతుని దేమియు

చెఱుపజాలరు. (వారు తమకు తామే నష్టపడుచున్నారు.) పరలోకమున (అక్కడి సౌఖ్యములందు) వారికెట్టి భాగమును లభింపజేయకుండుట భగవంతు నిష్టము. తుదకు వారికి ఘోరశిక్షకలదు.

177. విశ్వాసమును అమ్మి, అవిశ్వాసమును కొనువారు భగవంతున దేమియు చెఱుపజాలరు. వారికి దుఃఖకరమగు శిక్షకలదు.

178. మేము అవిశ్వాసులకిచ్చు గడువు తమకు మంచిదేయని వారు అనుకొనకుందురు గాక! (తమకిచ్చిన అవకాశమును పోగొట్టుకొని దుర్మార్గమునే యున్నచో) వారి పాపములు (మరింత) హెచ్చుటకే మేము గడువు నొసగెదము. (తుదకు) వారికి లజ్జాకరమగు శిక్షకలదు.

179. పవిత్రులను అపవిత్రులనుండి వేరుపరచనంతవరకు విశ్వాసవంతులను ఇప్పుడు మీకున్న (దు)స్థితియందే భగవంతుడు విడిచిపెట్టడు.

అతీంద్రియములగు విషయములను (సామాన్యులగు) మీ(యందర)కు తెలియజేయుట భగవంతుని విధానము కాదు. (కాని ఈ రహస్యవిద్యను ప్రసాదించుటకై) భగవంతుడు తన ప్రవక్తలలో ఇష్టము వచ్చినవారిని ఎన్నుకొనును.

అందుచే (ఓ వంచకులారా!) భగవంతుని, అతని ప్రవక్తలను విశ్వసింపుడు. (ఇప్పుడైనను మీరు పశ్చాత్తాపపడి) విశ్వాసము కుదుర్చుకొని, సత్కార్యాచరణ పరులైనచో మీకు మిక్కిలి గొప్పఫలము లభించును.

180. భగవంతుడు తన అనుగ్రహముచే ప్రసాదించిన (ధన ధాన్య విద్యా) సంపదలను దానముచేయునెడ లోభము చూపువారు ఆ లోభబుద్ధి తమకు లాభకరమని అనుకొనకుందురు గాక! వాస్తవముగ అది వారికి (నష్టము కలిగించు) ఒక దుర్గుణము. ఏసంపదను వ్యయపరచుట యందిక్కడ లోభించిరో, ఆ సంపదలు (వారికి శాస్తియగునట్లు) తుదిదినమున వారి మెడలకు సంకెళ్ళుగా చేయబడి వ్రేలాడగట్టబడును. (జ్ఞాపక

ముంచుకొనుడు. ఇది నాది, అది నాది అని మీరనుచున్న దేదియు వాస్త
వముగ మీది కాదు.) భూమ్యాకాశము లందున్న సర్వస్వమును భగవం
తుని సొత్తే (అని మరువకుడు). మీరు చేయుచున్న దంతయు భగ
వంతుడెఱుగును.౧౮౦

పందొమ్మిదవ ఖండము

181. "(మాటిమాటికి దేవునిపేర దాన మర్థింపబడు చున్నది
కాబోలు) భగవంతుడు యాచకుడు, మేము ధనికులము" అని చెప్పువారి
ఎత్తిపొడుపును నిశ్చయముగ భగవంతుడు వినియేయున్నాడు. వారి ఈ
మాటలను మేము వ్రాసియుంతుము. (అంతేకాదు;) వారు (సన్మార్గము
నుపదేశించు) ప్రవక్తలను అన్యాయముగ వధించినదియు (వ్రాసియుం
తుము.) (వారి ఈ కర్మలు పరిపాకమైన పిదప) "దుఃఖభాజకమైన ఈ
నరకాగ్నియొక్క శిక్షను చవిచూడుడు" అని మేమందుము.

182. ఇది మీరింతకుముందు మీ చేతులతో చేసుకొనినదాని ఫల
మిది. అంతేకాని భగవంతుడు తన సేవకులను హింసింపడు.౧౮౨

183. "అగ్నిచే గ్రసింపబడిన హవిస్సును తెచ్చినగాని ఎట్టి ప్రవ
క్తనైనను విశ్వసింపవలదని మాకడ భగవంతుడు వాగ్దా
నము గైకొనినాడు." అని చెప్పువారితో (ఓ ప్రవక్తా!) ఇట్లనుము:
"నాకు పూర్వము స్పష్టమగు చిహ్నములతో మీరడుగుచున్న
దానితో సైతము ప్రవక్తలు వచ్చిరి. మీరు సత్యమే పలుకుచుండి
నచో వారిని మీరేల వధించిరి? (చెప్పుడు.)"

184. (ఓ ప్రవక్తా!) ఇప్పుడు వీరు నిన్ను నిరాకరించుచున్నచో
(అది వీరికి క్రొత్తకాదు. వీరు నిరాకరించినది నిన్నొక్కనినేకాదు.) నీకు
పూర్వము స్పష్టమగు చిహ్నములతోడను, (జ్ఞానపూర్ణమగు చిన్నచిన్న)

గ్రంథముల * తోడను, (ధర్మ) ప్రకాశమగు గ్రంథముతోడను వచ్చిన
ఎందరో ప్రవక్తలు వీరిచే నిరాకరింపబడిరి.

185. (ఓవిశ్వాసవంతులారా! జ్ఞాపకముంచుకొనుడు.) ప్రతిప్రాణి
యు చావు చవిచూచి తీరవలెను. మీరుచేయు కర్మఫలమును (మరణా
నంతరము) తుదిదినముననే పూర్తిగా పొందుదురు. ఎవడు ఆ నాడు
నరకాగ్నినుండి దూరముగ తొలగింపబడి స్వర్గోద్యానమున ప్రవే
శము పొందునో అతడే సాఫల్యభాగ్యము నందినవాడు. ఈ ఐహిక
జీవితము (విషయవాంఛలతోకూడిన) మోసపు సామగ్రి గాని వేరొండు
కాదు.౧౮౫

186. మీధనములతోడను ప్రాణములతోడను మీకు తప్పక
పరీక్షింపబడుదురు. మీకు పూర్వము భగవద్గ్రంథమును పొందిన
వారియొక్కయు, బహుదైవతారాధకుల యొక్కయు తిట్లు తినవలసి
వచ్చును. మీరు ఓర్పు వహించి దౌష్ట్యమునుండి తొలగి చరిం
పుడు. నిశ్చయముగ ఇది మిక్కిలి మనోదార్ఢ్యముతో కూడిన విష
యము.

187. భగవద్గ్రంథము ఎవరికి ప్రసాదింపబడెనో భగవంతుడు
వారి కడ (ఈవిధముగ) సమయము గైకొనెను:

"(ఈగ్రంథములో ఉన్న సర్వవిషయములను) మానవు లందరకు
బాగుగా బోధించి చెప్పుడు. (భగవద్గ్రంథమును) దాచకుడు."

---

* కొందరు ప్రవక్తలు చిన్నచిన్న ధర్మగ్రంథములును, కొందరు పెద్ద ధర్మగ్రంథ
ములను ఆయాకాలముల అవసరములనుబట్టి తెచ్చిరని ఇక్కడభావము.
"జబుర్" అనగా "పలకలు" లేక "వ్రాయబడిన పలకలు" అనిఅర్థము.
"జబూర్" దావూదు ప్రవక్తకు ప్రోక్తమైన గ్రంథముపేరు.
ఇక్కడ 'జబురి' అను శబ్దమునకు ధర్మగ్రంథములని అర్థము.

కాని వారు భగవద్గ్రంథమును (ఉపేక్షాభావముతో) వెనుకబ
వైచిరి. దానిని నీచమగు మూల్యమునకు అమ్మివైచిరి. (సత్యమునిట్లు
విక్రయించుటవల్ల వచ్చిన) ఈ మూల్యము ఎంత దుష్టమైనది!

188. (ఓ ప్రవక్తా!) తమ చేష్టలకు సంతోషించుచు తాము
ఎన్నడు చేయని కార్యములకు ప్రశంసింపబడవలెనని కోరు వీరు
(రాబోవు) శిక్షనుండి తప్పించుకొనగలరని అనుకొనకుము. వారికొఱకు
దుఃఖదాయకమగు శిక్షకలదు.

189. భూమ్యాకాశముల రాజ్యమంతయు భగవంతునిదే.
సమస్త వస్తువులపైనను భగవంతున కధికారమున్నది.

ఇరువదియవ ఖండము

190. భూమ్యాకాశముల సృష్టిలో, రాత్రింపగళ్ళ మార్పులో
నిశ్చయముగ బుద్ధిమంతులకొఱకు (భగవంతుని) చిహ్నములుకలవు.

191. నిలిచియుండియు, కూర్చొనియుండియు, (ప్రక్కలపై)
పరుండియు భగవన్నామ చింతనము చేయువారు భూమ్యాకాశముల
సృష్టినిగూర్చి తరచి, ఆలోచించి (ఇట్లందురు):

"ప్రభూ! ఇదంతయు నీవు వ్యర్థముగ సృష్టింపవైతివి. నీవు పరి
శుదుడవు. (నీవుచేయు ఏదియు వ్యర్థముగాని, దోషయుతముగాని కాజా
లదు.) (ప్రభూ!) మమ్ము నరకాగ్నియొక్క దుఃఖమునుండి రక్షింపుము."

192. "ప్రభూ! నీవునరకాగ్నియందు ఎవనిని ప్రవేశింపజేసితివో
వానినెంతయు అవమానమునకు పాల్పరచినావు. (అప్పుడు, దుర్మార్గు
లకు ఎవరును సహాయము చేయరారు."

193. "ప్రభూ! నిశ్చయముగ విశ్వాస మార్గము వైపునకు పిలుచు
ఒక ఆహ్వాయకుని పిలుపును వింటిమి."

'మీరు ప్రభువైన భగవంతుని యెడ విశ్వసింపుడు.' (అని ఆ
ఆహ్వాయకుడు పిల్చెను).

" (మేమా పిలుపు విని తత్ప్రకారము) విశ్వసించితిమి. కాన,
ప్రభూ! మా పాపములను క్షమింపుము. మా కుచేష్టలను కప్పిపుచ్చుము.
సత్పురుషులతో మేము మరణించునట్లు వరము ప్రసాదింపుము."

194. "ప్రభూ! నీవు మాకిచ్చెదనని నీ ప్రవక్తలద్వారా వాగ్దాన
మిచ్చిన వన్నియు మాకు ప్రసాదింపుము. తుదిదినమున మేము అవమా
నితులము కాకుండునట్లు చేయుము. నిశ్చయముగ నీవు వాగ్దానభంగ
మొనర్పవు."

195. వారి ప్రభువు వారి ఈ ప్రార్థనల నాలించెను. (అట్లు ప్రార్థ
నల నాలించి భగవంతుడిట్లు సెలవిచ్చెను:)

"నిశ్చయముగ నేను మీలో ఎవరైననునరే కావించిన కర్మలను
వ్యర్థపుచ్చను. (చేయునది) స్త్రీయైనను పురుషుడైనను సరే. ఎందుకన
మీ రొకరినుండి యొకరుద్భవమైనవారు. (కర్మ ఫలముల విషయములో
నందరును సమానులే.)

"అందుచే (భగవన్మార్గమున) తమయిండ్లు విడిచిపెట్టి వెళ్ళిపోయిన
వారియొక్కయు, ఇండ్లనుండి వెళ్ళగొట్టబడిన వారియొక్కయు, నా మా
ర్గమున బాధింపబడిన వారియొక్కయు, (నా మార్గమున) పోరాడి హతు
లైనవారి యొక్కయు (సత్కృతులు వ్యర్థముకావు. ఇంతేకాదు; వారి)
కుచేష్టలను (సైతము) నేను తప్పక కప్పిపుత్తును. వారిని తప్పక నిర్ఝరులు
ప్రవహించు సుందరోద్యానములందు ప్రవేశింపజేతును. అది అల్లాః
ప్రసాదించు ఫలము. అల్లాఃయే శ్రేష్ఠమగు ఫలములను ప్రసాదించు
వాడు."

196. విశ్వాసహీనులు (భోగభాగ్యములతో తులతూగుచు) నగర
ములలో విహరించుచుండుటను చూచి మోసపోకుడు.

197. వారి ఆ భాగ్యము తాత్కాలికము. దాని తర్వాత నివాసము నరకము. నరక మెంతటి తుచ్ఛనివాసము!

198. కాని ఎవరు భగవంతునియెడ భయభక్తులుకలిగి (త విధ్యుక్తములను శ్రద్ధాభక్తులతో నిర్వర్తింతురో) వారికొఱకు నిర్ఝరు ప్రవహించు సుందరోద్యానము లివ్వబడును. వారికందే నిత్యనివా కలదు. వారిప్రభువు వారికిచ్చు ఆతిథ్యమది. అల్లాః ప్రసాదించు ఫల అత్యంత శ్రేష్ఠమైనదే అగును.

199. భగవద్గ్రంథము ప్రసాదింపబడిన వారిలో కొందరు భ వంతునియందును, నీకు ప్రోక్తమైనదాని (సత్యగ్రంథము) యందును, వారికి (ఇంతకుముందు) ప్రసాదింపబడిన భగవద్గ్రంథమునందును వి శింతురు. వారు అల్లాః సమక్షమున వినయ వినమితాంగులైన వారు. వారు భగవదాదేశములను నీచమూల్యమునకై విక్రయించివేయు (మూఢులవంటి) వారుకారు. నిశ్చయముగ (అట్టివారి కెట్టి భయశోకములు నంటవు). వారిని భగవంతుడు బహూకరించును. భగవంతుడు (పుణ్య పాపఫలముల) లెక్కనుంచుటలో ఆలసింపడు.

200. ఓ విశ్వాసవంతులారా! క్షమా ధైర్యస్థైర్యములను వహించియుండుడు.* దృఢనిశ్చయులై ఉండుడు. నిశ్చలచిత్తులై ఉండుడు. భగవంతునకే భయపడుడు. మీకప్పుడే జయశ్రీ లభించును.

* ఇక్కడ 'ఇస్బిరు' అను శబ్దమును "క్షమా ధైర్యస్థైర్యములు వహించియుండుడు" అని తెనిగించితిని. 'సబ్రున్' శబ్దమునకు "క్షమ, ధైర్యము, స్థైర్యము, ఆత్మ సంయమనము, నిశ్చయదార్ఢ్యము కలిగియుండుట" అని పూర్తి అర్థము.

بسم الله الرحمن الرحيم

అధ్యాయము ౪

స్త్రీలు *

(అన్నిసా)

(మదీనాయం దవతరించినది. ౨౪ ఖండములు.)

(౧౭౬ సూక్తులు)

కరుణామయుడును వరప్రదాయకుడును అగు
అల్లాః నామస్మరణముతో (ప్రారంభించుచున్నాను.)

1. ఓ మానవులారా! అల్లాః (ఆజ్ఞల నుల్లంఘించుటవలని దుష్ఫలితమున)కు భయపడుడు. (భగవంతుడు) మిమ్ముల నందరిని ఒకేప్రాణి నుండి సృష్టించెను. అదేప్రకృతినుండి దానికి జోడై యుండుటకు (స్త్రీని) పుట్టించెను., వారి ఇద్దరినుండియు పెక్కండ్రు పురుషులను స్త్రీలను (పుట్టించి ప్రపంచమంతటను) వ్యాపింపజేసెను. (ఈ విధముగ ఒకే తలిదండ్రులనుండి ఉద్భవించినను మానవకుటుంబము వివిధజాతులుగ వర్ధిల్లి ప్రపంచమంతయు అల్లుకొనెను) ఏ అల్లాః పేర మీరు ఒకరిపై ఒకరికి గల హక్కులను కోరుచున్నారో అతనియెడ భయభక్తులతో ప్రవర్తించుచు మీ విధ్యుక్తములను నిర్వర్తింపుడు. (మీలో ఒకరిలో నొకరికిగల బాంధవ్యముల (విషయములో ఉపేక్ష వహింపకుడు.) (వారి హక్కులను కాపాడుడు.) భగవంతుడు మీకు సంరక్షకుడై యున్నాడు.౧౦

2. తల్లిదండ్రులు లేని అనాథుల ఆస్తిపాస్తులను (న్యాయబుద్ధితో వారికి) ఇచ్చివేయుడు. (వారి) మంచి వస్తువులను (మీరు) తీసుకొని మీ

* వ్యాఖ్యాన భాగములో ఈ అధ్యాయముపై వ్రాసిన పీఠికను చూడుడు.

చెడ్డవస్తువులను వారి కియ్యకుడు. వారి ధనమును మీ ధనముతో క[లిపి] అనుభవింపకుడు. ఇట్లుచేయుట గొప్ప పాపకార్యము. ౨

3. (మీరొకసారి వివాహ మాడదలచినయెడల) తలిదండ్రులు [లేని] బాలికలయెడ న్యాయముతో ప్రవర్తింపజాల మను అనుమానమున్నచో (వారిని వివాహమాడకుడు.) మీకు [నచ్చిన] నచ్చిన (ఇతర) స్త్రీలను పెండ్లియా[డు]డుడు. (ఒకేసారి) ఇద్దరేసినిగాని, నల్గురేసినిగాని పెండ్లాడవచ్చును. (మీ[రు] వారితో న్యాయముగ ప్రవర్తించి అందరిని సమానముగ చూడగలుగుటయు [వారి] పోషింపగలుగుటయు మాత్రము షరతు.) ఒకసారి మీరు న్యాయము చేయలేమను భయ మున్నచో ఒకే (స్త్రీని) పెండ్లాడుడు. లేక (యుద్ధ[ము]) ములో ఖైదీలుగా కొనబడి) మీకు దాసీలై వచ్చినవారిని (వివాహ[మాడు]) డుడు.) అన్యాయమార్గము పట్టకుండుటకై మీకిది ఉచితప్రవర్తనము.

4. స్త్రీలకు మహర్ ధనమును (శుల్క-ద్రవ్యమును) హృదయ[పూర్వకముగ] పూర్వకముగు బహుమానముగ ఇచ్చివేయుడు. (మీభార్యలు తల్లిదండ్రులు లేనివారని వారి నిస్సహాయతవలన లాభము పొంది వారి శుల్క-ద్రవ్యము నెగగొట్టకుడు.) ఒకసారి వారు స్వేచ్ఛగా అందులో కొంత విడిచిపెట్టి[న]వైచినచో మీరు దానిని సంతోషముతో వినియోగించుకొనుడు. (అది దోషముకాదు.) ౪

5. భగవంతుడు ఆస్తిపాస్తులను మీకు బ్రతుకు తెరువుగా ప్రసాదించినాడు. అందుచే మీరు ద్రవ్యమును బుద్ధిహీనులగు * వారికి ఇచ్చి వేయకుడు. (ఒకసారి వారు చిన్నపిల్లలై యున్నచో), వారి ద్రవ్యము[ల]

* ఇక్కడ "సుఫహా" అను శబ్దమునకు 'బుద్ధిహీనులు', అని అర్థము. యుక్త వయస్సురాని పిల్లలు, ఉన్మాదులు, మతిస్థిరముగా లేనివారు, దుశ్శీలురు, దుర్వ్యయము చేయువారు కూడ ఈ శబ్దార్థము క్రిందికి వత్తురని ఇబ్నెకసీర్. స్త్రీలుకూడా ఈ అర్థము క్రిందికి వత్తురని కొందరి అభిప్రాయము.

(ఇబ్నెకసీర్ సం. 4 పుట 70)

నుండి వారి అన్నవస్త్రముల ఏర్పాట్లు చేయుడు. మంచివియు, ధర్మవిహితమును అగు మాటలు వారికి చెప్పుడు. ♦

6. తల్లిదండ్రులులేని పిల్లల స్థితిగతులను విచారించుచు వారికి యుక్తవయస్సు * వచ్చువరకు (వారి ప్రవర్తనమును) పరీక్షించుచుండుడు. (అప్పుడు) వారిలో యోగ్యత కన్పించినచో వారి ఆస్తిపాస్తులను వారికి ఇచ్చివేయుడు.

పిల్లలు వయస్సునకు వచ్చినతర్వాత అడుగుదురను భయముచే త్వరత్వరగ వ్యర్థవ్యయమొనర్చి వారి ఆస్తిపాస్తులను, ద్రవ్యమును మ్రింగివేయకుడు. ధనికుడైనవాడు (తల్లిదండ్రులులేని పిల్లలధనమును) ఎంతమాత్రమును (స్వంతమునకై) వినియోగించరాదు. బీదవాడు (తల్లిదండ్రులులేని పిల్లల ధనముయొక్క వ్యవహర్తయైనచో) న్యాయబద్ధమగు (ఒకచిన్న) మొత్తమును వ్యయపరచుకొనవచ్చును. (అట్టిపిల్లల) ద్రవ్యము, ఆస్తులను వారికి తిరిగి ఇచ్చివేయునప్పుడు (కొందరు) సాక్షులనుంచుకొనుడు. (జ్ఞాపకముంచుకొనుడు.) భగవంతుడే లెక్కపెట్టుటకు చాలును. (మీరు చేయుచున్న లెక్కలకు భగవంతుడు సాక్షియై యున్నాడనియు, భగవంతునికంటె ఎక్కువలెక్కలను చూచువారెవ్వరును లేరనియు జ్ఞాపకముంచుకొనుడు.)

7. తల్లిదండ్రులును, దగ్గరి బంధువులును విడిచిపెట్టివెళ్ళిన ఆస్తియందు పురుషులకు భాగము కలదు; తల్లిదండ్రులును దగ్గరి బంధువులును విడిచిపెట్టి వెళ్ళిన ఆస్తియందు అదేవిధముగ స్త్రీలకును భాగము కలదు. అది చిన్నదైనను, పెద్దదైనను సరే. ఈ భాగము (భగవంతునిచే) నిర్ణీతమైనది. ౭

♦ 'వారికి విద్యాబుద్ధులు గరపుడు' అని దీని భావము. 'వారితో మధురముగ భాషింపుడు' లేక 'వారితో మంచిమాటల నాడుడు' అనియు కొందరర్థము వ్రాసిరి.

* 18 వ ఏడు దాటిన యుక్తవయస్సు వచ్చునని హనఫీ మతము.

8. ఆస్తివిభజన సమయములో (దూరపు) బంధువులును, (... వంశమునకు చెందిన) తల్లిదండ్రులు లేని పిల్లలు, బీదలు ఉండిన ... వారికి కూడ కొద్దియో గొప్పయో ఇయ్యుడు. వారితో ప్రేమ... మాట్లాడుడు.

9. (హక్కు గలవారి హక్కును భంగపరచుటకు) వారు భ... పడుదురుగాక! ఒకసారి వారు బలహీనులగు సంతానమును విడిచి... వెళ్ళినచో వారిని గుఱించి వారెంత భయపడుదురు! (అట్లే ఇతరుల... యములో కూడ అని భావింపదగును.) అందుచే అల్లాకు భయపడు... న్యాయయుక్తమగు మాటలనే చెప్పుడు.

10. ఎవరు తల్లిదండ్రులు లేని పిల్లల ఆస్తిని అన్యాయము... తిందురో వారు తమ కడుపులను నిప్పుతో నింపుకొనుచున్నారు. ... వారు ప్రజ్వలితమగు అగ్నిని ప్రవేశింతురు.

రెండవ ఖండము

11. మీ సంతానము (యొక్క వారసత్వపుహక్కు) ను గుఱిం... భగవంతుడు (ఇట్లు) ఆజ్ఞాపించుచున్నాడు: ఒక పురుషుడు ఇద్దరు స్త్రీ... సమానమగు భాగమున కర్హుడు.

ఒకసారి ఇద్దరికంటె ఎక్కువమంది కూతుళ్ళున్నచో వా... పైతృకములో మూడింట రెండుపాళ్ళు రాదగును.

ఒకసారి ఒక్కతే కూతురున్నచో ఆమెకు సగము భాగ... రావలెను.

మరణించినవాని తల్లిదండ్రులకు ప్రతియొక్కరికి ఆరవభాగము లభించును. ఇది మరణించినవానికి సంతాన మున్నపక్షమున. ఒకసా... సంతానము లేకపోయి అతని వారసులు కేవలము తల్లిదండ్రులే యైన... తల్లికి మూడవవంతు (లభించును. తక్కినది తండ్రిది.)

ఒకసారి (తల్లిదండ్రులేకాక) మరణించినవానికి ఒకరికంటె ఎక్కువ అన్నదమ్ములుగాని, అక్కచెల్లెండ్రుగాని ఉన్నచో తల్లికి ఆరవవంతు మాత్రము లభించును. (తక్కినది తండ్రిది).

కాని (మరణించిన వ్యక్తి) మరణశాసనము (వ్రాసియుండినచో దాని) ప్రకారము జరిపి, (అతనిపై ఉన్న) అప్పులను తీర్చి (మిగిలిన దాని నుండియే పైవిధముగ భాగించవలెను.)

(చూడుడు:) మీ తండ్రులును, మీ సంతానమును వీరిలో (ఐహి... కమును ఆముష్మికమును అగు) లాభమునుబట్టి ఎవరిసంబంధము మీక... న్నిటికంటె సన్నిహితమో (దానినిబట్టి ఎవరికి ఎక్కువ హక్కు లభించ... వలెనో, ఎవరికి తక్కువ లభించవలెనో భగవంతుడే నిర్ణయించగలడు.) అది మీకు తెలియదు. (అందుచేతనే) భగవంతుడు (ఎవరెవరి కెంతభా... గము లభించవలెనో ఆయా) భాగములను ఈ విధముగ నిర్ణయించినాడు. భగవంతుడు సర్వజ్ఞుడు; ప్రజ్ఞానిధి.

12. మీ భార్యలు విడిచిపెట్టి పోయినదానిలో, వారికి సంతా... నము లేనిపక్షమున, మీకు సగముభాగము లభించును. సంతాన మున్న... చో నాల్గవభాగము (లభించును.) కాని ఈ విభాగము (ఆమె చేసిపోయిన) మరణశాసనము ప్రకారము జరిపి, (ఆమె చేసిపోయిన) అప్పులు తీర్చిన తర్వాత మిగిలినదానికి మాత్రము చెల్లును.

మీరు (భర్తలు) విడిచిపెట్టిన దానిలో, మీకు సంతానము లేక... పోయినచో, భార్యలకు నాల్గవభాగము లభించును. (మీకు) సంతానము... న్నచో (భార్యలకు) ఎనిమిదవభాగము (మాత్రము లభించును.) మీరు చేసిన మరణశాసనము ననుసరించి జరిపి, మీరు చేసిపోయిన అప్పులను తీర్చినపిదప (పైచెప్పిన విధమున) విభాగము జరుపవలెను.

పురుషుడైనను స్త్రీయైనను ఏదైన (ఆస్తిని, సొత్తును) విడిచిపెట్టి పోయినప్పుడు, అతనికిగాని ఆమెకుగాని తల్లితండ్రులుగాని సంతానముగాని లేనిపక్షమున, ఒక సోదరుడుగాని ఒక సహోదరిగాని ఉండిన పక్షమున (ఈ విధముగ విభాగము జరుగవలెనని) ఆజ్ఞ : సోదరీ సోదరులలో ప్రతి ఒక్కరికి ఆరవభాగము. ఒకసారి (సోదరీ సోదరులు) ఒకరికంటె ఎక్కువగనున్నచో (ఆస్తిని మూడుభాగములు చేసి అందలి) ఒక మూడవ భాగములో అందరును సమానభాగములు వేసుకొనవలెను.

కాని మరణించిన వ్యక్తి విడిచిపెట్టి వెళ్ళిన మరణశాసనము ప్రకారము జరిపి, చేసివెళ్ళిన అప్పులను తీర్చగా మిగిలినదానిపై (పై నుదహరించిన విభాగము చెల్లును.) మరతు ఏమనగా (మరణశాసనము యొక్కయు అప్పుయొక్కయు) ఉద్దేశము (హక్కుదారులకు) నష్టము కలిగించుట కాకుండ నుండవలెను.

ఇది (ఆస్తి విభాగవిషయములో) భగవంతుడు ప్రసాదించిన ఆజ్ఞ; (జ్ఞాపకముంచుకొనుడు) భగవంతుడు సమస్తమును తెలిసినవాడు. (మానవుని దౌర్బల్యమును గుర్తించి తన ఆజ్ఞలను ప్రసాదించుటలో) దాక్షిణ్యమును చూపువాడు.

13. ఇవి భగవంతు డేర్పరచిన హద్దులు. ఎవ్వరు భగవంతునియొక్కయు అతని ప్రవక్తయొక్కయు ఆజ్ఞలకు బద్ధులై యుందురో అట్టివారు స్వర్గమును ప్రవేశింతురు. అందు స్వచ్ఛమైన నిర్ఝరులు ప్రవహించుచున్నవి. వారి కందే స్థిరనివాసము.

వీరిదే మహద్విజయము.

14. (అట్లుకాక) ఎవడు భగవంతుని యొక్కయు అతని ప్రవక్త యొక్కయు ఆజ్ఞల నుల్లంఘించి విధివిహితమగు హద్దుల నతిక్రమించునో

వాడు నరకాగ్నిని ప్రవేశించి అందే యుండును. వానికి అత్యంత అవమానకరమగు శిక్ష లభించును.

మూడవ ఖండము

15. మీ స్త్రీలలో ఎవతెయైన దుష్ప్రవర్తకురాలైనచో♦ (ఆమె దుష్ప్రవర్తనమునుగూర్చి) మీనుండి నలుగురను సాక్ష్యుల నుంచుకొనుడు. (ఆ నలుగురు) సాక్షులు సాక్ష్యమిచ్చినచో అట్టి స్త్రీలను ఇండ్లలో నిర్బంధించి యుంచుడు. మృత్యువు వారి ఆయుస్సును హరించువరకుగాని, భగవంతుడు వారికొఱ కేదైన మంచిమార్గము చూపించువరకు (అట్లే కట్టియుంచుడు,)

16. మీలో ఎవ్వరైన ఇద్దరు పురుషులు పరస్పరము కామాసక్తులై ప్రవర్తించినచో వారిని శిక్షింపుడు. ఒకసారి వారు పశ్చాత్తాపపడి సరియైన మార్గమునకు వచ్చినచో వారిని పోనిండు. భగవంతుడు పశ్చాత్తప్తులను క్షమించువాడు; కరుణామయుడు.

17. ఎవరు అజ్ఞానముచే తప్పొనర్చి, వెంటనే పశ్చాత్తప్తులగుదురో వారియెడ భగవంతుడు దయచూపును. భగవంతుడు సర్వము నెఱిగినవాడు; ప్రజ్ఞానిధి.

18. (ఎడతెగకుండ తమ జీవితకాలమంతయు) పాపకృత్యములొనర్చువారి పశ్చాత్తాపము (నిజమైన పాపభేదము) కాదు. వారిలో ఎవనికైన మృత్యు వాసన్నమైనప్పుడు వాడు "ఇప్పుడు నేను పశ్చాత్తాపపడుచున్నాను." అనును. అవిశ్వాసులై మరణించువారి (పశ్చాత్తాపము కూడ పశ్చాత్తాపము) కాదు. వీరందరికొఱకు కఠినమగు శిక్ష సిద్ధపరుపబడియున్నది.

♦ ఇక్కడ 'ఫాహిషిత' అను శబ్దమునకు 'వ్యభిచారము చేసినచో' అనియు కొంద రర్థము వ్రాసిరి. 'స్త్రీలు స్త్రీలతో వ్యభిచరించుట' అనియు కొంద రర్థము వ్రాసిరి. (చూ. అబుల్ కలాం, సం. 1 పుట 333.)

19. ఓ విశ్వాసవంతులారా! (మరణించినవాని) స్త్రీలను వా
త్వముక్రింద వారి ఇష్టమునకు వ్యతిరేకముగ స్వాధీనపరచుకొనుట మీ
నిషేధింపబడినది.

మీరు స్త్రీలకు ఇచ్చివేసిన (ఆస్తియు, సొత్తుయు) వారి ను
తిరిగి తీసుకొనుటకు వారిని నిర్బంధించి యుంచకుడు. వారు స్పష్టము
దుష్ప్రవర్తకురాండ్రైన తప్ప (వారిపై కాఠిన్యము చూపి, వారిని నొ
యుంచుటకు ప్రయత్నింపకుడు.)

స్త్రీలతో వ్యవహరించునప్పుడు దయాదాక్షిణ్యముల తో
న్యాయముతోడను ప్రవర్తింపుడు. ఒకసారి వారనిన మీకు (ఏకారణ
చేనైనను) అయిష్టముగ నున్నచో (హద్దుల నతిక్రమించకుడు.) మీ
వారిలో ఒక్క విషయము అయిష్టముగ నుండిన నుండవచ్చును.
భగవంతుడు దానియందే మీకెంతో శ్రేయస్సు సమకూర్చవచ్చును.

20. ఒకసారి మీరు (మీకిష్టములేక సంతోషపూర్వకముగ స
రము చేయజాలక) ఒక భార్యను విడిచి ఆమెకు బదులు మరొక భార్య
పెండ్లాడ నిశ్చయించినచో, ప్రథమభార్యకు మీరు (వెండి బంగారము
ఒకరాశియైనను (మహర్ రూపముసన, ఆభరణాదులుగను) ఇచ్చియు
నచో (ఆమెను విడిచిపెట్టునప్పుడు) దానిలో ఎంతమాత్రమును తి
పుచ్చుకొనరాదు. ఆమెపై అపవాదమును మోపిగాని, విస్పష్టము
పాపమునకు గడగిగాని మీ రామెకిచ్చిన ధనమును సంగ్రహిం
గోరెదరా ?

21. మీ రొకరితో నొకరు భార్యాభర్తలవలె వర్తించిన
వాత, (మీ భార్యల వివాహకాలమందు వారి హక్కులనుగూర్చి మీక
విధిపూర్వకమైన ఒడంబడికగైకొన్న తర్వాత, వారికిచ్చిన ధనము
తిరిగి మీ రెట్లు పరిగ్రహింపగలరు ? ౯౯

22. మీ తండ్రులు పెండ్లాడిన స్త్రీలను మీరు పెండ్లాడకుడు.
(ఈ ఆజ్ఞ ప్రసాదింపబడక) పూర్వము జరిగినదానిని పోనిండు. (ఇక
ముందు జ్ఞాపకముంచుకొనుడు.) ఇది మిక్కిలి సిగ్గుమాలిన పాపకృత్యము.
దుష్టమగు దురాచారము. ౧౦౦

నాల్గవ ఖండము

23. (చూడుడు) మీకొఱకు (ఈక్రింది చుట్టరికములు గల స్త్రీలు)
వివాహమునకై నిషేధింపబడినారు:

మీ తల్లులు;
మీ కూతుండ్లు;
మీ అక్కచెల్లెండ్రు;
మీ తండ్రి అక్కచెల్లెండ్రు;
మీ తల్లి అక్కచెల్లెండ్రు;
మీ అన్నదమ్ముల కూతుండ్లు;
మీ అక్కచెల్లెండ్ల కూతుండ్లు;
మీకు పాలిచ్చిన తల్లులు;
మీతల్లి (లేక పాలిచ్చినతల్లి) పాలుత్రాగిన అక్కచెల్లెండ్రు;
మీ భార్యల తల్లులు.

మీ భార్యల (ఇతరభర్తలవల్ల కలిగి), మీ ఒడులలో పెరిగిన
సంతానము. (వారు మీకు పుట్టకపోయినను వారి తల్లులను మీరు పెండ్లా
డుటచే వారు మీకు సంతానముతో సమానమైనవారు.)

ఒకసారి వారి తల్లులతో మీరు సంగమించని పక్షమున (వారిని
వివాహమాడినచో) అది పాపము కాదు.

మీకు పుట్టిన పుత్రులభార్యలు (మీకోడండ్రు).

ఒకేసారి ఇద్దరు అక్కచెల్లెండ్రను వివాహమాడుటకూడ ని
ధము.

(ఈ ఆజ్ఞ ప్రసాదింపబడక) పూర్వము జరిగిన దేదో జరిగినది. భ
వంతుడు దానిని క్షమించును. భగవంతుడు దయాదాక్షిణ్యపూర్ణుడు.

ఐదవ భాగము

24. ఇతరుల భార్యలు కూడ మీకై నిషేధింపబడినారు. మీ
యుద్ధములో ఖైదీలుగా పట్టుబడ్డవారితో మీరు వివాహము చేసికొన
వచ్చును.

ఇది భగవంతుడు మీకై నిర్ణయించిన ధర్మము.

మీరు కోరి, వారికి మీ సంపదనుండి కానుకలనిచ్చి, వి
యలోలసత్వమునకాక పవిత్రబుద్ధితో వివాహమాడ దలచినచో (పైన
పేర్కొనబడిన) ఈ స్త్రీలు తక్క తక్కిన స్త్రీలందరును మీకు వివాహ
యోగ్యలు. మీరు (వివాహమాడి) వారివలన లాభము పొందినందున
వారికి నిర్ణీతమగు మహర్ధనమును వారి కిచ్చివేయుడు. మహర్ధన
మును నిర్ణయించుకొని, దానిపిదప మీరు పరస్పరము (దానినిగూర్చి
ఒడబడినచో మరేమియు బాధలేదు.♦ భగవంతుడు సర్వమును తెలిసిన
వాడు; ప్రజ్ఞానిధి.

25. విశ్వాసవతులగు స్వేచ్ఛాస్త్రీలను వివాహమాడగల ధన
సంపద మీకడ లేకపోయినచో యుద్ధములందు చెరబట్టబడిన విశ్వా

♦ అనగా నిర్ణీతమైన మహర్ధనమునుగూర్చి భార్యాభర్త లిరువురును ఒ
బడి అందులో హెచ్చుతగ్గులు చేసికొనినగాని లేక భార్య తన భర్తయెడ తనకు
ప్రేమచే తన మహర్ హక్కులో కొంతభాగమునుగాని పూర్తిగాగాని వదలుకొనినను
వదలుకొనవచ్చును. అట్లుచేయుట నిషేధము కాదు అని భావము.

సవతులగు స్త్రీలలో నెవతెనైన పెండ్లాడుడు. (మీకు యుద్ధమున లభిం
చిన బానిసస్త్రీతో పెండ్లాడుట గౌరవహీనమైన పని యని భావింపకుడు.
అసలు కావలసినది విశ్వాసము. ఇతరవిధములైన గౌరవములు నిజమైన
గౌరవములు కావు.) భగవంతుడు మీ విశ్వాసమును ఎఱుగును. (విశ్వా
సవతియగు ఒక బానిసకత్తె సత్ప్రవర్తకురాలగుటయు, గొప్ప ఇంట పుట్టిన
స్త్రీ సత్ప్రవర్తనమునందు లోపముకలదిగా ఉండుటయు సాధ్యము.
అందుచే బానిసకత్తె యైనంతమాత్రమున వివాహమాడుటకు జంకకుడు.
అంతేకాక) మీరు అందరు ఒకే (మానవ) జాతికి చెందినవారు (కదా!)
(మానవులగుటచే అందరు సమానులే.) ఇట్టి స్త్రీలను వారి యజమానుల
అనుమతితో (నిస్సందేహముగ) పెండ్లాడుడు. ఆచారము ననుసరించి
వారి కుచితమగు మహరును వారి కిచ్చివేయుడు. వారు స్వచ్ఛమగు
(వివాహ) నియమములకు బద్ధులై జీవితము గడపువారై ఉండవలెను.
అంతేకాని కులటలు కాకూడదు. చాటుచాటున వ్యభిచారము చేయు
వారై యుండరాదు. (ఇదంతయు జాగ్రత్తగ గమనించి వారు పవిత్రలని
విశ్వాసము కుదిరినపిదప వివాహమాడుడు.)

అట్టి స్త్రీలను వివాహమాడినప్పుడు ఆ స్త్రీలు వ్యభిచరించినచో,
స్వేచ్ఛాస్త్రీల కివ్వవలసిన శిక్షయందు సగము శిక్ష వారికి విధించవలెను.

(వివాహమాడనిచో) చెడునడతకు అలవడుదుమను భయము కల
వారికి (ఈ) ఆజ్ఞ ఇవ్వబడినది. అట్లుకాక మీరు ఓర్పువహించి (అను
కూల పరిస్థితులు కలుగునంతదాక ఆగినచో) అది శ్రేష్ఠతరమైనది. భగ
వంతుడు (మానవుని దౌర్బల్యమును) క్షమించువాడు; దయాపూర్ణుడు.

ఐదవ ఖండము

26. మీకు పూర్వము గడచిపోయిన (సత్పురుషులైన) వారి
మత (ధర్మ) ములను భగవంతుడు స్పష్టముగ వివరించి వారిమా

ర్గమును మీకు చూపగోరుచున్నాడు. (భగవంతుడు) మీపై (దయ దృష్టి బరప గోరుచున్నాడు. అల్లాః సర్వజ్ఞుడు; ప్రజ్ఞానిధి.

27. భగవంతుడు మీపై (దయా) దృష్టి బరపగోరుచున్నా (మీరిప్పుడు మునిగియున్న చెడుగులనుండి విడివడి మీరు పవిత్రులగు భగవంతునిష్టము.) కాని విషయవాంఛల ననుసరించువారు (తమవలె మీరు (కూడ విషయవాంఛల వైపునకు) పూర్తిగా ఒరిగిపోగోరెదరు.

28. అల్లాః మీ (బరువును) తేలికయొనర్ప గోరుచున్నా (ఎందుకన) మానవుడు దుర్బలుడుగా సృష్టింపబడినాడు.

29. ఓ విశ్వాసవంతులారా! ఒకరిసొత్తు నొకరు అన్యాయము పొట్టవేసుకొనకుడు. (క్రియవిక్రయ రూపమైన) వాణిజ్యమున పరస్ప గీకారముతో (కలుగు లాభము మాత్రము అనుభవింప దగినది.)

ఒకరి ప్రాణముల నొకరు హరించుకొనకుడు. ♦

నిశ్చయముగ అల్లాః మీయెడ దయా దాక్షిణ్యములు క యున్నాడు.

30. దౌర్జన్యమునకును, అన్యాయమునకును పాల్పడి ఇట్లు నచో వారిని త్వరలో నరకాగ్నియందు పడవేతును.

భగవంతున కిది సుకరమే.

31. మీకు నిషిద్ధములగు అతినింద్యమగు (మహా పాతకము నుండి మీరు తప్పించుకొనినచో, మీయందలి తక్కిన చెడుగుల న టిని తొలగించువైతును. మిమ్ము గౌరవస్థానమున ప్రవేశింప జే దును. ౧౦౧

♦ "మీ ప్రాణములను మీరు హరించుకొనకుడు" అనియు అర్థము చెప్పవచ్చు అనగా ఆత్మహత్య గావించుకొనకుడు అని అర్థము వచ్చును.

32. భగవంతుడు మీలో ఒకరిపై ఒకరికి ఆధిక్యత ప్రసాదించి (ఒకరికంటె మరొకరికి విద్యాగౌరవములు అధికముగ నిచ్చి) నాడని (ఒక రినిచూచి యొకరు) అసూయపడకుడు. పురుషులు వారు సంపాదించు కొన్నదాని ఫలితమును వారనుభవింతురు. (అట్లే) స్త్రీలు (కూడ) వారు సంపాదించుకొన్న దానిని వా రనుభవింతురు. (ఇట్లు ఎవరు గడించినది వా రనుభవింతురు. ఇతరుల కున్నదని అసూయ పడుటకంటె మీకుకూడ ప్రసాదించుమని) భగవంతుని అనుగ్రహమునకై వేడుకొనుడు. నిశ్చ యముగ భగవంతుడు సర్వము నెఱుగును. ౧౦౨

33. తల్లిదండ్రులును, సన్నిహిత బంధువులును విడిచిపెట్టివెళ్లిన ఆస్తిలో మేము ప్రతి యొక్కరికిని (లాభము కలుగునట్లు) వారసులను నియమించితిమి. మీరు గావించుకొనిన ఒడంబడికలను వాగ్దానములను అనుసరించి వారి కా భాగముల నిండు. ♦ (జ్ఞాపక ముంచుకొనుడు.) భగవంతుడు సర్వసాక్షి. (భగవంతుని దృష్టినుండి యేదియు గుప్తముగా నుండజాలదు.)

♦ 'అఖదత్ ఐమానుకుమ్' అను ఇక్కడి మూలమునకు 'మీ కుడిచేతులు చేసి కొనిన ఒడంబడికలు' అని అర్థము. ఒడంబడికలు చేసికొనునపుడు చేతిపై చేయి వేయుట ఆచారము. అందుచే 'చేతిపై చెయ్యివేసి చేసికొనిన ఒడంబడిక లేక వాగ్దా నము' అని అర్థమగును. సూక్తి మొదటిభాగములో వారసత్వముయొక్క నిర్ణీతభాగ ముల ప్రసంగమును, తరువాతిభాగముతో ఒడంబడికలు వాగ్దానములు పూర్తిచేయుట గూర్చిన ప్రసంగమును చేయబడినది. ఈ ఒడంబడికలందును, వాగ్దానములందును భర్తలు భార్యలతో వివాహసమయమునను, తర్వాతను చేసిన వాగ్దానములు కూడ చేరును. ప్రత్యేకముగ ఈ ఒడంబడికలే ఇక్కడి భావమని మౌలానా అబుల్ కలాం ఆజాద్, మౌలానా మొహమ్మదలీగార్ల అభిప్రాయము.

(చూ. అబుల్ కలాం, తర్జుమానుల్ ఖుర్ఆన్, సం. 1, పుట 340; మొహ మ్మద్ అలీ, బయానుల్ ఖుర్ఆన్ సం. 1, పుట 500.)

ఆరవ ఖండము

34. పురుషులు స్త్రీలను భరించువారు. ♦ ఎందుకనగా భగవంతుడు కొందరిని కొందరపై ఆధిక్యతను ప్రసాదించినాడు. (ఎందు కనగా పురుషులు) తాము సంపాదించిన సొత్తును (స్త్రీలకై) వ్యయపరచి (వారిని) పోషింతురు.) ఉత్తమ స్త్రీలంఘుచేతనే (తమ భర్తలకు) విధేయలై యుండి భగవంతుడు భద్రపరచి ఇచ్చిన తమశీలమును రహస్యమునను పరోక్షమునను కూడ భద్రపరచుకొందురు. ౧౦౩

మిమ్ముల నెదిరించి, మిమ్ముల విడిచి లేచిపోవునని మీకు భయమున్న స్త్రీలను (మనస్సు విరిగి వెంటనే విడిచిపెట్టివేయకుడు, వారికి) (మొట్టమొదట ప్రేమతోడను, మెత్తదనముతోడను) అనునయించి బుద్ధి చెప్పుడు. తర్వాత వారితో శయ్యాగారమున వేరుగా నుండుడు. (అంతకును వారు కుదురనిచో వారిని భయపెట్టుటకై హాని కలుగనట్లు) కొట్టుడు.* అప్పుడు వారు మీమాట వినినచో (కాఠిన్యము వహించి) వారిపై నేరములు మోపుటకై మార్గముల నన్వేషింపకుడు. భగవంతుడు అందరికంటె ఎక్కువ మహిమాపావిత్ర్యములతో మీ అందరిపై ఉన్నాడు (అని జ్ఞాపక ముంచుకొనుడు.) ౧౦౪

35. వారిద్దరి (భార్యాభర్తల) లో విచ్ఛేదము కల్గుట తప్పదని మీకు తోచినప్పుడు ఒక మధ్యవర్తి భర్తపక్షమువానిని, ఒక మధ్యవర్తి భార్యపక్షమువానిని ఇట్లు ఇద్దరిని పరిష్కరించుటకై నియమించి-

♦ ఇక్కడ "ఖవ్వామూన" అను మూలమునకు "ఆహారము చేకూర్చువాడును, కాపాడువాడును, స్త్రీసహజమైన అవసరములను పూర్తి చేయువాడును" అని అర్థము.

* కొట్టినతర్వాత దెబ్బ కనబడునట్లుగాని, గాయము కలుగునట్లుగాని, ఏదైన అవయవము విరుగునట్లుగాని కొట్టరాదని శ్రీ ప్రవక్త దీనిని వ్యాఖ్యానించినారు.

చిన్న చిన్న అపరాధములకు తమభార్యలను కొట్టు పురుషులు సజ్జనులు కారని శ్రీప్రవక్త ఉపదేశము. (ఇబ్నెకసీర్, సం. 5, పుట 21.)

ఫుడు. వారు సమాధానపడుట కిచ్ఛగించినచో భగవంతుడు వారిమధ్య అన్యోన్యతను తప్పక కల్గించును. నిశ్చయముగ భగవంతుడు సర్వజ్ఞుడు. సమస్తవిషయముల నరయువాడు. ౧౦౫

36. భగవంతుని సేవింపుడు. (అసమానుడైన) అతనికి సమానులను కల్పింపకుడు. తల్లిదండ్రులయెడలను, బంధువులయెడలను, తల్లిదండ్రులులేని పిల్లలయెడలను, బీదసాదలయెడలను, బంధువులైన మీ పొరుగువారియెడలను, అపరిచితులైన మీ పొరుగువారియెడలను, సహవాసులయెడలను, * స్నేహితులయెడలను, ప్రయాణీకులయెడలను మీ స్వాధీనములోనున్న (సేవకులు ♦ మొదలైన) వారియెడలను ఉపకారబుద్ధితో ప్రవర్తింపుడు. (ధనమదముచే తల్లిదండ్రులను, బంధువులను, బీదసాదలను, ఇరుగు పొరుగువారిని నిరాదరణము చేయు) గర్విష్ఠులను, అహంకారపూరితులను భగవంతుడు ప్రేమింపడు.

37. లోభులను, (తమతోపాటు) ఇతరులను కూడ లోభులై యుండుడని బోధించువారిని, భగవంతుడు తన అనుగ్రహముచే ప్రసాదించిన దానిని (వ్యయపరచుటకు బదులు) దాచియుంచువారిని (కూడ భగవంతుడు ప్రేమింపడు.) భగవత్ప్రసాదితమగు అనుగ్రహములకు కృతజ్ఞులై యుండుటకు బదులు) కృతఘ్నత చూపువారికి అవమానకరమగు శిక్ష సిద్ధపరచబడియున్నది.

38. కేవలము ప్రపంచమునకు చూపుటకొఱకు (పేరు ప్రతిష్ఠల కోసము దానధర్మములపై) ధనమును వ్యయపరచుచు, వాస్తవముగ భగవంతునిపైనను తుదిదినముపైనను విశ్వాసములేనివారిని (కూడ భగవం-

* "సాహెబి బిల్‌జన్బి" అను ఇక్కడి మూలశబ్దమునకు "స్త్రీలు" అని అని కొందరు వ్యాఖ్యాతలు. "అతిథులు" అని మరికొందరు.

♦ పెంపుడుజంతువులను పక్షులనుకూడ ఇందు చేర్చవచ్చును—అనువాదకుడు.

తుడు ప్రేమింపడు.) ♦ అట్టివారు సైతాను సహవాసులు. సైతాను ఎంతటి దుష్టసహవాసి!

39. (ఈ దానధర్మములు చేయువారు) భగవంతునియెడలను, తుదిదినముయెడలను విశ్వాసముంచి, భగవంతుడు వారికి ప్రసాదించినదానినుండి (భగవత్ప్రీతికై) వ్యయపరచియుండిన వారి కేమి (నష్టము) కలిగెడిది? భగవంతుడు (వారు చేయుచున్నది) అంతయు నెఱుగును.

40. దేవుడు సత్కృతుల ఫలము నొసగుటలో అణుమాత్రమైన నన్యాయము చేయడు. (అన్యాయము చేయకపోవుటయే కాదు;) పాటి మంచిచేసినను దాని ఫలమును ద్విగుణీకృత మొనర్చును. తాను స్వయముగ మిక్కిలి గొప్పగా బహుమానించును.

41. (ఓ ప్రవక్తా! తుదిదినమునాడు) ప్రతిజాతినుండియు (ఆయా జాతులకుపంపబడిన ఆదేశకులైనప్రవక్తలను) సాక్షిగాపిలిచి, నిన్ను కూడ వీరిప్రవర్తనమునకు సాక్షిగా పిలిచినప్పుడు (వీరిస్థితి) ఏమగును?

42. నాడు సత్యమును నిరాకరించి దుష్పథము నవలంబించి (తమ) ప్రవక్త ఆదేశములను వినని వారు (సిగ్గుచేతను, భయముచేతను అయ్యో! మేము భూమిలో పూడుకొనిపోయి) భూమి మమ్ములను కప్పివేసిన ఎంత బాగుండెడిది? అని వాపోవుదురు. నాడు వారు భగవంతుని నుండి (తమ) ఒక్క మాటయు దాచిపెట్టలేరు.

ఏడవ ఖండము

43. ఓ విశ్వాసవంతులారా! మత్తుగొని మీ మాటల యర్థమును మీరు గ్రహించగలుగునంతవరకు * ప్రార్థన (నమాజు) చేయ సమకట్టకుడు. అదేవిధముగ మీకు స్నానముచేయవలసిన అవసరము కలిగినప్పుడు అట్లు స్నానముచేయునంతవరకు నమాజు చేయకుడు. మీ రొకసారి బాటసారులై మార్గమున నున్నచో (అది వేరుమాట. అప్పుడు మీరు తయమ్మమ్ ♦ విధి ననుసరించవచ్చును.) మీరు జబ్బుపడి యున్నప్పుడును, ప్రయాణమునం దున్నప్పుడును, మలమూత్ర విసర్జనము చేసినప్పుడును, స్త్రీస్పర్శ § చేసినప్పుడును, మీకు నీరుదొరకని పక్షమున పరిశుద్ధమైన మట్టితో (పరిశుద్ధులుకండు, దానితో) మీ ముఖములను చేతులను తుడుచుకొనుడు. నిశ్చయముగ భగవంతుడు పాపములను క్షమించువాడు; మహాక్షమి.

44. భగవద్గ్రంథమునందలి ఒకభాగము ప్రసాదింపబడినవారి స్థితిని నీవు చూడలేదా? వారు (సత్యమును వదలుకొని) మార్గభ్రంశతను ఎన్నుకొనుచున్నారు! మీరు కూడ (వారివలెనే) మార్గభ్రంశులు కావలెనని వారు కోరుదురు.

45. మీ శత్రువులను భగవంతుడు బాగుగా ఎఱుగును. అల్లాః రక్షకుడగుట చాలును. అల్లాః సహాయుడగుటయే చాలును.

46. యూదులలో కొందరు శబ్దములను వాటి సందర్భముల నుండి మార్చివైతురు. (మీతో కలిసినప్పుడు) సత్యమగు మీ మతమును హేళనచేయుటకు మాటలను విరిచి శబ్దములకు పెడర్థములు వచ్చునట్లు

♦ ఎందుకనగా భగవంతునియందు వారికి నిజముగ విశ్వాస మున్నచో భగవత్ప్రీతికై కాక పేరుప్రతిష్ఠలకును, లోకులకు తమ గొప్పతనమును చాటుటకును దానధర్మములు చేసియుండెడివారు కారు. అట్లే తుదిదినమునందు విశ్వాస మున్నయెడల నాడు భగవంతునిచే దానధర్మములకు ప్రతిఫలముగా ఒసగబడు బహుమానమునాశించి ఆ సుకృతిని అతడు చేసియుండువాడు. కాని, లోకప్రీతికొఱకు చేసియుండెడివాడు కాడని భావము.

* మత్తుపదార్థములు వెనుక ౨ : ౨౧౯ లోను ౫ : ౯౦, ౯౧ లోను నిషేధింపబడినవి.

♦ ఈ సూక్తము చివర చెప్పబడిన మంటితో పరిశుద్ధపరచుకొను విధానమును 'తయమ్మమ్' అందురు.

§ దీనియర్థము 'స్త్రీ సంగమ' మని కొందరు వ్యాఖ్యాతలు. కామాసక్తితో స్త్రీని స్పృశించుటయు ఈ శబ్దార్థమున చేరును.

ఇట్లు చెప్పుదురు: (మీ ఉపదేశములను) వింటిమి. వాటిని శిరసావహి తిమి." ఈ మాటలను "(మీ ఉపదేశములను) వింటిమి. కాని మే మనుసరింపము" అను అర్థము వచ్చునట్లు వికటముగ నుచ్చరింతు అట్లే (ఇంక వారి అనుయాయులతో) వినుము : భగవంతుడు మీకు మాటలను విన్పింపకుండుగాక!" అను అర్థముగల మాటను "ఓ మీరీ మాటలను పెడచెవిని పెట్టుము" అను అర్థము వచ్చునట్లు ఉ రింతురు. అట్లే 'మాయెడ సుముఖులుగండు' అను మాటను 'ఓ ప కాపరీ!' అను అర్థమువచ్చునట్లుచ్చరింతురు. (వీరీ కుటిలత్వమునకు లుకాక) "మేము (మీ ఉపదేశమును) వింటిమి. మేము దాని నను తుము." అనియు, తమ అనుయాయులతో (ఈ ఉపదేశములను) వి (ఈ ఉపదేశములను గ్రహించిన) మమ్ము చూడుడు." అని చెప్పియు నచో ఎంతయో బాగుగను సత్యముగను ఉండెడిది. కాని సత్యనిరా ణము చేసినట్టివారు భగవంతునిచే శపితులైరి. వారిలో కొలదిమ తప్ప తక్కినవారు విశ్వసించరైరి.

47. భగవద్గ్రంథమును పొందిన ఓ ప్రజలారా! (మొహమ్ ప్రవక్తకు) ప్రోక్తమగుచున్న ఈ గ్రంథము ఇప్పుడు మీకడ నున్న నిని నిరూపించి చూపుచున్నది. దానిని (నిరాకరింపక) విశ్వసింపు మీ ముఖములను మార్చివైచి ♦ మీరు వెన్నుత్రిప్పి పలాయితుల నట్లు చేయకపూర్వము § సబ్బాతును నిరాకరించిన వారిని శపించి శపించుటకు పూర్వమును (ఖుర్ ఆనును విశ్వసింపుడు.) భగవంతు కావించిన ఆజ్ఞ అయితీరును.

♦ 'మీ నాయకులను విధ్వంసమొనర్చి' అని దీని భావార్థము,

§ యూదులు నిలువనీడలేక ఒక దేశమునుండి మరొక దేశమునకు వెళ్ళగొట్టబ టయు, పూర్వకాలముననేకాక నేటివరకు యూదులు యూరప్ ఖండమున హింసిం బడి ఒక దేశమునుండి మరొక దేశమునకు పలాయితులగుచుండుటయు సర్వవిదితము.

48. భగవంతునితో సమానులను నిలబెట్టు పాపమును భగవంతుడెంత మాత్రమును క్షమింపడు. ఇదిగాక మరేపాపమునైనను భగవంతు డిచ్ఛించుచో మన్నించును. భగవంతునితో సమానులను నిలబెట్టునో వాడు నిశ్చయముగ మహాపాతకము చేసినవాడు.

49. (ఓ ప్రవక్తా!) తామే పవిత్రులమని గర్వించువారిని గమనించితివా? (ఒక కులమునందును, ఒక జాతియందును జన్మించినంతమాత్రమున పావిత్ర్యము కలుగదు.) వాస్తవమేమనగా భగవంతుడు తన కిచ్ఛవచ్చినవారిని (చెడుగులనుండి రక్షించి) పవిత్రులను చేయును. (ఎవరు చేసినదానికి వారికి తగు ప్రతిఫల మిచ్చుటలో భగవంతుడు) ఆవగింజంత హెచ్చు తగ్గైనను చేయడు.

50. (భగవంతుడు తమ్మాజన్మపవిత్రులను చేసెనని) భగవంతునిపై ఎట్టి అబద్ధములు వీరు చెప్పుచున్నారో చూడుడు. (పావిత్ర్యమును, సద్గతియు విశ్వాసముపైనను సత్ప్రవర్తనము పైనను ఆధారపడియున్నది. కాని ఒక కులమునందుగాని ఒక జాతియందుగాని జన్మించినంత మాత్రమున కాదు.)వారు స్పష్టముగ పాపిష్ఠులనుటకు ఈ నిదర్శనమొకటి చాలును.౧౦౬

ఎనిమిదవ ఖండము

51. (ఓ ప్రవక్తా!) భగవద్గ్రంథమందలి ఒకభాగము మాత్రము ప్రసాదింపబడిన వీరిస్థితిని గమనించితివా? వారు (ఎట్లు) దేవతా విగ్రహములను, దయ్యములను దుష్టశక్తులను (కట్టుబడి మొదలైన దుష్ట మంత్ర తంత్రములను) నమ్ముచు, అవిశ్వాసులతో ఇట్లనుచున్నారు: "విశ్వాసవంతులకంటె వీరే సత్యమార్గమున ఉన్నారు."

52. భగవంతునిచే శపితులైనవారు వీరు. ఎవనిని అల్లాః శపించునో వానికి ఎవ్వరును సహాయము చేయజాలరు.

53. (సత్యము ననుసరించు మీతో ఇంతగా వైరముబూనిన వీరి రాజ్యములో ఏదైన భాగముకలదా? అట్లుండి యుండినచో వారు రవ్వంతైనను ప్రజల కిచ్చియుండెడివారు కారు. ♦

54. లేక, ఎవరికేని భగవంతుడు తన అనుగ్రహముచే ప్రసాదించిన దానిని చూచి వీరు ఈర్ష్యపొందుదురా? నిశ్చయముగ ఇబ్రాహీమ్ సంతతివారికి మేము భగవద్గ్రంథమును, ప్రజ్ఞాపాటవమును ప్రసాదించితిమి. వారికొక గొప్పరాజ్యమును కూడ ప్రసాదించితిమి.

55. వారిలో కొందరు అతనియందు (ఇబ్రాహీమ్ ప్రవక్తయందు) విశ్వసించిరి. కొందరు అతనిని నిరాకరించిరి. (నిరాకరించువారికొఱకు) ప్రజ్వలించుచున్న నరకాగ్ని చాలును.

56. నా సందేశములను విశ్వసించక నిరాకరించువారిని నరకాగ్ని యందు ప్రవేశింపజేతును. వారికి శిక్ష రుచి (బాగుగా) తెలియునట్లు ఎన్నిమార్లు వారి చర్మములు కాలినచో అన్నిమార్లు వారికి క్రొత్త చర్మములు కలిగించుచుందును. § నిశ్చయముగ భగవంతుడు సర్వశక్తిమంతుడు; ప్రజ్ఞానిధి.

57. (అట్లుకాక నా సందేశమును) విశ్వసించి, సత్కార్యాచరణశీలురైనవారికి నిర్ఝరులు ప్రవహించు సుందరోద్యానముల ప్రవేశింపజేతును. అందే వారికి స్థిరనివాసము. పవిత్రలగు సహచారిణులు వారికందు లభింతురు. వారికి మహత్సౌఖ్యానందములను ప్రసాదింతును.

♦ యూదులు మహాలోభులు. వారికి రాజ్యాధికారమే ప్రసాదింపబడి యుండినచో వారెవ్వరికైనను సరే రవ్వంత లాభము కలుగకుండ చేయుదురు. రాజ్యాధికారము లేనప్పుడే వారు నీతో ఇంత వైరము పూనియున్నారు. రాజ్యాధికారమే ఉండియుండెనా వీరెంతయైనను పగబూని హింసించియుండెడివారు. అని దీనిభావము.

* మొహమ్మద్ ప్రవక్త యనియు దీని నన్వయించవచ్చును.

§ వారికి అంతరాయములేని శిక్ష లభించును.

58. (ఓ విశ్వాసవంతులారా!) మీ నమ్మకముపై మీకడ దాచి ఉంచిన నిక్షేపములను ఎవరికివ్వవలెనో వారికిచ్చివేయుడని భగవంతుడు మీ కాజ్ఞాపించుచున్నాడు. (హక్కుదారుని హక్కును నిరాకరింపకుడు.) ప్రజలమధ్య తీర్పు చెప్పునప్పుడు న్యాయముతో తీర్పు చెప్పుడు. భగవంతుడు కావించుచున్న ఈ ఉపదేశము ఎంతయు శ్రేష్ఠమైనది. నిశ్చయముగ భగవంతుడు సర్వమును వినువాడు; సర్వమును చూచువాడు.

59. ఓ విశ్వాసవంతులారా! భగవంతునకు విధేయులైయుండుడు. భగవంతుని ప్రవక్తకు విధేయులైయుండుడు. మీలో మీపై అధికారము వహించియున్నవారికి విధేయులై యుండుడు. ఏదైన విషయమునుగూర్చి మీరు (భేదాభిప్రాయపడి) జగడమునకు దిగినచో మీరు భగవంతుని వైపునకును, ప్రవక్తవైపునకును మరలుడు. (భగవదాదేశములను, ప్రవక్తయొక్క ఉపదేశములను అనుసరించి మీ వివాదములను పరిష్కరించుకొనుడు.) మీకు భగవంతునిపైనను తుదిదినముపైనను విశ్వాసమున్నచో (ఇదే మీకొఱకు ఆచరణమార్గము.) (ఈ ఆచరణమునందే) మీకు శ్రేయశ్శుభములు కలవు. దీని పర్యవసానము కూడ అత్యంత శుభప్రదమే యగును.౧౦౩

తొమ్మిదవ ఖండము

60. (ఓ ప్రవక్తా!) నీకు ప్రోక్తమైన దానియందును, నీకుపూర్వము ప్రోక్తమైన దానియందును విశ్వసింతుమని (పైకి) నమ్మజెప్పు (పయోముఖ విషకుంభములవంటి మోసగాండ్రైన) వారి స్థితిని గమనించితివా? వారు తమ జగడములను, వివాదములను తాము పూజించు శిలావిగ్రహముల కడకు తీసికొని వెళ్లుదురు.♦ (ఆ విగ్రహములను) విడిచిపెట్ట

♦ విగ్రహారాధకులు తమ తగువులను పరిష్కరించుకొనుటకు తమ దేవతావిగ్రహములకడకు వెళ్ళి బాణములతో ఒకవిధమైన సోదె చెప్పించుకొనుట అరేబియాలోను ఇతర దేశములందును ఆచార ముండెడిది.

వలసినదిగా ఆజ్ఞాపింపబడినప్పటికిని (వారిట్లు చేయుచున్నారు.) వారి మార్గభ్రంశుల నొనర్చి, వారు సత్పథమునకు మిక్కిలి దూరులగుటకు షైతాను కోరును.

61. భగవత్ప్రోక్తమైన ఆదేశమునకు, ప్రవక్తను అనుసరింపుడు అని వారిని ప్రబోధించినప్పుడు (పయోముఖ విషకుంభములవంటి) వం కులగు వీరు ద్వేషముతో ముఖము త్రిప్పుకొనుటను నీవు చూచెదవు.

62. తమ ఈ ప్రవర్తనమునకు ఫలితముగ ♦ వారిపై (శిక్షా మైన) ఆపద వచ్చినచో అప్పుడు వారిస్థితి ఏమగును? (ఓ ప్రవక్తా!) అప్పుడు వారు నీదగ్గరకు పరుగెత్తుకొనివచ్చి దేవుని పేర ఒట్టుపెట్టుకొని (ఇట్లందురు): మేము ఇదంతయు మంచికే (అనుకొని పరస్పర) సమాధా నము నకై- ఇట్లు చేసితిమి."

63. (ఓ ప్రవక్తా!) వారి హృదయములందలి రహస్యములను భగ వంతుడెఱుగును. వారినంతగా గణింపకుము. వారికి సదుపదేశము చేయ చుండుము. వారి మనస్సులపై అచ్చొత్తుకొనిపోవునట్లు ఉపదేశింపుము.

64. (ఓ ప్రవక్తా! నిన్ను అనుసరించవలసినదిగా వీరికిచ్చిన ఆజ్ఞ వీరికొక్కరికి మాత్రమే ఇచ్చిన ఆజ్ఞకాదు.) నేను ప్రపంచమునకు ఏ ప్రవ క్తను పంపినను నా ఆజ్ఞానుసారము (ఆ ప్రవక్త ప్రజలచే) అనుసరింప వలెననియే పంపితిని. ఒకసారి వారు (నీ ఆదేశములకు విధేయులై యుం డక) తమకు తాము నష్టపరచుకొని యుండిన కాలములో (పశ్చాత్త ప్తులై) నీకడకు వచ్చి తమ తిరస్కృతికి భగవంతుని క్షమార్పణము వేడుకొనినచో, భగవంతుని ప్రవక్త కూడ వారిని క్షమింపుమని భగవం తుని ప్రార్థించియుండును. భగవంతుడు మహాక్షమి యనియు, దయా నిధి యనియు అప్పుడు వారు తెలిసికొనియుందురు.

♦ "వారి చేతులు ముందే పంపినదాని ఫలితముగ" అని ప్రతిపదార్థము. అనగా "వారు స్వహస్తములతో చేసిన కర్మలకు తర్వాత కలిగిన ప్రతిఫలము." అని అర్థము.

65. నీ భగవంతునిసాక్షి! వారు తమ వివాదములను (తీర్పు కై) నిన్ను నాయకునిగా స్వీకరించనంత కాలము వారు (నిజముగా) విశ్వాసులు కానేరరు. (అంతేకాదు); నీవు చేసిన తీర్మానమును అంగీకరించి కించిన్మాత్రము వ్యతిరేకభావము లేక మనఃపూర్తిగ దానికి కట్టుబడి యుండనంతకాలము (వారు విశ్వాసులు కానేరరు.)

66. (భగవన్మార్గమున) "మీ ప్రాణముల నర్పింపుడు" లేక "మీ ఇండ్లు విడిచి దేశాంతరముల కేగుడు" అని వారి నాజ్ఞాపించి నచో, వారిలో ఏకొద్దిమందియోతప్ప తక్కినవారు ముందడుగు వేయ కుండెడివారు. వారి కుపదేశింపబడిన దాని ననుసరించి వారు ప్రవ ర్తించి యుండినచో వారికెంతయో శ్రేయస్కరమై యుండెడిది. (భగవన్మార్గమున) వారు దృఢముగ పాదుకొనియుండువారు.

67. (వారు ఈవిధముగ దృఢముగ భగవన్మార్గమున పాదుకొని ఉండియుండినచో) నిశ్చయముగ వారికి నాకడనుండి మిక్కిలి గొప్ప పుణ్యము లభించి యుండెడిది.

68. వారికి నిశ్చయముగ (శ్రేయస్సుఖముల నొడగూర్చు) ఋజు మార్గము లభించియుండెడిది.

69. అల్లాకును, ప్రవక్తకును విధేయులై యుండు వారందరును నిస్సందేహముగ భగవదనుగ్రహమునకు పాత్రులైనవారితో నుందురు. (వారు) ప్రవక్తలతోను, సత్యవంతులతోను, దృఢ విశ్వాసులతోను ఉత్తమోత్తములతోను ఉందురు. * వీ రెంతటి శ్రేష్ఠతములగు సహ చరులు!

* అధ్యాత్మికముగ ఉత్తమోత్తములు నాల్గు తరగతులుగ చెప్పబడిరి. అరబీలో వీరు ఆరోహణ క్రమమునందు 'స్వాలెహ్' 'షహీద్' 'సిద్దీఖ్' 'నబీ' అనబడుదురు.

శ్రీ ప్రవక్త మరణశయ్యపై నుండి "ఈశ్వరా! నాకు ఉత్తమోత్తము లగువారి సాహచర్యమును ప్రసాదింపుము." అని మువ్మారు ప్రార్థించి ప్రాణముల విడిచిరి.

(ఇబ్నెకసీర్ వ్యాఖ్యానమునుండి-సంపుటము ౨. పుట ౨౨.)

70. భగవంతుని మహదనుగ్రహము (ఇట్టిది). అనుగ్రహి టకు) సర్వజ్ఞుడగు భగవంతుడు చాలును.

పదవ ఖండము

71. ఓ విశ్వాసవంతులారా! మీరు (స్వసంరక్షణమునకై స ద్ధులై) జాగ్రతవహించి యుండుడు. (అవసరము వచ్చినప్పుడు వును) ఎదుర్కొనుటకై జట్టులుజట్టులుగా గాని లేక అందరు కలిసి బయలు దేరుడు.

72. మీలో ఎవడైన నొకడు (యుద్ధమునకు పిలుపువచ్చినప వెనుకడుగు వేయువాడును తప్పక ఉండును. ఒకసారి (యుద్ధము మీకేదైన ఆపద సంభవించినచో (తాను సురక్షితముగ నుండుటకు స షించి) "నేను వీరితో (యుద్ధమున) లేకపోవుట భగవదనుగ్రహ అనును.

73. మీకు భగవదనుగ్రహమువల్ల శ్రేయశ్శుభములు నప్పుడు, తనకును —కును మధ్య స్నేహానురాగముల ఎట్టి బంధ లేనట్టే (అసూయా ద్వేషములతో) "నేను వారితో ఉండియుండి ఎంతయో గొప్పలాభము సంపాదించియుందును" అని వాపోవును.

74. పారలౌకిక ఫలముకొరకు ఎవరు ఐహికజీవితమును వంతునకు) అమ్మివైచిరో వారు (ఇట్టివంచకులమార్గము ననుసరిం భగవన్మార్గమున యుద్ధమొనర్తురుగాక! ఎవడు భగవన్మార్గ యుద్ధము సల్పునో అతడు వధింపబడినను విజయము పొందినను అ మహత్తరమైన పుణ్యమును మేము ప్రసాదింతుము.

75. (ఓ విశ్వాసవంతులారా!) నిస్సహాయులగు ఇంతమంది షులు, స్త్రీలు, పిల్లలు (దుర్మార్గుల హింసలకు తాళలేక) "ప్రభూ! మ ఇంతగా బాధపెట్టుచున్న హింసకులు గల ఈ పట్టణమునుండి మ

...నిమ్ము; నీవు మాకొఱకు ఒక పోషకుని, ఒకసహాయ్యుని ప్రసా దింపుము." అని మొఱపెట్టుకొనుచుండగా (వారిని రక్షించుటకు) మీరు భగవన్మార్గమున యుద్ధముచేయుటకు వెనుదీయుచున్నారేల? *

76. విశ్వాసవంతులగువారు భగవన్మార్గమున యుద్ధము సేతురు. (వారు స్వలాభమునకై కాక సత్యముకొరకును న్యాయముకొరకును పోరా డుదురు.) విశ్వాసహీనులు సైతానుమార్గమున (అధర్మమునకై) పోరా డుదురు. అందుచే సైతాను స్నేహితులతో పోరాడుడు. (వారి బల మును సంఖ్యను లెక్కపెట్టకుడు.) సైతాను పోరాట మెప్పుడును (పైకి చూచుట కెంత బలవత్తరమైనదైనను సత్యము నెదుర్కొన్నప్పుడు) దుర్బ లమైనదే.

పదునొకండవ ఖండము

77. (ఓ ప్రవక్తా! యుద్ధమునుండియు రక్తపాతము నుండియు) మీ చేతులను కళంకిత మొనర్చుకొనక, ప్రార్థన సల్పుటయందు తత్ప రులై యుండి, దాననిరతులై యుండుడు" అని ఆజ్ఞాపింపబడినవారి స్థితిని గమనించితివా? (ధర్మరక్షణార్థము) వారికి యుద్ధము విధింపబడినప్పుడు, వారిలో కొందరు (తమవంటి) మనుష్యులనే చూచి భగవంతునకు భయ పడినట్లు భయపడుచున్నారు; అంతకంటె అధికముగ కూడ. (అట్లు భయ పడి) వారిట్లందురు: "ప్రభూ! మాకు యుద్ధముచేయుట నేల విధించితివి? మాకు మరికొన్నిదినములు (బ్రతుకు) గడువేల ఈయవైతివి?"

(ఓ ప్రవక్తా: వారితో) ఇట్లనుము: "(మీరు ఏ ప్రపంచమునందలి ప్రీతిచే మృత్యుభయము పొంది ఇట్లు వెనుదీయుచున్నారో) ఆ లౌకికలా భము అత్యల్పమైనది. ఎవరు (మానవులకు బదులు) భగవంతునకే భయ

* శ్రీ ప్రవక్త ఎందుకు యుద్ధములు చేయవలసి వచ్చెనో ఈ సూక్తమునుండి గ్రహించవచ్చును.

పడుదురో* అట్టివారికి ఆముష్మికఫలమే ఉత్తమమైనది. అక్క... గింజంతైనను అన్యాయము జరుగదు.

78. మీ రెక్కడున్నను సరే మృత్యువు మిమ్ములను ...డించి పట్టుకొనును. మీరు ఉన్నతమైన బలిష్ఠమగు దుర్గములలో యున్నను సరే (మృత్యువువాతను తప్పించుకోజాలరు.)

వారి కేదైన శుభము కలిగినప్పుడు "ఇది భగవత్ప్రసాదిత... (ఇది మా చేతులకు భగవంతునిచే నిర్ణయింపబడిన ఫలము) అందు... కాని వారి కేదైన కీడు మూడెనా, "ఇది నీవల్ల కలిగినది," అందు... (ఓ ప్రవక్తా!) వారితో ఇట్లు చెప్పుము: "అంతయు భగవంతునికడను... డియే. (ఏది జరిగినను అది భగవత్కృతమే. భగవంతుని ప్రకృతిధర్మ... ము ననుసరించి ఆయాచేతల కాయాఫలము కలుగుచుండును.) ఈ ప్రజ... కేమైనది? వారికి చెప్పబడినదానిని గూర్చి యోజింపనైన యోజింప...

79. (వాస్తవమేమనగా) మీకు ఏమంచి కలిగినను అది భ... త్ప్రసాదితము. ఏ నష్టము కలిగినను అది మీరు (స్వహస్తములతో) చే... కొనినది. (అది మీ దుష్ప్రవర్తనముయొక్క ఫలితము.)

(ఓ ప్రవక్తా!) మేము నిన్ను ప్రవక్తనొనర్చి మానవులకొర... (ఒక సందేశమునిచ్చి) పంపితిమి. (నీపని నా సందేశము వినిపించుట మా... త్రమే.) దీనికి అల్లాహ్ యే సాక్షియగుట చాలును.

80. ఎవరు (భగవంతుని సందేశమును గొనివచ్చిన) ప్రవక్త... విధేయులో వారు (వాస్తవముగ) భగవంతునకుకూడ విధేయులైయుం... దురు. ఎవరు (ప్రవక్త ఆజ్ఞలకు) విముఖత్వము చూపిరో (వారిని

---

* "భగవద్భక్తిపరులకు లేక సన్మార్గప్రవర్తకులకు ఆముష్మికఫలమే ఉత్తమ మైనది" అనియు అర్థము చెప్పవచ్చును. 'తఖా' అను శబ్దమునకు 'భయము' 'సత్ప్రవర్తనము' 'భగవద్భీతి' అను అర్థములు కలవు.

...నిమ్ము.) వారిపై నిన్ను రక్షకునిగా చేసి పంపలేదు. ♦ (వారి నడవడికి ...వు బాధ్యుడవు కావు.)

81. (వీరు నీ ఎదుట మాత్రము నీ మాట విని) "(మీ ఆజ్ఞను) శిర ...సావహించితిమి" అని చెప్పుదురు. కాని నీ ఎదుటినుండి లేచి బయటకు ...వెళ్ళి వారిలో కొందరు రాత్రులందు (రహస్యముగ) సమావేశమై నీవు ...చెప్పినదానికి వ్యతిరేకముగ కుట్రలు పన్నుదురు. రాత్రులందు వీరుచేయు ...సమావేశములలో వారు చేయునదంతయు (భగవంతునిముందు రహస్య ...ముగ లేదు. దానిని వారి కర్మపత్రములందు) భగవంతుడు వ్రాసియుం ...చును. అందుచే ఇట్టివారిని లెక్కగొనకుము. భగవంతునే నమ్మియుం ...డుము. మీకు సంరక్షకు డగుటకు భగవంతుడు చాలును.

82. ఏమి! వీరు ఖుర్ ఆన్ (యొక్క ఉపదేశముల) ను గూర్చి ...శ్రద్ధతో యోచింపరా? ఇది అల్లాహ్ కడనుండి కాక మరెవ్వరి కడనుండి ...యైన వచ్చియుండినచో ఇందులో ఎన్నోచోట్ల స్వవచనవ్యాఘాతము ...లుండియుండును.౧౧౫

83. శ్రేయస్సునకు సంబంధించినది కాని భీతికి సంబంధించినది ...గాని వారికేదైన వార్త తెలిసినప్పుడు దానిని ప్రజలలో (అపవాదరూప ...మున) వ్యాపింపజేతురు. (దానికిబదులు) వారు తమ ప్రవక్తకును, తమలో ...అధికారము నందున్నవారికిని, కుశాగ్రబుద్ధులకును, చెప్పియున్నచో ...వారు (ఆవిషయమును తరచి దాని మంచిచెడ్డలను) గ్రహించు వారు. (దానివలన ప్రజలలో భీతావహము కల్గెడిదికాదు.) భగవంతుడు మీపై అనుగ్రహము చూపి మిమ్ములను కరుణించియుండనిచో (మీ దౌర్బల్య ...ముల వల్ల) మీలో కొందరు తప్ప తక్కినవా రెల్లరును సైతాను (యొక్క దుష్పథము) ను వెంబడించి యుండువారు.

♦ రక్షకుడు భగవంతు డొక్కడే; మరెవ్వరును కారని భావము.

84. మరి (ఓ ప్రవక్తా! వీరు నీకు తోడ్పడుదురా లేక తోడ్ప... అన్న విషయములెక్క సేయక) నీవు భగవన్మార్గమున యుద్ధమొనర్పు... నీ బాధ్యత నీకుగాని, నీ కితరుల బాధ్యత లేదు. విశ్వాసవంతులయ... ఉత్సాహమును పురికొల్పుము. విశ్వాసహీనుల ఈ యుద్ధపు ఉబల... మును భగవంతుడు త్వరలో తగ్గించును. భగవంతుడు సర్వ శక్తి... తుడు. (ఇతరులకు గుణపాఠ మగునట్లు) శిక్షించుటలో కఠినుడు.

85. ఒక సత్కార్యములో మరొకనితో కలసి పనిచేయువా... దాని ఫలితములో భాగముకలదు. ఒక దుష్కార్యములో మరొకని... కలిసి అతనికందు తోడ్పడువాడు (ఆ దుష్కార్యముయొక్క) ఫలిత... ననుభవింపవలసి వచ్చును. భగవంతుడు సర్వవస్తు సంరక్షకుడు.

86. (ఓ విశ్వాసవంతులారా!) మీకు ఆశీః పూర్వకమైన వంద... మాచరింపబడుచో, మీరు అంతకంటె మంచిమాటలతో ఆశీస్సు... వందనమును అర్పింపుడు. * లేదా (అధమము) అవేమాటలతో వంద...

♦ 'ఏదేని సత్కృతివిషయమున ప్రోత్సహించినచో' అనియు, అట్లే తరు... వాక్యార్థమున 'ఏదేని దుష్కృతివిషయమున ప్రోత్సహించినచో' అనియు కొందరర్థము... వ్రాసిరి.

* "అస్సలామొ అలైకుమ్" (మీకు శాంతి చేకూరుగాక!) ఇది ఖుర్ఆన్ నిర్ణయించిన వందనపద్ధతి. దీనికి ప్రత్యుత్తరముగ "వ అలైకుముస్సలామ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు" (మీకుకూడ శాంతి చేకూరుగాక! భగవంతుని అనుగ్ర... మును శ్రేయశ్శుభములును కలుగుగాక! అందురు. మొదటి వందనముకంటె ప్రత్యు... త్తర వందన ముత్తమముగ నుండుట స్పష్టము. ఈ విధముగ ఇస్లాములో వందన మా... రించురీతి ఒకరి శ్రేయశ్శుభముల నొకరు కోరుకొను ఒక పద్ధతి యైపోయినది. ఒక ముస్లిమ్ మరొక ముస్లిమ్‌ను కలసినప్పుడు స్త్రీ పురుష బాల వృద్ధ, ధనిక నిర్ధన అధికని... భేదము లేకుండా వందన మాచరించుపద్ధతి ఇది. దీనివలన పరస్పరసద్భావమును, పరస్పర హితాభిలాషయు వెల్లడియగును.

ఈ అజ్ఞ ముస్లిమ్ సంఘమునకు మాత్రమేకాక అందరికిని వర్తించును. ఒక ముస్లిమ్ మరొక ముస్లిమ్‌ను కలిసినప్పుడే ఇట్లు చేయవలెనని కాదు దీని అర్థము. ఒక ముస్లిమ్ మరే మతమునకు ఏ జాతికి చెందిన వ్యక్తిచే వందన మాచరింపబడినను అం... కంటె మంచి మాటలలో దానికి ప్రత్యుత్తర మొసగవలెను. (హజరత్ ఇబ్నె అబ్బాస్ గారి వాక్యములు ఇబ్నెకసీర్ భాష్యములో ఉద్ధృతము. సం. ౨. పుట. ౬౭.)

...పుము. ప్రతివస్తువు తప్పక భగవంతుడు గణించును. (మీచే తా... చు ప్రతి చిన్న సత్కృతిని గణించి దానికి ఫలమును ప్రసాదించును.)

87. ఏకమాత్రుడగు భగవంతు డొక్కడు తప్ప మరెవ్వరును ...రాధనమునకు (గాని స్తోత్రమునకుగాని) అర్హులుకారు. నిశ్చయముగ ...దినమునాడు మిమ్ములనందఱను భగవంతుడు ఒకచోట (తన సమక్ష ...మున) చేర్చును. ఇందెంతమాత్రము సందేహములేదు. (ఇది భగవ ...దుక్క.) భగవంతునికంటె ఎవరు ఎక్కువ సత్యము వచింపగలరు?

పండ్రెండవ ఖండము

88. (ఓ విశ్వాసవంతులారా!) మీకేమైనది? (పయోముఖ విష ...కుంభములవంటి) ఈ వంచకులవిషయములో మీరు రెండు పక్షములుగ ...చీలిపోయినారు? భగవంతుడు వారి చేతలకు ఫలితముగ వారిని (అవి ...శ్వాస మార్గమునకు) మరల్చినాడు. (అందుచే వారు సన్మార్గమును కోల్పోయిరి). భగవంతుడు పతితుల నొనర్చిన వీరికి సన్మార్గము చూపదల ...తురా? (తన నియమముల ననుసరించి) భగవంతుడు ఎవరిని భ్రష్టుల ...నొనర్చునో వారికి మీరు సన్మార్గమును చూపలేరు.

89. తాము అవిశ్వాసులైనట్లే మీరుకూడ అవిశ్వాసులు కావ ...లెనని వారి కోరిక. దీనివల్ల మీరును వారితో సమానులైపోవలె నని (వారి ఉపాయము). అందుచే (వారు మీ శత్రువుల సాంగత్యమును విడిచి) భగవన్మార్గమున స్థలాంతరమునకు వలస పోయి [మీతో కలియ] నంత వరకు, వారిలో ఎవరితోడను మైత్రి చేయకుడు.

మరి వీరు వలసపోవుటకు నిరాకరించినచో (జ్ఞాపకముంచుకొనుడు యుద్ధకాలములో ఎవరు శత్రుపక్షమున శత్రువులతో కలిసియుందురో వారు కూడ మీకు శత్రువులే. అందుచే) వారెక్కడ చిక్కినను వారిని పట్టు కొనుడు; వధింపుడు. వారిలో ఎవరితోడను మైత్రిచేయకుడు. వారిలో

నెవరినైనను మీకు సహాయ్యులుగా నంగీకరింపకుడు. (అట్లు చేసి[...] వారు తొలుత మిత్రులవలె నటించి తర్వాత మీకు అపాయమును క[...] జేతురు.)

90. ఎవరు (మీశత్రువును విడిచి) మీతో సంధిచేసికొని (తట[...]ముగ) ఉన్న పక్షములతో కలియుదురో; లేక, ఎవరు మీతో పో[...]డుటకు గాని, లేక (మీ పక్షముననుండి) తమవారితో దెబ్బలాడుట[...] గాని రోసి, మీదగ్గరకు వచ్చిరో (వారు పై నియమముక్రిందకు రా[...] వారితో యుద్ధము చేయకుడు.) ఎందుకనగా భగవంతు డిచ్ఛించిన[...] వారుకూడ మీతో యుద్ధముచేసి మీపై ఆధిక్యతను సంపాదిం[...]యుండువారు. అందుచే వారు తటస్థులైయుండి, మీతో సంధి చేసికొ[...]టకు రాయబారము పంపినచో మీరు అట్టివారితో, వైరముపూ[...] యుద్ధముచేయుట ఎంతమాత్రము తగదు. ♦

91. వీరుకాక మరొక పక్షమువారున్నారు. వారు మీతోడ[...] జగడము లేకుండ, తమవారితోడను వైరములేకుండ (తటస్థులై) ఉం[...] గోరెదరు. కాని వారి నెవరైనను చెడుదారి కీడ్చిరా * ఇంక దాని[...] వారు వెనుకముందు లాలోచింపక దుడుకుతనముతో దూకుదురు. ఇ[...] వారు తటస్థులైయుండక, మీకడకు సంధి రాయబారము పంపక, మీ[...] కయ్యమునకు కాలుత్రవ్వినచో వారెక్కడ చిక్కిన నక్కడ పట్టుక[...]నుడు. ఎక్కడ చిక్కిన నక్కడ వధింపుడు. వారితో యుద్ధ[...] చేయుటకు మీకు స్పష్టమైన అధికారము నిచ్చితిమి.౧౯౯

♦ "ఇట్టివారితో యుద్ధము చేయుటకు భగవంతుడు మీకై ఎట్టి మార్గము[...] విడిచిపెట్టలేదు." అని మూలము. అవిశ్వాసులైనను శాంతిపై యుండ గోరినవారి[...] యుద్ధము చేయరాదని ఇక్కడ భావము.

ముసల్మానులతో యుద్ధమునకు దింపబడినచో" అని భావము.

పదమూడవ ఖండము

92. (ఒకసారి) పొరపాటున (అట్టి అకార్యము జరిగిన) తప్ప, లేనిచో ఒక విశ్వాసవంతుడు మరొక విశ్వాసవంతుని వధించుట ఎంతమాత్రము తగదు. ఒకసారి ప్రమాదవశమున ఒక విశ్వాసవంతుడు మరొక విశ్వాసవంతుని వధించినచో ఒక ముసల్మాను బానిసకు స్వాతంత్ర్యము నొసగి, వధింపబడినవాని వారసులు ఆ ధనమును దానముగ నిచ్చిన నివ్వవచ్చును §

ఒకసారి (వధింపబడి) వాడు, మీ శత్రువు తెగవాడై, విశ్వాసవంతుడైనచో ఒక విశ్వాసవంతుడగు బానిసకు స్వాతంత్ర్య మిచ్చిన చాలును. (రక్తశుల్క మివ్వనక్కరలేదు. ఎందుకనగా వధింపబడినవాడు ముసల్మానైనను అతని వారసు లందరును శత్రువర్గమున నుండి మీతో పోరాడుచున్నారు కదా!)

ఒకసారి (వధింపబడిన) వాడు, మీతో సంధిచేసికొని తటస్థముగ నున్న తెగకు చెందినవాడైనచో (వధించినవాడు వధింపబడిన) వాని వారసులకు రక్తశుల్కము నివ్వవలెను. (అంతేకాదు) ఒక ముసల్మాను బానిసకు స్వాతంత్ర్య మివ్వవలెను.

ఒకసారి మీకడ బానిస లేకపోయినచో (అనగా బానిసకు స్వాతంత్ర్య మిప్పించుపాటి ధనము లేకపోయినచో) వరుసగా రెండు నెలలపాటు ఉపవాస ముంచవలెను. ఇది భగవంతుడు విధించిన ప్రాయశ్చిత్తము. భగవంతుడు సర్వజ్ఞుడు; ప్రజ్ఞానిధి.

93. ఎవడు ఉద్దేశపూర్వకముగ ఒక విశ్వాసవంతుని వధించునో వానికి శిక్ష నరకాగ్ని. వానికందే స్థిరనివాసము. భగవంతుడు వానిపై

§ "క్షమించవచ్చును" అని కూడ ఇక్కడ అర్థము చెప్పవచ్చును. అబుల్ కలాం ఆజాద్ గారి అర్థమునే గ్రహించిరి. అష్రఫ్ ఆలీ థానవీ, మొహమ్మద్ ఆలీ గారు నేను గ్రహించిన అర్థమును వ్రాసిరి.

తన ఆగ్రహమును బరపును. వానిని శపించును. వానికై ఘోరశిక్ష సిద్ధపరచును.

94. ఓ విశ్వాసవంతులారా! మీరు భగవన్మార్గమున యుద్ధ చేయబోయినప్పుడు (మీ ప్రతిపక్షపు తెగలలో ఎవరు శత్రువులో ఎవ మిత్రులో) బాగుగా విచారణ సేయుడు. మీకెవడు సలాము♦ చేయు వానిని "నీవు ముసల్మానువు కావు" అనకుడు. ఏమి! మీరు (నశ్వ మగు) ఈ జీవితపు ఐహికసంపదలను ఆశించువారా? (ఐహికసంపదల పొందగోరినచో) భగవంతునికడ (న్యాయమార్గమున నార్జించుటకు) పుష్క లమగు సంపదలు కలవు. (మీరు ఐహికలాభమునకై రక్తపాతము చేయవలెను?) మీరుకూడ పూర్వము ఇట్టి స్థితియందే ఉండిరికదా (ముసల్మాననిపించుకొనుటకు మీకడ మరేచిహ్నముండెను?) తరువా భగవంతుడు మిమ్ముల ననుగ్రహించెను. (ఒక ఇస్లామీయ జీవిత వి నము మీకొఱకై విధింపబడెను.) అందుచే (మీరు యుద్ధమారంభించుట పూర్వము ప్రజల మంచిచెడ్డలనుగూర్చి) బాగుగా విచారణ సేయుడు. మీరు చేయునదంతయు భగవంతు డెఱుగును.

95-96. (గాయపడినవారుతప్ప తక్కినవారిలో) ఎవరు ముసల్మానులతో (జిహాదులో చేరక) ఏ దుఃఖమును లేక ఇంట కూర్చొనియుండిరో వారు, భగవన్మార్గమున చేయబడు జిహాదు* కొరకు తమ ప్రా

♦ "అస్సలామొ అలైకుమ్" మీకు శ్రేయశ్శాంతులగు గాక! అనుట ఖుర్ఆ విధించిన వందనపద్ధతి. 86 వ సూక్తిపైని అడుగు టీకను చూడుడు.

'ఎవడు మీతో శాంతిమై నుండగోరునో' అనియు దీని కర్థము వచ్చును. కా బహుళసంఖ్యాకులు గ్రహించు అర్థము నే నిచ్చితిని.

* జిహాద్ అనగా యుద్ధముకాదు. 'శ్రమపడి ప్రయత్నించు,' లేక 'ఉద్య మించు' అని వ్యుత్పత్త్యర్థము. స్వసంరక్షణమును, స్వధర్మసంరక్షణమునకు ఉద్యమించుట, లేక ధర్మవిధ్వంసమునకై పాటుపడు దుష్టశక్తుల నణచుటకై శ్రమపడి ప్రయత్నించుట" అని ఇక్కడ అర్థము.

ధనములను సమర్పించినవారితో సమానులు కానేరరు. తమ ధన ప్రాణములతో జిహాదు చేయువారికి ఇంట కాళ్ళు ముడుచుకొనియుండువారిపై భగవంతుడు ఆధిక్యత నిచ్చినాడు. (ఇంట కూర్చుండియుండువారెంతటి యోగ్యులైననుసరే). భగవంతుడు (ఎట్టి సత్కార్యములకు అట్టి) సత్ఫలము నిత్తునని వాగ్దానము చేసెను. (ఎవరి సత్కృతియు వ్యర్థము కాదు. కాని ఫలములలో తరగతులును కలవు. అందుచే) జిహాద్ చేయువారికి ఇంట కూర్చొని యుండువారికంటె మిక్కిలి గొప్ప ఫలము ప్రసాదించును. (ఈ) తరగతులు భగవంతు డేర్పరచినవి. క్షమా కృపలు (కూడ భగవంతుని కడనుండియే వచ్చును.) ఎందుకన భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

పదునాలుగవఖండము

97. (శత్రువుల సాంగత్యమున నుండి) ఆత్మహాని గావించుకొనిన వారి ప్రాణములను హరించి దేవదూతలు "మీరెట్టి స్థితియందుండిరి?" అని అడిగినప్పుడు, వారిట్లు ప్రత్యుత్తరమిత్తురు: "మేమేమి చేతుము?) మేము భూమియందు నిస్సహాయులమై యుంటిమి. (అందుచే మేము మావిశ్వాసము ననుసరించి జీవితమును గడుపజాలక పోతిమి.)" దానికి దేవదూత లిట్లందురు: "మీరుమీదేశమున నిస్సహాయులై యుండినచో) ఏమి! భగవంతుని భూమి మీరు వలసపోవుటకై విశాలముగ లేకపోయెనా?" (మొత్తమునకు) ఇట్టివారి నివాసము నరకము. అదిఎంతటి తుచ్ఛనివాసము!

98-99. కాని పురుషులలోను, స్త్రీలయందును, పిల్లలయందును అశక్తులైన వారు స్వస్థలమునందే యుండుటకంటె వేరుగతి లేక (వలస) పోజాలని పక్షమున భగవంతుడు వారిని క్షమించును. ఎందుకన భగవంతుడు పాపములను తుడిచివేయువాడు; మహాక్షమి.

100. భగవన్మార్గమున (తమ ఇళ్ళు వాకిళ్ళు విడిచిపెట్టి) వలసపోవుదురో, వారికి తలదాచుకొనుటకై భూమిపై పెక్కు నివాసస్థానములు, పుష్కలమగు సంపత్సాధనములు లభించును. తమ ఇళ్ళను విడిచిపెట్టి భగవంతుని కొఱకు, అతని ప్రవక్తకొఱకు వలసపోవువా ఎవరికైన (మార్గమధ్యమున) మృత్యువు సంభవించినచో, అతనికి ఫలము భగవంతుని సమక్షమున స్థిరపడిపోయినది. భగవంతుడు క్షమి; దయానిధి.

పదునైదవ ఖండము

101. మీరు (యుద్ధసన్నద్ధులై) భూమిపై ప్రయాణము బోయినప్పుడు, మీకు (శత్రువులగు) అవిశ్వాసులు అపాయము తురని భయమున్నయెడల, ప్రార్థనల (సంఖ్య)ను తగ్గించినచో దో కాదు. నిస్సంశయముగ అవిశ్వాసులు మీకు బద్ధశత్రువులు. యము దొరికినప్పుడు వారు మీపై పడుదురు.)

102. (ఓ ప్రవక్తా! యుద్ధము జరుగుచుండగా) ముసల్మాన ఉండినప్పుడు నీవు వారికొఱకు నమాజు చేయగోరినచో, (సైన్యము ఒక జట్టు తమతమ ఆయుధములను ధరించి నీవెనుక నిలువబడియు ప్రార్థన చేయవలెను. సాష్టాంగపడి అయిపోయినపిదప, వారు కకు వెళ్ళిపోవలెను. అప్పుడు నీతో ప్రార్థనమునందు చేరని రె జట్టప్పుడు ప్రార్థనకు రావలెను. వారు జాగరూకతతో మెలగియు టయు, శస్త్రధరులై ఉండుటయు (అవసరము.)

అవిశ్వాసమార్గము నవలంబించిన (మీశత్రువులగు) వారు మీ ఆయుధములు ఇతరసామగ్రి విడిచి ఏకొద్దిపాటు అజాగ్రత్త వహించి మీపై అందరు కలిసి హఠాత్తుగ విరిగి పడజూతురు. (అందుచే మీ ప్రార్థన చేయునప్పుడుకూడ జాగ్రత్తవహింపుడు.)

వర్షము కురియుచుండుటచే ఇబ్బందికల్గినను, రోగగ్రస్తులై యున్నప్పుడును ఆయుధములనుదించి ప్రార్థన సలిపినను దోషము కాదు. స్వసంరక్షణమందు ఏమరపాటు నొందరాదు. సత్యమును నిరాకరించు వారికొఱకు భగవంతుడు నిశ్చయముగ ఘోరమగు శిక్షను సిద్ధపరచి యున్నాడు.

103. మీరిట్లు ప్రార్థనలను పూర్తిగా కావించినపిదప, నిలువబడి యుండినను, కూర్చొనియున్నను, ప్రక్కలపై యుండినను, (ఏ స్థితియందుండియు) భగవంతుని స్మరింపుడు. (ఒక్క ప్రార్థన కాలము నందే కాదు; అన్నివేళలయందును భగవంతుని స్మరించుచుండుడు.)

(శత్రుభయములేక) శాంతినెలకొనినప్పుడు [ఎప్పటివలె] ప్రార్థనలు సల్పుడు. నిస్సంశయముగ ముసల్మానుల కొరకు నిర్ణీతకాలములలో ప్రార్థనము విధింపబడినది.

104. శత్రువును వెన్నాడుటయందు అలసులు కాకుడు.* మీకు (యుద్ధములో) కష్టములు కల్గినచో, మీకు కష్టములు కల్గినట్లే వారికిని కష్టము కల్గుచున్నది కదా! కాని [వారికంటె మీ ఆధిక్యత ఏమనగా] మీకు [విజయముయొక్కయు పుణ్యముయొక్కయు] ఫలమును భగవంతుడు ప్రసాదించునను ఆశకలదు. వారికా ఆశలేదు. (ఎందుకనగా మీరు భగవన్మార్గమున ధర్మసంస్థాపనమునకై పోరాడుచున్నారు. వారు స్వలాభమునకై మిమ్ములను హింసించుచున్నారు.) భగవంతుడు సర్వ డు; ప్రజ్ఞానిధి.

పదునారవ ఖండము

105. (ఓ ప్రవక్తా!) సత్యమును బోధించు ఈ గ్రంథమును భగవదాదేశముల ననుసరించి ప్రజలమధ్య తీర్పుచెప్పుటకై మీకు వెలువరచితిని. విశ్వాసద్రోహుల పక్షమున వాదించకుము.

---

*"ధైర్యమును కోల్పోవకుడు" అనియు కొందరర్థము వ్రాసిరి.

106. భగవంతుని క్షమాభిక్ష వేడికొనుడు. భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

107. ఆత్మ ద్రోహులను వెనుకవేసికొని వాదించకుము. విశ్వాసఘాతకులను, పాపిష్ఠులను భగవంతుడు ప్రేమింపడు.

108. (విశ్వాసఘాతకులు) మానవుల (దృష్టి) నుండి (తమ ద్రోహచింతనమును, ద్రోహకార్యములను) దాచిపుచ్చ వచ్చును. కాని భగవంతుని (దృష్టి) నుండి దాచియుంచలేరు. (భగవంతుడు సర్వసాక్షి.) వారు రాత్రులందు కుట్రలు పన్నుటకై కూడి భగవంతున కిష్టములేని మాటలు చెప్పికొనునప్పుడు భగవంతుడు కూడ అక్కడుండును. వారు చేయునదంతయు భగవంతుడెఱుఁగును.

109. ఈ ప్రాపంచిక జీవితములో వీరి పక్షమున మీరు వాదించిరి. కాని తుదిదినమునాడు భగవంతుని ఎదుట వారి పక్షమున ఎవరు వాదించగలరు? ఆనాడు వారిని ఎవరు రక్షించగలరు?

110. ఏదేని దుష్కృతి నాచరించియు, లేక ఆత్మహాని యొనర్చుకొనియు (పశ్చాత్తప్తుడై) భగవంతుని క్షమాపణను నెవడు వేడునో వానిని భగవంతుడు మన్నించును; కరుణించును. *

111. ఎవడు పాపముల నాచరించునో వాడు తన ఆత్మను తానే నష్టపరచుకొనును. భగవంతుడు సర్వజ్ఞుడు; ప్రజ్ఞానిధి.

112. ఎవడు పాపము నాచరించియు, తప్పిద మొనర్చియు (తాను తప్పించుకొనుటకై ఏపాప మెఱుగని) మరియొకనికి (ఆ పాపముగాని, తప్పిదముగాని) అంటగట్టునో, వాడు అపవాదముయొక్కయు ఒక స్పష్టమైన పాతకముయొక్కయు భారమును వహించవలసియుండును.

* "అట్టివారు భగవంతుడు మహాక్షమి యనియు, కరుణాళువనియు తెలిసికొందురు." అని ప్రతిపదార్థము.

పదునేడవ ఖండము

113. (ఓ ప్రవక్తా!) నీపై భగవదనుగ్రహమును, దయయు లేకపోయి యుండినచో వీరిలో ఒక పక్షమువారు (అసలు నేరస్థుని ప్రోద్బలమునకై ఏకమై) నిన్ను తప్పుమార్గమును పట్టించువారు. (నీవును ఏపాప మెరుగని వానిని నేరస్థుడనుకొని యుందువు.) నిజముగ వారు నిన్ను కాదు తప్పుమార్గము పట్టించినది; వారి ఆత్మలనే. నీకు వారెంతమాత్రమును హాని కలిగింపజాలరు. భగవంతుడు నీకు జ్ఞానగ్రంథమును ప్రజ్ఞావివేకములను ప్రసాదించెను. నీకు తెలియని విషయములను నేర్పెను. నీపై భగవంతుడు మహదనుగ్రహము కలిగియున్నాడు.౧౧౦

114. వారి ఈ రహస్యాలోచనములలో పెక్కాలోచనలు (వారికి సైతము) శ్రేయస్కరమైనవి కావు. ఐతే దానముచేయుమని గాని, అట్టి మరే సత్కృతి నొనర్పుమనిగాని ఆజ్ఞ ఇచ్చినను, లేక ప్రజలలో గల తగవులను మాన్చి వారిలో సమాధానము కుదుర్చుటకును (రహస్యాలోచనము చేసిన అది మంచిదే.) ఎవరు భగవత్ప్రీతికై ఇట్టి పనులు సేతురో మేము వారికి మిక్కిలి గొప్ప పుణ్యమును ప్రసాదింతుము.

115. ధర్మమార్గము స్పష్టముగ చూపబడిన పిదప కూడ ఎవడు ప్రవక్తకు వ్యతిరేకముగ వైరభావమును పూని, విశ్వాసవంతుల మార్గమును విడిచి ఇతరమగు దుష్టమార్గముల ననుసరించునో వానిని వాని ఇష్టమువచ్చిన మార్గమువైపునకే నడిపించి నరకమునకు చేర్తుము. ఇది ఎట్టి కఠోరమగు గమ్యస్థానము!

పదునెనిమిదవ ఖండము

116. భగవంతునితో సమానులను నిలబెట్టు పాపమును భగవంతుడెంతమాత్రమును క్షమింపడు. ఇదికాక మరేపాపమునైనను భగవంతు

డిచ్చించుచో మన్నించును. భగవంతునితో ఎవడు సమానులను నిలబెట్టునో వాడు నిశ్చయముగ మహాపాతకము చేసినవాడు.౧౧౬

117. వీరు భగవంతుని విడిచి (జడములగు) స్త్రీ విగ్రహముల* ముందు మొఱపెట్టుకొందురు. వారు నిజముగా దుర్మార్గుడగు సైతాను ముందు మాత్రము మొఱపెట్టుకొందురు.౧౧౭

118. భగవంతుడు సైతానును శపించినాడు. కాని (సైతాను అట్లు శపితుడై భగవంతునితో) ఇట్లు విన్నవించుకొనెను. "మానవులను (త్రోవతప్పించుటలో) నేను ఒక నిర్ణీతభాగము గైకొందును.

119. "వారిని నేను దారితప్పించి వారిలో తుచ్ఛమగు కోర్కెల రేకెత్తింతును. వారిలో మూఢవిశ్వాసముల గల్గించి వారు జంతువుల చెవులు చీల్చి (దేవతల మొక్కుబడులను చెల్లించుటకై విడిచిపెట్టి మూఢత్వమునకు సైతము మొగ్గునట్లు) చేయుదును. వారు భగవత్సృష్టిని మార్చునట్లు చేయుదును."♦ ఎవడు భగవంతుని విడిచిపెట్టి

* "ఇనాసా" అని మూలము. ఈ శబ్దమును నేను "(జడములగు) స్త్రీ విగ్రహములు" అని అనువదించితిని. "ఇనాసా" అనగా "స్త్రీలు" అని అర్థము. అరబ్బులు స్త్రీ విగ్రహములను పూజించువారు. ఈ స్త్రీ విగ్రహములను దేవుని పుత్రికలని పిలుచువారు. ఈ విగ్రహములు దేవునికడకు తమ్ము గొంపోవునని వీరు నమ్ముచుండిరి. రాయి, కఱ్ఱ, మన్ను మున్నగు జడపదార్థములు 'ఇనాస్' అనబడునని కొందరు వ్యాఖ్యాతలు. "ఆరాధనమునకై ఏర్పడిన విగ్రహములు" అని కొందరు వ్యాఖ్యాతలు.

♦ "భగవంతునిచే చేయబడిన ఆకారమును చెడగొట్టుడని వారినందును" (తఫ్సీరె మొహమ్మదీ) అని కొందరును, "భగవన్నిర్మితమగు (ప్రకృతి సహజమైన) ధర్మమును చెడగొట్టుడని వారినందును" అని కొందరును (ముజాహిద్, అక్రిమా, అబ్దుల్లా బిన్ అబ్బాస్ ఇత్యాదులు) దీనికర్థము చెప్పిరి. ప్రతిమానవుడును ప్రకృతిసిద్ధముగ పవిత్రుడై జన్మించుచున్నాడనియు అతని తల్లిదండ్రులతనిని అసత్యాధర్మములలో ప్రవేశింప జేయుచున్నారనియు శ్రీ మొహమ్మద్ ప్రవక్త వచనము. ౩౦ వ అధ్యాయమున ఖుర్ ఆన్ ఇట్లనుచున్నది. "ఈశ్వరుడు మానవు నెట్టి ప్రకృతితో సృజించెనో, ఆ

సైతానును సంరక్షకునిగ గ్రహించునో వాడు పతితుడగును. వాడు పొందు నష్టము విస్పష్టమైనది.౧౧౯

120. సైతాను వారికి వట్టి ఆశలు కల్పించి తుచ్ఛమగు కోరికలలో పడవేయును. సైతాను వారికి చూపిన ఆశలన్నియు మోసముతో కూడుకొనినవి.

121. (తుదకు) నరకమునందు నివసింపవలసినట్టివారు వీరే. నరకమునుండి వీరికి ముక్తిమార్గము లభింపదు.

122. ఎవరు విశ్వాసవంతులై, సత్కార్యాచరణ పరులై యుందురో వారిని (శాంతి సౌఖ్యముల) నిర్ఝరులు ప్రవహించు ఉద్యానవనములలో ప్రవేశింపజేతును. వారికందే నిత్యనివాసము. (వారికక్కడ అక్షయమైన శాంతియు ఆనందమును చేకూరును.) భగవంతుని ఈ వాగ్దానము సత్యము. భగవద్వాక్కుకంటె ఎవరివాక్కు ఎక్కువ సత్యమైనది?

123; (ఓ విశ్వాసవంతులారా! ముక్తియు పుణ్యమును) మీహృదయవాంఛలపై గాని క్రైస్తవయూదుల వాంఛలపైగాని (ఆధారపడి) లేదు. (అవి మీ విశ్వాసముపైనను స్వకీయ కర్మలపైనను ఆధారపడియున్నవి.) ఎవడు దుష్కార్యముల నాచరించునో (అతడెవడైనను సరే) దాని దుష్ఫలము నతడు అనుభవించక తప్పదు. భగవంతుడు తప్ప వారికి మరెవ్వడును బాంధవుడుగాని సహాయ్యుడుగాని లభింపడు.

124. సత్కార్యాచరణపరులు — పురుషులైనను స్త్రీలైనను— విశ్వాసము కలవారైనచో వీరు స్వర్గమును ప్రవేశింతురు. వారి (పుణ్య

స్వభావ సిద్ధమైన స్థితియే మానవుని మతధర్మము. భగవత్సృష్టిలో మార్పులేదు. అదే సత్యమైన మతధర్మము. కాని పలువురకది తెలియదు. అందుచే అదే ధర్మమునైపునకు మీరుముఖులుగండు." (౩౦-౩౦) ప్రకృతియందు స్థాపితమైయున్న ఈ మతమునే ఖుర్ ఆన్ 'ఇస్లామ్' అని పిలుచుచున్నది. ఈ సహజప్రకృతిని మార్చి కృత్రిమ మార్గము లందు నడుపుటయే సైతాను ప్రయత్నము.

కార్యములకు సత్ఫల మొసగుటలో) వారికి రవ్వంతయు అన్యాయము జరుగదు.౧౨౪

125. భగవంతునకు తన ఆత్మసర్వస్వమును సమర్పించి సత్కార్యాచరణ మొనర్చువారికంటె సన్మత మెవరిది! (వివిధ దేవతలను విగ్రహాదులను విడిచి) భగవన్మార్గమునే ఏకైక మార్గముగా గ్రహించిన ఇబ్రాహీము ననుసరించినవారు వీరు. భగవంతుడు ఇబ్రాహీమును తన మిత్రునిగ గ్రహించినాడు.౧౨౫

126. భూమ్యాకాశములలో కల సర్వస్వము భగవంతునిదే. భగవంతుడు సర్వము నావరించియున్నాడు.

పందొమ్మిదవ ఖండము

127. (ఓ ప్రవక్తా!) స్త్రీలను గూర్చి తీర్పు చెప్పవలసినదని మిమ్ము వీరు కోరుచున్నారు. * (వారితో ఇట్లు) చెప్పుము: 'భగవంతు డీ విషయమున ఆజ్ఞాపించుచున్నాడు. ♦ ఖుర్ ఆన్ లో అనాథలగు యువతుల పిల్లలను § గూర్చి (మీకు) వినిపింపబడుచున్నది. (వారి విషయమున అన్యాయమునకు పాల్పడవలదని వెనుక చెప్పబడినది.) వారికై నిర్ణయింపబడిన (వారసత్వమునందలి) వారి హక్కును వారికి ఇవ్వక, వారి (ఆస్తుల స్వాధీనపరచుకొనుటకై) ఎవరితో మీరు వివాహమాడదలచుకొనుచున్నారో * (మీ పోషణములోగల అట్టి అనాథయువతుల గూర్చి వెనుకటి సూక్తమునందే చెప్పబడినది.)

(అట్లు) దుర్బలులగు దిక్కులేని (తల్లిదండ్రులు లేని) బాల బాలికలను గూర్చియు ఖుర్ ఆన్ లో (వెనుకటి సూక్తులందు) ప్రవచితమైనది.)

(అట్లే) తలిదండ్రులులేని పిల్లల విషయమున (బాలికలైనను బాలురైనను, వారు మీ పోషణముక్రింద ఉన్నను లేకపోయినను) న్యాయబుద్ధితో ప్రవర్తింపుడు. మీరు చేయు సత్కృతుల నన్నిటిని భగవంతుడెఱుగును.

128. తన భర్త తన్ను నిరాదరించి తనయం దనురక్తుడు కాక విముఖుడై యున్నప్పుడు పరస్పరము (భార్యాభర్తలు) సమాధానపడి (ఒకరినొకరు ప్రేమగౌరవములతో చూచుకొనినచో) వారికి (ఇక) పాపము కాదు. ♦ (ఎట్టి పరిస్థితులందైనను) సమాధానపడుటయే మిక్కిలి ఉత్త

---

* ౧౯ వ ఖండములో విషయము మారినది. అనాథస్త్రీల హక్కులగూర్చి అధ్యాయప్రారంభమున చెప్పబడిన ఆదేశములే ఇక్కడ తిరిగి చెప్పబడినవి. ఒకసారి ఈ విషయమున స్పష్టమగు ఆదేశము లివ్వబడినను కొందరు మాటిమాటికి ఈ విషయముల గూర్చి ప్రశ్నించుచుండుటచే వెనుకటి ఆదేశములనే అనుష్ఠించవలసినదని ఖుర్ ఆన్ చెప్పుచున్నది.

♦ ఈ అధ్యాయ ప్రారంభమున ఈ విషయమున ఇవ్వబడిన ఆదేశములే మీకు చదివి వినిపింపబడుచున్నవి. చర్వితచర్వణముగ ఈ ఆదేశములను ఇక్కడ మరొకసారి చెప్పవలసిన అవసరములేదని అభిప్రాయము. ఆ ఆదేశములనే అనుసరింప వలసినదని మరొకసారి ఆజ్ఞ.

§ „యతామన్నిసాయి" అను ఇక్కడి మూలమునకు „విధవాస్త్రీలు" అనియు „తల్లి దండ్రులులేని స్త్రీలు" అనియు ఇట్లు మూడువిధములుగా అర్థము చెప్పవచ్చును.

* „(వారి ఆస్తులను స్వాధీనపరచుకొనగోరియు) ఎవరితో వివాహమాడుటకు వెనుదీయుచున్నారో" అనికూడ అర్థము చెప్పవచ్చును.

ఒకని పోషణక్రింద తల్లిదండ్రులులేని ఒక బాలిక ఆస్తిపరురాలున్నప్పుడు ఆమె ఆస్తిని ఆశించి ఆమెకు తాను తగిన వరుడు కాకపోయినను, ఆమె కిష్టము లేకపోయినను ఆమెను బలాత్కారముగ వివాహమాడగోరుట యొకటి; ఆస్తిపరురాలగు తల్లిదండ్రులులేని బాలిక అందకత్తె కాకపోవుటచేతను, మరేకారణము చేతనైనను ఆమెను తాను వివాహమాడక, ఆస్తి తనచేతినుండి జారిపోవునను భయముచే ఆమెను మరొకని కిచ్చి వివాహము చేయకయుండుట యొకటి—ఈ రెండు తెరగుల ప్రవర్తనయు నిషేధింపబడినది. వీటికి సంబంధించిన ఆదేశములు అధ్యాయ ప్రారంభ ఖండములో ప్రవచింపబడినవి.

♦ భార్యాభర్తలు పరస్పరము ప్రేమించుకొనకుండుటయు, పరస్పరము గౌరవించుకొనకుండుటయు పాపకార్యములు. ఒకసారి అట్లు మనస్పర్థలు కల్గిన తరువాత పశ్చాత్తాపపడి సమాధానము కుదుర్చుకొని ఎప్పటియట్లు ఒకరియెడ ఒకరు ప్రేమగౌరవములతో ప్రవర్తించినయెడల అట్టివారి పాపములను భగవంతుడు క్షమించును అని ఇక్కడ అర్థము.

మము. ఆశాలోభము మానవుని (ప్రకృతి) లో (సహజముగ) నున్నది. మీరు (పరస్పరము ఉపకారపారీణులై (ఒకరిపైనొకరు) దౌర్జన్యము నొనర్చుకొనక భగవద్భీతిపరులై యుండినచో (భగవంతుడు మీకు మీ సత్ప్రవర్తనముయొక్క ఫలము నొసగును.) భగవంతుడు మీ సమస్త కర్మలను గమనించుచునే యున్నాడు.౧౨౮

129. (ఒకతెకంటె ఎక్కువమంది) స్త్రీల* యెడల మీరెంతగా కోరినను పూర్తిగా) న్యాయమునో (ప్రవర్తింపజాలరు. అది మీశక్తి మించిన పని.♦ కాని ఒకే భార్యవైపునకు మొగ్గిపోయి, రెండవయామెను ఇట్లూ అట్లూ కాకుండ§ విడిచిపెట్టకుడు. మీరు మీ భార్యలవిషయములో న్యాయయుక్తముగను, సమాధానపూర్వకముగను ప్రవర్తించుచు దౌర్జన్యము చేయకుండినచో (మీ శక్తికి మించినట్టియు, సహజ దౌర్బల్యముకలిగి మీరు చేయునట్టియు అపరాధములను) భగవంతుడు క్షమించువాడు; కరుణానిధి†.

* "భార్యలు" అని భావము.

♦ పురుషుడు తన భార్యలలో ఒకతెను ఎక్కువగ ప్రేమించుటయు మరొకతెను తక్కువగ ప్రేమించుటయు సహజము.

§ అనగా వివాహితవలె తన భర్త అనురాగమును బడసి అనుకూల దాంపత్యభాగ్యమును నెరపునదియు కాక, ఆభర్త త్యక్తయై అనుకూలుడగు మరొక భర్తను పొందనేరనిదియును కాక మధ్యస్థముగ త్రిశంకు స్వర్గమున ఉంచకుడు అని అర్థము.

† ఒకనికి ఇద్దరు భార్యలుండి వారిలో ఒకతె ఎక్కువ సౌందర్యవతియు, యౌవనవతియు, విద్యావతియునై యుండి గాని, మరేకారణముచేనైన గాని ఆమెను రెండవయామెకంటె ఎక్కువ ప్రేమ గౌరవములతో చూచుట సహజము. అట్లు చేయుటయు దోషమైనను మానవుని ఈ సహజ దౌర్బల్యమును భగవంతుడు క్షమించును. కాని పురుషుడు ఆహార, వస్త్ర, అలంకార, సంభోగాది విషయములందు తనభార్యలందరితోడను సమానముగ ప్రవర్తించుట మాత్రము విధి. అట్లు చేయజాలక పోయినచో ఒకతెకంటె ఎక్కువమంది స్త్రీలను పెండ్లాడుట కతని కధికారము లేదు.

130. ఒకసారి (భార్యాభర్తలలో పరస్పరము అనుకూలపడక ఒకరినుండి ఒకరు) వారు వేరైపోయినచో భగవంతుడు తన అనుగ్రహముచే వారికి ఏలోపమును కలుగకుండ చేయును. (వారి కుచితమగు ఏర్పాటుచేయును.) భగవంతుడు అందరను పోషించువాడు; ప్రజ్ఞానిధి.౧౩౦

131. (ఓ విశ్వాసవంతులారా!) భూమ్యాకాశములలో కల సర్వస్వము భగవంతునికొరకే యైయున్నవి. (అవి కేవలము భగవదాజ్ఞానుసారము తమతమ విధ్యుక్తములను నిర్వహించుచున్నవి.) మీకంటె పూర్వము జ్ఞానగ్రంథము ప్రసాదింపబడినవారికిని, (అదేరీతిగ) మీకును, భగవంతుని (ఆజ్ఞలను అతిక్రమించుటవల్ల కలుగు దుష్ఫలితములకు) భయపడుడని ఉపదేశించితిని. (భగవదాజ్ఞలకు) విధేయులై ఉండకపోయినచో (నష్టము మీదే;) భగవంతుడే భూమ్యాకాశముల మధ్యగల సర్వస్వముయొక్క ప్రభువు; నియంత. భగవంతుడు స్వయంసంపూర్ణుడు; సర్వ సంస్తుత్యుడు.

132. భూమ్యాకాశములందున్న సర్వస్వము భగవంతునికొరకే ఉన్నవి. మీకు సంరక్షకుడుగా భగవంతుడే చాలును. (మీరు సంరక్షణమునకై మరెవ్వరి నర్థించనక్కరలేదు.)

133. ఓ మానవులారా! (జ్ఞాపకముంచుకొనుడు.) భగవంతుడు తలచినచో మిమ్ములను నశింపజేసి మీ స్థానములో మరొకజాతిని తెచ్చిపెట్టగలడు. ఇట్లు చేయుట భగవంతుని శక్తికి మించినమాటకాదు. (అతడు సర్వశక్తిమంతుడు.)

134. ఎవడు ఐహికలాభమునుమాత్రమే వాంఛించునో, భగవంతుడే ఐహికాముష్మికములు రెంటను శ్రేయశ్శుభముల కల్గించువాడని (తెలిసికొనుగాక!) భగవంతుడు సర్వమును వినువాడు; సర్వము చూచువాడు.౧౩౪

ఇరువదవ ఖండము

135. ఓ విశ్వాసవంతులారా! న్యాయబుద్ధిని దృఢముగ చేపట్టుడు. భగవంతునికొఱకు (సత్యమగు) సాక్ష్యము నియ్యుడు. స్వయముగ మీకు వ్యతిరేకముగను, (మీ) తల్లిదండ్రులకు వ్యతిరేకముగను, మీ సన్నిహితబంధువులకు వ్యతిరేకముగను (సాక్ష్యము చెప్పవలసివచ్చినను) సరే; ధనికుడైనను, పేదవాడైనను సరే (సత్యమగు సాక్ష్యము నియ్యుడు.) భగవంతుడు (మీకంటె) ఎక్కువగ వారిపై అనుగ్రహము చూపువాడు. (ధనికుని ధనమునకు భయపడియు. బీదవాని దారిద్ర్యమునకు దయదలచియు అబద్ధ సాక్ష్యము నియ్యకుడు.) మీ విషయవాంఛలు మీ న్యాయబుద్ధిని మార్చకుండుగాక! అట్లుకాక మీరు వక్రోక్తుల పలికి, న్యాయముచేయ నిరాకరించినచో (జ్ఞాపకముంచుకొనుడు) మీరు చేయునదంతయు భగవంతు డెఱుగును.౧౩౫

136. ఓ విశ్వాసవంతులారా! అల్లా యందును, ప్రవక్త యెడలను, ప్రవక్తకు వెలువరచిన గ్రంథమునందును, ఇంతకుపూర్వము (వెనుకటి ప్రవక్తలకు) వెలువరచబడిన గ్రంథములయందును విశ్వసింపుడు. భగవంతునియందు, అతని దేవదూతలయందు, అతని ప్రవక్తలయందు, తుదిదినమునందు విశ్వసింపక (సత్యమును) నిరాకరించువాడు సన్మార్గమునకు మిక్కిలి దూరుడైనవాడు.

137. ఒకసారి విశ్వాసమును ప్రకటించి, తిరిగి అవిశ్వాసమును చూపి, మరొకసారి విశ్వాసమును వెలువరచి, మరల విశ్వాసమును విడిచి, అట్లే అవిశ్వాసులై ఉండినవారిని భగవంతుడు క్షమింపడు. వారికి (విజయ మోక్షముల) మార్గము చూపడు.

138. (ఓ ప్రవక్తా!) వంచకులగు వీరికి ఘోరమగు శిక్ష లభించునని తెలియజేయుము.

139. విశ్వాసవంతుల (పొత్తు) విడిచి, విశ్వాసహీనుల బంధువులుగా గ్రహించు ఈ వంచకులు అవిశ్వాసులకడ గౌరవము పొందగోరుచున్నారా యేమి? (అదే వీరి యుద్దేశమైయుండినచో వీరిది తెలిసికొందురుగాక!) సమస్త గౌరవ (ప్రదాన) ము భగవంతుని వశమందే యున్నది. (గౌరవమిచ్చుట సత్యమునకు శత్రువులైన వంచకుల వశమందులేదు.)౧౩౯

140. భగవంతుడు తన పవిత్ర ప్రవచనములో ఈ విధముగ మీ కాదేశించుచున్నాడు. (ఏ సభ లేక ఏ సమావేశమందు) భగవదాదేశములు నిరాకరింపబడుచున్నట్లును పరిహాసింపబడుచున్నట్లును మీరు విందురో (అక్కడివారా చర్చనుమాని) విషయాంతరమునుగూర్చి సంభాషించుకొనునంతవరకు వారితో కూర్చొనకుడు. (ఆసభనుండి లేచిపొండు. దుష్టసహవాసమున వారి దుష్ప్రభావము మీపైబడి) మీరుకూడ వారివలె కాగలరు. నిశ్చయముగ భగవంతుడు వంచకులను అవిశ్వాసులను నరకమున సమావేశపరచును.

141. మీకు (ఆపదలు సంభవించవలెనని ఎప్పుడు) వేచియుండు (వంచకులగు) వీరు, మీకు భగవంతుడు విజయమును ప్రసాదించినప్పుడు మీ (యెడ మైత్రిని నటించుచు) "మేము మీకు తోడై యుంటిమి కదా?" (అని వత్తురు.) అవిశ్వాసుల కొకసారి విజయము లభించినచో (వారిదగ్గరికి పరుగెత్తుకొనివెళ్ళి "విశ్వాసవంతులు యుద్ధములో) మీకు పైచెయ్యి యైనప్పుడు మిమ్ములను మేము వారిబారినుండి రక్షించలేదా?" (అందురు). భగవంతుడు తుదిదినమునాడు మీమధ్య పరిష్కరించును. (ఈ వంచకులు అవిశ్వాసుల కెంతసాయపడినను) అవిశ్వాసులు విశ్వాసులపై (విజయమును సాధించు) మార్గమును భగవంతుడు చూపడు.

ఇరువదియొకటవ ఖండము

142. (ఈ విధముగ) వంచకులు భగవంతుని మోసగింపజూతురు. ♦ వారి మోసమునకు తగు శిక్ష వారికి భగవంతుడిచ్చును.

♦ అనగా ప్రవక్తను, విశ్వాసవంతులను మోసగింపజూతురు.

వారు ప్రార్థనమునకై నిలువబడినప్పుడు అలసులై అశ్రద్ధతో నిలువబడుచున్నారు. (వీరు నిజమైన శ్రద్ధాభక్తులతో ప్రార్థనము చేయరు;) కేవలము లోకులకు చూపించుటకై ప్రార్థనము సల్పుదురు; నామమాత్రముగ భగవంతుని స్మరింతురు. (శ్రద్ధా విశ్వాసములతో కాదు.)౧౪౨

143. (వీరు విశ్వాసమునకు అవిశ్వాసమునకు) మధ్య ఇటూ అటూ అని (గోడమీద పిల్లివలె) ఏమియు తోచక నిలువబడియున్నారు. వీరి పక్షముననుకాక వారి పక్షముననుకాక ఉన్నారు. (అనగా విశ్వాసవంతుల పక్షమున కాక, వారి శత్రువుల పక్షమున కాక ఉన్నారు.) వాస్తవమేమనగా భగవంతుడే ఎవనిని దారి తప్పించునో (అనగా భగవదాదేశానుసారము నడచినవారికి సన్మార్గమును, ఆ ఆదేశములకు విరుద్ధముగ ప్రవర్తించినవారికి పతనమును కలుగునన్న భగవన్నియమము ననుసరించి వానికి పతనము కాగా) వానికి (శ్రేయశ్శుభముల) మార్గమును మీరు వెతికిపెట్టజాలరు.

144. ఓ విశ్వాసవంతులారా! విశ్వాసవంతులను విడిచి (మీతో పోరాడుచున్నట్టియు మీ-వినాశమునే కోరుచున్నట్టియు నగు) అవిశ్వాసులను బంధువులుగను సహాయులుగను గ్రహింపకుడు. భగవంతుని (శిక్షకై) మీకు వ్యతిరేకముగ స్పష్టముగ కారణమును చూపగోరెదరా? ♦

145. వంచకులు నిస్సంశయముగ నరకమున నధోగతి నొందుదురు. (నాడు) వారికి ఎవరును సహాయము చేయరారు. (మరి మీరు ఇట్టివారి ననుకరింతురా?)

146. ఐతే (వారిలో) ఎవరు పశ్చాత్తప్తులై, తమ ప్రవర్తనమును సంస్కరించుకొని, భగవంతుని (యెడ భక్తిని) దృఢముగ (హృదయమున) చిక్కబట్టి, ధర్మాచరణమున భగవంతునకే స్వాత్మార్పణ మొనర్తురో

♦ మీరు పాపమొనర్చినారనుటకు ఇది స్పష్టమైన నిదర్శనము అని దీని భావము.

వారు విశ్వాసులతో ఉందురు. (సత్యమునందు) విశ్వసించి (సత్ప్రవర్తకులై యుండు) వారిని భగవంతుడు గొప్పగా బహూకరించును.

147. (మానవులారా!) మీరు (భగవంతునకు) కృతజ్ఞులై ఉండి విశ్వాసవంతులై ఉండినచో భగవంతుడు మిమ్ముల నేల శిక్షించును? భగవంతుడు మీ సత్కృత్యముల గ్రహించువాడు. (మీ అంతఃకరణమును) ఎఱిగినవాడు.౧౪౭

ఆరవ భాగము

148. (నలుగురిలో) బహిరంగముగ వాచాలతతో చెడుగును చాటుట భగవంతున కిష్టముకాదు. కాని అన్యాయము జరిగినప్పుడు బాధితుడు (తనకు జరిగిన అపచారముల వెల్లడింపవచ్చును.) భగవంతుడు సర్వము వినువాడు; సర్వజ్ఞుడు.౧౪౮

149. మీరేదైన సత్కృతిని బహిరంగముగ చేసినను, రహస్యముగ చేసినను లేక ఏదైన అపరాధము క్షమించినను (మీ సత్కృతుల ఫలమును భగవంతుడు ప్రసాదించును. చూడుడు:) భగవంతుడు సర్వశక్తిమంతుడయ్యు (పాపముల) క్షమించువాడు.

150. భగవంతుని, అతని ప్రవక్తలను నిరాకరించువారును; అల్లాకు అతని ప్రవక్తలకు మధ్య భేదభావము కనబరచగోరి "మేము కొందరిని (ప్రవక్తలనుగా) విశ్వసించి మఱికొందరని విశ్వసింపము" అని చెప్పుచు ఒక మధ్యగారి తీయువారును—౧౫౧

151. వీరే నిజమైన విశ్వాసహీనులు. మేము అవిశ్వాసుల కొరకు అవమానకరమగు శిక్షను సిద్ధపరచియుంటిమి.

152. అల్లాపైనను, అతని ప్రవక్తలపైనను విశ్వాసము గలవారికిని, వారిని (ప్రవక్తలను) పరస్పర భేదభావముతో చూడనివారికిని,

నిశ్చయముగ త్వరలో మేము వారి (విశ్వాసమునకు తగిన) బహుమానము ప్రసాదింతుము. భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

ఇరువదిరెండవ ఖండము

153. (ఓ ప్రవక్తా!) భగవద్దత్తమగు గ్రంథము పొందిన (యూదులు నీవు నిజమైన ప్రవక్తవనుటకు నిదర్శనముగ) 'ఆకాశమునుండి గ్రంథము దిగునట్లు చేయుడు.' అని నిన్నడుగుచున్నారు. వారు మూసాను ఇంతకంటె గొప్ప (మహాత్మ్యమును) చూపుడని కోరిరి. "మాకు భగవంతుని ప్రత్యక్షముగ చూపుము." అని (మూసాను) వారడిగిరి. వారి ఈ మౌర్ఖ్యము కతన వారిపై గొప్ప ధ్వనితో పిడుగుపడెను. (దానితర్వాతకూడ వారు మౌర్ఖ్యమును దౌర్జన్యమును విడిచిపెట్టరైరి.) తర్వాత (సత్యమగు ధర్మముయొక్క) స్పష్టమగు నిదర్శనములు వారికి లభించినను వారు గోవత్సమును (ఆరాధ్యదైవముగ) గ్రహించి (విగ్రహారాధనమునకు పాల్పడి)రి. దానినికూడ మేము క్షమించి (ధర్మసంస్థాపనమునకు) మూసాకు స్పష్టమగు శక్తిని ప్రసాదించితిమి.

154. (భగవదాజ్ఞలను పాలింపుడని) వారికడనుండి ప్రతిజ్ఞను గైకొనినప్పుడు, 'తూర్' పర్వతశిఖరమును వారికై మహత్తర మొనర్చితిమి. (వారు భగవదాజ్ఞలను పాలింతుమని ప్రతిజ్ఞచేసిరి.) దాని తర్వాత (మరొకసందర్భములో) "నగరద్వారమును (భగవంతునకు) వినయ వినమితులై ప్రవేశింపుడు" అని ఆజ్ఞాపించితిమి. "సబ్బాతు విషయమున అతిక్రమణ మొనర్పకుడు" అని (మరియొక సందర్భమున) ఆజ్ఞాపించి వారికడ (ఈ ఆజ్ఞలను పరిపాలింతుమను) దృఢప్రతిజ్ఞను గైకొంటిమి.

155. వారు తమ ప్రతిజ్ఞలను భంగ మొనర్చినందులకును; భగవదాదేశములను నిరాకరించినందులకును; దౌర్జన్యముచే భగవత్ప్రవక్తలను చంపినందులకును (వారు దుర్గర్వముచే) "మా హృదయములపై తెరలు

పడియున్నవి" (అని విర్రవీగుచు సత్యమును స్వీకరింప నిరాకరించి) పలికినందులకును (వారిపై భగవదాగ్రహము కల్గినది.) భగవంతుడు వారి హృదయములను వారి అవిశ్వాస కారణముగా ముద్రాబద్ధిత మొనర్చినాడు. వారిలో కొద్దిమందికితప్ప తక్కినవారికి విశ్వాసమేలేదు.౧౫౫

156. వారు విశ్వాసమార్గమును నిరాకరించినందులకును, మర్యమ్ పైవారు మిక్కిలి అసత్యాపవాదమును మోపినందులకును;

157. "(తాను) భగవత్ప్రవక్త (యనిన) మర్యమ్ కుమారుడగు ఈసాను మేము వధించితిమి" అని (డంబములు) పల్కినందులకును (వారిపై భగవదాగ్రహము కల్గెను)—వాస్తవమేమనగా వారతనిని చంపనూలేదు, సిలువపై ప్రాణముల తీయనూలేదు. వారికా విషయము సందేహాస్పదము కావింపబడెను. ఈ విషయమున వివాద పడినవారు సందేహములలో మునిగి ఉన్నారు. దానినిగూర్చి వారికడ నిశ్చయజ్ఞానము లేదు. వారికున్నది ఊహామాత్రజ్ఞానమే. వారు అతనిని చంపలేదనుట నిశ్చయము.౧౫౭

158. కాను, భగవంతుడు తన సమక్షమున అతనికి ఔన్నత్యమును ప్రసాదించెను. భగవంతుడు సర్వశక్తిమంతుడు; ప్రజ్ఞానిధి.౧౫౮

159. భగవద్దత్తమగు గ్రంథ మీయబడినవారి (యూదుల) లో ఎవరును తమ మరణమునకు పూర్వము (వాస్తవము తెలిసికొని) దానిపై (ఈసా సత్యప్రవక్త యగుటపై) తప్పక విశ్వసింపనివా రుండరు. (మరణించునప్పుడు వారు పశ్చాత్తప్తులగుదురు.) తుది దినమునాడు (భగవంతుని సమక్షమున) అతడు వారి విషయమున సాక్షియగును.

160. యూదుల ఈ చెడునడతకు ఫలితముగ (పెక్కు) మంచి వస్తువులను వారికై నిషేధించితిమి. (అంతకు పూర్వము) అవి నిషేధ

ముగై యుండలేదు. వారు భగవన్మార్గమున పెక్కుర నిరోధించుచు వచ్చుటయే (ఈ శిక్షకు కారణము.)

161. (అంతేకాదు;) వారికి నిషేధింపబడినను వారు వడ్డీ తీసికొన సాగిరి. అన్యాయముగ ఇతరుల సొమ్మున కొడిగట్టుకొనసాగిరి. వారిలో (ఈవిధముగ భగవదాదేశముల) నిరాకరించి (అధర్మప్రవర్తకులై)న వారికై కఠినశిక్ష సిద్ధపరచబడియున్నది.౧౫౦

162. కాని (ఓ ప్రవక్తా!) వారిలో (భగవద్గ్రంథముయొక్క) విజ్ఞానముకలవారు విశ్వాసవంతులు నీకు ప్రోక్తమైన గ్రంథమును, నీకు పూర్వపు ప్రవక్తలకు ప్రోక్తమైన గ్రంథములను కూడ విశ్వసింతురు. ప్రార్థనములందు స్థిరచిత్తులైనవారును, జకాతు నిచ్చువారును, భగవంతునిపైనను తుదిదినముపైనను విశ్వాసముంచువారును—వీరికే మేము త్వరలో మిక్కిలి గొప్పఫలము ప్రసాదింతుము.

ఇరువదిమూడవ ఖండము

163. (ఓ ప్రవక్తా!) నోహాకును, అతని తర్వాత వచ్చిన ప్రవక్తలకును పంపినట్లే నీకును ఈశ్వరప్రేరిత జ్ఞానమును పంపితిమి. (అట్లే) ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, ఇస్హాక్, యఅఖూబ్, యఅఖూబ్ సంతతి, ఈసా, అయ్యూబ్, యూనుస్, హారూన్, సులైమాన్ మున్నగు (ప్రవక్తలకు) కూడ (ఈశ్వరప్రేరిత జ్ఞానమును) ప్రసాదించితిమి. దావూదుకు జబూరు నిచ్చితిమి.

164. (అంతేకాదు; ఖుర్ఆనులో) ఇంతకుముందు కథితమైనట్టి ప్రవక్తలును, (ఖుర్ఆన్‌లో) కథితముకానట్టి ప్రవక్తలును (కూడ ఈశ్వరప్రేరిత జ్ఞానమును బడసిరి. అదేవిధముగ) మూసాతో భగవంతుడు తన ప్రవచనములతో భాషించెను.

165. ఈ ప్రవక్తలు (అందరును భగవదారాధనము యొక్కయు సత్కృతులయొక్కయు ఫలముల) సువార్త నిచ్చువారును, (సత్యనిరాకరణముయొక్క దురంతమును వివరించి) భయపెట్టువారును అయియుండిరి. ప్రవక్తలు (వచ్చి మంచిచెడుగుల విప్పిచూపిన) తర్వాతకూడ, వారు భగవంతుని సముఖమున (మాకు ధర్మమార్గము చూపతివైవే!) అను సాకు చూపకుండుటకై (ఈ ప్రవక్తలు పంపబడిరి.) భగవంతుడు మహోన్నతుడు; ప్రజ్ఞానిధి.

166. (ఓ ప్రవక్తా! అవిశ్వాసులు సత్యసంధతను నిరాకరించిన నిరాకరింతురుగాక:) కాని భగవంతుడు నీకు ప్రసాదించిన జ్ఞానము దైవిక జ్ఞానమే ననుటకు భగవంతుడేసాక్షి. దేవదూతలు దీనికి సాక్షులు. భగవంతు డొక్కడు సాక్షియగుటయే చాలును.

167. ఎవరు (సత్యమును) నిరాకరింతురో, (ఎవరు) భగవన్మార్గమున రాకుండ (మానవుల) అడ్డుగొట్టుదురో, (వారు) నిస్సందేహముగ (సన్మార్గమునుతప్పి) బహుదూరము పోయి పడినవారు.

168. ఎవరు విశ్వాస (మార్గ) మును నిరాకరించి, దుష్కార్యాచరణ మొనర్తురో భగవంతుడు వారిని క్షమింపడు. వారికి (శ్రేయశ్శుభముల) ఏమార్గమును చూపడు.

169. నరకమార్గముతప్ప (వారికి మరేదియులేదు.) అందే వారికి నిత్యనివాసము. ఇట్లు చేయుట భగవంతునకు మిక్కిలి సులభము.

170. ఓ మానవులారా! నిస్సందేహముగ భగవంతుని కడనుండి సత్యమును తీసికొని మీకడకు ప్రవక్త వచ్చినాడు. అందుచే అతనియందును, (అతడు మీకై నా కడనుండి తెచ్చిన సత్యమునందును) విశ్వసింపుడు. అది మీకే శ్రేయస్కరము. (అట్లుకాక) మీరు నిరాకరించినచో (జ్ఞాపక ముంచుకొనుడు) భూమ్యాకాశము లందున్న సమస్తమును భగవంతునివే యైయున్నవి. భగవంతుడు సర్వజ్ఞుడు; ప్రజ్ఞానిధి.

171. భగవద్దత్తగ్రంథము లివ్వబడిన (ఓ క్రైస్తవయూదులారా!) మీ మతములలో అతిశయోక్తులను నింపి హద్దుల నతిక్రమించకుడు. భగవంతుని గూర్చి సత్యముకాని విషయములను చెప్పకుడు. మర్యమ్ కుమారుడగు ఏసుక్రీస్తు భగవంతుని ఒక ప్రవక్తమాత్రము; కాని వేరు కాదు. (ఏసుక్రీస్తు) మర్యమునకు (సంతోషవార్తగా) ఇవ్వబడిన వాక్కు యొక్క ఫలము; భగవంతునికడనుండి వచ్చిన ఒకఆత్మ (కాని ఈసా మీరనుకొనుచున్నట్లు భగవంతుని కుమారుడుగాని, భగవదవతారముగాని కాడు. అతడొక ప్రవక్త.) అందుచే భగవంతునియందును భగవంతుని ప్రవక్తలయందును విశ్వసింపుడు. "భగవంతుడు త్రిమూర్తి (గా విభజింపబడినాడు.)" అని చెప్పకుడు. ఇట్టి మాటలను కట్టిపెట్టుడు. మీకు శ్రేయశ్శుభములు కల్గును. ఎందుకనగా ఏకైకుడగు భగవంతుడొక్కడే ఆరాధనార్హుడు. అతని మహిమా పావిత్ర్యములు కొనియాడబడుగాక! భగవంతునకు కుమారుడా? (అది అతని పావిత్ర్యమున కెంత దూరము?) భూమ్యాకాశముల మధ్యనున్నదంతయు భగవంతునిదే. (విశ్వమునందలి సర్వస్వమును) రక్షించుటకు భగవంతుడు చాలును. (భగవంతునకును మీకును నడుమ మధ్యవర్తు లక్కరలేదు.) * ౧౭౯

ఇరువదినాల్గవ ఖండము

172. ఏసుక్రీస్తు భగవంతుని సేవకుడై భగవంతునకే వినతుడగుటను చిన్నతనముగా భావించలేదు. భగవంతునకు సమీపమునన్నున్న దేవదూతలును అట్లనుకొనలేదు. భగవంతుని సేవను ఎవరు చిన్నతనమనుకొని గర్విష్ఠులైరో (వారు దుర్గర్వప్రమత్తులై ఎక్కడకుపోగలరు?)

* పల్వురు క్రైస్తవులు మానవుల పాపములను క్షమించుటకును, వారిని రక్షించుటకు భగవంతునకును మానవలోకమునకును నడుమ ఏసుక్రీస్తు మధ్యవర్తియని భావింతురు. భగవంతుడు రక్షించువాడుండగా మధ్యవర్తులకొఱకేల దేవులాడుదురని ఖుర్ఆన్ ప్రశ్నించుచున్నది.

భగవంతుడు వారినందరిని (తుదిదినమున) తన సమక్షముననే సమావేశపరచును. ౧౩౦

173. భగవంతునిపై విశ్వాసము కలిగి సత్కార్యాచరణము చేయువారికి (ఆనాడు) భగవంతుడు (వారివారి సత్కర్మల) ఫలమును ప్రసాదించును. (అంతేకాదు) భగవంతుడు తన అనుగ్రహముచే ఇంకను ఎక్కువగ బహూకరించును.

ఎవరు భగవత్సేవను చిన్నతనమనుకొని గర్విష్ఠులైరో వారికి కఠినమగు శిక్షనిచ్చును.

174. నాడు భగవంతుడు తప్ప వారికి సంరక్షకుడుగాని సాహాయ్యుడుగాని లభింపడు.

175. ఓ మానవులారా! మీ ప్రభువు కడనుండి మీయొద్దకు (సత్యముయొక్క స్పష్టమగు) నిదర్శనము వచ్చినది. మీకడకు స్పష్టమగు ఒక తేజస్సును పంపితిమి.

177. ఎవరు భగవంతునియెడ విశ్వసించి భగవదాశ్రయమునే గట్టి పట్టుకొమ్మగా గ్రహించిరో, వారికి తన మహదనుగ్రహమును ప్రసాదించి, దయాదాక్షిణ్యములను వారిపై ప్రసరింపజేసి, తనకడకు వచ్చు ఋజుమార్గమును భగవంతుడు చూపును.

177. (ఓ ప్రవక్తా!) నిన్ను వారు (ఆస్తివిషయకమైన) తీర్మానమడుగుచున్నారు. (వారితో ఇట్లు) చెప్పుము: తల్లిదండ్రులుగాని సంతానముగాని లేనివానిని గూర్చి భగవంతుడు (ఇట్లు) తీర్మానించుచున్నాడు: ఒక పురుషుడు నిస్సంతానుడై మరణించినప్పుడు, వానిసోదరి యున్నచో, ఆమెకు అతని ఆస్తియందలి సగభాగము లభించగలదు. అట్లు మరణించిన వ్యక్తి సంతానహీనయగు స్త్రీయైనచో ఆమె ఆస్తి అంతయు సోదరునకు సంక్రమించును.

ఒకసారి అక్క-చెల్లెండ్రు ఇద్దరున్నచో వారిద్దరును ఆస్తిలో మూడింట రెండుభాగములను (సమానముగ పంచుకొనవలెను.)

ఒకసారి అన్నదమ్ములును అక్క-చెల్లెండ్రును ఉన్నచో పురుషునకు ఇద్దరు స్త్రీలకు వచ్చునంత భాగము (వచ్చును.)

మీరు పొరపడుట కవకాశము లేకుండ భగవంతుడు (తన ఆజ్ఞలను) స్పష్టముగ చెప్పుచున్నాడు. భగవంతుడు సర్వస్వము నెఱుగును.

بسم الله الرحمن الرحيم

అధ్యాయము ౫

ఆహారము

(అల్ మాయిద)

(మదీనాలో అవతరించినది.)

(౧౬ ఖండములు — ౧౨౦ సూక్తులు.)

కరుణామయుడును వరప్రదాయకుడును అగు
అల్లాః నామస్మరణముతో (ప్రారంభించుచున్నాను.)

మొదటి ఖండము

1. ఓ విశ్వాసవంతులారా! మీ ఒడంబడికలను[౧౩౦] (విధులను, కర్తవ్యములను) పాలింపుడు.

(నిషేధములని ఇందు) ఆజ్ఞాపింపబడినవి తప్ప తక్కిన చతుష్పాత్తులు (ఆహారమునకై) మీకు ధర్మ్యమొనర్పబడినవి. కాని కాబాకు యాత్రసల్పుటకై పోయి వేటాడిన జంతువులు మీకై నిషేధింపబడినవి. భగవంతుడు తన ఇచ్ఛానుసారము ఆజ్ఞలను ప్రసాదించును.

2. ఓ విశ్వాసవంతులారా! అల్లాఃచే నిర్ణయింపబడిన చిహ్నములను అగౌరవ పరపకుడు. పవిత్రమగు మాసమును అగౌరవ పరపకుడు. (యాత్రకు పోయినప్పుడు ఇచ్చు) బలులను, మెడలలో పట్టాలు (లేక మాలలు) తొడిగించిన బలిజంతువులను అగౌరవ పరపకుడు. కాబాను దర్శింప బయలుదేరి భగవంతుని అనుగ్రహమును, దయను అభిలషించు యాత్రికుల (మార్గమును అడ్డియు, వారిని బాధించియు) అగౌరవ పరపకుడు.

మీరు యాత్రావిధులను పూర్తిగ నెరవేర్చినపిదప (అవసరమున్నచో) వేటాడవచ్చును. మిమ్ము పవిత్ర ప్రార్థనాలయమునకు రానీయక అడ్డుపెట్టినందుకు మీకొకతెగ యెడగల వైరము మిమ్ము వారిపై దౌర్జన్యమునకు పురికొల్పకుండునుగాక. శ్రద్ధాభక్తుల యందును, సత్కర్మానుష్ఠానము నందును మీ కొకరికొకరు చేదోడు వాదోడుగా నుండుడు. కాని పాపకార్యములందును, దౌర్జన్యమునందును ఒకరికొకరు అండయై నిలువకుడు. భగవంతునకు భయపడుడు. నిశ్చయముగ భగవంతుడు (పాపమునకు) ప్రతీకారము చేయుటలో నిష్ఠురుడు.

౩. (ఓ విశ్వాసవంతులారా!) మీకై (ఈ క్రిందివి) నిషేధింపబడినవి : ౧౩౨

తనంతట తాను చచ్చిపోయిన జంతువు;
రక్తము;
పందిమాంసము;
దైవేతరులపేర ప్రోక్షింపబడినది;
గొంతుపిసికి చంపబడినది;
దెబ్బతగిలి చచ్చినది;
ఎత్తునుండి క్రిందపడి చచ్చినది;
ఏదేని ఒక జంతువు కొమ్ముచే దెబ్బతిని చచ్చినది;
అడవిమృగముచే చీల్చి చంపబడినది;

కాని (ఆ జంతువు) చావకముందు అది విధివిహితముగ కోయబడినచో అది నిషేధముకాదు.

(విగ్రహాదులకై ఏర్పరచబడిన) బలివేదికలపై చంపబడినవి;
బాణములువేసి పంచుకొనిన మాంసము (మీకొఱకు నిషేధము);
(నిషేధింపబడిన వీనిని తినుట) పాపకార్యము.

(ఓ విశ్వాసవంతులారా!) అవిశ్వాసమార్గము ననుసరించినవారు

నేడు మీ మతమునుచూచి ఆశ వదలుకొనిరి. (మీరు భగవన్మార్గమును విడిచి ఇక వారి దుష్పథము ననుసరింపరని వారికి నిశ్చయమైనది.) అందుచే వారికి భయపడకుడు. నాకుమాత్రము భయపడుడు. (నాకు భయపడి నా ఆజ్ఞల ననుసరించినవానిని ప్రపంచములో ఎవ్వరును భయపెట్టజాలరు.)

నేడు మీకై మీ మతమును సంపూర్ణమొనర్చి, మీయెడ నా అనుగ్రహమును పూర్తిగావించి ఇస్లామ్‌ను మీకొఱకు మతధర్మముగ నెన్నుకొంటిని. ౧౩౩

(చూడుడు:) ఆకలితాకిడి కాగలేక, చేయునదిలేక, పాపమొనర్పవలెనను కోరికచేకాక (ప్రాణములు నిల్పుకొనుటకు ఒకవేళ నిషిద్ధవస్తువును తినినచో అది దోషముకాదు.) భగవంతుడు మహాక్షమి; దయానిధి. ౧౩౪

(ఓ ప్రవక్తా!) ఏవేవి భోజ్యమొనర్పబడినవని ప్రజలు నిన్నడుగుచున్నారు. (వారితో) నీ విట్లనుము: మంచివస్తువులన్నియు మీకై భక్షింపదగినవిగా చేయబడినవి.

మీరు తర్ఫీతుచేసిన వేటజంతువులు తెచ్చినదియు మీకు భక్షింపదగినదే.

మీకు భగవంతుడు నేర్పిన పద్ధతి దానికి నేర్పుడు. దాని ననుసరించి (వేటజంతువు) మీకై పట్టుకొని తెచ్చినదానిని మీరు తినవచ్చును. (వేటజంతువును వేటకై) విడిచిపెట్టునప్పుడు భగవన్నామము నుచ్చరింపుడు. ౧౩౫

భగవంతుని (ఆజ్ఞల నుల్లంఘించుటకు) భయపడుడు. (జ్ఞాపకముంచుకొనుడు): భగవంతుడు (మీ కర్మలను) వెంటనే గణించును.

౫. నేడు మీకొఱకు పరిశుద్ధములగు వస్తువులన్నియు భోజ్యములొనర్పబడినవి. భగవద్దత్తమగు జ్ఞానగ్రంథమును పొందిన ప్రజల ఆహా

రముకూడ మీకై భక్షింపదగినదిగా చేయబడినది. మీ భోజనము వారికొఱకు కూడ భోజనార్హ మొనర్పబడినది. ౧౩౬

అట్లే విశ్వాసవతులగు స్త్రీలలో పవిత్రలగువారును, మీకు పూర్వము భగవద్దత్తమగు గ్రంథము లివ్వబడిన వారిలో పవిత్రలగు స్త్రీలును (మీకు వివాహయోగ్యలు.) వారి మహర్ ధనమును వారికిచ్చివేయవలెను. వారితో విధివిహితమగు వివాహము చేసికొనవలెను. అంతేకాని (విషయలోలతచే) వ్యభిచారము చేయుటయు, వారితో రహస్యముగ వర్తించుటయు ఎంతమాత్రము తగదు. (జ్ఞాపకముంచుకొనుడు): ఎవడు సత్యమును నిరాకరించునో వాడుచేయున దేదైనను వ్యర్థమేయగును. తుదిదినమున వాడు భ్రష్టులలో నొకడై యుండును.

రెండవ ఖండము

6. ఓ విశ్వాసవంతులారా! మీరు నమాజు సలుపుటకు ఆయత్తులైనచో ముట్టమొదట మీ ముఖములను, మోచేతులవరకు చేతులను కడిగికొనుడు. మీ తలలను నీళ్ళతో తుడుచుకొనుడు. మీ రెండుపాదములు చీలమండలవరకు కడిగికొనుడు. ఒకసారి స్నానముచేయు అవసరమున్నచో (స్నానముచేసి) పరిశుద్ధులుకండు.

ఒకసారి మీరు రోగులైయుండి (నీళ్లుపయోగించుట నష్టదాయకమైన) పక్షమునను, ప్రయాణములోనుండి (నీళ్ళు దొరకకపోయి) నను, లేక మీరు మలమూత్ర విసర్జనమునకు వెళ్ళివచ్చియు, లేక స్త్రీ సాంగత్యముననుండి వచ్చియు, నీళ్ళు దొరకనప్పుడు పరిశుద్ధమగు మట్టితో శుద్ధిచేసికొనుడు. (దాని విధానమిది): దానితో ముఖమును చేతులను స్పృశింపుడు. మిమ్ములను చిక్కులలో పడవైచి కష్టపెట్టుట భగవంతుని ఇష్టముకాదు. మీరు పరిశుద్ధులుగ ఉండుటయే భగవదుద్దేశము. మరియు మీపై తన అనుగ్రహమును సంపూర్ణ మొనర్పగోరును. (దానివల్ల) మీరు భగవంతుని అనుగ్రహములకు కృతజ్ఞులై యుందురు. ౧౩౭

7. భగవంతుడు మీకు ప్రసాదించిన అనుగ్రహములను జ్ఞాపకముంచుకొనుడు. భగవంతుడు మీతో దృఢమగురీతిని గైకొనిన ప్రతిజ్ఞను మరువకుడు. మీరు "(ఈ సత్యమును విశ్వసింపుడు" అన్నపిలుపు నంగీకరించి) ఇట్లంటిరి: "(ప్రభూ!) మేము (నీ ఆజ్ఞను) వింటిమి. శిరసావహించితిమి" (ఈ విధముగ మీరు భగవదాజ్ఞలకు లొంగియుండుమని ప్రతిజ్ఞ సలిపితిరి.) అందుచే భగవంతునియెడ భయభక్తులతో ప్రవర్తింపుడు. నిశ్చయముగ భగవంతుడు మీ హృదయములలో గుప్తముగ నున్నదంతయు ఎఱుగును.

8. ఓ విశ్వాసవంతులారా! భగవంతునికొఱకు సుస్థిరులై నిలువబడుడు; న్యాయపక్షమున సాక్ష్యమీయుడు. ఒకజాతియెడ మీకుగల విరోధము అన్యాయ ప్రవర్తనమునకు మిమ్ము ప్రోత్సహింప కుండునుగాక. (ఎట్టి పరిస్థితులందైనను) మీరు న్యాయముగ ప్రవర్తింపుడు. ధర్మనిష్ఠాపరతకిది మిక్కిలి సమీపము. భగవంతునియెడ భయభక్తులతో ప్రవర్తింపుడు. మీరు చేయునదంతయు భగవంతుడెఱుగును. ౧౩౮

9. విశ్వాసవంతులై, సత్కార్యాచరణ మొనర్చువారికి భగవంతుడు క్షమార్పణమును, మిక్కిలి గొప్ప బహుమానమును వాగ్దానముచేసినాడు.

10. ఎవరు అవిశ్వాసవంతులై, మా సందేశములను నిరాకరింతురో వారు నరకవాసులు.

11. ఓ విశ్వాసవంతులారా! భగవంతుడు మీకు ప్రసాదించిన ఆ అనుగ్రహమును జ్ఞప్తికి తెచ్చుకొనుడు. అప్పుడొక పక్షమువారు మిమ్ము (నిర్మూలించుటకు) మీపై చేయినెత్తిరి. (భగవదనుగ్రహమువల్ల) వారిచెయ్యి మీకు వ్యతిరేకముగ సాగకుండ నిరోధింపబడెను. (మీకెట్టి హానియు కలుగలేదు.) అల్లాకు భయపడుడు. విశ్వాసవంతులు సంపూర్ణముగ భగవంతునే నమ్ముకొని యుందురుగాక!

మూడవ ఖండము

12. నిశ్చయముగ భగవంతుడు ఇస్రాయీలీయులతో ఒడంబడికను గావించుకొనెను. మేము వారిలో పండ్రెండుగురు నాయకులను పుట్టించితిమి.

భగవంతుడు (వారితో ఇట్లు) సెలవిచ్చియుండెను: "చూడుడు, నేను మీతో నున్నాను. మీరు భగవత్ప్రార్థనము సల్పుచు, జకాతు నిచ్చుచు, నా ప్రవక్తలందరియెడ శ్రద్ధా విశ్వాసములను చూపి వారికి సాయపడియు, భగవంతునకు సద్ఋణము నిచ్చియు (మీరు సజ్జనులై) పరివర్తించినచో తప్పక మీ చెడుగులను కప్పిపుత్తును. మిమ్ములను తప్పక నిర్ఝరులు ప్రవహించు సుందరోద్యానముల ప్రవేశింప జేతును. దీనితర్వాత కూడ మీలో ఎవడు విశ్వాసమును విడనాడునో వాడు సన్మార్గమునుండి తప్పిపోయినవాడగును.

13. వారు (భగవంతునకు నమ్రులై యుందుమను తమ) ప్రతిజ్ఞను భంగమొనర్చినందుకు వారిని మేము శపించితిమి. వారి హృదయములను కర్కశ మొనర్చితిమి. అందుచే వారు (భగవద్గ్రంథముయొక్క) పవిత్ర సూక్తములను వాని స్వస్థానమునుండి మార్చివైతురు. వారికు ద్బోధించిన ఉపదేశమునందలి ఎక్కువభాగమును వారు మరచిపోయిరి. వారిలో ఏ కొందరోతప్ప తక్కినవా రందరును ఏదో ఒక విశ్వాసఘాతుకత్వము నాచరించుచునే యుందురు.

(ఓ ప్రవక్తా!) ఐనను వారిని క్షమింపుము. (వారి అకార్యములను) ఉపేక్షింపుము. ఉపకారపరులను భగవంతుడు ప్రేమించును.౧౩౯

14. తాము క్రైస్తవులమని పిల్చుకొనువారి కడనుండి కూడ మేము ప్రతిజ్ఞను గైకొంటిమి. కాని వారుకూడ వారికివ్వబడిన సందేశమునందలి ఎక్కువభాగమును మరచిపోయిరి. (వారు మూలమును విస్మరించి శాఖోపశాఖలుగ చీలిపోయిరి. మరి మేము వారి ఈ శాఖలలో) పరస్పరము ప్రళయకాలమువరకు విరోధ విద్వేషము లుండునట్లు చేసితిమి. వారు ఇంతవరకు ఏమిచేసిరో భగవంతుడు వారికి (బుద్ధివచ్చునట్లు) త్వరలో తెల్పును.

15. భగవద్గ్రంథమును పొందిన ఓ ప్రజలారా! నిశ్చయముగ మీకడకు నాప్రవక్త వచ్చెను. మీరు భగవద్గ్రంథమునందలి దాచిపుచ్చిన పెక్కు ధర్మ (రహస్య) ములను స్పష్టముగ విప్పి చెప్పుచున్నాడు. పెక్కు (ధర్మములయొక్క మూలసూత్రములతో సంబంధములేని అల్ప విషయములలో) మిమ్ములను క్షమించుచున్నాడు.౧౪౦

నిశ్చయముగ భగవంతునికడనుండి మీకై ఒక గొప్ప వెలుగు వచ్చినది. విస్పష్టమగు (ఉపదేశములుకల) భగవద్గ్రంథము (మీకై పంపబడినది.)

16. దీనిద్వారా భగవంతుడు తన్నాశ్రయించు వారందరకును శ్రేయశ్శాంతులను ప్రసాదించును. చీకటినుండి వెలుతురులోనికి తీసికొని వచ్చును. (శ్రేయశ్శుభముల) ఋజుమార్గమున నడిపించును.

17. మర్యమ్ (మేరీ) కుమారుడైన ఈసా (ఏసుక్రీస్తు) భగవంతుడని చెప్పువారు సత్యమును నిరాకరించినవారు.

(ఓ ప్రవక్తా!) వారితో ఇట్లనుము: భగవంతు డొకసారి మర్యమ్ కుమారుడైన ఈసాను, అతనితల్లిని, (అంతేకాదు) భూమియందున్న సమస్తమును నశింప జేయగోరినచో అట్లుకాకుండ చేయుటకు ఎవరికి శక్తి కలదు? (ఎందుకన) భూమియు, ఆకాశమును, ఈ రెంటిమధ్యనున్న సర్వస్వమును భగవంతుని సర్వేశ్వరత్వము క్రింద నున్నది. తన ఇచ్చవచ్చినదాని నతడు సృష్టించును. సమస్త వస్తువులు భగవంతుని అధికారమునకు లోబడి యున్నవి.

18. యూదులు క్రైస్తవులు ఇట్లందురు:

"మేము భగవంతుని కుమారులము; అతనికి ప్రేమపాత్రులము."

(ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము :

"అట్లైన మీ పాపముల కతడేల మిమ్ము శిక్షించుచున్నాడు? వాస్తవమేమనగా మీరుకూడ భగవంతునిచే సృష్టింపబడిన మానవులే. (మీరు అందరి మానవులవలె భగవద్ధర్మమునకు లోబడినవారే, మీలో ప్రత్యేకత ఏమియు లేదు.) భగవంతుడు తన ఇచ్చవచ్చినవారిని క్షమించును; తన ఇచ్చవచ్చినవారిని శిక్షించును. భూమ్యాకాశముల యొక్కయు, దాని మధ్య కల సమస్తము యొక్కయు సర్వేశ్వరత్వము భగవంతునిదే యైయున్నది. అందరకును తుదిగమ్య మతడే.

19. భగవద్గ్రంథము పొందిన ఓ ప్రజలారా! ప్రవక్తల అనుసరణి తెగి చిరకాలముతర్వాత మీకడకు నా ప్రవక్త వచ్చినాడు. "మాకడకు (మోక్షముయొక్క) శుభవార్తను తెచ్చువాడును, (పాపములనుండి తప్పియుండుడని) హెచ్చరించువాడును రాలేదని మీరు చెప్పకుండుటకై (ఈ ప్రవక్తను పంపినాను.) అతడు మీకు స్పష్టముగ సమస్త విషయములను బోధించుచున్నాడు. మీకై మోక్షవిజయముల శుభవార్తను తెచ్చువాడును, (పాపములో మీరు చిక్కుకొనకుండ) హెచ్చరించువాడును వచ్చినాడు. భగవంతునకు సమస్త వస్తువులపైనను అధికారము కలదు.

నాలుగవ ఖండము

20. మూసా తనజాతితో ఇట్లనెను : "ఓ నా జాతీయులారా! భగవంతుడు మీ జాతినుండి ప్రవక్తలను పుట్టించి, మిమ్ము పరిపాలకుల నొనర్చి, మరే ఇతరజాతులకును ఇవ్వనివి మీకిచ్చిననాటి భగవదనుగ్రహమును జ్ఞప్తికి తెచ్చుకొనుడు.

21. "ఓ నా జాతీయులారా! మీ కొఱకై భగవంతు డేర్పరచిన పవిత్రభూమిని ప్రవేశింపుడు; వెనుజూపకుడు. అట్లు చేసినచో భ్రష్టులై మరలిపోవలసిన వారగుదురు."

22. దానికి వారిట్లనిరి: "ఓ మూసా! ఇందులో (ఈ దేశములో) బలవంతమగు జాతి కలదు. వారా దేశము విడిచి వెళ్ళిపోవువరకు మేమందు ప్రవేశింపజాలము. వారా దేశమునువిడిచి వెళ్ళిపోయిన పిదప తప్పక మేమందు ప్రవేశింతుము.

23. (వారిలో) భగవదనుగ్రహమును పొందిన ఇద్దరు భగవద్భక్తపరు లిట్లనిరి :

(ఈ విధముగ భీరులై అధైర్యపడెదరేల?) ధైర్యముతో వారిపై పడుడు. (నగర) ద్వారమును ప్రవేశింపుడు. మీరు (ఒక్కసారి) ప్రవేశించితిరా తప్పక మీకే విజయము కల్గును. మీరు విశ్వాసవంతులే యైనచో భగవంతునే నమ్మియుండుడు."

24. (దానికి) వారిట్లనిరి :

"ఓ మూసా! వారందున్నంతకాలము మేము (దేశమును) ప్రవేశింపము. (నీకు వెళ్ళవలెనని తొందర యున్నచో) నీవు వెళ్ళుదువు గాక; నీతో నీ భగవంతుడును. మేమిక్కడ కూర్చొనియుందుము, నీవును నీ భగవంతుడును కలిసి అక్కడ పోరాడుడు.

25. (ఇదంతయు చూచి మూసా) ఇట్లనెను : "ప్రభూ! నాకు నా ఆత్మపైనను నా సోదరునిపైన తప్ప ఇతరులపై అధికారము లేదు. ఈ పాపిష్ఠి జాతినుండి మమ్ము వేరుచేయుము."

26. (భగవంతుడిట్లు) చెప్పెను :

"ఇప్పుడు నలుబదేండ్లవరకు వారికై ఈ భూమి నిషేధింపబడినది. (వారిట్లే) దేశద్రిమ్మరులై తిరుగుచుందురు. అందుచే (ఓ మూసా!) నీవీ పాపిష్ఠి జాతినిగూర్చి దుఃఖింపకుము.

ఐదవ ఖండము

27. (ఓ ప్రవక్తా!) వీరికి ఆదమ్‌యొక్క ఇద్దరి కుమారులకథను సత్యముగ వినిపింపుము. వారిద్దరును బలినర్పించినప్పుడు వారిలో ఒకరి

నుండియే యది గ్రహింపబడెను. రెండవవానిది నిరాకరింపబడెను. (రెండవ) వాడు (అసూయాద్వేషములచే మండి మొదటివానితో) ఇట్లనెను: "నిశ్చయముగ నిన్ను నేను వధింతును. దానికి (మొదటి) వాడిట్లనెను: "భగవంతుడు భక్తిపరుల బలినే స్వీకరించును."

28. "నీవు నన్ను వధించుటకు చెయ్యెత్తినచో (ఎత్తుము.) నేను మాత్రము నిన్ను చంపుటకు చేయెత్తను. సమస్త విశ్వమునకు ప్రభువైన భగవంతునకే నేను భయపడుదును.

"(అపరాధము నీవలన కావలెను కాని నావలన కాకూడదు.) నాపై కావించిన యీ అత్యాచారముయొక్క పాపము, నా పాపము కూడ నీ నెత్తిపైనే పడవలెనని నా కోరిక. నీవు నరకములో నుందువు. అన్యాయపరుల కిదే ప్రతిఫలము."

30. వాని చిత్తము వాని సోదరుని వధించుటకు ప్రేరేపించెను. అతడు వానిని వధించెను. వాడు భ్రష్టుడాయెను.

31. దానితర్వాత భగవంతుడొక కాకిని పంపెను. వానితమ్ముని శవమును (భూమిలో) ఎట్లు పూడ్చవలెనో వానికి చూపుటకు అది భూమిని గీకసాగెను. (కాకి అట్లు భూమిని గీకుచుండుటను చూచి) వాడిట్లనెను: "నే నెటువంటి మూఢుడను! నాకీ కాకిపాటి వివేకమైనను లేకపోయెనే! నేను నా సోదరుని శవమును (భూమిలో) పూడ్చలేకపోతిని." అని అతడు (తన తెలివితక్కువకు) వాపోయెను.

32. ఇందుకోసమే ఇస్రాయీలీయులకు మే మీవిధముగ ఆజ్ఞాపించితిమి: "హత్య గావించినవానిని, దేశములో దౌర్జన్యమును వ్యాపింప జేయుచున్నవానిని తప్ప మరెవ్వనివధించినను సమస్త మానవులను హత్యగావించినట్లు. ఎవడు ఒకని జీవితమును కాపాడెనో అతడు సమస్త మానవులకు ప్రాణదానము చేసినట్లు."

వారియొద్దకు (ఒకరితర్వాత నొకరు) మా ప్రవక్తలు (సత్యముయొక్క) విస్పష్టమగు ఉపపత్తులతో వచ్చిరి. (వారిని దౌష్ట్యమునుండియు, వధా వ్యాపారమునుండియు తొలగింపజూచిరి.) ఐనను వారిలో పల్వురు దేశములో అత్యాచారపరులై యున్నారు.

33. నిశ్చయముగ ఎవరు భగవంతునితోడను, అతని ప్రవక్తతోడను యుద్ధమొనర్తురో, ఎవరు దేశములో దౌర్జన్యమును వ్యాపింపజేయుచు తిరుగుచుందురో వారికి మరణశిక్ష విధింపబడవలెను; లేక, ఉరిశిక్ష ఇవ్వవలెను; లేక, ఒకవైపు చెయ్యి, ఒకవైపు కాలు విరుగగొట్టించవలెను; లేక వారిని దేశమునుండి వెళ్ళగొట్టవలెను. (ఈ విధముగ ఏ శిక్ష ఆ సమయమునకును నేరమునకును అనుకూలమో అట్టిశిక్ష విధించవలెను.) వారికీ ప్రపంచమున ఇది అవమానము. తుదిదినము నాడును వారికి ఘోరమగు శిక్షకలదు.౧౭౨

34. కాని మీకు పట్టుబడి (శిక్ష విధింపబడక) పూర్వమే వారు పశ్చాత్తప్తులైనచో (వారిని క్షమింపుడు;) భగవంతుడు మహాక్షమియనియు, కరుణాళువనియు తెలుసుకొనుడు.

ఆరవ ఖండము

35. ఓ విశ్వాసవంతులారా! భగవంతునకు భయపడుడు. భగవత్సాన్నిధ్యమును పొందగలుగు మార్గము నన్వేషింపుడు. భగవన్మార్గమున గట్టిగా పాటుపడుడు. మీకు విజయశ్రీ లభించును.

36. ఎవరు విశ్వాసహీనులో వారు భూమియందలి సమస్త సంపదలుండియు, అంతకంటె ఎక్కువగ నుండియు, తుది దినముయొక్క శిక్షనుండి తప్పించుకొనుటకై అదంతయు ధారపోసినను వారికడనుండి అది పరిగ్రహింపబడదు. వారికొఱకు ఘోరమగు శిక్షకలదు.

37. వారా నరకాగ్నినుండి తప్పించుకొనుటకు ఎంతైన కోరుదురు. కాని వారికందునుండి విముక్తి లభించదు. వారికక్కడ శాశ్వతమగు శిక్ష కలుగును.

38. పురుషుడైనను, స్త్రీ యైనను దొంగతనము చేసిన యెడల వారిచేతులు ఖండింపుడు. వారు చేసినదానికది శిక్ష. భగవంతుడు దీనిని (ఇతరులకు) గుణపాఠముగ నుండుటకై (ఇట్టి కఠినమగు శిక్షను విధించినాడు.) భగవంతుడు సర్వశక్తిమంతుడు; ప్రజ్ఞానిధి.౧౭౩

39. కాని ఎవడు దుష్కార్యాచరణముచేసి పిదప పశ్చాత్తప్తుడై (తన ప్రవర్తనమును) సంస్కరించుకొనునో, భగవంతుడు తప్పక అట్టివానిని (కరుణతో) మన్నించును. నిశ్చయముగ భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

40. (ఓ మానవుడా! నీ భగవంతుని ఈ కరుణాశీలత్వమును విత ర్కించుటేల?) భూమ్యాకాశముల సమస్త ప్రభుత్వమును భగవంతునిదేయని నీవెఱుగవా? అతడు తన ఇచ్ఛవచ్చినవారికి శిక్షనిచ్చి, తన ఇచ్ఛవచ్చిన వారిని క్షమించును. అతనికి సమస్తవస్తువులపైనను అధికార మున్నది.

41. ఓ ప్రవక్తా! ఎవరు నోటితో 'మేము విశ్వసించితిమి' అని చెప్పి నిజముగ హృదయములలో విశ్వాసము లేనివారో, ఎవరు యూదులై యున్నారో, ఎవరు సత్యమును నిరాకరించుటలో త్వరపడుచున్నారో—అట్టివారి స్థితి నిన్ను దుఃఖితునొనర్ప కుండుగాక! వీరు అసత్యమునకు చెవియొగ్గువారు. నీదగ్గరకురాని ఇతరుల (కు వార్తలు చేరవేయుటకై (వారట్లు) చెవియొగ్గుదురు. వీరు (తౌరాతు గ్రంథముయొక్క) సూక్తముల (నిజమైన సందర్భము, అర్థము సోపపత్తికముగ పరిష్కరింపబడినను, వాని) యసలు సందర్భములనుండి వానిని త్రిప్పివైచి (వాని యర్థమును మార్చివైతురు.) వారు (ప్రజలతో) ఇట్లందురు: "(మేము తౌరాతుసూక్తములను మీకు బోధించిన ప్రకారము) మీకివే యాజ్ఞల నిచ్చినచో మీ రంగీకరింపుడు. దీనిప్రకారము మీ రాజ్ఞాపింప బడకపోయినచో (ఆ ఆజ్ఞలను గ్రహింపక) అప్రమత్తులై యుండుడు.

(ఓ ప్రవక్తా! ఎవరు ఇంతటి దౌర్భాగ్యమునకు పాల్పడిరో వారుప దేశమును పొందజాలరు. వారికొఱకై నీవు దుఃఖింపకుము.) ఎవడు

మోహమునందు చిక్కుకొనిపోవుటను భగవంతుడిచ్ఛించునో నీవు వానికొఱకు భగవంతుని (క్షమా కారుణ్యమును) ఎంతమాత్రమును పొందజాలవు. భగవంతుడు ఇట్టివారి హృదయములను పరిశుద్ధ మొనర్పగోరడు. వారికొఱకు ఈ లోకమున పరాభవమును, పరలోకమున ఘోరమగు శిక్షయు కలవు.

42. ఓ ప్రవక్తా! వీరు అసత్యమునకు చెవియొగ్గువారు; అన్యాయార్జితమును తినువారు. ఇట్టివారు నీకడకు వచ్చినచో నీవు వారిమధ్య తీర్పు చెప్పవచ్చును. లేక (నీకిష్టము లేకపోయినచో) వారియెడ ఉదాసీనుడవై యుండుము. నీవు వారియెడ ఉదాసీనుడవై యున్నయెడల వారు నీకేమియు నష్టము కల్గింపజాలరు. ఒకసారి (నీవు ఉదాసీనుడవు కాక) తీర్పు చెప్పగోరినచో న్యాయముతో తీర్పుచెప్పుము. భగవంతుడు న్యాయపరులను ప్రేమించును.

43. మరి వారికడ తౌరాతుగ్రంథము ఉండగా, నీకడకేల న్యాయమునకు వచ్చిరి? భగవంతునియాజ్ఞ అందు కలదా? (దాని ననుసరించి వారేల తీర్పు గావించుకొనరు? నిజమేమనగా) వారు తౌరాతును, దాని యాజ్ఞలను సరకుచేయరు. వారికి (నిజముగ) విశ్వాసమే లేదు.

ఏడవ ఖండము

44. నిశ్చయముగ మేము తౌరాతును పంపితిమి. అందులో హితబోధ, (జ్ఞాన) ప్రకాశము కలవు. (భగవంతుని) ఆజ్ఞలకు బద్ధులగు ప్రవక్తలు దాని ననుసరించి యూదులకు ధర్మబోధ చేయుచుండువారు. (యూదుల విద్వాంసులగు) రబ్బీలు, గురువులు కూడ దానిప్రకారము నడచుచుండిరి. ఎందుకనగా వారా భగవద్గ్రంథమునకు రక్షకులుగా నియమింపబడిరి. వారందరు (ధర్మమునకు) సాక్షులై యుండిరి.

అందుచే (ఓ యూదులారా! ధర్మానుసరణములో మీరు) లోకులకు భయపడకుడు. (మీ యందరకును ఈశ్వరుడనైన) నాకుమాత్రమే భయ

పడుడు. నా సందేశ సూక్తములను అల్పమూల్యమున కమ్మివేయకుడు. భగవంతునిచే ప్రోక్తమైన గ్రంథము ననుసరించక ధర్మపాలనము చేయని వారే అవిశ్వాసులు.౧౪౪

45. మేము యూదులకొరకు తౌరాతులో ఇట్లాజ్ఞాపించితిమి. "ప్రాణమునకు బదులు ప్రాణము; కంటికిబదులు కన్ను; ముక్కునకు బదులు ముక్కు; చెవికిబదులు చెవి; పంటికిబదులు పన్ను; గాయములకు బదులు అట్టివేయైన గాయములు. మరి బదులు తీసికొనకుండ క్షమించు వానికి (అతనిపాపముల కది) పరిహారమగును. ఎవరు భగవంతునిచే పంపబడిన పవిత్రగ్రంథము ననుసరించి ఆజ్ఞాపింపరో అట్టివారే అధర్మ పరులు.

46. (ఆ ప్రవక్తల) తర్వాత వారి అడుగుజాడలనే మర్యమ్ కుమారుడగు ఈసాను పంపితిమి. అతని ముందుండిన తౌరాతుగ్రంథము నతడు నిరూపించెను. అతనికి మేము ఇన్జీల్ గ్రంథము నిచ్చితిమి. అందు హితబోధయు ధర్మప్రకాశమును కలవు. ఇంతకు ముందుండిన తౌరాతు నది నిరూపించి చూపెను. భగవద్భక్తిపరుల కది (మోక్ష) మార్గమును చూపునది; హితబోధ చేయునది.

47. (మేము ఇన్జీలులోకూడ ఇదే ఆజ్ఞ నిచ్చితిమి,) ఇన్జీలులో ఎట్లు ప్రోక్తమైనదో దాని ననుసరించియే ఇన్జీలు అనుయాయులు విధి నిషేధము లెరుగవలెను. ఎవరు భగవత్ప్రోక్తమగు గ్రంథము ననుసరించి ధర్మమును విధింపరో అట్టివారే ఆజ్ఞోల్లంఘన పరులు.

48. (ఓ ప్రవక్తా: ఇదేవిధముగ) నీకు సత్యముతోకూడిన ఈ గ్రంథమును ప్రవచించితిని. ఇది వెనుకటి పవిత్రగ్రంథమును నిరూపించి చూపును; దానికి సంరక్షకముగా ఉండును.

అందుచే (ఈ) భగవద్గ్రంథము ననుసరించి వీరిలో ధర్మమును ప్రవర్తింపజేయుము. నీకు ప్రోక్తమైన సత్యమును విడిచి ప్రజల తుచ్ఛ

మగు కోరికలను (మూఢభావములను, మూర్ఖ విశ్వాసములను) అనుసరింపకుము.

మీలో ప్రతిజాతికిని మేము ఒక్కొక్క ధర్మమును ఒక్కొక్క మార్గమును ఏర్పరచితిమి. భగవంతు డిచ్ఛించి యుండినచో మిమ్ముల నందరను ఒకేధర్మము ననుసరించువారిగా ♦ చేసియుండును. (కాని భగవంతుడట్లు చేయలేదు. మీ దేశకాల పరిస్థితులనుబట్టి మీ కప్పుడప్పుడు) ఇవ్వబడిన ధర్మము ననుసరించియే మిమ్ములను పరీక్షించవలెనని (అటు చేయలేదు.) అందుచే సన్మార్గమున ఒకరికంటె యొకరిని మించుటకు ఉద్యుక్తులై ముందడుగు వేయుడు. (అన్ని ధర్మములయొక్కయు గమ్యస్థాన మొక్కటే.) తుట్టతుదకు మీరందరు భగవంతునికడకే మరల వలసి యున్నది. మీ రేయే విషయములందు విభేదములను చూపిరో నాటి సత్యము మీ కతఁడు తెల్పును.

49. (ఓ ప్రవక్తా!) నీకు భగవంతుడు ప్రవచించిన రీతి వీరిలో ధర్మమును ప్రవర్తింపజేయుమని నీకు ఆజ్ఞాపించితిని. (అంతేకాని వీరి) తుచ్ఛమగు కోరికల ననుసరింపకుము. భగవంతుడు నీకు ప్రవచించిన సత్యమునుండి కొంతయైనను నిన్ను తప్పించుటకు వారు చూడకుండ జాగ్రత వహింపుము. వీరు ఈ ధర్మము ననుసరింపక పోయినచో భగవంతుడు వారి పాపములకై వారిని శిక్షించును. నిశ్చయముగ మానవులలో పల్వురు ధర్మము నతిక్రమించువారు.

50. (భగవదాజ్ఞల ననుసరించనివారు) అజ్ఞాన యుగమునందలి ధర్మము కావలెనందురా? నిశ్చయజ్ఞానము కలవారికి భగవంతునికంటె ఎక్కువ మంచిఆజ్ఞ నిచ్చువా రెవరు కలరు?

ఎనిమిదవ ఖండము

51. ఓ విశ్వాసవంతులారా! (మీకు శత్రువులైన) యూదులను

♦ ఇక్కడ "ఉమ్మతంవ్వాహిదతన్" అను మూలమునకు "ఒకేజాతి" యనియు అర్థము చెప్పవచ్చును.

డియు, క్రైస్తవుల నుండియు మీరు మిత్రుల గ్రహింపకూడు. వా(రు) (మీపై పగబూనుటయందు) ఒకరికొకరి మిత్రులు. మీలో ఎవడ(ు) వారిలో మిత్రులను గ్రహించునో వాడు వారిలోనివాడే యగును. అధ(ర్మ)పరులకు భగవంతుడు సన్మార్గమును చూపడు.

52. కాని (ఓ ప్రవక్తా!) నీవు చూచెదవుగాక! హృదయములలో (విద్వేష) రోగము కలవారు వారికడకు పోయి ఇట్లు చెప్పుదురు:

"(వీరితో వేరుగా ఉండుటవల్ల) మా కపాయము కల్గునేమో అని మేము భయపడుచున్నాము."

(మీకు) భగవంతుడు విజయము ప్రసాదించు కాలము దూర(ము)ముగ లేదు. లేక వారు శిక్షింపబడవచ్చును. అప్పుడు వారు తమ హృదయములలో దాచియుంచిన (వైరద్వేషములకు) పశ్చాత్తప్తులగుదురు.

53. అప్పుడు విశ్వాసవంతు లిట్లందురు: "మేము ~ — పక్షమున ఉన్నామని భగవంతునిపై కఠినాతి కఠినమగు ఒట్లు పెట్టుకొని చెప్పుచుండినవారు వీరేనా?" వారి ఈ కపటవృత్తివల్ల వారు చేసినదంతయు వమ్మైనది. వారు భ్రష్టులైరి.

54. ఓ విశ్వాసవంతులారా! మీలో ఎవడు తన ధర్మమును త్యజించునో (అతడు దానివల్ల ధర్మమునకు హాని కల్గునని భ్రమించకుండుగాక!) త్వరలో భగవంతుడు ఒక సంఘమును పుట్టించును; భగవంతుడు వారిని ప్రేమించును; వారు భగవంతుని ప్రేమింతురు. విశ్వాసవంతుల యెడ వారు మిక్కిలి వినయముతోడను, విశ్వాసహీనులయెడ మిక్కిలి కఠినులును ఐ యుందురు. వారు భగవన్మార్గమున సమస్తము నర్పింతురు. ఏ దూషకుని దూషణమునకును వెరువరు. ఇది భగవదనుగ్రహము. దానిని తన ఇచ్ఛవచ్చినవారికి ప్రసాదించును. భగవంతుడు సర్వసంపద్దాత; సర్వజ్ఞుడు.

55. (ఓ విశ్వాసవంతులారా!) మీకు నిజమైన బాంధవుడు భగవంతుడే; (అట్లే) అతని ప్రవక్తయు, విశ్వాసవంతులును, భగవద్ధ్యాన(ప)రులును, దాన నిరతులును, (అన్నిస్థితులయందును) భగవంతునిముందు (తల)వంచువారును (నీకు నిజమైన చుట్టములు.)

56. (జ్ఞాపక ముంచుకొనుడు.) ఎవడు భగవంతుని, అతని ప్రవ(క్తను), విశ్వాసవంతులను తన సంరక్షకులుగా గ్రహించునో (అతడు భగ(వం)తుని పక్షమున నున్నవాడు.) నిశ్చయముగ భగవంతుని పక్షమే గెలు(వ)గలదు.

తొమ్మిదవ ఖండము

57. ఓ విశ్వాసవంతులారా! యూదులలోను, క్రైస్తవులలోను (ఇ)తర అవిశ్వాసులలోను ఎవరు మీ మతమును చులకనగా తీసికొని పరి(హ)సించిరో వారిని మీరు రక్షకులుగ గ్రహింపకుడు. మీరు విశ్వాస(వ)ంతులే యైనచో భగవదాజ్ఞోల్లంఘనము వలని దుష్ఫలితములకు భయ(ప)డుడు.

58. మీరు ప్రార్థనకై పిలిచినప్పుడు వారు దానిని పరిహసించి (ఎ)కాకోళము చేయుదురు. ఎందుకనగా వారు బుద్ధిలేనివారు.

59. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "ఓ క్రైస్తవయూదు(ల)ారా! మీలో పల్వురు ధర్మభ్రష్టులైనది పోగా, మేము భగవంతుని(య)ందు విశ్వాసముంచి, మాకు ప్రోక్తమైనట్టియు, మాకు పూర్వము ప్రోక్తమైనట్టియు పవిత్రగ్రంథములను నమ్మినందులకు మీరు మా(య)ందు తప్పు పట్టుచున్నారా?"

60. (ఓ ప్రవక్తా! నీవు) ఇట్లనుము: "ప్రతీకారము విషయములో భగవంతుని సమక్షమందు ఎవడు నికృష్టుడో చెప్పమందురా? వాడు భగవంతునిచే శపితుడై భగవదాగ్రహమునకు పాత్రుడైనవాడు. (ఇట్టి) వారిలో కొందరి నతడు కోతులుగను, పందులుగను చేసెను. వారు దుశ్శ(క్తు)లను పూజించువారు. వారిస్థానము మిక్కిలి అధమాధమమైనది. వారు సన్మార్గమునుండి బహుదూరమున నున్నవారు.

61. వారు నీడకు వచ్చినప్పు డిట్లందురు: "మేము విశ్వసింతుము." కాని వారు నిశ్చయముగ అవిశ్వాసముతో వచ్చి అవిశ్వాసముతోడనే మరలిపోవుదురు. వారు తమ హృదయములలో దాచియుంచు సమస్తమును భగవంతుడెఱుగును.

62. వారిలో పాపమువైపునకును అతిక్రమణము వైపునకును, అన్యాయార్జితముతో పొట్ట నింపుకొనుటయందును ముందడుగు వేయు వారిని పల్వురను నీవు చూచెదవు వారు (రాత్రింపగళ్ళు) చేయుపనులు ఎంత దుష్టమైనవి!

63. వారి పండితులు, గురువులు వారిని అసత్యములు పలుకకుండగను, అన్యాయార్జితమగు విత్తమును తిననీయకుండగను ఏలచేయరు? వీరు చేయునదంతయు ఎంతటి దౌష్ట్యము!౧౬౪

64. యూదులిట్లందురు: "భగవంతుని చేతులు బద్ధమైయున్నవి." వారి అసత్యమునకు వారి చేతులే బంధింపబడుగాక! వారు శప్తులగుదురుగాక!

వాస్తవమేమనగా (భగవంతుడు సర్వవరసంప్రదాత.) భగవంతుని రెండుచేతులును బాగుగ చాచియున్నవి. భగవంతుడు తన ఇచ్ఛ వచ్చినట్లు వరప్రదాన మొనర్చును; అనుగ్రహమును పంచును.

నీకు ప్రోక్తమైన భగవద్గ్రంథము వారిలో పల్వుర దౌష్ట్యము (కౌటిల్యము) ను ధర్మహీనతను హెచ్చించెను.

(వారి ఈ కౌటిల్యమునకును, ధర్మహీనతకును) ఫలితముగ వారిలో పరస్పర విరోధ ద్వేషములను ప్రళయాంతమువరకు (వారి వివిధశాఖల మధ్య) మేము పెట్టితిమి. వీరు యుద్ధాగ్నిని ఎప్పుడు రగిల్చినను భగవంతుడు దాని నార్పుచునే యున్నాడు. వీరు దేశములో అల్లరులు వ్యాపింపజేయుటకు ప్రయత్నింతురు. దుష్టులను భగవంతుడు ప్రేమింపడు.

65. భగవద్గ్రంథము లివ్వబడిన వారు విశ్వాసవంతులై సన్మార్గ

ప్రవర్తకులైనచో వారి తప్పిదములు క్షమించి ఆనందోద్యానముల ప్రవేశింపజేసి యుండువాడను.

66. వారు తౌరాతును, ఇన్జీలును, భగవంతుడుపంపిన ఇతర ఉపదేశములను అనుసరించి యుండినచో వారిపైనున్న (ఆకాశము నుండియు) వారి క్రిందనున్న (భూమినుండియు) కూడ వారికి శ్రేయస్సు కలిగియుండెడిది. (కాని వారు తౌరాతు యొక్కయు, ఇన్జీలు యొక్కయు ధర్మబోధను తృణీకరించిరి.)౧౬౬

వారిలో కొందరు మధ్యమార్గము నవలంబించువారును కలరు. కాని వారు చేయునదికూడ దౌష్ట్యమే.

పదవ ఖండము

67. ఓ ప్రవక్తా! నీకు నీ ప్రభువునుండి ప్రోక్తమైనదానిని (మానవులందరకును) తెలియజేయుము. అట్లు చేయకపోతివా నీవు భగవత్సందేశమును తెలియజేయనివాడ వగుదువు. (శత్రువుల ప్రాతికూల్యమును లెక్కపెట్టకుము.) నిన్ను నీ (శత్రు) ప్రజలనుండి భగవంతుడు రక్షించును. భగవంతుడు విశ్వాసహీనులైనవారికి దారిచూపడు.

68. (ఓ ప్రవక్తా!) వారితో (ఇట్లు) చెప్పుము: "భగవద్గ్రంథములను పొందిన ఓ ప్రజలారా! మీరు తౌరాతును, ఇన్జీలును, భగవంతుడు పంపిన ఉపదేశములను అనుసరించక పోయినచో మీరు సన్మార్గమున లేరని తెలిసికొనుడు." (ఓ ప్రవక్తా! నీవు చూచెదవుగాక! ఈమాటలు వారికి రుచించవు. అవి వారి కుపదేశకారణము కాకపోవుట కాగా) వారిలో పల్వురి కౌటిల్యమును, ధర్మహీనతయు దీనివల్ల మరింత హెచ్చును. సత్యమును నిరాకరించిన వీరిస్థితికి నీవు దుఃఖపడకుము.

69. నిశ్చయముగ ఎవరు (ఖుర్ ఆన్ యందు) విశ్వాసము కలవారో, లేక యూదులైనను, సబాయీలైనను, క్రైస్తవులైనను (మరే మతస్థులైనను సరే) ఎవరు అల్లాః యందును, తుదిదినమునందును విశ్వ

సించి, మంచినే చేయుదురో, వారికెట్టి భయమును లేదు; వారు దుఃఖింప బనిలేదు.

70. నిశ్చయముగ నేను ఇస్రాయీల్ సంతతినుండి (విశ్వాసవంతులమై సత్కార్యాచరణ పరులమై యుందుమను) ఒడంబడికను గైకొంటిని. వారికడకు ప్రవక్తను పంపితిని. వారికి రుచించని విషయమును ప్రవక్తలు చెప్పినప్పుడు వారు వారిలో కొందరిని అసత్యవాదు లనిరి; కొందరిని వధించిరి.

71. తమకు శిక్ష లభించదని వారనుకొనిరి. అందుచేవారు (సత్యముచే) అంధులును బధిరులును అయిపోయిరి. తరువాత (వారి పశ్చాత్తాపము నంగీకరించి) భగవంతుడు వారి ననుగ్రహించెను. కాని వారిలో పల్వురు తిరిగి (అజ్ఞా) నాంధులును, బధిరులును ఐపోయిరి. వారు చేయుచున్నదంతయు భగవంతుడు చూచుచునేయున్నాడు.

72. "భగవంతుడు మర్యమ్ కుమారుడైన మసయా"* అని చెప్పువారు నిశ్చయముగ విశ్వాసహీనులు. (మీరు అజ్ఞానముచే ఎవరిని భగవంతు డనుచున్నారో ఆ) ఏసుక్రీస్తు ఇట్లు చెప్పియుండెను: ఇస్రాయీలీయులారా! భగవంతు నారాధింపుడు; భగవంతుడు నాకును మీకును కూడ ప్రభువు.'' ౭౨

నిశ్చయముగ, ఎవడు అల్లాఃతో ఇతరులను చేర్చునో (అనగా భగవంతునకు సమానులను కల్పించిగాని, లేక భగవంతునకు భార్యాపుత్రులను కల్పించిగాని వారి నారాధించునో) వానికి స్వర్గము నిషేధింపబడినది. వానినివాసము నరకాగ్ని. అధర్మపరులకు ఎవరునుసహాయముచేయరారు.

73. (అదేవిధముగ) "భగవంతుడు త్రిమూర్తులలో ఒకడు" అని చెప్పువారును, నిశ్చయముగ విశ్వాసహీనులు. ఏకైకుడగు భగవం

* ఏసుక్రీస్తు లేక ఈసా ప్రవక్తకు ఇదొక బిరుదనామము. ఇంగ్లీషులో Messiah అందురు.

తుడు తప్ప వేరుదైవము లేదు. వారు తాము చెప్పు (ఈ అసత్యమును) మానని-చో విశ్వాసహీనులగు వీరికి ఘోరమగుశిక్ష సంభవించును.౭౩

74. మరి వీరు (పశ్చాత్తాపపడి) భగవంతుని అనుగ్రహమును ఏల వేడుకొనరు? భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

75. మర్యమ్ కుమారుడైన ఈసా (ఏసుక్రీస్తు) కేవలమొక ప్రవక్తమాత్రము. అతనికి పూర్వమెందరో ప్రవక్తలు గతించిపోయిరి. అతని తల్లి సత్యవ్రతయగు ఒక స్త్రీ (మాత్రము). వారిద్దరును (అందరు మానవులవలె ఆకలిదప్పులకు లోనై) అన్నము తినువారు. చూడుము; మేమెంత స్పష్టముగ వారికై బోధించుచున్నామో, ఐనను వారెట్లు (సత్యమునుండి) విముఖు లగుచున్నారో!

76. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "మీరు భగవంతుని విడిచి, కించిత్తు లాభముగాని, కించిత్తు నష్టముగాని కలిగించజాలని వానిని పూజింతురా? భగవంతుడు సర్వము వినువాడు; సర్వము తెలిసినవాడు.

77. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "భగవద్గ్రంథమును పొందిన ఓ ప్రజలారా! మీ మతములలో సత్యమునకు వ్యతిరేకముగ హద్దుల నతిక్రమించి ప్రవర్తింపకుడు. మీకు పూర్వము దుర్మార్గము నవలంబించి, ఇతరులను దుర్మార్గుల నొనర్చి, సన్మార్గమును పోగొట్టుకొనినవారి తుచ్ఛవాంఛల ననుసరింపకుడు.

పదునొకండవ ఖండము

78. ఇస్రాయీలీయులలో ఎవరు సత్యమును నిరాకరించిరో వారు (మొదట) దావూదుచేతను (తర్వాత) మర్యమ్ కుమారుడగు ఈసాచేతను శపింపబడిరి. ఎందుకన వారు భగవదాజ్ఞల నుల్లంఘించువారు; హద్దుల నతిక్రమించువారు.

79. (ఒక్కసారి) వారు కావించిన చెడుగులను తిరిగి ఎన్నడును విడిచిపెట్టువారు కారు. నిశ్చయముగ వారు కావించినది గొప్పదోషము.

80. (ఓ ప్రవక్తా!) వారిలో పల్వురు అవిశ్వాసులతో స్నేహము చేయుటను నీవు చూచెదవుగాక! వారు సంచయించుకొనుచున్న దెంతయు దుష్టమైనది. భగవంతుడు వారిపై ఆగ్రహించెను. వారు శాశ్వతముగ శిక్ష ననుభవించు చుండవలసినవారే.

81. వీరు భగవంతునియందును, ప్రవక్తయందును, అతనికి ప్రోక్తమైన భగవద్గ్రంథమునందును విశ్వాసము కలవారే మైనచో వారెన్నడును (విశ్వాసులకు వ్యతిరేకముగ) అవిశ్వాసులతో స్నేహబాంధవ్యములను చేసికొన కుండెడివారు. కాని వారిలో పల్వురు అధర్మపరులే. ♦

82. (ఓ ప్రవక్తా!) విశ్వాసవంతులతో పగబూను విషయములో మిక్కిలి కఠినులు యూదులు, బహు దైవతారాధకులు. విశ్వాసవంతులతో మైత్రిచూపు విషయములో మిక్కిలి సన్నిహితులు 'మేము క్రైస్తవులము' అని చెప్పుకొనువారు. ఎందుకనగా వారిలో (సజ్జనులగు) పాదిరీలు, (భగవద్ధ్యానమునకై ప్రపంచమును విడిచిన) సన్న్యాసులును కలరు. (అంతేకాక) వారిలో గర్వము, స్వోత్కర్షాపరత్వము లేదు.౧౮౭

ఏడవ భాగము

83. భగవత్ప్రవక్తకు ప్రోక్తమైన ఈ సూక్తములను విని వారు ఆనంద భాష్పములను రాల్చుటను నీవు చూచెదవుగాక! ఎందుకన వారు (ఈ గ్రంథము) సత్యమైనదని గ్రహించిరి. వారిట్లందురు: "మా ప్రభూ! మేము (ఈ గ్రంథమును) విశ్వసించితిమి. నీ సత్యమునకు సాక్ష్యమిచ్చు వారిలో మమ్ము వ్రాయుము.

84. (వారు మరియు నిట్లందురు): "భగవంతునిపైనను, మా కడకు వచ్చిన సత్యమునందును విశ్వసించక పోవుటకు మాకేమైనది? సజ్జనుల శ్రేణిలో చేర్పుమనియేకదా మనము నిత్యము భగవంతుని వేడుకొనుచున్నాము."

85. అందుచే భగవంతుడు వారిట్లు చెప్పినందుకు వారిని బహూకరించెను. వారికి నిర్ఝరులు ప్రవహించు స్వర్గోద్యానములను ప్రసాదించెను. వారికందే నిత్యనివాసము. సత్కర్మాచరణపరుల కిదే ఫలము.

86. కాని ఎవరు అవిశ్వాసముతో మా సందేశములను నిరాకరింతురో వారు నరకాగ్నికి పాలగుదురు.

పండ్రెండవ ఖండము

87. ఓ విశ్వాసవంతులారా! భగవంతుడేయే వస్తువులను మీకై ధర్మ్యమొనర్చెనో వానిని మీకై నిషేధించుకొనకుడు. కాని హద్దుల నతిక్రమించకుడు. నిశ్చయముగ హద్దుల నతిక్రమించినవారిని భగవంతుడు ప్రేమింపడు.

88. మీకు భగవంతుడిచ్చిన ధర్మ్యమగు పదార్థములను, పరిశుభ్రమైన పదార్థములను తినుడు. మీరు విశ్వసించుచున్న భగవంతుని (ఆజ్ఞోల్లంఘనమువలని దుష్ఫలితములకు) భయపడుడు.

89. (అర్థము లేనట్టి) మొరకుతనముతో పెట్టుకొను ఒట్టులను భగవంతుడు గణింపడు. కాని మీరు ఉద్దేశపూర్వకముగ పెట్టుకొనిన ఒట్టులను శపథములను భగవంతుడు గణించును. అందుచే దానికి ప్రాయశ్చిత్తము: మీ కుటుంబములు సాధారణముగ ఎట్టి అన్నమును తినునో అట్టి అన్నమును పదిమంది బీదలకు పెట్టుట; లేక పదిమంది బీదలకు వస్త్రదానము చేయుట; లేక ఒక బానిసను విడిపించుట. ఇట్లు చేయుటకు కావలసిన ధనము లేనివారు మూడుదినములు (వరుసగా) ఉపవసింపవలెను. మీరు (ఉద్దేశపూర్వకముగ) ఒట్టు పెట్టుకొనిన దానికిది ప్రాయశ్చిత్తము. అందుచే మీ ప్రతిజ్ఞలను పాలింపుడు. (ఒట్టు పెట్టుకొని ఆ

♦ "ఫాసిఖూన్" అను ఇక్కడి మూలశబ్దమునకు 'భగవదాజ్ఞోల్లంఘనపరులు' అని అర్థము.

పని తప్పక చేయుడు. చేయజాలని పనికి ఒట్టు పెట్టుకొనకుడు.) మీరు కృతజ్ఞులై యుందురని మీకై తన సందేశమును భగవంతుడిట్లు స్పష్ట పరచును.

90. ఓ విశ్వాసవంతులారా! మత్తు పదార్థములు, జూదము, తత్సంబంధమైన ఆటలు, శిలాప్రతిమలకు బలులు, బాణములతో జ్యోస్యము మున్నగునవి చెప్పుట—ఇవన్నియు అపవిత్రములు; సైతానుపనులు. మీరు మోక్షకాములైనచో వీనిని విడిచిపెట్టుడు.

91. మత్తుపదార్థముల చేతను, జూదము మున్నగు ఆటలవల్లను సైతాను మీలో పరస్పర విద్వేషమును, వైరములను కల్గించి మిమ్ముల భగవత్స్మరణము నుండియు, భగవద్ధ్యానము నుండియు దూరుల నొనర్ప గోరును. మరి మీరు వానిని విడిచిపెట్టరేల?

92. భగవంతుని ఆజ్ఞలను పాలింపుడు; ప్రవక్త ఆజ్ఞలను పాలింపుడు. (చెడుగులనుండి) తప్పించుకొని వర్తింపుడు. మీరట్లు చేయక పోయినచో జ్ఞాపక ముంచుకొనుడు: మీకు సందేశమునుస్పష్టముగ వినిపించుట మాత్రమే నా ప్రవక్త విధి. (మీ కర్మఫలమును మీరే యనుభవింతురు.)

93. విశ్వాసవంతులై సత్కార్యాచరణ పరులై (ఈ ఆజ్ఞ వెలువడకపూర్వము) ఏది తిన్నను వారికది పాపముకాదు. వారు (ఇకముందు) జాగ్రత వహింతురు. వారు భగవదాజ్ఞలను విశ్వసించి సత్కార్యాచరణ పరులైరి. తరువాత అదేవిధముగ (తిరిగి వారిపై నిషేధమురాగా) వారు జాగ్రత వహించిరి. (భగవదాజ్ఞలపై) విశ్వాసను చూపిరి; సత్కార్యాచరణపరులైరి. (అట్టివారి వెనుకటి అకార్యములు పరిగణింప బడవు.) సత్కార్యాచరణ పరులను భగవంతుడు ప్రేమించును.

పదమూడవ ఖండము

94. ఓ విశ్వాసవంతులారా! మీ చేతులతోను, మీ బల్లెములతోను చేయు వేటవిషయములో భగవంతుడు నిశ్చయముగ మిమ్ము

పరీక్షించును. ఎవరు నిజముగ రహస్యమందుకూడ భగవంతునకు భయపడుదురో దీనివల్ల తెలియగలదు. మరి ఈ యాజ్ఞ తర్వాతకూడ ఎవరు హద్దుల నతిక్రమింతురో వారికి బాధాకరమగు శిక్ష లభించును:

95. ఓ విశ్వాసవంతులారా! మీరు యాత్రార్థులై వెళ్ళి వేటాడకుడు. మీలో ఎవరు (అట్టిస్థితిలో) ఉద్దేశపూర్వకముగ వేటాడి జంతువులను చంపుదురో దానికి వారు బదులివ్వవలెను. ఎట్టిజంతువునుచంపిరో దానివంటి పశువును కాబాకు పంపి ఖుర్బానీ ఇవ్వవలెను; (ఇది నిర్ణయించుటకు) మీలో ఇరువురు న్యాయస్థులను నియమించవలెను. లేక, ప్రాయశ్చిత్తముగ (దానిధర ననుసరించి) బీదల కన్నదానము చేయవలెను. లేక, ఎంతమంది పేదలకు అన్నదానము చేయవలెనో అన్ని దినములు (వరుసగా) ఉపవసింపవలెను. దానివలన తాను చేసినదాని ఫలమునతడు (వెంటనే) అనుభవించును. (ఈ ఆజ్ఞ ఇవ్వబడుటకు) పూర్వము ఐనదానికి భగవంతుడు క్షమించును. ఇకముందు ఎవరుచేసినను భగవంతుడు దానికి ప్రతిఫలమిచ్చును. భగవంతుడు సర్వశక్తి సంపన్నుడు; పుణ్యపాపముల ఫలముల నిచ్చువాడు.

96. మీకొఱకు సముద్రమునందును, నదులయందును వేటాడుట (యాత్రార్థము వెళ్ళినప్పుడుకూడ) ధర్మ్యమే. (అట్లే వేటాడకుండ మీకు లభించు) తినుబడివస్తువులు కూడ ధర్మ్యమే. దానివల్ల మీకేకాక మీతో ప్రయాణము చేయుచున్న ఇతరులకును లాభము కల్గును. మీరు యాత్రార్థమై వెళ్ళుచున్నప్పుడు నేలపై వేటాడుట మీకై నిషేధింపబడినది. అందుచే భగవంతునకు భయపడుడు. తుద కందరును భగవంతుని సమక్షమునకే సమావేశపరుప బడుదురు.

97. భగవంతుడు కాబాను పవిత్రగృహ మొనర్చినాడు. ప్రజలకొఱకు (శాంతిస్థాపనమునకొక) సంస్థగా నెలకొల్పినాడు. పవిత్ర మాసమును, బలిదానమును, పట్టి కాలంకృతములగు బలిపశువులను— (వీని యన్నిటి పావిత్ర్యమును కాపాడుడు.) మీరు తెలిసికొన వలెనని

ఇట్లు చేయబడినది. భూమ్యాకాశములలో కల సమస్తము భగవంతు డెఱుగును. భగవంతుడు సర్వజ్ఞుడు.

98. భగవంతుడు (దుష్కృతుల) ప్రతిఫల మిచ్చుటలో మిక్కిలి కఠినుడు. (కాని) మహాక్షమి; కరుణానిధి.

99. భగవత్సందేశమును వినిపించుటయే ప్రవక్త విధి. (ఆసందేశము ననుసరించుటయు, అనుసరించక పోవుటయు మీ పని.) మీరు రహస్యముగ చేసినను, బహిరంగముగ చేసినను భగవంతుడంతయు నెఱుగును.

100. (ఓ ప్రవక్తా! వారితో నిట్లు) చెప్పుము: "మీకు చెడుగు ఎంత రుచించినను మంచిచెడుగులు సమానము కావు. అందుచే, ఓ వివేకవంతులారా! భగవంతుని (ఆజ్ఞ నుల్లంఘించుటవలని దుష్ఫలితములకు) భయపడుడు. దానివల్ల మీకు సఫలత చేకూరును.

పదునాలుగవ ఖండము

101. ఓ విశ్వాసవంతులారా! మీకు విస్పష్టపరప బడినచో మీకు బాధాకరమగు వాటినిగూర్చి (అవసరమగు) ప్రశ్నలను వేయకుడు. ఖుర్ ఆన్ వ్యక్తీకరింపబడు చుండగా మీరు యేమేని విషయములను గూర్చి (సదుద్దేశముతో) ప్రశ్నించినయెడల మీకవి విస్పష్టపరుపబడును. భగవంతుడు (అప్పుడట్టి ప్రశ్నలు వేయు) వారిని క్షమించును. భగవంతుడు మహాక్షమి. (మానవుని తప్పిదములను) మన్నించువాడు.

102. (ఓ ప్రవక్తా!) నీకు పూర్వము ఒకజాతివారిట్టి ప్రశ్నలనే వేసి తమ విశ్వాసము గోల్పోయిరి.

103. ఆడుబంటు చెవిచీరుట, ఆడుబంటును ఊరిపై విడిచిపెట్టుట, పశువులు జంటల గనినప్పుడు విగ్రహములకు బలులనిచ్చుట, ఒంటెలను మొక్కుబడిగా విడిచిపెట్టుట (మున్నగు మూఢాచారములను నెలకొల్పినది భగవంతుడు కాడు.) దుర్మార్గులు భగవంతునకిట్టి అబద్ధముల నంటగట్టినారు. వారిలో పల్వురు బుద్ధిహీనులు.౧౧౦

104. "భగవత్ప్రోక్తమైన ఈ ఉపదేశము వైపునకు రండు; భగవంతునిచే పంపబడిన ప్రవక్తమాట వినుడు" అని వారికి చెప్పినపుడు వారిట్లందురు: "మాతాత తండ్రులు అనుసరించిన ఆచారమే మాకు చాలును"

(ఓ ప్రవక్తా! వారిసిట్లడుగుము): మీ తాత తండ్రులు అజ్ఞానులై సన్మార్గప్రవర్తకులు కానప్పటికిని (మీరు వారిమార్గమును గొఱ్ఱెదాటుగా అనుసరింతురా?)

105. ఓ విశ్వాసవంతులారా! నీ ఆత్మల బాధ్యత మీది. (ఇతరుల బాధ్యత మీకులేదు. మీ బాధ్యత ఇతరులకు లేదు.) మీరు సన్మార్గప్రవర్తకులైనచో ఇతరులు చెడిపోవుటవలన మీకెట్టి నష్టము కలుగదు. (తుట్టతుదకు) మీరందరు భగవంతుని సమక్షమునకే మరలవలసి యున్నది. (నాడు) మీచేత లెట్టివో అతడు చూపును.

106. ఓ విశ్వాసవంతులారా! మీలో ఎవనికైనను మృత్యువు సమీపించినపుడు (అతడు మరణశాసనము వ్రాయదలచినచో) మరణశాసనము వ్రాయు సమయమున మీనుండి ఇద్దరు పెద్దమనుష్యులను సాక్షులుగా పెట్టుకొనుడు. ఒకసారి మీరు ప్రయాణములో ఉండినప్పుడు మరణమాసన్నమై (ముసల్మాను సాక్షులు లభించ) నప్పుడు ముసల్మాన్ సాక్షులకుబదులు ముస్లిమేతర సాక్షులు చాలును.

మీకా సాక్షుల నిజాయితీతనముపై ఒకసారి సందేహమువచ్చినచో నమాజుతర్వాత వారిని (ప్రార్థనాలయములో) నిలువబెట్టి వారిచేత ఈ ఒట్టు పెట్టించుకొనుడు: "మాకిందెట్టి ప్రాపంచిక లాభము అక్కరలేదు. మాకితడు దగ్గరిబంధువైనను మేము భగవంతునిముందు సాక్ష్యమును దాచిపుచ్చము. మేమట్లు చేసినచో పాపహతుల మగుదుముగాక!"

107. ఒకసారి ఆ ఇద్దరుసాక్షులు పాపమాచరించినచో (అనగా అబద్ధసాక్ష్యము చెప్పినచో) ఆ సాక్షులు ఎవరిహక్కులను పోగొట్టజూచిరో

వారిపక్షమునుండి మరి ఇరువురు సాక్షులు ముందుకువచ్చెదరు గాక. వారు (నష్టపడిన పక్షము) వారికి బంధువులై యుండవలెను. తరువాత వారిద్దరును భగవంతునిపై ఒట్టుపెట్టుకొని ఇట్లు చెప్పవలెను: "మా సాక్ష్యము వెనుకటిసాక్షుల సాక్ష్యముకంటె ఉత్తమమైనది. మేము సాక్ష్యమిచ్చుటలో ఎట్టిఅన్యాయమును చేయలేదు. అట్లు చేసినచో మే మన్యాయపరుల మగుదుముగాక?"

108. ఇట్టిఒట్టువల్ల సాక్షులు సరియైనసాక్ష్య మివ్వవచ్చునని ఆశింపవచ్చును. (అథవా) రెండవపక్షము ఒట్టు పెట్టుకొనిన పిదప మేము పెట్టుకొనిన ఒట్లు రద్దుచేయబడునేమో అనుభయము వారి కుండును.

భగవంతునకు భయపడుడు; భగవంతుని ఆజ్ఞలను శిరసావహింపుడు. (జ్ఞాపకముంచుకొనుడు) అధర్మపరులకు భగవంతుడు (విజయమోక్షముల) మార్గమును చూపడు.

పదునేనవ ఖండము

109. నాడు ప్రవక్తలనందరను సమావేశపరచి భగవంతుడు వారినిట్లడుగును: "(మీరు భగవత్సందేశమును మీ ప్రజలకు వినిపించినప్పుడు) మీకెట్టి ప్రత్యుత్తరము లభించెను? (వారెంతవరకా సందేశమును ఆచరణలో పెట్టిరి?")

అప్పుడు ప్రవక్త లిట్లందురు: "మాకు తెలియదు. సర్వరహస్యములను ఎఱిగినవాడ వీవే."

110. నాడు భగవంతుడిట్లనును: "మర్యమ్ కుమారుడవైన ఓ ఈసా! నేను నీపైనను నీ తల్లిపైనను చూపిన అనుగ్రహమును జ్ఞప్తికి తెచ్చుకొనుము.

"నేను పరిశుద్ధాత్మచే నీకు శక్తినిచ్చినప్పుడు బాల్యములో ఉయ్యెలయందుండికూడ నీవు ప్రజలతో మాట్లాడుచుంటివి. అట్లే వయస్సు పెరిగినతర్వాతకూడ.

"నీకు పుస్తక (జ్ఞాన) మును, విజ్ఞానమును, తౌరాతు ఇంజీల్ గ్రంథములను ప్రసాదించినప్పుడు;

"నీవు మట్టినితీసుకొని దానితో పిట్టబొమ్మనుచేసి నా అనుజ్ఞతో దానిలో ఊదగానే అది నా ఆజ్ఞచే ఒకపక్షి ఐపోయినప్పుడు;

"నీవు నా ఆజ్ఞచే అంధులను, కుష్ఠురోగులను బాగుపరచినప్పుడు;

"నీవు నా ఆజ్ఞచే చచ్చిపోయినవారిని మృత్యువుబారినుండి విడిపించినప్పుడు; ౧౧౦

"ఇస్రాయీలీయులు నీపై చేయుచున్న దౌర్జన్యమును నిరోధించినప్పుడు; అప్పుడునీవు (సత్యముయొక్క) స్పష్టమగు చిహ్నములను వారియొద్దకు తీసుకొని వెళ్ళితివి. వారిలో దుష్టులు "ఇది స్పష్టముగ ఇంద్రజాలవిద్య" యనిరి.

111. "అప్పుడు నాయెడను, నాప్రవక్తయగు నీయెడను విశ్వాసవంతులు కండని నేను నీఅనుయాయులను ప్రేరేపించినప్పుడు వారిట్లనిరి: "మేము విశ్వసించితిమి. భగవంతుడా! మేము సర్వస్వము నీకర్పించినవారమనుటకు నీవేసాక్షివి."

112. "మర్యమ్ కుమారుడవైన ఓ ఈసా! నీభగవంతుడు మాకొఱకు ఆకాశమునుండి భోజనము పంపునా?" అని ఈసా అనుయాయులన్నప్పుడు దానికి ఈసా ఇట్లనెను: "మీరు విశ్వాసవంతులేయైనచో భగవంతునకు భయపడుడు. (ఇట్టికోర్కెలను కోరకుడు.)

113. వారిట్లనిరి: "(మేము మిమ్ము పరీక్షించు ఉద్దేశముతో ఇట్లనుటలేదు.) మే మందుండి ఆరగింపగోరెదము. దానివల్ల మాకు మనశ్శాంతి కల్గును. నీవు మాకు సత్యమునే చూపితివని తెలుసుకొని దానికి సాక్షులమై యుందుము."

114. అప్పుడు మర్యమ్ కుమారుడైన ఈసా భగవంతునిట్లు ప్రార్థించెను: "ఓ అల్లా! ఓ మాప్రభూ! మాకొఱకు ఆకాశమునుండి ఆహారమును దింపుము. ఈ ఆహారము దిగుట మాకును, మా తర్వాతివారికిని మాపూర్వులకును ఒక పండుగదినమగుగాక! అది నీ (అనుగ్రహమునకు) ఒక చిహ్నమగుగాక! మాకది ఆహారమిచ్చుగాక! ఆహారమును ప్రసాదించుటలో నీకు సమానుడెవ్వడును లేడు."

115. భగవంతుడిట్లనెను: "నేను మీకొఱకు తప్పక ఆహారమును పంపుదును. కాని దానితర్వాత ఎవడు (సత్యమార్గమును) నిరాకరించునో వానిని కఠినముగ శిక్షింతును. అది ప్రపంచములో మరెవ్వరికిని ఇవ్వబడనట్టి శిక్ష."

పదియారవ ఖండము

116. (ఈసాను) భగవంతుడిట్లు (ప్రశ్నించును): "మర్యమ్ కుమారుడవైన ఓ ఈసా! అల్లాః కాక నన్ను, నాతల్లిని ఇద్దరు దేవులుగా భావింపుడు అని నీవెన్నడైనను చెప్పితివా?"

దానికి ఈసా ఇట్లనును: "నీవు మహాత్తరుడవు; పరమపవిత్రుడవు. నాకర్హతలేని విషయముల నేను చెప్పుటకు పాత్రుడ గాను. నేనట్లు చెప్పియుంటినా నీవు తప్పక తెలుసుకొనియుందువు. నా హృదయమున దాగియున్న విషయములనైతము నీ వెఱుగుదువు; నీకు తెలిసినవిషయములు నాకు తెలియవు. నిశ్చయముగ నీవు సర్వరహస్యసంవేదివి.

117. "నీవు ఆజ్ఞాపించినవిషయములు తప్ప నేను వారికి మరేదియు చెప్పలేదు. (వారికినేనుచెప్పిన ప్రధానవిషయమిది): 'నాకు ప్రభువు మీయందరకు ప్రభువు అగు అల్లాఃను సేవింపుడు.'

"నేను వారితో ఉన్నంతకాలము వారికి సాక్షినై యుంటిని. కాని నీవు నన్ను మృతునొనర్చినపిదప వారిని కాచువాడవు నీవేయైతివి. నీవు సర్వసాక్షివి.

118. "నీవు వారిని శిక్షించినచో నిశ్చయముగ వారు నీ సేవకులే కదా? నీవు వారిని క్షమించినచో-నిశ్చయముగ నీవు సర్వశక్తిమంతుడవు; ధీనిధివి."

119. భగవంతుడిట్లనును: "సత్యవంతుల సత్యము పనికివచ్చు దినమిది. నిర్ఝరులు ప్రవహించు సుందరోద్యానములు వారికి లభించును వారికంతే నిత్యనివాసము. భగవంతుడు వారియెడ ప్రసన్నుడయ్యెను. వారు భగవంతుని ప్రసాదమునకు తుష్టులైరి. అత్యంత ఘనమైన కృతార్థత ఇది.

120. భూమ్యాకాశములు, అందున్న సర్వస్వము భగవంతునివే. అన్నిటిపైనను అతని కధికారమున్నది.

بسم الله الرحمن الرحيم

అధ్యాయము ౬

జంతుసంతతి

(అల్ అన్ ఆమ్)

(మక్కాలో ప్రోక్తము.)

(20 ఖండములు — 165 సూక్తములు)

కరుణామయుడును వరప్రదాయకుడును అగు అల్లాః నామస్మరణముతో (ప్రారంభించుచున్నాను.)

మొదటి ఖండము

1. భూమ్యాకాశముల సృష్టించి, చీకటి వెలుగుల కల్పించిన అల్లాఃయే సమస్త స్తుతిపాత్రుడు. ఐనను అవిశ్వాసులు తమ ప్రభువునకు సమానులను కల్పింతురు.

2. మిమ్ము మట్టినుండి చేసిన దతడే. తరువాత మీకై ఒక (జీవిత) కాలపరిమితిని విధించెను. (మరణానంతరము తుదిదినమువరకు) మరొక కాలపరిమితిని నిర్ణయించెను. ఐనను మీరు శంకింతురు.

3. భూమ్యాకాశములం దెల్లెడల (సర్వవ్యాపియై) యున్నవాడు భగవంతుడు. మీ రహస్యభావములను, మీరు పైకిచెప్పు మాటలను భగవంతుడెఱుగును. మీరు గడించు (చెడ్డదైనను మంచిదైనను) సమస్తము నెఱుగును.

4. (చూడుడు) వీరిప్రభువు చిహ్నములలో ఏచిహ్నము వారికడకు వచ్చినను వారు దానికి విముఖులైరి.

5. ఈ విధముగ వారు తమకడకు సత్యము వచ్చినప్పుడు దానిని

నిరాకరించిరి. అందుచే వారు దేనినిచూచి పరిహసించిరో దానిసత్యము వారికి తేటతెల్లమగును.

6. వారికి పూర్వము ఎన్నిజాతులను నశింపజేసితిమో వారు చూడరా? అవి మీకంటె ఎక్కువ బలవంతమైన పునాదులపై నెలకొల్పబడిన జాతులు. మేఘములనుపంపి వారికై పుష్కలమగు వర్షమును కురియజేసి జీవనదులను ప్రవహింపజేసితిని. కాని తర్వాత వారిపాపములకు ఫలితముగ వారిని నశింపజేసి వారిస్థానమున క్రొత్తజాతులను పుట్టింపజేసితిని.

7. (ఓ ప్రవక్తా!) కాగితముపై వ్రాయబడి సిద్ధముగనున్న ఒక పుస్తకమును నీపై దించియుండినచో దానిని స్పృశించి అది నిజమైన పుస్తకమని తెలిసికొన్నపిదప కూడ విశ్వాసహీనులు ఇది ఇంద్రజాల విద్యవల్ల సంభవించినదని చెప్పియుందురు.

8. వారిట్లు చెప్పిరి: "(ఇతడు నిజము చెప్పుచుండినచో ఇతని కడకు ఒకదేవత ఎందుకు పంపబడడు?") మేము ఒకదేవతనే పంపిననైతే సమస్తము పరిష్కరింపబడి యుండెడిది. అప్పుడు వారికి గడువే లభించక పోయెడిది.

9. మేమొక దేవతను ప్రవక్తగా పంపియుండినచో వానినికూడ మనుష్యునిగనే చేసియుందుము. (ఎందుకనగ దేవతలు దేవతా స్వరూపముతో మానవులముందు వచ్చుట ప్రకృతి విరుద్ధము.) ఇప్పుడు వీరెట్టి శంకలు పుట్టించుచున్నారో అప్పుడుకూడ వారి నన్నివిధముల సంకోచింతురు.

10. (ఓ ప్రవక్తా!) నీకు పూర్వముకూడ ప్రవక్తలపహసింపబడిరి. ఇట్లపహసించినవారు ఎందుకపహసించిరో వారికా ఆపదయే తటస్థించెను.

రెండవ ఖండము

11. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "దేశాటనము చేయుడు. (నశించినజాతుల పురావైభవ చిహ్నములను చూడుడు.) సత్యమును నిరాకరించినవారి కెట్టిఫలము లభించెనో చూడుడు."

12. (ఓ ప్రవక్తా! వారిని) అడుగుము: "భూమ్యాకాశములందున్న సమస్తము ఎవరిది?" (వారితో ఇట్లు) చెప్పుము: "(ఈ సమస్తము) అల్లాదే. అతడు కరుణాళుత్వము తనపై విధించుకొనెను. నిశ్చయముగ తుదిదినమునాడు మిమ్ముల నందరను ఒకచో కూడబెట్టును. అందెంతమాత్రము సందేహములేదు. (కాని) తమ (చేతులతో తమ) ఆత్మలను కోల్పోయినవారు దీనిని విశ్వసింపరు.

13. రాత్రి (చీకటి) యందును, పగటి (వెలుతురు) లోను ఉన్న సమస్తము అతనికొఱకే. భగవంతుడు సమస్తమును వినువాడు; సమస్తము తెలిసినవాడు.

14. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) అనుము: "భూమ్యాకాశముల సృష్టించిన భగవంతునివిడిచి మరొకనిని నేను పోషకునిగా గ్రహింతునా? అతడు అందర కాహారము ప్రసాదించును; కాని తాను తినడు.

నీవిట్లనుము: "భగవంతునిముందు ప్రణమిల్లువారిలో ప్రప్రథముడవగుమని నాకాజ్ఞాపింపబడెను. మీరు బహుదైవతారాధకులు కాకుడు.

15. ఇట్లనుము: "నేను భగవంతుని ఆజ్ఞల నెట్లు జవదాటుదును? రాబోవు ఆ భయంకరదుఃఖ దినమునకు నేను భయపడుదును.

16. నాడు ఎవరు ఆపదనుండి తప్పిపోయిరో వారు నిశ్చయముగ భగవదనుగ్రహమును బడసినవారు. అది నిజమైన జీవసాఫల్యము.

17. ఒకసారి భగవంతుడే శిక్షించినయెడల తిరిగి భగవంతుడు తప్ప మరెవ్వరును దానిని తొలగింపజాలరు. భగవంతుడే అనుగ్రహించినచో (చెప్పవలసిన దేమున్నది?) భగవంతునకు అన్నివస్తువుల పైనను సర్వాధికార మున్నది.

18. అతడు తన సేవకులపై సర్వేశ్వరుడై యున్నాడు. అతడు ప్రజ్ఞానిధి; సర్వజ్ఞుడు.

19. (ఓ ప్రవక్తా! వారినిట్లు) అడుగుము: "అన్నిటికంటె గొప్ప సాక్ష్యము ఎవరిది?"

నీ విట్లనుము: "(భగవంతుని సాక్ష్యమే అన్నిటికంటె గొప్ప సాక్ష్యము.) భగవంతుడు మీకును నాకును మధ్య సాక్షియై ఉన్నాడు. దీనిద్వారా మిమ్ములను, ఈ సందేశము విన్న వారిని (సత్య నిరాకరణము యొక్కయు, దుష్ప్రవర్తనము యొక్కయు దుష్ఫలమునుచెప్పి) భయ పెట్టుటకై భగవంతుడు నాకీ ఖుర్ ఆన్ గ్రంథమును ప్రసాదించినాడు. ఇప్పటికిని భగవంతునితో ఆరాధనార్హులగు ఇతరేశ్వరు లున్నారని మీరు సాక్ష్యమిత్తురా?"

(ఓ ప్రవక్తా!) నీవిట్లనుము: "(మీ సాక్ష్య మిదేయైనచో వినుడు): నేనిట్టి సాక్ష్యమివ్వను. భగవంతుడు ఏకైకుడేనని నేననుచున్నాను. అతనితో మరెవ్వరును (సహేశ్వరులు) లేరు. మీరు కల్పించుచున్న ఈశ్వరేతరులతో నాకెట్టి సంబంధమును లేదు."

20. మేము ఎవరికి సత్యగ్రంథము ప్రసాదించితిమో వారు తమ సంతానము నెంత సులభముగ ఆనవాలు పట్టుదురో అంత సులభముగ ఇతనిని (ప్రవక్తను) ఆనవాలు పట్టుదురు. కాని ఎవరు స్వాత్మ వినాశపరులో వారు విశ్వసింపరు.

మూడవ ఖండము

21. అల్లాహుపై ఒక అసత్యము నాపాదించువారికంటె ఎక్కువ అధర్మపరులెవరు? (అదేవిధముగ భగవత్ప్రోక్త మైనవానిలో) అబద్ధముల కల్పించువానికంటె (అధర్మపరు డెవడుండును?) నిశ్చయముగ అధర్మపరులు సఫలురు కాజాలరు.

22. వారినందర నొకచో చేర్చు ఆ (తుదిదినము) నాడు బహు దైవతారాధకుల నిట్లడుగుదుము: "మీరు ఇంతగా దృఢవిశ్వాసముతో నొక్కిచెప్పిన ఆ దైవతములేవి?"

23. అప్పుడు వారు (ఈ విధముగ అబద్ధము చెప్పుటకంటె) మరేమియు చెప్పజాలరు. వారిట్లందురు: "మా ప్రభువైన అల్లాహుతోడు! మేము బహు దైవతారాధకులము కాము."

24. వారెట్లు తమకు వ్యతిరేకముగ తామే అబద్ధమాడుచున్నారో చూడుము. వారి కల్పనలన్నియు ఇప్పుడు వారికడనుండి పోయెను.

25. వారిలో కొందరు (భగవద్వాక్యమును) వినుటకు నీకు చెవి యొగ్గుదురు. (ఇది పైకి చూపుటకుమాత్రము. నిజముగా వారికి జిజ్ఞాస లేదు.) మేము వారి హృదయములపై తెరలువైచితిమి. వారికందుచే బోధపడదు. వారి చెవులపై ఒకభారము నైచితిమి. అందుచే వారికి జ్ఞానబోధ వినపడదు. ఒకసారి వీరు సత్యముయొక్క ప్రతిచిహ్నమును ప్రత్యక్షముగ చూచినను, వారు దానియందు విశ్వసింపరు. వారు మీ దగ్గరకు వచ్చినప్పుడు మీతో వివాదము మాత్రము చేయుదురు.

(అవిశ్వాసులు) ఇట్లందురు: "(మేము ఎల్లప్పుడును వినుచుండిన) ప్రాచీనుల గాథలేగాని ఇది మరియొకటి కాదు."

26. ఇతరులు కూడా (సత్యవచనములు) వినకుండ వీరు చేయుదురు. తాముకూడా దానినుండి దూరులైపోవుదురు. దానివల్ల వారు స్వాత్మవినాశము చేసికొనుచున్నారు. అది వారు గ్రహించుటలేదు.

27. (ఓ మానవుడా!) వారు నరకాగ్నిముందు నిలువబడి యున్నప్పుడు నీవుచూచి ఆశ్చర్యపోవుదువు. వారప్పు డిట్లందురు: "అయ్యో! మేము తిరిగి మరియొకసారి ప్రపంచమునకు పంపబడినచో మా ప్రభువు సందేశము నిరాకరించువారము కాము. మేము విశ్వాసవంతులమై యుందుము."

28. (వారి కోరిక హృదయపూర్వకమైనది కాదు.) వారు తమ హృదయములలో దాచియుంచిన (కల్మషము) నాడు బయలుపడును. (దాని ఫలము వారికి ప్రత్యక్షమగును.) ఒకసారి వారు భూమికి

మరలింపబడిరేని ఏది నిషేధింపబడెనో తిరిగి దానినే అవలంబింతురు. నిశ్చయముగా వారు అసత్యపరులు.

29. (అవిశ్వాసులలో కొందరు పరలోకమందు విశ్వాసము లేని వారు) వారిట్లందురు: "ఈ ప్రపంచపు జీవితముతప్ప వేరొకటి లేదు. (మరణమే జీవితమునకు అవధి. ఒకసారి మరణించిన తర్వాత) తిరిగి లేచుటలేదు."

30. (ఓ మానవుడా!) వారు (తుదిదినమునాడు) తమ ప్రభువు ముందు నిలువబడియుండగా చూచి నీ వాశ్చర్యపోవుదువు. అప్పుడు భగవంతు డిట్లనును: "(మరణించినతరువాత తిరిగి లేవము అని మీరనిరిగదా, ఇప్పుడు మీరు పునర్జీవితులైరే; మరి చెప్పుడు!) ఇది వాస్తవముకాదా?"

దానికి వారిట్లందురు: "మా ప్రభువుతోడు. ఇది సత్యము."

దానికి భగవంతుడిట్లు సెలవిచ్చును: "మీరు (ప్రపంచములో ఈ సత్యమును నిరాకరించిరి.) ఇప్పుడు అందుకై ఇవ్వబడు శిక్షను రుచిచూడుడు. ఎందుకన, మీరు అవిశ్వాసులు."

నాలుగవ ఖండము

31. భగవంతుని ముందునకు తుదిదినమునాడు అందరును తేబడుదురు. సత్యము నిరాకరించినవారు నిజముగ భ్రష్టులు. రాబోవు (మృత్యు) కాలము అకస్మాత్తుగా ఆసన్నమైనప్పుడు వారిట్లందురు: "మా ప్రమాదము ఎంత శోచనీయమైనది!" అప్పుడు వారు తమ పాపభారములను తమ వీపులపై ఎత్తుకొనియుందురు. వారిట్లు వహించుచున్న భారము నిశ్చయముగ దుష్టమైనది.

32. ఈ ప్రపంచపు జీవితము ఒక ఆటమాత్రము; ఒక వ్యర్థమైన ఆట. ఎవరు దైవభీతిపరులో వారికి పరలోకనివాసమే ఉత్తమమైనది. మీరీమాత్రము గ్రహింపజాలరా?

33. (ఓ ప్రవక్తా!) అవిశ్వాసులు చెప్పెడి మాటలు తప్పక నీ మనస్సు నొప్పించును. ఇది మాకు తెలియును కాని, నిన్ను అసత్యవాది

యని మాత్రము వారనరుకదా. (నీ సత్యవ్రతము వారందరకును తెలియును.) నిశ్చయముగ మూర్ఖులైనవారు భగవదాదేశములను నిరాకరింతురు.౧౫౪

34. నిశ్చయముగ నీకు పూర్వపు ప్రవక్తలుకూడ ఇట్లే ధిక్కరింపబడిరి. వారట్లు ధిక్కరింప బడినప్పుడు ఓర్పువహించిరి. నా సహాయము వచ్చువరకు వారు నానాబాధలకు లోనైరి. (జ్ఞాపకముంచుకొనుడు. ఇది భగవంతునిచే నిర్ణయింపబడినధర్మము.) భగవంతుని వచనములను ఎవ్వరును మార్చలేరు.

నిశ్చయముగ ప్రవక్తల చరిత్రలలో కొందరిచరిత్రలు నీకు తెలుపబడియే యున్నవి.

35. (ఓ ప్రవక్తా!) వారి సత్య నిరాకరణము నీకు దుర్భరమైనచో (సహనముతప్ప వేరొక మార్గములేదు. నీవేమి చేసినను వారు సన్మార్గమునకు రారు.) భూమిలో చొచ్చుటకు ఒక సొరంగమును వెతికిగాని, ఆకాశముపై ఎక్కుటకు నిచ్చెన తయారుచేసికొనిగాని, నీవు ఎంతటి మహాత్మ్యమును చూపినను (వారు నమ్మరు.) భగవంతుడు తలచినచో వారినందరిని తప్పక సత్యమార్గముపై తీసికొని వచ్చువాడు. (కాని అది భగవదిచ్ఛకాదు.) అందుచే (భగవద్రహస్యము తెలియని) అజ్ఞానులలో చేరకుము.

36. ఎవరు శ్రద్ధతో చెవియొగ్గి వింటురో వారే (నిన్ను ప్రవక్తగా) స్వీకరింతురు. కాని ఎవరు మృతులో (వారు నిన్నెట్లు స్వీకరింతురు?) వారిని భగవంతుడే (తుదిదినమున) లేపును. భగవంతుని సముఖమునకు వారు మరలింపబడుదురు.

37. వారిట్లందురు: "వాని ప్రభువునుండి వానికొక చిహ్నమేల పంపబడలేదు?"

(వారితో) ఇట్లనుము: "భగవంతుడు నిశ్చయముగ చిహ్నము పంపగలడు." కాని వారిలో పల్వురకు తెలియదు.

38. భూమిపై చరించు ప్రతిజంతువు, గాలిలో ఎగురు పక్షియు, మీవలెనే, సంఘములుగా ఏర్పడియున్నవి. (వారికై ఒక నియమము, ధర్మము కలదు.) ధర్మగ్రంథములో ఏదియు అపేక్షింపబడలేదు. (మీవలెనే) వారుకూడ భగవంతుని సముక్షమున సమావేశ పరుపబడుదురు.౧౪౫

39. మా సందేశములను నిరాకరించువారు చెవిటివారు, మూగవారు; అంధతమస్సునందున్నవారు. భగవంతుడు తన యిచ్ఛవచ్చిన వారిని తప్పిదముల చేయనిచ్చును; తన యిచ్ఛవచ్చిన వారిని సన్మార్గమున నడిపించును.

40. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: భగవంతునిశిక్ష వీరిపైవచ్చి పడినను, రాబోవు (మృత్యు) కాలము సమీపించినను అప్పుడు సైతము మీరు భగవంతుని విడిచి ఇతరులను పిలుతురా? మీరు సత్యవంతులే ఐనచో (సమాధానము నీయుడు.)

41. కాదు; మీరు భగవంతునే పిలుతురు. మీరెందుకు భగవంతుని పిలిచిరో, భగవంతుడు తలచినచో మిమ్ములను ఆ విపత్తునుండి రక్షించును. (భగవంతుడు అనుగ్రహించినచో) మీరు కల్పించుకొనిన దైవేతరులను మీరు మరచిపోదురు.

ఐదవ ఖండము

42. నిశ్చయముగ నీకు పూర్వము (వివిధ) జాతులకు మేము (ప్రవక్తలను) పంపితిమి. (ఆ జాతులు వారిబోధ వినక దుర్మార్గులైనప్పుడు) వారు నమ్రులై సరియైన మార్గమునకు వచ్చుటకు వారికి బాధను, దారిద్ర్యమును కలిగించితిమి.

43. మాశిక్ష వారికి కలిగినప్పుడు వారేల నమ్రులు కాలేదు? వారి హృదయములు కర్కశములైనవి. వారి పాపకార్యములే వారికి ఆకర్షణీయము లగునట్లు సైతాను చేసెను.

44. (వారికి చేయబడిన ఉపదేశము వారు మరచి దుర్మార్గులై ప్రవర్తించుచున్నప్పటికిని) వారికి మేము సర్వశుభములను ప్రసాదించితిమి. వారీ భోగభాగ్యముల ననుభవించుచుండగా హఠాత్తుగ (ఒకనాడు వారు తమచేతల ప్రతిఫలమును పొందవలసి వచ్చెను.) వారు పట్టుకొనబడి దిగ్భ్రాంతులైరి.

45. ఈ విధముగ దుర్మార్గులు సమూలముగ నశింపజేయబడిరి. సర్వలోక సంపోషకుడైన భగవంతునకు సర్వస్తుతు లగుగాక!

46. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "మీరీ విషయమును యోజించితిరా? ఒకసారి భగవంతుడు మీ శ్రవణమును, దృష్టిని హరించి మీ హృదయములపై ముద్రివేసినచో, భగవంతుడుతప్ప మరెవరు మీకు శ్రవణమును, దృష్టిని తిరిగి ప్రసాదింపగలరు?"

చూడుడు! మేమెట్లు వివిధరీతుల బోధించుచుంటిమో! ఐనను వారు సత్యవిముఖు లగుదురు.

47. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "భగవంతుని శిక్ష హఠాత్తుగకాని, స్పష్టముగకాని మీకు వచ్చినప్పుడు దుర్మార్గులు తప్ప ఇతరులెవ్వరైన నశింతురనుకొందురా?"

48. మేము మీకు శుభవార్త నిచ్చుటకును, పరాకుపుచ్చుటకును మాత్రమే ప్రవక్తలను పంపుదుము. అందుచే ఎవరు విశ్వసించి (తమ జీవితములను) సంస్కరించుకొందురో వారికి (నరక) భయ మక్కరలేదు; వారికెట్టి దుఃఖమును లేదు.

49. కాని, ఎవరు మా సందేశములను నిరాకరింతురో వారు శిక్షింపబడుదురు. ఎందుకన వారు ధర్మాతిక్రమ మొనర్చిన పాపులు.

50. (ఓ ప్రవక్తా! నీవు వీరితో ఇట్లు) చెప్పుము: "నాదగ్గర భగవంతుని గుప్తధననిధు లున్నవని మీతో చెప్పుటలేదు. గుప్తమై అదృశ్యమై యున్నదానినికూడ నేనెఱుగను. నేను దేవతననికూడ మీతో

చెప్పుటలేదు. నాకేది ప్రోక్తమైనదో అదితప్ప నేను మరొక దాని ననుసరించుటలేదు.”

(ఓ ప్రవక్తా!) వారినిట్లడుగుము: “కండ్లున్న వారు, కండ్లులేనివారు సమానులేనా? మరి మీరాలోచించరేల?”

ఆరవ ఖండము

51. (ఓ ప్రవక్తా! నీమాట వినని దుర్జనులను విడిచిపెట్టుము.) వారి భగవద్వచనములను వినిపించి (సత్యమును నిరాకరించుటవల్ల కలుగు దుష్ఫలితములను చూపి) భయపెట్టుము. వారందరు ఒకనాడు భగవంతుని సమక్షమునకు తేబడుదురనియు, నాడు భగవంతుడుతప్ప వారికి మరెవ్వరును అడ్డురారనియు, రక్షింపరనియు చెప్పుము. అప్పుడైనను వారు సన్మార్గమునకు వత్తురేమొ!

52. (ఓ ప్రవక్తా!) ఎవరు ఉదయము, సాయంకాలము భగవదనుగ్రహము కోరి ప్రార్థింతురో అట్టివారిని (నీ సమక్షముననుండి) త్రోలగించకుము. వారికర్మలకు నీవు బాధ్యుడవుకావు. నీకు వారును బాధ్యులుకారు. వారిని నీవట్లు తొలగించినచో నీ వన్యాయపరులలో నొకడవాదువు.౧౫౬

53. (ప్రపంచములోనున్న హెచ్చుతగ్గులను ఆధారముగ) కొందరిని కొందరిస్థితిలో పరీక్షించితిమి. (ధన ధాన్యములతో తులతూగుచున్నవారు నిరుపేదలను చూచి పరిహాసగర్భితముగ) ఇట్లందురు: “వీరికేనా భగవంతుడు తన అనుగ్రహమును చూపుటకై మానుండి ఎన్నుకొన్నది!”

(కాని ఓ గర్విష్ఠులారా! భగవంతుని అనుగ్రహమునకు) కృతజ్ఞులైయున్నవారెవరో వారిని భగవంతునికంటె నెక్కువెవరెఱుగుదురు?

54. (ఓ ప్రవక్తా!) మా సందేశమును విశ్వసించినవారు నీదగ్గరకు వచ్చినప్పుడు వారితో ఇట్లు చెప్పుము: “మీకు శాంతియగుగాక! మీ ప్రభువు కరుణానిధి. తెలియనప్పుడు మీరేదేని పాపముచేసి పశ్చాత్తప్తులై తర్వాత మీ ప్రవర్తనమును సంస్కరించుకొనినచో (భగవంతుడా పాపములను క్షమించును.) భగవంతుడు మహాక్షమి, కరుణానిధి.”

55. ఈవిధముగ మేము మా ఉపదేశములను వివరించి చెప్పుదుము. దీనివల్ల పాపిష్ఠులమార్గము స్పష్టమగును.

ఏడవ ఖండము

56. (ఓ ప్రవక్తా! సత్యమును నిరాకరించినవారితో) ఇట్లనుము: “మీ రెవరిని పూజించుచున్నారో, అట్టి ఈశ్వరేతరులను పూజించుట నాకు నిషిద్ధము.”

(మరియు) ఇట్లనుము: “తుచ్ఛమైన మీ కోర్కెలనుకూడ నేననుసరింపను. నేనట్లు చేసినచో నేను సన్మార్గమును తప్పిపోయి యుందును. సన్మార్గ ప్రవర్తకులనుండి విడివడి యుందును.”

57. (ఓ ప్రవక్తా!) ఇట్లు చెప్పుము: “నేను నిస్సంశయముగ నా ప్రభువుకడనుండి విస్పష్టమైన ఉపదేశమును తెచ్చితిని. కాని దానిని మీ రసత్యమనిరి. (అట్లైన వెంటనే భగవంతుడేల మమ్ము శిక్షింపలేదని మీరడుగుచున్నారు.) మీరు ఏ ఫలితమును చూచుటకు తొందరపడుచున్నారో అది నా శక్తిలోలేదు. భగవంతు నొక్కనిదే నిజమైనతీర్పు. అతడు సత్యమును ప్రవచించును. భగవంతుడు అత్యుత్తముడైన పరిష్కారకర్త.

58. (ఓ ప్రవక్తా! ఇట్లు) చెప్పుము: మీరు ఏ ఫలితమును చూచుటకు తొందరపడుచున్నారో దానిని నేను కల్గించగలిగి యుంటినేని ఈపాటికి మీకును నాకును మధ్య పరిష్కారము జరిగియుండెడిది. (కాని అది అంతయు భగవంతుని చేతిలో నున్నది. మీ దౌష్ట్యము పరిపక్వమునకు వచ్చునంతవరకు మీకు భగవంతుడు గడువొసగును.) దుష్టులను భగవంతుడు బాగుగ నెఱుగును.

59. అదృష్టములైన సమస్త రహస్యములను భగవంతుడెఱు

గును. అవి అతనికితప్ప మరెవ్వరికిని తెలియశక్యము కానివి. భూమియం దను, సముద్రమునందును కల సమస్తము నతడెఱుగును. అతనికి తెలియకుండ ఒక్క ఆకైనను రాలదు. భూగర్భములో అతనికి తెలియకుండ ఒక్క గింజైనను నాటబడదు. ఒక్క పండుగాని, ఒక్క కాయగాని అతనికి తెలియకుండ (క్రిందరాలదు.) అది అతని జ్ఞానకోశములో స్పష్టముగ లిఖింపబడి యున్నది.౫౯

60. చూడుడు! రాత్రులందు మీపై మృత్యువు నాచ్ఛాదింప జేసినవాడు (అనగా నిద్రపుచ్చినవాడు) అతడే. మీరు పగలు చేయు సమస్తము అతడెఱుగును. (రాత్రి మీరు నిద్రపోయినతర్వాత) పగలు మిమ్ములనతడు నిద్రనుండి లేపును. ఒక నిర్ణీతకాలము పూర్తియగువరకు (మీకు జీవితమునిచ్చును. ఆగడువు పూర్తియైనపిదప) మీరు భగవంతుని సమక్షమునకు మరలుదురు. మీరుచేసిన సమస్త కర్మలయొక్క మంచి చెడ్డలు అక్కడ మీకు చూపబడును.

ఎనిమిదవ ఖండము

61. అతడే తన సేవకులగు (సమస్త జీవరాసుల) పై సర్వశక్తిమంతుడై యున్నాడు మీకై అతడే రక్షకశక్తుల పంపుచున్నాడు. మీలో ఒకరికి అవసానము సమీపించినప్పుడు మా దూతలే మృత్యువును కలిగింతురు. వారు ఎట్టిపొరపాటు చేయరు.

62. తరువాత తమప్రభువు, సత్స్వరూపుడు ఐన భగవంతుని సమక్షమునకు వారు మరలింపబడుదురు. నిశ్చయముగ అతని ఆజ్ఞయే ఆజ్ఞ. అతనికంటె ఎక్కువ త్వరగ లెక్కతీసికొనువాడు మరొకడులేడు.

63. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "మీకు భూమిపైనను సముద్రములపైనను కలుగు ఆపదలనుండి రక్షించువారెవరు? మీరు వినయ వినమితులై బహిరంగముగను, రహస్యముగను భగవంతుని శరణమును కోరుచు (ఇట్లందురు): "దీనినుండి మమ్మతడు రక్షించినచో నిశ్చయముగ మేము కృతజ్ఞులమై యుందుము."

64. (ఓ ప్రవక్తా! నీవిట్లు) చెప్పుము: "మిమ్ముల దుఃఖములనుండియు, ప్రతి ఆపదనుండియు రక్షించువాడు భగవంతుడు. ఐనను మీరు భగవంతునకు సమానుల నెలకొల్పుదురు."

65. (ఓ ప్రవక్తా! ఇట్లు) చెప్పుము: "మీపై ఆకాశమునుండికాని, మీ పాదములక్రింది భూమినుండికాని విపత్తు తెచ్చిపెట్టుటకు అతనికి శక్తికలదు. లేదా, మీరు పక్షములుగచీలి పరస్పరము పోరాడుకొనునట్లు చేయును. ఒకపక్షము రెండవపక్షమువారి దౌర్జన్యపురుచి చూచునట్లు చేయును. చూడుడు: మేమెట్లు మా సందేశములను వారి కర్థమగుటకై మాటిమాటికి చెప్పుచుందుము.

66. (ఓ ప్రవక్తా!) నీజాతి దీని నబద్ధమనెను. వాస్తవమేమనగా (భగవత్ప్రోక్తమగు ఈ సందేశము) శుద్ధసత్యము. అందుచే వారితో నీవిట్లు చెప్పుము: (మీరబద్ధమని చెప్పదలచినచో చెప్పుడు, మీకు సత్యమని ఒప్పుకొనుడని బలవంతపెట్టుటకు) నేను మీ చేతలకు బాధ్యుడనై లేను.

67. అన్నిటికిని ఒకకాల మున్నది. అప్పుడు మీరు (ఏదిసత్యమో, ఏది అసత్యమో) తెలియగలరు.

68. (ఏ సభ, లేక ఏ సమావేశమందు) భగవదాదేశముల గూర్చి వ్యర్థమగుచర్చలు జరుగుచుండగా మీరు చూచెదరో అక్కడనుండి (అచటివారా చర్చనుమాని విషయాంతరమునుగూర్చి సంభాషించుకొనువరకు) వెళ్ళిపొండు. సైతాను మిమ్ములను ఒకసారి మరపించినయెడల జ్ఞాపకము వచ్చినతర్వాత దుష్టుల సాంగత్యమున కూర్చొనకుడు.

69. సన్మార్గ ప్రవర్తకులకు ఇట్టి దుష్టుల బాధ్యతలేదు. (వారినిగూర్చి సజ్జనులు దుఃఖింపబనిలేదు.) వారికి సత్యసంస్మృతిని కలిగించుటయే వారివిధి. దానివల్ల వారికి భగవంతునియెడ భయభక్తులు కలుగవచ్చునేమో!

70. తమ మతధర్మమును కేవలము ఆటగను, వినోదముగను భావించువారిజోలికి పోవలదు. వారి ప్రపంచపు జీవితమునుచూచి మోసపోయినవారు. వారికి సత్యమును ఘోషించిచెప్పుము. స్వకీయ దుష్కర్మలచేతనే ప్రతిజీవియు (వినాశమగుచున్నది.) భగవంతుడుతప్ప అట్టివారికి సంరక్షకుడుగాని, సహాయులుగాని లభింపరు. వారు తమ పాపకర్మములకు ఎట్టి బదులిచ్చినను అది స్వీకరింపబడదు. వీరు స్వకీయ పాపకర్మలచే భ్రష్టులైనవారు. త్రాగుటకు క్రాగుచున్న నీళ్ళుమాత్రము వారికి లభించును. వారికి లభించుశిక్ష అత్యంత ఘోరమైనది. ఎందుకన, వారు భగవంతుని నిరాకరించిరి.

తొమ్మిదవ ఖండము

71. (ఓ ప్రవక్తా! వారినిట్లు) అడుగుము: "భగవంతునివిడిచి మాకు లాభముగాని నష్టముగాని కలిగింపజాలని దైవేతరులను శరణు జొచ్చుమని మీరందురా? భగవంతుడు మాకు సన్మార్గమును చూపిన పిదప దుర్మార్గమువైపు వెనుకకు మరలుదుమా? సైతాను దారితప్పించగా తెన్ను తెలియక అల్లలాడువానివలె మేము విపథగాములము కావలెనా? అతనితో ప్రయాణము చేయుచున్న అతని సహవాసులు దారి తప్పినవానిని ఇటురమ్మని పిలుచుచున్నారు." (ఓ ప్రవక్తా: వారితో) ఇట్లు చెప్పుము: "భగవంతుని మార్గదర్శిత్వమే నిజమైన మార్గదర్శిత్వము. సమస్త లోకములకు ప్రభువగు భగవంతునకే వినయ వినమితులు కావలసినదని మాకు ఆజ్ఞాపింపబడినది.

72. "ప్రార్థనలు సల్పుడని, భగవంతునియెడ భయభక్తులతో ప్రవర్తింపుడనియు (ఆజ్ఞాపింపబడి యున్నది.) తుట్టతుదకు మీరు భగవంతుని సమక్షముననకే మరల్పబడుదురు."

73. భూమ్యాకాశములను సత్యముతో సృష్టించిన దతడే. నాడు అతడిట్లనును: "అగుగాక!" (ఈ ఆజ్ఞామాత్రమున సమస్త సృష్టియు) అయ్యెను.

74. అతని మహావాక్యము సత్యము. ప్రళయనాదము చేయునాడు అతడే సార్వభౌముడై యుండును. అతడు సమస్త దృశ్యాదృశ్యములను ఎరిగినవాడు; ప్రజ్ఞానిధి; సర్వసంవేది.

75. ఇబ్రాహీం తన తండ్రియగు ఆజర్‌తో ఇట్లు చెప్పెను: "నీ వీ విగ్రహములను ఈశ్వరులనుగా గ్రహింతువా? నిశ్చయముగ నీవు, నీ ప్రజలు స్పష్టమైన దోషములో మునిగియున్నారు."

76. మేము ఇబ్రాహీముకు భూమ్యాకాశములందలి మహత్పదార్థములను అతనికి నిశ్చయదార్ఢ్యము కుదురుటకై చూపితిమి. ౧౫౫

77. రేనీడలు ముసురుకొనిరాగా అతడొక ప్రకాశవంతమగు నక్షత్రమును చూచెను. అట్లుచూచి, "ఇది నా ప్రభువేయగునా?" (అని భ్రమించెను.) తర్వాత అది అస్తమించెను. దానినిచూచి అతడిట్లనెను: "అస్తమించువారిని నేను ప్రేమింపజాలను."

78. అప్పుడతడు ఉదయించుచున్న చంద్రుని చూచెను. దానిని చూచి: "ఇది నా ప్రభువే యగునా?" అనెను. చంద్రుడుకూడ అస్తమించెను. అతడప్పుడిట్లు ప్రార్థించెను: "నా ప్రభువు నాకు మార్గము చూపియుండడేని నేను ఈ జాతివలె దారి తప్పినవాడనై యుందును."

79. (తెల్లవారెను) అతడు ఉదయభానుని చూచెను. అతడు తిరిగి ఇట్లనెను: "ఇదేనా నా ప్రభువు? అన్నిటికంటె మహత్తరమైన దిదేనా?"

సూర్యుడుకూడ అస్తమించెను. (ఇవేవియు బ్రహ్మముకావని ఇబ్రాహీము నిశ్చయించుకొనెను. అప్పుడతడు తనజాతి నుద్దేశించి) ఇట్లనెను: "ఓ నా జాతీయులారా! (నాకిప్పుడు సత్యము గోచరించినది.) మీరు భగవంతునికి బదులు నిలిపి పూజించుచున్న వీనితో నేను సమస్త సంబంధములను వదలుకొనుచున్నాను.

80. భూమ్యాకాశములను సృజించిన భగవంతుని నేనాశ్రయించుచున్నాను. నేను సన్మార్గగామిని; బహుదైవతారాధకుడను కాను."

81. ఇబ్రాహీం జాతివారు అతనితో వాదించిరి. అతడు వారితో ఇట్లనెను: "భగవంతునిగూర్చి మీరు నాతో వివాదపడెదరా? నిశ్చయముగ భగవంతుడు నాకు మార్గదర్శిత్వ మొనర్చినాడు. మీరు భగవంతునితో ఆరాధ్య దైవతములుగ నిలిపిన వీటికినేను భయపడను. ఇది నా ప్రభువు అభీష్టము. నా ప్రభువు సర్వస్వము నెరిగినవాడు.

82. మరి మీరు జాగ్రతపడరేల? భగవంతునకు సమానులని దేవతలను నిలబెట్టుటకు మీరు భయపడనప్పుడు భగవంతునితో సమానులుగ మీరు నిల్పిన దైవేతరులకు నేనేల భయపడుదును? అట్లు నిలబెట్టుటకు మీకెట్టి అధికారము నతడు పంపలేదుకదా? ఈ రెండుపక్షములలో ఎవరు నిజముగ సురక్షితపక్షమునకు చెందినవారో మీరు తెలిసికొనలేరా?

83. ఎవరు విశ్వాసవంతులై, తమ విశ్వాసమును అధర్మముతో మేళవింపరో వారే సురక్షితులగుదు; వారే సన్మార్గ ప్రవర్తకులు.

పదవ ఖండము

84. ఇబ్రాహీము తనజాతితో వాదించుటకు మేమతనికి ప్రసాదించిన హేతువాదమిది. మా కిష్టులైనవారిని ఉన్నతమైనస్థితికి తెచ్చెదము. నిశ్చయముగ నీప్రభువు ధీనిధి; సర్వజ్ఞుడు.

85. మేము ఇబ్రాహీము సంతతిలో ఇస్హాక్‌ను, (అతని కుమారుడైన) యాకూబును ప్రభవింపజేసితిమి. వీరిలో ప్రతియొక్కనికి సన్మార్గము చూపితిమి. అంతకుముందు నోహాకు అట్లే సన్మార్గము చూపి యుంటిమి.

మరియు ఇబ్రాహీము వంశమునుండి దావూద్, సులైమాన్, అయ్యూబ్, యూసుఫ్, మూసా, హారూన్, (మున్నగువారికి) ఇదేమార్గమును చూపితిమి. ఈ విధముగ పరోపకార పారీణులను నేను బహూకరింతును.

86. జకరియా, యహ్యా, ఈసా, ఇల్యాస్, వీరందరు అత్యుత్తములు.

87. ఇస్మాయీల్, ఇల్యాస్, యూనుస్, లూత్ - వీరందరికి మేము ప్రపంచములో ఉన్నతస్థానమును ప్రసాదించితిమి. ౧౧౬

88. మరియు వారి పూర్వులలోను, వారి సంతతియందును, వారి సోదరులలోను, ఎంతోమందిని ఎన్నుకొని ఉత్తమమార్గమున నడిపించితిమి.

89. ఇది భగవంతుని మార్గదర్శిత్వము. తన సేవకులలో తనకిష్టులైనవారి కతడు దారిచూపును. వీరొకసారి ఏకేశ్వరమార్గమును విడిచి బహుదైవతారాధనమునకు పూనుకొని యుందురేని (వారికెన్నడును సన్మార్గము లభించి యుండెడిదికాదు.) వారుచేసిన మంచియంతయు వమ్మైయుండెడిది.

90. (ఓ ప్రవక్తా!) వీరికే నేను జ్ఞానగ్రంథమును, అధికారమును, ప్రవక్తృత్వమును ప్రసాదించితిని. (ఇప్పుడీప్రజలు) ఈ (భగవత్) ప్రసాదమును నిరాకరించినయెడల (నిరాకరింతురుగాక!) మేము ఈసందేశమును (భద్రపరచి) విశ్వసించి అనుసరించు ఒకజాతికి అప్పుడే ఒప్పజెప్పితిమి.

91. (ఓ ప్రవక్తా!) వారు భగవంతునిచే సన్మార్గమున నడిపింపబడినవారు. నీవుకూడ వారిమార్గమునే అనుసరింపుము. నీవిట్లనుము: "నేను చేయుచున్న ఈ బోధకు) నేనెట్టి బహుమానమును మిమ్మడుగుటలేదు. ఇది సర్వప్రపంచమునకు ఉద్బోధకము మాత్రము."

పదునొకండవ ఖండము

92. "భగవంతుడు ఏ మానవునకును తనసందేశము పంపలేదు" అని వారు చెప్పినప్పుడు భగవంతుని మహత్తును వారు పూర్తిగ గ్రహించలేదన్నమాట.

(ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "మానవులకు (ధర్మ) ప్రకాశముగను, మార్గదర్శకముగను మూసా తెచ్చిన పుస్తకము ఎవరిచే ప్రోక్తమాయెను? మీరిప్పుడు దానిని పుస్తకములుగ కుట్టి ప్రజలకు

చూపుచు అందలి ధర్మోపదేశమందలి ఎక్కువభాగమును దాచి ఉంచు చున్నారు. ఆ గ్రంథముద్వారా మీకుగాని మీ తాత తండ్రులకుగాని తెలియని అనేక విషయములను మీకు భగవంతుడు నేర్పెను."

(ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) అనుము: "భగవంతుడు ఈ ఖురాను గ్రంథమును మూసా ప్రవక్తకు పంపినట్లే పంపినాడు."

వ్యర్థమగు తుచ్ఛవాగ్వాదములందు నిమగ్నులైనవారిని వారి త్రోవను వారిని పోనిమ్ము.

93. ఈ గ్రంథము మాచే ప్రోక్తమైనది. ఇది మీకు శుభము లను చేకూర్చునది. ఇంతకుముందు ప్రోక్తమైన గ్రంథముల నిర్ధారిం చునది. నగరవాసులను ♦ మీ నగరము చుట్టుప్రక్కలవారిని నీవు హెచ్చరించుదువుగాక! ఎవరు పరలోకమును విశ్వసింతురో వారు దీనిని కూడ విశ్వసింతురు. వారు వేళతప్పక ప్రార్థనము సల్పుదురు.

94. భగవంతునకు అబద్ధమాపాదించికాని, లేక తనకేదియు ప్రోక్తము కాకపోయినను ఇది నాకు ప్రోక్తమైనదనియు లేక భగవ త్ప్రోక్తమైన ఈ ప్రవచనములను నేనుకూడ చెప్పగలననియు చెప్పి మోసము చేయువానికంటె ఎక్కువ అన్యాయపరు డెవడుండును? అధ ర్మపరులగు వీరు మృత్యుదంష్ట్రలలో చిక్కుకొని నప్పుడును, మృత్యు దూతలు (వారి ప్రాణాపహరణమునకై తమ హస్తములతో వారి నాచ్ఛా దించినప్పుడును) నీవు వారిని చూచియుండినచో (ఓ ప్రవక్తా!) నీకాశ్చ ర్యము కలుగును. (మృత్యుదూతలు వారితో ఇట్లందురు): "మీ ప్రాణ ముల నిచ్చివేయుడు. నేడు భగవంతునిపై అబద్ధములు చెప్పినందులకును, భగవంతుని సందేశము వచ్చినప్పుడు గర్విష్ఠులై కన్నుకానక యుండినం దులకును మీకు ఘోరశిక్ష లభించును."

♦ 'ఉమ్ముల్ ఖురా' అను ఇక్కడి మూలనముకు 'పురముల తల్లి' అని అర్థము. ఇది మక్కా పట్టణమునకు నామము. 36 కోట్ల ముస్లిమ్ మతస్థులకిది ఇప్పుడు ఆధ్యా త్మిక కేంద్రము. దీని భావి గొప్పతనమును ఖుర్ ఆన్ గ్రంథమిట్లు సూచించినది.

95. (మరి భగవంతుడిట్లనును): "చూడుడు. మిమ్ములను ఒంట రిగ పుట్టించినట్లే మీరిప్పుడు ఏకాకులై వచ్చిరి. మేము మీకిచ్చిన సమస్త (ధనధాన్య) ములను మీ వెనుక విడిచిపెట్టి వచ్చితిరి. మీరు భగ వంతునికి సమాంశులుగా మీ రక్షణార్థమై కల్పించుకొనిన దైవతములు మీతో కన్పించుటలేదే! నిశ్చయముగ వారికిని మీకును మధ్య ఉండిన బంధములు తెగిపోయినవి. మీరు వారినిగూర్చి చెప్పినదంతయు ఇప్పు డుపోయెను.

పందొమ్మిదవ ఖండము

96. నిశ్చయముగ భగవంతుడే గింజను, టెంకను అంకురింపజే యును. జడమునుండి జీవమును అతడే ఉద్భవింపజేయును. జీవులకు మృత్యువుకూడ అతడే కల్పించును. (జీవన్మరణముల కలిగించువాడే) భగవంతుడు. (మీ రింత మాత్రము గ్రహింపజాలరా?) మీరు మరి ఈ సత్యమునుండి ఏల దూరముగ తొలగిపోవుచున్నారు?

97. అతడే ప్రభాతమును కావించును. విశ్రాంతికై అతడే రాత్రిని కలిగించును. సూర్యచంద్రులను కాలగణనమునకై ఏర్పరచెను. సర్వశక్తిమంతుడును, సర్వజ్ఞుడును అను భగవంతుని ఏర్పాట్లివి.

98. భూమిపైనను, సముద్రమునందును చీకటిలోను నీకు సరి యైనదారి తెలియుటకై నక్షత్రములు కలవు. నిశ్చయముగ వివేకవంతు లగువారికి ఈ సందేశమును స్పష్టపరచితిని.

99. మిమ్ముల నొకే ఆత్మనుండి పుట్టించి విశ్రాంతిస్థానమును, విరామస్థానమును మీకై ఏర్పరచినది భగవంతుడే. వివేకవంతు లగు వారికి ఈ సందేశమును స్పష్టపరచి చెప్పితిమి.

100. మేఘములనుండి వర్షమును కురిపించునది భగవంతుడే. దానితో సమస్త వృక్షసంతతి అంకురింపజేతుము. (ధరిత్రిని) సస్యశ్యా మల మొనర్తుము. ఫలధాన్యములను పండింప జేయుదుము. ఖర్జూరపు

చెట్టుకు చేతికందునట్లు ఖర్జూరపు గెలల పండింతుము. అదేవిధముగ ద్రాక్ష, జితవృక్ష, దాడిమీ ఫలోద్యానములను ప్రభవింపజేసెదము. ఇవి ఆకారమున ఒకేవిధముగను వివిధముగను కూడ ఉన్నవి. పంటకు వచ్చినప్పుడు వాని ఫలములను చూడుడు. అవి పక్వమగుటను గమనింపుడు. నిశ్చయముగ విశ్వాసవంతులగువారికి ఇందులో (భగవన్మహిమ యొక్క) చిహ్నములు కలవు.

101. భూతములను భగవంతునితో కలిపి వారారాధింతురు. సమస్త భూతములను భగవంతుడేకదా పుట్టించినది? (ఈశ్వరుడు పుట్టించినవాటిని ఈశ్వరులుగా పూజించుట ఎంతటి అజ్ఞానము!) భగవంతునకు అజ్ఞానముచే కుమారులను, కూతుండ్రను ఆపాదింతురు. భగవంతునకు సర్వస్తుతులగుగాక! వీరాపాదించు దానికంటె భగవంతుడు అత్యంత మహా మహిమోపేతుడు.

పదమూడవ ఖండము

102. సమస్త భూమ్యాకాశముల సృష్టికర్త: అతనికి భార్యలేదు కదా, కుమారుడెట్లుకలుగును? అంతేకాక ప్రతివస్తువును సృష్టించువాడు భగవంతుడేకదా? సమస్తవస్తువుల నెఱిగినవాడతడేకదా;

103. అట్టి భగవంతుడు మీ ప్రభువు. అతడుతప్ప వేరొకదేవుడు లేడు. అతడు సమస్తవస్తు సృష్టికర్త. అందుచే అతనిని సేవింపుడు. సమస్తము అతని అధీనములో నున్నది.

104. దృష్టి అతనిని చూడలేదు. కాని అతనిదృష్టి సమస్తము నావరించియున్నది. అతడు సమస్త రహస్యముల నెఱుగును. అతడు సర్వసంవేది.

105. నిశ్చయముగ నీ ప్రభువుకడనుండి స్పష్టమైన నిదర్శనములు వచ్చినవి. ఎవడు ఈ సత్యమును గ్రహించునో దానివల్ల అతనికే శ్రేయస్సగును. ఎవరు అంధులై (సత్యమును నిరాకరింతురో) అది వారికే నష్ట

దాయకమగును. (ఓ ప్రవక్తా! వారితో స్పష్టముగ ఇట్లు చెప్పివేయుము): "నేను మీపై సంరక్షకుడుగ నియమింపబడలేదు."

106. ఈవిధముగ మా సందేశములను చర్విత చర్వణముగ చెప్పుచుందుము: (అప్పుడైనను మీరు జ్ఞానవంతు లగుదురేమో అని.) "మీరు (సత్యమును బోధించుటలో ఎంతమాత్రమును ఉపేక్ష వహించలేదు.) సమస్తమును చదివి వినిపించిరి." (అని మీరు చెప్పువరకు సత్యము మాటిమాటికి అనేకవిధముల బోధింపబడినది.) వివేకవంతులకు స్పష్టముగ చెప్పుట మా ఉద్దేశము.

107. ఓ ప్రవక్తా! నీ ప్రభువు నీకు ప్రవచించినదానిని అనుసరింపుము: అతడుతప్ప వేరు భగవంతుడులేడు. బహుదైవతారాధకులను వారిత్రోవను వారిని వదులుము.

108. భగవంతుడిచ్ఛించి యుండినచో వారు బహుదైవతారాధకులు కాకుండియుందురు. (ఓ ప్రవక్తా!) వారిపై నిన్ను రక్షకునిగా మేము నియమింపలేదు. వారి వ్యవహర్తగాకూడ నిన్ను నియమింపలేదు.

109. భగవంతునివిడిచి ఇతరులను ఆరాధించువారిని తిట్టవలదు. ఎందుకన వారు అజ్ఞానముచే తమ హద్దులనుమీరి భగవంతుని తిట్టవచ్చును. ఎవరిచేతలు వారికి ఉచితముగ కన్పించునట్లు మేము చేసితిమి. కాని వారు భగవంతుని సమక్షమునకు మరలునప్పుడు వారుచేసిన దానినంతటిని భగవంతుడు వారికి తెలియజేయును.

110. వారి (ఈ సత్యమును నిరూపించుటకై) వారికేదైన ఒక (అపురూప) చిహ్నము కనిపించినయెడల తాము తప్పక విశ్వసింతుమని వారు ఎంతో గట్టిగ ప్రమాణము చేయుదురు. (ఓ ప్రవక్తా! వారితోఇట్లు) చెప్పుము: "మహాత్మ్యములు భగవంతుని వశములు." (ఓ ప్రవక్తా!) నీకు వీరిసంగతి ఏమి తెలియును? ఒకసారి మహాత్మ్యము చూపినను వారు విశ్వసింపరు.

111. మేము వీరి హృదయములను, వీరి దృష్టులను త్రిప్పి వేయుదుము. (వారిజ్ఞానము, వారికండ్లు, పనిచెయ్యవు.) మొదటిసారి వారెట్లు నమ్మకుండిరో ఇప్పుడుకూడ వారట్లే విశ్వసింపరు. వారిని వారి దౌర్మార్గ్యములో అంధులై, దారి తెన్ను తెలియక తిరుగునట్లు విడిచిపెట్టివైచెదను.

ఎనిమిదవ భాగము

పదునాలుగవ ఖండము

112. వారికడకు మేము దేవదూతలను పంపినను, మృతులు వారితో మాట్లాడినను, సమస్తము వారిముందు తెచ్చి నిలువబెట్టినను భగవంతు డిచ్ఛించనంతకాలము వారు నమ్మరు. వారిలో పలువురు అజ్ఞానులు.

113. (ఓ ప్రవక్తా!) ఇదేవిధముగ మేము ప్రతి ప్రవక్తకు (సామాన్య) మానవులనుండియు, వారి నాయకులనుండియు కొంతమంది దుష్టులను శత్రువుల నొనర్తుము. వీరు లోకమును మోసపుచ్చుటకై ఆకర్షవంతముగ కల్పించు అసత్యములనన్ని ఒకరికొకరు చెప్పికొందురు. భగవంతుడు తలచినచో వారిట్లు చేయజాలకుందురు. అందుచే వారిని, వారు సృష్టించిన అసత్యములను విడిచిపెట్టుడు.

114. (ఈ దుష్టులు ఇట్టి అబద్ధములను ఏల కల్పింతురనగా) పరలోకమును విశ్వసింపనివారి హృదయములు తమవైపునకు మొగ్గి, తమ మాటలకు సంతసించి తమవలెనే దుష్కృత్యము లాచరింతురని.

115. (ఓ ప్రవక్తా! వారి నిట్లడుగుము): భగవంతుని విడిచి (మీకును నాకును మధ్య తీర్పుచెప్పుటకై) వేరొకనిని నేను కోరెదనను కొందురా? అతడేకదా నీకు జ్ఞానగ్రంథమును ప్రసాదించి (సమస్త ధర్మములు) స్పష్టపరచెను. మేమెవరికి జ్ఞానగ్రంథమును ప్రసాదించితిమో

వారు ఇది సత్యముతో భగవంతునిచే ప్రోక్తమైనదని ఎఱుగుదురు. అందుచే మీరు (దీని సత్యమునుగూర్చి) వాదింపకుడు.

116. మీ ప్రభువుమాట సత్యముగను, న్యాయముగను పూర్తియైనది. భగవత్ప్రవచనములను ఎవ్వరును మార్చలేరు. భగవంతుడు సర్వము వినువాడు. సర్వము తెలిసినవాడు.

117. (ఓ ప్రవక్తా!) ప్రపంచములో అధికసంఖ్యాకులు చెప్పుదానిని వినినయెడల మీరు ధర్మమార్గమును తప్పిపోదురు. (ఒక అసత్యమును అధికసంఖ్యాకులు నమ్ముచున్నంత మాత్రమున అది స్వీకారయోగ్యము కాజాలదు.) వీరు (స్పష్టమైన సత్యమును విడిచి) అనుమానములకాస్పదమైనవాని నే అనుసరించుచున్నారు. (ఆ అనుమానములపై భావనాసౌధములను నిర్మించుకొనుచున్నారు.) వారు అసత్యవాదులు.

118. నిశ్చయముగ నీప్రభువు ఎవరు సత్యమార్గమును తప్పి చరించుచున్నారో, ఎవరు సరియైనమార్గము ననుసరించుచున్నారో బాగుగ ఎఱుగును.

119. మీరు భగవత్సందేశములను విశ్వసించువారలైనచో ఏ వస్తువులపై భగవన్నామ ముచ్చరింపబడునో వానినే తినుడు.

120. భగవన్నామము ఏ వస్తువులపై ఉచ్చరింపబడెనో వానిని మీరేల భుజింపకున్నారు? మీ కేయేవస్తువులు నిషేధములో అప్పుడే మీకతడు స్పష్టపరచెనుకదా? (ఆపత్సమయములలో) గత్యంతరములేక (ఏవేని నిషిద్ధవస్తువులు) తినిన అది వేరుమాట. తుచ్ఛమైన తమకోరికల ననుసరించి, అజ్ఞానముచే వారు పల్వురు ప్రజలను తప్పుత్రోవ పట్టింతురు. నిశ్చయముగ నీ ప్రభువు హద్దుల నతిక్రమించినవారిని బాగుగ నెఱుగును.

121. బహిరంగముగను, రహస్యముగను కూడ మీరు చేయు పాపములను పూర్తిగ విడిచిపెట్టుడు. ఎవరు పాపము లాచరింతురో (వారెంత రహస్యముగ పాపము లాచరించినను) వారి చేయుదానికి తప్పక ఫలము పొందుదురు.

122. భగవంతుని నామ ముచ్చరింపబడని ఏ వస్తువునైనను తిన వలదు. అట్లుచేయుట ఆజ్ఞోల్లంఘనము. మీతో వాద ప్రతివాదములు చేయుటకు దుష్టులు తమ మిత్రులను ప్రోత్సహింతురు. మీరొకసారి వారిమాట వినిరా మీరుకూడ తప్పక బహుదైవతారాధకులలో చేరి పోవుదురు.

పదునేనవ ఖండము

123. ఒకడు మృతుడై యుండెను. అతనికి జీవప్రదానము చేసి, అతనికై ప్రకాశమును కలిగించగా, ఆ కాంతిలో అతడు అందరిలో స్వేచ్ఛగ సంచరించుచున్నాడు. మరొకడు చిమ్మచీకటిలో దారితెన్ను తెలియక బయటికిరాలేక అల్లాడుచున్నాడు. వీరిద్దరిస్థితి ఒకటేయగునా? (ఐనను చీకటికలవడి దానితోనే తృప్తిపడువారును కలరు.) ఈ విధముగ బహుదైవతారాధకుల దృష్టిలో వారి అసత్యములే వారికి ఆకర్షవంతముగ కన్పించుచున్నవి. (వారు చేయుపనులు నిజముగ ఎంత చెడ్డవైనను) వారు చేయుచునే యుండిరి.

124. ఇదేవిధముగ ప్రతి పట్టణమునందును కొందరు దుష్టనాయకులను మేము సృష్టించితిమి. వారందు పన్నాగములు పన్నుచుందురు. వారు నిజముగ తమ ఆత్మవినాశమునకు మాత్రమే కుట్రలు పన్నుచుందురు. కాని (పాపము!) వారికది తెలియదు.

125. వారికేదైన సందేశము వచ్చినప్పుడు వారిట్లందురు: "భగవత్ప్రవక్తలకు ఇవ్వబడినదానికి సమానమైనది మాకు ప్రోక్తమైనంత వరకు మేము విశ్వసింపము. ఎవరికి తన సందేశమును పంపవలెనో భగవంతుడెఱుగును. ఎవరుదుష్టులో భగవంతుడు వారిని నీచస్థితికి తెచ్చును. కఠినముగ శిక్షించును. ఎందుకన వారు భగవంతునకు వ్యతిరేకముగ కుట్రలు పన్నిరి.

126. ఎవరిని భగవంతుడు సన్మార్గమున నడిపింపబూనునో, సత్య స్వీకారమునకై అతని హృదయమును ఇస్లామ్ విశాలపరచును. ఎవ

రిని దుష్టమార్గమున విడువగోరునో అతని హృదయమును కుంచించును. ఆయాసముతో ఒకకొండ నెక్కుచున్న వానివలె అతని హృదయము కుంచితమగును. ఈ విధముగ విశ్వాసహీనులను భగవంతుడు అపరిశుద్ధుల నొనర్చును.

127. ఇది నీ భగవంతుడేర్పరచిన దారి; సత్పథము. వివేకవంతులగువారికి మా సందేశములను నిశ్చయముగ విస్పష్టపరచుదుము.

128. వారి ప్రభువుకడ వారికి శాంతిసదనము లభించును. వారు సన్మార్గప్రవర్తకులగుటచే భగవంతుడు వారిని తన పోషణక్రిందికి తీసికొనినాడు.

129. తన సమక్షమున సర్వులను సమావేశపరచు ఆనాడు భగవంతుడిట్లు సెలవిచ్చును: "ఓ దుష్టభూతములారా! మీరు మానవులలో ఎక్కువమందిని (మీ దుష్ప్రభావముచే) మీ వైపుకు లాగికొనిరి (కదా?") మానవులలో వీరి మిత్రులును, సహాయులును ఐనవారు భగవంతునకిట్లు విన్నవించుకొందురు: "ప్రభూ! (ప్రపంచములో) మేము ఒకరివల్ల ఒకరు లాభము పొందితిమి. ఇప్పుడు మీరు మాకై నిర్ణయించిన జీవితకాలము పూర్తియైనది. (ఇప్పుడు మేము నీ సమక్షమునకు వచ్చితిమి.)" దానికి భగవంతుడిట్లనును: "నరకాగ్ని మీ నివాసము. మీరందుందురు. మేము మోక్షమీ దలచినవారుతప్ప (తక్కినవారి కిదే నివాసము.) మీప్రభువు ప్రజ్ఞానిధి; సర్వజ్ఞుడు.

130. ఈవిధముగ మేము కొందరు దుష్టులను వారి పాపములకు ఫలితముగ ఇతర దుష్టులతో సహవాసము కలుగజేయుదుము.

పదియారవ ఖండము

131. "ఓ భూతములారా! మానవులారా! నా సందేశమును తెల్పుచు మీనుండియే నా ప్రవక్తలు మీకడకు రాలేదా? మీరందరు సమావేశమగు ఈ దినమునుగూర్చి మిమ్ము హెచ్చరింపలేదా?" దానికి వారిట్లందురు: "ప్రభూ! మేము సాక్ష్యమిచ్చుచున్నాము. (నిస్సందేహ

ముగ వారు మాకడకు వచ్చిరి. మాకు ధర్మము నుపదేశించిరి. కాని మేము వారిమాట విననైతిమి.)"

వాస్తవ మేమనగా వారినీ ప్రపంచపు జీవితము మోసగించెను. ఇప్పుడు వారు తమకు వ్యతిరేకముగ తా మవిశ్వాసులమై యుంటిమని తామే సాక్ష్య మిచ్చుకొనుచున్నారు.

132. ఓ ప్రవక్తా! నీప్రభువు అక్కడిప్రజలను సత్యము తెలియని వారిగా ఉంచి, అన్యాయముగ వారి పట్టణములను విధ్వంస మొనర్పడు. (అందుచేతనే ప్రవక్తలనుపంపి ధర్మబోధ చేయించును.)

133. ప్రతియొక్కరికి వారివారి ప్రవర్తననుబట్టి అంతరములు ఏర్పరుపబడినవి. వారుచేయు ఏపనినైనను దేవు డుపేక్షింపడు.

134. నీప్రభువు సర్వ సంపూర్ణుడు; దయానిధి. అతడు తలచినచో మరొకజాతినుండి మిమ్మ్ము పుట్టించినట్లే మిమ్ములను తొలగించి మీస్థానములో మరొకజాతిని తెచ్చి పెట్టగలడు.

135. మీకు వాగ్దానము చేయబడినది తప్పక సంభవించును. మీరు దానినుండి తప్పించుకొనలేరు.

136. (ఓ ప్రవక్తా!) వారితో ఇట్లు చెప్పుము; "ఓ నా జాతీయులారా! మీ రోపినంతచేయుడు. నా యోపినంత నేను చేయుచున్నాను. ఎవరు మంచి గమ్యమునకై పాటుపడుచున్నారో త్వరలో మీకు తెలియును. నిశ్చయముగ అన్యాయపరులు సఫలులు కాజాలరు.

137. భగవంతుడు మీ పొలములయందును, మీ పశువులయందును కలిగించిన పాడిపంటలనుండి (మూఢవిశ్వాసములుగల) ఈ ప్రజలు ఒకభాగము దేవునికొఱకు వేరుచేయుదురు. తరువాత వారిట్లందురు: "ఈ భాగము అల్లాకొఱకు, ఈభాగము మా దేవతలకొఱకు." వారు నిల్పుకొనిన దేవతలకొఱకు వేరుచేసిన భాగము దేవునకు చెందదు. దేవునికై వేరుపరచిన భాగము (వీరు సృజించుకొనిన) దేవతలకై ఖర్చు పెట్టుదురు. వీరుచేయు తీర్మానము ఎంత దుష్టమైనది!

138. బహుదైవతారాధకులకు వారి మతగురువులు ♦ ఇదేవిధముగా (స్త్రీ) శిశువులను చంపుటకూడ మంచిదిగ కన్పించునట్లు చేసినారు. (బహుదైవతారాధకుల మతగురువులగు వీరు మూఢులగు) వీరిని వినాశమార్గమును పట్టింతురు. వారి మతమును అస్తవ్యస్త మొనర్తురు. (ఓ ప్రవక్తా!) భగవంతుడు తలచినచో వీరిట్లు చేసియుండెడివారుకారు. అందుచే వారిని, వారి ఈ కల్పనలను వారికే విడిచిపెట్టుము. (వారు సత్యమును స్వీకరించుటలేదని ఖిన్నమనస్కుడవు కాకుము.)

139. (మూఢాచారపరాయణులగు వీరు తాము కల్పించుకొన్న దేవతాదులకు పశువులను పొలములను అంకిత మిచ్చి) ఇట్లందురు: "ఈ పొలము, ఈ పశువులు నిషేధములు. మేము ఒక పద్ధతిని కుదువబెట్టినవారు తప్ప తక్కినవారి కిది తినరాదు. (ఏ దేవతల కవి అంకిత మివ్వబడినవో ఆ దేవతల పూజారులే తిన నర్హులు.)"

(ఇదేవిధముగ అంకిత మివ్వబడిన) జంతువులచే బరువు మోయించుట నిషేధ మందురు. కొన్ని పశువులపై భగవన్నామ ముచ్చరింపరు. భగవంతునకు అసత్యముల నారోపింతురు. వీరి అసత్యకల్పనలకు భగవంతుడు శిక్షించును.

140. (మరికొందరు మూఢాచారపరాయణులు) ఇట్లందురు: "ఈ జంతువుల కడుపులలో నున్న సజీవ పిండములు మా పురుషులకొరకే భోజనార్హములు. మా స్త్రీలకు నిషేధములు. అది చచ్చిపోయినచో (స్త్రీలు, పురుషులు) అందరు కలసి తిందుము. (ఇవన్నియు ఎంతటి మూఢ నమ్మకములు!) భగవంతున కీయబద్ధము లన్నియు నాపాదించినందుకు వారి నతడు శిక్షించును. నిశ్చయముగ అతడు ప్రజ్ఞానిధి; సర్వజ్ఞుడు.

141. ఎవరు మూర్ఖులై అజ్ఞానముచే తమ కన్నబిడ్డలను చంపుకొందురో వారు పతితులు. భగవంతుడు వారి కిచ్చినదానిని నిషేధించు

♦ "షురకాఉహుమ్" అను ఇక్కడి మూలమునకు వారు పూజించు దేవతలు, వారి పురోహితులు, వారి మతగురువులు అని అర్థము.

కొని, వారు భగవంతునికొక అసత్యము నాపాదించినారు. నిస్సందేహముగ వీరు దారి తప్పినవారు. సన్మార్గము ననుసరించువారు కారు.

పదునేడవ ఖండము

142. భగవంతుడే (వివిధ ఫలవృక్షములతో కూడిన) ఉద్యానవనములను సృష్టించెను. ఇందులో లతలు, వృక్షములు కలవు. ఖర్జూరపుచెట్లు, వివిధ ఫలసంభరితమైన ఇతరవృక్షములు, జైతూన్, దానిమ్మచెట్లు, ఒకేవిధమైన పోలికలుకలవి, వివిధాకారములుకలవి- ఈ వృక్షసంతతి అంతయు ఫలవంతమైనప్పుడు ఆ ఫలములను తినుడు. మీ చేలు కోసినప్పుడు దానముకూడ చేయుడు. వ్యర్థవ్యయము చేయకుడు. వ్యర్థవ్యయము చేయువారిని దేవుడు ప్రేమింపడు.

143. పశువులలో భారవాహకము లగువానిని కొన్నిటిని, కేవలము ఆహారమునకుమాత్రము పనికివచ్చువానిని కొన్నిటిని పుట్టించెను. మీ ఆహారమునకై భగవంతుడు పుట్టించినవానిని (నిస్సంశయముగ) తినుడు. సైతాను అడుగుజాడల వెంబడింపకుడు. వాడు నిస్సందేహముగ మీకు బహిరంగ శత్రువు.

144. "(భక్ష్యములగు) జంతువులలో అష్టవిధములు కలవు, రెండువిధముల గొఱ్ఱెలు, రెండువిధముల మేకలు" (అని వారందురు.) (ఓ ప్రవక్తా!) వారి నిట్లడుగుము : "భగవంతుడు ఇందులో ఏ జంతువును నిషేధ మొనర్చెను ? రెండువిధముల పోతులనా ? లేక రెండువిధముల ఆడజంతువులనా ? లేక ఆడజంతువుల గర్భకోశములో నున్న వాటినా! మీరు సత్యవంతులేమైనచో తెలిసికొని దీని జవాబు నా కిండు."

145. "ఇదేవిధముగ ఒంటెలలో రెండువిధములు, గోవులలో రెండువిధములు కలవు." (అని వారందురు) (ఓ ప్రవక్తా!) వారి నిట్లడుగుము : "ఇందులో మీరు ఆడపశువునా మగపశువునా నిషేధ మొనర్చినది ? లేక ఆడపశువుల గర్భస్థపిండములనా ? (మీకు ఏమియు తెలియకుం

డగనే మీ మూఢాచారము ననుసరించి ఇది భక్ష్యములని ఇది నిషేధ మని నిర్ణయింతురు.) భగవంతుడు వీనినిగూర్చి ఆజ్ఞాపించినపుడు మీరు దగ్గరుండిరా ? ప్రజలను తప్పుదారి పట్టించుటకై భగవంతునిపై అసత్యమారోపించి తనకు తెలియని విషయములను (భగవదాజ్ఞ లని) ప్రకటించువానికంటె దుష్టుడెవడు ? దుష్టులకు భగవంతుడు మోక్షమార్గము తెరువడు."౧౪౫

పదునెనిమిదవ ఖండము

146. (ఓ ప్రవక్తా!) నీవిట్లు చెప్పుము: "తనంత తాను చచ్చిపోయినదియు, రక్తము, సూకర మాంసము తప్ప తక్కిన వేవియు తినదలచినవారికి నిషేధమైనట్లు నాకు ప్రోక్తమైనదానిలో లేదు. (సూకర మాంసము) నిశ్చయముగ అపరిశుభ్రమైనది. (ఇదికాక పాపమూలకమైనట్టియు, భగవన్నామ ముచ్చరింపబడనట్టియు) మాంసాదులుకూడ నిషేధము. కాని ఎవరు ఆపదలో చిక్కుకొని అది తినినతప్ప గత్యంతరము లేనప్పుడు వాటినిచ్ఛించక, (అత్యవసరమైన) హద్దును దాటక (తిన్నచో అది ఆపద్ధర్మముగ పరిగణింపబడును.) నిశ్చయముగ నీప్రభువు మహాక్షమి; కరుణానిధి.

147. యూదులకు మేము గోళ్లుకల జంతువులను నిషేధమొనర్చితిమి. గోవులందును మేకలందును వాటికొవ్వును నిషేధించితిమి. వీపులపైనను, ప్రేగులయందును, ఎముకలతో కూడియున్నట్టియు క్రొవ్వునుమాత్రము నిషేధింపలేదు. వారు ఆజ్ఞోల్లంఘనము చేసినందుకు వారికి శిక్ష నొసగితిమి. నిశ్చయముగ మేము సత్యసంధులము.౧౪౭

148. (ఓ ప్రవక్తా!) వీరు నిన్ను నమ్మనిచో వారితో ఇట్లనుము: "మీ దేవుడు మహా కరుణాళువు. ఐనను పాపిష్ఠులు అతనిశిక్షను తప్పించుకొనలేరు."

149. ఎవరు బహు దైవతారాధకులో వారిట్లందురు: "భగ

వంతు డిచ్చించి యుండినచో మేముకాని మా పూర్వులుకాని బహు దైవతారాధకులము కాకుండెడివారము. అదేవిధముగ మాకై నిషేధించుకొని యుండకపోదుము. (ఓ ప్రవక్తా: వారితోనిట్లు) చెప్పుము: "దీనిని గూర్చి మీకేమైన నిశ్చయజ్ఞాన మున్నదా? ఐనచో దానినిటు తెండు. (నిజ మేమనగా) మీరు ఊహలను మాత్రము అనుసరించుచున్నారు. అసత్యములు పలుకుచున్నారు."

150. (ఓ ప్రవక్తా!) వారితో ఇట్లనుము: "భగవంతునిదే నిష్కర్షమైన సిద్ధాంతము. ఇతడు తలచినచో మిమ్ములనందరను నిశ్చయముగ సన్మార్గమున నడిపించువాడు.

151. (ఓ ప్రవక్తా!) వారితో ఇట్లుచెప్పుము: "భగవంతుడు ఈ వస్తువులను నిషేధించెనని సాక్ష్యమిచ్చువారిని తీసికొనిరండు. ఒకసారి వారి (అబద్ధసాక్షులు) ఈ విషయమున సాక్ష్యమిచ్చినను మీరు వారితో సాక్ష్యమివ్వకుడు: మా సందేశమును నిరాకరించి, పరలోకమందు నమ్మక భగవంతునకు సమానులను కల్పించు వీరి తుచ్ఛమగు వాంఛల ననుసరింపకుడు.

పందొమ్మిదవ ఖండము

152. (ఓ ప్రవక్తా!) వారితో ఇట్లనుము: "రండు! భగవంతుడు వేనిని నిషేధించెనో మీకు (భగవత్ప్రోక్తమగు ఈ గ్రంథమునుండి) చదివి వినిపింతును. భగవంతునకు సహవాసులను కల్పింపకుడు. తల్లిదండ్రులయెడ దయాభక్తులతో ప్రవర్తింపుడు. దారిద్ర్యభీతిచే మీసంతానమును చంపకుడు. మీకొఱకును, వారికొఱకునుకూడ మేము ఆహారము నేర్పాటుచేసితిమి. సిగ్గుమాలిన చేష్టలనుండి దూరముగ నుండుడు; బహిరంగముగనైనను, రహస్యముగ నైననుసరే. న్యాయపరిపాలను నందుతప్ప భగవంతుడు నిషేధించిన ఏప్రాణినైనను చంపకుడు. భగవంతుడీధర్మములను మీపై విధించినాడు. వివేకముతో విని ననుసరింపుడు.

153. తల్లిదండ్రులులేని పిల్లల ఆస్తిని వారు యుక్తవయస్సుకు వచ్చువరకు వారి మంచికై తప్ప మరొకవిధముగ ముట్టుకొనకుడు. కొలతయందును, తూనికయందును పూర్తిగ న్యాయముతో ఈయుడు. ఏ వ్యక్తికిని ఆచరించుటకు సాధ్యము కాని ధర్మము నుపదేశింపము. మీరు మాట్లాడినప్పుడు న్యాయముగ మాట్లాడుడు; అది మీ ఆత్మబంధువునకు వ్యతిరేకముగ నైననుసరే. ఈవిధముగ మీరు భగవంతునితో చేసిన ఒడంబడికను పూర్తిచేయుడు. మీరు శ్రద్ధతో అనుసరింతురు గాకయని భగవంతుడు మీకై ఈ విధులను ఏర్పరచినాడు.

154. ఇది నామార్గమని తెలిసికొనుడు. ఇది సన్మార్గము. అందుచే దానిననుసరింపుడు. ఇతరమార్గముల ననుసరింపవలదు. ఎందుకనగ అవి అతనిమార్గమునుండి మిమ్ములను తప్పించి తప్పుత్రోవల పట్టించును. మీరు చెడుగునుండి రక్షింపబడుదురని ఈవిధముగ విధించితిని.

155. పరోపకార పారీణుడగు మూసాపై నా అనుగ్రహమును సంపూర్ణముగ చూపుటకై అతనికి జ్ఞానగ్రంథమును ప్రసాదించితిని. అందులో సమస్త విషయములును విస్పష్టపరుపబడినవి. అది సన్మార్గము చూపునది; భగవదనుగ్రహము. భగవంతుని సమక్షమున సమావేశమగుదుమను నమ్మకము వారికి కలిగించుటకై (ఇస్రాయీలీయులకు జ్ఞానగ్రంథమును ప్రసాదించితిని.)

ఇరువదియవ ఖండము

156. మేము ప్రవచించిన జ్ఞానగ్రంథమిది. ఇది శుభస్కరమైనది. అందుచే దానిననుసరింపుడు. దౌష్ట్యమునుండి తప్పించుకొనియుండుడు. మీపై కరుణ చూపబడును.

157. (ఓ మానవులారా!) ఇంతకుముందు రెండేజాతులకు జ్ఞానగ్రంథము నిచ్చితిరి; దాని పఠనపాఠములు మాకు తెలియవని మీరనకుండుటకై (ఈ జ్ఞానగ్రంథము మీకు వెలువరచితిని.)

158. "జ్ఞానగ్రంథము మాకు ప్రవచింపబడి యుండినచో వారికంటె ఎక్కువగ మేమే సన్మార్గప్రవర్తకులమై యుండువారము." మీరనకుండ (ఈ జ్ఞానగ్రంథము మీకు పంపితిని,) చూడుడు! ఇప్పుడు మీ ప్రభువు కడనుండి విస్పష్టమైన సత్యమగు నిదర్శనము వచ్చినది. (ఇది) మార్గదర్శకము; (మీపై భగవంతుడుచూపిన) అనుగ్రహము. భగవత్సందేశములను నిరాకరించి వాటియెడ విముఖత్వము వహించువానికంటె అన్యాయపరు డెవడుండును? మా సందేశముయెడ విముఖత్వము చూపినవారికి కఠినమగు శిక్షలభించును. ఎందుకన వారు (సత్యముయెడ) విముఖత్వము చూపిరి.

159. (సత్యమింత స్పష్టముగ వివరింపబడినను తమ మౌర్ఖ్యమును వదలని వీరు) దేనికొఱకు ప్రతీక్షించుచున్నారు? (ఆకాశమునుండి) దేవదూతలు దిగివత్తురనియా? లేక భగవంతుడే వానినుండి ప్రత్యక్షము కావలెననియా? లేక భగవంతుడు ఏవేని అపురూపమైన మహత్త్వములు ప్రదర్శించు ననియా? (వీరు ఇందుకై ప్రతీక్షించు చున్నచో ఇది తెలిసికొందురుగాక!) ఏనాడు మీ ప్రభువు కొన్ని (తుదిదినపు) చిహ్నములను ప్రదర్శించునో నాడు ఇంతకుపూర్వమే విశ్వసింపనివారికిని, అట్లు విశ్వసించి సత్కార్యాచరణము చేయనివారికిని (ఆపత్కాలమున భయపడి) విశ్వసించుట లాభకారి కానేరదు. (ఓ ప్రవక్తా!) వారితో ఇట్లు చెప్పుము: "(మీకు ప్రతీక్ష చేయవలెనని యున్నచో) ప్రతీక్ష చేయుడు. మేముకూడ (సత్యాసత్యముల తీర్పుకై) ప్రతీక్షించుచున్నాము."

160. (ఓ ప్రవక్తా!) తమ మతములో భేదములు కల్పించి వివిధ శాఖలుగ చీలిపోయినవారితో నీకెంతమాత్రము సంబంధము లేదు. (నీమతము కృతకమైనదికాదు. అది అవిభాజ్యమైన సంపూర్ణ సత్యము.) ఈ విభేదవాదుల వ్యవహారము భగవంతుని వశమందున్నది. వారు చేయుచున్న దుష్కృత్యముయొక్క ఫలము నతడే చూపును.

161. ఎవడు ఒక సత్కార్యము చేయునో దానికి పదింతలు ఫలము కలుగును. ఎవడు దుష్కార్య మాచరించునో దానికి సమానమైన ప్రతిఫల మతనికి లభించును. వారికి అన్యాయము జరుగదు.

162. (ఓ ప్రవక్తా!) వారితో ఇట్లు చెప్పుము: "నిశ్చయముగ నామట్టుకు నా ప్రభువు నాకు సన్మార్గమును చూపినాడు. సత్యమైన ధర్మమును, ధర్మపరుడగు ఇబ్రాహీమ్ మతమును (చూపినాడు.) ఇబ్రాహీమ్ బహుదైవతారాధకుడు కాడు."

163. (ఓ ప్రవక్తా!) ఇట్లు చెప్పుము: "నిశ్చయముగ నా ప్రార్థన, నా యాత్ర, నా జీవితము, నా మరణము సమస్తము సర్వలోక సంపోషకుడగు భగవంతునికొరకే.

164. "అతనికి సహవాసి లేడు.

"ఈవిధముగ నే నాజ్ఞాపింపబడితిని. (భగవంతునకు) సర్వసమర్పణము చేసికొనువారిలో నేను ప్రథముడను."

165. (ఓ ప్రవక్తా!) ఇట్లనుము: "నేను భగవంతుని విడిచి మరొకనిని ప్రభువుగ స్వీకరింతునా? భగవంతుడు సర్వస్వమునకును ప్రభువు. ఏ ప్రాణియు అది చేసిన చెడుగు దాని వినాశముకొరకే చేసికొనుచున్నది. ఒకరు ఇంకొకరి భారమును వహింపరు. (ఎవరి పాపభారమును వారు వహించవలసినదే.) తుదకు మీ ప్రభువు కడకే మీరు మరలనున్నారు. ఏయేవిషయములనుగూర్చి మీరు వివాదపడిరో ఆ విషయముల సత్యాసత్యములను భగవంతుడప్పుడు మీకు తెలియజేయును.

166. మిమ్ము భూమిపై వారసుల నొనర్చి, వివిధమగు అంతరములలో మీలో కొందరిని కొందరికంటె అధికుల నొనర్చినది భగవంతుడే. మీ కిచ్చినదానితో మిమ్ములను పరీక్షించుట ఇందలి ఉద్దేశము. నిశ్చయముగ మీ ప్రభువు చెడుగుయొక్క ఫలమును త్వరితముగ కలిగించువాడు. (ఐనను) అతడు నిస్సంశయముగ మహాక్షమి; కరుణాళువు.

بسم الله الرحمن الرحيم

అధ్యాయము ౭

ఉన్నతస్థానములు

(అల్ ఆ'రాఫ్)

(మక్కాలో అవతరించినది.)

(24 ఖండములు — 206 సూక్తములు)

కరుణామయుడును వరప్రదాయకుడును అగు అల్లా
నామస్మరణముతో (ప్రారంభించుచున్నాను.)

మొదటి ఖండము

1. అలిఫ్. లామ్. మీమ్. స్వాద్.

2. (ఓ ప్రవక్తా!) ఈ జ్ఞానగ్రంథము నీకు ప్రోక్తమైనది. దీని ద్వారా నీవు మానవులను హెచ్చరింపుము. ఇది విశ్వాసవంతులకుదోద్బోధకమును, ఉపదేశమునై యున్నది. ఈ విషయములో నీవు ఎంతమాత్రము ఖిన్నచేతస్కుడవు కాకుము.

4. (మానవులారా!) మీ భగవంతునికడనుండి వచ్చిన జ్ఞానగ్రంథమును అనుసరింపుడు. భగవంతుని విడిచి మీరు కల్పించుకొనిన సహాయుల ననుసరింపకుడు. (ఎంత శోచనీయము!) మీరు (జ్ఞానప్రకాశమును గ్రహించుటలో) ఎంత అలసత్వమును చూపుచున్నారు!

4. ఎన్ని పట్టణములను మేము నశింపజేసితిమి! (ప్రజలు రాత్రి) మైమరచి నిద్రించుచుండగను, లేక వారు మధ్యాహ్నము పరుండియుండగను హఠాత్తుగా నిష్ఠురమైన మా శిక్ష వారికి వచ్చెను.

5. ఈ వినాశము ప్రాప్తించినప్పుడు "నిస్సందేహముగ మేము

దుష్టులమై యుంటిమి" అనుటకంటె వారు మరొకవిధముగ చెప్పజాలక పోయిరి.

6. (ఏ జాతులను సంస్కరించుటకు) ప్రవక్తలను పంపితిమో వారిని తప్పక పరీక్షింతుము. అదేవిధముగ ప్రవక్తలనుకూడ (వారు తమ విధిని సరిగ నిర్వహించిరో లేదో అని) ప్రశ్నింతుము.

7. తరువాత నిశ్చయముగ (వారి ప్రవర్తనోదంతమును) సర్వజ్ఞత్వముచే వారికి వినిపింతుము. (నిత్యుడను సర్వసాక్షుడనగు నేను) అప్పుడు లేకపోలేను.

8. నాడు (మీకర్మలు) న్యాయముగ తూచబడును. ఎవరిసత్కర్మలు బరువుగ నుండునో వారు జయశ్రీని పొందినవారగుదురు.

9. ఎవరి (సత్కర్మల) తూనిక తేలికగ ఉండునో వారు ఆత్మనష్టమును పొందినవారు. ఎందుకనగ వారు మా సందేశములను విశ్వసింపరైరి.

10. నిశ్చయముగ మిమ్ము భూమిపై స్థాపించి, మీకై జీవికకు సాధనములను కల్పించితిమి. కాని మీరు కృతజ్ఞులై యుండరు.

రెండవ ఖండము

11. నిశ్చయముగ మేము మిమ్ము సృజించితిమి. తర్వాత మీకు చక్కని ఆకారము కల్పించితిమి. పిదప దేవతలకు "మానవునకు సాష్టాంగపడుడు." అని చెప్పితిమి. వారల్లె సాష్టాంగపడిరి. ఒక్క ఇబ్లీసుతప్ప; వాడు సాష్టాంగ పడినవారిలో లేడు.

12. భగవంతుడిట్లనెను: "నేను ఆజ్ఞాపించినప్పటికిని నీవే కారణముచే సాష్టాంగపడవైతివి?" దానికి ఇబ్లీసు ఇట్లనెను: "నేనీ మర్త్యునికంటె శ్రేష్ఠతరుడను. నీవు నన్ను అగ్నినుండి పుట్టించితివి. అతనిని మట్టినుండి పుట్టించితివి."

13. దానికి భగవంతుడిట్లనెను: "నీవిచటినుండి పొమ్ము. (శాంతి

ధామమగు స్వర్గములో) గర్విష్ఠుడవైన నీవుండతగవు. అందుచే ఇటనుండి పొమ్ము. నీవు పరమ నీచులలో ఒకడవైతివి."

14. అప్పుడు వాడిట్లనెను: "(ప్రభూ!) వారుతిరిగి బ్రతికి లేచు ప్రళయదినమువరకు నాకు గడువొసంగుము."

15. దానికి భగవంతుడిట్లనెను: "పొమ్మస్తే గడువొసంగితిని."

16. వాడిట్లనెను: "నీవు నాపై మోక్షద్వారమును బంధించివేసితివి. కాన నేను నీ ఏర్పరచిన సన్మార్గమున నడువబోవు మానవులకై పొంచియుండెదను."

17. వారి ముందునుండియు, వెనుకనుండియు, వారి కుడిప్రక్క నుండియు, ఎడమప్రక్కనుండియు వారినావరించి (వారిని దుష్పథముల కీడ్తును.) వారిలో పల్వురు నీకు కృతజ్ఞులై యుండరు.

18. దానికి భగవంతుడిట్లనెను: "నీవు స్వర్గమునుండి ధిఃకృతుడవై, తరుమగొట్టబడినవాడవై పొమ్ము. మానవులలో ఎవరు నిన్ననుసరింతురో నీతోపాటు వారినందరినికూడ నరకమున నింపుదును."

19. (మానవునుద్దేశించి మేమిట్లంటిమి:) "ఓ ఆదమ్! నీవును నీ భార్యయు ఈ స్వర్గోద్యానమున వసింపుడు. మీ కిష్టమువచ్చిన చోట నుండి తీసికొనితినుడు. కాని ఈ వృక్షముపొంతకు పోవలదు. మీరు దానికడకు పోతిరా అధర్మపరులగుదురు."

20. కాని సైతాను వారి హృదయములలో దుర్భావమును ప్రేరేపించెను. (వారిలో రహస్యముగ గుప్తమైయున్న కామక్రోధాది దుర్గుణములను పైకి తెచ్చుటకై) వారితో ఇట్లనెను: "మీరు దేవతలై పోదురనియు అమర్త్యులై పోదురనియు మాత్రమే భగవంతుడు వీరికీ వృక్షమును నిషేధించినాడు."

21. వారిద్దరిముందు సైతాను అనేకముగు ఒట్లుపెట్టుకొని వారికి నచ్చచెప్పెను. "మీకు నేను నిశ్చయముగ మంచిసలహా నిచ్చుచున్నాను. (అని వారికతడు నచ్చజెప్పెను.)"

22. ఇట్లు మోసముచేసి వాడు వారిని ధర్మస్థానమునుండి పడద్రోసెను.

వారప్పుడు నిషేధమైన వృక్షఫలమును రుచిచూచిరి. వారిలో గుప్తమైయుండిన (కామక్రోధాది) దుర్గుణములు వెంటనే బయల్పడెను. వారు ఆ వనమందలి ఆకులతో తమ దేహములను కప్పుకొనసాగిరి.

అప్పుడు భగవంతుడు వారికిట్లనెను: "ఆ చెట్టును మీ ఇద్దరకును నేను నిషేధించలేదా? సైతాను మీకు బహిరంగశత్రువని బోధించియుండలేదా?"

23. దానికి వారిట్లనిరి: "ప్రభూ! మేము ఆత్మద్రోహ మొనర్చికొంటిమి. మమ్ము నీవు క్షమించి, మాపై కరుణ చూపవేని, మేము తప్పక భ్రష్టులమగుదుము."

24. దానికి భగవంతుడిట్లనెను: "మీరీ స్వర్గోద్యానమును విడిచిపొండు. (మీరిప్పు డలవరచుకొన్న కామక్రోధాది దుర్గుణములవల్ల) మీ రొకరికొకరు శత్రువులగుదురు. మీకై భూమిపై నివాసమును, ఒక నిర్ణీతకాలమువరకు ఆహారము కలదు."

25. భగవంతుడు మరియు నిట్లు సెలవిచ్చెను: "మీరందే నివసింతురుగాక! అందే మరణింతురుగాక! దానినుండియే తిరిగి మీరు లేపబడుదురు."

మూడవ ఖండము

26. ఓ మానవులారా! మీసిగ్గును దాచుకొనుటకు మేము నిశ్చయముగ వస్త్రాచ్ఛాదనమును పంపితిమి; అది మీ సౌందర్యమునకు కూడ. వస్త్రము (చెడుగునుండి మిమ్ము) కాపాడుటకుకూడ. అదియే అత్యుత్తమమైనది. మీరు శ్రద్ధాళువులై యుండుటకై పంపబడిన భగవత్సందేశము.

27. ఓ మానవులారా! సైతాను మీ జననీజనకులను స్వర్గోద్యానమునుండి వెడలగొట్టించి, వారి ఇద్దరి వస్త్రాచ్ఛాదనమును ఒలిపించి, (కామక్రోధాది) సమస్త దుర్గుణములను ప్రకాశపరచినట్లు మిమ్ములను కూడ ధర్మస్థానమునుండి పడగొట్టుట కవకాశమియ్యకుడు. నిశ్చయముగ సైతాను, అతని దుష్టపరివారము మీకై పొంచియే యున్నది. వారిని మీరు చూడలేదు. విశ్వాసహీనులను నిశ్చయముగ మేము దుష్టుల వశమొనర్చితిమి.

28. వారేదైన సిగ్గుమాలిన అకృత్యముచేసి ఇట్లందురు: "ఇది మాతాత తండ్రులు అనుసరించిన సంప్రదాయము. ఇది మాకై భగవంతునిచే విధింపబడినది."

(ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) అనుము: "నిశ్చయముగ భగవంతుడు సిగ్గుమాలిన ఇట్టి అకృత్యములను విధింపడుకదా? నిజమైన భగవదాజ్ఞలను ఎరుగని మీరు భగవంతునకిట్టివి ఆపాదింతురా?"

29. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "నా ప్రభువు న్యాయమును విధించెను. ప్రార్థనకాలమునకు మీ ముఖములను భగవంతుని వైపునకు త్రిప్పుడు. సంపూర్ణ హృదయముతో భగవంతునకు వినతులు కండు. మొదట మీరెట్లు పుట్టింపబడిరో తుదకు మీరట్లే (రిక్తహస్తములతో) తిరిగి మరలుదురు."

30. మీలో కొందరు సన్మార్గమున ప్రవర్తింపజేయబడిరి. మరి కొందరు (దుర్మార్గమును పట్టిరి.) వారికి దౌష్ట్యము ప్రాప్తించెను. నిశ్చయముగ వారు భగవంతునివిడిచి దుష్టులను రక్షకులనుగా గ్రహించిరి. (అట్లయ్యు) వారు తాము సన్మార్గ ప్రవర్తకులమనియే అనుకొందురు.

31. ఓ మానవులారా! ప్రతిప్రార్థన సమయమందును మీ శరీరముల శుభ్రపరచుకొని, అలంకరించుకొనుడు. తినుడు; త్రాగుడు. కాని హద్దుల నతిక్రమింపకుడు. హద్దుల నతిక్రమించినవారిని భగవంతుడు ప్రేమించడు.

నాలుగవ ఖండము

32. (ఓ ప్రవక్తా!) వారితో ఇట్లు చెప్పుము: "తన సేవకుల ఉపయోగమునకై భగవంతుడు పుట్టించిన అలంకారవస్తువులను, పరిశుభ్రమును, పవిత్రమును ఐన ఆహారపదార్థములను ఎవరు నిషేధించిరి? (వారితో) నీవిట్లనుము: "ఈ ప్రపంచపు జీవితములో విశ్వాసవంతులకవి. అట్లే తుదిదినమున వారికిమాత్రమే (అవి లభించును. విశ్వాసహీనులకు లభింపవు.) ఈ విధముగ వివేచనాపరులకు మా సందేశములను సవివరణముగ విప్పిచెప్పుదుము."

33. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "నా ప్రభువు నిషేధించినవి :

సిగ్గుమాలిన మాటలు-అవి బహిరంగముగ చెప్పినను రహస్యముగ చెప్పినను;

పాపపుమాటలు;

అన్యాయ దౌర్జన్యములు;

భగవంతునకు నిరాధారముగ సహవాసులను నిలువబెట్టుట;

మీకు తెలియని విషయములను భగవంతుని కాపాదించి చెప్పుట.

34. (జ్ఞాపకముంచుకొనుము.) ప్రతిజాతికిని ఒక నిర్ణీతకాలము కలదు. ఆ నిర్ణీతకాలము రాగానే ఒక్క-ఘడియ ముందువెనుక లుండవు. (కావలసినది వెంటనే ఐ తీరును.)

35. ఓ మానవులారా! మీనుండియే ఉద్భవముగు ప్రవక్తలు నా సందేశములను వినిపించుచు వచ్చినప్పుడు ఎవరు భగవద్భీతితో సరిగ ప్రవర్తింతురో వారికెట్టిభయమును లేదు. వారికెట్టిశోకమును కలుగదు.

36. కాని ఎవరు నా సందేశములను నిరాకరించి గర్వముతో నా ప్రవక్తలయెడ విముఖత్వమును చూపుదురో వారికి నరకాగ్ని నివాసమగును. వారికందే నిత్యనివాసము.

37. భగవంతునిపై అసత్యమారోపించి, భగవత్సందేశములను నిరాకరించువానికంటె అన్యాయపరు డెవఁడుండును? ఇట్టివారు భగవంతుని ప్రకృతిధర్మానుసారము వారిపై ఏర్పరచిన భాగమును పొందుదురు. కాని వారికి మృత్యువును కలిగించుటకై వచ్చిన నా దూతలు "భగవంతునివిడిచి మీ రెవరిని సంరక్షకునిగ ప్రార్థించుచుంటిరో వారిప్పు డేరి?" అని అడిగినప్పుడు వారిట్లందురు: "వారు మమ్ము విడిచిపోయిరి." తాము అవిశ్వాసులమై యుంటిమని వారికి వారే సాక్ష్యమిచ్చుకొందురు.

38. అప్పుడు భగవంతుడిట్లాజ్ఞాపించును: "మీకు పూర్వముండిన భూతములయొక్కయు, మానవులయొక్కయు జాతులతోపాటు మీరు కూడ నరకాగ్నిని ప్రవేశింతురు."

ఒకజాతి నరకములో ప్రవేశించినప్పుడు ఆజాతి తనవంటి ఇతర జాతులను శపించును. తుదకు వారందరు ఒకచోట చేరినప్పుడు ఒకజాతి తనకు పూర్వముండిన జాతినిగూర్చి ఇట్లనును: "ఓ ప్రభూ! మమ్ము దారి తప్పించిన జాతియే ఇది. (వీరి ననుసరించియే మే మధఃపతితుల మైతిమి.) అందుచే వీరికి ద్విగుణీకృతమగు నరకబాధనిమ్ము."

దానికి భగవంతుడిట్లనును: "మీలో ప్రతిఒక్కనికి ద్విగుణీకృతమగు శిక్షయే కాని మీరది ఎఱుగరు."

39. పూర్వపుజాతి తరువాతిజాతులను చూచి ఇట్లనును: "మా కంటె మీ కేమియు తక్కువశిక్ష లభింపలేదు. మీరు చేసినదాని దుష్ఫలము ననుభవింపుడు."

ఐదవ ఖండము

40. ఎవరు మా సందేశమును నిరాకరించి, మా ప్రవక్తలయెడ గర్వముతో విముఖత్వమును చూపిరో వారికొఱకు స్వర్గద్వారములు తెరువబడవు. సూచికా రంధ్రమునుండి ఒక ఒంటెయైనను పోగలదుకాని వారు స్వర్గోద్యానమును చేరజాలరు. దుష్టులకు మేమిట్లు పరిహారము నొసగుచున్నాము.

41. నరకాగ్ని వారికి పరుపగును; కప్పుకొనుటకుకూడ అదే. అధర్మపరులకిది ప్రతిఫలము.

42. ఎవరు విశ్వసించి సత్కృతుల నొనర్తురో వారు స్వర్గోద్యానమున వసించువారు. వారి కందే నిత్యనివాసము! ఏ ఆత్మకును దాని కాచరణ సాధ్యముకాని ధర్మమును విధింపము.

43. (స్వర్గోద్యానమును ప్రవేశించిన సుకృతుల) హృదయములందలి దోషములను క్షాళితమొనర్తుము. అక్కడ స్వచ్ఛమైన నిర్ఝరులు ప్రవహించుచుండును. అప్పుడు వారిట్లందురు: "మా కిక్కడకు మార్గముచూపిన భగవంతుడు సర్వస్తుతిపాత్రుడు. భగవంతుడు సరియైనమార్గము చూపించకుండినచో మాకీ మార్గము లభింపకుండెడిది. నిశ్చయముగ మా ప్రభువు ప్రవక్తలు సత్యమును తెచ్చిరి." అప్పుడు వారికీమాటలు వినిపించును: "మీరు చేసిన సత్కార్యములకు ఈ స్వర్గోద్యానమునకు వారసులైతిరి."

44. స్వర్గోద్యానమున నివసించు వీరు నరకాగ్ని యందున్నవారితో ఇట్లు చెప్పుదురు: "మా ప్రభువు మాకుచేసిన వాగ్దానప్రకారము నిశ్చయముగ మాకిది లభించినది. ప్రభువు వాగ్దానము సత్యమైనది. మీ ప్రభువు వాగ్దానము చేసినది నిజమని మీకు కూడా తెలిసిదా?" వారిట్లందురు: "అవును."

ఒకడు ఉచ్చైస్స్వరముతో ఇట్లనును: "దుష్టులు భగవంతునిచే శపింపబడినారు."

45. భగవన్మార్గమునుండి ప్రజలను నిరోధించువారలను, భగవన్మార్గమునకు అడ్డంకులు కల్పించువారును, పరలోకమునందు నమ్మకము లేనట్టివారును ఈ దుష్టులు.

46. ఈ ఉభయులకును మధ్య ఒక తెర కలదు. ఉన్నతస్థానములలో కొందరుందురు. వారు ముఖచిహ్నములనుబట్టి ప్రతియొక్కరిని

తెలిసికొందురు. వారు స్వర్గోద్యానవాసులను ఇట్లు సంబోధింతురు: "మీకు శాంతియగుగాక!" వారింకను స్వర్గోద్యానములో ప్రవేశింప లేదు. ప్రవేశించుట కాశమాత్రము వారికి కలదు.

47. వారు నరకవాసులను చూచినప్పుడు ఇట్లు ప్రార్థింతురు: "మా ప్రభూ! అధర్మపరులగు వీరితో మమ్ముంచకుము."

ఆరవ ఖండము

48. అత్యున్నత స్థానములందు నివసించువారు వారిని ముఖచిహ్నములనుబట్టి గుర్తించి ఇట్లు సంబోధింతురు: "మీరు చేరదీసిన (మీ అనుయాయుల) గుంపులు, మీ గర్వము మీ దంబములు మీ కేమియు లాభము చేకూర్చలేదు."

49. (తరువాత వారు స్వర్గవాసులనుచూపి ఇట్లందురు): "మీరు ఒట్లు పెట్టుకొని భగవంతుని అనుగ్రహము వారికెంతమాత్రము చేకూరదని చెప్పినది వీరినిగూర్చియేనా? (చూతుము. నేడు భగవదనుగ్రహము వారినెట్లు పిలుచుచున్నదో): "స్వర్గోద్యానమును ప్రవేశింపుడు. మీకెట్టి భయమును లేదు. మీకెట్టి దుఃఖమును లేదు."

50. నరకవాసులు స్వర్గవాసులకిట్లు ఆక్రోశించి చెప్పుదురు: "మాకై కొంతనీటిని ప్రవహింపజేయుడు; లేదా భగవంతుడు మీకిచ్చిన దానినుండి కొంత మాకును ఈయుడు."

స్వర్గవాసులిట్లు ప్రత్యుత్తరమిత్తురు: "నిశ్చయముగ భగవంతుడు అవిశ్వాసుల కీరెండును నిషేధించినాడు."

51. (ఎందుకన భగవంతుడిట్లు సెలవిచ్చినాడు): "ఎవరు తమ ధర్మమును పనికిమాలిన ఒక ఆటగా గ్రహించిరో, ఎవరిని ఈ ఐహిక జీవితము మోసగించెనో వారు ఏవిధముగ ఈ దినమును మరచిపోయి యుండిరో ఆ దేవిధముగ వారుకూడ విస్మరింపబడిరి. ఎందుకన తెలిసియుండియు వారు తాము సమావేశమగు ఈ దినమును నా సందేశము నిరాకరించినవారు."

52. నిశ్చయముగ మేము వారికొరకు స్పష్టమైన జ్ఞానగ్రంథమును వారికి మార్గదర్శకముగ నుండుటకును, విశ్వాసము కలవారికి అనుగ్రహముగను పంపితిమి.

53. ఏమి వీరు! (తాము చేయుచున్న సత్య తిరస్కారముయొక్క) దుష్ఫలితము సంభవించువరకు నిరీక్షించుచున్నారా? (వారొకసారి ప్రతీక్షించుచున్నది దానికొరకే యైనచో వారు తెలిసికొందురుగాక!) దాని ఫలితార్థము సంభవించిననాడు దానియెడ అంతవరకు ఉపేక్షవహించిన వారిట్లు ఆక్రోశింతురు: "నిశ్చయముగ మాప్రభువు ప్రవక్తలు మాకొరకు సత్యమే తెచ్చిరి. మాకిప్పు డడ్డుపడువా రెవ్వరైన కలరా? లేక మేము వెనుక చేసిన దుష్కార్యములుకాక సత్ప్రవర్తకులమై యుండుటకు తిరిగి భూమిపై పంపబడగలమా?" నిస్సందేహముగ వారు తమ ఆత్మలను కోల్పోయిరి. వారు కల్పించుకొన్నది వారిని విడిచిపోయెను.

ఏడవ ఖండము

54. నిశ్చయముగ నీప్రభువు అల్లాః. భూమ్యాకాశముల నతడు ఆరు కాలవిభాగములలో సృష్టించెను. అతనిశక్తి స్థిరమైనది. అహస్సుపై నిశీథావగుంఠనము నతడువైచును. అహోరాత్రములు ఒకదానినొకటి వెంబడించుచున్నవి. అతడు సూర్యుని, చంద్రుని, నక్షత్రములను సృష్టించెను. అవి అతని ఆజ్ఞాబద్ధములై నడచుచున్నవి. నిశ్చయముగ అతడు సృష్టించువాడు; పరిపాలించువాడు. సకలలోకప్రభువగు భగవంతుడు సర్వ సంస్తుత్యుడగుగాక!

55. నీ ప్రభువును వినయముతోడను రహస్యముగను ప్రార్థింపుడు. హద్దుల నతిక్రమించువారి నతడు ప్రేమింపడు.

56. సంస్కరింపబడిన తరువాత భూమిలో దౌష్ట్యమొనర్పకుడు. భగవంతుని భయముతోడను, ఆశతోడను ప్రార్థింపుడు. ఉపకార పారీణులకు భగవత్కరుణ సమీపముననే యున్నది.

57. భగవత్కరుణ వర్షించకపూర్వమే శుభవార్తలతెచ్చు వాయువులను భగవంతుడే పంపుచున్నాడు. అవి వర్షదములగు కారుమబ్బులను తమతో తెచ్చును. నిర్జీవమైన భూమివైపునకు ఆ మేఘములను పంపుచున్నాడు. తరువాత దానినుండి వర్షమును కురిపించుచున్నాడు. వివిధఫలములను పండించుచున్నాడు. ఇదేవిధముగ మేము మృతులను సజీవుల నొనర్చుచున్నాము. దీనినిగూర్చి మీ రాలోచింతురుగాక!

58. ఫలవంతమగు భూములలో వృక్షజాలము సమృద్ధిగ భగవదనుజ్ఞ ననుసరించి ఫలవంతమగును. ఫలవంతముకాని భూములలో వృక్షసంతతి తక్కువగనుండును. ఈ విధముగ మా చిహ్నములను మాకు కృతజ్ఞులై యుండువారికొఱకు చర్విత చర్వణముగ చెప్పుచున్నాము.

ఎనిమిదవ ఖండము

59. నోహాను అతనిజాతిని (మార్గదర్శకునిగ) నిశ్చయముగ పంపితిమి. అతడు (తనజాతిని సంబోధించుచు) ఇట్లు చెప్పెను: "ఓనా జాతీయులారా! అల్లాను సేవింపుడు. అల్లాతప్ప మరొక దేవుడు లేడు. ఒక విషాదదినమునాడు తప్పక మీ కొరకు వచ్చు శిక్షకై నేను భయపడుచున్నాను.

60. (నోహా ప్రబోధమునకు) అతనిజాతి నాయకులిట్లనిరి: "నిస్సందేహముగ నీవు స్పష్టమైన తప్పుమార్గములో ఉన్నావు."

61. నోహా వారితో ఇట్లనెను: "ఓనా జాతీయులారా! నాలో ఎట్టిదోషమును లేదు. నేను సకలలోక సంపోషకుని ఒక ప్రవక్తను మాత్రము.

62. నా ప్రభువు సందేశములను మీకు విన్పించుచున్నాను. మీకు హితోక్తులను గరపుచున్నాను. మీకు తెలియని విషయములను నేను భగవంతునికడనుండి తెలిసికొంటిని.

63. ఏమి! మీలోని ఒక మనుష్యునిద్వారా భగవంతుడు మిమ్ము హెచ్చరించుచున్నాడని మీకాశ్చర్యము కలుగుచున్నదా? (భగవంతుడిట్లు చేసినది) మీకు హెచ్చరించుటకును, మిమ్ము చెడుగులనుండి తప్పించుటకును, మీపై అనుగ్రహమును చూపుటకేకదా?"

64. కాని వారతని నబద్ధవాదియనిరి. అందుచే మేము అతనిని, అతని అనుయాయులను ఓడలో కూర్చుండబెట్టి మా సందేశమును నిరాకరించినవారిని ముంచివైచితిమి. నిశ్చయముగ వారొక అంధజాతి.

తొమ్మిదవ ఖండము

65. ఆద్ తెగకు మేము వారిసోదరుడగు హూద్‌ను ప్రవక్తగ పంపితిమి. అతడు తనజాతిని సంబోధించుచు ఇట్లనెను: "ఓ నా జాతీయులారా! అల్లాను సేవింపుడు. అతడుతప్ప వేరుదైవములేడు. మరి మీరు భయపడరా?"

66. అతనిజాతిలో విశ్వసించని వారినాయకులు ఇట్లుచెప్పిరి: "నిస్సందేహముగ నీవు పొరపడుచున్నావు. నీవు అబద్ధవాదివని మా అభిప్రాయము."

67. (మూర్ఖులగు తనజాతి నాయకులతో హూద్) ఇట్లుచెప్పెను: "ఓ నా జాతీయులారా! నాలో ఎట్టిదోషమును లేదు. నేను సర్వలోక సంపోషకుడగు భగవంతుని ప్రవక్తను."

68. నేను నాప్రభువు సందేశములను మీ కందజేయుచున్నాను. నేను మీకు సత్యసంవాదినగు హితబోధకుడను.

69. మీనుండియే ఒక మనుష్యునిద్వారా మీప్రభువు ఈ హెచ్చరికను మిమ్ములనుద్బోధించుటకై పంపెనని మీ రాశ్చర్యపోవుచున్నారా? నోహా జాతికి మిమ్ములను వారసులనొనర్చి మీకు ఘనతను బలమును ప్రసాదించినది జ్ఞాపకముంచుకొనుడు. మీరు (ఐహికాముష్మికములందు) జయశ్రీ నందగోరినచో భగవంతుడు ప్రసాదించిన ఈ యనుగ్రహములను జ్ఞాపక ముంచుకొనుడు."

70. వారిట్లనిరి: "ఏకేశ్వరుడగు అల్లాను సేవించి మా తాత

తండ్రులు సేవించిన దేవతానులను విడిచిపెట్టుడని మాకు చెప్పవచ్చితివా? (అట్లు చేయకపోయినచో మాకేదో ఆపదవచ్చునని) నీవు భయపెట్టుచున్న ఆ ఆపదను నీవు సత్యవాదివే యైనచో తెచ్చిపెట్టుము.''

71. హూద్ వారికిట్లనెను: "నిశ్చయముగ మీ భగవంతునికడ నుండి శిక్ష, ఆగ్రహము మీపై వచ్చిపడినవి. ఏమి! మీరును మీ తండ్రులును (మీ దేవతలకు) ఇచ్చిన నామములనుగూర్చి నాతో చర్చింతురా? దానికి భగవంతుడెట్టి అధికారమును ఇవ్వలేదే! (మీరు మీ దౌష్ట్యమునకు కలుగు శిక్షను చూచుటకు కుతూహలముతో ప్రతీక్షించుచున్నారు.) అట్లయిన దానికై వేచియుండుడు. నేనుకూడ మీతోపాటు వేచియుందును.

72. మేము హూదును, అతని అనుయాయులను కరుణతో తప్పించి మా సందేశములను తిరస్కరించి అవిశ్వాసమును చూపినవారిని సమూలముగ నశింపజేసితిమి.

పదవ ఖండము

73. సమూద్ జాతికి తిరిగి వారి సోదరుడగు సాలెహ్‌ను (ప్రవక్తగచేసి ధర్మబోధకై) పంపితిమి. అతడు తనజాతినుద్దేశించి ఇట్లు ప్రబోధించెను: "ఓనా జాతీయులారా! అల్లాను సేవింపుడు. అతడుతప్ప మీకు వేరు దైవములేడు. మీ ప్రభువునుండి దీనినిగూర్చి స్పష్టమైన నిదర్శనము వచ్చినది. ఈ ఆడుఒంటెను నేను భగవంతుని నామముపై విడిచిపెట్టుచున్నాను. ఇది మీకొరకు ఒక చిహ్నము. దానిని స్వేచ్ఛగ పోనిండు. భగవంతుని భూమిలో అది ఎక్కడికిపోయిన అక్కడ మేయును గాక! దాని కెట్టివిధమగు హింస చేయకుడు. అట్లు చేసితిరా మీకు కఠినశిక్ష లభించును.

74. ఆద్ జాతి తర్వాత మిమ్ము భగవంతుడు వారి వారసులనొనర్చెను. మిమ్ములను భూమిపై స్థాపించెను. మైదానములలో భవనములను నిర్మించుకొనిరి; పర్వతములను తొలిచి మీరు గృహములను నిర్మించుకొనిరి. భగవంతుని ఈ యనుగ్రహములను జ్ఞాపక ముంచుకొనుడు. దుష్టులై ప్రవర్తించుచు ప్రపంచములో సంకటములను కలిగించకుడు.

75. సాలెహ్‌జాతిలో గర్విష్ఠులై ప్రవర్తించిన నాయకులు తాము బలహీనులని భావించుచుండిన విశ్వాసవంతులతో ఇట్లు చెప్పిరి: "సాలెహ్ భగవంతునిచే పంపబడినవాడని మీకు తెలియునా?''

దానికి వారిట్లనిరి: "అతనిచే ఇచ్చి పంపబడిన సందేశమును మేము తప్పక విశ్వసింతుము."

76. దానికి గర్విష్ఠులగువారిట్లు చెప్పిరి: "మీరు దేనిని విశ్వసించుచున్నారో మేము దానిని తిరస్కరించుచున్నాము.''

77. తుట్టతుదకు వారు ఆ ఆడుఒంటెను చంపి తమప్రభువు ఆజ్ఞను వ్యతిరేకించిరి. (అట్లుచేసి తమప్రవక్తను సంబోధించి) వారిట్లనిరి:

"ఓ సాలెహ్! (దీనిని చంపుటవల్ల మాకేదో విపత్తు తటస్థించునని భయపెట్టితివే?) నీవు నిజముగ ప్రవక్తలలోనివాడవే యైనచో నీవు భయపెట్టినదాని నిప్పుడు తెమ్ము."

78. అప్పుడు భూకంపము కలిగెను. వారు తమతమ ఇండ్లలో బోర్లపడిరి.

79. అప్పుడు సాలెహ్ వారినుండి తాను వేరై వారితో ఇట్లనెను: "ఓ నా జాతీయులారా! నేను నా ప్రభువు సందేశమును మీకు విన్పించితిని. హితోక్తులను పల్కితిని. మీకు హితబోధ చేయువారిని మీరు ప్రేమింపరు.

80. మేము అతనిజాతికి హితబోధ చేయుటకై లూతును ప్రవక్తగ పంపితిమి. అతడు తనజాతి ప్రజలను ఉద్దేశించి ఇట్లుచెప్పెను: "మీకు పూర్వము ప్రపంచములో ఏజాతియు చేయని సిగ్గుమాలిన అకార్యమును చేయుదురా?''

81. నిస్సందేహముగ మీరు తుచ్ఛ కామాసక్తితో స్త్రీలనే కాక పురుషులనుకూడ దరియుదురు. విషయాసక్తిలో హద్దుల నతిక్రమించిన జాతిగ మీరు మారిపోయినారు.

82. లూత్ యొక్క జాతి ఇంతకంటె మరొకరీతిగ ప్రత్యుత్తర మివ్వలేకపోయెను. వారిట్లు పరస్పరమనుకొనిరి: "(లూతును అతని అనుయాయులను) పట్టణమునుండి వెడలగొట్టుడు. వీరు మహా పరిశుద్ధులు కాగోరువారు."

83. మేము అతనిని, అతని అనుయాయులను విపత్తునుండి తప్పించుకొంటిమి. అతనిభార్య మాత్రము వెనుక దిగబడిపోయెను.

84. (దుష్టుల ఆ జాతిపై) ఒక ప్రళయవర్షమును కురిపించితిమి. పాపిష్ఠుల పర్యవసానము చూడుడు.

పదునొకండవ ఖండము

85. మీదియన్ జాతికి ఆజాతికే చెందిన షుయైబ్‌ను ప్రవక్తగ పంపితిమి. అతడు తన జాతినుద్దేశించి ఇట్లనెను: "ఓ నా జాతీయులారా! అల్లాను సేవింపుడు. అతడుతప్ప వేరు దైవములేడు. మీ ప్రభువునుండి ఈ విషయమున స్పష్టమగు నిదర్శనము వచ్చినది. అందుచే కొలతయందును, తూనికయందును పూర్తిగ ఈయుడు. కొలత, తూకము తగ్గించి మనుష్యులకు వారి వస్తువుల నియ్యకుడు. సంస్కరింపబడిన భూమిలో దౌష్ట్యమును వ్యాపింపజేయకుడు. మీరు విశ్వాసవంతులే యైనచో ఇది ఉత్తమమైన మార్గము.

86. (ధర్మబోధకు ఆటంకము కల్గించుటకై) దారులు పొంచియుండి, విశ్వాసవంతుడగు ప్రతిమనిషిని బెదరించి, భగవంతునిమార్గము నతడు ప్రవేశింపకుండ నిరోధింపకుడు. భగవన్మార్గమున అడ్డంకులు కల్పింపకుడు. జ్ఞాపకముంచుకొనుడు: మీరు మిక్కిలి కొద్దిగనుంటిరి. భగవంతుడు మీ జాతిని ప్రవృద్ధమొనర్చెను. ఆలోచింపుడు, దుష్టుల పర్యవసాన మేమైనదో!

87. నాద్వారా పంపబడిన సందేశమునందు విశ్వసించు ఒకపక్షమును, విశ్వసించని మరొకపక్షమును ఉన్నచో మా ఉభయుల మధ్యమున భగవంతుడు తీర్పు చెప్పువరకు ఓర్పుతో వేచియుండుడు. తీర్పు చెప్పుటలో భగవంతుడే అత్యుత్తముడు.

తొమ్మిదవ భాగము

88. అతని జాతిలో గర్విష్ఠులైన నాయకులిట్లు చెప్పిరి: "ఓ షుయైబ్! నిన్ను నిశ్చయముగ మేము బయటకు వెడలగొట్టుదుము. నీతోపాటు నీ అనుయాయులనుకూడ మా పట్టణమునుండి వెడలగొట్టుదుము. కాదందువా నీవు తిరిగి మా మతమును స్వీకరింపుము."

దానికి (షుయైబ్ వారితో) ఇట్లనెను: "నే నసహ్యించుకొనుచున్న మీ మతమును స్వీకరింపుమందురా?

89. భగవంతుడు మాకు మోక్షమార్గమును చూపించిన తరువాత తిరిగి మీ మతమును మేము స్వీకరించినచో భగవంతున కసత్యమారోపించినవార మగుదుము. మా ప్రభువైన అల్లా తలచిన తప్ప మేము తిరిగి మీ మతమును స్వీకరింపము. మా ప్రభువు తన సర్వజ్ఞత్వముచే సర్వస్వము నావరించి యున్నాడు. మేము భగవంతునే నమ్ముకొని యున్నవారము." "(షుయైబ్ భగవంతునకు మొకరిల్లి ఇట్లుప్రార్థించెను:) "మా ప్రభూ! మాకును మా యీ జాతికిని మధ్య సత్యముతో తీర్పు చెప్పుము. తీర్పు చెప్పువారిలో నీవు అత్యుత్తముడవు."

90. అతని జాతిలో అవిశ్వాసులైనవారి నాయకులు విశ్వాసవంతులతో ఇట్లు చెప్పిరి: "మీరు షుయైబ్‌ను అనుసరించినయెడల నిశ్చయముగ భ్రష్టులగుదురు."

91. అప్పుడు భూకంపము వారి నావరించెను. వారు తమఇండ్లలో నిశ్చేష్టితులైరి.

92. షుయైబ్‌ను అసత్యవాది యన్నవారు భ్రష్టులై ఎన్నడును ఆ పట్టణమునం దుండనట్లే నశించిపోయిరి. ఎవరు షుయైబ్‌ను అసత్యవాది యనిరో వారే నష్టపడిరి.

93. తుట్టతుదకు షుయైబ్ తనజాతినుండి వేరై వారినిట్లు సంబోధించెను. "ఓ నా జాతీయులారా! నేను మీకు నాప్రభువు సందేశము నందజేసితిని. మీకు హితబోధ చేసితిని. (కాని మీరు దుష్టమార్గమునే అవలంబించిరి.) అవిశ్వాస జాడ్యపీడితమగు మీ జాతిపై నేనెట్లు జాలి గొందును?"

పండ్రెండవ ఖండము

94. ఏదైన పట్టణమునకు మేమొక ప్రవక్తను పంపగా (అక్కడిప్రజలు అతని ధర్మబోధకు చెవియొగ్గక దుష్టులై యుండిరేని) మేమా పట్టణపు ప్రజలపై విపత్తును, కష్టమును కలిగింతుము; దానివల్ల వారు నమ్రులగుదు రని.

95. చెడు (కాలము) తరువాత వారికి మేము శుభ (కాల) మును ప్రసాదించితిమి. వారు బలిసి (భోగభాగ్యములతో తులతూగుచు గర్వించి) ఇట్లనిరి: "మా పూర్వులపై చెడుకాలమును గడచెను; మంచికాలమును గడచెను. (సుఖదుఃఖములు ఈ విధముగ కలుగుచునే యుండును. భగవంతునిశిక్ష అనునదేదియు లేదు.) ఇంతలో హఠాత్తుగ మాశిక్ష వారిపై వచ్చిపడెను. వారు దానికసంసిద్ధులై యుండిరి.

96. (వెనుకచెప్పబడిన) పట్టణముల ప్రజలు సత్యమునందు విశ్వసించి దౌష్ట్యమును విడిచియుండినచో, వారికై భూమ్యాకాశముల సమస్త సౌభాగ్యములను కల్గించియుందుము. కాని వారు (సత్యమును) నిరాకరించిరి. వారుచేసిన దుష్కర్మలకు ఫలితముగ మేము వారిని శిక్షించితిమి.

97. ఈ పట్టణవాసులు వారు నిద్రించుచుండగ రాత్రి హఠాత్తుగ వచ్చు మా శిక్షనుండి సురక్షితులని భావించుచున్నారా ఏమి?

98. ఉదయము వారు ఆటపాటలలో నిమగ్నులై యుండగా వారిపై వచ్చిపడు భగవచ్ఛిక్షనుండి సురక్షితులని ఈ పట్టణవాసు లనుకొనుచున్నారా యేమి?

99. భగవంతుని గుప్తహస్తమునుండి వారు సురక్షితులని అనుకొనుచున్నారా యేమి? వినాశము కోరువారుతప్ప ఇతరులెవ్వరును భగవంతుని గుప్తహస్తమునుండి సురక్షితుల మనుకొనరు.

పదమూడవ ఖండము

100. వెనుకటి నశించినజాతుల తరువాతవచ్చిన వారికిమాత్రము మేము తలచినచో వారి ఘోరాపరాధములకు శిక్ష లభించునని వారికి స్పష్టముగ తెలియదా? వారి హృదయములు ముద్రాబద్ధ మొనర్పబడెను. వారు (ధర్మబోధ) వినలేరు.

101. (పూర్వపుజాతుల, వారి) పట్టణముల కొన్నికథలను మీకు విన్పించుచున్నాను. నిశ్చయముగ ఆయాజాతులకు వారిప్రవక్తలు వచ్చిరి; స్పష్టమైన వాదములతో (సత్యమును సాధించుటకు ప్రయత్నించిరి.) కాని (దౌర్భాగ్యులగువారు) మొట్టమొదట సత్యమును నిరాకరించి, తర్వాత దానిని విశ్వసింపరైరి. అవిశ్వాసుల హృదయములను భగవంతుడు ముద్రాబద్ధ మొనర్చినాడు.

102. వారిలో పల్వురు భగవంతునితో వారుచేసిన ఒడంబడికను పాలించినవారుకారు. నిశ్చయముగ వారిలో పల్వురు అధర్మపరులు.

103. ఫిర్‌జౌన్ చక్రవర్తికిని అతని పరివార ముఖ్యులకును మూసాద్వారా సందేశమును పంపితిమి. కాని వారాసందేశమును విశ్వసింపరైరి. ఆదుష్టుల పర్యవసాన మేమైనదో ఆలోచింపుము.

104. (దుష్టుడగు ఫిర్‌జౌన్ చక్రవర్తితో) మూసా ఇట్లుచెప్పెను: "ఓ ఫిర్‌జౌన్! నిశ్చయముగ సమస్త జగదీశ్వరుడగు భగవంతుని ప్రవక్తను నేను.

105. భగవంతునిగూర్చి నేను సత్యముతప్ప మరొకటి చెప్పజాలను: మీ ప్రభువుకడనుండి నేను నిశ్చయముగ విస్పష్టమైన నిదర్శనము తెచ్చితిని. (మీ కారాగారములం దున్నట్టియు, మీ దేశములో బానిసలుగ చేయబడినట్టియు) ఇస్రాయీలీయులను నావెంట పంపుము."

106. దానికి ఫిర్ఔన్ ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను: "నీవు భగవచ్చిహ్నముతో వచ్చినవాడవేని, సత్యవంతుడవేయేని ఆ చిహ్నము నిటు తీసికొనిరమ్ము."

107. దానికి మూసా తన చేతికర్రను క్రిందపడవేసెను. అది అత్యాశ్చర్యకరముగ సర్పమాయెను.

108. మూసా తనహస్తమును తీసిచూపెను. అత్యాశ్చర్యకరముగ అది చూపరులకు శ్వేతహస్తమై కన్పించెను.

పదునాలుగవ ఖండము

109. ఫిర్ఔన్‌జాతి నాయకులు (ఈ మహాత్మ్యములను చూచి తమలోతాము) ఇట్లు యోచించుకొనిరి: "నిశ్చయముగ ఇతడు అభిచారవిద్య తెలిసిన ఐంద్రజాలికుడు.

110. "ఇతడు తనమాయచే మిమ్ము మీ దేశమునుండి వెడలగొట్ట దలచుచున్నాడు. ఈ విషయములో మీ ఆలోచనయేమి?"

111. వారు (తమలోతాము ఆలోచించుకొని ఫిర్ఔన్‌తో) ఇట్లు చెప్పిరి: "మూసాను అతనిసోదరుని ఇక్కడే నిలిపియుంచి రాజ్యముయొక్క ప్రతి పట్టణమునుండియు (ఐంద్రజాలికులను) వెతకి తెచ్చుటకు మనుష్యులను పంపుము.

112. వారు ఈ రాజ్యములో అభిచారవిద్య తెలిసిన ప్రతి ఐంద్రజాలికుని తీసికొనివత్తురు."

113. (ఫిర్ఔన్ అట్లేచేసెను.) సమస్త ఐంద్రజాలికులు ఫిర్ఔన్ సమక్షమునకువచ్చి ఇట్లు చెప్పిరి: "మేము ఇంద్రజాలములో మూసాను ఓడింపగలిగినచో మాకు బహుమానము ఇవ్వవలెను."

114. (దానికి ఫిర్ఔన్ ఇట్లు) చెప్పెను: "తప్పక; (మీకు బహుమతుల నిచ్చుటయేకాదు) మిమ్ములను నేను నా సన్నిహితుల నొనర్చుకొందును."

115. (ఇంద్రజాలికులు మూసా నెదుర్కొని) ఇట్లుచెప్పిరి: "ఓ మూసా! నీ చేతికర్రను నీవు ముందు వేయుదువా మేము ముందు వేయుమా?

116. మూసా ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను: "మీరే వేయుడు." వారట్లేవేసిరి. వారు కనుకట్టుచే ప్రజలను మోసగించి భయంకరమగు అత్యద్భుత ఇంద్రజాలమును ప్రదర్శించిరి.

117. అప్పుడు మేము మూసాకు ఇట్లు ప్రవచించితిమి: "నీవు నీ చేతికర్రను విసురుము."

(మూసా అట్లేచేసెను.) అత్యద్భుతముగ ఆ కర్ర ఐంద్రజాలికులు నిర్మించిన ఆ మోహమాయా జాలమంతటిని మ్రింగివైచెను.

118. ఈ విధముగ సత్యము స్థాపింపబడెను. ఐంద్రజాలికులు చేసినదంతయు బూటకమాయెను.

119. అట్లు వారు పరాజితులై, పరాభవముతో వెనుకకుతగ్గిరి.

120. ఐంద్రజాలికులు (మూసాకు) సాష్టాంగపడిరి.

121. (అట్లు సాష్టాంగపడి) ఇట్లనిరి: "మేము సర్వలోక సంపోషకుడగు భగవంతుని యందు విశ్వసించుచున్నాము.

122. మూసాయొక్కయు, హారూన్ యొక్కయు ప్రభువును (విశ్వసించుచున్నాము.)"

123. ఫిర్ఔన్ (ఇంద్రజాలికుల ఈ ప్రవర్తనకు క్రుద్ధుడై ఇట్లనెను): "నేననుజ్ఞ ఇవ్వకపూర్వమే మీరు భగవంతునియందు విశ్వసింతురా? (ఓ మూసా!) నిశ్చయముగ నీవు రహస్యముగ ఈ నగరములో పన్నిన పన్నాగమిది. (ఇట్లు కుట్రపన్ని) నీవు ప్రజలను నీవైపు త్రిప్పజూచితివి. (నేను నీకేమిచేయుదునో) తెలిసికొందువుగాక!

124. తప్పక మీ కాలు చేతులను నరికింతును. మిమ్ములనందరను సిలువపై ఎక్కించి ఉరితీయింతును."

125. (దానికి మూసా నిశ్చలమనస్కుడై) ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను: (మేము మరణమునకు భయపడువారము కాము. మాకు మరణమే వచ్చినచో) నిశ్చయముగ మేము మా ప్రభువు సముఖమునకే మరలుదుము:

126. "మాకు ప్రోక్తమైన భగవత్సందేశమును మేము విశ్వసించితి మనియేకదా నీవు మాపై కసి తీర్చుకొనుచున్నావు? (ఈ విధముగ సత్యమునకై ప్రాణము ధారపోయుటకంటె వేరుభాగ్యముండునా!) అని (భగవంతునకు మోకరిల్లి ఇట్లు ప్రార్థించిరి): "మా ప్రభూ! మాపై సహనవృష్టిని కురిపింపుము. నీకు సమస్తము సమర్పించిన వారిగ మమ్ము మరణింపనిమ్ము."

పదునేనవ ఖండము

127. ఫిర్ జౌన్ జాతి నాయకులు ఫిర్ జౌన్‌తో ఇట్లు చెప్పిరి: "దేశములో ఈ విభేదము కల్పించి నిన్ను, నీ దేవతలను పరిత్యజించునట్లు బోధించుచున్న మూసాను, అతని అనుయాయులను ఇట్లే విడిచిపుచ్చెదవా?"

ఫిర్ జౌన్ ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను: "మేము వారి పుత్రులను చంపి, స్త్రీలను (బానిసలుగ నుంచుకొనుటకై) విడిచిపుత్తుము. నిశ్చయముగ మేము వారిపై అధిపతులము."

128. మూసా (నిస్సహాయుడై) తన ప్రజలతో ఇట్లు చెప్పెను: "భగవంతుని సహాయమునకై ప్రార్థింపుడు. ఓర్పువహించి యుండుడు. నిస్సందేహముగ సమస్తభూమియు భగవంతునిది. తన ఇచ్ఛవచ్చినవారికి భగవంతుడు తనభూమికి వారసుల నొనర్చును. భగవద్భీతిపరులకే తుట్టతుదకు విజయము కల్గును.

129. (ఇస్రాయీలీయులు మూసాతో) ఇట్లు చెప్పిరి: "నీవు మా కడకు రాకపూర్వమును, నీవు వచ్చినప్పటినుండియు మే మొకేవిధముగ హింసింపబడుచున్నాము."

మూసా వారికిట్లనెను: "త్వరలో మీ ప్రభువు మీ శత్రువును నశింపజేయును. దేశములో మిమ్ము పాలకులుగ నియమించును. అప్పుడు మీరెట్లు ప్రవర్తింతురో భగవంతుడు చూచును."

పదియారవ ఖండము

130. క్షామములను సంభవింపజేసియు, పంటలను తగ్గించియు ఫిర్ జౌన్ జాతిని మేము శిక్షించితిమి, అప్పుడైన వారు బుద్ధితెచ్చుకొందురేమో నని.

131. వారికి సుఖము కలిగినప్పుడు ఇది మా ప్రయోజకత్వమందురు. కాని వారికి కష్టకాలము వచ్చినప్పుడు ఇది మూసా అతని అనుయాయులవలన కలిగిన అశుభమువల్ల సంభవించినదందురు. వాస్తవమేమనగా వారికా దౌర్భాగ్యము భగవంతుడే ప్రాప్తింపజేసెను. కాని వారిలో పల్వురకది తెలియదు.

132. (వారు మూసానుద్దేశించి) ఇట్లు చెప్పిరి: "మమ్ము మోహింపజేయుటకై నీవే మహాత్మ్యము చేసిచూపినను మేము నిన్ను నమ్మము."

133. వారిపై మేము తుపానును, మిడుతగుంపులను, పేలను, కప్పలను, రక్తమును పంపితిమి. ఇవి స్పష్టమైన సూచనలు. ఐనను వారు గర్విష్ఠులై ప్రవర్తించిరి. వారు పాపకర్ములు.

134. వారికి ప్లేగు సంభవించినప్పుడు మూసానుద్దేశించి ఇట్లనిరి: "ఓ మూసా! నీ ప్రభువు నీకు మహత్వమును ప్రసాదించినాడు. దాని నాధారముగ గొని, మాకై నీ ప్రభువును ప్రార్థింపుము. నీ ప్రార్థనా బలముచే ఈ విపత్తును కడతేరితిమా మేము తప్పక నిన్ననుసరింతుము. ఇస్రాయీలీయులను విడిచిపెట్టి నీవెంట పంపివేయుదుము."

135. మేము ఒక నిర్ణీతకాలమువరకు ప్లేగును కలిగించితిమి. కాని దుష్టులగువారు తమ ప్రతిజ్ఞలను భంగమొనర్చిరి.

136. అందుచే తిరిగి వారిని శిక్షించితిమి. వారిని సముద్రగర్భమున ముంచివైచితిమి. ఎందుకన వారు మా సందేశములను ధిక్కరించి వాటియెడ ఉపేక్షాభావము వహించిరి.

137. వారు ఎవరని బలహీనులు, నీచులు అనుకొనుచుండిరో వారిని దేశముయొక్క పూర్వదిశకును, పశ్చిమభాగమునకును పాలకుల నొనర్చి, ఆ దేశభాగములను ధనధాన్యములతో తులతూగునట్లు చేసితిని. నీప్రభువు ఇస్రాయీలీయులకు చేసిన వాగ్దానము ఈవిధముగ పూర్తియాయెను. ఎందుకన వారు ఓరిమితో సమస్తకష్టములను సహించిరి. ఫిరౌన్‌ను, అతనిజాతిని, ఆజాతిచేసిన సమస్తమును, నిర్మించిన సర్వస్వమును సమూలముగ నశింపజేసితిమి.

138. ఇస్రాయీలీయుల సంతతిని మేము సముద్రము దాటించితిమి. (ఇట్లు సముద్రముదాటి) వారు ప్రవేశించిన దేశమందలి ప్రజలు విగ్రహములను పూజించుచుండిరి. ఇస్రాయీలీయులు వారినిచూచి మూసాతో ఇట్లుచెప్పిరి: "ఓ మూసా! వారికున్న దైవములవలె మాకుకూడ ఒకదైవమును చేసిపెట్టుము." మూసా వారికిట్లు ప్రత్యుత్తరమిచ్చెను: "ఓనా జాతీయులారా! నిశ్చయముగ మీరు అజ్ఞానులై ప్రవర్తించుచున్నారు."

139. "వీరేమతము ననుసరించుచున్నారో అది వినాశమార్గము. వారు చేయుచున్నది వ్యర్థకార్యము."

140. (మూసా వారితో మరియు) నిట్లనెను: "అల్లాను విడిచి మీకొరకు మరొకదైవమును నేను వెతికిపెట్టుదునా? (అయ్యో మీ అజ్ఞానము!) భగవంతుడు మానవులగు మిమ్ము సమస్త సృష్టిజాతమునుండి ఉత్కృష్టుల నొనర్చినాడుకదా? (అట్టి ఉత్కృష్ట మానవజాతికి చెందిన మీరు

శిలాలోహమయములై, మీచేతనే చేయబడిన ఈ విగ్రహములను పూజింతురా?)

141. మిమ్ము అతిభయంకరముగ బాధపెట్టి, మీ కుమారులను చంపుచు, మీ స్త్రీలను బానిసలుగ ఉంచుకొనుటకై విడిచినట్టి ఫిరౌన్ జాతినుండి మిమ్ము విడిపించితిని. ఇది మీ ప్రభువుకడనుండి ఒక పెద్ద పరీక్ష."

పదునేడవ ఖండము

142. మేము మూసాకు ముప్పదిరాత్రుల నియమమును చేసి తర్వాత మరి పది రాత్రులతో పూర్తి చేసితిమి. ఈవిధముగ భగవంతుని నిర్ణీతకాలము నలుబదిరాత్రులు పూర్తియాయెను. మూసా తనసోదరుడైన హారూనుతో ఇట్లుచెప్పెను: (నేను నిష్ఠకై తూరు పర్వతముపైకి వెళ్ళుచున్నాను.) నీవు నాబదులు జాతికి నాయకుడవై యుండుము. సమస్తము చక్కగ నిర్వహింపుము. దుష్టుల మార్గము ననుసరింపకుము."

143. మేము నిర్ణయించిన కాలమునకు మూసా వచ్చెను. అతని ప్రభువు అతనితో మాట్లాడెను. మూసా భగవంతునిట్లు ప్రార్థించెను: "నా ప్రభూ! నీ దర్శనమునిమ్ము. నిన్ను చూచెదనుగాక!"

దానికి భగవంతుడిట్లనెను: "నీవు నన్ను చూడలేవు. ఐనను ఆ పర్వతమువైపు చూడుము. అది స్థిరముగ తనచోట నుండగలిగినచో నీవు నన్ను చూడగలవు." కాని భగవంతుడు తన దివ్యతేజస్సును ఇంచుకప్రదర్శించినంతనే పర్వతము అణువణువై భస్మమాయెను. మూసా మూర్ఛిల్లి క్రిందపడెను. మూసా మూర్ఛనుండి తేరుకొని భగవంతున కిట్లు విన్నవించుకొనెను: "ప్రభూ! నీవు మహాత్తరుడవు; పరమపవిత్రుడవు. మేము నీ శరణము వేడుచున్నాము. నేను విశ్వాసవంతులలో ప్రథముడను."

144. దానికి భగవంతుడిట్లు ప్రత్యుత్తరమిచ్చెను: "ఓ మూసా! మానవులలో ఉత్కృష్టునిగా నిన్ను ఎన్నుకొంటిని. నీకు నా సందేశము

లను ప్రసాదించితిని. నీతో భాషించితిని. అందుచే నేను మీ కిచ్చినదానిని గ్రహించి కృతజ్ఞుడవగుము."

145. మేము మూసాకు ప్రసాదించిన పలకల జ్ఞానగ్రంథములో సమస్త విషయములు సవివరణముగ బోధించితిమి. (మేము మూసాతో ఇట్లంటిమి: "ఓ మూసా!) ఈ జ్ఞానగ్రంథమును నిశ్చయ దార్ఢ్యముతో చేపట్టుము. ఈనీ ప్రజలనుకూడ దానిననుసరింప నాజ్ఞాపింపుము. నీకు అవిశ్వాసుల స్థానమును త్వరలో చూపింతును.

146. ఎవరు భూమిలో అన్యాయ గర్వములతో మత్తెక్కిరో వారిని నా సందేశముయెడ విముఖుల నొనర్తును. వారెన్ని మహాత్మ్యములు చూచినను నమ్మరు. వారికి సంస్కారమార్గము కన్పించినను దాని ననుసరింపరు. వారికి దుర్మార్గము కన్పించినప్పుడు వెంటనే దాని వెంబడి పోదురు. ఎందుకన వారు నా సందేశముల నిరాకరించిరి. (అందలిసత్యములయెడ) ఉపేక్ష వహించిరి.

147. ఎవరు నా సందేశములను నిరాకరించి పరలోకమునందు విశ్వసింపరో వారు చేయునదంతయు వ్యర్థము. వారు చేసినదానికి తప్ప మరే ఇతరఫలములు వారికి లభించును?

పదునెనిమిదవ ఖండము

148. మూసా జాతివారు (అతడు పర్వతముపైకి వెళ్ళినప్పుడు) తమ నగలతో ఒక గోవత్సమును చేసిరి. దానినుండి (ఆవువంటి) రవము పుట్టుచుండెను. (వారు దానిని పూజింపసాగిరి.) అది వారితో మాట్లాడలేదనియు వారిని సన్మార్గమున నడిపింపలేదనియు వారెరుగరా? ఐనను దానిని వారు ఆరాధింపసాగిరి. వారధర్మపరులు.

149. వారు తర్వాత పశ్చాత్తాపపడి తాము తప్పుత్రోవల పడితిమని గ్రహించినప్పుడు ఇట్లనిరి: "మా ప్రభూ! మాయెడల కరుణచూపుము. మమ్ము క్షమింపవేని మేము తప్పక పతితులమగుదుము."

150. మూసా తిరిగి తన ప్రజలకడకు మరలి వచ్చునప్పటికి (అతడు తనప్రజలు గోవత్సమును పూజించుచుండగా చూచెను.) అతనికి కోపము, అపరిమితమైన దుఃఖము కలిగి తనజాతితో ఇట్లుచెప్పెను: "మీ ప్రభువు ప్రసాదించు ఆజ్ఞలకై మీరించుకయు ఓర్మితో నిరీక్షింపరైరి గదా!"

మూసా ఆగ్రహావేశముతో జ్ఞానగ్రంథపు ఆ పలకలను పారవేసి తమ సోదరుడగు హారూనును తలపట్టి తనవైపున కీడ్చెను. హారూన్ మూసాతో ఇట్లుచెప్పెను: "(సోదరా! నేనేమిచేయుదును?) ప్రజలు దుర్బలునిగ భావించి నన్ను వధింపబూనిరికూడ. శత్రువులను అపహాస్యకారక మగునట్లు నాయెడ ప్రవర్తింపకుము. నన్ను ఈ దుష్టులలో ఒకనిగ గణింపకుము."

151. (మూసా తనప్రవర్తనకు పశ్చాత్తప్తుడై) భగవంతునకు మొకరిల్లి ఇట్లు ప్రార్థించెను: "ప్రభూ! (ఆగ్రహావేశమున కావించిన) నా దోషములను మన్నింపుము. (నా సోదరుడు ఈ దుష్టులను దౌర్మార్గ్యమున పడకుండ చేయజాలపి) అతనితప్పు మన్నింపుము. మమ్ము నీ అనుగ్రహచ్ఛాయను ప్రవేశింపనిమ్ము. దయామయులలో నీవు దయానిధివి."

పందొమ్మిదవ ఖండము

152. ఎవరు గోవత్సమును పూజించిరో వారికి ఈ ఐహిక జీవితమునందే భగవదాగ్రహమును, పరాభవము కలుగును. అసత్య కల్పకులకు మేమిట్టి ప్రతిఫలమునే ఇచ్చెదము.

153. ఎవరు దుష్కార్యములనొనర్చి తర్వాత పశ్చాత్తప్తులై సత్యమునందు విశ్వసింతురో భగవంతుడు (వారిని క్షమించి కరుణించును. ఎందుకన) నిశ్చయముగ భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

154. మూసా ఆగ్రహము శాంతించినపిదప అతడు తాను తెచ్చి పారవైచిన జ్ఞానగ్రంథపు పలకలను ఎత్తుకొనెను. ఎవరు భగవద్భీతిపరులో వారికై అందు మార్గదర్శనము, భగవదనుగ్రహము కలదు.

155. మూసా తనజాతినుండి మా నిర్ణయము ప్రకారము డెబ్బదిమందిని ఎన్నుకొనెను. (ఇంతలో) భూకంపము వచ్చెను. అప్పుడు మూసా భగవంతునిట్లు ప్రార్థించెను: "నా ప్రభూ! నీవు తలచినయెడ వీరందరిని ఇంతకుముందే నశింపజేసియుందువు. నన్నుకూడ నశింపజేసియుందువు. (కాని నీవు దయామయుడవగుటచే మాకు గడువొసంగితివి.) మాలో కొందరు మూర్ఖులు చేసినదానికి మమ్ములనందరిని నశింపజేతువా? ఇది నీయొక్క పరీక్షతప్ప వేరుకాదు. నీవు ఇచ్ఛించినవారిని దౌష్ట్యమునందు విడిచిపుత్తువు. నీవనుగ్రహించినవారికి సన్మార్గము చూపుదువు. నీవు మా సంపోషకుడవు. అందుచే మా తప్పిదములను క్షమింపుము. మాపై కరుణచూపుము. నీవు మహాక్షమివి.

156. "మాకీ ఐహిక జీవితమునందును, ఆముష్మిక జీవితము నందును మంచిని ప్రసాదింపుము. ఎందుకన మేము నీ శరణు వేడుచున్నాము."

దానికి భగవంతుడిట్లనెను: "ఓ మూసా! నేను కోరినవారినే శిక్షింతును. నాకరుణ సమస్తము నావరించి యున్నది. ఎవరు భగవద్భీతిపరులై దానధర్మములొనర్చి మా సందేశములను విశ్వసింతురో వారికి నా కరుణను ప్రసాదింతును.

157. ఎవరు నిరక్షరాస్యుడగు నా ప్రవక్త ననుసరింతురో ఎవరి ఆగమనము తౌరాత్, ఇంజీల్ గ్రంథములలో వ్రాసియున్నదో, ఎవరు వారికి సత్ప్రవర్తనము విధించునో, దౌర్మార్గ్యమును నిషేధించునో, మంచివస్తువులను ధర్మ్యమొనర్చి అపరిశుభ్రమగు వస్తువులను నిషేధించి, వారిపైనున్న భారమును తొలగించి, వారిని బంధించియుంచిన బేడీలను వదలగొట్టునో అట్టి మహాప్రవక్తను ఎవరునమ్మి, గౌరవించి, సహాయపడి, అతనికి పంపబడిన తేజోమార్గము ననుసరింతురో వారే సౌభాగ్యముల నందుదురు.౧౬౦

ఇరువదియవ ఖండము

158. (ఓ ప్రవక్తా! నీవు వీరితో) ఇట్లనుము: "ఓ మానవులారా! నేను మీయందరకును భగవత్ప్రవక్తగ పంపబడితిని. భూమ్యాకాశముల సమస్త సామ్రాజ్యము ఆ భగవంతునిది. అతడుతప్ప మరొక దైవము లేడు. అతడే జీవమునిచ్చుచున్నాడు. అతడే మృత్యువును కలిగించుచున్నాడు. అందుచే భగవంతుని, అతనిప్రవక్తను విశ్వసింపుడు. నిరక్షరాస్యుడగు మీప్రవక్త భగవంతునియందు, అతని ప్రవచనము నందును విశ్వసించుచున్నాడు. మీరతని ననుసరింపుడు. అప్పుడు మీకు సన్మార్గము లభించును."౧౬౦

159. మూసా జాతిలో ఒకపక్షమువారు ప్రజలను సత్యమునైపునకు త్రిప్పిరి. ఈ విధముగ వారు సత్ప్రవర్తకులైరి.

160. మేము ఇస్రాయీలీయులను పండ్రెండు తెగలుగ, పండ్రెండు జాతులుగ విభజించితిమి. అప్పుడు ప్రజలు మూసాను దాహోదకము నడుగగా మేము మూసా నిట్లాజ్ఞాపించితిమి: "నీచేతి కర్రతో ఆరాతిపై కొట్టుము." దానినుండి పండ్రెండు సెలయేళ్ళు ప్రవహించెను. ప్రతితెగ తన సెలయేటిని పొందెను.

మేము ఇస్రాయీలీయులపై మేఘచ్ఛాయను కల్పించితిమి. వారి ఆహారమునకై మన్నాను, సల్వాను పంపితిమి. వారితో ఇట్లంటిమి: "మీకు ప్రసాదించిన ఈ మంచి ఆహారమును తినుడు." కాని వారు (భగవదాజ్ఞోల్లంఘనముచేసి) మాదేమియు చెడగొట్టలేదు. కాని తమ చేతులతో తామే నష్టపడిరి.

161. (మరి యీ ఘట్టముకూడా జ్ఞాపకముంచుకొనుడు.) ఇస్రాయీలీయులకు మే మిట్లాజ్ఞాపించితిమి: "ఈ పట్టణమును ప్రవేశించి అందు వసింపుడు. అందునుండి మీ కిచ్ఛవచ్చిన చోటునుండి ఆహారమును పొందుడు. 'ప్రభూ! మాపైనున్న ఈ దుర్వహభారమును తొలగింపుము' అని ప్రార్థింపుడు. నగర ద్వారములను ప్రవేశించినప్పుడు

(గర్వముతో నిక్కి నడువక) నమ్రతతో ప్రవర్తింపుడు. కృతజ్ఞతతో భగవంతునకు సాష్టాంగపడుడు. మీ తప్పిదములను క్షమింతును. ఉపకార పారీణులకు నేను బహుకృతఫలము నిత్తును."

162. కాని వారిలో అధర్మపరులు భగవదుపదేశములనుమార్చి ఒక క్రొత్త ధర్మమును సృష్టించుకొనిరి. అందుచే ఆకాశమునుండి వారికి శిక్ష వచ్చెను. ఎందుకన వారధర్మపరులు.

ఇరువదియొకటవ ఖండము

163. ఓ ప్రవక్తా! సముద్రతీరమున నుండిన ఆపట్టణమునుగూర్చి ఇస్రాయీలీయుల నడుగుము. అక్కడ ప్రజలు సబ్బాతు దినమునాడు భగవంతుడు నియమించిన హద్దులను ఉల్లంఘించువారు. వారికై చేపలు తమంత తామే వచ్చుచుండెడివని (వారు మిషపెట్టు చుండిరి.) కాని సబ్బాతుకానినాడు అవి వచ్చెడివికావు (కదా?) ఈ విధముగ మేము వారిని పరీక్షింతుము. ఎందుకన వారు భగవదాజ్ఞల నుల్లంఘించువారు.

164. ఆ పట్టణపు ఒక పక్షమువారు (విశ్వాసవంతులతో) ఇట్లు చెప్పిరి: "(వీరి కనవసరముగ) ధర్మోపదేశ మేలచేయుదురు? (వీరు దీనికి చెవియొగ్గరు.) భగవంతుడు వారిని నశింపజేయును. లేదా కఠినముగ శిక్షనిచ్చును."

దానికి విశ్వాసవంతు లిట్లందురు: "(ధర్మోపదేశము చేయుట మా విధి: మా ఈ విధిని నెరవేర్చుకొంటిమని) భగవంతునకు విన్నవించుకో గలుగుటకు ఇట్లు చేయుచున్నాము. ఒకవేళ వీరు దౌర్మార్గ్యమునుండి మరలను వచ్చును."

165. ఈ విధముగ వారు వారికీయబడిన ధర్మోపదేశమును మరచి దుష్టులై ప్రవర్తించిరి. మేమప్పుడు ధర్మోపదేశకులను రక్షించి తక్కినవారిని కఠినముగ శిక్షించితిమి. ఏలయన వారు భగవదాజ్ఞల నుల్లంఘించిరి.

166. వారికి నిషేధించిన దానినే చేయుటయందు వారప్రమత్తులై ఉండుటచే వారిని తుచ్ఛమగు మర్కటములు కండని శపించితిమి.

167. (ఓ ప్రవక్తా!) నీప్రభువు ఇట్లు ప్రకటించెను: "(ఇస్రాయీలీయులు తమ దుష్టమార్గములను విడిచిపెట్టనిచో) ప్రళయకాలము వరకు వారిని నీచులుగచేసి ఉంచు జాతులకు వారిపై అధికారము నిత్తును. వారిని కఠినముగ శిక్షింతును."౧౬౨

వాస్తవమేమనగా నీప్రభువు శిక్షించుటలో ఆలసించువాడుకాడు ఐనను (పశ్చాత్తప్తులైనవారిని క్షమించి కరుణించును.) భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

168. వారిని మేము వేరువేరు తెగలుగ విభజించివైచితిమి. వారిలో కొందరు మంచివారు, కొందరు చెడ్డవారు. వారికి మేము దుస్థితినికూడ కలిగించి పరీక్షించితిమి. దానివల్ల వారు దౌష్ట్యమును విడిచిపెట్టుదు రేమోనని.

169. వారి తరువాత జ్ఞానగ్రంథమును వారసత్వముతో పొందిన ఒక దుర్జాతివచ్చెను. వారు తుచ్ఛజీవితమునందు లభించు నశ్వరమగు మంచిమాత్రమే గ్రహించి ఇట్లుచెప్పిరి: "భగవంతుడు దీనికై మమ్ము క్షమించును." ఇదేవిధముగ వారి కెక్కడినుండి లాభమువచ్చినను (అది ఎంత అధర్మమార్గముననైననుసరే) గ్రహింతురు. భగవంతునిగూర్చి సత్యముతప్ప మరొకటి చెప్పకూడదని మీకడ జ్ఞానగ్రంథములో భగవంతుడు వాగ్దానము తీసికొనలేదా? వారు జ్ఞానగ్రంథమును చదివిరికూడ. భగవద్భీతిపరులకు పరలోకవాసమే ఉత్తమమైనది. మీకింతమాత్ర మర్థముకాదా?

170. ఎవరు జ్ఞానగ్రంథమును దృఢముగ చేపట్టి భగవత్ప్రార్థనా నిమగ్నులై యుందురో నిశ్చయముగ అట్టి సత్పురుషుల సుకృతిని వ్యర్థపుచ్చము.

171. మేమప్పుడు ఆ పర్వతములో కంపము కలిగించినప్పుడు వారిపై అది కదులుచున్న కప్పువలెనుండును. అది వారిపై వచ్చిపడునని వారనుకొనిరి. అప్పుడు వారి కిట్లాజ్ఞాపించితిని: "మీ కిచ్చిన జ్ఞానగ్రంథమును స్థిరముగ చేపట్టుడు. అందలి ఉపదేశము ననుసరింపుడు. అప్పుడు మీరు చెడుగునుండి తప్పియుండగలరు."

ఇరువదిరెండవ ఖండము

172. (ఓ ప్రవక్తా! వారికాదినము జ్ఞప్తికితెమ్ము). అప్పుడు నీప్రభువు మానవులతో, వారి తరతరములనుండి ఒడంబడిక గావించుకొనెను. దానికి వారినే సాక్షులుగ నిల్పితిని. అప్పుడు వారినిట్లడిగితిని:

"నేను మీ ప్రభువునేనా?"

వారందరిట్లనిరి: "ఔను. మేము దీనికి సాక్షులము." తుదిదినము నాడు ఇదంతయు మాకు తెలియదనికాని,

173. లేక "ప్రభూ! దైవేతరులను దైవములుగ చేసి పూజించినది మాతాత తండ్రులు. మేము వారితరువాత పుట్టినవారము. (అందుచే వేరుగతిలేక వారి సంప్రదాయమును, వారి ఆచార వ్యవహారములను) మేమనుసరించితిమి. దుర్మార్గమున నడచినవారి ప్రవర్తనకు మరి మమ్ము శిక్షింతువా?" అని అందురనియు మేమిట్లు చేసితిమి.

174. వారు సన్మార్గమునకు మరలుదురేమోనని ఈ విధముగ మా సందేశములను స్పష్టపరుతుము.

175. (ఓ ప్రవక్తా!) వీరికి ఆ వ్యక్తినిగూర్చి చెప్పుము: అతనికి మేము మా సందేశము నిచ్చితిమి. అతడు దానియెడ విముఖతను చూపెను. సైతాను అతని నాక్రమించెను. అతడు నశించెను.

176. మేము తలచినచో అతనికి ఈ సందేశముద్వారా అత్యున్నతి నొసర్చియుందుము. కాని అతడు నైచ్యమువైపున కొరిగెను. విషయలోలు డయ్యెను. అతనిగుణము కుక్కవంటిది. కష్టపడినప్పుడు అది వగర్చుచు నాలుక వ్రేలాడదీయును. ఏమియు చేయనప్పుడును కూడ అది అట్లేచేయును. మా మహత్వమును అసత్యపరచినవారి కిదే ఉదాహరణము. ఓ ప్రవక్తా! ఈ కథలు ప్రజలకు వినిపింపుము. వారు ఆలోచింతురేమో!

177. మా సందేశములను నిరాకరించి ఆత్మద్రోహము చేసికొనిన వీరిపోలిక ఎంత దుష్టమైనది!

178. ఎవరిని భగవంతుడు సన్మార్గమున నడిపించునో అతడే సన్మార్గగామి. ఎవరిని పాపములో విడిచిపెట్టునో వారే భ్రష్టులు.

179. మేము నిశ్చయముగ అనేక మానవులను భూతములను నరకమునకై సృజించితిమి. వారికి బుద్ధికలదు; కాని దానితో వారు వివేచనచేయరు. వారికి కన్నులుకలవు; కాని వానితో చూడరు. చెవులు కలవు; కాని వినరు. వారు పశుసమానులైరి; అంతకంటె అధములు కూడ. వారు నిశ్చయముగ తమ్ముతాము మరచినవారు.

180. భగవంతునకు అత్యుత్తమమగు అనేక నామములు కలవు. ఆ నామములతో భగవంతుని స్మరింపుము. ఎవరు భగవన్నామముల పావిత్ర్యమును పోగొట్టుదురో వారిని విడిచిపెట్టుము. వారు చేసినదానికి ప్రతిఫలము వారికి లభించును.

181. మేము సృష్టించిన మానవజాతిలో కొంతమంది సన్మార్గమును చూపువారై ధర్మమును ప్రవర్తింపజేయువారు కలరు.

ఇరువదిమూడవ ఖండము

182. మా సందేశమును నిరాకరించినవారిని క్రమక్రమముగ పతనమువైపుకు లాగుదుము; వారికది తెలియదు.

183. వారికొక గడువునొసగుదుము. నిశ్చయముగ నా పద్ధతి వివేక పూర్ణము.

184. వారి ఈ ప్రవక్త మతిచాంచల్యము నొందినవాడని వారనుకొనుచున్నారా? అతడు కేవలము మిమ్ములను హెచ్చరించువాడు మాత్రమే.

185. వారు భగవంతుడు సృష్టించిన భూమ్యాకాశముల సమస్త సామ్రాజ్యమును చూడరా? దానినిగూర్చి యోచింపరా? (వారిట్లే సత్యశత్రువులై ప్రవర్తించినచో) వారిపై త్వరలో ప్రళయము వచ్చిపడునని ఆలోచింపరా? (ఇంత స్పష్టమును సరళమును అగు) ఈ సందేశమును నమ్మనిచో మరియే యితరసందేశమును వారు విశ్వసింపగలరు?

186. భగవంతుడే యెవరిని దౌష్ట్యమున విడిచిపుచ్చెనో వారి నెవరు సన్మార్గమునకు త్రిప్పజాలుదురు? వారినతడే దౌష్ట్యమున అంధులై, దారితెన్ను తెలియక తిరుగునట్లు చేయును.

187. ప్రళయఘడియ ఎప్పుడువచ్చును అని వారు నిన్నడుగుదురు. వారితో ఇట్లుచెప్పుము: ఇది నా ప్రభువునకే తెలియును. దానికాలము వచ్చినప్పుడు భగవంతుడుతప్ప మరెవ్వరును దానిని కలిగింపలేరు. అది ఆకాశమునందును భూమియందును ఒక అపూర్వసంఘటనమై యుండును. అది హఠాత్తుగ సంఘటిల్లును.

ఓ ప్రవక్తా! నీవేదో ఆ దినమునుగూర్చి పరిశోధన సల్పుచున్నట్లుగ నిన్నడుగుచున్నారు. వారితో ఇట్లు చెప్పుము: "అది భగవంతునికే తెలియును. కాని ఈ విషయము పలువురెఱుగరు."

188. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: నాకుసైతము కలుగు లాభనష్టములపై నేను వశములేనివాడను. అదంతయు భగవదిచ్ఛలో కలదు. గుప్తమైయున్న సర్వ విశ్వరహస్యమును నాకు తెలిసియుండినచో నాకు సమస్తశుభములు కలిగెడివి. ఎట్టికష్టములును నన్ను స్పృశించెడివికావు. కాని (నేను మానవుడను.) దుర్మార్గమునుండి మానవుల తప్పించుటకై వారిని హెచ్చరించువాడను మాత్రము నేను. విశ్వాసవంతులగువారికి శుభవార్త నిచ్చువాడను."

ఇరువదినాల్గవ ఖండము

189. ఒకే ప్రాణినుండి మిమ్ముపుట్టించి, మీనుండియే మీజతను కల్పించి, ఆమెయెడ మీకు ప్రేమను కలిగించినది భగవంతుడే. పురుషుడు స్త్రీని కామించినప్పుడు స్త్రీ గర్భవతియగును. గర్భము తొలుదొల్త తేలికగను, క్రమక్రమముగ బరువుగను ఉండును. (ప్రసవకాలము వచ్చునప్పటికి) స్త్రీ పురుషు లిద్దరుకలిసి తమ ప్రభువగు భగవంతు నిట్లు ప్రార్థింతురు: "ప్రభూ! మాకు సత్పుత్రుని ప్రసాదింపుము. నిశ్చయముగ మేము కృతజ్ఞులమై యుందుము."

190. భగవంతుడు వారికొక సత్పుత్రు నిచ్చినప్పుడు వారు దైవేతరులగు ఇతరులు ఆ అనుగ్రహ ప్రదానములో భాగస్వాములుగ భావింతురు. వీరు కల్పించు ఈ కృతకదైవములకంటె భగవంతు డత్యున్నతుడు.

191. వారి ఈ కృతకదైవతములు దేనిని సృష్టింపగలవు? అవి స్వయముగ సృష్టింపబడినవి కదా?

192. అవి వారికి సహాయమెట్లు చేయగలవు? స్వయముగ తమకు తాము సహాయము చేసికొనలేవుకదా?

193. మాకు దారిచూపుము అని మీరు వానిని పిలిచినచో అవి మిమ్మనుసరింప లేవుకదా? మీరు వానిని ప్రార్థించినను ఊరకొన్నను ఒకటే.

194. మీరు వేనిని దైవములుగ యెంచి ప్రార్థించుచున్నారో అవి మీవలెనే సమస్త ప్రకృతి నియమములకు లొంగియున్నవి. సరే! మీరు వానిని పిలువుడు. మీరు సత్యపరులే యైనచో వారిని ప్రత్యుత్తర మివ్వనిండు.

195. వాటికి నడచుటకు కాళ్లున్నవా? పట్టుకొనుటకు చేతులున్నవా? చూచుటకు కళ్ళున్నవా? వినుటకు చెవులున్నవా?

(ఓ ప్రవక్తా: వారితో ఇట్లు) చెప్పుము: "మీ కృతకదైవములను పిలువుడు. నాకు వ్యతిరేకముగ వారి సహాయముతో మీకు చేతనైనదంతయు చేయుడు. నా కెంతమాత్రము గడువియ్యకుడు.

196. నా సంరక్షకుడు ఈ జ్ఞానగ్రంథమును ప్రసాదించిన భగవంతుడు. సత్పురుషులకే అతడు మిత్రుడు.

197. మీరు కల్పించుకొని ప్రార్థించుచున్న ఈ దైవతములు మీకు సహాయము చేయలేకపోవుట అటుండగా స్వయముగ తమకు తాము సహాయము చేసికొనలేవు.

198. మీరు దారిచూపుమని వారిని పిలిచినచో వారికది వినపడదు. వానికండ్లు మీపైనున్నను అవి మిమ్ము చూడలేవు.

199. (అట్టి జడమును, కృతకమును అగు విగ్రహములను ఆశ్రయించి ఏల పతితులగుదుర? భగవంతుడు క్షమాపూర్ణుడు. అందుచే పశ్చాత్తప్తులై) క్షమార్పణమును వేడుకొనుడు. మీ తోడివారలకు సన్మార్గమును చూపి అజ్ఞానులనుండి దూరముగ నుండుడు.

200. ఓ ప్రవక్తా! సైతాను కలిగించిన అపవాదము ఏదైన నీ హృదయమును మథనపెట్టినచో భగవదాశ్రియమును పొందుము. నిశ్చయముగ భగవంతుడు సర్వమును వినువాడు; సర్వము తెలిసినవాడు.

201. ఎవరు భగవద్భీతిపరులో వారిలో సైతాను ఏదేని దుష్టభావములను కలిగించినప్పుడు వారు వెంటనే జాగ్రతపడుదురు. (భగవదనుగ్రిహముచే) వారు తిరిగి కన్ను తెరతురు.

202. కాని సైతాను సహోదరులైనవారు వారిని దౌర్భాగ్యములోనికి ఈడ్చుకొనిపోవుదురు. అందెంతమాత్రము వారు వెనుకడుగు వేయరు.

203. (ఓ ప్రవక్తా!) వారికడకు నీవేదైన మహాత్మ్యమును తీసికొని పోవేని వారిట్లందురు: "మీరేల ఏదేనొక మహాత్మ్యమును చూపరు? మహాత్మ్యమును ప్రసాదింపుమని భగవంతునేల కోరరు?" వారితో ఇట్లు చెప్పుము: "నా ప్రిభువు నాకు పంపినదానిని నేననుసరింతును. ఈ జ్ఞానగ్రంథములో మీ ప్రిభువుకడనుండి మేము పలుకుచున్న సత్యమునకు స్పష్టమైన నిదర్శనములు కలవు. ఇది విశ్వాసవంతులగువారికి మార్గదర్శకము; భగవంతుడు వారికి ప్రిసాదించిన అనుగ్రహము.

204. (ఓ విశ్వాసవంతులారా!) ఖురాను చదువుచున్నప్పుడు దానిని శ్రిద్ధతో వినుడు. నిశ్శబ్దముగ నుండుడు. భగవంతుడు మిమ్ము కరుణించును.

205. ప్రాతఃకాలముననుసాయంసమయముననుభగవంతుని భయ వినయములతో మెల్లగ స్మరింపుడు. ఉపేక్ష వహింపకుడు.

206. ఎవరు భగవంతునకు సమీపస్థులో వారు భగవంతుని సేవించుటలో గర్వమును చూపరు. వారు భగవంతునిస్తుతించుచు అతని మోలి వినయముతో సాష్టాంగపడుదురు.

بسم الله الرحمن الرحيم

అధ్యాయము ౮

లాభములు

(అల్ అన్ ఫాల్)

(మదీనాలో అవతరించినది.)

(10 ఖండములు — 75 సూక్తములు)

కరుణామయుడును వరప్రదాయకుడును అగు అల్లాః నామస్మరణముతో (ప్రారంభించుచున్నాను.)

మొదటి ఖండము

1. (ఓ ప్రవక్తా!) యుద్ధారమును*గూర్చి వారు నిన్నడుగుదురు. వారితో ఇట్లు చెప్పుము: "లాభములు భగవంతుని కొరకును ప్రవక్త కొరకును మాత్రమే. అందుచే మీరు విశ్వాసవంతులే యైనచో (ఆ విషయములో వివాదపడక) భగవంతునకు భయపడుడు. మీరు పరస్పరము సమాధానపడి సామరస్యము కలిగించుకొనుడు. భగవంతుని, ప్రవక్తను సేవించుటలో ఆసక్తులు కండు.

2. భగవంతుని నామము స్మరింపబడిన వెంటనే భయభక్తిపూర్ణ హృదయులైనవారే విశ్వాసవంతులు. భగవత్సందేశములు వినినప్పుడు వారివిశ్వాసము హెచ్చును. వారు తమభగవంతునే నమ్ముకొనియుందురు.

3. వారు భగవత్ప్రార్థనము సల్పుటలో నిష్ఠాపరులై యుందురు. మేము వారికిచ్చిన (ధనధాన్యములనుండి) ఖర్చుపెట్టుదురు.

* యుద్ధగంగమున లభించిన ధన వస్తు సామగ్రి యుద్ధార మనబడును.

4. వీరే సత్యమునందు నమ్మకము కలవారు. భగవంతుడు వారికి ఉన్నతమైన స్థానముల నిచ్చును. వారి తప్పిదములను క్షమించును. వారికి గౌరవప్రదమైన జీవనము కలిగించును.

5. విశ్వాసవంతుల ఒకపక్షము ఇష్టపడకపోయినను మీ ప్రభువు మిమ్ము సత్యముకొరకు ఇల్లువిడిచి పోవునట్లు చేసెను.

6. వారు సత్యమునుగూర్చి మీతో వివాదపడసాగిరి. అప్పటికే అది స్పష్టమాయెను. వారు మృత్యుముఖములో వెళ్లుచున్న వారివలెను, తమకన్నులతో తమ మృత్యువును చూచుచున్న వారివలెను ప్రవర్తించిరి.

7. (ఓ విశ్వాసవంతులారా!) శత్రువుయొక్క రెండుపక్షములలో ఏదో ఒక పక్షము మీకు చిక్కునని భగవంతుడు మీకు వాగ్దానము చేసియుండెను. యుద్ధముచేయుటకు శక్తిలేని నిరాయుధమగు పక్షము మీకు చిక్కవలెనని మీరు కోరిరి. మీకిచ్చిన వాగ్దానమూలమున సత్యమును నిరూపించి, సత్యమునకు శత్రువులైన వీరిని సమూలముగ నశింపజేయుట భగవంతుడు కోరెను;

8. ఎందుకనగా సత్యమును సత్యముచేసి చూపెట్టుటకును, అసత్యమును అసత్యముగ నిరూపించుటకును. కాని దుష్టులగు వీరు దాని కిష్టపడరైరి.

9. జ్ఞాపకముంచుకొనుము: భగవంతుని సహాయము నీవర్థించునప్పుడు, భగవంతుడు నీకిట్లు ప్రత్యుత్తరమిచ్చెను: "నీ కొకరివెంబడి ఒకరు వెయ్యిమంది దేవదూతల సహాయము నిత్తును."

10. భగవంతుడు నీ హృదయము నిశ్చింతమై యుండుటకై నీకీ శుభవార్త నిచ్చెను. విజయము భగవంతునికడ నుండియే వచ్చును. భగవంతుడు సర్వశక్తిమంతుడు; సర్వజ్ఞుడు.

రెండవ ఖండము

11. నీకు మనశ్శాంతి, నిర్భీతి, కలిగించుటకు భగవంతుడు నీకు ప్రశాంతి కలుగజేసెను. మీరు పరిశుద్ధులగుటకు, సైతాను మీలో కలిగించిన నిస్పృహయొక్క అపరిశుద్ధతను తొలగించుటకును వర్షము కురిపించెను. మీ హృదయములను దిట్టపరచుటకును, మీ పాదములను స్థిరపరచుటకును అట్లు చేసితిని.

12. (ఓ ప్రవక్తా!) ఆ సమయమున నీప్రభువు దేవదూతలకిట్లు సెలవిచ్చెను: "నేను మీతో ఉన్నాను. విశ్వాసవంతులను సుస్థిరచిత్తుల గొనర్పుడు. త్వరలో అవిశ్వాసుల హృదయములలో విశ్వాసులయెడ భీతిగొల్పుదును."

"(ఓ విశ్వాసవంతులారా! మీ శత్రువులగు విశ్వాసహీనులు మీతో యుద్ధమునకు పూనుకొనినప్పుడు) వారి కంఠములపై వ్రేయుడు; వారి కాలుసేతుల వ్రేళ్ళను తెగనరకుడు."

13. ఎందుకనగా వారు భగవంతునకును, ప్రవక్తకును వ్యతిరేకముగ ప్రవర్తించిరి. ఎవరు భగవంతునకును అతని ప్రవక్తకును వ్యతిరేకముగ ప్రవర్తింతురో (వారికిది శిక్ష.) నిశ్చయముగ భగవంతుడు పాపకర్ములను శిక్షించుటలో కఠినుడు.౧౬౪

14. (ఓ విశ్వాసహీనులారా!) ఇది మీకు శిక్ష. మరి దాని రుచి చూడుడు. సత్యమును నిరాకరించిన వారికి నరకాగ్నియొక్క బాధకూడ రానున్నదని తెలిసికొనుడు.

15. ఓ విశ్వాసవంతులారా! అవిశ్వాసుల సైన్యముతో మీరు ముఖాముఖి కావలసి వచ్చినప్పుడు వారికి వెనుజూపకుడు.

16. అట్టి సందర్భములో ఎవడు వెనుజూపునో వాడు భగవదాగ్రహమునకు పాత్రుడైనవాడు. అతనినివాసము నరకము. అది యెంతటి

దుష్టనివాసము! ఒకసారి అవసరమునుబట్టి వెనుకకు తగ్గినను, మర్యొక సైన్యమునకు తోడుగ వెళ్ళినను అది చెడ్డదికాదు.

17. (ఓ విశ్వాసవంతులారా! యుద్ధములో) వారిని చంపినది మీరుకాదు. భగవంతుడు వారిని చంపెను. మీరు కొట్టినది మీ దెబ్బ కాదు. కొట్టినది భగవంతుడు. విశ్వాసవంతులకు పరీక్షార్థమై ఇది కల్పించెను. భగవంతుడు సర్వము నెరిగినవాడు. భగవంతుడు సర్వము వినువాడు; సర్వము తెలిసినవాడు.

18. ఇది ఈ విధముగ జరిగినది. (జ్ఞాపకముంచుకొనుడు): అవిశ్వాసుల రహస్యతంత్రములను భగవంతుడు నిర్వీర్య మొనర్చును.

19. (అవిశ్వాసులారా!) మీరు విజయముకొరకును, తీర్పుకొరకును ప్రార్థించిరి. ఇప్పుడు తీర్పును మీరు ప్రత్యక్షముగ చూచితిరికదా! ఇప్పుడైనను మీరు దౌర్మార్గ్యమును మానినచో మీకొరకది అత్యుత్తమమైనది. అట్లుకాక తిరిగి మీరు కయ్యమునకు కాలుదువ్వినచో మేముకూడ అట్లేచేయుదుము. మీ సైన్యములు ఎంతపెంచినను అవి మీకు ఎంతమాత్రము సహాయకారులు కాజాలవు. ఎందుకన నిశ్చయముగ భగవంతుడు విశ్వాసవంతులతో నున్నాడు.

మూడవ ఖండము

20. ఓ విశ్వాసవంతులారా! భగవంతునకును, అతని ప్రవక్తకును విధేయులై యుండుడు. సత్యముయొక్క పిలుపు వినుచుండికూడ మీరు అతనియెడ విముఖత చూపకుడు.

21. "మేము విందుము," అనిచెప్పి విముఖులైన వారివలె కాకుడు.

22. భగవంతుని దృష్టిలో బుద్ధిహీనులై, బధిరులై, మూకలై, యుండువారే అధమాధమమైన పశువులు.

23. వారిలో ఏకొద్ది మంచియున్నను, భగవంతుడు వారికి విను శక్తి నిచ్చియుండెడివాడు. వారికొకసారి సత్యసందేశము వినిపించినను వారు ముఖము త్రిప్పుకొందురు. ఎందుకన వారు దానియెడ విముఖులై యున్నారు.

24. ఓ విశ్వాసవంతులారా! భగవంతుడును అతని ప్రవక్తయు మిమ్ము పిలిచినప్పుడు మీరు దానికి జవాబిండు. మిమ్ము (ఆధ్యాత్మిక మృతినుండి) సజీవుల నొనర్చును. ఒక్కొక్కప్పుడు భగవంతుడు మనుష్యునకును అతని హృదయమునకును మధ్య నిలుచును. జ్ఞాపకముంచుకొనుడు. మీరతని సమక్షముననే కూడవలసి యున్నది.

25. ఏ ఆపద ఒకసారి సంభవించినయెడల కేవలము దుష్టులనే కాక అందరినికూడ బాధించునో అట్టి విపత్తునకు భయపడుడు. భగవంతుడు శిక్షించుటలో కఠినుడని తెలిసికొనుడు.

26. జ్ఞాపకముంచుకొనుడు. మీరొకప్పు డత్యల్పసంఖ్యాకులై యుండిరి. దేశములో మిక్కిలి బలహీనులుగ పరిగణింపబడుచుండిరి. మిమ్ము మీ శత్రువులు బలవంతముగ ఎత్తుకొని పోవుదురని మీరు భయపడుచుండిరి. మీరు కృతజ్ఞులగుదురని అప్పుడు భగవంతుడు మీకాశ్రయమిచ్చి, తనసహాయముతో మిమ్ము శక్తివంతులనొనర్చి, శ్రేష్ఠమైన పదార్థములను మీకొసగెను.

27. ఓ విశ్వాసవంతులారా! భగవంతుని యెడలను, అతని ప్రవక్తయెడలను కృతఘ్నులుకాకుడు. మీకు నమ్మి ఒప్పగించిన వాటియెడ కూడ అవిశ్వాసముతో ప్రవర్తింపకుడు. అట్లుచేయుట దుష్టమని మీకు తెలియునుకదా?

28. మీ ఆస్తులు, మీ సంతానము మీకు మనోవికార హేతువులని జ్ఞాపకముంచుకొనుడు. భగవంతునికడనే అత్యుత్తమమగు బహుమానమున్నదని తెలిసికొనుడు.

నాలుగవ ఖండము

29. ఓ విశ్వాసవంతులారా! మీరు భగవద్భీతిపరులై యుండినచో భగవంతుడు మీకు ఉచితానుచితజ్ఞానమును ప్రసాదించును. మీ తప్పిదములను తొలగించును. మిమ్ము క్షమించును. భగవంతుడు అఖండ దయాపూర్ణుడు.౧౬౬

30. అవిశ్వాసవంతులు మీకు వ్యతిరేకముగ కుట్రలుపన్ని మిమ్ము బంధించికాని, లేక చంపికాని, లేక పట్టణమునుండి వెడలగొట్టికాని (మీ సంస్కారోద్యమమును అంతమొందింపజూచిరి.) వారు కుట్రలు పన్నిరి. భగవంతుడు వారికుట్రల నెఱుగునుగాన దానికి ప్రతిక్రియ చేసెను. భగవంతుడు దుష్టుల సర్వమాయోపాయములను తెలిసినవాడు.

31. మా సందేశము వారికి వినిపింపబడినప్పుడు వారిట్లందురు: "మేము నిశ్చయముగ వింటిమి. మేము తలచినచో దానికి సమానమైన దానిని చెప్పగలము. ఇందు ప్రాచీనుల గాథలుతప్ప మరేమియు లేవు."

32. (ఓ ప్రవక్తా!) అవిశ్వాసవంతులు ఇట్లు ప్రార్థించిరి: "దేవా! ఈ సందేశము నిజముగ నీకడనుండి వచ్చిన సత్యమేయైనచో మాపై శిలావర్షము కురిపింపుము. అట్లుకాదేని మరే కఠినమైన శిక్షనైనను ఇమ్ము."

33. కాని నీవు వారితోనుండగా వారికిట్టిశిక్షను భగవంతుడివ్వ దలచుకొనలేదు. వారు క్షమార్పణము వేడనుండగా భగవంతుడు వారిని శిక్షింపడు.

34. కాని (దౌష్ట్యమును వదలక క్షమార్పణము వేడిన నేమిలాభము? వారిదౌష్ట్యము దినదినాభివృద్ధి యగుచున్నది.) ఇప్పుడు వారిని శిక్షించుట కభ్యంతరమేమున్నది? వారు పవిత్ర ప్రార్థనాలయములోనికి భక్తులను వెళ్ళనిచ్చుటలేదుకదా? వారు దానికి ధర్మకర్తలు కాజాలరు. సన్మార్గప్రవర్తకులే దానికి ధర్మకర్తలగుట కర్హులు. కాని పల్వురకది తెలియదు.

35. వారు తమ ప్రార్థనాలయములందు ఈలలు వేయుటయు, చప్పట్లు చరచుటయేకదా చేయునది? దానినే వారు ప్రార్థనమందురు. మీరుచేసిన సత్యనిరాకరణమునకు శిక్ష ననుభవించుడు.౧౬౭

36. భగవన్మార్గమున ఆటంకములు కల్గించుటకై విశ్వాసహీనులు తమధనమును వెచ్చించుచున్నారు. వారు దీనితర్వాతకూడ వ్యయపరతురు. కాని వారి ఈ వ్యయము వారికి పశ్చాత్తాపకారణ మగును.

విశ్వాసహీనులు నరకాగ్నికి మరలింపబడుదురు.

37. ఎందుకన భగవంతుడు అపరిశుద్ధులను పరిశుద్ధులను ఒకరినుండి యొకరిని వేరుపరచును. అపరిశుద్ధులను అపరిశుద్ధులతో కూర్చును. వారందరి నొకచో కూర్చి నరకమున కొప్పజెప్పును. వీరొకేసారి వినాశ మొందుదురు.

ఐదవ ఖండము

38. (ఓ ప్రవక్తా!) విశ్వాసహీనులతో ఇట్లు చెప్పుము: వారు దౌర్మార్గ్యమును విడిచినచో వారి పూర్వపాపములు క్షమింపబడును. అట్లుకాక వారు దౌష్ట్యమునకే మరలినచో పూర్వులకు జరిగినదేదో అప్పుడే సంభవించినది.

39. దౌష్ట్యము, దౌర్జన్యము అణుగువరకు వారితో పోరాడుము. ధర్మము సంపూర్ణముగ భగవద్ధర్మము (అగునంతవరకు పోరాడుము.) వారు దౌర్జన్యము మానుకొనినచో నిశ్చయముగ వారు చేయుచున్న సమస్త కార్యములను భగవంతుడు చూచుచునే యున్నాడు.

40. వారు శాంతిమార్గమునకు విముఖత చూపినచో (ఓ ప్రవక్తా! నీవు విచారపడకుము.) భగవంతుడు నీకు పోషకుడు. నీ పోషకుడత్యుత్తముడు. నీ సహాయకుడు పరమోత్తముడు.

పదవ భాగము

41. ఇట్లు తెలిసికొనబడుగాక! యుద్ధములో వచ్చిన లాభములో ఐదవభాగము భగవంతునికొరకును, ప్రవక్తకొరకును, (ప్రవక్త) బంధు పరివారమునకును, తల్లితండ్రులులేని పిల్లలకును, నిరుపేదలకును, బాటసారులకును, (చెందుగాక!) (మిగిలినది యుద్ధభటులలో సమానముగ పంచిపెట్టబడుగాక!) మీరు భగవంతునియందును, మా సేవకునకు ప్రోక్తమైన జ్ఞానగ్రంథమునందును, రెండుపక్షములు ముఖాముఖియైన ఆనాటియందును విశ్వసించినచో (పై విధముగ ప్రవర్తింపుడు.) భగవంతునకు సమస్త వస్తువులపైనను అధికారము కలదు.౧౬౮

42. అప్పుడు మీరు (లోయయొక్క) దగ్గరికొనయం దుండిరి. వారు దూరపుకొనయం దుండిరి. బిడారము మీకు క్రిందిభాగమున నుండెను. మీరు యుద్ధముచేయుటకు నిశ్చయించుకొనియుండిరేని తప్పక ఆ నిశ్చయమునుండి మీరు మరలువారే. (ఎందుకన శత్రువు మీకంటె బహుగుణమగు సైన్యము కలిగియుండెను.) కాని భగవంతుడు ఒక జరుగవలసిన కార్యమును జరుగునట్లు చేయుటకును, వినాశము పొందవలసినవారు స్పష్టమైన నిదర్శనముతో నశించునట్లు చేయుటకును, అదేవిధముగ సజీవులుగ ఉండవలసినవారు విస్పష్ట నిదర్శనముతో విజయులై బ్రతుకునట్లు చేయుటకును (ఆ రెండు సేనలను ముఖాముఖి యొనర్చెను.) భగవంతుడు సర్వమును వినువాడు; సర్వమును తెలిసినవాడు.

43. (ఓ ప్రవక్తా!) భగవంతుడు స్వప్నములో నీకు వారిసంఖ్యను తగ్గించి చూపెను. వారిని హెచ్చించి చూపియుండినచో, (ఓ విశ్వాసవంతులారా!) మీరు తప్పక ధైర్యము కోలుపోయి, మీ కర్తవ్యమును గూర్చి వివాదపడి యుందురు. భగవంతుడు మిమ్ము దానినుండి రక్షించుకొనెను. జ్ఞాపకముంచుకొనుడు. మానవుని హృదయములో గుప్తమైయున్న సమస్త భావములను భగవంతు డెఱుగును.

44. మీ ఇరుపక్షముల వారును ముఖాముఖి యైనప్పుడు శత్రుసైన్యము మీ దృష్టిలో అత్యల్పముగ కన్పించునట్లు భగవంతు డొనర్చెను. ఎందుకన కావలసినదానిని చేసి చూపెట్టవలెనని భగవదుద్దేశము. సమస్త కార్యభారమును భగవదాధారము నాశ్రయించియున్నది

ఆరవ ఖండము

45. ఓ విశ్వాసవంతులారా! మీరు మీ శత్రుమూక నొకదానిని కలిసినప్పుడు సుస్థిరులై యుండుడు. భగవంతుని స్మరింపుడు. మీరు విజయవంతు లగుదురు.

46. భగవంతునకును, అతని ప్రవక్తకును విధేయులై యుండుడు. కలహింపకుడు. (పరస్పరము కలహించుకొంటిరా) మీరు దుర్బలహృదయు లగుదురు. మీశక్తి నశించును. ఓర్పు వహింపుడు. ఓర్పు వహించినవారితో భగవంతుడున్నాడు.

47. భగవన్మార్గమునుండి ప్రజలను తొలగించుటకై గర్వముతో ఆడంబరముగ లోకమునకు చూపుటకు తమ ఇండ్లనుండి యుద్ధార్థము బయలు దేరిన అవిశ్వాసులవలె కాకుడు. వారుచేయు సమస్తమును భగవంతు డెరుగును.

48. వారి పాపకృత్యము లాకర్షవంతముగ కన్పించునట్లు సైతాను చేసెను. సైతాను వారితో ఇట్లు చెప్పెను: "మీకు నేను బాసటయై యుండగా మానవులలో ఎవ్వరును మిమ్మోడింపజాలరు." కాని ఆ రెండు సైన్యములు ఒకదానినొకటి ఎదుర్కొనినప్పుడు వాడు పలాయితుడై ఇట్లుచెప్పెను: "చూడుడు. నాతో మీకెట్టి జోక్యమును లేదు. మీరు

చూడజాలనిది నేను చూచుచున్నాను. నేను భగవంతునకు భయపడు
చున్నాను. ఎందుకన, శిక్షించుటలో భగవంతుడు నిష్ఠురుడు."

ఏడవ ఖండము

49. వంచకులును, హృదయమునందవిశ్వాసరోగము కలవా
రును ఇట్లందురు: "వీరిని వీరిధర్మము మోసపుచ్చినది." (ఓ విశ్వాసవంతు
లారా!) ఎవరు భగవంతుని నమ్ముకొనియుందురో (వారికే విజయము
కలుగును.) భగవంతుడు సర్వ శక్తిమంతుడు; సర్వజ్ఞుడు.

50. మరణకాలమున దేవదూతలు అవిశ్వాసుల ఆత్మలను ఎట్లు
హరించునదియు, వారి ముఖములపైనను, వీపులపైనను ఎట్లుకొట్టునదియు
"మండుచున్న నరకాగ్ని శిక్షను చవిచూడుడు" అని ఎట్లు చెప్పునదియు
నీవు చూచియుండినచో (వీరికెట్టి దుర్గతి ప్రాప్తింప నున్నదో నీకు తెలిసి
యుండును.)

51. (మృత్యుకింకరులు మరియు నిట్లనిరి): "మీరు స్వయముగ
చేతులతో చేసికొనినదాని ఫలమిది. భగవంతుడు తనసేవకుల కన్యాయ
మొనర్పడు.

52. మీరు చేసినపనులు ఫిర్ జౌన్ జాతియు, అంతకు ముందు
ఉండి నాశనమైన జాతులును చేసిన పనుల (వంటివి.) వారుకూడ మీ
వలెనే భగవత్సందేశమును నిరాకరించిరి. భగవంతుడు వారి పాపము
లకై వారిని నశింపజేసెను. భగవంతుడు సర్వబలయుతుడు, శిక్షించు
టలో నిష్ఠురుడు.

53. వారు స్వయముగ తమ స్థితిగతులను మార్చుకొనిననే తప్ప
భగవంతుడు ఒకజాతికి తాను ప్రసాదించిన అనుగ్రహమును ఎన్నడును,
ఆగ్రహముగ మార్చడు. నిశ్చయముగ భగవంతుడు సమస్తమును విను
వాడు; సమస్తమును తెలిసినవాడు.

54. మీరు ఫిర్ జౌన్ జాతియు, అంతకు పూర్వముండిన దుష్ట
జాతులును ప్రవర్తించినట్లు ప్రవర్తించిరి. వారు భగవత్సందేశములను
అసత్యమనిరి. వారి పాపకర్మలకు వారిని నశింపజేసితిని. ఫిర్ జౌన్ ప్రజ
లను నదీగర్భమున ముంచివైచితిని. ఎందుకన వారందరు దుష్టులు,
దుర్జనులునై యుండిరి.

55. ఎవరు భగవంతుని నిరాకరించి, సత్యమును విశ్వసింపరో,
భగవంతునిదృష్టిలో వారే అధమాధమమైన పశువులు.

56. (ఓ ప్రవక్తా!) వీరితో నీవు ఒడంబడిక చేసికొంటివి. కాని
నీవెప్పుడొడంబడిక చేసికొనినను వారు దానిని భగ్నమొనర్చిరి. వారికి
భగవద్భీతిలేదు.

57. యుద్ధములో నీకు వారిపై జయము చేకూరినచో వారివె
నుక నున్నవారినికూడ చెదరగొట్టుము. (దౌష్ట్యమునకు కలుగు దుష్ఫ
లము) అప్పుడు వారికి జ్ఞాపకముండును.

58. నీ శత్రుపక్షము నీకు ద్రోహముచేయునను భయము నీకు
న్నచో వారి యొడంబడికను నీవు వారికే మరలింపుము. అప్పుడు పరిస్థి
తులు సమానమగును. భగవంతుడు ద్రోహము చేయువారిని ప్రేమింపడు.

ఎనిమిదవ ఖండము

59. విశ్వాసవంతులకు పైచేయి యగుదుమని విశ్వాసహీనులు
తలపకుందురుగాక! విశ్వాసవంతులను వారెన్నడును భంగపెట్టజాలరు.

60. (ఓ విశ్వాసవంతులారా!) మీ శక్త్యనుసారము బలమును
సంపాదింపుడు. భగవచ్ఛత్రువులకును, మీ శత్రువులకును అడలుపుట్టు
నట్లు మీరు గుర్రములను, ఇతర పరికరములను చేకూర్చుకొనుడు. మీరు
కాక ఇంకను కొందరు గుప్తశత్రువు లున్నారు. వారిని మీరెరుగరు.
వారిని భగవంతుడెరుగును. భగవన్మార్గములో మీరుచేసిన వ్యయమం
తయు మీకు పూర్తిగ తిరిగి లభించుగాక! మీ కన్యాయము జరుగదు.

61. ఒకసారి శత్రువు సంధిచేసికొనుట కిష్టపడినచో మీరుకూడ సంధిచేసికొనుట కొప్పుకొనుడు. భగవంతునియందు నమ్మకముంచుడు, ఎందుకన అతడొక్కడే సమస్తమును వినువాడు; సమస్తమును తెలిసిన వాడు.

62. వారు (సంధిమిష పెట్టుకొని) నిన్ను మోసగింప జూచినచో నీకు భగవద్రక్షణము చాలును. భగవంతుడే నిన్ను తన సహాయముచే శక్తివంతు నొనర్చెను. నీకు విశ్వాసవంతుల తోడ్పాటు నిచ్చెను.

63. వారి హృదయములలో పరస్పరానురాగము కలిగించెను. భగవంతుడట్లుకావించనేకాని నీవు భూమిలోనున్న సమస్తమును వెచ్చించి యైనను ఇట్టిప్రేమను కల్గించగలిగి యుందువా? భగవంతుడు మహా ఘనుడు; ప్రజ్ఞానిధి.

64. ఓ ప్రవక్తా! నీకొరకును, విశ్వాసవంతులలో నిన్ననుసరించు చున్న వారికిని ఒక్క భగవద్రక్షణము చాలును.

తొమ్మిదవ ఖండము

65. ఓ ప్రవక్తా! విశ్వాసవంతులను యుద్ధమునకు పురికొల్పుము. సహనము పట్టుదల కల మీ ఇరువదిమంది శత్రుపక్షపు రెండువందల మందిని ఓడింపగలరు. వందమంది యున్నచో అవిశ్వాసుల వెయ్యిమంది నోడింపగలరు. ఎందుకన అవిశ్వాసులు బుద్ధిహీనులు.

66. (ఓ విశ్వాసవంతులారా!) ఇప్పుడు భగవంతుడు మీ భార మును తేలికయొనర్చెను. మీదౌర్బల్యము నతడెరుగును. ఐనను మీలో నూరుమంది సహనము, పట్టుదల కలిగియున్నవా రుండినచో వారు రెండువందలమందిని ఓడింపగలరు. వెయ్యిమందిఉన్నచో భగవదాజ్ఞచే రెండువేలమంది నోడింపగలరు. ఎందుకన ఓర్పువహించిన వారితో భగ వంతుడున్నాడు.

67. దేశమంతటను సంపూర్ణవిజయ మైనకాని ఖైదీలను పట్టు కొనుట ప్రవక్తకు తగదు. (ఓ విశ్వాసవంతులారా!) మీకీ ఐహికజీవితపు తుచ్ఛవస్తువులు కావలెనా? భగవంతుడు మీకై పరలోక సుఖమును వాంఛించుచున్నాడు. భగవంతుడు సర్వశక్తి సంపన్నుడు; సర్వజ్ఞుడు.

68. ఇంతకుముందే భగవంతుడు ఆజ్ఞాపించి యుండకపోయినచో మీరు తీసికొనినదానికి భగవంతుడు శిక్షించియుండును.

69. అందుచే యుద్ధములో మీకు లభించిన న్యాయయుతమైన ట్టియు, మంచివియు నగు వస్తువులను తినుడు. భగవంతునకు భయపడుడు. నిశ్చయముగ భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

పదవ ఖండము

70. ఓ ప్రవక్తా! నీ చేజిక్కిన ఖైదీలకిట్లు చెప్పుము: మీ హృద యములలో ఏపాటి మంచియున్నదని భగవంతు డెరిగినను, మీదగ్గర తీసికొనబడిన దానికంటె ఎక్కువ మీకతడిచ్చును. మిమ్ము క్షమించును. భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

71. ఒకసారి నిన్ను వీరు మోసగింపజూచిరేని (దానికి విచారింప పనిలేదు.) ఎందుకన వీరింతకుముందు భగవంతునకే ద్రోహము చేసిన వారు. ఆ పాపమునకు ఫలితముగనే వారిపై నీకు అధికారము నిచ్చి నాను. జ్ఞాపకముంచుకొనుము. భగవంతుడు సమస్తము నెరుగును. అతడు ప్రజ్ఞానిధి.

72. ఎవరు విశ్వసించి (విశ్వాసహీనుల బాధలు పడలేక) వలస పోయిరో, ఎవరు ధర్మముకొరకు ప్రాణధనములతో పోరాడిరో, ఎవరు వీరికి ఆశ్రయమునిచ్చి సహాయముచేసిరో, వీరు ఒకరికొకరు రక్షకులై యున్నారు. ఎవరు విశ్వాసవంతులై నీవు చెప్పినట్లు వలసపో నిరాకరిం చిరో వారట్లు చేయువరకు వారిని రక్షించుబాధ్యత నీపై లేదు. ధర్మము

విషయములో వారు నీసహాయము కోరినచో నిస్సందేహముగ నీవు వారికి సహాయము చేయుదువు. నీవు సంధిఒడంబడిక చేసికొనిన వారి వ్యతిరేకముగ మాత్రము ఏమియు చేయరాదు. నీవు చేయుచున్నదేమియు భగవంతునియెదుట రహస్యముగ లేదు.

73. విశ్వాసహీనులు ఒకరినొకరు సంరక్షించుకొను చున్నారు. మీరుకూడ అట్లుచేయరేని భూమిపై దౌర్జన్యము దౌష్ట్యము పెచ్చు పెరుగును.

74. ఎవరు విశ్వసించి (విశ్వాసహీనుల బాధలు పడలేక) వలస పోయిరో, ఎవరు ధర్మముకొరకు పోరాడిరో, ఎవరు వారికి ఆశ్రయము నిచ్చి సహాయపడిరో నిశ్చయముగ వారందరును విశ్వాసవంతులే. వారి పాపములు క్షమింపబడును. వారికి గౌరవాస్పదమైన అన్న సమృద్ధి కలుగును.

75. ఎవరు తరువాత విశ్వాసవంతులై వలసపోయి ధర్మము కొరకై నీకు బాసటమై నిలిచి పోరాడిరో వారు నీవారే. బాంధవ్యము కలవారు భగవత్ప్రణాళికలో ఒకరికొకరు సన్నిహితులు. భగవంతుడు సర్వమును తెలిసినవాడు.

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

అధ్యాయము ౯

పశ్చాత్తాపము

(తౌబా)

(మదీనాలో అవతరించినది.)

(16 ఖండములు — 129 సూక్తములు)

కరుణామయుడును వరప్రదాయకుడును అగు అల్లాః నామస్మరణముతో (ప్రారంభించుచున్నాను.)

మొదటి ఖండము

1. మీరు పరస్పరము ఒడంబడికలు గావించుకొనిన అవిశ్వాసులకు భగవంతుడును, అతని ప్రవక్తయు సర్వసంధి బాధ్యతల నుండియు ముక్తిని ప్రకటించుచున్నారు.

2. అందుచే నాల్గుమాసముల కాలము దేశములో స్వేచ్ఛగ సంచరింపుడు. (ఎట్టి అభ్యంతరమును లేదు. దీని తరువాత యుద్ధస్థితి ఏర్పడును.) జ్ఞాపక ముంచుకొనుడు. మీరు భగవంతుని ఎన్నడును (మీ అసత్యములచే) భంగపెట్టజాలరు. భగవంతుడు సత్యమును నిరాకరించిన అవిశ్వాసులను (విశ్వాసవంతులద్వారా) అవమాన పరచును.

3. మహాయాత్రా దివసమునాడు భగవంతుడును, అతని ప్రవక్తయు అవిశ్వాసులతో సంధియొడంబడికలు రద్దయినట్లుగా ప్రకటించుచున్నారు. ఇప్పుడైనను మీరు (దౌష్ట్యమును విడిచి) పశ్చాత్తప్తులైనచో అది మీకొరకు అత్యుత్తమము. మీరట్లు చేయనిచో, జ్ఞాపక ముంచుకొనుడు: మీరు భగవంతుని భంగపరుప జాలరు.

(ఓ ప్రవక్తా!) ఎవరు అవిశ్వాసులై యున్నారో వారికి కఠినమైన శిక్ష కలుగునని తెలియజేయుము.

4. మీతో సంధిచేసికొని, సంధిషరతులను చెల్లించుటలో అప్రమత్తులై యుండి, మీకు వ్యతిరేకముగ ఎవరికిని సహాయము చేయక ఉన్నవారి (సంఘులుమాత్రము అమలులో ఉండబడుగాక!) ఎంతకాలమునకు వారితో మీరొడంబడిక చేసికొనిరో అంతకాలమువరకు దాని ప్రకారము నడచుకొనవలెను. ఎవరు ప్రతివిషయమునందును భగవద్భీతితో ప్రవర్తింతురో భగవంతుడు వారినే ప్రేమించును

5. తర్వాత పవిత్రమాసములు గడచినపిదప (యుద్ధస్థితి తిరిగి ఏర్పడును.) అవిశ్వాసులు ఎక్కడ తటస్థించిన అక్కడ వారిని వధింపుడు. ఎక్కడ పట్టుబడిన అక్కడ పట్టుకొనుడు. వారిని ముట్టడింపుడు. ప్రతి మాటునను వారికై పొంచియుండుడు.

వారొకసారి (తమ దౌష్ట్యమును వదలి) పశ్చాత్తప్తులై, భగవత్ప్రార్థనా నిరతులై, దానతత్పరులై యుండగోరినచో వారిని విడిచిపెట్టుడు. నిశ్చయముగ భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

6. (ఓ ప్రవక్తా!) అవిశ్వాసవంతులనుండి యైనను సరే నీకడకు వచ్చి శరణువేడినచో అతని కభయప్రదానమిమ్ము. భగవద్వచనములను వానికి (చక్కగా) వినిపింపుము. తర్వాత అతనిని సురక్షితముగ అతని ఇంటికి చేర్పుము. ఎందుకన వారు సత్యమునెరుగని జాతి.

రెండవ ఖండము

7. అల్లాకును, అతని ప్రవక్తకును ఈ విగ్రహారాధకులతో సంధి ఎట్లుకుదురును? కాని ఎవరు నీతో పవిత్రప్రార్థనాలయముదగ్గర (హుదైబియాలో) ఒడంబడిక చేసికొని (దానిని భంగమొనర్పక యున్నారో వారితోడి సంధిమాటవేరు.) వారెన్నాళ్ళు నీతో (ఈ ఒడంబడికపై) నిలబడుదురో అన్నాళ్ళు మీరుకూడ దానికి బద్ధులై యుండుడు. ఎవరు తమ సమస్త కార్యములందును భగవద్భీతిపరులై యుందురో వారిని భగవంతుడు ప్రేమించును.

8. వారెది పైచెయ్యి యైనప్పుడు వారు చుట్టరికపు మొగమోటమియు చూడరు; ఒడంబడిక షరతులను సరకుచేయరు. అట్టి ఈ విశ్వాసహీనులతోడి ఒడంబడిక ఎట్టి ఒడంబడిక? వారి హృదయము లొప్పుకొనక పోయినను వారు నోటిమాటలతో నిన్ను సంతోషపెట్ట జూతురు. వారిలో పల్వురు దుస్స్వభావులు.

9. వారు భగవదాజ్ఞలను విడిచిపుచ్చి దానికిబదులు స్వల్పమగు (ఐహిక)మూల్యమును గైకొనిరి. (తుచ్ఛమైన ప్రాపంచికలాభము నాశించిరి. భగవత్సందేశమును విశ్వసింపరైరి) భగవన్మార్గమునకు పోగోరువారి నడ్డగించిరి. వీరు చేయుచున్న దెంత దుష్టము.

10. విశ్వాసవంతుని విషయములో వారు చుట్టరికపు మొగమోటమిని చూపరు; ఒడంబడికల షరతులను అనుసరింపరు. వీరు తమ దౌష్ట్యములో సైతము హద్దులను మించినవారు.

11. ఒకసారి వీరు పశ్చాత్తప్తులై (తమ దౌష్ట్యమును విడిచి) భగవత్ప్రార్థనా నిరతులై, దానతత్పరులై సన్మార్గమునకు వచ్చినచో (వారిపై చెయ్యెత్తకుడు.) వారు మీకు ధర్మసోదరులు. వివేకవంతమగు జాతికి ఈ విధముగ మేము మా సందేశములను స్పష్టపరచి చెప్పుదుము.

12. వీరు స్వయముగ చేసికొనిన ఒడంబడికలను భంగపరచి, మీ మతధర్మమును దూషించినచో మీరీ విశ్వాసహీనుల నాయకులతో యుద్ధముచేయుడు. వీరిప్రమాణము ప్రమాణమే కాదు. వీరు తమదౌష్ట్యమును విడిచిపెట్టుటకు (మీరు వారితో యుద్ధము చేయుటకంటె గత్యంతరము లేదు.)

13. (ఓ విశ్వాసవంతులారా!) తమ ఒడంబడికల ప్రమాణములను భంగపరచి, భగవత్ప్రవక్తను దేశమునుండి వెళ్ళగొట్టుటకు నిశ్చయించి, తామే ముందు మీపై యుద్ధమునకు కాలుదువ్విన వీరితో యుద్ధము చేయరా? మీరు వారికి భయపడుచున్నారా? (భయపడుచునే యున్నచో మీరు విశ్వాసవంతులు కాజాలరు. ఎందు కన) మీరు విశ్వాసవంతులే యైనచో భగవంతునకు మాత్రమే భయపడవలెను. (దైవేతరుల భయము మీకుండరాదు.)

14. (ఓ విశ్వాసవంతులారా!) వారితో (నిస్సంకోచముగ) యుద్ధము చేయుడు. భగవంతుడు మీద్వారా వారికి విపత్తు కల్గించును. వారిని పరాభవించును. వారిపై మీకు విజయము ప్రసాదించును. విశ్వాసవంతుల సకలదుఃఖములను దూరమొనర్చును.

15. వారి ఆగ్రహజ్వాలలను చల్లార్చును. తన ఇచ్ఛవచ్చినవారికి అనుగ్రహము చూపును. భగవంతుడు సర్వజ్ఞుడు; ప్రజ్ఞానిధి.

16. (ఓ విశ్వాసవంతులారా!) మీరింతలో విడువబడి రనుకొందురా? మీలో ధర్మయుద్ధము చేసినవారిని; భగవంతుని, అతనిప్రవక్తను విశ్వాసవంతులను విడిచి ఇతరులనెవ్వరిని తమ రహస్యపోషకులుగ గ్రహింపనివారిని భగవంతుడింకను పూర్తిగ పరీక్షింపనైన లేదు. మీరు చేయున దంతయు భగవంతుడెరుగును.

మూడవ ఖండము

17. భగవంతుని ప్రార్థనాలయములను వెలయించుటకు విశ్వాసహీనులకు హక్కులేదు. వారు స్వయముగ తాము విశ్వాసహీనులమని చెప్పుకొనుచున్నప్పుడు (వారికట్టి హక్కెట్లు లభించును?) వారేది చేసినను దానిఫలము వమ్మేయగును. వారినివాసము నరకాగ్ని.

18. ఎవడు అల్లాను తుదిదినమును విశ్వసించి, భగవత్ప్రార్థనానిరతుడై దానతత్పరుడై, భగవంతుని తప్ప మరెవ్వరికిని భయపడడో

అట్టివానికే భగవంతుని ప్రార్థనాలయములను సందర్శించుట కధికారము కలదు. వారు ధర్మమార్గానుయాయు లగుదురని ఆశించవచ్చును.

19. యాత్రికులకు నీళ్ళిచ్చి, పవిత్ర ప్రార్థనాలయము కాపుదల చేయువాడు, అల్లాయందును తుదిదినమునందును విశ్వసించి భగవన్మార్గమున ఉద్యుక్తుడైనవానికి సమానుడని మీరెంతురా? భగవంతుని దృష్టిలో వారు సమానులు కారు. అధర్మపరులకు భగవంతుడు విజయమోక్షముల మార్గమును తెరువడు.

20. ఎవరు భగవంతునియందు విశ్వసించి, (సత్యముకొరకు) తమ ఇండ్లను వాకిండ్లను విడిచి, తమఆస్తి ప్రాణములతో భగవన్మార్గమున కఠినపరిస్థితులలో ఉద్యుక్తులైరో వారు భగవంతునికడ ఉత్తమతర తరగతికి చెందినవారు. వారే విజయశ్రీని పొందినవారు.

21. వారికి భగవంతుడు తన అనుగ్రహ శుభవార్తను తెల్పుచున్నాడు. భగవదనుగ్రహము, స్వర్గోద్యానము అందులభించు అక్షీణమగు శుభానందముల (శుభవార్తను తెల్పుచున్నాడు.)

22. (ఆ స్వర్గోద్యానములో వీరికి) నిత్యనివాసము. భగవంతుడు ఉత్తమోత్తమమగు బహుమానము నిచ్చువాడు.

23. ఓ విశ్వాసవంతులారా! విశ్వాసముకంటె అవిశ్వాసమునే ఎక్కువగ ప్రేమించువారు మీ తండ్రులైనను, మీ సోదరులైనను సరే వారిని రక్షకులుగ గ్రహింపకుడు. ఎవరు వారిని రక్షకులుగ గ్రహింతురో వారే అధర్మపరులు.

24. (ఓ ప్రవక్తా! విశ్వాసవంతులతో ఇట్లు) చెప్పుము: "మీ తండ్రులు, మీ పుత్రులు, మీ సోదరులు, మీ భార్యలు, మీ బంధువులు, మీరు గడించిన ఆస్తి, మందగించిపోవునేమో యని మీరు నిరంతరము భయపడుచుండు మీవర్తకము—ఇవన్నియు భగవంతుడు, అతని

పరివక్తే, భగవన్మార్గమున ఉద్యుక్తులగుట—వీనికంటె ప్రియములైనచో, భగవంతుడు చేయునదేదో మీ ముందుకు వచ్చువరకు వేచియుండుడు. భగవంతుడు దుష్టులకై శ్రేయోవిజయముల మార్గమును తెరువడు.

నాలుగవ ఖండము

25. (ఓ విశ్వాసవంతులారా!) నిశ్చయముగ భగవంతుడు మీకు అనేక యుద్ధరంగములందు సాయమొనర్చెను. (అప్పుడు మీరు) బలహీనులై, అల్పసంఖ్యాకులై యుండిరి. మీకు విజయముకల్గునను ఆశయైనను లేకుండెను. హునైన్ యుద్ధములో మీరు మీ సంఖ్యనుచూచి గర్వించి (మీ అధికసంఖ్యయే మీకు విజయమునిచ్చు నని మిన్నుగానక) యున్నప్పుడు, చూడుడు. మీ సంఖ్యాబలము మీ కెంతమాత్రము లాభకారి కాజాలకపోయెను. విశాలమగు భూమి మీకై ఇరుకైపోయెను. మీరు వెనుజూపి పలాయితులైరి.౧౭౦

26. అప్పుడు భగవంతుడు అతని ప్రవక్తకును, విశ్వాసవంతులకును ప్రశాంతినొసగెను. మీ కదృశ్యమైన బలగమును పంపెను. విశ్వాసహీనులను శిక్షించెను. విశ్వాసహీనుల కిదే ఫలితము.౧౭౧

27. దీనితర్వాత భగవంతుడు తన ఇచ్ఛవచ్చినవారి కనుగ్రహము చూపెను. భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

28. ఓ విశ్వాసవంతులారా! విగ్రహారాధకులు అపరిశుద్ధులు. అందుచే వారీసంవత్సరము తర్వాత ఈ పవిత్ర ప్రార్థనాలయమును సమీపింపరాదు. (అవిశ్వాసులగు యాత్రికులు యాత్రార్థమై రాకపోవుటవల్ల మీ ఆదాయము తగ్గి) మీకు దారిద్ర్యభయము కల్గినచో భయపడకుడు. భగవంతు డిచ్ఛించినచో తన అనుగ్రహముచే మిమ్ము త్వరలో సంపన్నుల నొనర్చును. నిశ్చయముగ భగవంతుడు సర్వజ్ఞుడు; ప్రజ్ఞానిధి.

29. భగవద్గ్రంథము ప్రసాదింప బడినవారిలో ఎవరు భగవంతునియందును, తుదిదినమునందును విశ్వసింపక, భగవంతుడును భగవ

త్ప్రవక్తయు నిషేధించినవానిని నిషేధములనుకొనక, సత్యమతధర్మము ననుసరింపక యుందురో వారితోడను యుద్ధముచేయుము. వారు జిజియా పన్ను చెల్లించువరకు, వారిగర్వము అణుగువరకు (వారితో యుద్ధమొనర్పుము.)౧౭౨

ఐదవ ఖండము

30. "ఉజైర్ దేవునికుమారుడు" అని యూదులందురు. "మసీః (ఏసుక్రీస్తు) దేవునికుమారుడు" అని క్రైస్తవులందురు. ఇవి వారు నోటితో చెప్పు మాటలు. వారికిపూర్వము విశ్వాసహీనులైనవారి మాటలను వారనుకరింతురు. భగవంతుడు వారిని నశింపజేసెను.* వారు సత్యము నుండి ఎట్లు మరలిపోయిరి!౧౭౩

31. వారు భగవంతుని విడిచి తమ పండితులను, మతగురువులను ఈశ్వరులనుగా గ్రహించిరి. అదేవిధముగ మర్యమ్ కుమారుడగు ఈసాను కూడ (దైవముగ గ్రహించిరి.) ఏకేశ్వరునే సేవించుడనియు ఏకేశ్వరుడే తప్ప మరిదైవము లేడనియు వారికి బోధింపబడెను. వారు ఎవరిని దైవతములని నిలబెట్టుచున్నారో వారు భగవంతుని మహిమా పావిత్ర్యముల నుండి ఎంతోదూరమున నున్నవారు.౧౭౪

32. వారు భగవత్తేజమును నోటితో ఊది ఆర్పగోరుచున్నారు. భగవంతుడు ఈ (ధర్మ) తేజస్సును సంపూర్ణ మొనర్పగోరుచున్నాడు; ఇది విశ్వాసహీనుల కిష్టము లేకపోయిననుసరే.

33. (మానవులకు) మార్గదర్శకమగు (గ్రంథమును) సత్యసంయుతమగు మతధర్మమును ఇచ్చి తనప్రవక్తను పంపినదతడే. విశ్వాసహీనుల కిష్టము లేకపోయినను ఇది సమస్త మతధర్మములను మించి ప్రకాశించును.

34. ఓ విశ్వాస వంతులారా! నిశ్చయముగ విద్వాంసులలోను సన్యాసులలోను పల్వురు మోసపుచ్చి మనుష్యుల ఆస్తులను దిగమ్రింగి,

* "వారు భగవచ్ఛాపహతు లగుదురుగాక!" అనియు అర్థము చెప్పవచ్చును.

భగవన్మార్గమున వచ్చువారిని సైతము అడ్డుపెట్టుదురు. ఎవరు భగవన్మార్గమున ఖర్చుపెట్టక వెండిబంగారములను కూడబెట్టి యుంచుదురో వారికి అత్యంత కఠినమగుశిక్ష కలుగునని కబురుచెప్పుము.౧౭౪

35. నరకాగ్నిలో ఆ ధనసంపదనుండి వేడిపుట్టించినాడు, (ఈ ధనస్వాములగు లోభుల) నుదుళ్ళపైనను, పక్కలపైనను, వీపులపైనను (మండుచున్న ఆ డబ్బుతో) వాతలు వేయబడును. (అప్పుడు వారికిట్లు చెప్పబడును): "మీరు కూడబెట్టి యుంచుకొనినదిది. అందుచే మీరు కూడబెట్టుకొని యుంచుకొనినదాని రుచి చూడుడు."

36. భగవంతుని కడ నెలల లెక్క పండ్రెండు. భూమ్యాకాశములు సృష్టింపబడి నప్పటినుండియు భగవద్గ్రంథములో ఇట్లే లిఖింపబడియున్నది. ఈ పండ్రెండు మాసములలో నాల్గు నెలలు పవిత్రమైనవి. ఇది ధర్మముయొక్క ఋజుమార్గము. ఈ పవిత్రమాసములలో (యుద్ధము, రక్తపాతము చేయకుడు.) మీ ప్రాణములను నష్టపరచుకొనకుడు. విశ్వాసహీనులు మీతో ఏవిధముగ యుద్ధము చేయుచున్నారో అట్లే మీరుకూడ వారితో యుద్ధముచేయుడు. కాని ఎవరు సర్వస్థితులయందును భగవద్భీతిపరులై యుందురో భగవంతుడు వారితోనే యున్నాడని జ్ఞాపకముంచుకొనుడు.

37. (పవిత్రమాసములను) విలంబముచేయుట అవిశ్వాసమును హెచ్చించుట. విశ్వాసహీనులు దానివల్ల ఇంకను చెడుగునకు మళ్ళింపబడుదురు. ఒక సంవత్సరము ఆ మాసపావిత్ర్యమును భంగపరతురు. మరొకసంవత్సరము దానినే పవిత్రమాస మందురు. (వారి కెట్లనుకూలముగనున్న అట్లుచేయుదురు.) భగవంతుడు పవిత్రమాసముల నిర్ణయించిన నెలలలెక్కను సరిపుచ్చి, అతడు పవిత్రముగ చేసినవానిని భంగపరచుట కిట్లుచేయుదురు. వారిచేతల చెడుగు వారి కాకర్షవంత మగు

నట్లు చేయబడెను. భగవంతుడు విశ్వాసహీనులకు మార్గదర్శిత్వమొనర్పడు.

ఆరవ ఖండము

38. ఓ విశ్వాసవంతులారా! మీ కేమైనది? భగవన్మార్గమున ముందడుగు వేయుడు అని మీ కాజ్ఞాపించినప్పుడు మీ పాదములు బరువై భూమికంటుకొనును. మీరు పారలౌకిక జీవితమును విడిచి (తుచ్ఛమగు) ఐహిక జీవితముతో తృప్తిపడుచున్నారా? కాని పారలౌకిక జీవితముతో పోల్చినచో ఐహికజీవితము బహు స్వల్పమైనది.

39. మీరు ముందడుగు వేయనిచో (జ్ఞాపకముంచుకొనుడు) అత్యంత కఠినముగ మిమ్ము శిక్షించును. మీ స్థానములో మరొకజాతిని తెచ్చిపెట్టును. మీరు (ఇట్టిప్రవర్తనచే) భగవంతున కేమియు నష్టము కల్గింపజాలరు. (నష్టము మీదే.) భగవంతుడు సర్వవస్తువుల పైనను అధికారము కలిగియున్నాడు.

40. మీరు ప్రవక్తకు సహాయము చేయకపోయిన (చేయకపోవు గాక!) వానికి భగవంతుడే సహాయము చేసెను. విశ్వాసహీనులు అతని (పట్టణమునుండి) వెడలగొట్టిరి. (వారు కేవల మిద్దరుండిరి.) ఆ ఇద్దరిలో ఒకడు (భగవత్ప్రవక్త.) వారిద్దరును ఒక గుహలో డాగియుండిరి. అట్టి సమయములో భగవత్ప్రవక్త తనమిత్రునితో ఇట్లనెను: "దుఃఖింపకుము. నిశ్చయముగ దేవుడు మనతోనున్నాడు." భగవంతుడతనికి నిశ్చలతను ప్రసాదించెను. మీ కదృశ్యమైన బలగముల చేదోడు నిచ్చితిని. విశ్వాసహీనుల ప్రతిజ్ఞను వమ్మొనర్చితిని. భగవంతుని ప్రతిజ్ఞయే మిక్కిలి ఘనమైనది. భగవంతుడు సర్వశక్తిమంతుడు; ప్రజ్ఞానిధి.౧౭౫

41. (ఓ విశ్వాసవంతులారా!) మీరు (పరికరములులేక) తేలికగనున్నను, (సర్వ పరికరములతో) బరువుగ నున్ననసరే; ఎట్టిస్థితియందున్నను బయలు దేరుడు. మీ ఆస్తులతోడను మీ ప్రాణములతోడను భగ

వన్మార్గమున పోరాడుము. (ఏది మీకు లాభమో ఏది మీకు నష్టమో) మీరు తెలిసినవారేని ఇది మీ కత్యుత్తమమైనది.

42. (ఓ ప్రవక్తా!) వెంటనే లాభము కలుగునదియు, దగ్గర ప్రయాణమున నున్నదియు నైనచో వీరు తప్పక నీతో వచ్చెడివారు. కాని వారికి దారి దూరముగ కన్పట్టెను. వీరు భగవంతునిసాక్షిగా ప్రమాణములుచేసి (విశ్వాసవంతులతో ఇట్లందురు): "మేము రాగలిగియుండినచో మీతో తప్పక వచ్చియుండెడివారము."

వారు స్వాత్మవినాశము గావించుకొనిరి. వారు అసత్యవాదులని భగవంతునకు తెలియును.

ఏడవ ఖండము

43. (ఓ ప్రవక్తా!) భగవంతుడు నిన్ను క్షమించుగాక! (దుష్టులగువారి సాకులనువిని వెనుక ఉండిపోవుటకు) వారికి సెలవేల యొసగితివి? ఎవరు నిజము చెప్పుచున్నారో ఎవరు అబద్ధము చెప్పుచున్నారో నీకు స్పష్టమగువరకు (ఏల సెలవొసగితివి?)

44. భగవంతునియందును తుదిదినమునందును విశ్వాసము కలవారు నీదగ్గర సెలవడుగరు. వారు తమ ప్రాణధనములతో (భగవన్మార్గమున) ఉద్యుక్తులగుదురు. భగవంతునియందు భయభక్తులు కలవారిని భగవంతుడెరుగును.

45. ఎవరికి భగవంతునియందును తుదిదినమునందును విశ్వాసము లేదో, ఎవరు సంశయాత్ములో వారే నిన్ను సెలవడుగుదురు. వారి హృదయములు సంశయాందోళితములు.

46. వారు నిజముగా బయలుదేరుటకు నిశ్చయించి యుండిరేని దానికై వారు పరికరములను చేకూర్చుకొని యుందురు. కాని వారు బయలుదేరుట భగవంతునిష్టముకాదు. వారిని వెనుకంజ వేయువారినిగా

చేసెను. వారితో ఇట్లు చెప్పబడెను: "వెనుక దిగబడినవారితో మీరు కూడ దిగబడియుండుడు."

47. ఒకసారి నీతో వారు ముందుకు సాగియుండినను దానివల్ల నీబల మభివృద్ధి యయ్యెడిదికాదు. (అట్లు కాకపోవుట పోగా) మరింత కుళ్ళుచేరెడిది. వారు తప్పక అటుఇటు తిరిగి మీలోమీకు తగవులు కల్గించువారు. మీలో కొందరు వారికి చెవియొగ్గువారును కలరు. భగవంతుడు దుష్టుల నెరుగును.

48. (ఓ ప్రవక్తా!) ఇంతకు ముందుకూడ వీరు అంతఃకలహములు పుట్టించుటకు ప్రయత్నించి నీకు వ్యతిరేకముగ కుట్రలు పన్నిరి. తుట్టతుదకు నిజము బయలుపడెను. భగవదాజ్ఞ ప్రభావము హెచ్చెను. అది వారికి రుచింపదయ్యెను.

49. (పయోముఖ విషకుంభములగు వీరిలో) ఇట్లనువాడు కలడు: "(ఇంట కూర్చొనుటకు) నాకు సెలవియ్యుడు. నన్ను పరీక్షింపకుడు." నిశ్చయముగ వారు పరీక్షయందే దింపబడినారు. నిశ్చయముగ విశ్వాసహీనులను నరక మావరించును.

50. (ఓ ప్రవక్తా!) మీకేదేని శుభము కలిగినయెడల వారు దుఃఖింతురు. మీకేదైన ఆపదవచ్చినప్పుడు వారిట్లందురు: "ఇందుచేతనే మేము మొదటినుండియు ఉపాయముచే తప్పించుకొని యుంటిమి." ఇట్లని పెడమొగముపెట్టి సంతోషముతో వెళ్ళిపోవుదురు.

51. వారితో ఇట్లుచెప్పుము: "భగవంతుడు మాకై విధించినది తప్ప మమ్ముల మరేదియు బాధింపజాలదు. భగవంతుడు మాకు పోషకుడు. విశ్వాసవంతులు భగవంతునే నమ్ముకొని యుందురుగాక!

52. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "మీరు మాకేది కావలెనని వేచియున్నారో (అనగా మేము యుద్ధములో వధింపబడవలె

నని కోరుచున్నారో) అది మాకొరకు రెండు సుకృతములలో ఒకటి. (అనగా విజయము, వీరమరణము అను రెండు సుకృతములలో ఒకటి.) మేము మీకొఱకు భగవంతుని శిక్షకై వేచియున్నాము. లేక మాచేతులనుండియే మీకు శిక్ష నిప్పించవలెనని (మేము వేచియున్నాము.) ఇక పర్యవసానమునకై ప్రతీక్షింపుడు. మేముకూడ మీతోపాటు ప్రతీక్షించుచున్నాము.

53. (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: మనఃపూర్వకముగ వ్యయపరచినను అయిష్టముగ వ్యయపరచినను సరే, అది మీకడనుండి స్వీకరింపబడదు. నిశ్చయముగ మీరు దుస్స్వభావము కలవారు.

54. వారు భగవంతునియందును అతని ప్రవక్తయందును విశ్వసింపక, ప్రార్థనకు వచ్చునప్పుడు అలసత్వము చూపుచు, అయిష్టముగ ధనవ్యయము చేయుచు నుండుటయే వారి దానప్రదానమును స్వీకరించకుండుటకు కారణము.

55. (ఇట్టి) వారి ధనసంపదయు, సంతతియు మీ ప్రశంసకు పాత్రము కాకుండుగాక! ఈ ఐహిక జీవితములో (ధనధాన్యములను సంతానమును) ఇచ్చి భగవంతుడు వారిని శిక్షింపగోరును. వారు విశ్వాసహీనులుగ నుండగనే మరణించునట్లు చేయవలెనని (భగవంతు డిట్లుచేసెను)

56. తాము నీకు చెందినవారేనని వారు భగవత్సాక్షిగా ప్రమాణము చేయుదురు. (వాస్తవమేమనగా) వారు నీపక్షమువారు కారు. (భక్తితో నీదగ్గరకు వచ్చినవారుకారు) నీవన్న భయపడి నీదగ్గరకు వచ్చినవారు వీరు.

57. వారికెక్కడనైన తలదాచుకొనుటకు ఆశ్రయము లభించినను, లేక గుహలు దొరికినను, లేక ప్రవేశించుటకు మరేస్థలము లభించినను వారు నిశ్చయముగ అక్కడకు సత్వరగమనమున పోయి యుండెడివారు.

58. దానధర్మముల విషయమై వారిలో కొందరు నీపై నింద మోపిరి. వారికి జకాత్ నిధినుండి ఇవ్వబడినచో వారు సంతోషింతురు. వారికి దానినుండి (ధనసహాయము) ఇవ్వబడకపోయినచో వారు ఆగ్రహావేశపరు లగుదురు.

59. భగవంతుడును అతని ప్రవక్తయు ఇచ్చినదానితో వారు సంతృప్తిపడి, "అల్లాః మాకు చాలును. (మాకీ ఐహికసంపద లేల?) భగవంతుడు అనుగ్రహించి ఇంతకంటె ఎక్కువ ప్రసాదించును. అతని ప్రవక్తకూడ (అట్లే అనుగ్రహించును.) భగవంతునకే సమస్తమును నివేదించుకొందుము" అందురు.

ఎనిమిదవ ఖండము

60. నిరుపేదలకును, దరిద్రులకును, దానిని వసూలుచేయుటకు నియమింపబడినవారికిని, సత్యమువైపున కొరిగినవారికిని బానిసలను (విడిపించుట) కొరకును, (ఋణభారముచే క్రుంగిపోయి తీర్ప శక్తిలేక) ఋణగ్రస్తుల కొరకును, భగవన్మార్గమునను, (దిక్కులేని) ప్రయాణీకుల కొరకును తప్ప దానధర్మము మరొకందుకు కాదు. ఇది భగవంతుని శాసనము; భగవంతుడు సర్వజ్ఞుడు; ధీనిధి.

61. వారిలో కొందరు ప్రవక్తమనస్సు నొచ్చునట్లు ఇట్లందురు: "విన్న ప్రతిదానిని ఈయన నమ్మును." (ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "నిజము; అతడు ఎక్కువగ వినును; కాని మీ మంచికొరకే. అతనికి భగవంతునియందు నమ్మకముకలదు. (భగవంతుడు అతనిని తప్పుదారుల నడిపింపడని అతని నమ్మకము.) విశ్వాసవంతుల (మాటలుకూడ అతడు వినును. వారి) యెడల అతనికి నమ్మకముకలదు. ప్రవక్త విశ్వాసవంతులకొరకు (భగవంతునిచే ప్రసాదింపబడిన అనుగ్రహము.) ఎవరు ప్రవక్తను బాధింతురో వారికి కఠినమగుశిక్ష లభించును.

62. నిన్ను సంతోషపెట్టుటకై వారు దేవునిపై ఒట్టు పెట్టుకొందురు. వారు నిజమైన విశ్వాసవంతులే యైనచో భగవంతుని అతని ప్రవక్తను సంతోషపెట్టుదురుగాక!

63. ఎవడు భగవంతునకును అతని ప్రవక్తకును వ్యతిరేకముగ ప్రవర్తించునో వానికి తప్పక నరకాగ్నియందు నివసింపవలసి వచ్చునని వారికి తెలియదా? అది మిక్కిలి అవమానకరమైన విషయము.

64. వారి హృదయములలో నున్నదానిని స్పష్టముగ వెలిబుచ్చుచు ఒక అధ్యాయ మవతరించునేమో యని ఈ వంచకులు భయపడుచున్నారు. (ఓ ప్రవక్తా!) వారితో ఇట్లు చెప్పుము: "మీరు (మీ అలవాటుచొప్పున) పరిహసింపుడు. మీరు దేనికై భయపడుచున్నారో భగవంతుడు తప్పక దానిని వెలిబుచ్చును."

65. (ఇట్లేల చెప్పెదరని) నీవు వారినడిగినచో తప్పక వారిట్లందురు: "మేమూరక ఇట్లు చర్చించుకొని పరిహసించుకొనుచున్నాము."

(ఓ ప్రవక్తా! వారినిట్లు) అడుగుము: "భగవంతునకును, అతని సందేశమునకును, అతని ప్రవక్తకును వ్యతిరేకముగనా మీరు పరిహాస మాడినది?"

66. సాకులు పన్నకుడు. మీరు మొదట విశ్వసించి తర్వాత నిరాకరించిరి. (పశ్చాత్తప్తులైన) మీలోని ఒకపక్షమును మేము క్షమించినను, (అసలు వీరిని రెచ్చగొట్టి) అపరాధము గావించిన మరొకపక్షమును తప్పక శిక్షింతుము.

తొమ్మిదవ ఖండము

67. వంచకులగువారు పురుషులైనను స్త్రీలైనను ఒకటే. వారు చెడుగును ప్రబోధింతురు; మంచిని నిషేధింతురు. (సత్కార్యములనుండి) తమచేతులను వెనుకకు లాగికొందురు. వారు భగవంతుని విడిచిపెట్టుకొన్నవారు. ఈ వంచకులు నిశ్చయముగ దుస్స్వభావులు.

68. వంచకులగు పురుషులను, వంచకులగు స్త్రీలను, విశ్వాసహీనులను భగవంతుడు నిత్యనివాసమునకై నరకాగ్ని వాగ్దానము చేయుచున్నాడు. అది వారికిచాలును. వారిని భగవంతుడు శపించెను. వారికి శాశ్వతశిక్ష లభించును.

69. (వంచకులారా!) మీకు పూర్వముండిన వారి వంటిదే మీ స్థితికూడ. వారు మీకంటె ఎంతో బలాఢ్యులుగ నుండిరి. ధనసంపదయందును, సంతానమునందును కూడ వారు మీకు మించియుండిరి. వారివంతుకు వచ్చిన ప్రాపంచిక లాభములు ఖర్చైపోయెను. మీరు కూడ వారివలెనే మీవంతుకు వచ్చిన ప్రాపంచికలాభములను ఖర్చుపెట్టుకొనిరి. వారెట్టి (అధర్మమును అనుసరించు) మాటలు చెప్పిపోయిరో మీరుకూడ చెప్పినారు. (ఇదిమాత్రము మరువకుడు) వారు చేసినదంతయు ఇహలోకమునను పరలోకమునను కూడ వమ్మైయయ్యెను. వారు భ్రష్టులు. (వారి ననుసరింతురా?)

70. వారికి పూర్వముండిన (దుష్టుల) వృత్తాంతము వారికి తెలియదా? నోహుజాతి, ఆద్ జాతి, సమూద్ జాతి, ఇబ్రాహీమ్‌జాతి, మీదియన్ పురవాసులు, వినాశమైన నగరములందుండినవారు (మున్నగు దుష్టజాతుల చరిత్రలు వారికి తెలియవా?) వారి ప్రవక్తలు వారికడకు విస్పష్టమైన నిదర్శనములతో వచ్చిరి. (వారు తమ ప్రవక్తలమాట వినక నశించిరి.) వారికీనష్టము వాటిల్లజేసినది భగవంతుడుకాడు. వారు తమకు తామే నష్టపరచుకొనిరి.

71. విశ్వాసవంతులగు పురుషులును, విశ్వాసవతులగు స్త్రీలును ఒకరికొకరు చేదోడు వాదోడుగా నుందురు. వారు మంచిని ప్రబోధింతురు. చెడుగును నిషేధింతురు. ప్రార్థనానిరతులై, దానధర్మపరులై, అల్లాకును, అతని ప్రవక్తకును విధేయులై యుందురు. వీరికి భగవంతుడు

తన అనుగ్రహమును ప్రసాదించును. భగవంతుడు నిశ్చయముగ సర్వ శక్తిమంతుడు; ధీనిధి.

72. విశ్వాసవంతులగు పురుషులకును, విశ్వాసవతులగు స్త్రీలకును భగవంతుడు నిర్ఝరులు ప్రవహించు స్వర్గోద్యానములను, నిత్య నివాసమునకై వాగ్దానమిచ్చినాడు. ఆ స్వర్గోద్యానములలో సుందరభవనములు, శాశ్వత నివాసములు కలవు. అన్నిటికంటె అధికమైనది భగవదనుగ్రహము. అది అత్యుత్తమమగు సఫలత.

పదవ ఖండము

73. ఓ ప్రవక్తా! విశ్వాసహీనులకును వంచకులకును వ్యతిరేకముగ ధర్మయుద్ధ మొనర్పుము. వారికి లొంగిపోవలదు. వారినివాసము నరకము. దుర్గతియే వారి (చేతల) పర్యవసానము.

74. (ఈ వంచకులు) దేవునిపేర ఒట్టుపెట్టుకొని మేమిట్లు చెప్పలేదందురు. వాస్తవమేమనగా వారు నిజముగా సత్యనిరాకరణపు మాటల జెప్పిరి. వారు ఇస్లామును స్వీకరించి తిరిగి అవిశ్వాసపుమాటల నాడిరి. వారు చేయజాలనిది చేయుటకు నిశ్చయించిరి. భగవంతుడును, అతని ప్రవక్తయు వారికి (ఆధ్యాత్మిక సంపదను) ఇచ్చి వారిని సంపన్నుల నొనర్చినందులకే కదా వారు కసితీర్చుకొనబూనిరి!

ఇప్పుడైనను వీరు తమ దౌష్ట్యమునువదలి పశ్చాత్తాపపడినచో అది వారికేమంచిది. అట్లుగాక వారు పెడమొగముపెట్టి పోయినచో, జ్ఞాపకముంచుకొనుడు, భగవంతుడు వారికి ఇహలోకమునను పరలోకమునను కూడ అత్యంత కఠినముగ శిక్షించును భూమిపై వారికెవ్వరును రక్షకులుండరు; సహాయులును ఉండరు.౧౨౦

75. వీరిలో కొందరు భగవంతునితో ఒడంబడిక గావించుకొనిరి. "భగవంతుడనుగ్రహించి ఇచ్చినచో మేము తప్పక దానధర్మములు చేసి సజ్జనులమై యుందుము" (అని వారుచెప్పిరి.)

76. కాని భగవంతుడు తన అనుగ్రహముతో వారికి (ధనసంపద) ప్రసాదించినప్పుడు వారు లోభులై తమమాటకు నిలబడకపోయిరి. వారు తమచేతులను వెనుకకు లాగికొనిరి.

77. దీనికి ఫలితముగ భగవంతుడు వారి హృదయములలో వంచకత్వమును ప్రవేశింపజేసెను. వారు భగవంతుని సమక్షమున సమావేశమగు కాలమువరకు కల్గియుండిరి. ఎందుకన తాము భగవంతునిఎదుట ప్రతిజ్ఞ చేసినదానిని చెల్లించుకొనరైరి; అబద్ధములు పల్కిరి.

78. అల్లాః వారి గుప్తభావములను, రహస్యపుటాలోచనలను ఎరుగునని వీరికి తెలియదా? అల్లాః సమస్త అదృశ్యవిషయములను కూడ ఎరుగనని (వీరికి తెలియదా?)

79. మనఃపూర్వకముగ సంతోషముతో దానముచేసిన విశ్వాసవంతులనుచూచి (లోకమునకు చూపుటకై ఇట్లు చేయుచున్నారని) నింద మోపుచున్నారు. కష్టపడి సంపాదించినది మరొకవిధమైన ధనము లేనివారు (తమకు తోచినరీతిని భగవన్మార్గమున ఖర్చుపెట్టుచుండగా) వారిని చూచి పరిహసించుచున్నారు. భగవంతుని పక్షమునుండి వారు నవ్వుల పాలగుచున్నారని (తెలిసికొందురుగాక!) తుదిదినమున వారికి కఠినమగు శిక్ష లభించును.

80. వారికొరకు క్షమార్పణమును అడుగుము, అడుగకపొమ్ము. నీవు వారికొరకు డెబ్బదిసార్లు క్షమార్పణ మడిగినను భగవంతుడు వారిని క్షమింపడు. ఎందుకనగా వారు అల్లాఃయందును, అతని ప్రవక్తయందును విశ్వసింపరు. దుస్స్వభావులగువారికి భగవంతుడు దారిచూపడు.

పదునొకండవ ఖండము

81. (ధర్మయుద్ధమున చేరక) వెనుక దిగబడిపోయినవారు భగవంతుని ప్రవక్త ఇచ్ఛకు వ్యతిరేకముగ వెనుక దిగబడిపోతిమని సంతో

షించిరి. వారు తమ ధన ప్రాణములతో భగవన్మార్గమున ధర్మయుద్ధము చేయుట కిష్టపడకపోయిరి. వారు (తమ తోడివారితో) ఇట్లనిరి: "ఈ ఎండలలో మీరు (ఈ ధర్మయుద్ధమునకై) వెళ్ళకుడు."

(ఓ ప్రవక్తా! వారితో ఇట్లు) చెప్పుము: "నరకాగ్ని ఇంకను వేడియైనది. వారిది యర్థముచేసికొని యుండిరేని (ఇట్లు చెప్పకుండెడివారు.)

82. సరే; వీరిని కొంచెము సంతోషింపనిమ్ము. వారు చేసిన దానికి ఫలితముగ వారు ఎంతో విలపించవలసియే యున్నది.

83. ఒకసారి (ఈ వంచకులలో) ఒకపక్షమును భగవంతుడు నీ కడకు తెచ్చినచో వారు ధర్మయుద్ధమున నీకు తోడుగావచ్చుట కనుజ్ఞ వేడుదురు. (ఓ ప్రవక్తా! అప్పుడు వారితో ఇట్లు) చెప్పుము: "మీరు నాతో ఎంతమాత్రము రావద్దు. మీరు నాతో కలిసి శత్రువులతో పోరాడవలదు. (మీరు నమ్మకమును కోల్పోయినవారు.) మీరు మొదటిసారి (ఇంట) కూర్చొనియుండుట కిష్టపడిరి. అందుచే ఇప్పుడుకూడ వెనుక దిగబడినవారితో కూర్చొనియుండుడు."

84. (ఓ ప్రవక్తా!) వారిలో మృతులైనవారికొరకు ప్రార్థన సలుపకుము. వారి సమాధులప్రక్క నిలువబడకుము. వీరు భగవంతుని అతనిప్రవక్తను విశ్వసింపనివారు. వారు తమ దౌష్ట్యమునందే మరణింతురుగాక!

85. (ఇట్టి) వారి ధనసంపదయు, సంతతియు మీ ప్రశంసకు పాత్రము కాకుండుగాక! ఈ ఐహికజీవితములో (ధనధాన్యములను సంతానమును) ఇచ్చినవారిని శిక్షింపగోరును. వారు విశ్వాసహీనులుగ నుండగనే మరణించునట్లు చేయవలెనని (భగవంతుడిట్లు చేసెను.)

86. "భగవంతుని విశ్వసింపుము; భగవంతుని ప్రవక్తతో కలిసి ఉద్యమింపుము" అని ప్రోక్తమైనప్పుడెల్ల సంపన్నులు నిన్ను ఇట్లనుజ్ఞవేడుదురు: "మమ్ము విడిచిపెట్టుడు; మేము వెనుకదిగబడినవారితో నుందుము."

87. వారు వెనుక దిగబడినవారితో నుండుట కిష్టపడిరి. వారి హృదయములు ముద్రాబద్ధితములు; వారికి వివేకములేదు.

88. ప్రవక్తయు, అతనితోపాటు సత్యమునందు విశ్వాసము కలవారును తమ ధన ప్రాణములతో భగవన్మార్గమున నుద్యుక్తులగుదురు. వీరికే సమస్తమైన శుభసంపద చేకూరును; వీరే విజయశ్రీని పొందువారు.

89. వారికొరకు భగవంతుడు నిత్యనివాసమునకై నిర్ఝరులు ప్రవహించు స్వర్గోద్యానములను సిద్ధపరచినాడు. ఇదెంతయు గొప్ప సాఫల్యము.

పండ్రెండవ ఖండము

90. (ఇట్టివే) సాకులుపన్ను ఆటవికులు నీకడకువచ్చి (ఇండ్లలో దిగబడుటకు) అనుజ్ఞవేడుదురు. అల్లాః సమక్షమునను ప్రవక్త సమక్షమునను అబద్ధములు పల్కువారు (ధర్మయుద్ధమునచేరక ఇండ్లలో ఉండిపోయిరి.) విశ్వాసహీనులకు కఠినమగుశిక్ష లభించును.

91. (ధర్మయుద్ధమున చేరక ఇంట నుండుట) బలహీనులకు, రోగిష్ఠులకు, దానికి కావలసిన ధనము లేనివారికిని దోషము కాదు. వారు భగవంతునియెడలను, భగవంతుని ప్రవక్త యెడలను నిజమైన విశ్వాసము కలిగి యున్నంతకాలము (అశక్తతచే) వారు యుద్ధమున పాల్గొనకపోవుట దోషము కాదు. సత్కార్యాచరణపరులకు ఎట్టిదోషమును లేదు. భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

92. (కొందరు వాహనము తెచ్చికొను శక్తిలేనివారై యుండిరి.) వారు నీకడకు వాహనముకొరకై వచ్చిరి. అప్పుడు వారితో "నేను మీ కెట్టివాహనము నివ్వజాలను" అంటివి. వారు (ఆశాభగ్నహృద

యులై) వెనుకకు మరలిరి. (తాము ధర్మయుద్ధములో చేరలేకపోతిమే అను) దుఃఖముచే వారికన్నులు అశ్రుపూరము లాయెను. "అయ్యో! మేము భగవన్మార్గమున ఏదేని ఖర్చుపెట్టుటకు అవకాశము చిక్కలేదే?" అని వారు వాపోయిరి. ఇట్టివారికికూడ (ధర్మయుద్ధమున పాల్గొన లేదను) దోషము లేదు.

93. సంపన్నులయ్యు (ఇంట దిగబడుటకు) నిన్ననుజ్ఞ వేడువారిది మాత్రమే దోషము. వెనుక దిగబడువారితో ఉండుటకు వారిష్టపడిరి. భగవంతుడు వారి హృదయములు ముద్రాబద్ధ మొనర్చినాడు; వారజ్ఞానులు.

పదునొకండవ భాగము

94. మీరు (ధర్మయుద్ధమునుండి) వారికడకు వచ్చినప్పుడు వారేవో సాకులు పన్నెదరు. (ఓ ప్రవక్తా!) వారితో ఇట్లు చెప్పుము: "మీరింక సాకులు పన్నకుడు. మిమ్మిక మేము నమ్మము. మిమ్ముల గూర్చి భగవంతుడు మాకు సమస్త విషయములు తెల్పినాడు. ఇక ముందు మీప్రవర్తన మెట్లుండునో భగవంతుడును, అతని ప్రవక్తయు చూచుచుందురు. దృశ్యాదృశ్యముల సమస్తమును తెలిసిన భగవంతుని సమక్షమునకు మీరు తేబడుదురు. మీరు చేసినదంతయు మీకతడే తెల్పును.

95. మీరు తిరిగి వచ్చి వారిని కలిసినప్పుడు వారు భగవత్సాక్షిగా ప్రమాణములుచేసి తమ్ము మన్నింప గోరుదురు. మీరు వారికి పెడమొగము పెట్టుడు. వారు అపరిశుద్ధులు. వారి నివాసము నరకము. ఇది వారు గడించినదానికి ప్రతిఫలము.

96. మిమ్ము సంతోషపెట్టుటకై వారు ఒట్లు పెట్టుకొందురు. వారితో నీవిష్టపడినను, నిశ్చయముగ భగవంతుడుమాత్రము ఆజ్ఞోల్లంఘనపరులయెడ ఇష్టపడడు.

97. ఎడారివాసులు అవిశ్వాసమునందును, వంచకత్వమునందును మిక్కిలి కఠినులు. భగవంతుడు తన ప్రవక్తకు ప్రవచించిన ధర్మమును వారెరుగరు. భగవంతుడు సర్వస్వము నెరిగినవాడు; సర్వజ్ఞుడు.

98. ఎడారివాసులలో కొందరు (భగవన్మార్గమున) తాము ఖర్చుపెట్టునదంతయు నష్టమని భావింతురు. మీకు కష్టములు సంభవించవలెనని వేచియుందురు. కష్టపరిస్థితులు వారికే కలుగును. భగవంతుడు నిశ్చయముగ సర్వము వినువాడు; సర్వజ్ఞుడు.

99. ఎడారివాసులలో భగవంతుని యెడలను, తుదిదినము యెడలను విశ్వాసము కలవారుసైతము కొందరు కలరు. (భగవన్మార్గమున) వారేది ఖర్చుపెట్టినను దానివల్ల భగవత్సామీప్యము కలుగు ననియు, ప్రవక్త ఆశీస్సులు లభించుననియు భావింతురు. వినుడు; అది నిశ్చయముగ వారికి ఈశ్వరసామీప్యమును కలిగించునదై యున్నది. భగవంతుడు వారిని తన అనుగ్రహచ్ఛాయక్రిందికి తీసికొనును. నిశ్చయముగ భగవంతుడు మహాక్షమి; కరుణాళువు.

పదమూడవ ఖండము

100. ఎవరు సత్యమునందు విశ్వసించుటలో ప్రప్రథములైరో, ఎవరు (తమధర్మమును నిలబెట్టుకొనుటకు) తమతమ ఇండ్లు వాకిండ్లు విడిచిపోయిరో, ఎవరు వారికి సహాయము చేసిరో, ఎవరు వీరిసన్మార్గము ననుసరించిరో వారు భగవదనుగ్రహమునకు పాత్రులైరి. వారుకూడ భగవంతునియెడ ప్రీతి కలిగియున్నారు. నిర్ఝరులు ప్రవహించు సుందరోద్యా

నములు వారికై భగవంతుడు సిద్ధపరచెను. వారికందే నిత్యనివాసము. అది ఎంతయు ఘనమగు సాఫల్యము.

101. మీ చుట్టుపక్కల నుండు ఎడారివాసులలో కొందరు వంచకులును కలరు. మదీనావాసులలో నైతము కొందరు వంచకులు కలరు. వారు తమ వంచకత్వమున పట్టుకలిగి యున్నారు. మీరు వారి నెరుగరు. మేము వారి నెరుగుదుము. వారు రెండుసార్లు శిక్షింపబడు దురు. తర్వాత వారు ఘోరశిక్షకు మరలింపబడుదురు.

102. మరికొందరు తమ పాపములకు పశ్చాత్తప్తులైరి. వారు ఒక సత్కార్యమునూ చేసిరి; ఒక దుష్కార్యమునూ చేసిరి. భగవంతుడు వారిని క్షమించవచ్చును. నిశ్చయముగ భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

103. (ఓ ప్రవక్తా!) వారి ఆస్తులనుండి దానమును గ్రహింపుడు. దానివల్ల వారు పరిశుద్ధులగుదురు; పవిత్రులగుదురు. వారికై భగవదనుగ్రహమునకై ప్రార్థింపుడు. నిశ్చయముగ మీ ప్రార్థనలు వారికి మనశ్శాంతి కల్గించగలవు. భగవంతుడు సర్వము వినువాడు; సర్వము తెలిసినవాడు.

104. తన సేవకుల పశ్చాత్తాపమును గ్రహించి వారిచ్చినదానిని భగవంతుడు గ్రహించువాడని వా రెరుగరా? భగవంతుడు మహాక్షమి, కరుణానిధి (అని వా రెరుగరా?).

105. (ఓ ప్రవక్తా!) వారితో ఇట్లనుము: "ధర్మమును నిర్వర్తింపుడు; మీరు చేయుదానిని భగవంతుడు చూచును, అట్లే ప్రవక్తయు, విశ్వాసవంతులును కూడ. దృశ్యాదృశ్యమగు సమస్తమును తెలిసిన భగవంతుని సమక్షమునకు మీరు తేబడుదురు. (అప్పుడు) మీరు చేసినదంతయు అతడు మీకు తెల్పును.

106. మరికొందరు భగవదాజ్ఞకై నిరీక్షించవలసివచ్చినది. భగ ...తుడు వారిని శిక్షించునో, లేక కరుణతో క్షమించునో (అని వారు ...క్షింతురు). భగవంతుడు సర్వజ్ఞుడు; ప్రజ్ఞానిధి.

107. (వంచకులలో కొందరు) నష్టపరచుటకును, అవిశ్వాస ...ము హెచ్చించుటకును, విశ్వాసవంతులలో విభేదములు కల్గించుట ...ు, భగవంతునకును, ప్రవక్తకును వ్యతిరేకముగ యుద్ధము కావిం ...వారికి ఆశ్రయము కల్పించుటకును ఒక ఆలయమును కట్టిరి. దాని ...ల మంచినే తాము వాంఛించితిమి కాని మరొకటి కాదని ఒట్టు ...కొందురు. వారు అబద్ధములు చెప్పుచున్నారనుటకు భగవంతుడే ...క్షి.

108. (ఆ ఆలయమునందు) ఎన్నడును నిలువకుడు. భక్తివిశ్వా ...ముల పునాదిపై మొదటినుండియు కట్టబడిన ప్రార్థనాలయమే దాని ...కి ఉత్తమమైనది. అందులో పరిశుద్ధులు కాగోరినవారే అందు ...రు. పరిశుద్ధులైనవారినే భగవంతుడు ప్రేమించును.

109. భగవద్భీతిపైనను, భగవదనుగ్రహముపైనను తన పునాది ...యువాడు మంచివాడా? లేక బీటువడి క్రిందగుల్లనై యున్న గట్టుఅంచు ...పునాదివేయువాడు మంచివాడా? వాడు వేసిన పునాది వానితోసహా ...లి నరకాగ్నియందు పడెను. అధర్మపరులకు భగవంతుడు దారి ...పడు.

110. వారు కట్టిన కట్టడము వారి హృదయములకు—అవి ఖండ ...డములుగ ఛేదింపబడినతప్ప—అశాంతి కలుగజేయునదై యుండును. ...వంతుడు సర్వజ్ఞుడు; ప్రజ్ఞానిధి.

పదునాలుగవ ఖండము

111. భగవంతుడు విశ్వాసవంతులకు స్వర్గోద్యానమును ప్రసాదింపగోరి వారి ఆస్తులను కొనుక్కొనెను. వారు భగవన్మార్గమున పోరాడుదురు. వారు (దుష్టులను) చంపుచుందురు; (ధర్మయుద్ధమున) చత్తురు కూడ. ఇది తౌరాతు, ఇంజీలు గ్రంథములందును, ఖుర్ఆన్ గ్రంథమునందును కలదు. తన వాగ్దానమును పూర్తిచేయుటయందు భగవంతుని కంటె ఎక్కువ ఎవరు? మీకు భగవంతు డిచ్చిన ఈ వాగ్దానమునకు సంతసింపుడు. అదియే గొప్ప సాఫల్యము.

112. (తప్పిదము లొనర్చి)
ఎవరు పశ్చాత్తప్తు లగుదురో,
ఎవరు భగవత్ప్రార్థనానిరతులో,
ఎవరు భగవంతుని (మాత్రమే) స్తుతించువారో,
(భగవన్మార్గమున)
ఎవరు దేశాటనము* చేయువారో,
(భగవంతుని ముందు)
ఎవరు (భక్తితో) శిరస్సు వంచువారో,
(భగవంతుని ప్రోల)
ఎవరు (వినయముతో) సాష్టాంగపడువారో,
ఎవరు (ప్రజలకు) సన్మార్గమును చూపి దౌష్ట్యమును నిషేధించువారో,

* "సాయెహూన" అను ఇక్కడి మూలమునకు "దేశాటనము చేయువారు, ఉపవాస ముండువారు, విద్యార్జనము చేయువారు" అను వివిధార్థములు కలవు. ఈ అర్థము హజరత్ అక్రమా గ్రహించినది.

ఎవరు భగవంతు డేర్పరచిన హద్దులను కాపాడువారో,
(వీరే నిజమైన విశ్వాసవంతులు. ఓ ప్రవక్తా!) వీరికి
(మోక్ష విజయముల) సువార్త నిమ్ము.

113. విశ్వాసహీనులు నరకాగ్నివాసులని స్పష్టముగ తెలుపబడిన తర్వాతకూడ బహుదైవతారాధకులకై క్షమార్పణము వేడుట ప్రవక్తకును విశ్వాసవంతులకును తగదు. ఒకవేళ వారు దగ్గరిబంధువు లైనను సరే.

114. తన తండ్రికొరకై ఇబ్రాహీమ్ క్షమార్పణము నర్థించినది తా నతనికి చేసిన వాగ్దానమును చెల్లించుకొనుటకుమాత్రమే. అతడు భగవచ్ఛత్రువని స్పష్టముగ తెలిసిన పిదప అతడు తన ఉద్యమమును మానుకొనెను. నిశ్చయముగ ఇబ్రాహీమ్ మిక్కిలి మెత్తని హృదయము కలవాడు; అత్యంత సహనపరుడు.

115. ఏవి చెడుగులనుండి తప్పించుకొని తిరుగవలెనో సంపూర్ణముగ తెలిపిగాని, సన్మార్గమును చూపినపిదప భగవంతుడు తిరిగి ప్రజలను విపథగాముల నొనర్పడు. నిశ్చయముగ భగవంతుడు సర్వజ్ఞుడు.

116. నిశ్చయముగ భగవంతుడు భూమ్యాకాశములందున్న సర్వస్వమునకును ప్రభువు. అతడే జీవింపజేయును; అతడే మరణము కలిగించును. అల్లాః తప్ప మీ కెవ్వరును సహాయులు గాని పోషకులు గాని లేరు.

117. నిశ్చయముగ భగవంతుడు ప్రవక్తయెడలను, ఇండ్లు వాకిండ్లు విడిచి ధర్మసంరక్షణార్థము వచ్చినవారియెడలను, వారికి సహాయము చేసినవారియెడలను అనుగ్రహము చూపెను. వీరు అత్యంత కష్టపరిస్థితులలో, నిస్సహాయస్థితిలో ప్రవక్త అడుగుజాడల వెంబడించిన

వారు. వారిలో కొందరి హృదయములు సంకోచస్థితిలో ఉండినసమయమది. భగవంతుడు వారందరియెడలను అనుగ్రహము చూపెను. భగవంతుడు అనుగ్రహపూర్ణుడు ; దయానిధి.

118. (అదేవిధముగ) విడిచిపెట్టి వేయఁబడిన ఆ ముగ్గురియెడ కూడ (భగవంతు డనుగ్రహము చూపెను.) భూమి ఎంతో విశాలమైనదయ్యు వారికై ఇరుకై పోయెను. భగవంతుని విడిచి వారికి మరెక్కడను ఆశ్రయము లభించలేదు. భగవంతుని వద్దనే వారి కాశ్రయము లభించెను. వారు పశ్చాత్తప్తులగుదురని భగవంతుడు వారియెడ అనుగ్రహము చూపెను. నిశ్చయముగ భగవంతుడు మహాక్షమి; కరుణానిధి.

పదునేనవ ఖండము

119. ఓ విశ్వాసవంతులారా! భగవద్భీతిపరులై సత్యవ్రతులతో ఉండుడు.

120. ప్రవక్తకు తోడ్పడక వెనుక దిగబడియుండుట మదీనావాసులకును, పరిసరములందుండిన వారికిని అనుచితమై యుండెను. అంతేకాక ప్రవక్త క్షేమమును సరకుచేయక తమ ప్రాణములు వదలపరచుకొన జూచుటయు వారి కనుచితమై యుండెను. ఎందుకన దాహము వల్ల వారికి కల్గు బాధ, వారు భరించు ప్రతికష్టము, వారు చిక్కుకొను ప్రతి ఇబ్బంది, అవిశ్వాసులను ఆగ్రహావేశమున ముంచు ప్రతి ముందడుగు, వారు శత్రువులనుండి పొందు ప్రతివస్తువు వారికై ఒక సత్కృతిగా పరిగణింపబడును. నిశ్చయముగ అల్లాః సత్కార్యాచరణపరుల సత్కృతుల ఫలమును వమ్మొనర్పడు.

121. కొద్దియైనను గొప్పదైనను వారు (భగవన్మార్గమున) చేసిన ఖర్చు, వారు (భగవన్మార్గమున యుద్ధమొనర్చుటకు) దాటిన లోయలు—అన్నియు సత్కృతులుగా వారి లెక్కలలో వ్రాయబడును. వారు చేసిన ప్రతి సత్కృతికి భగవంతుడు ఉత్తమ తమమగు బహుమాన మిచ్చును.

122. (ధర్మ విజ్ఞానమును పొందుటకై) విశ్వాసవంతు లందరును ఒకేసారి వెళ్ళుట సాధ్యముకాదు. జట్టులు జట్టులుగా పోయి ధర్మవిజ్ఞానమును వారేల బడయరాదు? (అట్లు ఒక్కొక్క జట్టు ధర్మవిజ్ఞానమును బడసి) తమ తెగకు మరలి వారికా జ్ఞానమును బోధించి వారిని ప్రబుద్ధుల నొనర్ప వచ్చును.

పదునారవ ఖండము

123. ఓ విశ్వాసవంతులారా! మీకు సమీపమునందున్న అవిశ్వాసులతో మీరు పోరాడుడు. యుద్ధములో వారు మీ శక్తిని చవిచూచెదరుగాక! దైవభీతి పరులకు తోడుగా భగవంతుడున్నాడని వారు గ్రహింతురుగాక!

124. (భగవద్గ్రంథమందలి) ఒక అధ్యాయము ప్రోక్తమైనప్పుడెల్ల వారిలో కొందరిట్లందురు : "మీలో ఎవరి విశ్వాసము దీనివల్ల దృఢపడినది?" వాస్తవ మేమనగా, నిజమైన విశ్వాసవంతుల విశ్వాసము దానివలన నిజముగ దృఢపడెను. వారు సంతోషముచే ఉప్పొంగుచున్నారు.

125. కాని ఎవరి హృదయములందు (అవిశ్వాస) రోగమున్నదో వారి (హృదయ) మాలిన్యమున కది మరింత మాలిన్యమును చేర్చును. వారు అవిశ్వాసమునందే మరణింతురు.

126. ప్రతి సంవత్సరము వారు ఒకటి రెండుసార్లు పరీక్షింపబడుచున్నారని వారు గ్రహించలేదా? ఐనను వారు పశ్చాత్తప్తులై జాగరూకత వహించరు.

127. ఒక అధ్యాయము ప్రోక్తమైనప్పుడెల్ల వారు ఒకరిముఖము లొకరు చూచుకొందురు. 'మీపై ఎవరిదృష్టి యైనను పడుటలేదు కదా?' (అని ఒకరి నొకరు చూచుకొందురు.) తర్వాత వారు తమ ముఖములు త్రిప్పికొందురు. అజ్ఞానులగు వారి హృదయములను భగవంతుడు (సత్యమునుండి) త్రిప్పివైచెను.

128. నిశ్చయముగ మీ నుండియే మీకడ కొక ప్రవక్త వచ్చెను. మీరు కష్టములందు చిక్కుకొనుట అతనికి దుఃఖము కలిగించినది. అతడు మీయెడ ఎక్కువ శ్రద్ధ కలవాడు. విశ్వాసవంతులయెడ అతడు దయా దాక్షిణ్యములను చూపువాడు.

129. (ఓ ప్రవక్తా!) దీని తర్వాతకూడ వీరు పెడ మొగము పెట్టుకొన్నచో వారితో ఇట్లనుము: "నాకు భగవంతుని ఆశ్రయము చాలును. భగవంతుడు తప్ప ఆరాధనమున కర్హుడు మరొకడు లేడు. నేను అతనినే పూర్తిగ నమ్ముకొని యున్నాను. అతడు సమస్త శక్తులకు ప్రభువు.

వ్యాఖ్యానము

...MIA BOOK DEPOT
GUNTUR

ఖురాన్ షరీఫ్ వ్యాఖ్యానము

తొలిపలుకు

"పవిత్రమగు ఈ పుటలలో సమస్త (సత్య) వేద సారము కలదు" అను ఖురాన్ వచన మొకటి ఈ గ్రంథము అట్టపై ముద్రింపబడినది. ప్రారంభమునుండి నేటివరకు వివిధ దేశములలో వివిధ ప్రవక్తలకు ప్రోక్తమైన సర్వధర్మ సంగ్రహము ఖురాన్ అని దీనిభావము. సత్యము సనాతనమైనది. అది వివిధ కాలములలో వివిధ దేశములం దుద్భవించిన మహామహులగు ప్రవక్తలకు దైవదత్తమైనదని ఖురాన్ మతము.

ధర్మము మూలమున ఒక్కటయ్యు దేశకాలాది పరిస్థితుల ననుసరించి అది ఆచరణమునకు వచ్చును. రాకపోకల సౌకర్యములు లేక, ఒకజాతి భాష ఒకరికి అర్థముకాక ఉన్న కాలములో ప్రవర్తింపజేయబడు ధర్మము ఏదేనిఒక తెగకును, ఒకజాతికిని ఆచరణయోగ్యమైన ధర్మమే కావలెను. పూర్వకాలము ప్రవర్తింపజేయబడిన ధర్మములన్నియు నట్టివే.

శ్రీ మొహమ్మద్ ప్రవక్త కాలము ఆధునిక యుగద్వారము వంటిది. అందుచేతనే శ్రీ ప్రవక్త :

> "వెనుకటి ప్రవక్తలు తమతమ దేశములకు ధర్మప్రబోధము కావించుటకు పంపబడిరి. నేను సర్వప్రపంచమునకు ధర్మప్రబోధకునిగా పంపబడినాను"

అని సెలవిచ్చిరి. ఖురాన్ ఒక ఆధునికధర్మము. ఖురాన్ ప్రతిపాదించిన ఈ ధర్మము కేవలము మానవుని ఆధ్యాత్మిక జీవితమునకే మార్గదర్శకము కాదు. మానవుని ఆర్థిక, సాంఘిక, రాజకీయ జీవితమునకు మార్గదర్శకమై యున్నది. అంతేకాదు; ఈ ధర్మము సర్వకాలసమ్మతమైనది. సర్వవిధ శీతోష్ణ పరిస్థితులందును ఆచరణయోగ్యమైనది. ఖురాన్ ప్రతిపాదించిన ధర్మము మిక్కిలి సరళమైనది. ఏకైకత (Unity) దాని పునాది—ఏకైకుడగు భగవంతుడు; ఏకైకమగు మానవసంఘము.

ఇస్లామ్ దృక్పథము విశ్వవిశాలము. జాతి కుల వర్ణ మత దేశ వేష భాషా భేదములకు ఇస్లామీయ ధర్మములో స్థానములేదు. రంగు భేదములు భాషాభేదములు శీతోష్ణస్థితుల భేదములవంటివి. అవిమన అనుకూలమున కేర్పడినవేగాని మానవసంఘ విభజనమునకు కాదు. ఆయా ప్రాంతముల శీతోష్ణ పరిస్థితులనుబట్టి రంగులందును, భాషలయందును, వస్త్రులయందును భేదము కలిగినది. చలిప్రదేశములం దుండువారు తెల్లవారైరి; వేడిప్రదేశములం దుండువారు నల్లపడిరి. భాషలుకూడ అట్లే రూపొందినవి. అలవాట్లుకూడ అదేవిధముగ ఏర్పడినవి. ఈ భేదములు మానవజాతి ఏకైకతకు భంగకరములు కావు. భాషాశాస్త్రజ్ఞు లందరును ఇప్పుడు సమస్త భాషలు ఒకేభాషనుండి ఉత్పన్నమైనవని నిరూపించుచున్నారు. ఇప్పుడు ప్రపంచమంతయు ఒక్కటగుచున్నది. ప్రపంచమంతటికిని ఒక సామాన్యభాష కావలెనని భావుకులు సూచించుచున్నారు. ప్రపంచ మహాసభలు జరుగుచున్నవి. దూరము క్రమక్రమముగ మాయమగుచున్నది. వాయుయానము, రేడియో, టెలివిజన్ మున్నగు పరికరములు ప్రపంచమునంతటిని ఒక పొరుగుగా మార్చుచున్నవి. ఇంకను ఏవ మహాత్మ్యములను సైన్సు చూపనున్నదో!

ఈ పరిస్థితులలో ఖురాన్ చూపిన మార్గము ఒక్కటే ఆచరణయోగ్యమైనదని ఈ గ్రంథము చదివినవారందరకును విశదము కాగలదు.

ఖుర్ ఆన్ గ్రంథమునకును ఇతర ధర్మగ్రంథములకును కొన్నివిష యములలో ముఖ్యమైన భేదములు కలవు :

1. ఖుర్ ఆన్ సంపూర్ణ మానవజీవితమునకు వలయు ధర్మమును ప్రతిపాదించుచున్నది. ఇతరగ్రంథము లేవియు జీవితమునకు కావలసిన సంపూర్ణ ధర్మమును ప్రతిపాదింపలేదు.

2. ఖుర్ ఆన్ సర్వప్రపంచమునకు ఆచరణయోగ్యమైన మానవధర్మమును ప్రతిపాదించినది. మరే ఇతరగ్రంథమును అట్లు చేయలేదు.

3. ఖుర్ ఆన్ ప్రతిపాదించిన ధర్మము ఆధునిక భౌతిక, నైతిక సాంఘిక, ఆర్థిక, రాజకీయ శాస్త్రవిజ్ఞానమునకు విరుద్ధముగ లేదు.

4. ఖుర్ ఆన్ కేవలము ఆదర్శప్రాయమైనదే కాక ఆచరణయోగ్యమైనట్టి మానవధర్మమును ప్రతిపాదించుచున్నది.

5. ఏకేశ్వరత్వము, విశ్వమానవ సౌభ్రాతృత్వము ఈ ధర్మము యొక్క పునాదులు.

6. ఈ ధర్మము సమస్త మూఢాచారములను పడగొట్టుచున్నది.

7. ఒక ప్రపంచధర్మమును, ఒక ప్రపంచసంఘమును, ఒకప్రపంచ ధర్మపరిపాలనమును ప్రతిపాదించినధర్మ మిదొక్కటే.

ఆధునిక ప్రపంచము తెలిసియో తెలియకయో ఈ ధర్మమువైపునకే ఆకర్షింపబడుచున్నది. ఇది సహజము, అనివార్యము. సైన్సు దూరమును కుంచించినది. ప్రపంచము మానవునకు చిన్నదిగా కన్పట్టుచున్నది. అతడు ఆకాశమువైపునకు సాగుచున్నాడు. అతని ఇండ్లుసైతము భూమినివిడిచి ఆకాశమువైపునకు పయనమొనర్చుచున్నవి. అతని విమానములు నక్షత్రమండలమును శోధించుచున్నవి. నక్షత్రములలో వాలనున్నవి. ఏకైక ప్రపంచమను భావము మానవునిలో జీర్ణించుచున్నది. భాషాభేదములు తొలగుచున్నవి. ఇంగ్లాండు దేశపు షేక్స్పియరు జర్మన్ దేశీయుడగు గతే, ఫ్రెంచి దేశీయుడగు రూజో, ఇటలీ దేశస్థు

డగు క్రోసె, రష్యన్ టాల్‌స్టాయి, గ్రీకు హోమర్, పారసీ ఉమర్ ఖయ్యామ్, జపాను కగావా, చైనా సన్‌యాట్‌సేన్ ప్రతికాలేజి విద్యార్థి విజ్ఞానకోశములో ఉన్నారు. అతనికి వారి భాషలతో సంబంధములేదు. వారి జాతులతో సంబంధములేదు. కాళిదాసు, పెద్దన, వేమనలతో అతనికెంత పరిచయమో, పైన పేర్కొన్న సమస్త భావుకలోకముతోడను అతనికంతే పరిచయము. ఖుర్ ఆన్ ఈ మనస్తత్వమునే కలిగించుచున్నది. యారిస్టాటల్, ప్లేటో, గ్యాలెన్ మున్నగు ప్రాచీన గ్రీకుభావకుల గ్రంథము లొకవంకను, ప్రాచీన ఆర్యవిజ్ఞానమును మరొకవంకను వెతికి, పైకితీసి, వ్యాఖ్యానించి లోకమునకు వెల్లడించినది ఖుర్ ఆన్ అనుయాయులనుటకు చరిత్రయే సాక్షి. ఖుర్ ఆన్ ఆధునిక యుగద్వారమును తెరచినది.

ఇప్పు డాధునికయుగము కేవలము ప్రాపంచిక పంకమున చిక్కిపోయినది. ప్రాపంచిక లాభమునకై దేవులాడుచు దేవుని మరచినది నీతిని విడనాడినది. దురాశ, పరవంచన, పరపీడనము, స్వలాభాపేక్ష మున్నగు దుష్ప్రవర్తనకు గడగి దేశములు పరస్పర వినాశమునకు అవకాశముల నరయుచున్నవి. ఐహిక వాంఛలతోపాటు, ఆముష్మిక చింతయు మానవజీవితమును నడిపించనప్పుడు ప్రపంచ సంక్షోభము కల్గును. ఈ పరిస్థితులలో ఖుర్ ఆన్ ధర్మము ఎంతవరకు మానవుని ఆధునిక జీవిత సాఫల్యమునకు తోడ్పడునో చదువరులే గ్రహించవచ్చును.

ఖుర్ ఆన్ ప్రతిపాదించిన ధర్మము క్రొత్తదికాదు. సనాతనమైన సత్యమునే ఖుర్ ఆన్ ఆధునిక ప్రపంచ పరిస్థితుల కనుసరింపజేసినది. ప్రతి జాతి కొన్ని సంప్రదాయములను, కొన్ని ఆచార వ్యవహారములను అలవరచుకొన్నది. అది సహజము. ఈ సంప్రదాయములు ఈ ఆచారవ్యవహా

రములు, వానినాధారముగ ఏర్పడిన మనస్తత్త్వము సత్యమునకు విరుద్ధమైనప్పుడు ధర్మముయొక్క పతనము జరుగును. సత్యముకంటె సంప్రదాయము బలవత్తరమైనప్పుడు, ధర్మమునశించి ఆచారము దానిస్థానమున నెలకొనును. ఆచారమునకు ఆత్మలేదు. అది గుడ్డిఅనుకరణము. కాని దానిపట్టు మిక్కిలి గట్టిది. అది మన స్వభావములో భాగమైపోవును. మన మనస్తత్త్వములో జీర్ణించిపోవును.

సంప్రదాయమునకు కట్టుపడియున్న జాతులను సత్యమువైపునకు పిల్చినది ఖుర్ ఆన్. భారతీయార్యర్షులు ఏసత్యమును బోధించిరో, మోసెస్‌ప్రవక్త మధ్యప్రాచ్య దేశములందే సత్యమును ప్రవర్తింపజేసెనో, ఏసుక్రీస్తు ఏధర్మమును లోకమునకు చాటెనో, గౌతమబుద్ధుడు ఏధర్మపథమును చూపెనో, అట్లే వివిధ దేశములందు, వివిధయుగములలో, వివిధజాతులకు, వివిధభాషలలో బోధించిన దేధర్మమో అదేధర్మమును ఖుర్ ఆన్ బోధించినది. అదేధర్మమును ఆధునిక ప్రపంచపరిస్థితుల కనువర్తింపజేసినది. జాతీయధర్మములను ప్రపంచధర్మముగ మార్చినది. కాని ఈ ధర్మమునకు పునాదయైన సత్యము అనాదినుండియు ఒకటే. భగవంతుడొక్కడే కాడని చాటని ధర్మములేదు. మానవజాతియంతయు ఏకైక కుటుంబమని సూచించని ధర్మములేదు. పరపీడనము పాపమని చెప్పనిధర్మము లేదు. పరోపకారము పుణ్యమని చెప్పని ధర్మములేదు. అన్నిధర్మములు చాటిన సత్యమొక్కటే. కాని జాతీయ సంప్రదాయములు, జాతీయాచారములు, మూఢవిశ్వాసములు ఈ సత్యమును త్రొక్కిపెట్టి యుంచినవి. ఖుర్ ఆన్ సంప్రదాయము ఆచారము సత్యమని భ్రమించుచున్న జాతుల భ్రాంతిని తొలగించుచున్నది. బ్రహ్మము సంప్రదాయముకాదు ఆచారముకాదు; బ్రహ్మము సత్యము. ఖుర్ ఆన్ ఈ సత్యమునైపునకు పిలుచుచున్నది. ఈ పిలుపును ఆంధ్రలోకమునకు విస్పష్టముగ వినిపింపచుటే ఈ వ్యాఖ్యానోద్దేశము.

بسم الله الرحمن الرحيم

సూరయె ఫాతిహా లేక ప్రారంభాధ్యాయము

వ్యాఖ్యానము

ఖుర్ ఆన్ గ్రంథమున కిది ప్రారంభాధ్యాయము. ఇందు ఏడు (౭) ఋక్కులు కలవు. ఇది ప్రవక్త మక్కాపట్టణమందుండగా ప్రోక్తమైనది.

ఈ అధ్యాయము "బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్" (వరప్రదాయకుడును, కరుణామయుడును అగు అల్లాః నామస్మరణముతో ప్రారంభించుచున్నాను) అనువాక్యముతో ప్రారంభింపబడినది. ఖుర్ ఆన్ గ్రంథమున ౧౧౪ అధ్యాయములున్నవి. అందులో ౯ వ అధ్యాయము తప్పతక్కిన ౧౧౩ అధ్యాయములును ఈ తొలిసూక్తితోడనే ప్రారంభమగును. ప్రతి కార్యారంభమునను ముసల్మానులు దీనిని స్మరింతురు.

'ఫాతిహా' అను పేరు గల ఈ అధ్యాయము కడు చిన్నదైనను ఇస్లాం మతసారమిందు సూత్రీకరింపబడినది. ఈ అధ్యాయ ప్రాశస్త్యమును ఖుర్ ఆనే ఈ విధముగ నుగ్గడించుచున్నది :

"ఓ ప్రవక్తా! మహత్తుగల ఖుర్ ఆన్ గ్రంథముతోపాటు పునశ్చరణము నిమిత్తము ఏడు వాక్యములు గల అధ్యాయమును ప్రసాదించితిని."

ప్రవక్త ఈ అధ్యాయమును ఖుర్ ఆన్ యొక్క శిరస్సనియు, ఖుర్ ఆన్ యొక్క పునాది యనియు వచించిరి.

ఈ అధ్యాయము ప్రార్థనారూపమున ఉన్నది. అందుచేతనే దీని ననుదినము ప్రార్థనములందు ముస్లిములనేకమారులు పఠింతురు. ఖుర్ ఆన్ గ్రంథమును సమగ్రముగ చదువలేనివారీ ఏడు వాక్యముల యర్థమును బాగుగ అవగాహనము చేసికొనుచో ఇస్లాం మత సారము వారికి కరతలామలకమగును.

ప్రతి మానవుడును నైజముగ ఈశ్వరుడొకడున్నాడని నమ్ముచున్నాడు. ఈ భావము మానవుని ప్రకృతియందే వేరుగొనియున్నది. మానవ పరిణామమందలి అన్ని

దశలయందును ఈ భావము కాన్పించుచున్నది. కాని తన అంతరాత్మ 'అస్తి' (ఉన్నది) అని చెప్పుచున్న ఈ బ్రహ్మము ఎక్కడ, ఎట్లు, ఏగుణములు కలిగిఉన్నది అను ప్రశ్న మానవుడు నిరంతరము చేయుచునేయున్నాడు. "కిం బ్రహ్మ" (బ్రహ్మమననేమి?) "కస్మై దేవాయ హవిషా విధేమ?" (ఏదేవునకు మా హవిస్సుల నివ్వవలెను?) "కిం కారణం బ్రహ్మ?" (ఈ ప్రపంచమునకు బ్రహ్మమే కారణమా?) ఇత్యాదిప్రశ్నలు అనాదినుండియు మానవ హృదయమును వేధించుచునే ఉన్నవి. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ" (బ్రహ్మమును పొందలేక వాక్కులు మనస్సుతో మరలుచున్నవి) అనిగాని లేక "తపసాబ్రహ్మవిజిజ్ఞాసస్వ" (తపస్సు లేక ఆధ్యాత్మికాలోచనము వలన బ్రహ్మమును తెలిసికొనుము) అని చెప్పుటగాని ఈ ప్రశ్నలకు సమాధాన మిచ్చుటకాదు. బ్రహ్మజ్ఞానమున కాధ్యాత్మికాలోచన మవసరమే కాని అది సామాన్యులకు సాధ్యము కాదు. మతము సార్వజనీనకమై యుండవలెను. బ్రహ్మస్వరూప నిర్ణయమున జ్ఞాని, అజ్ఞాని అను భేదముండకూడదు. బ్రహ్మమును పొందు మార్గములయందు భేద ముండిన నుండవచ్చును; బ్రహ్మతత్వజ్ఞానమందు మాత్రము భేదముండరాదు. అందుచే సార్వజనీనక మగు బ్రహ్మతత్వనిర్వచన మొక టత్యంతావశ్యకమాయెను. అట్టి నిర్వచనముపైననే ప్రతి మతము ఆధారపడి యుండును. ఈ విషయమున ఏకీ భావము కలుగుచో మతబాహుళ్యమునకు స్థానమే ఉండదు. అట్టి నిర్వచనమును నిష్కర్షగా ఇచ్చిన మత గ్రంథము ఖుర్ఆన్ ఒక్కటేనని చెప్పవలెను. ఈ అధ్యాయమున అట్టి నిర్వచనమే సూత్రప్రాయముగ చెప్పబడినది. ఖుర్ఆన్ గ్రంథమంతయు ఈ నిర్వచనమునే ఆధారము చేసికొని తన సమస్త సిద్ధాంతములను ప్రతిపాదించినది.

ఏ కాలమునందైనను మతజిజ్ఞాసువుల నెదుర్కొన్నవి నాల్గు సమస్యలు:

౧. బ్రహ్మముయొక్క లక్షణము లెవ్వి ?

౨. సృజింపబడిన మనము దేనిచేత జీవించుచున్నాము? మనమనుభవించుచున్న సుఖదుఃఖము లెవని అధికారమునకు, నియమములకు లోబడియున్నవి? మన సుఖదుఃఖము లెవరికి నివేదించుకోవలెను? ఎవరి నుపాసింపవలెను?

౩. మనమీ లోకమున ఆచరించుచున్న కర్మల పర్యవసాన మేమి?

౪. మోక్షమార్గ మేది?

ఈ ప్రశ్నలు ప్రతి మానవుని హృదయాంతరాళమునను సదా ప్రతిధ్వనించుచునే యున్నవి. వీనినే శ్వేతాశ్వతరోపనిషత్తు చక్కగ ఇట్లు క్రోడీకరించినది:—

ఓం బ్రహ్మవాదినో వదంతి
కిం కారణం బ్రహ్మ? కుతస్స్మజాతా?
జీవామకేన? క్వ చ సంప్రతిష్ఠితాః?
అధిష్ఠితాః కేన సుఖేతరేషు
వర్తామహే? బ్రహ్మ విదో వ్యవస్థామ్*— ౧. ౧.

ఖుర్ఆన్ లోని ఈ అధ్యాయమున పై ప్రశ్నలకు నిష్కర్షయగు సమాధానము సుబోధకముగ చెప్పబడినది. సత్య మెప్పుడును సులభముగను సుగమముగను ఉండును; శంకలకుగాని అర్థాంతరములకుగాని తావిచ్చుసమాధానము సమాధానమేకాదు. అంతే కాదు; మానవబుద్ధిని ధిక్కరించునదియు, మానవ జ్ఞానమునకు వ్యతిరేకమును విపరీతమును ఐనదియునగు సమాధానము సమాధానమే కాదు. ఖుర్ఆన్ గ్రంథమిచ్చిన సమాధానమున చిక్కులేమియు లేవు; ఏ విధమగు శంకకును తావు లేదు.

భగవంతుని అనంతగుణములను వర్ణించు నామము లన్ని భాషలయందును అన్ని మతముల వారికి కలవు. ఖుర్ఆన్ గ్రంథమునకూడ భగవంతుని కల్యాణగుణములను వర్ణించు పెక్కు నామములు కలవు. వాటి సంఖ్య ౧౦౦౧ అని పండితులు గణించిరి. భగవంతుని అనంత గుణములను వర్ణించుటకు ఎన్ని నామములున్ననేమి కొరత? ఇట్టి గుణవర్ణనము చేయు యే నామమును లేక అన్ని నామములు కలిసియు పరిపూర్ణుడగు బ్రహ్మమును నిర్దేశింపలేవు. ఒక్కొక్క నామము భగవంతుని ఒక్కొక్క అంశను, అన్ని నామములును కలసి భగవంతుని కొన్ని అంశలను మాత్రము నిర్దేశించగలవు. పరిపూర్ణుడగు బ్రహ్మమును నిర్దేశించు శబ్దము సాధకులకును సామాన్యులకునుకూడ చాల అవసరము. ఎందుకనగా గుణనామ సంకీర్తనము చేయువారికి భగవంతుని సంపూర్ణ దర్శనము లభింపదు. "నేదం యదిద ముపాసతే" అను కేనోపనిషద్వచనము నందును, "యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః భూతానియాంతి భూతే

* ఈ ప్రపంచమునకు కారణము పరబ్రహ్మమా? దేనివల్ల నుండి మనము పుట్టితిమి? ఎవని సహాయముచే మనము బ్రతుకుచున్నాము? మన మెచ్చట నున్నాము? సుఖదుఃఖముల వ్యవస్థను ఎవ్వనిచేత అధిష్ఠితులమై అనుభవించుచున్నాము? అని బ్రహ్మవాదులు పరస్పరము చర్చించుకొనుచున్నారు.

జ్యాయాంతి మద్యాజినో౽పి మామ్" (౯: ౨౫). అన్న గీతావచనమునందు ని సత్యమే విశదీకరింపబడినది. అట్టి విభూతులను ఆరాధించుట అజ్ఞానమని గీతయేకాక శ్రుతికూడ "అంధం తమః ప్రవిశన్తి య ఉ సంభూత్యాగ్ం రతాః" అని నిష్కర్షగా చెప్పినది. ఒక్కొక్క భగవద్గుణమును ఒక్కొక్క దేవతగ నిరూపించి అట్టి దేవతలను పూజించు ఆచారముకూడ సార్వార్థిక నామము లేకపోవుటవలననే వచ్చియుండవచ్చును.

భగవంతుని అనంత గుణములలో మూడు అత్యంత ముఖ్యమైనవిగా పరిగణింపబడుచున్నవి:— ౧. సృష్టికర్తృత్వము ౨. పోషకత్వము 3. లయకారకత్వము. పుట్టుక, జీవనము, చావు— ఇవి ప్రతి జీవికి సామాన్య ధర్మములు. ఈ మూడు అవస్థలకు ప్రేరేపకుడు లేక కారకుడైన భగవంతునకు మానవుడు మూడు ముఖ్య గుణముల నాపాదించినాడు. అంతటితో ఆగక ఒక్కొక్క గుణమునకు ఒక్కొక్క రూపమును కల్పించి ఆ రూపములను ప్రత్యేక ప్రత్యేకముగ ఆరాధింపసాగినాడు. బహుదేవతారాధనము ఈ విధముగనే ప్రాకియుండవచ్చును. భగవద్విభూతులనే భగవంతుడని భ్రమించి అనేక దేవతలను కల్పించుకొని ఆదేవతానీకములో ఎవరి నారాధింతునా అని సందేహింపసాగినాడు. ఈ సందేహము ఆర్యజాతిని చిరకాలము బాధించి యుండవలెను: అనేక ఉపనిషత్తులయందు దీనిని గురించిన విచారణ కలదు. ఇట్లు విచారించి ఇట్లు ప్రత్యుత్తర మిచ్చినాడు :

యోదేవా నా మధిపో! యస్మిన్ లోకా అధిశ్రితాః

ః ౪ । కస్మైదేవాయ హవిషా విధేమ *

శ్వేతా. VI.13.

ఇట్లు విజ్ఞానధను లగు మహర్షులును తత్వజ్ఞులును సత్యజ్ఞానానంద స్వరూపుడును అవాఙ్మానసగోచరుడును అగు భగవంతుని తెలిసికొనిరి. కాని జనసామాన్యమగుమతము మాత్రము ప్రతిమోపాసనము, బహు దైవతారాధనము తోడనే ఆగిపోయెను. ఇంత కాక మానవమాత్రులగు శ్రీ కృష్ణ బుద్ధాది మహాత్ములను, ధార్మికులగు రామ హనుమదాది

* ఏ పరమేశ్వరుడు బ్రహ్మాది దేవతలకు అధిపతియో, సర్వకారణ భూతుడగు ఏ పరమేశ్వరుని యందు భూతాది లోకములు అధిష్ఠింపబడియున్నవో, ఏ పరమేశ్వరుడు ఈ మనుష్యులకును, పశువులకును నియామకుడుగా నుంటున్నాడో అట్టి ఆనంద స్వరూపుడును ప్రకాశ స్వరూపుడును అగు పరమేశ్వరుని కొఱకు హవిస్సులను సమర్పించుకొను చున్నాము.

వీరాగ్రేసరులను, దైవతములుగా నారాధింపసాగిరి. అట్లుచేయుట అజ్ఞానమని రామమోహన రాయలవంటి తాత్విక శిరోమణులు మనదేశమున బోధించిరి. ఈ అజ్ఞానమునకంతటికిని బ్రహ్మగుణోపాసనమే కారణమని ఇంతకుముందే చెప్పియుంటిని. బ్రహ్మస్వరూపనిర్ణయము చేయుటయందు ఆర్యఋషులు ఎంతో శ్రమపడిరి. కాని వారి పరిశోధనా ఫలితమునంతటను ఒకచో చేర్చి వాటియందలి సత్యాసత్యములను నిర్ణయించు గట్టిప్రయత్నమును విమర్శక దృష్టితో ఎవరును చేయరైరి: అట్లు ప్రయత్నము చేసినవారు కూడ "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనుసిద్ధాంతము ననుసరించి సూర్యాది సమస్త భూతములం దంతర్యామియై యున్న భగవదంశమును ఆధారముగ గొని అయ్యైవస్తువులను బ్రహ్మైక భేదముగా సిద్ధాంతీకరించిరి. (ఛాందో. ౧-౬-౬. తైత్తి. నా. ౧౩-౧౪)

ప్రపంచమునందలి యే మతమునందైనను శుద్ధబ్రహ్మమునకు సార్వార్థిక నామమున్నట్లు కన్పించదు. బ్రహ్మము అచిన్త్యరూపము; అవాఙ్మానసగోచరము; అనంతము; అఖండము. అట్టి బ్రహ్మమును నిర్దేశించు శబ్దము మరొక అర్థమునకు తావీయకూడదు. ఖుర్ఆన్ అట్టి శబ్దమును కల్పించినది. ఆ శబ్దమే "అల్లాః." ఈ శబ్దమునకు వ్యుత్పత్తి లేదు; లింగ వచనములు లేవు; ఎట్టి ఆకారమునకును ఇది చిహ్నముకాదు. నిరాకారుడగు శుద్ధబ్రహ్మమునకే ఇది చిహ్నము. తక్కిన సహస్ర సంఖ్యగల నామము లన్నియు గుణనామములు మాత్రమే. "అల్లాః అసంఖ్యాక కల్యాణగుణకలితుడు. మీకిష్టమైనచో ఆ గుణములతో వానిని సంబోధింపుడు." (౧౭౯ : ౭.) అని ఖుర్ఆన్ చెప్పుచున్నది. అల్లాః శబ్దమును శుద్ధ బ్రహ్మమునకు సంజ్ఞావాచకముగ ఖుర్ఆన్ యేర్పరచినది.

ఇట్లు శుద్ధబ్రహ్మమున కొక సార్వార్థిక నామమును ఏర్పరచి ఈ అధ్యాయము నాల్గు ప్రధాన గుణనామములను పేర్కొనుచున్నది. ఈ గుణ నామములు బ్రహ్మస్వరూప నిర్ణయమును చేయుచున్నవి. బ్రహ్మలక్షణము లీ నామములందు వివరింపబడినట్లు యింక వేరియందును వివరింపబడలేదు. ఈ నామములు వరుసగా ఇవి: రబ్, రహ్మాన్, రహీమ్, మాలికెయౌమిద్దీన్.

'రబ్' అను నామమును నేను 'పరిపోషకుడు' అని తెనిగించితిని. తెలుగున మరొకవిధముగ ఆ శబ్దార్థము ననువదింప సాధ్యము కాలేదు. ఈ శబ్దమునకు అరబీభాషయందు విశాలమగు అర్థము కలదు. "ఉత్పత్తి యైనది మొదలు సంపూర్ణాభివృద్ధినొంది గమ్యాంతమును చేరువరకు గల సమస్తావస్థలయందును తత్తదుచితమగు పోషణము నిచ్చువాడు" అని రాగిబ్ అను నిఘంటుకారుడు దీని యర్థమును వ్రాయుచున్నాడు. అనగా ప్రతి వస్తువును సృష్టియందలి దాని ప్రథమావస్థ మొదలుకొని చరమావస్థ వరకు గల

సమస్తావస్థలయందును ఆయా అవస్థలకు కావలసిన సమస్త పోషణయు నిచ్చువాడ... ర్థము. సృష్టి స్థితి లయములను మూడవస్థలయందు మొదటి రెండవస్థలకును పోషకుడు అను అర్థ మిం దున్నది.

భగవంతునియొక్క వర్ణనములలో ముఖ్యమైనవి అతని సృష్టి కర్తృత్వమున పోషకత్వమునకును సంబంధించినవి. "కిం కారణం బ్రహ్మ? కుతస్మజాతా? జీవామ క్వ చసంప్రతిష్ఠితా?" ఇత్యాది ప్రశ్నల కన్నిటికిని సమాధాన మిం దీయబడినది. తా... కులు కొందరు సృష్టికి కారణము బ్రహ్మము కాదనియు కాలాదులు కారణమని చెప్పిరి. కర్మయే జగత్కారణమని మీమాంసకులును, ప్రకృతిస్వభావమే జగత్కా... మని లోకాయతికులును, కాలమే కారణమని కాలవేత్తలును, యదృచ్ఛ చేతనే జగ... సృజింపబడుచున్నదని నిరీశ్వరవాదులును, పంచమహాభూతముల సంయోగము జగత్సృష్టి జరుగుచున్నదని జగన్నిత్యత్వవాదులును, ప్రకృతియే జగత్కారణమని శా... యులును, ఇట్లు వివిధముగ తలచుచున్నారు. ఈ వివిధ మతములను పేర్కొని శ్వే... శ్వతరశ్రుతి :

తేధ్యానయోగానుగతా అపశ్యన్
దేవాత్మశక్తిం స్వగుణైర్నిగూఢామ్,
యః కారణాని నిఖిలాని తాని
కాలాత్మయుక్తా న్యధితిష్ఠత్యేకః

(1 : 3)

(ఆ బ్రహ్మవేత్తలు ధ్యానయోగము ననుసరించినవారై ఏ అద్వితీయుడగు పర మాత్మ కాలము మొదలుకొని పురుషునివరకు గల ఆ కారణముల నన్నిటిని నియమించు చున్నాడో అట్టి పరమాత్మయొక్క సర్వజ్ఞత్వ సర్వేశ్వరత్వాది గుణములచేత నిగూఢ మైనట్టి ప్రకాశస్వరూపుడగు పరమాత్మయొక్క జగదుత్పత్తి స్థితి లయ నియమనశక్తి ని జగత్కారణముగా నెఱింగిరి.)

అని ఈ సర్వకారణములను నియమించు అద్వితీయుడగు పరమాత్మయొక్క సర్వ జ్ఞత్వ సర్వేశ్వరత్వాది గుణములచేత నిగూఢమైనట్టి జగదుత్పత్తి స్థితి లయ నియమ శక్తియే జగత్కారణమని చెప్పుచున్నది.

ఇక్కడ ఖుర్ ఆన్ గ్రంథము భగవంతుడు సృష్టికర్త యనియే కాక సర్వావ స్థలయందును పోషకుడనికూడ చెప్పుచున్నది.

ఇంక రెండవనామము 'రహ్మాన్.' ఈశబ్దమును 'వరదుడు' అని నే నాంగీకరించి తివి. రహ్మాన్ అనగా శ్రేష్ఠమగు వస్తువుల నిచ్చువాడని అర్థము. భగవంతుడు మన ...చుచుండిన శ్రేష్ఠమగు వస్తువు లెవ్వి? ఎట్లిచ్చుచున్నాడు? ఎవరి కిచ్చుచున్నాడు? అని ప్రశ్నలు సహజముగ ఉత్పన్నమగును. ఈ ప్రశ్నలకు ఖుర్ ఆన్ గ్రంథమున స్పష్ట మగు ప్రత్యుత్తరము లీయబడినవి.

భగవంతుడు సృష్టికర్త. మనస్థితికి కారకుడు అన్నవిషయము "రబ్" నామ మునం దిమిడియున్నదని చెప్పియుంటిని. అట్టిసృష్టికి శ్రేష్ఠత్వమును ఆపాదించువాడు కూడ భగవంతుడు. ప్రకృతియందు కేవలము నిర్మాణ కౌశలమే కాక, సౌందర్యాపాద నాశక్తియు కనిపించుచున్నది, అందుచేతనే ప్రతివస్తువు సుందరమగుచున్నది. పువ్వు లయందు పరిమళము, పక్షుల కలకలము, వృక్షముల మనోహర పర్ణములు, జంతువుల నయనానందకరమగు రంగులు, సూర్యుని తేజస్సు, చంద్రుని వెన్నెల, నక్షత్ర ముల కాంతులు, శిలలయందలి చిత్రవర్ణములు, సీతాకోక చిలుకరెక్కల నవరింపు, ... ఇవన్నియు భగవత్సృష్టికి అమూల్యాభరణములు. సృష్టివ్యాపారమునందు అలంకృతికూడ కన్పించుచున్నది. ఈ అలంకారగుణమే "రహ్మత్" అని ఖుర్ ఆన్ చెప్పుచున్నది. సౌందర్యము, శ్రేష్ఠత్వ ములేని సృష్టి ఎడారివంటిది. దానిలో ఆనందములేదు. అందుచే భగవంతుడు ప్రతి వస్తువునందును శ్రేష్ఠత్వమును సౌందర్యమును ఉంచెను.

"ప్రతివస్తువును సౌందర్యవంతముగను శ్రేష్ఠముగను నిర్మించిన భగవంతుడు కళా కారుడు." [సున అల్లాహిల్లజి అత్ ఖన కుల్ల షైఇన్.]

"నేను సృష్టించిన ప్రతివస్తువును సుందరముగనే నిర్మించితిని;" [అల్లజీ అహ్ సన కుల్ల షైఇన్ ఖలఖహు]

"సౌందర్యాపాదకమగు నాశక్తి సమస్త వస్తువులను పరివేష్టించి యున్నది." [వరహ్మతి వసిఅత్ కుల్లషైఇన్] అని ఖుర్ ఆన్ వాక్రుచ్చుచున్నది.

భగవంతుని సృష్టిలో మరొక విశేషము కలదు. ప్రతివస్తువు మన ఉపయోగ మునకే సృష్టింపబడినది. అనుపయుక్తమగు వస్తు వేదియు సృష్టియందు లేదు. ఇదికూడ భగవంతుని వరదాయకత్వమే.

ఇంక ఈ వరదాయకత్వము, ఈ శ్రేష్ఠత్వ సౌందర్యాపాదకమగు శక్తి ఎట్లు ప్రకాశమునకు వచ్చుచున్నవి ? భగవంతుడు ప్రకృతిని కొన్ని నియమములచే బంధించి నాడు. ఆ నియమములకు లోబడి ఈ శక్తులు క్రమముగ పరిణమించి పరిపక్వదశను పొందును. ఈ క్రమ వికాసధర్మముకూడ భగవంతుని వరదాయకత్వ గుణమువలననే యే

ర్పడినదని ఖుర్ ఆన్ చెప్పుచున్నది. ఈ ప్రకృతి పరిణామక్రమమునకు లోబడియే సృష్టియు నడచుచున్నది.

భగవంతుని అనంతమగు వరప్రసాదత్వమున అందరకును భాగ మున్నది. ...యందలి వరములు అందరిసొత్తుగా భగవంతుడు నియమించినాడు. సూర్యుడు ...కును, సజ్జనులకును ఒకేవిధమగు లాభమును కలిగించుచున్నాడు. కాని దుర్మార్గులు ...వంతుని వరములను దుష్టమార్గమున వినియోగించుచున్నారు. దానిఫలము వారి క... కలుగును.

ఈశ్వరదత్తమగు వరములను తమ ఆత్మోత్థానమునకును జన్మసాఫల్యమున... ఉపయోగించుకొనక దౌర్మార్గ్యమునకై వినియోగించినచో వెంటనే శిక్ష దొరు... అగ్నిని స్పృశించిన కాలును. సముద్రములో దుమికిన మునిగి చావవలసివచ్చును. కాని అగ్ని, నీరు — ఇవి భగవంతుని అత్యంత శ్రేష్ఠమగువరములలో చేరినవి. వానిని మనము దుర్వినియోగము చేయుచో అవి ప్రాణాంతకమగును. సృష్టియందు అపకారకరము హేయమును అగు వస్తువేదియును లేదు. వాని దుర్వినియోగమే వాటియందపకార భీతియు హేయభావమును కలిగించుచున్నది.

మన ప్రతి చేతకును ప్రతిఫల మున్నది. అది దైవనిర్ణీతము — ప్రకృతియందే ఆ నియమము స్థగితమై యున్నది. చేతకు ప్రతిచేత కల్గించుశక్తి ఒక భగవద్విభూతి. ఈ అధ్యాయమందలి నాల్గవగుణము ఈ విభూతి నే వర్ణించుచున్నది. "మాలికెయౌమిద్దీన్" (అవసానదినము నాటి న్యాయాధినేత).

ప్రకృతియందు బాధ, తన్నివారక సాధనములు — రెండును ఒకదాని వెంబడి ఒకటి కన్పించుచున్నవి. ఈ ధర్మము ఒక జీవకణము మొదలు బ్రహ్మాండమువరకును గల్గి సమస్త జీవులయందును పనిచేయుచున్నది. మనము కాలుజారి నీట పడినప్పుడు నీరు వెంటనే ముంచి చంపదు. అది ముందు పైకి తేల్చును. ఏదేని విషక్రిమి మన దేహమున ప్రవేశించినపుడు ఇంతకుముందే దేహమునన్ను అనేకక్రిములు దానిని ముట్టడించును. ఇది శరీరశాస్త్రజ్ఞుల కందరకును తెలిసిన సామాన్య విషయము. ఎట్టి కార్యమున కెట్టి ఫలము కలుగవలెనో ఆ విషయము సృష్టియందే ఉన్నది. కాని మానవజీవితము ... కార్యనిర్మితము కాదు. మనము చేయు లక్షలకొలది పనులు, మాట్లాడు లక్షలకొలది మాటలు, తలచు లక్షలకొలది తలపులు — వీటి అన్నిటివలన కలిగిన సామూహికఫలము మరణానంతరమే నిర్ణయింపవలెను. ఎందుకనగా ఆ ఫలము మనము జీవితకాలమంతటను కావించిన సమస్తకర్మలయొక్కయు, పలికిన సమస్త భాషణములయొక్కయు ...లచిన సమస్త భావములయొక్కయు సామూహికఫలము. ఆ ఫలము సహితము భగవం... అనుల్లంఘనీయమగు ప్రకృతిధర్మము ననుసరించియే యుండును. "భగవన్నియమము ...లో యెట్టిమార్పును కలుగజాలదు." [ఖు. 30 ; 30] అట్టి సామూహికఫలమును తుది ...మున నిర్ణయించువాడు భగవంతుడు. ఇది భగవంతుని ముఖ్య విభూతులలో నొకటి. ...న మరణానంతర జీవితము దీనిపైననే ఆధారపడి యున్నది.

ఇట్లు భగవత్స్వరూప నిర్ణయమును గావించి, ముఖ్యమగు భగవద్విభూతులను ...రించి ఈ అధ్యాయ మింక మానవునకును భగవంతునకును మధ్య నుండవలసిన సంబం...మును నిర్వచించుచున్నది.

"నిన్ను తప్ప మరెవ్వరిని మే మారాధింపము." అని ప్రతిజ్ఞ చేయుమని భగ...వంతు డాజ్ఞాపించుచున్నాడు.

'భగవంతుడు ఒకడు' అని మతము లన్నియు ఏదో ఒకవిధముగ చెప్పుచున్నవి. కాని ఆ ఏకేశ్వరునే ఆరాధించు మతములు లేవు. వాయ్వాది భూతములను ప్రత్యక్ష దేవతములుగా ఆరాధించు పద్ధతులు ఉపనిషత్తులయందు సైతము చెప్పబడినది. (తైత్తి. నారా. ప్ర.) ఖుర్ ఆన్ లో భగవంతు డొక్కడే ఆరాధ్యుడు ; అతనినితప్ప మర్వెరిని ఆరాధింపకూడదు. "నీ సహాయమునే మే మపేక్షింతుము. మరెవ్వరి సహాయము మా కక్కరలేదు." అని మానవునికడనుండి ప్రతిజ్ఞను గొనుచున్నది. "ఇన్ద్రః పురపతు నస్స్వస్తిదాం"* "నమో రుద్రాయ విష్ణవే మృత్యుర్మే పాహి" ♦ ("మేధాం మ ఇంద్రోదదాతు మేధాం దేవీ సరస్వతీ మేధాం మే అశ్వినా వుభావాధత్తాం పుష్కరస్రజా" §) ఇత్యాది వివిధ దేవతారాధనాసూచకములగు ఎన్నో వాక్యములు ఉపనిషద్గ్రంథములందు సైతము కన్పించుచున్నవి. ఖుర్ ఆన్ ఇట్లు ఒక్కొక్కకోరిక కొక్కొక్క దేవతను ప్రార్థించు విధానమును ఖండించినది. భగవంతు నొక్కనినే ఆరాధింపవలెను. "అతనికడనుండియే సహాయమును వేడవలెను"అని ఖుర్ ఆన్ చెప్పుచున్నది.

---

* "వర్షము కురిపించువాడును, సుఖమునొసగువాడును, అభయ మొసగువాడును అగు ఇంద్రుడు మా సంరక్షణార్థము ముందు వచ్చుగాక."

♦ "రుద్రునికొరకును, విష్ణువుకొరకును నమస్కారము అగుగాక. ఓ రుద్రవిష్ణువులారా! నన్ను మృత్యువునుండి రక్షింపుడు."

§ "ఇంద్రుడు, సరస్వతీదేవియు, పద్మమాలాలంకృతులగు అశ్వినీదేవత లిద్దరును నాకు మేధను కలుగజేయుదురుగాక."

తైత్తిరీయోపనిషత్. నారాయణప్రశ్నాంతర్గతము)

అందుచేతనే మోక్షమార్గమును చూపుమని భక్తుడు భగవంతునే ప్రార్థించుచున్నాడు :—

"ప్రభూ! మోక్షము లభించుటకు తిన్ననిమార్గమును మాకు చూపుము. నీ అనుగ్రహమునకు పాత్రులైనవారి మార్గమునే మాకు చూపుము. నీ ఆగ్రహమునకు గురియైనవారి మార్గమునుండి మమ్ము తప్పింపుము."

ఇట్లు ఖుర్ ఆన్ భగవంతుని స్పష్టముగ నిరూపించుచున్నది. ఈ నిరూపణము శ్వేతాశ్వతరోపనిషత్తునందలి యీ క్రింది భావములతో సామరస్యము కలిగియున్నది.

న తస్య కార్యం కరణఞ్చ విద్యతే
న తత్సమశ్చాప్యధికశ్చ దృశ్యతే,
పరాఽస్య శక్తిర్వివిధైవ శ్రూయతే
స్వాభావికీ జ్ఞాన బలక్రియా చ॥

న తస్య కశ్చిత్పతిరస్తి లోకే
న చేశితా నైవ చ తస్య లిఙ్గమ్,
స కారణం కరణాధిపాధిపో
న చాస్య కశ్చిజ్జనితా న చాధిపః॥

(VI : 8, 9)

(ఆ పరమేశ్వరునకు శరీరముగాని, చక్షురాదీంద్రియములుగాని లేవు. ఆ పరమేశ్వరునితో సముడుగాని, అధికుడుగాని ఎవ్వడు కనపడడు. ఆ పరమేశ్వరుని శ్రేష్ఠమైన శక్తి నానావిధమైనదిగా వేదములందు ప్రతిపాదింపబడుచున్నది. ఆ ఈశ్వరశక్తి స్వాభావికమైనది. సర్వవిషయ జ్ఞానప్రవృత్తియు, స్వసన్నిధిమాత్రముచేత సర్వము స్వాధీనము చేసికొని నియమించునదియునై యున్నది.

ఆ పరమేశ్వరుడు కార్యకారణాది శూన్యుడగుటచేత అతనికి ప్రభువుగాని, నియంతగాని లేడు. అతడిట్టివాడని ఊహించుటకు లింగభూతమైన చిహ్నముగాని లేదు. అతడే సర్వకారణభూతుడు. అతడే ఇంద్రియాధిష్ఠాన దేవతలగు సూర్యాది దేవతలకు ప్రభువు. అతనికి జనకుడుగాని, అతనికంటె అధికుడుగాని మరొక్కడు లేడు.)

రెండవ అధ్యాయము

గోవు

వ్యాఖ్యానము

ఈ అధ్యాయము శ్రీ ప్రవక్త మదీనా నగరమునం దుండగా ప్రోక్తమైనది. గోవునుగురించి ఒక ఉపాఖ్యానమిందు చెప్పబడుటచే ఈ అధ్యాయమునకీ పేరు వచ్చినది. ఇందు ౪౦ ఖండములును ౨౮౬ సూక్తులును, ౨౫,౫౦౦ అక్షరములును కలవు.

౧. ఇవి బీజాక్షరములు. శ్రీ ప్రవక్తగాని వారి శిష్యులుగాని ఈ అక్షరములను ఇట్టి ఇతరాక్షరములకును అర్థము చెప్పలేదు. కొందరు వ్యాఖ్యాతలు అర్థము వ్రాసిరి. కాని అవి కేవలము స్వకపోల కల్పితములు.

ఖుర్ ఆన్‌లోని మరి ఐదు అధ్యాయములు (3, ౨౯, 3౦, 3౧, 3౨) ఇవే అక్షరములతో ప్రారంభింపబడినవి.

* * * *

౨. 'విశ్వాసము'నకు 'ఈమాన్' అరబీ మూలము. 'ఈమాన్' అనగా నిశ్చయమగు ఆస్తిక్యబుద్ధి. ఆర్యభాషలో దీనికి 'శ్రద్ధ' యందురు. భగవంతుని అస్తిత్వమునందును ఖుర్ ఆన్‌లో ప్రవచితమైన సత్యమునందును విశ్వాసమునకు ఈమాన్ అందురు. నేను క్లుప్తముగ దీనికి 'విశ్వాసము' అని అనువాదమందెల్లెడల వాడితిని. అట్లే 'విశ్వసము' అని దీనికి సంబంధించిన క్రియాపదముగ వాడితిని. శ్రుతులలోకూడ శ్రద్ధయొక్క ఆవశ్యకత ఉగ్గడింపబడినది. ఋగ్వేదమున శ్రద్ధ ఒక ఉపాస్యదైవతముగ చెప్పబడినది. "దేవతలు సహితము శ్రద్ధను ఉపాసింతురు" (ఋగ్వే. II. 151). ఛాందోగ్యోపనిషత్తునందు "శ్రద్ధత్స్వ" (విశ్వాసముంచుము) అని తండ్రియగు ఉద్దాలకుడు శ్వేతకేతువునకు ఉపదేశించును. అదే శ్రుతి "శ్రద్ధా తపః" (శ్రద్ధయే తపస్సు) అని బోధించుచున్నది. (ఛాం. III : 16). శ్రద్ధలేక యే కార్యము చేసినను వ్యర్థమని తైత్తిరీయోపనిషత్తు బోధించుచున్నది. (తైత్తి. 19).

'ఈమాన్' కేవలము విశ్వాసము కాదు. దాని కది పునాది. విశ్వాసము కేవలము బుద్ధియొక్క వ్యాపారము. ఒక ప్రవక్తయందలి గౌరవము వలన గాని, లేక జ్ఞాన

సంపాదనము వలన కలిగిన ప్రజ్ఞావిశేషమువలన కాని, కలిగిన విశ్వాసము మాత్ర 'ఈమాన్' కాదు. అట్టి విశ్వాసము పునాదిగాగల సత్కార్యాచరణమునందలి ఆసక్తి 'ఈమాన్'.

*　　*　　*　　*

3. "అతీంద్రియములైన తత్త్వములయందు విశ్వాసముంచుము" అని ఖుర్ ఆన్ ఉపదేశించుచున్నది. భగవంతుడు, ఆత్మ, దేవతలు, మరణానంతర జీవితము ఇత్యాది మహత్తత్త్వములకు ప్రత్యక్షప్రమాణములేదు. అందుచే చార్వాకాదులు, భౌతికశాస్త్రజ్ఞులు ఈతత్త్వములను నిరాకరించినారు. ఖుర్ ఆన్ అట్టివారిని ఋజుమార్గమునకు పిలుచుచున్నది. ఒక సత్యము ప్రత్యక్షము కానంతమాత్రమున అది లేదు అని చెప్పుట అజ్ఞానమని చెప్పుచున్నది. మానవబుద్ధికి అగమ్యమగు మహత్తత్త్వ జ్యోతిర్మండలమును నిరాకరించుట గుడ్డివాడు సూర్యుని నిరాకరించుటవంటిది. కేవలము బుద్ధివ్యాపారమువలన ఆ మహత్తత్త్వములను గ్రహించలేము.

విశ్వాసము ఆస్తిక్యతకు పునాది. అదిలేనివాడే నాస్తికుడు. అందుచేతనే ఖుర్ ఆన్ ప్రప్రథమమున ఆస్తిక్య బుద్ధి నుగ్గడించుచున్నది.

*　　*　　*　　*

౪. ప్రార్థనముయొక్క ఉద్దేశ్యము ఖుర్ ఆన్ ఈ విధముగ వివరించుచున్నది: "ప్రార్థన మానవుని దౌర్జన్యమునుండి తప్పించును. భగవంతుని స్మరించుట చాల గొప్ప విషయము. అది సమస్త పాపసంహారకము" (౨౯ : ౪౫.)

ప్రార్థనమువలననే ఈమాన్ దృఢమగుచున్నది. పాపచింత నశించుచున్నది. సంశయము సమయుచున్నది. నిరంతర భగవత్స్మరణము నాస్తికబుద్ధిని నశింపజేయును. అందుచేతనే ప్రప్రథమమున ఆస్తిక్యబుద్ధిని కలిగించు శ్రద్ధను ఉగ్గడించి, వెంటనే దానిని దృఢపరచు ప్రార్థనము లేక భగవచ్చింతనము ఆజ్ఞాపింపబడినది.

*　　*　　*　　*

౫. వెనువెంటనే నైతిక సంస్కారము ఉపదేశింపబడు చున్నది. "మేము ప్రసాదించిన సంపదను ధర్మమార్గమున వ్యయపరపుము." ధనము లోభమునకు, మోహమునకు, గర్వమునకు, మదమునకు — వేయేల సమస్త దుర్భావములకును మూలమగుచున్నది. ధన సంపద కీడుకాదు. కాని ధనమును కూడబెట్టరాదు; వ్యయపరుపవలెను. దుర్మార్గులుకూడ ధనమును వెచ్చింతురు. అందుచేతనే "ధర్మమార్గమున వ్యయపరుపుడు" అని ఖుర్ ఆన్ బోధించుచున్నది. ధన మదాంధుడు శ్రద్ధా

సమన్వితుడు కాజాలడు. ఏసుక్రీస్తు "సూచికా రంధ్రమునుండి ఒక ఒంటెయైనను దూరిపోగలదు గాని ధనికుడు స్వర్గద్వారమును ప్రవేశింపనేరడు" అని నుడివెను. పాపమూలమగు ధనమును కూడబెట్టవలదని ఖుర్ ఆన్ బోధించుచున్నది. ధనమునకు నిరంతర వ్యయము కావలెను. అట్టి వ్యయము ధర్మమార్గము ననుసరించి చేయవలెను. "శ్రద్ధయా దేయమ్ అశ్రద్ధయా దేయమ్" అని తైత్తిరీయోపనిషత్తు చాటుచున్నది.

ధనము ఒకచో కూడు సాధనములలో వడ్డీ ముఖ్యమైనది. ఇదే కారణముగ ఖుర్ ఆన్ వడ్డీని నిషేధించినది. ఆస్తి విభాగనిబంధనములు కూడా దీని ననుసరించియే యున్నవి. సమిష్టి కుటుంబపద్ధతికి ఇస్లామీయ సంఘములో స్థానములేదు. ఆధునిక అర్థశాస్త్ర పరిశోధనములు ఈ సిద్ధాంతములను బలపరచుచున్న విషయము సుప్రసిద్ధము.

*　　*　　*　　*

౬. ధనగర్వము వంటిదే జ్ఞానగర్వము. నిజమగు జ్ఞాని గర్వి కాజాలడు. సత్యమును దర్శించినవాడు సత్యమెక్కడున్నను దానిని నిరాకరింపడు. తన సత్యమున కది విరుద్ధముగ నున్నయెడల దానిని సమన్వయింప చూచును గాని సమయింప చూడడు. సత్యము ఒకరిసొత్తుకాదు. అది సర్వకాలములయందును, సర్వదేశములయందును. మహాత్ముల హృదయఫలకములపై దివ్యహస్తముచే లిఖింపబడుచునే యున్నది. దేశకాలపాత్రానుసారముగ ఆ మహాత్ములట్లు చిత్రింపబడిన సత్యమును వివిధరూపములలో వివిధభాషలలో, వివిధరీతుల ప్రకటింపవచ్చును. ఒక్కొక్కప్పుడు సత్యమునందలి కొన్ని అంశములనే చెప్పి తమ సందేశమును విరమించుకొనవచ్చును. "నేను చెప్పవలసిన దింకను ఎంతయో కలదు. కాని ఇది చెప్పుటకు సమయముకాదు. నా తరువాత మరియొక ప్రవక్త వచ్చును. ఆయన మీకు సంపూర్ణ సత్యమును ప్రకటించగలడు." అని ఏసుక్రీస్తు చెప్పియుండెను. మన దేశమునకూడ ఒక్కొక్క కాలమున ఒక్కొక్క ధర్మము ప్రతిపాదింపబడియుండుట సుప్రసిద్ధ విషయము. పరాశరస్మృతియందు కృతయుగమున ధ్యానయోగమును, త్రేతాయుగము యజ్ఞములును, ద్వాపరయుగమున ఆరాధనమును, కలియుగమున స్తోత్రములును, ప్రార్థనములును భగవదారాధనా పద్ధతులని చెప్పబడినది. ఈ విధముగ కాలభేదములను దేశభేదముల ననుసరించి ఆచరణ విధానము కూడ మారుచుండును. అందుచే పూర్వప్రవక్తల కీయబడిన భగవద్గ్రంథములను నిరాకరించుట అజ్ఞానము. ఖుర్ ఆన్ పూర్వగ్రంథములయందు విశ్వాసముంచవలెనని శాసించుచున్నది.

"ప్రతిదేశమునందును నేనొక్కొక్క ప్రవక్తను పుట్టించితిని. ప్రతి ప్రవక్తయు ఒక్కొక్క గ్రంథమును నా వలన పొందెను" అని ఖుర్ ఆన్ అనేకచోట్ల చెప్పబడినది (3౫ : ౨౪౧౦ : ౪౭ ; ౨ : ౨౧౩ ; ౨౧ : ౭, ౮) ఒక ప్రవక్త మరణించిన పిదప ఆయన అనుయాయులు తమ ప్రవక్త పలుకులను తారుమారొనర్చి, దాని అర్థమును మరచి విపరీతార్థములను కల్పించి అనృతమార్గముల పడవచ్చును. మానవునకు సహజము. సత్యమునుండి అసత్యమును వేరుచేసి సత్యమును ప్రకటించుట ప్రవక్తల విధి. "నిశ్చయముగ నీకు పూర్వము సమస్త దేశములకు ప్రవక్తలను పంపియుంటిని. ఇప్పుడు నీకు వెలువరచుచున్న గ్రంథము వారి సంశయములను బాపి వారెక్కడ పొరపడిరో చూపుటకు మాత్రమే." (౧౬: ౬౩, ౬౪). "సత్యమును నిరూపించుటయే దాని ఉద్దేశము." (౫౪;...)

దేశకాలభేదముల ననుసరించి కొన్ని మార్పులు వివిధ ప్రవక్తల సందేశములందు కన్పించినను మూలసూత్రమునందు మాత్రమట్టి భేదములేదనియే ఖుర్ ఆన్ చెప్పుచున్నది.

"ప్రవక్తా! నీతో వాదముచేయువారితో నిట్లు చెప్పుము: మేము మాకు ప్రకటింపబడిన సత్యమును, మీ ప్రవక్తలు ప్రకటించిన సత్యమును విశ్వసింతుము. మీ దేవుడును మా దేవుడును ఒక్కడే. మేము అతనికే విధేయులము." (ఖు. ౨౯: ౪౬)

ఈ విధముగ ఖుర్ ఆన్ విశ్వమతమును బోధించుచున్నది. ఖుర్ ఆన్ బోధించు మతమునకు దేశకాలముల గోడలు లేవు. దానికి మానవలోకమంతయు నొక కుటుంబము. కాలమునందలి మార్పులు సముద్రమునందలి అలలవంటివి. అలలు లేచినను పడినను, శాంతముగ నున్నను, అల్లకల్లోలముగ నున్నను సముద్రముయొక్క మూల స్వరూపము మారదు. ఆదినుండియు సత్యమొక్కటే. ఈ సత్యమును ప్రకటించు భగవద్గ్రంథము లన్నియు విశ్వాస పాత్రములే.

* * * *

౭. "మరణానంతర జీవితముపై విశ్వాసముంచుము." అని ఖుర్ ఆన్ ఆదేశించుచున్నది. ఆస్తిక మతములన్నియు మరణానంతర జీవితముకలదని నమ్ముచున్నవి. నాస్తికులును చార్వాకాదులును మరణము జీవితముయొక్క అవధి యందురు. భగవంతుని, ఆత్మను నిరాకరించుట అనగా మరణానంతర జీవితమును నిరాకరించుటయన్నమాట. ... దేశమున ఋగ్వేదకాలమునుండియు మరణానంతర జీవితమునుగురించి అనేక ...లు మొలకెత్తినవి. వాటి నీ క్రింద సంగ్రహింతును.

(౧) యమ, యమి అను ఇరువురు మర్త్యులు పరలోకమునకేగి అక్కడి ప్రభువులై మర్త్యలోకమునుండి వచ్చినవారి నాదరింతురు. గత దేహములైన ఆత్మలు ...శరీరములను ధరించి యమలోకమును ప్రవేశించి సుఖముగా నుందురు. ...రు పుణ్యాత్ములు. పాపులకు నరకముకూడ కలదు. ఇది ఋగ్వేదమతము. [ఋగ్వే. ... ౬. ౧౦ ; ౧౪. ౪౧. ౨౧ ; ౧౦. ౧౩౨. ౪ ; ౪. ౫. ౫ ; ౪. ౨౭. ౧ ఇత్యాది.]

(౨) పుణ్యకర్ములకు అమరత్వము కలుగును. పాప పుణ్యముల రెంటిని ఒనర్చిన వారి పాపపుణ్యములు ఒకత్రాసున తూచబడినపిదప ఆయా కర్మల కనుగుణముగ శిక్షలు నిర్ణయింపబడును. (శత. బ్రా. ౧౧. ౨. ౭. 33.) తాను నిర్మించుకొనిన ప్రపంచమునందే మానవుడు తిరిగి జన్మించును. (శత. బ్రా. ౬. ౨. ౨. ౨౭. చూ. రాధాకృష్ణ పండితుని Indian Philosophy Vol. I. PP. 133-5) ఇది బ్రాహ్మణముల మతము.

(౩) మానవుడు తాను గావించిన పాపపుణ్యముల ఫలములను అనుభవించుటకు మానవలోకమున తిరిగి జన్మింపవలెను. కర్మక్షయాంతమువరకు ఇట్టిజన్మము లెన్నైని కావచ్చును. "పుణ్యకర్మల నాచరించినవారు స్వర్గమునందు పుణ్యఫలము ననుభవించి పుణ్యశేషముతో బ్రాహ్మణాద్యుత్తమ జన్మములందు పుట్టుచున్నారు. పాపకర్మల నొనర్చినవారు నరకలోకమునందు తత్ఫలమనుభవించి కర్మశేషముతో శ్వ సూకర చండాలాది నీచజన్మములందు పుట్టుచున్నారు." (ఛాందో. ౫. ౧౦. ౭.) ఇట్లే గౌతమధర్మ సూత్రములు [౨. ౨. ౨౯]. ఇది ఉపనిషన్మతము. పురాణమతముకూడ దగ్గర దగ్గరగా ఇదియే.

ఇవి వైదికమతములు.

ఇంక ఖుర్ ఆన్ మరణానంతరజీవితమునుగురించి యేమి చెప్పుచున్నది ?

ఖుర్ ఆన్ మతము వేదమతముతోడను, బ్రాహ్మణముల మతముతోడను కొంత వరకు సామరస్యము కలిగియున్నది. ఋగ్వేదమున వలె ఖుర్ ఆన్ స్వర్గ నరకములను పేర్కొనుచున్నది. మృతులైనవారు పరలోకమున వారివారి కర్మానుసారము స్వర్గనరకములను అనుభవింతురు. ఆత్మ దేహమునుండి విడిచిపోవునపుడు దేహి గావించిన కర్మలను పుష్పవాసనను వాయువు మోసికొని పోయినట్లు పరలోకమునకు మోసికొనిపోవును. శతపథ బ్రాహ్మణమునందువలె పాపపుణ్యములు తూచబడును. [శత. ౧౧. ౨. ౭.

౩౩ ; ఖుర్. ౨౧ ; ౪౭ ; ౭ : ౮.] ఈ రెండుగ్రంథములును ఒకే ఉపమానమును గ్ర హించుట చిత్రము. ఋగ్వేదమునందువలె స్వర్గసుఖము నిత్యము. కాని నరకాగ్ని అని త్యము. అగ్ని లోహముల నెట్లు పరిశుద్ధపరచునో అదే విధముగ నరకాగ్ని పాపజీవు లను పరిశుద్ధులను గావించును. [ఖుర్ఆన్ ౫౭ : ౧౫ ; ౧౦౧ : ౯. చూ. మొహమ్మద్ అలీ The Religion of Islam. PP. 308 - 9 ; 314]

ఖుర్ఆన్‌లో నరకము భయంకరముగ వర్ణింపబడినది. వేద గ్రంథములయందును తరువాతి స్మృతులందును, పురాణములందును అట్లే వర్ణింపబడినది. అదేవిధముగ స్వర్గము సర్వసుఖములకు ఆటపట్టుగ వర్ణింపబడినది. ఈవర్ణనలు కేవలను ఉపమానపూర్వకము లని ఖుర్ఆన్ [౧౩ : ౩౫ ; ౪౭ : ౧౫] వక్కాణించుచున్నది. మానవహృదయములందు రగుల్కొను అగ్నిజ్వాలలే నరకమనియు [౧౦౪ : ౬, ౭], ఆధ్యాత్మికశాంతియే స్వర్గ మనియు [౧౪ : ౨౩ ; ౫౬ : ౨౫, ౨౬ ; ౬ : ౧౨౭ ; ౧౦ : ౨౫] ఖుర్ఆన్ స్పష్ట ముగ చెప్పుచున్నది.

*　　　*　　　*　　　*

౮. ఇది మానవప్రకృతి. మాఘుడు సత్యమునే "అధవాభి నివిష్టబుద్ధిషు వ్రజతి వ్యర్థకతాం సుభాషితమ్" ౧౬. ౪౩. [అసత్యజ్ఞానముచే ఒకసారి మనస్సు గ్రసింప బడెనేని ఆ మనుజునకు సత్యవాక్కులు మనసున పట్టవు.] అని చెప్పినాడు.

*　　　*　　　*　　　*

౯. అనగా వారి హృదయములు సత్యమును గ్రహింపవు ; చెవులు సత్యవాక్కు లను వినవు ; ప్రత్యక్షముగ నున్నను వారు సత్యమును దర్శింపలేరు.

రెండవ ఖండము

ప్రథమఖండమున రెండుతరగతుల వ్యక్తులనుగురించి చెప్పబడి నది. ౧. భగవన్మార్గమున నడచువారు [౧-౫] ; ౨. విశ్వాసమును విడనాడి తిరస్కారము చూపువారు [౬-౭]. ఈ ఖండమున మరియొక తరగతి వ్యక్తులనుగురించి చెప్పబడుచున్నది. వీరు గోముఖవ్యాఘ్రముల వంటివారు. ఇతరులను మోసగింపదలచి తామే మోసపోవు అవివేకులు వీరు. విశ్వాసమును నటించి తమ బాహ్యవేషములచే లోకులను మోస గింపజూచువారు కొందరు ; శాంతిదూతల మని చెప్పికొని ప్రపంచము నందు అశాంతిని ప్రబలజేయువారు కొందరు ; తాము మహా బుద్ధిమం

...లు మరియు, ప్రవక్తలు చెప్పినంత మాత్రమున విశ్వసించువారు అవి ...రు లనియు, బాగుగా విమర్శించిగాని తామట్టి విశ్వసింప మరియు ...ప్ప వీరు మూర్ఖులు కొందరు ; కేవలము పరిహాసమునకు గాని, ...దమునకుగాని విశ్వాసమును ప్రకటించువారు కొందరు. ఈ విధముగ ...ము నాల్గు తెరగులుగ విభజింపబడెను [౮-౧౬]. భగవద్గీతయందుకూడ ...మనుష్యులు నాల్గు విధములుగ చెప్పబడినారు. [భ. గీ. ౭ : ౧౬ చూ. రామానుజ భాష్యము.]

ఈ రెండు ఖండములయందును మానవ మనస్తత్త్వము చక్కగ ...మర్శింపబడినది.

*　　　*　　　*

౧౦. ఈ నాల్గు [17—20] సూక్తులయందును వంచకుల స్థితిని నిరూపించుటకు రెండుపమానములు చెప్పబడినవి. వంచకునకు ప్రప్రథమమున కొంతలాభము కలుగవచ్చు ...ను. దాని తరువాత దుర్భరమగు అవమానముతప్ప మరేదియు లేదు. వంచకులు ఈ లోక ...మున తమ వంచకబుద్ధిచే లౌకిక సంపదలను పొంది తమవంటి మూర్ఖులచే శ్లాఘింపబడ ...వచ్చును. కాని ఈ వంచకజీవితము ముగిసినపిదప పరలోకమున వారికి మిగులునది అంధ ...కారమే. ఈ జీవితమున వంచకులకు కలుగు కించిజ్జయము అగ్నియొక్క కాంతిగా చెప్పబడినది. దేవుడాకాంతిని హఠాత్తుగ హరించెను. అనగా ఆ వంచకులు మృత్యువు ...వాతబడి మరణించిరి. ఇంక పరలోకమున వారికి అంధకారమే.

ఇట్టి వంచకులను సన్మార్గమునకు త్రిప్పగలమా? అని ప్రశ్నవచ్చును. అట్లుచే ...యుట అసంభవము. ఏలననగా వారు సత్యమును వినలేరు. బధిరులకు శంఖారావమువలె జ్ఞానబధిరులకు సత్యము వినరాదు. వారు జ్ఞానాంధులుకూడ. అంధులకు చంద్రోదయము వలె వీరికి సత్యము గోచరింపదు. ఈ వంచకులు సత్యవాక్యము నెప్పుడును పలుకలేరు. ...వారు మూగవాండ్రు.'

రెండవ ఉపమానము వంచకుల మనోవృత్తిని మరింత స్పష్టముగ నిరూపించుచు ...న్నది. ఏదేని ఒక ప్రాపంచిక లాభము కొఱకు బాహ్యవిశ్వాసమును ప్రకటించి, ఏదేని ...విపత్తు వచ్చినప్పుడు గాని లేక వారనుకొన్నంత ప్రాపంచిక లాభము అందు లభించ ...నప్పుడు గాని వెనుకకు మరలుచున్నారు. వారికసలు విశ్వాసములేదు. ఏదో ప్రాపం

చిక లాభము నాశించి విశ్వాసము నటించిరి. అట్లు వంచకులై విశ్వాసవంతులను వేసటవలన కలుగు సాంఘికలాభములను అనుభవించి, తిరిగి విశ్వాసకులకు సాంఘికముగ నేదేని విపత్తు వచ్చినప్పుడు ఈ వంచకు లడలి ప్రాణభయముచే వెనుకగ్గుచున్నారు.

*　　　*　　　*

౧౧. ౨౧వ సూక్తియందు ఒక ధర్మరహస్యము చెప్పబడినది. "భగవత్సేవ మానవుల దుష్పథమునుండి రక్షించును" అందుచేతనే భగవద్గీతయందు:

అపిచే త్సుదురాచారో భజతే మా మనన్యభాక్
సాధురేవచ మంతవ్య స్సమ్యగ్వ్యవసితో హి సః
క్షిప్రంభవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి

గీ. ౯. ౩౦-౧.

[దురాచారరతుడైనను నన్ననన్యమగు భక్తిచే సేవించినచో అట్టివాడు సాధువగును. ఏలననగా నట్టివాడు దృఢమగు నిశ్చయముకలవాడు. అట్టివాడు శీఘ్రముగ ధర్మాత్ముడై నిత్యశాంతిని పొందును. నిశ్చయముగ నాభక్తుడు ఎంతమాత్రము చెడుగు నొందడు.] అని చెప్పబడినది.

*　　　*　　　*

౧౨. ౨౨వ సూక్తియందు ప్రకృతి వ్యాపారమంతయు భగవత్ప్రేరణము వలననే జరుగుచున్నదని చెప్పబడినది. ప్రకృతి వ్యాపారములు వివిధములగుటవలన, ప్రకృతియందలి ప్రతి వ్యాపారమునకు ఒక్కొక్క అధిష్ఠాన దేవత కలదనియు, అట్టి దేవత లందరును ఆరాధనీయులే యనియు ఋగ్వేదాది గ్రంథములయందు కాన్పించుచున్నది—(ఋగ్వేదము. ౧౦-౮౭. ౧; ౪-౩౨. ౪; ౨-౬; ౭-౨౪, ౯; ౮-౯౭. ౧౯.) ఋగ్వేదమునందే ఈ బహు దైవతారాధనమునుగురించి ఇట్లు చెప్పబడినది. "ఈ దేవతానీకము భక్తుని పరమాత్ముని సమీపమునకు తీసుకొనిపోవును"—[ఋగ్వేదము. ౧-౨౪. ౧] ఖుర్ ఆన్ లో ఈ మతముకూడ వివరింపబడినది. బహు దైవతారాధకులు ఇట్లందురు: "ఈ దేవతలు మమ్ము పరమాత్ముని సన్నిధిని చేర్చెదరని మాత్రమే మేము వారిని పూజించుచున్నాము. స్పష్టమగు సత్యము బోధింపబడినను దానిని విశ్వసింపక ఇట్లనెడి వీరి భేదభావమును దేవుడు తుదిదినమున పరిష్కరించును. [ఖు. ౩౯; ౩.]

ఐతే ఆర్షమతమున బహు దైవతారాధనమే బోధింపబడెనా? అను ప్రశ్న రావచ్చును. ఆర్ష గ్రంథములు సమగ్రముగ చదివిన ఈ సందేహము కలుగకమానదు. దయానందసరస్వతి, రాజా రామమోహనరాయ్ ప్రభృతులు ఆర్ష గ్రంథములయందు బహు దైవతారాధనము లేదనియే వ్రాసిరి. బహుదైవతారాధనమును బోధించు లేక సమర్థించు

గ్రంథభాగములను తమ పాండిత్యప్రతిభచే బ్రహ్మైకార్థము వచ్చునట్లు వ్యాఖ్యానించిరి. జిజ్ఞాసువుల కిది సరియగు పద్ధతి కాదు. ఉన్నదున్నట్లు వాస్తవముగ చెప్పుట వ్యాఖ్యాత విధి.

ఆర్ష గ్రంథములందు బహుదైవతారాధనము కొన్నిపట్లను ఏకేశ్వరత్వము కొన్నిచోట్లను ప్రతిపాదింపబడినది. ఆర్షమతమునందలి క్రమ పరిణామమును రాధాకృష్ణ పండితుడు చక్కగ నిరూపించినాడు. బ్రహ్మతత్త్వ నిరూపణమునం దైదవస్థలు కన్పించుచున్నవని ఆయన అభిప్రాయము. ఈ క్రమవికాసమునకు మకుటాయమానమగు అద్వైత సిద్ధాంతము ఉపనిషత్తులయందు ప్రతిపాదింపబడినది. (చూ. రాధాకృష్ణ Indain Philosophy Vol. I. PP. 99-9) ఏకేశ్వరత్వమును ప్రతిపాదించు ఉపనిషద్వచనము లెన్నో కలవు. "ఓ యాజ్ఞవల్క్యమహర్షీ! ఈశ్వరు లెంతమందికలరు?" "ఒకడే" అని ఆయన సెలవిచ్చెను. [బృ. ౯-౧. ఇట్లే మైత్రి ౪/౧౬; ముండక ౧-౧. ౧; తైత్తి. ౧-౫; బృహ. ౧-౪. ౯; ౧-౪. ౭; ౧-౪-౧౦ ఇత్యాది.]

క్రమవికాసము ప్రకృతి సహజము. ఆధ్యాత్మికవిషయములం దిట్టి క్రమవికాసము కలుగుట ఎట్లు సహజమో ఖుర్ ఆన్ చూపుచున్నది. ఇబ్రాహీమ్ ప్రవక్తకు బ్రహ్మతత్త్వ విషయమున ఎట్లు క్రమవికాసము కల్గెనో ఖుర్ ఆన్ ఇట్లు వాకొనుచున్నది:

"రేనీడలు ముసుకొని రాగా అత డొక ప్రకాశవంత మగు నక్షత్రమును చూచెను. అట్లు చూచి, "ఇది నా ప్రభువే యగునా?" అని భ్రమించెను. తరువాత అది అస్తమించెను. అప్పు డతడు ఉదయించుచున్న చంద్రుని చూచెను. దానిని చూచి కూడ భ్రమించెను. "ఇది నా ప్రభువే యగునా?" అని యనెను. చంద్రుడుకూడ అస్తమించెను. అత డప్పు డిట్లు ప్రార్థించెను: "ప్రభూ! నీవు నాకు మార్గమును చూపవేని నేను దారి తప్పినవాడ నగుదును." తెల్లవారెను. ఇబ్రాహీమ్ ఉదయభానుని చూచెను. తిరిగి అతడు భ్రమించెను. "ఇదేనా నా ప్రభువు? అన్నిటికంటె మహత్తరమైన దిదేనా?" అని శంకించెను. సూర్యుడుకూడ అస్తమించెను. ఇబ్రాహీమ్నకు సత్యము గోచరించెను. అప్పు డతడు తన ప్రజలను పిలిచి "ఓ నా ప్రజలారా! నా కిప్పుడు సత్యము గోచరించినది. భూమ్యాకాశాది సమస్తమును సృజించిన భగ

వంతుని నే నారాధింతును. నేను బహుదైవతారాధకుడను కాను" —"
(౬. ౨౨-౮౦.)

భ్రమాజన్యమైన లేక అసంపూర్ణజ్ఞాన జన్యమైన పూర్వసిద్ధాంతములు సంపూర్ణ వికాసానంతరము మాయవలెను. ప్రకృతిశక్తులనే భగవంతునిగ భావించిన దశ మానవ జ్ఞాన పరిణామమున కలదు. కాని మానవు డా దశను దాటిన తరువాత పూర్వభావములను దిద్దుకొనవలెను. దురదృష్టవశమున మనదేశమున అట్లు కాలేదు. దీనినిగురించి రాధాకృష్ణ పండితు డిట్లనుచున్నాడు:

"None asked the people to forsake the gods they were wont to worship. Ingeneous explanations, suggestions and symbolism helped to interpret the old superstition in consistency with the new idealism. While the hour demanded fidelity to the spiritual ideal, we find in the Upanishads a good deal of temporising....... ....The polytheistic conception was too deeply rooted in the Indian consciousness to be easily overthrown......... ....There was also a reverence for the past." * Vol. I. P. 44—5.

* * * *

౧౩. తరువాతి రెండు సూక్తులయందున ఖుర్ఆన్ యొక్క ఔత్కృష్ట్యమును, అసమానత్వమును చెప్పబడినవి. ఖుర్ఆన్ ప్రవక్త మహాత్మ్యముగ పరిగణింపబడుచున్నది. పాశ్చాత్యవిద్వాంసులు ఖుర్ఆన్ మహత్తునుగురించి చెప్పినమాటలు గమనింపుడు:—

"It [Quran] is one miracle claimed by Mohamad—his standing miracle, he said — and a miracle indeed it is" [Bosworth Smith, LIFE OF MOHAMAD.]

---

* (వారు సాంప్రదాయముగ కొలుచుచున్న దేవతలను విడిచిపెట్టుమని ఎవరును అనలేదు. ప్రాచీన మూఢాచారములను క్రొత్త జ్ఞానమునకు సరిపడునట్లు చమత్కారమైన యుక్తులను కల్పించి, ప్రతీకములను సృష్టించి అన్వయింపగోరిరి. నవీన ఆధ్యాత్మికాదర్శమునకు విశ్వాసము చూపుటకు మారు ఉపనిషత్తులలో చాలవరకు సమన్వయము కలదు—బహుదైవతారాధనమత మత్యంత దృఢముగ భారత మనస్తత్వమున వేరుగొనియున్నది—దానిని నిర్మూలింప సాధ్యము కాలేదు. ప్రాచీన సంప్రదాయముంయెడ గౌరవముకూడ కలదు.)

"The Quran is unapproachable as regards its convincing power, eloquence and even composition"
(Hirshfeld, 'New Researches'—P. 8.)

* * * *

౧౪. తీని వ సూక్తియందు ఏడు ఊర్ధ్వగతులు లేక ఆకాశములను సృష్టించినట్లుగా చెప్పబడినది. ఆత్మవికాసమునందలి పరిణామదశ లేడని తత్త్వజ్ఞులు దీనిని వ్యాఖ్యానించినారు. ఈ సప్తసంఖ్య ఆర్ష గ్రంథములందును మిక్కుటముగ కాన్పించుచున్నది. తైత్తిరీయోపనిష దంతర్గత నారాయణ ప్రశ్నమున:—

సప్తప్రాణాః ప్రభవంతి తస్మా
త్సప్తార్చిష స్సమిధ స్సప్త జిహ్వాః
సప్త ఇమే లోకా యేషు చరంతి
ప్రాణాగుహాశయాన్నిహిత స్సప్తసప్త. ౧౨ : ౩.

నాలుగవ ఖండము

ఈ ఖండమునందు మానవుని ఉత్కృష్టత ఉగ్గడింపబడినది. సృష్టికి మానవుడు కిరీటప్రాయుడు. దేవతలుసహితము మానవునకు ప్రణమిల్లిరి. ఈ విషయమునే తైత్తిరీయోపనిషత్తు ఈ విధముగ చెప్పుచున్నది:

రుచం బ్రాహ్మం జనయన్తః
దేవా అగ్రే తదబ్రువన్
యస్త్వైవం బ్రాహ్మణో విద్యాత్
తస్య దేవా అసన్ వశే. — నా. ప్ర. ౧-౨.

(దేవత లందరును ప్రప్రథమమున సృష్ట్యాదికాలమందు బ్రహ్మవిద్యా సంప్రదాయమును ప్రవర్తింప జేయు సమయమునందు విద్యాసామర్థ్యముచేత పరబ్రహ్మ చైతన్యమును ప్రాదుర్భవింపజేయుచు ఇట్లు పలికిరి. "ఓ పరమేశ్వరా! ఏ బ్రహ్మవేత్త ఈవిధముగ తెలిసికొనునో, అట్టి బ్రహ్మవేత్తకు సమస్తమైన దేవతలు స్వాధీన మగుచున్నారు.")

ఇదే విధముగ బృహదారణ్యకోపనిషత్తునందు (౧-౪. ౧౦.) కూడా చెప్పబడినది.

ఆదమ్ అనగా మానవుడు. ఆర్ష సంప్రదాయమున మనువు వంటి వాడు.

* * * *

౧౫. మానవునకు భగవంతుడు బుద్ధి నిచ్చి తద్వారా సర్వవస్తు పరిజ్ఞానమును కలుగునట్లు కావించెను. సర్వవస్తు పరిజ్ఞానము ఆర్షభాషయందు ఋతమనబడును. ఋతమును ప్రకాశింపజేయు బుద్ధినే భగవంతుడు మానవునకు ప్రసాదించినాడు. ఈ బుద్ధి "ఋతంభర" యనబడును. [చూ. విద్యారణ్యకృత జీవన్ముక్తి ప్రకాశిక. తృ.ప్ర.]

"వసురణ్వో విభూరసి ప్రాణీత్వమసి సంధాతా బ్రహ్మన్త్వమసి" ఇత్యాది తైత్తిరీయోపనిషత్ నారాయణ ప్రశ్నాంతర్గతమగు ౨౦ వ మంత్రమున "వసురణ్వ" లేక "వస్తుతత్త్వము నుపదేశించువాడవు" అని పరమేశ్వరుడు స్తుతింపబడినాడు. వసురణ్వ శబ్ద వ్యుత్పత్తి భాష్యకారులు ఇట్లు వ్రాయుచున్నారు :— "వస్తునః వస్తుతత్వస్య, రణ్వః వాశితా, కథయితా, అస్మదనుగ్రహార్థ ముపదేష్టా వసురణ్వః" మా యందలి అనుగ్రహముచేత వస్తుతత్త్వమును ఉపదేశించువాడు.

* * * *

౧౬. ఇబ్లీస్ ఒక దుష్టదేవత. మరి రెండుచోట్ల ఖుర్ఆన్‌లో ఈ ఉపాఖ్యానము వివరింపబడినది :—

"నీ ప్రభువు దేవతల నుద్దేశించి ఇట్లనెను : 'మంటితో నే నొక మర్త్యుని సృజింప దలచుకొంటిని.' అప్పుడు నేను మానవుని పూర్తిగ సృజించి వానిలో నా ఆత్మను ప్రవేశింపజేసిన పిదప, 'సాష్టాంగపడుడు' అని ఆజ్ఞాపించితిని. దేవత లందరును ఒక్కుమ్మడిని సాష్టాంగపడిరి. కాని ఇబ్లీస్ వినతాంగుడు కాడాయెను. సాష్టాంగపడుట కతడు నిరాకరించెను. భగవంతు డిట్లనియెను :— 'ఓ ఇబ్లీస్ ! నీ వెందులకు సాష్టాంగపడ వైతివి ?' వా డిట్లనియెను : 'మంటితో నిర్మింపబడిన ఈ మర్త్యునకు నేను సాష్టాంగపడను.'

అప్పుడు భగవంతు డిట్లనెను :— "ఇటనుండి పొమ్ము. నీవు బహిష్కరింపబడితివి. నీవు ప్రళయకాలమువరకు శాపగ్రస్తుడ వై యుండుము."

అప్పుడు ఇబ్లీస్ ఇట్లనెను :— "ప్రభూ ! నాకు ప్రళయకాలమువరకు గడువు నొసంగుము."

"పొమ్ము. అట్లే గడు విచ్చితిని. అది ఒక నియమితకాలమునకు మాత్రమే." అని భగవంతుడు సెలవిచ్చెను.

"ప్రభూ ! నీవు నన్ను విపథగామి నంటివి; నేను చెడుగునే మంచిదిగా కనిపించునటులజేసి మానవులను విపథగాముల నొనర్తును. నీ భక్తుల సమీపమునకును పవిత్రులగువారికడకును మాత్రము పోను." అని ఇబ్లీస్ విన్నవించుకొనెను.

భగవంతు డిట్లనెను :— 'నీ కుచితమగురీతినే చేసితిని. నా సేవకులపై నీ కెట్టి అధికారమును లేదు. దుర్మార్గులపై మాత్రమే నీ కధికారము కలదు.' నిశ్చయముగ వారి స్థానము నరకము. అది బహుద్వార సమంచితము. ప్రతి ద్వారమునుండియు వారు వత్తురు. [౧౫ : ౨౯-౪౪.]

అట్లే ౩౮ వ అధ్యాయమున :—

నీ ప్రభువు దేవతల నుద్దేశించి ఇట్లనెను :— "మంటితో నే నొక మర్త్యుని సృజింప దలచితిని. అన్నట్లు నేను అతనిని పూర్తిగా సృజించి నా యాత్మ నతనియం దూదితిని. అప్పుడు నేను దేవతల కిట్లాజ్ఞాపించితిని. "సాష్టాంగపడి అతనికి నమస్కరింపుడు." దేవత లెల్లరును అట్లే సాష్టాంగపడిరి. కాని ఇబ్లీసు అట్లు చేయడాయెను. వాడు గర్విష్ఠియై విశ్వాసహీనులలో నొక డాయెను. భగవంతుడు వాని నుద్దేశించి ఇట్లనియె ;—

'ఓ ఇబ్లీస్ ! నీ వెందుకు సాష్టాంగపడ వైతివి ? మానవుడగు ఇతనిని నేను నా రెండు చేతులతో సృజించితినిగదా ? నీవు గర్విష్ఠి వైతివా ? లేక నీవేమి ఘనుడ వనుకొనుచున్నావా ?" దానికి ఇబ్లీస్ ఇట్లు ప్రత్యుత్తర మిచ్చెను ;— 'నే నీ మర్త్యునికంటె శ్రేష్ఠతరుడను. నీవు న న్నగ్నినుండి పుట్టించితివి. అతడు కేవలము మట్టినుండి సృజింపబడినాడు.'

దానికి భగవంతు డిట్లనెను :—

'నీ విటనుండి పొమ్ము. నీవు బహిష్కరింపబడితివి. ప్రళయకాలమువరకు శాపగ్రస్తుడవై యుండుము.'

అప్పుడు వా డిట్లనియెను ;— "ప్రభూ ! వారు [మానవులు] తిరిగి బ్రతికి లేచు ప్రళయకాలమువరకు నాకు గడువు నొసగుము."

దానికి భగవంతు డిట్లనెను :— 'పొమ్ము. నీ కట్లే గడు విచ్చితిని. కాని ఇది ఒక నిర్ణీతకాలమువరకే.'

వా డిట్లనియెను :— నా శక్తితో వారిని నేను తప్పుత్రోవలకు మరల్తును. నీ భక్తులను, పరిశుద్ధులను మాత్రము చెనకను.' దానికి భగవంతు డిట్లనెను :—

, వాస్తవమేమనగా నేను నిన్ను, నీ అనుయాయులను నరకమున నింపుదును.'
[౩౮ : ౮౪-౮౫]

ఏదవ ఖండము

ఈ ఖండమున దుర్మతులు ముత్తెరగులుగ చెప్పబడిరి. (అ) ధర్మగ్రంథమును నిరాకరించువారు; (ఆ) పూర్వపుధర్మ గ్రంథములందు అసత్యములను చేర్చి అదే సత్యమని ప్రకటించువారు; (ఇ) ధర్మగ్రంథమును చదివియు, ఇతరులకు బోధించియు తాము స్వయముగ ఆచరింపక భ్రష్టులైనవారు.

వీరికి ప్రబోధము కలుగుటకు ఖుర్ఆన్ ప్రత్యేకముగ వీరిని పేర్కొనినది. ఇది ఇస్రాయీలీయులకు సంబోధించిన ట్లున్నను ప్రపంచమునందలి అన్ని జాతులకును అన్వయించును. ఎందుకనగా ప్రపంచమందలి అన్ని జాతులకును భగవంతుడు ధర్మగ్రంథములను ప్రసాదించినాడు. అందరును, ఆయా గ్రంథములను పొడిగించియు, కుదించియు, పెంచియు, తగ్గించియు వాటి అసలు స్వరూపమును మార్చివేచిన విషయము సుప్రసిద్ధము. ఇట్లు అడుగంటిన ధర్మమును పునరుద్ధరించుటకు నూతన ధర్మము బయల్వెడలును. ఆ ధర్మగ్రంథము ఏది ధర్మమో ఏది అధర్మమో విడదీసి చూపును. ఇదే ఖుర్ఆన్ మతము. అందుచేతనే ఖుర్ఆన్‌కు "ఫుర్ ఖాన్" అను నామాంతరము కలదు. ఫుర్ఖాన్ అనగా ధర్మాధర్మ విచక్షణమును చేయునది. "మీ కింతకుముందిచ్చిన ధర్మగ్రంథముతో దీనిని పోల్చి చూచుకొనుడు. దానిలో సత్యాసత్య విచక్షణమును చేసి, అందులో ఏది సత్యమో, ఏది మీరు కలిపినదో వేరు చేసి చూపునదీ యీ గ్రంథము. అందుకొరకే ఇది ప్రోక్తమైనది.' అని ఈ ఖండమునందు చెప్పబడినది.

*　　*　　*　　*

౧౭. "జకాత్‌ను ఈయుడు" అని ఇందు ఆజ్ఞాపింపబడినది. "జకాత్" దాతృత్వమను అర్థమున వాడుకలో నున్నది. అరబీ భాషలో "జకాత్" అనగా 'అభివృద్ధి' లేక 'పరిశుద్ధి నొందుట' అని అర్థము. దాతృత్వమునకు అరబీలో 'సదఖా' అనికూడ అందురు. ఖుర్ఆన్‌లో ఈ శబ్దముకూడ అనేకచోట్ల వాడబడినది. 'సదఖా' అనగా సద్బుద్ధితో ఇచ్చునది అన్నమాట. ఇది 'సిద్ఖ్' [సత్యము] — అను ధాతువునుండి నిష్పన్నమైనది. ఖుర్ఆన్‌లో దాతృత్వము రెండు విధములుగా చెప్పబడినది:— ౧. ఐచ్ఛికము. ౨. నిర్ణీతము. నిర్ణీతమగు దాతృత్వమునకే 'జకాత్'అని పేరీయబడినది.

"జకాత్"ను గురించి చెప్పుటకు ముందు ఇస్లామ్‌మత పరమార్థమును ఇంచుక వివరించుట ఉచితము. మతము ఒక సాంఘిక వ్యవస్థ. మానవుడు సంఘజీవి. మానవుని జీవితమును తీర్చి దిద్దబూనిన మతము, సంఘజీవితమును దిద్ద యత్నించవలెను. సంఘము సముద్రమువంటిది. వ్యక్తులు కెరటములవంటివారు. కెరటములకు సముద్రములకు అవినాభావ సంబంధ మున్నది. ఇఖ్బాల్ కవి అనినట్లు :

నరుడు నరుడయ్యె సంఘమాలంబనముగ ;
ఎవ్వ డేకాకిగా నుండ నెంచు జగతి ?
జలధియందునె అల లుంట కలుగు గాని
వనధి విడిచి బయట అల యనుట వెఱ్ఱి.

ఇస్లామ్ ఒక ఆదర్శసంఘమును నిర్మింప దలచుకొన్నది. ఈ ఆదర్శసంఘమునకు అయిదు స్తంభములను నెలకొల్పినది. ఏకేశ్వరునియందలివిశ్వాసము మొదటిస్తంభము. భగవత్ప్రార్థనము లేక నమాజ్ రెండవస్తంభము. జకాత్ మూడవస్తంభము. ఉపవాసము నాల్గవ స్తంభము. హజ్ లేక మక్కాయాత్ర అయిదవస్తంభము. ఈ అయిదు విధులయొక్క ప్రయోజనమును ఒకటే: "ఏకేశ్వరత్వము, మానవ సౌభ్రాతృత్వమును స్థాపించుట." మానవులు కృతకముగా నిర్మించుకొనిన హెచ్చుతగ్గులను, కొద్దిగొప్పలను రూపుమాపు సంస్థ లివి. ఒకరిభుజము నంటి మరియొకరు నిలిచి, అందరును — ప్రభువైనను, బానిసయైనను, ధనికుడైనను, పేదవాడైనను — భగవంతుని ప్రార్థించుట ఎంతటి మనఃపరివర్తనము కల్గించును? అందరును అట్లు నిలిచి "ఈశ్వరా! నీవు దయాసముద్రుడవు ; వరదుడవు ; మా కర్మల పరీక్షించి, పాప పుణ్యముల నిర్ణయించి తత్తదుచితమగు ఫలములను ప్రసాదించువాడవు. నీవే మా కారాధ్యుడవు. నీ సహాయమునే మేమపేక్షింతుము. ప్రభూ! మాకు మోక్షమార్గమును చూపుము." అని ప్రార్థించునప్పుడు మానవుడు తన అహంభావమును కోల్పోవుటయే కాక తన ప్రక్క నిలిచి భగవంతుని సమక్షమున వినతుడగుచున్న తోడి మానవునియెడ భ్రాతృత్వభావమును వహింపక మానడు. వారి మనోనిర్మాణమే దాని కనుకూలముగ రూపొందును.

(g)

'హజ్' కూడ నట్టిదే. అరఫాత్ మైదానమున ఒకేవిధగు వస్త్రముతో యాత్రికు లందరును భుజము భుజము కలిపి దేవునిముందు నిలిచి ప్రార్థించుటయందు కూడ అట్టి భావమే కలుగుచున్నది.

ఆర్థికమగు హెచ్చుతగ్గులు మానవసంఘమునందు హెచ్చుతగ్గులను కల్పించుచుండుట ప్రసిద్ధము. ధనికునకు అహంకార మెక్కువై పేదలను నీచదృష్టితో చూచుచుండుట అందరికి అనుభవమే. అందుచే ఖుర్ఆన్ సాధ్యమైనంతవరకు అట్టి హెచ్చుతగ్గులు కలుగకుండ సంఘ నిర్మాణమునకు పూనుకొనినది. 'జకాత్' ఇట్టి హెచ్చుతగ్గులను నిర్మూలించుటకు ప్రధాన సాధనముగా గ్రహింపబడినది. 'ధనికులకడ నుండి గ్రహించి బీదల కిచ్చు ధనము జకాత్' అని ప్రవక్త [బుఖారీ—౨౪. ౧—] స్పష్టముగ చెప్పినారు. ధన మొకచో నిరంతరాయముగ కూడినయెడల కొందరు ధనగర్వముచే బీద స్థితిలో నున్నవారిని నీచముగ చూచుట తటస్థించును. దీనివలన భ్రాతృత్వము కలుగదు. అందుచే పుంజీపతిత్వమును ఇస్లామ్ ఖండించుచున్నది. పుంజీపతిత్వమునకు ప్రధాన సాధనమగు వడ్డీని నిషేధించినది. అంతేకాక ధనికులపై ఒక పన్నునుకూడ నిర్ణయించినది. ఈ పన్నే 'జకాత్.' జకాత్ ఆదాయపుపన్ను కాదు. దానిని ఆస్తిసుంక మనవచ్చును. ఒకనికున్న పూర్తిసంపదపై అది పన్ను. కేవలము లాభముపైకాదు "ఒకవ్యక్తి తనయింట నున్న సర్వసంపదపైనను నూటికి రెండున్నర చొప్పున ఈ పన్ను చెల్లింపవలెను." ముస్లిమ్ప్రభుత్వ మున్నచోట్ల ఈ పన్నును ప్రభుత్వమే వసూలుచేసి ఒక నిధిని తయారుచేయును. ఇది బీదలకొరకే వినియోగింతురు. ముస్లిమ్ ప్రభుత్వము లేనిచోట్ల ఈ నిధిని సంఘప్రతినిధులు పాలింపవలెను. ఈ నిధిని సంఘమునందలి బీదల కుపయోగించు విధమున వినియోగింపవలెను.

క్షుద్బాధ యెట్టిదో తెలియుటకు స్వయముగ క్షుద్బాధ ననుభవించవలయును. క్షుద్బాధ యెట్లుండునో తెలిసినప్పుడే ఆకలిచే వేగు బీదప్రజల కష్టసుఖము లర్థమగును. ఐశ్వర్యమున నోలలాడుచు కష్టమన నేమియో, ఆకలియన నేమియో తెలియనివారు బీదసాదలయెడ సానుభూతి చూపజాలరు. అందుచేతనే సంవత్సరమున కొక నెల ఉపవాస ముండుటను ఖుర్ఆన్ విధించుచున్నది. విషయవాంఛలను అరికట్టు ఒక యోగాభ్యాస ముపవాసము.

ఇట్లు ఇస్లామ్ మతము నిర్మించిన సంఘనిర్మాణ మీ ఐదు స్తంభములపై ఆధారపడి యున్నది.

* * *

౧౮. 6, 7, 8 ఖండములయందు మూసా ప్రవక్త జీవితమునందలి అనుభవముల గురించి చెప్పబడినది. మూసాప్రవక్త యూదుల మతకర్త. ఆయననుగురించి ఖుర్ఆన్‌లో విస్తారముగ చెప్పబడినది. బైబిల్‌లో కూడ మూసాప్రవక్త ప్రసక్తి చాలా కలదు. క్రైస్తవులు వీరిని మోసెస్ (Moses) అందురు. మూసాప్రవక్తనుగురించి చెప్పినంత మరే ప్రవక్తనుగురించియు ఖుర్ఆన్ చెప్పలేదు. అంతేకాదు. ఖుర్ఆన్‌లో అందరికంటె ముందు ఈప్రవక్తనుగురించియే చెప్పబడినది. మూసాప్రవక్త కింతటి ప్రాముఖ్య మిచ్చుటకు కారణము ఖుర్ఆన్‌నుండియే మనము గ్రహించవచ్చును.

"ఫిరఔను కడకు మేము ఒక ప్రవక్తను పంపియుండినట్లే మీకడకును ఒక ప్రవక్తను పంపియున్నాము."

అని ఖుర్ఆన్ ప్రజలను సంబోధించుచు చెప్పుచున్నది. ఫిరఔనుకడకు పంపబడిన ప్రవక్త మూసా. వారికిని శ్రీ మొహమ్మద్ ప్రవక్తకును అనేకవిధముల సామ్యము కలదు. ఈ సామ్యమును మూసా ప్రవక్తయే వివరించి చెప్పియుండెను. చూడుడు .—

"తిరిగి మీ సోదరజాతినుండి 'నావంటి' ఒక ప్రవక్తను ప్రభువు పుట్టించును. మీ రందరును ఆయన ఉపదేశమును గ్రహించవలెను."

అని మూసా తన ప్రజలను సంబోధించి చెప్పియుండెను. శ్రీ మొహమ్మద్ ప్రవక్త ఇస్రాయీలీయుల సోదరజాతినుండియే కదా ఉద్భవించెను. శ్రీ ఏసుక్రీస్తు పరలోకగతు లైనపిదపకూడ ఆయనశిష్యులు వాగ్దానమీయబడిన ప్రవక్తకొరకు ఎదురు చూచుచునే యుండిరి.

శ్రీ మొహమ్మద్ ప్రవక్త మూసాప్రవక్తవలెనే కేవల ధర్మప్రవచనమే కాకుండ ధర్మసంస్థాపనము కూడ చేసిన మహాత్ముడు. కొందరు ప్రవక్తలు ధర్మప్రవచనము మాత్రము చేయుదురు. కొందరు ధర్మసంస్థాపనమును చేయుదురు. మూసా ప్రవక్త శ్రీ మొహమ్మద్ ప్రవక్తవలెనే ధర్మప్రవచనమే కాక ధర్మసంస్థాపనము కూడ చేసిన మహనీయుడు.

మూసాప్రవక్త చరిత్ర ఖుర్ఆన్‌లో సంక్షిప్తముగ చెప్పబడినది. ఈ ప్రవక్త జీవితరంగము ఈజిప్టుదేశము. ఈజిప్టుదేశములో ఆ కాలమున 'ఫారోఆ' లేక 'ఫిరఔన్' అనబడు చక్రవర్తులు పాలించుచుండిరి. అప్పటి ప్రజలు సూర్యుని పూజించుచుండిరి. నాటి భాషలో సూర్యునకు "రః"అని పేరు. చక్రవర్తి సూర్యుని అపరావతారముగా పరిగణింప బడుచుండెను. అందుచేతనే చక్రవర్తి, ఫారోఆ' అను బిరుదుతో

వ్యవహరింపబడుచుండెడివాడు. ఈ ఫారోఆల సమాధులు నేటికిని ఈజిప్టుదేశములో నిలచియున్నవి. వీటిని "పిరమిడు" (Pyramids) లందురు.

మూసా ప్రవక్త ఇస్రాయీల్ వంశమునకు చెందిన మహాపురుషుడు. ఇస్రాయీల్ వంశస్థులు యూసుఫ్ ప్రవక్త కాలములో ఈజిప్టుదేశమునకు వెళ్లిరి. యూసుఫ్ ప్రవక్త పరిపాలనాకాలములో ఈజిప్టుప్రజలు తర్వాత స్వతంత్రులై ఇస్రాయీల్ వంశీయులను బానిసలుగా పట్టుకొనిరి. మూసాప్రవక్త ఇస్రాయీలీయవంశమున జన్మించుట చేత తనప్రజల విముక్తికై ఆయన నాటి ఫారోఆ చక్రవర్తితో పోరాడవలసివచ్చెను. ఆయన ఫారోఆను అర్థించిన విషయములు రెండు :— ఇస్రాయీల్ వంశమువారిని బానిసత్వమునుండి విడిపించుట ; వారిని ఈజిప్టుదేశమునుండి వారిచ్ఛవచ్చినచోటికి వలస పోనిచ్చుట.

మూసాప్రవక్త చరిత్ర ఖుర్ఆన్‌లో ఇట్లు చెప్పబడినది :- చక్రవర్తికి భయపడి మూసాప్రవక్త తల్లి భగవదాజ్ఞచే ఆయన జన్మించిన తక్షణమే ఒకపెట్టెలో పెట్టి నైలునదిలో విడుచును. ఆ పెట్టె దైవవశమున చక్రవర్తికే దొరకును. తేజోవంతుడగు ఆ శిశువును చూచి రిచ్ఛవడి చక్రవర్తియే ఆ బాలుని పెంచును. ఆ బాలుడు దినదినము అభివృద్ధి నొంది చక్రవర్తి పెంపుడు కుమారునిగ పెరిగి యువకు డగును. ఇట్లుండగా ఒకనాడు ఒక ఈజిప్టుదేశస్థుడు ఒక ఇస్రాయీలీయుని బాధ పెట్టుచుండగా చూచి ఓర్వలేక ఈజిప్టుదేశస్థుని మూసా ఒకదెబ్బ కొట్టును. దానితో అతడు ప్రాణములు విడుచును. ఇట్లు తలవనితలంపుగా జరిగిన హత్యవలన తనకు అపాయము కలుగునను శంకతో మూసా మీడియన్ దేశమునకు పలాయితు డగును. అక్కడ జెత్రో అను నతనిని ఆశ్రయించి ఆయన కుమార్తెను వివాహ మాడును. ఇట్లు పదేండ్లు అజ్ఞాతవాసమును గడిపి తుదకు ఈజిప్టుదేశమునకు మరలును. ఈజిప్టుదేశమునకు పోవు మార్గములో ఆయన భగవత్తేజమును చూచి దివ్యజ్ఞానమును బడయును. నాటినుండి ఆయనకు ప్రవక్తృత్వము లభించును.

మూసాప్రవక్తకు దివ్యశక్తి లభించును. ఆయన చేతికఱ్ఱ ఆయన ఇచ్ఛానుసారము ఒక మహాసర్పమైనట్లును, ఆయన శ్వేతహస్తుడైనట్లును ఆయనకు కనిపించును. వెంటనే ఈజిప్టుదేశమునకు పోయి ఇస్రాయీలీయులను దాస్యమునుండి విడిచిపెట్టవలసినదిగా ఫారోఆను కోరుమని ఆయన భగవంతునిచే ఆజ్ఞాపింపబడును. మూసా తన సోదరుని సహాయమునా గొని ఫారోఆను సందర్శించి మేము దేవుని దూతలము; భగవదాజ్ఞలను అతిక్రమించక ఇస్రాయీలీయులను విడిచిపెట్టవలసిన దనియు, వారిని బాధించవలదనియు చెప్పును. ఫారోఆ చక్రవర్తి మూసా మాటలకు నవ్వి "భగవంతు డెవరు ?"

అని అడుగును. ఫారోఆ తానే భగవంతుడ నను అహంకారము కలిగి ఉండును. మూసా ఈ ప్రశ్నకు ఇట్లు జవాబు చెప్పును: 'సర్వసృష్టికి కారణభూతుడై దానిని నడిపించుచున్నవాడే మా ప్రభువు.' ఫారోఆ మూసా సందేశమును నిరాకరించుటయే కాక భగవంతునియందు కూడ అవిశ్వాసము ప్రకటించును. ఏదైనను మహాత్మ్యములను చూపుమని మూసాను కోరును. మూసా భగవన్నామముచే తన చేతికఱ్ఱను పాముగను, తన చేతిని శ్వేత హస్తముగను మార్చి చూపును. ఇది యేదియో మంత్ర ప్రభావమని ఫారోఆ చక్రవర్తి సుప్రసిద్ధ మాంత్రికులను రప్పించి మూసాపై మంత్రములను ప్రయోగించుమని ఆజ్ఞాపించును. మాంత్రికులకుమూసా మరి కొన్నిమహాత్మ్యములను చూపును. ఫారోఆ చక్రవర్తి తనకు ఆపద వచ్చినప్పుడు దానినుండి తప్పించుకొనుటకై విశ్వసించెదనని మాటనిచ్చి ఆపద గడచిన పిదప ఎప్పటియట్లు విశ్వాసహీనుడైయుండును. మూసాప్రవక్త తన ప్రజలను ఓపికవహించి భగవంతుని ప్రార్థించుడని హెచ్చరించును. తుదకు మూసా ఒకనాటి రాత్రి తన యనుచరులతో రాజధానిని విడిచి పలాయితుడగును. ఫారోఆ సైనికులు మూసాను వెంబడింతురు. మూసా తన మహిమచే సముద్రమును దాటి పోవును. వెంబడించిన ఫారోఆ సైనికులు సముద్రగర్భమున మునిగిపోదురు.

ఇట్లు తనప్రజలను ఫారోఆ బానిసత్వమునుండి విడిపించి మూసా తన ప్రజలను విడిచి తపస్సుచేసికొనుటకై యొక పర్వతమునకు పోవును. మూసాసందేశమునందు సందేహము కలిగినవారై ఇస్రాయీలీయులు భగవంతుని ప్రత్యక్షముగ చూపుమని ఆయనను కోరుదురు. మూసా భగవంతునిప్రార్థించును. దివ్యతేజము ఒక తటిల్లతవలె చేరువనున్న పర్వతముపై చూపట్టగనే ఆపర్వతము భస్మీభూతమగును. అందరును మూర్ఛపోవుదురు. మూసా తెలివినొంది మూర్ఛావశులైన తన ప్రజలకొఱకై ప్రార్థించును. అందరును తిరిగి లేతురు.

మూసా ప్రవక్త భగవద్గ్రంథమును బడయును. ఇస్రాయీలీయులు మూసా తపస్సునకుపోయి ఉండిన కాలములో ఒక గోవత్సమును పూజింపసాగిరి. మూసా ఈ పూజను మాన్పించును. తర్వాత గోవునందలి ఆరాధనాభావమును మాన్పించుటకై తన ప్రజలచే గోయజ్ఞమును చేయించును.

మూసా తన ప్రజలను స్వదేశమైన కేనాన్ దేశమునకు తనతో నడువవలసినదిగా కోరును. బానిసస్థితిలో నిరపాయజీవితమును గడపిన ఇస్రాయీలీయులకు తామెన్నడో విడిచిపెట్టిన స్వదేశమునకుపోయి తమ హక్కులను సంపాదించుకొనుటలో గల కష్టములను సహించుట రుచింపదయ్యెను. వారు మూసాపై తిరుగబడి ఈజిప్టుకు మరలిపోవలె

(h)

నని సహితము తలచిరి. మూసా మాట వినక ఇస్రాయీలీయులు ౪౦ ఏండ్ల కాలము ప్రవాసములో గడపి కష్టములను అనుభవింతురు.

మూసా ప్రవక్త సంక్షిప్త చరిత్రమిది. ౪౦౦ ఏండ్లు దుర్భర దాస్యమునకు కట్టుబడి ఉండిన ఇస్రాయీలీయులను విముక్తి నొందించి వారిని స్వదేశమునకు తీసుకొనిపోయిన జాత్యుద్ధారకుడు మూసా ప్రవక్త. ఇప్పుడు యూదులని పిలువబడుచున్నవారందరును మూసాప్రవక్త అనుయాయులు.

క్రీ.పూ. 14 వ శతాబ్దమున మెనెప్టా: లేక మెరెన్ప్టా: అను ఫారోఅ (చక్రవర్తి) కు మూసా ప్రవక్త సమకాలికుడని ఇప్పుడు చరిత్రకారు లందరును ఏకగ్రీవముగ ఒప్పుకొన్న విషయము. ఈజిప్టునుండి మూసా తన ప్రజలను కెనఆన్ దేశమునకు నిర్గమించిన కాలమును గూర్చి పండితులలో కొంత అభిప్రాయభేదమున్నది. క్రీ.పూ. 1320 అని డాయిట్స్కు పండితుడును, క్రీ.పూ. 1447 అని గార్టాంగ్ పండితుడును, 1380 అని కేంబ్రిడ్జి హిస్టరీ సంపాదకులును కాలనిర్ణయము చేసినారు.

చరిత్రనుండి గుణపాఠమును గ్రహించవలసినదని ఖుర్ఆను ఆదేశించుచున్నది. ఖుర్ఆను గ్రంథములో ప్రతి అధ్యాయమునందును చరిత్రప్రసిద్ధములైన ఇట్టి గాథలే ఉదాహరణములుగా ఇయ్యబడి ఉన్నవి. నాటి విజ్ఞానప్రపంచములో ఈ ప్రవక్తల చరిత్రములు అతి ప్రసిద్ధములై యుండెను. ఖుర్ఆను గ్రంథమునందు పేర్కొనబడినచరిత్ర పురుషులు బైబిల్లో పేర్కొనబడినవారే. బైబిల్ గ్రంథము క్రైస్తవులకును యూదులకును గూడ పవిత్రగ్రంథ మగుటచే ఈ ఉపాఖ్యానములు ప్రపంచమునందలి యెక్కువ భాగమునకు శ్రుతవిశ్రుతములైనవి.

*   *   *   *

౧౯. ఆరవ ఖండమున రెండు ఆధ్యాత్మిక సత్యములు వివరింపబడినవి. ఎవరి పాప పుణ్యములను వారే యనుభవించవలెను అనునది మొదటిది.

"జాగ్రత్త! ఒకదినము వచ్చును. నాడు ఎవరూ ఎవరికీ సహాయము చేయరారు. మిమ్ములను వెంటబెట్టుకొని రక్షించుటకు రారు. మీ పాపములకు ఏదియు పరిహారముగా గ్రహింపబడదు."

ఆకాలమునను ఈ కాలమునకూడా పాపపరిహారమునుగురించిన అనేక మూఢవిశ్వాసములు అన్ని మతములవారియందును వ్యాపించి యుండిన విషయము విదితము. ఏసుక్రీస్తు తనయందు నమ్మిన వారందరిని రక్షించునను విశ్వాసము క్రైస్తవులలోఉన్నది. అటులనే సర్వశక్తి సంపన్నుడగు పరమేశ్వరుని విడచి దేవతలను, మహాపురుషులను ఆరాధించి వారిద్వారా ముక్తిని బొందవచ్చునను భావముహిందూ బౌద్ధజైనమతములందు

వ్యాపించియున్నది. ఈవిశ్వాసము ప్రకృతి ధర్మములకు విరుద్ధముగ నుండుట స్పష్టముగ కనిపించుచున్నది. మనము చేసిన కర్మలకు మనమే బాధ్యులమై యుండుట సహజము. మన ఆధ్యాత్మికపరిణామముకూడ ప్రకృతిధర్మములచే కట్టుబడియున్నది. భగవత్ప్రార్థన, దానము, కరుణాళుత్వము ఇత్యాది పుణ్యకార్యములు మన మనస్సులను సంస్కరించును. దాని వలన మనకు ముక్తి లభించుట సాధ్యమగును. కాని కేవలము మనము చేయుచున్న పాపములను బాపుకొనుటకై ఒక మహాపురుషుని విగ్రహమును పూజించిగాని, ఒక దేవత నామమును స్మరించిగాని దానివలన లాభమును పొందగోరుట అజ్ఞానము. భగవదుపాసనము సహితము ఆత్మసంస్కారమునకై చేయవలయును; కాని ఒక మూలనుండి పాప కార్యములను చేయుచు ఆ చేసిన పాపముల దుష్ఫలముల నివారించుటకై ఉపాసనము చేయుట వ్యర్థము. ఖుర్ఆనులో ప్రతిచోట భగవంతునియందు విశ్వాసముంచి సత్కార్యములు చేయుమని ఉపదేశింపబడినది. దుష్కార్యములు చేయుచు భగవంతుని ప్రార్థించుట వ్యర్థము. మనము చేసిన దుష్కర్మలఫలమును నివారించుటకై దేవతాదులను పూజించుట అజ్ఞానమని భగవద్గీత సహితము బోధించుచున్నది. దేవతలు పరిమితమైన శక్తికలవారనియు, ప్రకృతిధర్మబద్ధులనియు, వారిని పూజించుటవలన ముక్తి లభించదనియు భగవద్గీత చెప్పుచున్నది.

శ్లో॥ కామైస్తైస్తైర్హృతజ్ఞానాః
ప్రపద్యంతేఽన్యదేవతాః
తంతం నియమ మాస్థాయ
ప్రకృత్యా నియతాః స్వయా
శ్లో॥ అంతవత్తు ఫలం తేషాం
తద్భవత్యల్పమేధసామ్
దేవాన్ దేవయజోయాంతి
మద్భక్తాయాంతి మామపి. * ✓

౭—౨౦. ౨౩.

✓ * (తమతమ ప్రకృతులచే నియమితులై ఆయా కోరికలచే వివేకమును కోల్పోయినవారై ఆయా కోరికల కనుగుణములగు నియమములను ఆశ్రయించి పరమాత్మకంటె భిన్నమగు ఇతర దేవతల పొందుచున్నారు.

ఆ కోరికలను కోరునట్టి స్వల్పబుద్ధులయొక్క కర్మలఫలము నశించు స్వభావము కలది. కాని శాశ్వతమైనది కాదు. ఇట్టి దేవతల నారాధించువారు దేవతలనే పొందుచున్నారు. నాయొక్క భక్తులు నన్నే పొందుదురు.)

ఖుర్ ఆన్ మరియొక అడుగు ముందుకువెళ్ళి మానవునకును భగవంతునకును మధ్య తెరల నన్నింటిని చించివైచినది. మానవుడు తన కర్మలకు తానే బాధ్యుడు. ఈ కర్మల ఫలము భగవంతునిచే నియమితమైన కొన్ని ధర్మములకు లోబడియున్నది. ఆ ధర్మము లకు లోబడియే మానవుడు కర్మఫలమును పొందుచున్నాడు. ప్రవక్తకూడ ఈవిషయ మును అతి స్పష్టముగ వివరించిరి. ఒకప్పుడు ఒక అరబ్బు ఆయనకడకువచ్చి 'ప్రవక్తా! నాకు సంతానములేదు. నాకొక పుత్రుని ప్రసాదింపుడు' అని ప్రార్థించెను. ప్రవక్త అరబ్బు నుద్దేశించి 'ఓయీ! నీ చెప్పుకొఱకు ఒక దారము కావలసివచ్చినను భగవంతునే అర్థిం పుము. అతడే సమస్తమును ఇచ్చువాడు. నేను కేవల మనుష్యమాత్రుడను. భగవంతునకు తప్ప మరెవ్వనికిని దేనినైనను ఇచ్చు అధికారములేదు.' అని సెలవిచ్చిరి. ఇస్లాం మతము యొక్క ప్రత్యేకత ఇందే కలదు.

*   *   *   *

౨౦. ఈ ఖండమునందు పేర్కొనబడిన రెండవ ఆధ్యాత్మికసత్యము భగవం తునియొక్క అగోచరత్వము. భగవంతుడు చర్మచక్షువులకు అగోచరుడన్న సత్యము ప్రతి మతముయొక్క వేదాంతమును అంగీకరించినది. కాని భగవంతుని ప్రత్యక్షముగ చూచిన కాని అంగీకరించుటకు అనేకులు నిరాకరించియున్నారు. కొందరు బుద్ధితో భగవంతుని అగోచరత్వమును ఒప్పుకొన్నను క్రియకు వచ్చునప్పటికి అగోచరుడైన భగ వంతుని నిరాకరించుచున్నారు. అవయవరహితుడును, అగోచరుడును అగు భగవంతుని ఉపాసించుటయు, ఊహించుటయు, అసాధ్యమని వీరు వాదించుచున్నారు. ఈ వాద మును ప్రతిఘటించుటకుబదులు ఆర్యధర్మశాసకులు దేవతామూర్తి పూజలను సామాన్యుల కొఱకు అంగీకరించిరి. దీనిని ఒకవిధముగ సమర్థించిరికూడ. భగవంతుడు సర్వవ్యాపి యగుటచే దేవతాది సమస్తమూర్తులును భగవంతుని విభూతులని సమర్థింపబడినది.

"సతయా శ్రద్ధయా యుక్తస్తస్యారాధన మీహతే

లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్హితాన్" (౭ : ౨౨)

అని సర్వదేవతలును భగవంతుని మూర్తులేయనియు ఆయాదేవతలచే ఈయబడిన కోరి కలు నిజముగ భగవంతునిచే ఈయబడినవే అనియు భగవద్గీత చెప్పుచున్నది. దేశములో ప్రబలియుండిన బహుదైవతోపాసనమునకును ఉపనిషత్కాలమున వర్ధిల్లిన ఏకేశ్వరభా వమునకును భగవద్గీతచేసిన సంధిఇది. "యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసాసహ" అని వాక్కునకు మనస్సునకు సహితము అందడని వర్ణింపబడిన భగవంతుని అర్జునుడు

11:8 చూడగోరినపుడు "నతుమాంచక్షుషేద్రష్టు మనేనైవ స్వచక్షుషా" (ఈ ప్రాకృతమైన నీ కన్నులతో నన్ను చూడలేవు) అని శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా భగవద్గీత వాకొను

చున్నది. ప్రత్యక్షభగవంతునే చూచి సంతృప్తి పడగోరిన పౌరాణిక మనస్తత్వమును గీత ఈవిధముగా సంతృప్తిపరచినది. కాని ఖుర్ ఆన్ భగవంతుని ప్రత్యక్షముగ చూడ కయే మానవుడు భగవంతుని ఉపాసించ వచ్చునను సిద్ధాంతమును పూర్తిగా అంగీక రించి ఇస్రాయీలీయులకు భగవద్దర్శనము కలిగించదాయెను. ఈవిషయములో ఖుర్ ఆన్ విస్పష్టమైన మార్గమును సూచించినది. విద్యుచ్ఛక్తి కంటికి కన్పబడదు. అంతమాత్రమున దాని అస్తిత్వమును నిరాకరించుటకాని లేక దానివలన లాభము పొందుటగాని మనము మానుటలేదుకదా. అటులనే భగవంతుడు మన కంటికి కనబడనంతమాత్రమున అతనిని ఆరాధించుట అసాధ్యమని చెప్పుట అజ్ఞానము. కనిపించనంతమాత్రమున తద్భిన్నమగు వేరొక పదార్థమునుకాని వేరొక తత్వమును కాని భగవంతుడని పూజించుట రజ్జుసర్ప భ్రాంతియే అగును. విద్యారణ్యస్వామి నిరాకారుడును నిర్గుణుడును అయిన భగవంతు నుపాసించుట సాధ్యమగునా? కాదా? యను విషయము తన వేదాంతపంచదశిలో అతి సమర్థతతో చర్చించినాడు. (చూ. ధ్యానదీప ప్రకరణము). బ్రహ్మము వాఙ్మనములకు గోచరింపని స్వరూపము కలది. కనుక, దానిని ఉపాసించుట అసాధ్యమైనచో అది వాఙ్మనములకు గోచరింపని స్వరూపము కలదని యెందుకు ఉపాసింపకూడదు? అని విద్యారణ్యుని వాదము.

"తిష్ఠంతుమూఢాః ప్రకృతా నిర్గుణోపాస్తిరీర్యతే,

విద్యైక్యాత్సర్వ శాఖార్థాన్ గుణా నత్రోపసంహరేత్"

[మూఢులజోలి మన కక్కరలేదు. అన్ని వేదములయందును నిర్గుణోపాసన ఒక్కటియే ప్రతిపాదింపబడినది. దాని విశేషములు ఎచ్చటెచ్చట జెప్పబడినను వాటి నన్నిటిని ఉప సంహరించుకొనవలెను] అని నిష్కర్షగా తన మతమును తెలిపినాడు. ఇంతకును చెప్పు నదేమనగా ప్రతిదేశమందును నిరాకారుడును అద్వితీయుడును అగు బ్రహ్మమునే ఉపాసించు సిద్ధాంతము బోధింపబడినను అవి ప్రజాసామాన్యముయొక్క అనుదిన జీవిత ములో ప్రతిఫలింపలేకపోయెను. క్రైస్తవులుసహితము ఏసుక్రీస్తును, మేరీమాతనుఉపాస్య దైవములుగా గ్రహించుట, బౌద్ధులు బుద్ధుని బోధిసత్త్వులను ఆరాధించుట, హిందువులు వేలకొలది సంఖ్యగల దైవతములను పూజించుట పైన విద్యారణ్యుడు వివరించిన ఉన్నత తత్వము యొక్క అధఃపతనమును సూచించుచున్నది. అంతమాత్రమున శుద్ధబ్రహ్మోపా సనమునకు ఎట్టికొఱతయు కలుగదు. "పురుషస్య అపరాధేన కిముపాస్తిః ప్రదుష్యతి?"

ఖుర్ ఆను వివరించిన పైకథలో ఇస్రాయీలీయులు భగవంతుని ప్రత్యక్షముగ చూపుమని మూసా ప్రవక్తను కోరిరి. అప్పుడే వారు చూచుచుండగనే పిడుగులు

కురిసెను. వారు నిర్ఘాంతులై స్పృహతప్పి పడిపోయిరి. అనగా ఒక సామాన్యపు పిడుగుయొక్క శక్తిని సహింపజాలని మానవమాత్రునకు తన మహాచ్ఛక్తియందలి ఒక అణుమాత్రభాగముచే సమస్త సృష్టిని ఒనర్చిన భగవంతుని చూచుటకు శక్తికలదా? అంతదూర మేల? సూర్యుని ప్రచండతేజమును సహితము మనము కన్నెత్తి చూడలేము గదా? భగవంతుడు ఇదే పాఠమును ఇస్రాయీలీయులకు చూపినాడు.

* * *

౨౧. ఈ ఖండమున తుది సూక్తియందు ఒక ముఖ్యవిషయము చెప్పబడినది. ఇస్రాయీలీయులు మూసా వెలువరచిన సత్యగ్రంథమును తారుమారుచేసి తిరిగి దుష్పథమును అవలంబించిరి. ఇది సామాన్యముగా ప్రపంచ చరిత్రయందు మనము చూచుచున్న విషయము. ప్రపంచ మతగ్రంథము లన్నియు ప్రక్షిప్తభాగములతో నిండియుండుట మన యందరి యనుభవము. ఒక ఖుర్ఆన్ గ్రంథముతప్ప తక్కిన అన్ని గ్రంథములలోను ఎన్నో మార్పులు వచ్చినవి. శ్రుతులని మనము పిలుచు ఉపనిషద్గ్రంథములు ఎట్లు అసంఖ్యాకముగ పెరిగి పరస్పర విరుద్ధముగా సిద్ధాంతముల ప్రతిపాదించుచున్నవో ఎల్లరకును తెలిసినదే. అట్లే బైబిల్ గ్రంథము వివిధభాషలలో వివిధ ప్రక్షిప్త భాగములతో కూడి ఉన్నదని క్రైస్తవపండితులు చెప్పుదురు. ఖుర్ఆన్ ఈ విషయమును అనేకచోట్ల నొక్కి వక్కాణించినది. సత్యము అన్ని కాలములందును ఒకటే అనియు, అదే సత్యము ప్రతిప్రవక్తయు ప్రతిదేశమునను చాటెననియు, తమతమ ప్రవక్తల మరణానంతరము ప్రజలు ఆ సత్యములను తారుమారొనర్చి తిరిగి దుష్పథమును అవలంబించుచు వచ్చిరనియు ఖుర్ఆన్ చెప్పుచున్నది. ఇప్పుడు మత చరిత్రపరిశోధకు లందరు ఈ సత్యమును ధృవపరచిరి.

* * *

౨౨. ఈ సూక్తియందే ఒక ముఖ్య సిద్ధాంతము ప్రతిపాదింపబడినది.

"వాస్తవముగ మోక్షము సత్యమునందు మీకుగల విశ్వాసముపైనను, స్వకీయమగు కర్మలపైనను ఆధారపడి యున్నది; కాని జన్మము, వంశము, మతాచారములు—వీటిపై ఆధారపడిలేదు. సత్యమును విశ్వసించువారు ఎవ్వరైనను అగుదురుగాక; యూదులగుదురుగాక, క్రైస్తవు లగుదురుగాక, గ్రహములను పూజించు సబాయీ లగుదురుగాక, మరేమతస్థులైనను కానిమ్ము— దేవునిపైనను, కర్మ పరీక్షాదినమునందును విశ్వాసముంచి, సత్కార్యాచరణము చేయువారైనచో దేవుడు వారికి దాని ఫలమును ఇచ్చును. వారిని ఏ విధమగు భయము గాని, శోకము గాని అంటదు."

ఎంత విశాలభావము. మతాచారములు వేరు. సత్యము వేరు. ఇప్పుడు మన దేశములో వస్త్రధారణ భేదములవలనను, భాషా భేదములవలనను, ఆచార భేదములవలనను మత భేదములు నిర్ణయింపబడుచున్నవి. మతమునకు నిజమైన గీటురాయి మనము నమ్ముచున్న సత్యము. మన మాచరించు కర్మలు కాని మనము ధరించు దుస్తులు, అనుసరించు ఆచారములును కావు. ఈ భావము ప్రజలహృదయములలో నాటుకొన్నచో మన దేశములో ప్రబలియున్న మతవైషమ్యము పూర్తిగ నశించును. ఇస్లాం మానవైక్యతను బోధించుచున్నది. మానవు లందరు ఆదమ్‌యొక్క సంతతి అని చెప్పి మానవులకు పరస్పర భ్రాతృసంబంధమును చేకూర్చినది. ముస్లిమ్‌లకు జాతీయతాదృష్టి లేదనియు, వారు టర్కీ, ఈజిప్టు, అరేబియా, పర్షియా దేశములవైపే తమదృష్టిని మరల్చి ఉంచుదురనియు మన దేశములో జాతీయవాదు లందరును చెప్పుట కలదు. ముస్లిమ్‌లకు నిజముగా జాతీయతాభావము లేదు. విశ్వమానవభ్రాతృత్వభావము వారికి ఉగ్గుపాలతో నేర్పబడిన పాఠము. వారి మనస్తత్వములో జాతీయతాభావమునకు తావు లేదు. ముస్లిమ్‌దృష్టి విశ్వవిశాలము. జాతి కులవర్ణ భేదములు అతని కర్థము కావు. అతనికి హరిజను డెంతయో బ్రాహ్మణుడును అంతయే. చైనా ముస్లి మెంతయో అమెరికన్ ముస్లిమ్‌యును అంతయే.

* * *

౨౩. ఎనిమిదవ ఖండము తుది భాగములో గోయజ్ఞమునుగురించి ఖుర్ఆన్ ఒక కథను చెప్పుచున్నది. ఇస్రాయీలీయులు గోవును పూజించుచుండిరి. గోవును దేవునిగ ఆరాధించుట పాపమని మూసాప్రవక్త బోధించెను. ఇస్రాయీలీయులు మూసాప్రవక్త ఉపదేశమును పైకి గ్రహించిరి. కాని వారికి ఆ మాటయందు పూర్తిగ విశ్వాసము కుదురలేదు. చిరకాలాగతమైన గోభక్తి వారిహృదయములనుండి తొలగించుట కష్టమాయెను. వారియందలి ఈ మూఢభక్తిని తొలగించుటకై మూసా వారిచేతనే గోయజ్ఞము చేయించిన పిదప ఇస్రాయీలీయులకు మూఢభక్తి వదిలెను.

భారతదేశమున అనాదినుండియు గోవు గౌరవస్థానమును వహించియే యున్నది. పాడియు, పంటయు ముఖ్యజీవనాధారముగాగల మన దేశమున గోవున కీ స్థానము సహజముగ లభించినది. ఐనను చిరకాలమువరకు—ప్రాయశః జైనబౌద్ధమతప్రభావము వేదమతమును మార్చినంతవరకు—గోయజ్ఞము, గోమాంసాశనము నిషేధములై యుండలేదు.

వేదకాలమందును మహాభారతకాలమందునుకూడ గోమాంసము విరివిగ వాడబడుచున్నట్లనేక నిదర్శనము లాయా గ్రంథములనుండి ఇయ్యవచ్చును. ఋగ్వేదమందలి ఈ క్రింది వాక్యములను పరికింపుడు :—

ఉక్ష్ణోహి మే పంచదశ సాకం పచంతి వింశతిం ఉతాహమద్మి
పీవ ఇదుభా కుక్షీ పృణంతి మే విశ్వస్మా దింద్రఉత్తరః.

[ఋగ్వే. 10—86—14]

[నా భార్యయైన ఇంద్రాణిచే ప్రేరితులై యజ్వలు పదియేను వృషభములను, ఇరువది యెద్దులను వండుచున్నారు. నేను వానిని భక్షించుచున్నాను. తిని బలియుచున్నాను. పైగా యాగకర్తలు సోమరసముచే నా డొక్కలు నిండించుచున్నారు. అందుచే లోకమంతటికంటె నేను గొప్పవాడ నగుచున్నాను.]

ఇట్లే వృషాకపి వసుక్ర భరద్వాజ సోమాహుతి దీర్ఘతమః ప్రభృతులగు ఋషుల వాక్యములనుబట్టి యజ్ఞహవిస్సుగా గోమాంసమును భక్షించుటకలదని తెలియుచున్నది. తాండ్యాబ్రాహ్మణమున కీ క్రిందివాక్యములు చూడుడు :—

"ఇంద్రుడు యజ్ఞపశువులైన వృషభములను భక్షించుగాక!" (ఋగ్వే. 40—86—13.)

"ఇంద్రా! నీ నిమిత్తము యజమానులు వృషభ పశువులను వండుచున్నారు. వాని నారగింపుము." (ఋ. 10—28—3).

"అగ్నీ! ఋగ్రూపమయిన హవిస్సు వృషభవసా మాంసరూపముగా పరిణమించి నీ భక్షణమున కగుగాక!" (ఋ. 10—28—3).*

"ఓ అగ్నీ! గోడ్డావులచేతను, బలీవర్దములచేతను మేకపోతుల మేకములచేతను ఆరాధింపబడినవాడవైతివి." [ఋ. 6—16—47]

"ఋభవులలో నొకడు రక్తము తీసి యావలపెట్టుచున్నాడు. అది రక్షోభాగము. మరియొకడు కత్తితో హృదయజిహ్వా వక్షస్థలములందలి మాంసమును కోయుచున్నాడు. ఇంకొకడు కుక్షిస్థమాంసమును వెలువరించుచున్నాడు. ఋత్విగ్రూపులైన ఋభవు లిట్లు చేసినపిగప యజమాన దంపతులు చేయదగిన దింకే మున్నది?"* [ఋ. 1 - 161 - 10.]

మహాభారతకాలమునకూడ గోమాంస భక్షణముండెడిదని ఈ క్రింది మహాభారత వాక్కులవల్ల తెలియుచున్నది ;

* బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి "సంస్కృత వాఙ్మయ చరిత్ర" (సం. 1 పేజీ 153 - 4) నుండి ఇవి సంగ్రహింపబడినవి.

"ఆరాళికో గోవికర్తా సూపకర్తా నియోధకః
ఆసం యుధిష్ఠిరస్యాహ మితి వక్ష్యామి పృచ్ఛతః"

(విరాట పర్వము)

(నేను పూర్వము ధర్మజు కొలువునందు వంటవాడనై, గోవులను ఖండించువాడనై, సూపకారుడనై, మల్లుడనైయుంటిని.) విరాటుని కడ సేవకుడైపోవు ; భీముని విరటునికడ నీవేమి చేయగలవని ధర్మజు డడుగ భీముడు చెప్పిన మాటలివి.

ఆపస్తంబ ధర్మసూత్రకారుడు 'ధేన్వనడుహోర్భక్ష్యం' అను సూత్రమున ఆవుయొక్కయు, యెద్దుయొక్కయు మాంసములు భక్షింపదగినవనియు, 'మేధ్యమానడుహమితి వాజసనేయకమ్' అను సూత్రముచే ఎద్దుమాంసము పవిత్రమైనదని వాజసనేయ మతమనియు చెప్పుచున్నాడు:

"అనడుహం నకేవలం భక్ష్యం కిం తర్హి మేధ్య మపీత్యర్థఃబహ్వృచ బ్రాహ్మణేషుశ్రూయతే 'తద్యథై వాదో మనుష్యరాజ ఆగతే అన్యస్మి న్వాఅర్హ త్యుక్షాణంవా వేహతం వా అక్షదన్త ఇతి. తత్రఅతిథేర్భక్ష్య మన్యేషామభక్ష్య మితి వధోఽపికిల తత్రానుజ్ఞాతః 'దశగోఘ్నా సంప్రదానే' గోఘ్నశ్శబ్దేన హన్యతే సగోఘ్నో అతిథిరితి ఏవంకిల పూర్వమాచారః ఇదానీమపి తద్గన్ధః వర్తత ఇతి శేషః.

(ఎద్దుతినదగినదిమాత్రమే కాక పవిత్రమని కూడ అర్థము. బహ్వృచ బ్రాహ్మణమునకూడ నిట్లే చెప్పబడినది. ఎట్లనగా కర్మార్హుడుగాని, రాజుగాని, మరొక యతిథిగాని వచ్చినపుడు బరువు మోయునట్టిగాని, మోయనట్టిగాని ఎద్దును చంపదగును. ఇచట అతిథి తినవచ్చును, ఇతరులు తినరాదని యర్థమైనను వధకు అనుజ్ఞ ఇయ్యబడినట్లు తలపవలెను. 'దశగోఘ్న సంప్రదానే' యను వచనమున 'గోఘ్న' శబ్దమునకు అతిథియని అర్థము— అనగా ఎవనికొఱకు గోవు చంపబడునో యని—పూర్వమిట్లే యాచారముండెను. ఇప్పటికిని దాని వాసన (సంప్రదాయము) కలదు).

అని హరదత్తుడు గౌతమధర్మసూత్ర వ్యాఖ్యయగు, మితాక్షరములో వ్రాయుచున్నాడు. హరదత్తుడు పండ్రెండవ శతాబ్దమువాడు. అతని కాలమున ఈదేశమున గోమాంసాశన మక్కడక్కడ ఉండెడిదనియే చివరి వాక్యమువల్ల తెలియుచున్నది.

భవభూతి తన ఉత్తరరామ చరిత్ర నాల్గవ యంకమున వేదఋషు మన్నించువారు మధుపర్క ప్రాశనకై 'వత్సతరిని (రెండేండ్ల ఈడుగల లేగదూడ) వధించి దాని మాంసమును బెట్టుటను వర్ణించుచున్నాడు.

భట్టమురారికవి కాలమునను బ్రాహ్మణ విద్యార్థులు గురువుల యజ్ఞములందు పశువిశసనము జేయుచున్నట్లే చెప్పియున్నాడు చూడుడు:

(j)

తత్రాదృక్త్రుణా పూల కోపనమిత క్లేశా చ్చిరద్వేషిభిః
మేధ్యా మత్సతరీ విహస్య వటుభిస్సోల్లుంఠమాలభ్యతే॥

(అనర్ఘరాఘవము, 2 అం.)

(గడ్డిమోపులఁ దెచ్చి మేఁపుటచే నైన కష్టమువల్ల బహుకాలమునుండి ద్వేషించుచుండిన బ్రహ్మచారులు నవ్వుచు రెండేండ్ల యీడుగల యావుదూడను జంపుచున్నారు.)" మహారాష్ట్ర ద్రావిడదేశములందు బ్రాహ్మణులు మాంసాశనమును గొప్ప దోషముగను, దేశమం దెల్లెడలను గోమాంసభక్షణము మహాపాతకముగను భావించుచుండుటకలదు. ఇవి జైన బౌద్ధమత ప్రభావముచే నిటీవల వచ్చిన ఆచారపూర్వకమైన నిషేధములేగాని వేదములందుగాని ఇతర ప్రాచీన గ్రంథములందుగాని ఇట్టినిషేధముండినట్లు కన్పించదని చూపుటయే ఇంత దీర్ఘముగ వ్రాయుటయందలి దీని ఉద్దేశము.

* * *

౨౪. తొమ్మిదవ ఖండమున మత గ్రంథములను వ్రాయు విద్యాంసులను గురించి చెప్పబడినది. ఇది ఇస్రాయీలీయులను ఉదాహరణముగ గ్రహించి చెప్పినప్పటికిని దీనిని సర్వదేశములకును అనువర్తింపజేయవచ్చును. ప్రతి సత్యమును ఏదో యొక ఉదాహరణరూపమున బోధించి చెప్పుట ఖుర్ఆన్ పద్ధతి. మన దేశములో ప్రతి పురాణమును ధర్మశాస్త్రమును, ఉపనిషదాది గ్రంథములును బ్రహ్మయో శివుడో లేక ఒక మహర్షియో ప్రవచించినట్లుగా చెప్పుట యొక యాచారమైపోయినది. ఈశ్వరోపదిష్టమైనదని చెప్పినగాని ప్రజాసామాన్యమునందది అంగీకృతము కాదని అభిప్రాయపడి ఈ గ్రంథకర్తలట్లు చేసియుందురు. మత వైషమ్యములుకూడ దీనికి కారణము. శైవ వైష్ణవాది వివిధ విరుద్ధమతములవారు ఒకరినొకరు దూషించుకొనుటయు, ఆదూషణములను పురాణాది గ్రంథములందు జొన్పుటయు, ప్రజలకు వానియందు విశ్వాసము కల్గించుటకై ఆ గ్రంథములు భగవదుపదిష్టములని చాటుటయు మన దేశమునందు సాధారణమైపోయినది. ఖుర్ఆన్ ఇట్లు చేయువారిని ఖండించుచున్నది. ౨౪-౨౯ సూక్తములలో ఖుర్ఆన్ వీరి మనస్తత్వమును చిత్రించుచున్నది. దైవభీతి లేనివారిట్లు చేతురనియు, వీరు బండబారిన హృదయములు కలవారగుటచే దైవభీతి లేదనియు, అందుచే వీరు పాషాణముల కన్న కఠినులనియు ఖుర్ఆన్ చెప్పుచున్నది.

* * *

౨౫. ౧౦-౧౩ సూక్తములలో ఖుర్ఆన్ మరొక ముఖ్య సిద్ధాంతమును ప్రతిపాదించుచున్నది. మోక్షము కొన్ని జాతులకును అందులో కొన్ని ప్రత్యేక కులములకును సంబంధించినవారికే సాధ్యమను ఒక దురభిప్రాయము పెక్కు జాతులందు ...దేకాక నేడుకూడ కలదు. మన దేశములో వర్ణవ్యవస్థ కీ భావముకూడ ఒక యంగ...మున్నది. ఇస్రాయీలీయులుకూడ నిట్టి భావమునే కల్గియుండిరి. ఖుర్ఆను ఈభా...మును ఖండించుచున్నది. మోక్షము ప్రతివ్యక్తియు చేయు పాపపుణ్యములపై ఆధార...యున్నది. కాని జాతి కుల భేదములచేత కాదని ఖుర్ఆన్ ఇందు స్పష్టపరచినది.

* * *

౨౬. పదవఖండమున కొన్ని నీతులు బోధింపబడినవి. ఇందుపదిష్టమైన నీతివా...ములు సర్వమత సమ్మతములు.

* * * *

౨౭. పదునొకండవఖండమున ౮౭-౯౧ సూక్తములలో సత్య మొకే మతము...కును, ఒకే గ్రంథమునకును పరిమితము కాదనియు, అనేక ప్రవక్తలు వివిధ కాలములందు ...సత్సందేశమును వినిపించియుండిరనియు ఖుర్ఆన్ చెప్పుచున్నది. ఈ గ్రంథములు ...స్పరవిరుద్ధములు కాక ఒకదాని కొకటి ప్రోద్బలముగా నుండినవనియు, వివిధ ప్రవ...లు పరస్పరవిరోధులు కాక ఒకేసత్యమును చాటు భగవద్దూతలనియు నిందు చెప్ప...నది.

* * * *

౨౮. తర్వాత (౯౨-౯౩) నోటితో చెప్పి హృదయమున నిరాకరించు పయో...విషకుంభములవంటివారిని ఖుర్ఆన్ ఖండించుచున్నది.

* * * *

౨౯. కేవలము జన్మమాత్రమున మోక్షము లభించదని ఖుర్ఆన్ మరొకసారి ...కొనుచున్నది. (౯౪-౯౬). కర్మలు మోక్షమున కాధారముకాక కేవలము జన్మయే ...నచో కర్మక్షేత్రమగు ఈ ప్రపంచమున నుండు టెందులకు? నశ్వరమును బుద్బుద...ప్రాయమును అగు ఈ జీవితము నాశించు టేల? తమకై తెరచియున్న మోక్షద్వార...మున ప్రవేశించుట కెందరు జంకుదురు? దాని మనస్తత్వమును ఖుర్ఆన్ ఇట్లు విన...పించుచున్నది. "వారిన్నాళ్లు కూడబెట్టియుంచిన దుష్కర్మలు వారి నిట్లు చేయని...య్యవు......జీవితమునందు వారికిగల తృష్ణ మరెవ్వరికిని లేదు ......వెయ్యేండ్ల జీవి...ము నాశించువారును వారిలో కలరు."

* * * *

30. పండ్రెండవ ఖండమున రెండు విషయము లుపదేశింపబడినవి. మొదటిది:- ...ఖుర్ఆన్ భగవదాజ్ఞానుసారము జిబ్రాయీలు అను దేవదూత ప్రవక్త...హృదయమునకు వ్యక్తీకరించినది సత్యము. రెండవది: దైవదత్తమగు ...ద్గ్రంథమును విడిచి మంత్రతంత్రములందు నమ్మకము కలిగియుండుట

దౌర్భాగ్యము. మంత్రతంత్రములయందలి నమ్మకము నరకమునకు దారి తీయును.

జిబ్రాయీల్ అను దేవదూత ఎవరు ? ఇతడు భగవదాజ్ఞానుసారము భగవదుపదేశములను ప్రవక్త హృదయమున కెట్లు వ్యక్తీకరించువాడు ? అన్న ప్రశ్నలకు పూర్తిగ ప్రత్యుత్తర మిచ్చుట సాధ్యము కాదు. ఎందుకనగా అది అనుభవైకవేద్యము. ఆధ్యాత్మిక రహస్యములు శబ్దములకు గాని తర్కమునకు గాని లొంగవు. కాని అట్టి సత్యదర్శన మగునప్పుడు ప్రవక్త ఎట్టి భౌతికస్థితియం దుండువారో, దానినిగురించి ప్రవక్త సెలవిచ్చినది తెల్పుట కాధారములు కలవు. ప్రవక్త వచనములు పెక్కురు సంపుటములుగ ప్రకటించిరి. వానిని "హదీస్"గ్రంథము లందురు. అట్టి గ్రంథములలో 'బుఖారీ' గ్రంథము తలమానికమువంటిది. ఇందు ప్రారంభముననే ఈ విషయమునుగూర్చిన ప్రవక్త వచనములు కలవు. "భగవత్సందేశము మానవహృదయమునకు వ్యక్తీకృతమగుట, లేక సత్యసందర్శనము" నకు అరబీలో "వహీ" అందురు. ఆంగ్లమున దీనికి "రివెలేషన్" అను శబ్దము కలదు. సంక్షిప్తముగ నుండుటకై యీవివరణమున దీనిని "సత్యసందర్శనము" అందును.

అల్ హారిస్ ఇబ్నెహిషామ్ అను శిష్యుడు ప్రవక్త నిట్లడిగెను : "ప్రవక్తా! మీకు సత్యసందర్శన మెట్లు కలుగును ?" ప్రవక్త ఇట్లు చెప్పిరి : "ఒక్కొక్కప్పుడది గంటమ్రోతవలె వచ్చును—అది నాకత్యంత కఠినబాధ కల్గించును ; ఆబాధ వదలినప్పుడు నాకు ప్రోక్తమైన మాటలు స్మృతియందు నిల్చిపోవును. ఒక్కొక్కప్పుడు దేవదూత నాతో ఒక మానవునివలె మాట్లాడును. అవియు నేను జ్ఞాపక ముంచుకొందును."

ప్రవక్త సతీమణి యగు ఆయెషాదేవి ఇట్లనెను : "ప్రవక్త సత్యసందర్శనము చేయుచుండగా నే నాయనను చూచితిని. నాడపరిమితమగు చలి యుండెను. ఆయన ఫాలభాగము ముచ్చెమటలు గ్రమ్మెను."

ఆయెషాదేవి మరియు నిట్లనెను : "ప్రవక్తకు మొట్టమొదటయైన సత్యసందర్శనము స్వప్నావస్థలో. వారి స్వప్నములు సత్యమైనవిగ నుండెను. * వారి ప్రతిస్వప్నమును ప్రభాత సూర్యోదయమువంటిదే. దీనితర్వాత వారికి ఏకాంతము ప్రియమయ్యెను. అందుచే వారు హీరా పర్వతగుహకు పోయి అక్కడ తపోనిష్ఠులైరి......తుదకు వారు హీరా గుహయందుండగా సత్యసందర్శన మాయెను. దేవదూత వారికడకు వచ్చి "చదువుము" అనెను. "నేను చదువజాలను" అని వారు ప్రత్యుత్తర మిచ్చిరి."

* ఈ స్వప్నములలో మొదటిది ప్రవక్త నలుబదవ యేట ఫిబ్రవరి ౧౧౦ లో కలిగెనని చరిత్రకారుల మతము.

ప్రవక్త ఇట్లనెను: "అప్పుడతడు (దేవదూత) నన్ను చేర దీసికొని అదిమెను. నేను పూర్తిగ నీరసుడనై పోతిని. అప్పు డతడు నన్నువదలి 'చదువుము' అనెను. 'నేను చదువజాలను' అని నే నంటిని. తిరిగి అతడు నన్ను చేరదీసికొని నేను పూర్తిగ నీరసుడ నగు నంతవరకు అదిమెను. తర్వాత నన్నతడు వదలి 'చదువుము' అనెను. 'చదువజాలను' అని నే నంటిని. అతడు నన్ను చేరదీసి మూడవసారి అదిమెను. తర్వాత అతడు నన్ను వదలి ఇట్లనెను : "చదువుము ; నిన్ను పోషించుచున్నట్టియు, సృష్టించినట్టియు, మానవు నొక్కబిందువుతో సృష్టించినట్టియు భగవంతుని నామస్మరణముతో చదువుము. నిన్ను పోషించువాడు సర్వసంప్రదాత."

తర్వాత మూడేండ్లవరకు ప్రవక్త కెట్టి సందేశమును రాలేదు. తాను ముందు చూచినదియు, విన్నదియు వట్టి భ్రమయేమోనని ప్రవక్త తలచిరి. ఈ కాలమున ప్రవక్త తపోనిమగ్నులై యుండిరి. ఒకనాడు హఠాత్తుగ తిరిగి సత్యసందర్శన మాయెను. ప్రవక్త వాక్కులలో :—

"ఒకనాడు నేను నడచుచుండగా ఆకాశమునుండి యొక వాణి వినిపించెను. నేను తలయెత్తి పైకి చూచితిని. హీరాగుహయందు నాకు దృశ్యుడైన దేవదూతయే తిరిగి కన్పించెను. అతడు భూమ్యాకాశముల మధ్య ఒక పీఠముపై అధిష్ఠించియుండెను. అతడు నాకు భయము గొల్పెను. నే నింటికి మరలి ఇట్లంటిని : 'నాపై దుప్పటి కప్పుము ; నాపై దుప్పటి కప్పుము' అప్పు డీ వాక్యములు నాకు శ్రవణగత మాయెను : 'ఓ దుప్పటి కప్పుకొన్నవాడా ! లెమ్ము.(మానవులను) పరాకుపుచ్చుము ....(ఇత్యాది.)' నాటినుండియు మాటిమాటికి ఇట్టిమాటలు వినబడసాగెను. సత్యసందర్శనము త్వరత్వరగ కలుగసాగెను."

ఖుర్ఆన్ గ్రంథమంతయు ఈ విధముగ దర్శించినదే. అప్పుడప్పు డవసరానుసారము దర్శింపబడిన సూక్తులను ప్రవక్త దర్శకత్వము క్రింద శిష్యులు గ్రథిత మొనర్పగా చేర్పడిన గ్రంథము ఖుర్ఆన్ షరీఫ్.

* * * *

౩౧. పండ్రెండవ ఖండమున ప్రవచితమైన రెండవవిషయము మంత్రతంత్రములకు సంబంధించినది. మంత్రతంత్రములయందు నమ్మకము ప్రతి దేశమునందు కాన్పించుచున్నది. యూరపుఖండమున మంత్రికత్తెలను సజీవముగ కాల్చివేయుచుండిరి. మన దేశమున మంత్రతంత్రములను ప్రయోగించు ఆచార మెక్కువగ నున్నది. మంత్రతంత్రములు ప్రజలను మోసపుచ్చుటకును బాధించుటకును మాత్రమే ఉపయోగింపబడుచుండుట సర్వవిదితము. అందుచే ఖుర్ఆన్ మంత్రతంత్రములను నిషేధించుచున్నది. మంత్రతంత్రముల శక్తి స్వాభావికమైనది కాదనియు భగవదాజ్ఞ లేనియెడల నదియు పనిచేయదనియు ఖుర్ఆన్ బోధించుచున్నది.

సులైమాను పూర్వకాలపు ఒక చక్రవర్తి. క్రైస్తవు లాయనను "సాలమన్" అందురు. ఈయన అత్యంత వివేకశాలి యనియు, రాజర్షియు క్రైస్తవ వాఙ్మయమునందు కలదు. ఖుర్ఆన్ సులైమానును ఒక ప్రవక్తగా పేర్కొనుచున్నది. మహా పరాక్రమశాలియు, విద్వాంసుడును, ప్రజ్ఞాధురీణుడును అగు సులైమాను శక్తియంతయు మంత్రమూలమని యూదులు పురాణకథలను కల్పించి సర్వశక్తులకును భగవంతుడే మూలమను భావమును మరపించిరి. హారూత్, మారూత్ అను బాబిలోనియా దేశపు ఖగోళశాస్త్రజ్ఞులు దేవతలనియు, వారు మంత్రతంత్రముల మూలమున దేవరహస్యములను వెలిబుచ్చిరనియు కథలను కల్పించిరి. యూదుల యీ కథలను, మంత్రతంత్రములందు వారికి గల విశ్వాసమును ఖుర్ఆన్ ఖండించుచున్నది.

* * * *

౩౨. ౧౦౭ సూక్తమున ఆధ్యాత్మికవిషయములనుగురించి కుతర్కములు చేయుట నిషేధించబడినది. మన ధర్మశాస్త్ర మట్టి కుతర్కములు చేయువారికి సంఘ బహిష్కారము శిక్షగా విధించుచున్నది.

యోఽవ మన్యేత తే మూలే హేతు శాస్త్రాశ్రయా ద్ద్విజః
స సాధు బిర్బహిష్కార్యో నాస్తికో వేద నిందకః.

మను. ౨. ౧౧.

[ఏ ద్విజుడు ప్రమాణములైన శ్రుతిస్మృతులను హేతుతర్కవాదముచే చర్చించుచు దూషించునో అట్టి నాస్తికుని వేదదూషకుని సాధువులు బహిష్కరింపవలెను.]

* * * *

౩౩. ౧౧౧-౧౧౩ సూక్తములందు ఖుర్ఆన్ ఒక గొప్పసత్యమును మరొకసారి ఉపదేశించుచున్నది. మోక్షము బడయుటకై ఒక ప్రత్యేకమతముయొక్క బాహ్యవేషమును ధరింప నక్కరలేదు. సత్కార్యాచరణమే మోక్షమార్గము.

* * * *

౩౪. పదునాల్గవ ఖండమున మతదురభిమానము ఖండింపబడినది. ఖుర్ఆన్ ...క్క మతము లున్నవని అంగీకరింపనే అంగీకరింపదు. సత్యము ఒక్కటే. మొదటి ...నవునకు భగవంతుడు ఏ సత్యము నుపదేశించెనో అదే సత్యము నేటివరకును ఆచర...యమై యున్నది. ఏలననగా భగవంతునివలెనే భగవంతుడు వెలువరచిన సత్యముకూడ ...మృతము. అది దేశకాలభేదములచే మారదు. అందుచేతనే ప్రపంచమునం దేకాలమున ...దేశమున జన్మించిన ధర్మప్రవర్తకుల నైనను, ఖుర్ఆన్ భగవంతునిచే పంపబడిన ...ర్మప్రవక్తలనుగా నంగీకరించుచున్నది. అట్లే సమస్త ధర్మగ్రంథములను భగవదుపదిష్ట ...గ్రంథములుగా నంగీకరించుచున్నది. అందుచే మా మతము మంచిది; కాదు, మా మతము ...ంచిది అని పోరాడుకొనుట తెలివితక్కువ. మతము "ఒక్కటే." అది మీదియు ...దియు కాదు. "అది అందరిది." సత్య మొకరిసొత్తెట్లగును? "ఐన నిప్పుడు కన్పించుచున్న భేదము లేమి?" అని మీ రడుగవచ్చును. ఈ భేదములు సత్యమును గ్రహించుటయందును దాని నాచరించుటయందును కలవుగాని అసలు సత్యమునందు లేవు. వెనుక ...ను చూపినట్లు ఆర్యమతము ఏకేశ్వరు నొప్పుకొనినది. క్రైస్తవమతమును, అట్లే ...స్త మతములును ఏకేశ్వరత్వము నొప్పుకొన్నవి. క్రీస్తు తాను దేవుడనని ఎక్కడైనను ...ప్పికొనెనా? ఆయన మరణించునప్పుడు 'తండ్రీ! తండ్రీ! న న్నేల విడనాడితివి?' ...ని పరమేశ్వరుడగు లోకపితను దీనముగ ప్రార్థింపడా? మతము లన్నియును సత్కార్యాచరణమును చేయుమనియే చెప్పుచున్నవి. ఇదియే అసలు మతము: ఏకేశ్వరునియందు విశ్వాసము, సత్కార్యాచరణము. వివిధముగ కన్పించుచున్న మతము లన్నియు ...యీ రెండు సూత్రముల నొప్పుకొనుచుండగా మతములలో విభేద మెక్కడ నున్నది? ...జముగ చూడ అది మన మా సత్యమును గ్రహించుటయందును, దానిప్రకార మాచరింపకుండుట యందే కలదు. ఏసుక్రీస్తు తాను భగవంతుని కుమారుడ నని యెక్కడనైన చెప్పియుండెనా? మన మెల్లరము భగవంతుని సంతతి యెట్లో ఏసుక్రీస్తుకూడ అట్లే భగవంతునికుమారుడు. భగవంతుడు సర్వలోకపిత. ఇది స్పష్టముగ నుండగా క్రైస్తవులు ఏసుక్రీస్తుని దేవునికుమారు డందురు. ఖుర్ఆన్ ఒక చిన్న వాక్యమునందు వీరిఅజ్ఞానమును ఖండించినది :—

'భూమ్యాకాశములలో నున్న సమస్తమును అతని సృష్టియే కదా? అందరును అతని ఆజ్ఞకు బద్ధులై యున్నారు కదా? అతని కొక కుమారుని గైకొనునంతటి కర్మ మేమి పట్టెను?"

ఖుర్ఆన్ ఇదే విషయమును 15, 16 ఖండములలో చెప్పుచున్నది. ఏ ప్రవక్త ...యూదులకు గురుస్వామియో, ఏ ప్రవక్త ఏసుక్రీస్తువంశమునకు మూల పురుషుడో అట్టి

ఇబ్రాహీం ప్రవక్తయే కాబా ప్రార్థనాలయమును నిర్మించినాడు. అట్టి కాబాను కేంద్రముగ నేర్పరచిన ఇస్లాంమతముతో వీరికి ద్వేషమేల? ఇబ్రాహీమ్ ప్రవక్తయు, ఆయన తర్వాత వచ్చిన ప్రవక్తలును, ఇట్లు సమస్త ప్రవక్తలును బోధించినది ఒకేమతము.

ఖుర్ఆన్ మరొక ముఖ్యవిషయమునుకూడ మరొకసారి నొక్కి చెప్పుచున్నది. ఏదేని యొక మతాచారముల ననుసరించినంతమాత్రమునగాని, ఎవరేని యొక మహాపురుషుని అనుయాయు లనిపించుకొనినంతమాత్రమునగాని, లేదా ఒక మహాపురుషుని వంశమునందు జన్మించినంతమాత్రమునగాని మోక్షము లభించదు. మోక్షము లభించవలె నన్న భగవంతునియందు శ్రద్ధా విశ్వాసము లుంచి సత్కార్యాచరణము నొనర్చుట యొక్కటే మార్గము.

"వారు చేసినదాని ఫలము వారిది. నీవు చేసినదాని ఫలము నీది. వారి కర్మలకు నీవు బాధ్యుడవు కావు."

రెండవ భాగము

౩౭. ఏ దిక్కు వైపునకు మొగము త్రిప్పుదుమో ఆ దిక్కునకు అరబీభాషలో 'ఖిబ్లా' అందురు. ఇది దీని వ్యుత్పత్త్యర్థము. ఖుర్ఆన్‌లో 'ఖిబ్లా' అనగా ప్రార్థనలు సలుపునప్పుడు ఏ దిశవైపు ముఖముంచుదుమో ఆ దిశ అని అర్థము. ప్రవక్త మక్కా నుండి మదీనాకు వలసపోయిన ౧౬ నెలల తర్వాత 'ఖిబ్లా'ను మార్చిరి. దాని ప్రశంసయే యిందున్నది. మొట్టమొదట 'జెరూసెలమ్' పట్టణమువైపు మొగము చేసి ప్రవక్త ప్రార్థనలు సలుపుచుండిరి. మదీనాకు వలస పోయిన తర్వాత కాబా (మక్కాయందలి ప్రాచీన ప్రార్థనాలయము) వైపు ముఖము చేసి ప్రార్థనలు సలుపసాగిరి. దీనికి కారణ మేమనగా మదీనాలో యూదులు ఎక్కువగ నుండుటయు, ప్రవక్త తమ పుణ్యక్షేత్రము వైపునకు మొగముపెట్టి ప్రార్థనలు సేయుటకు వారు పెడర్థములను కల్పించుటయు, దానిని తమ మూఢాచారముల వైశిష్ట్యమును ప్రకటించునదిగా నన్వయించుటయును.

ఒక్క విషయము నిక్కడ గమనింపవలెను. కాబాను 'ఖిబ్లాగా' నేర్పరచిన ఆ నాటికి 'కాబా' మక్కావాసుల దేవతా విగ్రహములతో నిండియుండెను. అప్పటి కది ప్రవక్త వశము కాలేదు. ఐనను ఖుర్ఆన్ దానిని 'ఖిబ్లా'గా నిర్ణయించినది. ఎందు కనగా "తూర్పైనను పడమరైనను, అన్ని దిక్కులు భగవంతునివే." అంతేకాని ఒకే దిక్కున భగవంతు డున్నాడనియు, ఒకే దిక్కు శ్రేష్ఠమైనదనియు కాదు.

ఖుర్ఆన్ ఒక కేంద్రమును ఏర్పరుపదలచు కొన్నది. అందరును ఒకే కేంద్రము వైపునకు ముఖము త్రిప్పుట ఆదర్శములయొక్కయు ఆశయముల యొక్కయు ఐక్యమునే

కాక మానవైక్యమును కూడ తెల్పును. ఇక్కడ దిశ కాదు ప్రధానమైనది, కేంద్రము. కాబాకు పడమట నున్నవారి కది తూర్పునను, తూర్పుననున్నవారి కది పడమటను, ఉత్తరమున నున్నవారికి దక్షిణముననను, దక్షిణమున నున్నవారికి తూర్పునను ఉండును.

* * *

౩౮. ౧౪౫ సూక్తమున ప్రవచింపబడిన సత్యమే మరల చెప్పబడుచున్నది. భగవంతునకు తూర్పు పడమరల భేదములేదు. అతడు సర్వవ్యాపి; సర్వతోముఖుడు.

'ఖిబ్లా'ను ఏర్పాటుచేయుటయం దుద్దేశము ఒక కేంద్రము నేర్పరచుట. యూదులు కాబాను కేంద్రముగ నంగీకరింపరు. ఆమాట వాస్తవమే. కాని జెరూసెలమును మాత్ర మందరును కేంద్రముగ స్వీకరించిరా యేమి? "వారిలో ఒక తెగవారి ఖిబ్లాను మరొక తెగవా రంగీకరింపరు." అట్టివారు కాబాను కేంద్రముగ నెట్లంగీకరింతురు? అని భావము.

* * *

౩౯. బైబిల్ గ్రంథమున శ్రీ మొహమ్మద్ ప్రవక్త ఆగమనమును గురించిన భవిష్యసూచక వాక్కులు పెక్కు కలవు. ఖుర్ ఆన్ ఆవిషయమునే ఇక్కడ ఉగ్గడించుచున్నది. బైబిల్ పాతనిబంధనలో (Deut. 18 : 19) "మీ సోదరులనుండి మూసావంటి ఒక ప్రవక్తను పుట్టింతును..............అతడు నా మాటలుగా చాటు నా ప్రవచనములు తప్పక వినవలెను."

(" Whosoever will not hearken unto My words which he shall speak in My name, I will require it of him.")

అట్లే ఏసుక్రీస్తు రాబోవు ఒక ప్రవక్తను గురించి చెప్పుచు: " He will guide you unto all truth: for he shall not speak of himself, but whatsoever he shall hear that shall he speak" (John 16:13) పాతనిబంధనలో మరొకచోట (Acts 3:21-22), " Whom the heaven must receive until the time of restitution of all things, which God hath spoken by the mouth of all His Holy Prophets since the world began. For Moses truly said unto the fathers, A prophet shall the Lord your God raise up unto you

of your brethern like unto me: him shall hear in all things whatsoever he shall say unto you. ''

యీ భవిష్యద్వచనములందు చెప్పబడిన ప్రవక్త శ్రీ మొహమ్మద్ ప్రవక్తయే ననుటలో నెట్టి సందేహమును లేదు. ఇది క్రైస్తవ పండితులకును యూద పండితులకును కూడ తెలియును.

*   *   *

౩౯. 'సఫా' 'మర్వా' అనునవి మక్కాకు సమీపమందలి రెండు కొండలు. ఇబ్రాహీం ప్రవక్త భార్యయు ఇస్మాయీల్ ప్రవక్త మాతయు నగు 'హాజరా' ఆ యెడారిలో ఒంటరిగ దిగవిడిచి పెట్టబడినప్పుడు నీటికై ఆమె అటుమటించిన స్థలము లవి. ఓర్పునకు కల్గు ఫలమున కివి చిహ్నములని ఖుర్ ఆన్ వాకొనుచున్నది. 'హాజరా' వాడు వహించిన ఓర్పునకు ఫలితముగ నామె సంతతివారు మక్కాపట్టణ నిర్మాతలై మహామహులై ఆధ్యాత్మిక నాయకులైరి. నేటికిని మక్కాకు వెళ్ళిన యాత్రికులీ కొండల ప్రదక్షిణము జేయుదురు.

ప్రవక్తకు పూర్వమీ కొండలపై విగ్రహములు ప్రతిష్ఠింపబడియుండెను. అందుచే పల్వురు ముస్లిములా కొండల ప్రదక్షిణము తప్పేమోనని యెంచుచుండిరి. కాని ప్రవక్త మక్కాను వశపరచుకొనిన తర్వాత ఆ విగ్రహము లక్కడనుండి తీసివేయబడెను. 'హాజరా' మాత ఓర్పునకు చిహ్నమైన యా కొండల ప్రదక్షిణము చేయుట తప్పు కాదనియు, ఆ కొండల ప్రదక్షిణము 'హాజరా' మాత పడిన శ్రమలను, ఆమె వహించిన శాంతిని జ్ఞాపకము తెచ్చుననియు ఖుర్ ఆన్ చెప్పుచున్నది.

*   *   *

౪౦. ఖుర్ ఆన్‌లో ప్రతిపాదింపబడిన ఏకేశ్వరత్వమునందు ఎట్టి ద్వైతభావము నకును తావులేదు. ఈశ్వరుడు అసమానుడు; సర్వస్తుతిపాత్రుడు; సర్వపూజార్హుడు, ఏకైకపూజ్యుడు. ప్రథమాధ్యాయ వివరణమున నీ విషయము విపులముగ చర్చించితిని. మనదేశమున సాధారణముగ 'దేవునివలె వచ్చినావు,' 'ఈ మహాత్ముడు భగవంతుని అవతారము'; 'ఇతడు అవతారపురుషుడు' ఇత్యాది వాక్యములు వినబడుచుండును. మన దేశమున అవతారపురుషులుగ భావింపబడుచున్న మహాపురుషుల సంఖ్య లక్షోప లక్ష లుండుననిన అతిశయోక్తి కాదు. మహాపురుషులను 'భగవాన్' ఇత్యాది యీశ్వరార్హ మగు నామముల నుపయోగించుటయు, యీశ్వరార్హమగు భక్తిశ్రద్ధలతో వారిని పూజించుటయు మనము చూచుచున్నాము. ఇది ఒక్క హిందూమతస్థులందే కాక సర్వసాధారణముగ అన్ని మతములందును కాన్పించుచున్నది. ఖుర్ ఆన్ దీనిని కఠినముగ నిషేధించుచున్నది. ఎంతటి మహాపురుషునైనను, అతనిని భగవంతుడనిగాని, భగవంతుని అవతారమని గాని, భగవత్సమానుడని కాని భావించుటను ఖుర్ ఆన్ కఠినముగ నిషేధించుచున్నది. కొందరు ముస్లిములు సైతము 'వలీ' లనబడు మహాపురుషులను అత్యంత భక్తిభావములతో కొలుచుటయు అట్టి మహాపురుషుల సమాధులను పుణ్యక్షేత్రములుగ భావించుటయు ఖుర్ ఆన్ మతము ననుసరించి నిషేధమే.

*   *   *   *

౪౧. ౨౧వ ఖండమున ముఖ్యముగ నిషిద్ధాహారములను గూర్చి చెప్పబడినది. మన దక్షిణదేశమున శాకాహారమే ఉత్కృష్టమైనదనియు, మాంసాహారము హింసాపూర్వకమగుటచే హేయమైనదనియు, ఒక భావము వ్యాపించియున్నది. నిజముగ చూడ హిందూ మతమునందు మాంసాహారనిషేధము లేదు. బంగాళము, బీహారు, కాశ్మీరము మున్నగు దేశముల బ్రాహ్మణులు నేటికి సైతము మాంసాహారులుగ నున్నారన్న విషయము సుప్రసిద్ధము. మన దేశమున యజ్ఞమతము అనగా వేదమతముండినంత కాలము మాంసాహారము వేదవిహితమగుటచే సర్వవర్ణములవారును మత్స్య మాంసాదులను యథేష్టముగ భుజించుచుండిరి. తరువాత జైన బౌద్ధమతముల ప్రభావముచే కొన్ని దేశముల బ్రాహ్మణ వైశ్యులందు మాంసాశన నిషేధము క్రమముగ వచ్చెను. మను స్మృత్యాది ధర్మశాస్త్రములందు మాంసాశన నిషేధము లేకపోవుటయేగాక, ఒక విధముగ మాంసయుక్తమగు కర్మలు శ్రేష్ఠతరమైనవని చెప్పబడినది.

పార్వణ శ్రాద్ధనియమమును వర్ణించుచు మనుస్మృతి శ్రాద్ధమందు నిమంత్రితులైన బ్రాహ్మణులను వివిధముగ పూజించి "వ్యంజనములు, పప్పు, కూరగాయలు మొదలగువానిని పెరుగు, పాలు, తేనె వీనిని పరిశుద్ధుడై పాత్రయందు వేర్వేరుగా తెచ్చి అన్నముంచుటకు ముందే ఉంచి,

"భక్ష్యం భోజ్యంచ వివిధం మూలానిచ ఫలానిచ
హృద్యానిచైవ 'మాంసాని' పానాని సురభీణి చ.

మను. 3. ౨౨౭

''పిండివంటలను, పాయసాదులను, మూలఫలములను హృద్యములగు మాంసములను* పానీయములను తెచ్చి చుట్టునుంచవలెను." అని చెప్పుచున్నది. అదే అధ్యాయమున మనువు హవిస్సు ఎవ్విధమున నాచరించిన నెంత కాలము పితృదేవతలకు సంతృప్తి యగునో చెప్పుచు ఇట్లు వివరించుచున్నాడు:—

---

* 'మాంసాని' అనుదానికి 'హృదయస్యప్రియాణి మాంసాని' అని కుల్లూకభట్టాచార్యుని వ్యాఖ్య.

తిలైర్వ్రీహియవైర్మాషై రద్భిర్మూలఫలేన వా
దత్తేన మాంసం తృప్యంతి విధివత్పితరో నృణామ్.
ద్వౌమాసౌ మత్స్యమాంసేన త్రీన్మాసాన్ హారిణేనతు
ఔరభ్రేణాథ చతురః శాకునేనాథ పంచ వై.
షణ్మాసాం శ్ఛాగమాంసేన పార్షతేన చ సప్తవై
అష్టావేణస్య మాంసేన రౌరవేణ నవైవతు.
దశ మాసాంస్తు తృప్యంతి వరాహ మహిషామిషైః
శశకూర్మయోస్తు మాంసేన మాసా న్నేకాదశైవతు
సంవత్సరం తు గవ్యేన పయసా పాయసేనచ
వార్ధ్రీణసస్య మాంసేన తృప్తిర్ద్వాదశ వార్షికీ,
కాలశాకం మహాశల్కాః ఖడ్గలోహామిషం మధు
ఆనంత్యాయైవ కల్పంతే మున్యన్నా ని చ సర్వశః

(మను. ౩: ౨౬౭-౨౭౨:)

(తిలలు, ధాన్యము, యవలు, కాయుమినుములు, నీళ్లు, దుంపలు, పండ్లు వీనినిపితృ ప్రీతికై బ్రాహ్మణునకు దానమొసగినచో దాతల పితృదేవత లొక నెల తృప్తినొంది యుందురు.

మత్స్యమాంసదానముచే రెండు నెలలును, జింకమాంస దానముచే మూడు నెలలును, గొఱ్ఱెమాంసదానముచే నాలుగు నెలలును, ద్విజాలు భక్షింపదగిన పక్షుల మాంసముచే ఐదు మాసములును;

మేకమాంసముచే నారు మాసములును, చారల జింకమాంసముచే ఏడు మాసములును, దుప్పి మాంసముచే తొమ్మిది మాసములును;

ముండ్లపంది, అడవిదున్న వీని మాంసముచే పది మాసములును, కుందేలు, తాబేలు వీని మాంసముచే పదునొకండు మాసములును;

గోసంబంధమైన పాలు, పెరుగు, నెయ్యి వీనితో శ్రాద్ధమొనర్చిన పండ్రెండు సంవత్సరముల కాలమును, వార్ధ్రీణసమను ముసలిమేకపోతు మాంసముచే శ్రాద్ధ మొనర్చిన పండ్రెండు సంవత్సరముల కాలమును పితరులు తృప్తినొందెదరు.

కాలశాకమను శాకమును, ముండ్లుగలచేపలును, ఖడ్గమృగము, ఎఱ్ఱని పొట్టేలు— వీని మాంసమును, నెవ్వరి ధాన్యమును, తేనెయు మున్యన్నములు—వీనితో శ్రాద్ధ మొనర్చిన పితరులు తుదిలేనంతకాలము తృప్తినొందెదరు.)

మఱియొకచో మనువు ప్రయత్నపూర్వకముగనైనను మాంసమును సంపాదించి మాసికశ్రాద్ధమును ఒనరింపవలెనని చెప్పుచున్నాడు. చూడుడు మనువు వచనములు :—

పితౄణాం మాసికం శ్రాద్ధ మన్వాహార్యం విదుర్బుధాః
తచ్చామిషేణ కర్తవ్యం ప్రశస్తేన ప్రయత్నతః

(పితృదేవతలనుగూర్చి నెలనెలకు చేయునట్టి మాసిక శ్రాద్ధము నన్వాహార్యమందురు. ఆ అన్వాహార్య శ్రాద్ధము జేయబోవునపుడు ప్రశస్త మాంసమును సంపాదించి దానితో ప్రయత్నపూర్వకముగ శ్రాద్ధమొనరింపవలెను.)

(మను : 3 — ౧౨౩.)

మఱియొకచో:—

"యజ్ఞార్థం బ్రాహ్మణైర్వధ్యాః ప్రశస్తా మృగపక్షిణః
భృత్యానాం చైవ వృత్త్యర్థ మగస్త్యోహ్యాచర త్పురా"

[బ్రాహ్మణులు యజ్ఞము నిమిత్తమును, పోష్యవర్గమును పోషించుటకును శాస్త్ర విహితములైన మృగ పక్షులను వధింపవచ్చును. తొల్లి యగస్త్య మునీంద్రుడు తనపోషణ యందున్న తల్లి-దండ్రుల పోషణమునకై అట్లు శాస్త్రవిహిత మృగపక్షులనుచంపెను.]

(మను. ౫ - ౨౨.)

మఱియొకచో :— ౫ : ౩౫

"నియుక్తస్తు యథాన్యాయం యో మాంసం నాత్తి మానవః
స ప్రేత్య పశుతాం యాతి సంభవా నేక వింశతిం."

[శ్రాద్ధవిధానము చొప్పున శ్రాద్ధ మధుపర్కములందు నియమింపబడిన ద్విజుడు మాంసమును భక్షింపడేని, అతడు దేహాంతరమున ఇరువదియొక్క జన్మములు పశువుగా జన్మింపగలడు.]

పండిత, పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు యువ, ఆశ్వయుజ భారతి యందు వ్రాసిన వ్యాసమందలి ఈ క్రింది వాక్యముల నుల్లేఖింతును :—

"జైనమతబీజములు హృదయక్షేత్రముల నాటఁబడి యవి మొలకెత్తి యల్లిబిల్లిగ నల్లుకొనుటచే, లో నేమున్నదో తెలిసికొనక హింసార్థద్యోతకములగు మంత్రములఁ జెప్పుచు వినియోగముల నహింసాప్రధానముగాఁ జేయుచున్నాము. ఇదియే సనాతన ధర్మ మనుకొనుచున్నాము. యజ్ఞకర్మముల నటుంచి ద్విజులు సేయు అన్నప్రాశన, వివాహ, ఆబ్దిక కర్మములలో హింసాప్రతిపాదక మంత్రములే—సూత్రపు ముక్కలే— కంఠోక్తిగాఁ జెప్పఁబడుచున్నవి. ఇందుల కొక్క నిదర్శనము మాత్రము చూపెదను.

ఇప్పటి వైదిక కర్మములలో శ్రద్ధతో నొనర్చు ఆబ్దికమున బ్రాహ్మణులు భుజింప నారంభించునప్పుడు యజమాని యీ క్రింది యర్థముగల మంత్రముఁ జెప్పును:

"ఈఁగ ఏ మాంసభాగమును భుజించెనో, కోయుటకు కారణమైన కత్తియం దేరక్త మంటియుండెనో, కోయువాని చేతులందు గోరులం దేమాంస లేశ మంటియుండెనో, కోయఁబడిన యో జంతువా! ఆ సమస్తము దేవతలకే యగుఁగాక!" [మం॥ మక్షికాశయద్వా స్వశాస్వధితారిప్తమస్తి యద్ధస్తయో శ్శమితుర్య న్నఖేషు. సర్వాతా తే అపి దేవేష్వస్తు.]

వివాహాదులలోని యంశము లిట నప్రస్తుతములు గాని, సమస్త స్మృతికర్తలు శ్రాద్ధమునందు ప్రతిపదోక్తముగా మత్స్య మాంసములనే పెట్టుట యుక్త మనిరనియు, తుదకు క్రీ॥ శ॥ 14 వ శతాబ్దమధ్యమునం దుండిన మాధవాచార్యులవారును నిత్య భోజన శ్రాద్ధాదులలో మాంసభక్షణ ముచితమా, అనుచితమా, అను నంశముఁగూర్చి చర్చించి చర్చించి, "యథావిధిగాఁ జేయఁబడు శ్రాద్ధమున, నిమంత్రణము చేయఁబడినవాఁడును, ప్రాణోపద్రవము కలిగినసమయ మందును, ఆఁకలి వ్యాధి కలిగినకారణముచేతను మాంసముం దినవచ్చును. ఇఁకను బ్రసక్తానుప్రసక్తి చాలును." * అని వ్రాసిన యంశము నాలోచింపవలయుఁగదా!........మాధవాచార్యుల కాలమునం గూడ శ్రాద్ధమున మత్స్య మాంసములం బెట్టుట తప్పుకాదు. తిరుమలదేవరాయల కాలమునం దుండిన రామానందుడు [క్రీ॥ శ॥ 16 వ శతాబ్దము.] వైదిక కర్మాంగమగు జంతువధము, మాంసభక్షణము ప్రతిపదోక్తముగా (విధి ననుసరించి) తప్పుకా దనియు, లక్షణచే [సామాన్య వాక్యముచే] చెప్పఁబడు నహింస లెక్కింపఁ దగినదికాదనియు తన "ఇష్టార్థకల్పవల్లి" లో వ్రాసియున్నాఁడు.

ఇంతమాత్రమే కాదు; మతత్రయ భాష్యకర్తలగు శంకర, రామానుజ, మధ్వాచార్యులవారలు తమ బ్రహ్మసూత్రభాష్యమునందు "అశుద్ధ మితి చేన్న; శబ్దాత్" (వేదప్రమాణము లుండుటచేత జీవహింస యపవిత్రము కాదు.) అని విపులముగాఁ జర్చించి "ఏ భూతములను హింసింపరా" దను ఉపనిషద్వాక్యమును సామాన్యశాస్త్రమని త్రోసివేసి యున్నారు."

* "యథావిధి నియుక్తశ్రాద్ధే నిమంత్రితశ్చ, ప్రాణాత్యయే, క్షున్నిమిత్తే ర్వ్యాధినిమిత్తే ర్వా మాంసం భక్షయే దిత్యలం ప్రసక్తానుప్రసక్త్యా."
—పరాశరమాధవీయము.

అహింసయే ప్రధాన సిద్ధాంతముగాగల బౌద్ధమతమున కూడ మాంసాశననిషేధమున్నట్లు కన్పింపదు. త్రిపిటకము లనబడుచున్న సుత్త, వినాయ, అభిధమ్మములలో మాంసాశననిషేధము లేదు. * ఏనుగు, గుఱ్ఱము, కుక్క, కొన్ని అడవిజంతువుల మాంసమును వినాయపిటకము నిషేధించుచున్నది. 'మత్స్యమాంసము' ను తినవచ్చునని శాసించుచున్నది. (వినాయపిటకము I. 218_237). గౌతమబుద్ధుడు స్వయముగ మాంసమును తినినట్లు పాళీ గ్రంథములలో కలదని 'బుద్ధచర్య' అను గ్రంథమునుండి బ్రహ్మచారి సీతల్ ప్రసాద్ జీగారు ఎత్తి చూపిరి. ఎడ్వర్డ్ థామస్ గారు తన బుద్ధచరిత్రలో ఇట్లు వ్రాయుచున్నారు:

"As meat-eating was made an ethical question, the ritual aspect ceased to have a meaning for the Buddhist. Hence the practice was not in itself condemned, but only in so far as the partaker was in some way contributory to killing or giving pain." §

అని వ్రాసి థామస్ జీవకసుత్తము (I. 378) నుద్దరించినాడు.

భక్ష్యాభక్ష్య మాంసవిచారము చేయుచు మనువు (౫-౨౮):—

"స్థావరం జంగమం చైవ సర్వం ప్రాణస్య భోజనం."

[ఈ స్థావర జంగమ పదార్థము లెల్ల జీవునికి భోజ్యములే] అని చెప్పుచున్నాడు.

ఖుర్ ఆన్ ఈ విషయమునే ఈ క్రింది మాటలలో చెప్పుచున్నది:—

,, ఓ మానవులారా! భూమిపైనున్న వస్తువులలో ధర్మవిహితములును మంచియు నగు వాటినే భుజింపుడు."

ఖుర్ ఆన్ సూకరమాంసమును నిషేధించుచున్నది. ,, అది అపరిశుభ్రమైనది." అని దానికి కారణము చెప్పుచున్నది. పందిమాంసము 'బైబిల్ లోను' ఆర్షగ్రంథములందును కూడ నిషేధింపబడినది. [మను. ౧౦ : ౧౫౬; ౫ : ౧౯.]

ఇంకొక విషయము: ఖుర్ ఆన్ ఒకదేశమునకు గాని, ఒకజాతికిగాని ధర్మము నుపదేశించుట లేదు. దాని సందేశము సర్వప్రపంచమునకు. అందుచే దాని ఉపదేశములు సర్వశీతోష్ణపరిస్థితులకును, సర్వదేశములకును అనుకూలించి యుండవలెను. కూరగాయ లెక్కువగా పండని దేశములలో మాంసభక్షణము చేయరాదనిన జీవితము సాధ్యమగునా? ఏ పదార్థమైనను అమితముగ భక్షించుటయందు దోషము కలదుగాని మితభోజనము

* B. Sital Prasadji, *Jainism and Buddhism*, P. 246.
§ Edward Thomas, *the Life of the Buddha*, P. 129.

దోషము కాదు. ఖుర్ ఆన్ పెక్కుచోట్ల మితభోజనమును బోధించుచున్నది. శాకాదు లమితముగ లభించు ప్రదేశములందు మాంసాహారము చేయనివారు పల్వురుండుట సహజము. ఆహారముయొక్క ప్రయోజనము దేహమునకు బలము నిచ్చుట. అందుచే పుష్టికరమును, ఆరోగ్యప్రదమును, అన్యథా నష్టకారకమును కాని ఆహారమునే మానవుడు భుజింపవలెను. జీవహింసయను పదము శాస్త్రజ్ఞాన మెక్కువగ వ్యాపించిన ఈ కాలములో అర్థశూన్యమైనది. ఎందుకనగా చెట్టుచేమలయందుసైతము ప్రాణ మున్నదనియు అవికూడ జంతువులవలెనే సుఖదుఃఖాదులను, బాధాసంతోషములను అనుభవించుచున్నవనియు సర్ జగదీశ చంద్రబోసు మున్నగు ఆధునిక వృక్షశాస్త్రవేత్తలు కనిపెట్టిరి. "A plant is an anchored animal and an animal is a walking plant" అనికదా కీర్తిశేషులగు సర్ జగదీశ చంద్రబోసుగారు చెప్పిరి. చేతనాచేతనములనియు, స్థావరజంగము లనియు భేదము చూపవచ్చును గాని ప్రాణులు అప్రాణులని భేదము చూపుట ఆధునిక శాస్త్రమర్యాద కానప్పుడు జీవహింసయని మాంసాశనము నిషేధించుట వివేకము కాదని నా మనవి. *

* * * *

౭౨. పూర్వుల మార్గానుసరణ, పూర్వాచారపరాయణత్వము, శ్రేష్ఠమైనదను భావము, యుక్తాయుక్తవిచక్షణ జ్ఞానమును నిర్మూల మొనర్చును. ఖుర్ ఆన్ సంప్రదాయములకు కాక స్వబుద్ధికి ప్రాధాన్య మొసగుచున్నది. సంప్రదాయ మైనంతమాత్రమున ఒక ఆచారము మంచిది కాజాలదని ఖుర్ ఆన్ బోధించుచున్నది.

* * *

౭౩. ఉపవాస మన్నిమతములందును విహితమై యున్నది. ఖుర్ ఆన్ సంవత్సరమున కొక మాస ముపవాసము విధించుచున్నది. మత నియమములు రెండు విధములు:— విధులు, నిషేధములు. విధు లనగా మంచిపనులను చేయుటకై ఆజ్ఞలు; నిషేధము లనగా చెడుపనులు చేయకుండుటకై ఆజ్ఞలు. మానవుడు మంచిని చేయును; చెడుగులను చేయును. అందుకై విధినిషేధము లేర్పడినవి. కాని మన ఇంద్రియములకును అంతఃకరణమునకును క్రమశిక్షణముండనిచో నవి మానవుని చెడుదారికి పోనివ్వక సన్మార్గమునకే త్రిప్పును. ఉపవాస మిట్టి క్రమశిక్షణ మొసగుచున్నది. దినమునకు ౧౨ మొదలు ౧౪ గంటల కాలమువరకు ఆహార పానీయాదులను పూర్తిగ వర్జించి, విషయా

* అహింసాసిద్ధాంతమును గూర్చి సర్ పి. ఎస్. శివస్వామి అయ్యర్ "The Doctrine of Ahimsa in Hinduism" అన్న వ్యాసములో గావించిన చర్చ చూడుడు. (Hindustan Review, Jan. 1941.)

సక్తత్వము దరిచేరక, మనోవాక్కాయకర్మల నెట్టి చెడుగును చేయక భగవద్ధ్యానపరమనస్కులై యుండుట ఎంతో గొప్ప క్రమశిక్షణమని వేర చెప్పనక్కరలేదు. రంజాన్ నెలలో ఖుర్ ఆన్ అవతరించుటకు ప్రారంభ మగుటచే అది పవిత్రమాసముగ పరిగణింపబడినది. అందుచే ఆ నెల ఉపవాస మాసముగ నియమింపబడినది.

* * *

౭౪. యుద్ధము రెండువిధములు:—స్వసంరక్షణార్థము చేయునదొకటి; పరపీడనార్థము చేయునదొకటి. ధర్మరక్షణము, అబలాదుర్బలరక్షణము, దుష్ట సంహారము—వీటికొరకై చేయు యుద్ధములుకూడ మొదటి తరగతి క్రిందకే వచ్చును; ఖుర్ ఆన్ ఈ యుద్ధమును ధర్మముగ విధించుచున్నది. రెండవ తరగతి యుద్ధమును నిషేధించుచున్నది. "మితిమీరకుడు. ఎందుకనగా హద్దుల నతిక్రమించిన వారిని భగవంతుడు ప్రేమించడు." "దౌర్జన్యము స్థిరపడుట తాత్కాలిక రక్తపాతముకంటె చెడ్డది." "ఒకసారి వారు యుద్ధము మానుకొనినచో మీరుకూడ యుద్ధమును మానుకొనుడు. దౌర్జన్యము చేయువారితోడనే పోరాడవలెను." ఇవి ఖుర్ ఆన్ వచనములు.

మతవ్యాప్తికై ముస్లిములు యుద్ధములు చేసిరను తప్పభిప్రాయ మొకటి మన దేశములో వ్యాపించియున్నది. ఖుర్ ఆన్ గ్రంథమందలి ఈ క్రింది సూక్తమును చూడుడు:—

"వారి దౌర్జన్య మణగువరకు వారితో యుద్ధము చేయుడు. మతము భగవంతునకు సంబంధించినది. వారి మతపరివర్తనమునకై యుద్ధము చేయవలదు. ఎందుకనగా మతమువిషయములో భగవంతుడే బాధ్యత వహించును. ఒకసారి వారు యుద్ధము మానుకొనినచో మీరు కూడ యుద్ధమును మానుకొనుడు. దౌర్జన్యము చేయువారితోడనే పోరాడవలెను.

"విశ్వాసముగలవారును, యూదులును, విగ్రహారాధకులును, క్రైస్తవులును, మేగియనులును, బహుదైవతారాధకులును—వీరి నందరిని గురించి తుది దినమున భగవంతుడే పరిష్కరించును. భగవంతుడు సర్వసాక్షి. (ఖు. ౨౦: ౧౭)

ఖుర్ ఆన్ మతస్థాపనమునకై యుద్ధమును విధించుటలేదని పై సూక్తుల వలనస్పష్టమగుచున్నది. పూర్వపు రాజులును చక్రవర్తులును హిందూరాజులతో పోరాడుటకు కారణము మతము కాదు. వారి రాజ్యకాంక్షయు ధనకాంక్షయును మాత్రము. ఏదేని ఒక మతమునకు చెందినవాడు దౌర్జన్యమొనర్చినంత మాత్రమున ఆ మతము దౌర్జన్యప్రేరకమైనదని చెప్పవచ్చునా? ఇస్లామ్ మతము ఖడ్గబలముచే ప్రపంచమున వ్యాప్త

మైనదను తప్పభిప్రాయముకూడ కలదు. ఈ వాదమును ఖండించుచు సర్ టి. ఆర్నాల్డు పండితుడు 'The Preaching of Islam' అను ఉద్గ్రంథమును వ్రాసినాడు. జిజ్ఞాసువు లీ గ్రంథమును పఠించనగును.

*　　　*　　　*

౪౫. సాధారణముగ అన్ని మతములందును వైరాగ్యము ఆదర్శముగను, సన్న్యాసము ఉత్కృష్టాశ్రమముగను భావించిరి. కాని ఖుర్ఆన్ వైరాగ్యమును సన్న్యాసమును నిషేధించుచున్నది. ఇహమునే ఆశించి పరమును విడచుటయు, పరమునే ఆశించి ఇహమును విడచుటయు ఈ రెండునూ గర్హ్యములేనని ఖుర్ఆన్ బోధించుచున్నది. ఇహపరములకై సమాన ప్రయత్నము చేయవలెనని ఉపదేశించుచున్నది.

*　　　*　　　*

౪౬. ఇస్లామ్ మతముయొక్క మరొక గొప్ప సిద్ధాంత మీ సూక్తమున ప్రతిపాదింపబడినది. అదియే సర్వమానవ సౌభ్రాతృత్వము. ఇస్లామ్ మతమున జాతి దేశ కులభేదములు లేవు. అన్ని జాతులును, అన్ని దేశములును, అన్ని భాషలును, అన్ని మతములును సమాన గౌరవమునకు అర్హతగలవే. ఒక జాతి ఉన్నతమైనదనియు ఒకజాతి నీచమైనదనియు, ఒక దేశము పుణ్యదేశమనియు, మరొకటి పాపదేశమనియు, ఒకభాష దేవభాషయనియు, మరొకటి మ్లేచ్ఛభాషయనియు, ఒక మతము సర్వోత్కృష్టమైనదనియు మరొకటి బొత్తిగా పనికిమాలినదనియు ఇస్లామ్ మతమనదు. అట్లనుట కంగీకరింపదు.

మనువు ఆర్యావర్తమే యజ్ఞములకు యోగ్యమైన ప్రదేశమనియు, దీని కావల నుండునది మ్లేచ్ఛదేశమనియు, అది యజ్ఞార్హమైనది కాదనియు శాసించు చున్నాడు. (మను. ౨ : ౨౩.). అట్లే అనార్యులగు శూద్రులకు హిందూ ధర్మశాస్త్రము లెట్టిస్థాన మిచ్చినవో విద్వాంసు లెల్లరకును తెలిసినదే. శూద్రుని నామము నిందావాచకమై యుండవలెననియు (౨ :౩౧) దాస శబ్దముతో అంతమైనదై యుండవలెననియు (౨:౩౨) శాస్త్రపఠనము వారికి నిషేధమనియు (౨ : ౧౬) ఇహసాధకములగు అర్థశాస్త్రాదులు సైతము అభ్యసింపరాదనియు (౪ : ౮౦) అతడు ధర్మ ప్రవక్తగగాని, ధర్మ వివేచకునిగ గాని యుండకూడదనియు (౮ : ౨౦, ౪) అతనిచే దాసకర్మ చేయించవలెననియు (౮ : ౪౧౩) అతడు దాస కర్మనుండి ఎన్నడును ముక్తుడుకాడనియు (౮:౪౧౪) అతనికి ధనమున కర్హతలేదనియు (౮:౪౧౭;౧౦:౧౨౯) మనువు శాసించుచున్నాడు. ఇట్టి శాసనములే పెక్కితర స్మృతుల యందును కలవు. రాజకీయ పరిస్థితులును కాలపరిస్థితులును మారుటచే ఇప్పుడీ శాసనములు చాలమట్టుకు పాటించబడకపోయినను హిందూ ఆచారములు నేటికిని ఇట్టి భేదములపై నిర్మింపబడినవి. పరమతస్థులను నీచముగ చూచుటయు,

తమలో తామే ఒకరితో నొకరు సహభోజనాదులను సైతము చేయకుండుటయు స్పృశ్యాస్పృశ్యములు మున్నగు విషయములు సర్వవిదితములు. వాటిని వేరే వివరింపనక్కర లేదు. ఈ విభేదములను, ఈ హెచ్చుతగ్గులను, నిమ్నోన్నములను ఖుర్ఆన్ రూపుమాపినది. ఖుర్ఆన్ మరియొకచో (౪౯ ; ౧౦—౧౩) ఇట్లు ప్రవచించుచున్నది:—

"విశ్వాసవంతులు సోదరులు. అందుచే మీలో మీరు సోదరులవలె కలసిమెలసి శాంతియుతులై యుండుడు. భగవంతుని యెడ మీ విధులను నెరవేర్పుడు. భగవంతుడు మిమ్ముల కరుణించును.........ఓ మానవులారా ! మిమ్ములను ఒక పురుషుని నుండి ఒక స్త్రీ నుండి (ఒకే తల్లిదండ్రులనుండి) పుట్టించి జాతులుగను తెగలుగను విభజించితిని. అట్లు చేసినది మీ సౌకర్యమునకే. మీ రొకరి నొకరు గ్రహించుకొనుట కట్లు చేసితిని. మీలో ఎవరు ఎక్కువ భగవద్భక్తి విశ్వాసములు కలవారో వారే ఎక్కువ శ్రేష్ఠులు. నిశ్చయముగ భగవంతుడు సర్వజ్ఞుడు."

ఇదే మూలసూత్రమిప్పుడు ముస్లిమ్ అంతర్జాతీయ సంఘమును బంధించుచున్నది. ఇస్లామ్ మతశత్రువులు సైత మీ విషయమును గ్రహించిరి. ఇంటర్నేషనల్ మిషనరీ కౌన్సిల్ వారు ప్రకటించిన "నేటి ముస్లిమ్ ప్రపంచము" అను పుస్తకములో ఏడెన్ విశ్వవిద్యాలయాచార్యుడగు డాక్టర్ స్నోక్ హుర్గ్రోంజి గారు 'ఇస్లామ్-జాతిసమస్య' 'Islam and the Race Problem' అను తన వ్యాసమున ఇట్లు వ్రాయుచున్నాడు:—

" !he league of nations founded on the basis of Mahammad's religion took the principle of equality of all human races so seriously as to put to shame other communities. White man's churches kept closed to coloured Christians, a missionary boycotted on account of his marrying a negro woman, and the habit of lynching are often quoted by Muslim as instances of the backwardness of Christian society. The ideal of a league of human races has indeed been approached by the Muslim Community more nearly than by any other." (P. 90)

(మొహమ్మద్ ప్రవక్తమతము పునాదిగా నిర్మింపబడిన నానాజాతిసమితి సర్వమానవ జాతులయొక్కయు సమానత్వమును సంపూర్ణముగ స్వీకరించినది. దీనిని చూచి ఇతర మతస్థులు సిగ్గుపడవలసివచ్చినది. తెల్లవారి చర్చిలలో నల్లవారికి ప్రవేశము లభింపకపోవుటయు, నీగ్రో స్త్రీని పెండ్లాడిన మిషనరీలను వెలివేయుటయు, తెల్ల స్త్రీలు నీగ్రోలను పెండ్లాడినపుడు నల్లవానికి చేయు చిత్రవధయు క్రైస్తవసంఘము వెనుకబడి యుండుటకు ఉదాహరణముగ ముస్లిములు చూపుదురు. మానవజాతులకు సమానత్వమను ఆదర్శపూర్తిని ముస్లిముసంఘము సమీపించినంత మరే సంఘమును చేరలేదు.)

సర్వమానవ జాతి సమ్మేళనము ఆదర్శముగ నైతము వెనుకటివా రంగీకరింపరైరి. ఇస్లామ్ దాని నాదర్శముగ ముస్లిముల ముందుంచుటయే గాక ఆ ఆదర్శమును ముస్లిమ్ జీవితమున కొక ముఖ్యాంగముగ నొనర్చినది, దేశ వర్ణ జాతి భాషా భేదములున్నను ప్రపంచము నందలి ముస్లిము లందరును ఒక అంతర్జాతీయ సౌభ్రాతృత్వ బంధముచే కట్టబడి యుండుట మనము చూచుచున్నదే. డాక్టర్ హంస్ గ్రోంజిగారు అదే వ్యాసమున;

"The Muslims all over the world show a remarkable unity in most respects, and the importance of their unanimous acknowledgement of the all-embracing system as tho ideal of their international community can hardly be over-rated."

[ప్రపంచమునందలి ముస్లిమ్ లందరును పెక్కు విషయములలో ఆశ్చర్యకరమైన ఐకమత్యమును చూపుదురు. తమ అంతర్జాతీయ సంఘమునకు ఆదర్శమైన తమ సంపూర్ణ మతమును ఐక్యకంఠముతో అంగీకరించుట ఒక గొప్ప విషయము. దాని విలువ చెప్పనలవికానిది.]

మరియొకచో:—

"Practically in the Muslim world neither birth nor colour has prevented men from reaching the highest positions. Persians, Turks, Mongolians, Berbers and Negroes have occupied the most important state offices and acquired the greatest fame in scholarship. Islam offered a chance to all races, and all of them have availed themselves of it in the

measure of their talents. In the mosque of Mecca during the lecturing hours students and professors with all gradations of complexion: coal-black, green (as the Arabs call a somewhat brighter nuance,) brown, yellow and white may be seen fraternally gathering, and the same variety is shown by the citizens of the Holy city, sometimes even by the members of one family:" (P. 89.)

[ముస్లిమ్ ప్రపంచములో జన్మగాని, జాతిగాని ఎవరైనను అత్యున్నతి పదవి నొందుటయం దాటంకము కల్గించలేదు. పారసీకులు, టర్కీ దేశస్థులు, మంగోలులు, బర్బెరులు, నీగ్రోలు అత్యున్నతపదవుల నలంకరించుటయే కాక, విద్వాంసులుగ నత్యంత కీర్తిని బడసిరి. ఇస్లామ్ అన్ని జాతులవారికిని సమానావకాశములను కల్గించినది. తమ తమ శక్త్యనుసార మందరును ఆ అవకాశము నుపయోగించుకొనిరి. ఉపన్యాసములు జరుగుచున్నప్పుడు మక్కా నగరమునందలి మసీదులో ప్రతివిధవర్ణము గల విద్యార్థులను విద్వాంసులును కాన్పింతురు: మసిబొగ్గువంటి నలుపు, పచ్చ, చామనచాయ, పసుపుపచ్చ మున్నగు సమస్తవర్ణములవారును సోదరభావమున కలిసి యుండుటను చూడవచ్చును. మక్కానగర వాస్తవ్యులలోకూడ ఇంతకంటె అధికవర్ణ భేదములు కన్పించును. ఒక్కొక్కప్పుడు ఒకేకుటుంబమువారిలో నిట్టిభేదములు చూడవచ్చును.)

రాకపోకల సౌకర్యములు బాగుగ హెచ్చిన ఈ కాలములో నైతము జాతివర్ణ భాషా భేదములు మరింత తీవ్రతర మగుచున్నవి. దానితో వివిధజాతులమధ్య పోరాటము కూడ తీవ్ర మగుచున్నది. జర్మన్ జాతి ఉత్కృష్టమైన దనియు, తక్కిన జాతులు నీచమైనవనియు, తెల్లజాతులు శ్రేష్ఠమైన వనియు, తక్కినజాతులు నిమ్న జాతు లనియు, మున్నగు నానావిధ జాతీయభావములు తీవ్రసంఘర్షణమును కలిగించి ప్రపంచమును రక్త పంకిల మొనర్చుచున్నవి. ఇంకను మనదేశములో హిందూ ముస్లిమ్ విభేదములే కాక భాషాభేదములపైనను, ఆర్యద్రావిడభేదములపైనను, బ్రాహ్మణ అబ్రాహ్మణ భేదములపైనను తీవ్ర సంఘర్షణలు జరుగుచున్నవి. ప్రతికులమును, ప్రతిజాతియు, ప్రతి భాషాకుటుంబమును — ఇట్లు వందలకొలది సంఘములు ఒకరిపై నొకరు కత్తులను దూయుచున్నారు. ఖుర్ఆన్ ప్రతిపాదించిన అమృతతుల్యమగు ఈ సూత్రమును అన్ని జాతులును స్వీకరించినచో ఈ ఘోరయుద్ధము తప్పిపోయెడివి కదా.

*   *   *   *

(o)

౨౭. విడాకులకు ‘తలాఖ్’ అరబీమూలము. దీనికి “భర్తనుండి విడిపోవుట” అని అర్థము. వివాహబంధచ్ఛేదనమున కీమాట పారిభాషికపదముగ వాడబడుచున్నది. తలాఖ్ విషయములో క్రైస్తవధర్మమునకును ఇస్లామీయధర్మమునకును ఒక ముఖ్య భేదము కలదు. క్రైస్తవధర్మమున స్త్రీ విడాకుల నడుగరాదు. పురుషుడు స్త్రీకి విడాకుల నివ్వవచ్చును. ఇస్లామీయధర్మములో స్త్రీకికూడ ఈ విషయమున సమానమగు హక్కివ్వబడినది. స్త్రీ తన భర్తతో వివాహచ్ఛేదము గావించుకొనుటను “ఖులా” అందురు.

స్త్రీ తాను పెండ్లాడిన భర్తను ప్రేమించజాల ననుకొనినంతమాత్రమున వివాహచ్ఛేదము (ఖులా) ను కోరవచ్చును. సాబిత్ బిన్ ఖైస్ భార్యయగు జమీలా తనభర్తను తాను ప్రేమించుటలేదనియు అందుచే తాను వివాహచ్ఛేదమును కోరుచుంటి ననియు శ్రీప్రవక్తతో చెప్పెను. “అతనిప్రవర్తనమునందుగాని, మతాచరణమునందుగాని నాకు లోపము పొడకట్టదు. కాని నే నాతని ప్రేమించను.” అని ఆమె ప్రవక్తతో విన్నవించుకొనెను. సాబిత్ బిన్ ఖైస్ ఆమె కిచ్చిన తోటను ఆమె అతనికి తిరిగి ఇచ్చివేయు షరతుపై (శ్రీప్రవక్త) ఆమె వివాహచ్ఛేదమున కొప్పుకొనెను. (బుఖారీ) ఇట్లు స్త్రీ యొక్క ప్రేమపావిత్ర్యమునకు ఇస్లామ్ ఉచ్చస్థాన మిచ్చినది. ఈవిధముగ స్త్రీలకు ఇస్లామ్ ఇచ్చినంత స్వాతంత్ర్యము ప్రపంచమునందలి ఏ మతమునందుగాని, ఏ సంఘమునందుగాని ఇవ్వబడలేదు.

ఖుర్ఆన్ స్త్రీల కిచ్చిన హక్కులనుగురించి పంచమాధ్యాయ వ్యాఖ్యానములో వివరింతును.

“తలాఖ్” విధివిహితమైన అనివార్యకారణము లుండినగాని వివాహచ్ఛేదము చేసికొనకుండునట్లు ఇస్లామ్ పెక్కు నిబంధనలను కల్పించినది.

“మానవులకు విధివిహిత మొనర్చినవానిలో కెల్ల భగవంతున కెక్కువ అయిష్టమైనది తలాఖ్” అని ప్రవక్త సెలవిచ్చిన మాటలు ఇందలి ధర్మరహస్యమును తెల్పుచున్నవి. ఈ మాటలు పై ఖుర్ఆన్ వాక్యమునకు వ్యాఖ్యానమని చెప్పవచ్చును.

* * *

మూడవ భాగము

౨౮. వెనుక ఇదే అధ్యాయమున దానము విధింపబడినది. ఇక్కడ అదే ఆజ్ఞ మరియొకసారి ఆదేశింపబడుచున్నది. రెండు ఖండముల తర్వాత 36, 37 ఖండములు రెంటియందును దానముయొక్క ధర్మసూక్ష్మములు వివరింపబడినవి.

దానమునకై ఖుర్ఆన్ ఎక్కువగ నాల్గుపదముల నుపయోగించుచున్నది. ఇన్ఫాఖ్ (పరహితేచ్ఛతో ఖర్చుపెట్టుట); ఇహసాన్ (ఉపకారము చేయుట); సదఖా (సత్యసంయుతమైన దాన కార్యము); జకాత్ (పావిత్ర్యము). దానము పరహితేచ్ఛతోడను, పరోపకారబుద్ధితోడను, పవిత్రబుద్ధితోడను చేయవలెననుట ఈ పదములందే స్పష్టీకరింపబడినది.

262, 263, 264 సూక్తములలో ఖుర్ఆన్ దానమెట్లు చేయవలెనో చూపుచున్నది. హింసించియు, దూషించియు, ఇతరవిధముల మనస్సును నొవ్వజేసియు చేసిన దానము దానముకాదు. దానము సౌహార్దముతో కూడిన మాటలతో చేయవలెను. ఒకసారి దానము గైకొనువాడు ఏదైన తప్పిదముచేసినను దానిని క్షమించవలెను. తాను దాతననియు, దానము గైకొనువాడు బిచ్చగాడనియు గర్వింపరాదు. అంతేకాదు. దానముచేసి దానివలన ప్రాపంచికమగు తుచ్ఛలాభములను బడయగోరరాదు. కీర్తిని పలుకుబడిని, గౌరవములను, ఇతర లాభములను ఆశించి చేయుదానము దానమే కాదు. భగవత్ప్రీతికై చేయు దానమే దానము. అట్టి దానమునకే భగవంతుడు బహుశతగుణముగ ఫలమును ప్రసాదించును. (261.) అంతే కాదు. మంచివస్తువునే దానము చేయవలెను. పొల్లువస్తువులను దానమునకై ఉంచి మంచి వస్తువులను స్వోపయోగమునకై ఉంచుకొనుటయు కూడదు. మీకు ప్రియమైన వస్తువునే దానము చేయుడని ఖుర్ఆన్ బోధించుచున్నది. మీకప్రియమైన వస్తువు ఇతరుల కెట్లు ప్రియము కాగలదు? అని ఖుర్ఆన్ ప్రశ్నించుచున్నది.

దానమునకు పాత్రులెవ్వరో ఖుర్ఆన్ ఇట్లు చెప్పుచున్నది: (బీద) బంధువులను అనాథబాలబాలికలను, నిరుపేదలను, మార్గస్థులను, బిచ్చగాండ్రను, ఖైదీలను (వారిని విడిపించుటకు) (II.177.) భగవన్మార్గమునందాసక్తులై ఉదరపోషణమునకై ఏదైన వృత్తి నవలంబించుట కవకాశము లేకయు, బిచ్చమునకై చేయి చాచకయు ఉండు బీదలను ఖుర్ఆన్ ప్రత్యేకముగ దానార్హులుగ పేర్కొనుచున్నది. నోటితో చెప్పనంతమాత్రమున వారు బీదలు కారనుకొనవలదనుచున్నది. వారి ముఖములపై గల చిహ్నములను బట్టి వారిని గుర్తించవచ్చునని ఖుర్ఆన్ చెప్పుచున్నది. ఎంతటి సున్నితమగు మనస్తత్త్వము ఖుర్ఆన్‌లో చిత్రింపబడినదో చూడుడు.

* * *

౨౯. ఈసూక్తమును ‘ఆయతల్ కుర్సీ’ అందురు. ఇది మహామహిమోపేతమైన సూక్తమని ముసల్మానుల నమ్మకము. ‘కుర్సీ’ అనగా ‘పీఠము’ అనియు కొందరు అర్థము వ్రాసిరి. ‘జ్ఞానము’ అనియు పల్వు రర్థము వ్రాసిరి. నే నీ రెండవ యర్థమునే గ్రహిం

చితిని. ఇబ్నెఅబ్బాస్, ముజాహిద్, ఇమామ్ అబూజఅఫర్, అబూఅబ్దుల్లా మున్నగు ప్రముఖభాష్యకర్తల మతమిదె. (తఫ్సీర్ మజ్మఉల్ బయాన్ సం. ౧. పు. ౧౪౯). సూఫీప్రముఖుడగు ఇబ్నె అరబీగారు కూడ ఇదే అర్థమును వ్రాసిరి. (తఫ్సీర ఇబ్నె అరబీ పు. ౭౯.)

*   *   *   *

౨౦. ఇస్లామ్ ఖడ్గబలముతో వ్యాపించెనన్న అపవాదము క్రైస్తవ చరిత్రకారులు మోపినది. ఖుర్ఆన్ ఈవిషయమున ఎంత స్పష్టమైన ఆదేశమిచ్చుచున్నదో చూపుటకు ఈసూక్తమొక్కటే చాలును. మతవిషయమున ఎట్టి బలాత్కారమును చూపరాదన్న ఈ సిద్ధాంతము ఖుర్ఆన్‌లో ఈ అధ్యాయముననే వెనుక 193 సూక్తమున చెప్పబడినది.

శ్రీప్రవక్త అనుచరులలో ఒకరికి ఇద్దరు పుత్రు లుండిరి. వారు క్రైస్తవులు. 'వారిని ఇంచుక బలాత్కరించి ముసల్మానుల నొనర్తును. సెల వివ్వవలసినది' అని ఆయన ప్రవక్త ననుజ్ఞవేడెను. ప్రవక్త బలాత్కారమును నిషేధించుచు ఈసూక్తమును ప్రమాణముగా సెలవిచ్చిరి.

శ్రీ ప్రవక్త ప్రధాన శిష్యులలో ఒకరును, రెండవ ఖలీఫాయునగు హజరత్ ఉమర్ కడ 'అస్బఖ్' అను పేరుగల ఒక క్రైస్తవ బానిసయుండెను. హజరత్ ఉమర్ మాటిమాటికా బానిసకు ఇస్లామ్‌ను ఉపదేశించుచుండువారు. బానిస ఆయన మాటలను పెడచెవిని పెట్టువాడు. తుదకు హజరత్ ఉమర్ 'మరి నీ ఇష్టము. ఇస్లామ్ బలాత్కారమును నిషేధించుచున్నది.' అని చెప్పి ఊరుకొనిరి. శ్రీప్రవక్తయొక్కయు వారి ప్రియానుచరుల యొక్కయు ఆచరణమును తెల్పు ఈ చరిత్రాంశములు ఈ సూక్తమునకు వ్యాఖ్యానములై యున్నవి.

*   *   *   *

౨౧. ఇందు పేర్కొన బడిన చక్రవర్తి పేరు 'నమ్రూద్' అని ప్రాచీన చరిత్రకారులు. ఇతడు బాబిలోనియాకు ప్రభువై యుండెను.

*   *   *   *

౨౨. ఇందు పేర్కొనబడిన నగరము జెరూసెలమ్. క్రీ. పూ. 599 లో నెబూషాద్‌నెజ్జర్ విధ్వంస మొనర్చిన పిదప జెరూసెలమ్ నగరముయొక్క స్థితి యిందు వర్ణింపబడినది. ఇందు ఎజెకియల్ స్వప్నము వర్ణితమైనది. ఇది స్వప్నము కాదు వాస్తవమని కొందరు వ్యాఖ్యాత లభిప్రాయపడిరి. బైబిల్ కథ ననుసరించి చూచినను ఇది స్వప్నమగుట స్పష్టము. ఖుర్ఆన్‌లో ఇట్టి విషయములు సూచనమాత్రముగ నుండును.

ఒక కథవల్ల మనము నేర్చుకోవలసిన గుణపాఠమే ఖుర్ఆనుకు ముఖ్యము కాని ఆకథయొక్క వివరములు కావు. ఖుర్ఆనుకు ప్రధానమైనది కథ కాదు; దాని గుణపాఠము. అందుకై కథయొక్క ప్రత్యంశము తరచి శోధించు అవసరము కన్పించదు.

*   *   *   *

౨౩. 'ఫసుర్‌హున్న ఇలైక్' అనుటకు 'నాటిని ముక్కలు ముక్కలు చేయుము' అనియు కొందరు వ్యాఖ్యాతలు అర్థము వ్రాసిరి. మౌలానా అబుల్ కలాం ఆజాద్, అల్లామా యూసుఫ్ అలీ, హాఫిజ్ గులాం సర్వర్, మౌలానా మొహమ్మద్ అలీ మున్నగు ఆధునిక వ్యాఖ్యాతలందరును నే నుల్లేఖించిన అర్థమునే గ్రహించిరి. వెనుక నేను చెప్పినట్లు కథలయొక్క ప్రత్యంశము విప్పి చెప్పుట ఖుర్ఆన్ ఉద్దేశమే కాదు. ఎంతవరకు తాను బోధింపనున్న సత్యమున కొక కథ ఉపకరించునో అంత కథాభాగమునే ఖుర్ఆన్ గ్రహించును. తక్కిన అంశములు ఖుర్ఆన్ దృష్టిలో అప్రస్తుతము. ప్రాచీనులకు అద్భుత కథనమునందును, మాహాత్మ్యము లందును ఎక్కువ ప్రీతి. అందుచే వారు సూచనలుగా ఇవ్వబడిన ఈ కథాంశములను పెంచి చిలవలు పలవలు పుట్టించి సంతోషపడిరి.

*   *   *   *

౨౪. ఖుర్ఆను ఎంతటి హృదయంగమమగు ఉపమానములను ఇచ్చినవో గమనింపుడు. అల్లో 264, 265, 266 సూక్తములలో ఇచ్చిన ఉపమానములు నిరుపమానమైనవి.

*   *   *   *

౨౫. దానమునకు జాతికులమత భేదములులేవు. పూర్వమన్ని మతములయందును ఇట్టి భేదములుండెను. ఉదాహరణమునకు మనువు:

సమ మబ్రాహ్మణే దానం ద్విగుణం బ్రాహ్మణబ్రువే
ప్రాధీతే శతసాహస్ర మనంతం వేదపారగే. (VII : 85)

బ్రాహ్మణేతరుని కొసగిన దానమునకు దానికి సమానమైన ఫలమనియు, అనుష్ఠాన రహితుడైన బ్రాహ్మణున కొసగిన దాని ఫలము ద్విగుణమనియు, వేదాధ్యయనము చేయుచున్న బ్రాహ్మణున కిచ్చిన లక్షగుణముల ఫలమనియు, వేదపారగున కిచ్చినచో అనంతమగు ఫలము కల్గుననియు చెప్పుచున్నాడు. ఖుర్ఆన్ అట్లు కాక ఎవరైనను, ఏజాతికి, ఏ మతమునకు చెందిన వాడైనను సరే అతడు నిజముగా దరిద్రుడై సహాయము నర్థించు వాడైనచో అతని కివ్వవలసినదని ఆదేశించుచున్నది.

శ్రీ ప్రవక్తశిష్యులు పల్వురు తమబంధువులలో ముస్లిమ్‌లు కాని వారికి వారెంత

బీదవారైనను వారికెన్నడును దానముచేయువారు కారు. ఈసూక్తముప్రోక్తమైన పిదప ఏమతమునకు చెందిన వ్యక్తికైనను దాన మివ్వవలెనని శ్రీప్రవక్త ఆదేశించిరి. దాన ఫలము పరిగృహీతపై ఆధారపడి లేదు. ఎవరికి దానము చేసినను ఫలమొక్కటే.

పరిగృహీత గుణవంతుడైనను దుర్గుణుడైనను సరే అతనికి దానము చేయవచ్చునని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయము.

* * * *

౫౬. ఇక్కడ ఖుర్ఆన్ వడ్డీని నిషేధించుచున్నది. ఆర్థికమగు చెడుగు లన్నిటికిని వడ్డీయే కారణమని అర్థశాస్త్రవేత్త లందరును ఒప్పుకొని వడ్డీని తొలగించవలసినదని ఉద్ఘోషించుచున్న ఈ కాలములో భగవంతు డేర్పరచిన ఈ నియమము యొక్క ప్రాముఖ్యత నెక్కువగ నొక్కి చెప్పనక్కరలేదు. వెనుకటి మతములన్నియు సర్వసాధారణముగ వడ్డీని నిషేధించియే యున్నవి. ప్రాచీన విజ్ఞానులలో సుప్రసిద్ధులగు ప్లేటో, యారిస్టాటల్ అను తాత్త్వికులు ఇద్దరును వడ్డీనిఖండించిరి. Laws అను తన ఉద్గ్రంథములో ప్లేటో ఒక ఆదర్శనగరమును వర్ణించుచు అందులో వడ్డీని నిషేధించుచున్నాడు.* యారిస్టాటల్ సుప్రసిద్ధమగు తన పొలిటిక్స్ అను గ్రంథములో వడ్డీని గురించి ఇట్లనుచున్నాడు:—

"The most hated sort, and with the greatest reason, is usury, which makes a gain out of money itself, and not from the natural use of it. For money was intended to be used in exchange, but not to increase at interest. And this term usury, which means the birth of money from money, is applied to the breeding of money because the offspring resembles the parent. Wherefore of all modes of making money this is the most unnatural." (*Politics* I. 10.5.)

(డబ్బు గడించు పద్ధతులలో చాలా హేయమైనది వడ్డీ. ఆ విధముగా హేయముగా భావింపబడుట న్యాయమే. డబ్బుయొక్క ఉపయోగమువల్ల కాక, డబ్బునుండియే డబ్బును పుట్టించు వృత్తిఇది. డబ్బు ఉపయోగపడుటకు ఏర్పడినది; కాని, వడ్డీగా వృద్ధిపొందుటకు కాదు. డబ్బు గడించు పద్ధతులలో కెల్ల ఇది చాల ప్రకృతి విపరీతమైనది.)

* Laws V. 742, C; VIII. 852, D. "Plato condemns usury with equal emphasis; he excludes it in the Laws, from the ideal city described there."
James Bonar, *Philosophy & Political Economy* P. 22.
[ప్లేటో వడ్డీని గట్టిగా నిషేధించెను. 'లాస్' అను తన ఉద్గ్రంథములో వర్ణింపబడిన ఆదర్శనగరమునందు వడ్డీ నిషేధించెను.]

ప్రాచీన రోమన్ సామ్రాజ్యము లో మొట్టమొదట వడ్డీ ధర్మ్యమేయైయుండెను. కాని దానివల్ల నష్టములు కొన్నాళ్ళకు దుర్భరమాయెను. క్రీ. పూ. 450 లో ప్రకటింపబడిన లా ఆఫ్ ది ట్వెల్వ్ టేబుల్స్ లో అసలులో పండ్రెండవ భాగము మాత్రము వడ్డీగా గ్రహింపనగునని శాసింపబడెను. దీనివల్లకూడ ప్రజల ఇబ్బందులు తగ్గలేదు. క్రీ.పూ. 342 లో లెక్స్ జెనూషియా ననుసరించి వడ్డీ పూర్తిగ నిషేధింపబడెను. ఈ నిషేధము దాదాపు 300 ఏండ్లవరకు అమలులో నుండెను. ధనికుల ఒత్తిడి కాగలేక క్రీ.పూ. 50 లో తిరిగి రోమన్ శాసనసభ సాలుకు నూటికి 12 చొప్పున మాత్రము వడ్డీ తీసికొనవచ్చునని శాసించెను. అంతకంటె ఎక్కువ వడ్డి తీసికొనువారు శిక్షకు పాత్రులగుచుండిరి.*

ప్రాచీన ఈజిప్టులోకూడ వడ్డీపై ఎన్నో ప్రతిబంధకము లుండియుండినట్లు డయడోరస్ వ్రాయుచున్నాడు. డయడోరస్ క్రీ.పూ. ప్రథమ శతాబ్ద మధ్యమున ఈజిప్టు దేశము తిరిగియుండెను. (Diodorus Vol. 1. P. 81.)

ఆధునిక అర్థశాస్త్రజ్ఞులలో మేటియగు సర్ నార్మన్ ఏంజల్ గారీ విషయము

* In B. C. 342 it (interest) was abolished altogether by Lex Genucia. Although the prohibition of interest long remained law, it was found impracticable........The Lex Unciaria of the Consuls Sulla and Rugus fixed the rate of interest at 12% per annum ...... By a decree of the Senate in B. C. 50 this became the legal limit throughout the Roman Provinces.

(Palgrave's *Dictionary of Pol. Economy.*)

(క్రీ. పూ. 342 లో లెక్స్ గెనూషియా వడ్డీని పూర్తిగా నిషేధించెను. వడ్డీ నిషేధము 'లా' లో ఉన్నప్పటికిని అది ఆచరణ సాధ్యము కాక పోయెను......సల్లా రూగసులు కావించిన ఉన్కియారియా శాసనము ప్రకారము నూటికి సాలుకు 12 చొప్పున వడ్డీ తీసికొనుట న్యాయ సమ్మత మొనర్పబడెను......క్రీ. పూ. 50 లో ఈ వడ్డీ రేటు రోమక సామ్రాజ్యమంతటను శాసన సమ్మతమై యుండెను.)

గూర్చి తన The Story of Money అను ఉద్గ్రంథములో ఇట్లు వ్రా-
యుచున్నాడు:

"One of the greatest events in the Story of Money is the change of ethical attitude in reference to loans, and interest thereon, and all that ecclesiastical ruling on such a matter implies. We find it difficult to-day to realise that for long ages nearly all the great moralists and teachers, nearly all the great religious bodies, including the Roman Catholic Church, condemned the charging of interest as a vile crime comparable only to murder. It was no casual or incidental condemnation with which the Church and for centuries the secular state as well visited this offence. Its heinousness has been the subject of a vast literature; of disputations carried on ardently from generation to generation, and ago to ago." *

(ఋణము దానిపై వడ్డీకి సంబంధించిన నాటియెడగల నైతిక వైఖరి యందు కలిగిన మార్పు ఆవిషయములపై క్రైస్తవచర్చి చేసిన నిబంధనములు ఆర్థికచరిత్రలో ఒక గొప్ప సంఘటనము. ఎంతో కాలము వరకు నీతిశాస్త్రవేత్తలు, విజ్ఞానులు, మత సంఘములు, రోమన్ క్యాథలిక్కు చర్చివారు వడ్డీని ఒక గొప్ప నేరమని, అది ఖూనీ కంటె తక్కువ నేరము కాదనియు ఖండించిరి. శతాబ్దముల పాటు చర్చివారును, మతమునకు సంబంధము లేకుండా రాజ్యములు వడ్డీని నిషేధించుట యాదృచ్ఛికముగా జరిగినదికాదు. వడ్డీ నేరమని వ్రాసిన ఒక విశాల గ్రంథసంచయము కలదు. శతాబ్దముల తరబడి దీని దౌష్ట్యమును గూర్చిన చర్చలు కలవు.)

ఇట్లు క్రైస్తవ మతమును, క్రైస్తవమతాచార్యులును కూడ దీనిని ఖండించిరి. వడ్డీని గురించి బైబిల్ ఏమనుచున్నదో చూడుడు:

"If thou lend money to any of my people that is poor by thee, thou shall not be to him as an usurer, neither shalt thou lay upon him usury."
(Exodus. 22: 25.)

(నా ప్రజలలో నీయొద్ద నుండు ఒక బీదవానికి సొమ్ము అప్పిచ్చినయెడల వడ్డీ పుచ్చుకొనువానివలె వారి యెడల ప్రవర్తింపకూడదు; వానికడ వడ్డీ తీసుకొనకూడదు.)

"Unto a stranger thou mayest lend upon usury; but unto thy brother thou shalt not lend upon usury: that the Lord thy God may bless thee in all that thou settest thiwe hand to in the land whither thou goest to possess it." (Deut. 23: 20)

(క్రొత్తవానికి వడ్డీపై అప్పివ్వవచ్చును. కాని నీ సోదరునికడ అప్పిచ్చి వడ్డీ తీసుకొనకూడదు ఇత్యాది)

"He that hath not given forth upon usury, neither hath taken any increse, that hath withdrawn his hand from iniquity, hath executed true judgment between man and man." (Ezek. 18-8.)

(వడ్డీకి అప్పివ్వకయు, లాభము చేపట్టకయు, అన్యాయము చేయకయుండువాడు నిజమైన న్యాయపరుడు.)

"Hath given forth upon usury, and had taken increase: shall he then live? He shall not live: he has done all those abominations; he shall surely die; his blood shall be upon him. (Ezek. 18-13.)

(అప్పిచ్చి వడ్డీ పుచ్చుకొనుటయు, లాభము చేపట్టుటయు మున్నగుపనులు చేయువాడు బ్రతుకనా? బ్రతకడు. ఈ హేయకార్యములు చేసెనుకనుక అవశ్యముగ వానికి మరణశిక్ష విధించవలెను.)

పై వాక్యము లన్నియు పాత నిబంధనము (Old Testament) లోనివి. నూతన నిబంధనములో ఎక్కడను వడ్డీనిగూర్చి స్పష్టముగ ఆజ్ఞాపింపబడలేదు. * కాని

---

* Quoted in Collin Brooks, " *The Economics of Human Happiness.*" P. 48.

* "The words of Jesus contain allusions to lending and borrowing, but as we should expect of one who refus d to be a judge and divider (Luke 12-14) there are no direct precepts to guide the Christian conscience." *John Dow in the Encyclopaedia of Religion and Ethics.*
(అప్పిచ్చుట, అప్పు తీసుకొనుట మున్నగువిషయములకు సంబంధించిన ఏసుక్రీస్తుమాటలు స్పష్టముగలేవు. తీర్పుచేయుటకు నిరాకరించిన (లూకు12-14) ఏసుక్రీస్తు ఈవిషయమున క్రైస్తవులఅంతరాత్మకు మార్గదర్శకమగుటకు సూటియైనఉపదేశము లేవియు ఇవ్వలేదు.)

ప్రాత నిబంధనమునగల ఆజ్ఞ సాధారణముగాగొని క్రైస్తవాచార్యులు వడ్డీని నిషేధించిరి. క్రీ. శ. ౧౩౧౧ లో వియన్నానగరమందు జరిగిన క్రైస్తవాచార్యుల మహాసభలో వడ్డీ సంపూర్ణముగ నిషేధింపబడెను. క్రైస్తవమత సంస్కర్తలలో అగ్రగణ్యుడగు మార్టిన్ లూథర్ వడ్డీనిగుఱించి ఇట్లు వ్రాయుచున్నాడు :

Usury is a great huge monster, like a were-wolf, who lays waste all, more than any cacus, Geryon or Autacus—Since we break on the wheel, and behead highwaymen, murderers and house-breakers, how much more ought we to break on the wheel and kill, hunt down, curse and behead all usurers. "

(Quoted by Marx, *Capital* Vol. II. P. 652.)

(వడ్డీ ఒక పెద్ద రాక్షసి. ఇది సర్వనాశనము చేయును. మనము దోపిడిగాండ్రను హంతకులను, దొంగలను చంపుదుముకదా. అట్లయిన ఈ వడ్డీ తీసుకొనువారి నేమిచేయవలెను? వారిని వేటాడి తలకాయలు నరకవలెను.)

యూరప్ ఖండపు కమర్షల్ లా మధ్యయుగములో ఇదే సిద్ధాంతముపై నిర్మింపబడెను. * కాని క్రమక్రమముగ క్రైస్తవాచార్యులు యూరప్ఖండమున వ్యాపించిన క్యాపిటలిజమ్ ఒత్తిడి కాగలేక వడ్డీపైగల నిషేధమును తొలగించిరి. యాష్లే దీనినిగూర్చి ఇట్లు వ్రాయుచున్నాడు :

"The Prohibition of usury was clearly the centre of Canonist doctrine. That Prohibition, as it is ordinarily interpreted, and indeed as it was actually formulated in some few passages by some of the Fathers, would have prevented every sort of investment for the sake of gain....(But soon) methods were found which did not conflict with the prohibition of usury, and which one after the other received the approval of the Church." (Ibid. P. 396.)

(క్రైస్తవ ధర్మశాస్త్రమునకు వడ్డీ నిషేధము స్పష్టముగ కేంద్రప్రాయమై యుండెను. ఆ నిషేధముయొక్క సాధారణ వ్యాఖ్యానము ననుసరించియు, క్రైస్తవాచార్యుల భావముల ననుసరించియు లాభము కొఱకు ఎట్టి పెట్టుబడియైనను అరికట్టి యుండెడిది......కాని వడ్డీ నిషేధమునకు వ్యతిరేకము కాని ఉపాయములు కనిపెట్టబడెను. అవి క్రమక్రమముగ చర్చివారి అంగీకారమును పొందెను.—)

౧౪-వ శతాబ్దము నాటికి క్రైస్తవ చర్చి వడ్డీ నిషేధమును తొలగించెను. పదునైదవ శతాబ్దములో వడ్డీకి క్రైస్తవాచార్యు లెల్లరును అంగీకరించిరి. § ఈ విధముగ చర్చి ఒక గొప్ప భగవదాజ్ఞను నిరాకరించివైచెను. క్రైస్తవమతము క్రైస్తవమతాచార్యుల ఇచ్ఛానుసారము ఎట్లు మారుచు వచ్చినదో చూపుట కిదొక తార్కాణము. ౧౫౪౫ లో సంవత్సరమునకు నూటికి ౧౦ వరకు వడ్డీ తీసుకొనవచ్చునని ఎనిమిదవ హెన్రీరాజు కావించిన శాసనమునకు వ్యతిరేకముగ క్రాలే అను ఒక ఆంగ్లమహాశయుడు ౧౫౫౧ లో పార్లమెంటుకు సమర్పించిన విన్నపమందలి ఈ క్రిందిమాటలు నేటికిని క్రైస్తవ మతస్థులకు చెల్లును. క్రాలే మహాశయుని మాటలివి :

" Now I will speak of the great and intolerable usury which at this day reigneth so freely this realm over all............

Alas, that over any Christian Assembly should be so void of God's Holy Spirit that they should allow for Lawful anything that God's Word forbiddeth. Be not abashed worthy Counsellors, to call this act into question again.

And again with regard to the Biblical Command I am not ignorant what glosses have been made upon this place, and how men have wrested and made it no precept but a Counsel of our Saviour; and therefore not to infer necessity to Christians,

---

* "On the fundamental points of usury and just price, commercial law in the later Middle Ages adopted completely the principles of the Canonists."
(Ashley, *Economic History* Vol. I, Part II, P. 384.)

(వడ్డీ, న్యాయసమ్మతమగు ధర మున్నగు ప్రధాన సమస్యల విషయములో మధ్యయుగములందు కమర్షల్ లా క్రైస్తవ ధర్మశాస్త్రమునే ఆధారముగా గ్రహించెను.)

§ "During the following, the fourteenth, it could hardly be regarded as distinctly under the ban of the Church; and in the 15th it was certainly very generally accepted by the best theologians."
(Ashley, P. 401.)

(14-వ శతాబ్దములో అది చర్చివారి నిషేధముక్రింద లేదు. 15-వ శతాబ్దములో గొప్ప క్రైస్తవాచార్యు లందరును వడ్డీని ఒప్పుకొనిరి.)

but to leave them at liberty either to do it or to leave it undone. Oh, Merciful Lord! *What manner of religion is it that these men profess*.................. And doubt ye not, most worthy Counsellors, whatsoever he is that will defend or teach that any one little iota of the Counsels of Christ should be so vainly spoken that any of his flock might refuse to practise the same in his living to the uttermost of his power, is no less than a member of the Devil and a very Antichrist..........." (Quoted by Ashley. P. 465.)

(మన దేశములో ఆమూలాగ్రము వ్యాపకములోఉన్న దుర్భరమైన వడ్డీ వ్యాపారమును గురించి నేనిప్పుడు చెప్పెదను. భగవంతుడు నిషేధించిన దానిని శాస్త్రసమ్మతముచేసి భగవదపచారము చేయుచున్న క్రైస్తవ సంఘములనుగురించి విచారపడవలయును.

బైబిల్ లో వడ్డీ నిషేధము సలహామాత్రమే ననీ, ఆజ్ఞ కాదనీ వీరు అర్థము చెప్పుచున్నారు. ఓ భగవంతుడా, వీరు అనుసరించే మతము ఏమిమతము?

ఏసుక్రీస్తు యొక్క ఉపదేశములు—ఏ కొద్దిభాగమైనను—నిరర్థకములని చెప్పి వారి శిష్యకోటి అనుసరించవలసిన అవసరములేదని చెప్పువారు క్రైస్తవులు కారు—పిశాచ కోటికి చెందినవారు.) అని దీని సంక్షిప్తభావము.

ఫ్రాన్సులో 1789 వరకు వడ్డీ నిషేధ శాసనములను తొలగించలేదు. అట్లే ఇంగ్లాండులో 1839 వరకు వడ్డీనిషేధ శాసనములు అమలులో నుండెను.

ఋగ్వేద కాలములోకూడ వడ్డీ తీసుకొను దుర్జనపద్ధతి యుండినట్లే కల్పించుచున్నది. వడ్డీవల్ల కలుగు వినాశము ఋగ్వేద దశమమండలమున 34-వ మంత్రములో వర్ణింపబడినది. ఈవిషయమునుగూర్చి డాక్టర్ బెరియెడేల్ కీత్ పండితుడు ఇట్లువ్రాయుచున్నాడు;

"The rate of interest is unknown, a reference to payments of an eighth or a sixteenth may be referred either to interest or instalments of principal. At any rate, the debtor might as a result be reduced to slavery. as we learn from an interesting hymn (x.34) where an unsuccessful dicer recites the fatal fascination for him of the dice and his consequent ruin and enslavement with its results for his family." *The Cambridge History of India*, Vol. 1. P. 98.)

(ఎంతవడ్డీ వసూలు చేయబడునదియు మనకు తెలియదు. అసలులో వడ్డీ ఎనిమిదోవంతో, పదహారవవంతో తీసుకోవచ్చునని సూచనకనుబడుచున్నది. ఎట్లయినను అప్పులవాడు దాస్యములోనికి క్రమేణ గుంజివేయబడుట జరుగవచ్చును; జూదమాడుటలోని మోజు దానికి ఫలితమై సర్వనాశనము ఒక మంత్రములో చెప్పబడియున్నవి (X 34). దీనివల్ల దాస్యము తప్పనిసరగును. తనకే కాదు, తన కుటుంబమునకుకూడా.)

ఆర్యధర్మశాస్త్రకారులు కూడ వడ్డీని కొంతవరకు నిషేధించిరి. మనువు:

'విద్యాశిల్పం భృతిస్సేవా గోరక్షం విపణిః కృషిః
ధృతిర్భైక్ష్యం కుసీదంచ దశ జీవనహేతవః

అని వడ్డీజీవనము ఆపదలందు జీవికగ చెప్పుచు, బ్రాహ్మణ క్షత్రియులకు

"బ్రాహ్మణః క్షత్రియో వాపి వృద్ధిం
నైవ ప్రయోజయేత్"

అని ఆపదలందు సైతము వడ్డీకిచ్చి జీవనము చేయరాదను చున్నాడు. మరియొకచో మనువు (IV ౨౧౦.)

'వృద్ధ్యాజీవికస్యాన్నం'

అని వడ్డీ వ్యాపారి అన్నము మలముతో సమాన మని చెప్పుచున్నాడు.

మనువు వలె ఆపస్తంబుడు కూడ వడ్డీ తీసుకొని జీవించువాని కడనుండి అన్నము స్వీకరించరాదనుచున్నాడు. (ఆపస్తంబ ధర్మసూత్రములు ౬. ౧౯. ౨౨.) అంతేకాదు. వడ్డీపై డబ్బిచ్చువానికి ఆపస్తంబుడు ప్రాయశ్చిత్తము విధించుచున్నాడు.(౧౦.౨౭.౧౦) యాజ్ఞవల్క్యుడు (౧: ౧౬౧), నారదుడు (౧: ౧౧౧) విష్ణువు (౮౦. ౧) ఇదేవిధముగ వడ్డీవృత్తి నిషేధించుచున్నారు. ఈ క్రిందివారు వడ్డీ చెల్లించనక్కరలేదని ధర్మశాస్త్రకారులు శాసించిరి: (1) నిరంతరము యజ్ఞములుచేయుటయందు దాసక్తికలవారు; (2) మృతులు; (3) విద్యార్జనమునకై గురునింట కాపురముండు బ్రహ్మచారులు; (4) చిన్నవాండ్రు; (5) దరిద్రులు. *కాని ఆర్యమతములు పెక్కితర విషయము లందువలె ఒకదారితొక్కవాయెను. వైశ్యులకు వడ్డీవృత్తి ధర్మ్యమే యని ధర్మశాస్త్రకారులు నిర్ణయించినారు. ఆర్యమతమున ఏ ధర్మమైనను వర్ణాశ్రమముల నాశ్రయించియుండును. వడ్డీ వృత్తిని వైశ్యులకు ధర్మ్యమొనర్చుటయే కాక ఆర్యధర్మకారులు ఎవరెవరికడ ఎంతెంత వడ్డీని గ్రహించవలెనో నిర్ణయించిరి.

---

* N. N. Law : Studies in Ancient Hindu Polity, P. 176. నరేంద్రనాథలాగారు దీనికి ప్రమాణము చూపలేరి.

"ద్వికం శతం వా గృహ్ణానో న భవత్యర్థకిల్బిషీ" అని నూటికి నెలకు రెండు చొప్పున వడ్డీని గ్రహించువాడు ధనగ్రహణ మూలమున పాపి కానేరడు అని మను వనుచున్నాడు. అంతటితో ఆగక బ్రాహ్మణునికడ నూటికి రెండును, క్షత్రియుని కడ నూటికి మూడును, వైశ్యునికడ నూటికి నాల్గును, శూద్రునికడ నూటికి ఐదును వడ్డీ తీకొనవలయునని శాసించుచున్నాడు (మను ౮:౧౪౨). యాజ్ఞవల్క్యుడు (౨:౩౭,౧,౨), విష్ణువు (౬:౨), నారదుడు (౧:౯౯) మున్నగు ధర్మశాస్త్రకారులును ఇదేవిధముగ శాసించుచున్నారు. నూటికి సాలుకు 15 చొప్పున వడ్డీ తీసుకొన వచ్చునని అర్థశాస్త్రకారు డనుచున్నాడు.

గౌతమ బుద్ధుడు వడ్డీని నిషేధించక పోయినను బౌద్ధయుగములో వడ్డీ తీసుకొను వారు సత్పురుషులుగ భావింపబడకుండినట్లు జాతక కథలలో కన్పించుచున్నది. వంచకులగు పారివ్రాజకులు వడ్డీ వ్యాపారము చేయుదురని ఒక జాతకములో కలదు.* భారత దేశమున ఎవరును వడ్డీ తీసుకొనరని మెగాస్తనీసు వ్రాసెను. (Hopkins in *Cambridge Hist. of Ind.* P. 287) ఇది మెగాస్తనీసు పొరపాటని కొందర భిప్రాయపడినను వడ్డీ వ్యాపారము నీచవృత్తిగానైనను నాటి భారత దేశమున పరిగణింపబడుచుండుట నిర్వివాదము. మెగాస్తనీసు నీచులవలంబించు ఈ వృత్తిని గమనించి యుండక పోవచ్చును. మొత్తము మీద సర్వకాలము లందును, సర్వదేశము లందును, అన్ని మతములందును వడ్డీ తీసుకొనుట దుష్టమనియు, వడ్డీ వ్యాపారము నీచవృత్తి యనియు పరిగణింపబడుచుండెననుట స్పష్టము.

వడ్డీకి సంబంధించిన ఈ నిషేధము మానవుని ఆర్థిక జీవితమునకు సంబంధించినది. మానవుని ఆర్థిక జీవితమునకు సంబంధించిన ఈ విషయమును కూడ మతాచార్యులు ఆధ్యాత్మిక జీవితమునకు సంబంధించిన సమస్యలను వలెనే తేలికగ ఇచ్ఛానుసారము మార్చివైచిరి. దీనికి ఫలితముగ మానవుడు ధనార్జనయంత్రముగ మారిపోయినాడు. పరుల దారిద్ర్యము వలన లాభము పొంది వారి అవసరములలో అప్పు సప్పు నిచ్చి తమ ధనమును పెంచుకొనుట కిదొక మార్గమైపోయినది. ఎన్ని కొంపలు కూలుటలేదు ఈ వడ్డీ వలన ? ఒక్క మన గ్రామసీమలో 900 కోట్ల రూపాయలకు పైగా ఋణమున్నదనియు దానిపై అధమము 225 కోట్ల రూపాయలు ప్రతి సాలు బీదరైతులు

* "Hypocritical ascetics are accused of practising it (money-len ing on interest). (Jataka IV. 484). No one but the money-lender seems to have lent capital wealth for interest as an investment." (Rhys Davids in *Cambridge History of India*, Vol. 1. P.218)

వడ్డీగా చెల్లించు చున్నారనియు అర్థశాస్త్రజ్ఞులు అంచనా వేసిరి. గత ఐరోపా మహాసంగ్రామములో అమెరికా నుండి ఇంగ్లాండు ఫ్రాంసుదేశములు తీసుకొనిన అప్పులపై వడ్డీ ఇచ్చుకొనలేక అనేక సార్లు దేశములు అమెరికాను ప్రాధేయపడి వాయిదా వేయించుకోవలసివచ్చెను. సంవత్సరమునకు వేల కోట్ల రూపాయలు అమెరికాకు ఇంగ్లాండు వడ్డీ క్రింద ఇవ్వవలసి వచ్చుచుండెను.

కాపిటలిజమ్ లేక పుంజీపతిత్వమునకు ఆధారము వడ్డీయేయని ౧౯-వ శతాబ్దములో గ్రహింపబడెను. తనకడనున్న ధనము వర్తకమునందుగాని పరిశ్రమలయందు గాని తాను స్వయముగ పెట్టుకొనచేతకాక వడ్డీపై ఆధనమును పెట్టుబడి పెట్టువాడు కాపిటలిస్టు. * అందు చేతనే సామ్యవాద పితామహుడగు కార్ల్‌మార్క్సు వడ్డీని నిషేధించినాడు. బీదకార్మికునుండి కాపిటలిస్టు అన్యాయముగ పిండుకొని తినుచున్న 'సర్‌ప్లస్ వ్యాల్యూ' లేక అదనపువిలువలో వడ్డీనికూడ చేర్చినాడు. జాన్‌డౌ పండితుడన్నట్లు పాటకజనముపై ఒక అన్యాయపు పన్నని ఇప్పుడు వడ్డీ ఖండింపబడుచున్నది. అంతేకాదు. వడ్డీ ధనికులను ధనికతరులుగను, బీదలను ఇంకను ఎక్కువ బీదవాండ్రుగను చేయుననియు, దీని వలన సాంఘిక జీవితము నిలుకడగా ఉండజాలదనియు జాన్‌డౌ అనుచున్నాడు. †అందుచే సామ్యవాదుల అర్థశాస్త్రములో వడ్డీకి స్థానములేదు.

"All extant Capital is accumulated or capitalised interest; for interest is nothing more than one frag-

* Grimm defines "capitalist" in German, as "a man who lends out money on usury." (Ashley, Vol. I. Part. II P. 430.)

† "The early attacks on usury were motived by the church's sympathy for the o pressed poor; the latest attack finds its strength in the plea that interest is an unjust tax on laboring classes... By interest then, the rich are made richer, and the poor poorer, and the stability of social organisation is disturbed," John Dow in the Encyclopeadia of Religion & Ethics.

(బీదల బాధలను జూచి కనికరించే దృష్టితో, తొలుత వడ్డీ పద్ధతులమీద దాడి మొదలు పెట్టబడెను. ఇప్పటి దృష్టిలో వడ్డీ, కూలి నాలీల మీద విధింపబడే అన్యాయపు పన్నుగా భావింపబడి నిరసింపబడుచున్నది. వడ్డీ కారణముగా, బీదలు మరీ బీదతనములో మగ్గి పోవుటయును భాగ్యవంతులు విపరీతముగా భాగ్యవంతులగుటయు జరుగుచున్నది. అందుచేత, సాంఘికవ్యవస్థలో స్థిరత్వము లేకుండా పోవును.)

ment of surplus value" (Karl Marx, Capital, Vol. II, P. 646.)

(వడ్డీ అదనపు విలువలోని ఒక భాగము. అందుకని, నిలువధనమంతా కూడబెట్టబడిన వడ్డీ అనిగాని, లేదా, ధనముగా కూడబెట్టిన వడ్డీ అనిగాని చెప్పాలి.)

అన్నాడు కార్ల్‌మార్క్స్. ఈ సందర్భములో ఎకానమిస్టులోని ఈ క్రిందిమాటల నుద్ధరించాడు మార్క్స్. చూడుడు ఇవి ఎంత స్పష్టముగా ఉన్నవో :

"Capital with compound interest on every portion of capital saved, is so all-engrossing that all the wealth in the world from which income is derived, has long ago become the interest on capital."

(Economist, July 19, 1859)

(వడ్డీ వ్యాపారములో అదనపు విలువగా మనము కొంత అదనపుధనమును కూడబెట్టుదుము. ఈ అదనపుధనమే కాంపౌండు వడ్డీతో పెంచబడినట్లైతే, ప్రపంచములోని మూలధనమంతయు, అనాదినుండి పెంచబడే వడ్డీ మాత్రమేనని గ్రహించవలెను.)

తాను అనుభవించకుండా నిగ్రహముతో దాచియుంచిన ధనమునకు ప్రతిఫలము ఈ నిలువ యని చెప్పే ధనికునకును, వాని బానిసయగు అర్థశాస్త్రజ్ఞుని పరిహసించుచు కార్ల్‌మార్క్స్ ఇట్లు వ్రాయుచున్నాడు :

"It has never occured to the vulgar economists to make the simple reflection that every kind of human activity can, if you like, be regarded as 'abstinence' from the opposite kind of activity. Eating is abstinence from fasting, walking is abstinence from standing, work is abstinence from idleness, idleness is abstinence from work, and so on. These gentlemen would do well to ponder, once in a way, Spinoza's dictum "determination is negation" (Ibid, P. 656.)

(ఛాందసులైన అర్థశాస్త్రజ్ఞులకు ఒక చిన్నవిషయముకూడ బోధపడినట్లు కనపడదు. మానవుని ప్రతిచర్యయు, తద్వ్యతిరేక కార్యముయొక్క నిగ్రహ భావమని వారికి తట్టలేదు. తినుట, దానికి వ్యతిరేకమైన ఉపవాసమును చేయకుండుట; అదేవిధముగ, నడచుటను, నిలచుట, పనిచేయుటకు సోమరితనము మొదలైనవి వాటికి వ్యతిరేకములైన కార్యములు. ఈ పెద్దలు, స్పినోజా చెప్పిన 'నిర్ణయించుట యనునదే వ్యతిరేకించుట' యను సూత్రమంతు మనము చేసిన బాగుండును.)

వడ్డీ ఉండుటచేతనే, అనగా ధనమునకు కొంత ప్రతిఫలము లభించునను ఆశ ఉండుటచేతనే ధనము కూడుచున్నదనియు, లేనిచో ఎవరును ధనమును కూడబెట్టరనియు, ఒకసారి కూడబెట్టినను పరిశ్రమాదులలో పెట్టుబడి పెట్టరనియు, అట్టి పరిస్థితులలో, సంఘమున కభివృద్ధి యుండదనియు, జాతిసంపద పెరుగక నిలిచిపోవుననియు, ఆధునిక నాగరికతకు కావలసిన ఉన్నతజీవిత ప్రమాణము స్వప్నప్రాయమై పోవుననియు, ప్రజలకు పల్లెటూరి నాగరికతయే ప్రాప్తమగుననియు మొన్న మొన్నటివరకు పేరుమ్రోలు తిరిగిన అర్థశాస్త్రవేత్తలందరును అనుచుండిరి. ఇప్పుడు వారిలోనే అత్యంత ప్రముఖుడగు ఒక అర్థశాస్త్రవేత్త ఈ మధ్య ఈభావము లన్నిటిని పడగొట్టినాడు. అతడే జేమ్స్ మేనార్డ్ కైన్స్ (James Maynard Keynes). బ్రిటిష్ సామ్రాజ్యములోనే కాదు ప్రపంచ అర్థశాస్త్రవేత్తలలో ఇత డగ్రగణ్యుడు. ఇతడు ౧౯౩౬ లో "The General theory of Employment, Interest and Money" అను ఒక ఉద్గ్రంథమును రచించి అర్థశాస్త్రజ్ఞులను విభ్రాంతుల నొనర్చెను. వడ్డీరేటు హెచ్చించినచో పెట్టుబడికై ఎక్కువ ధనము మార్కెటులోనికి వచ్చునను ఆర్థిక సిద్ధాంతము తప్పని 'కైన్సు' ఇందు చూపెను. వడ్డీరేటునకును పెట్టుబడికై మార్కెటులోనికి వచ్చు ధనముయొక్క మొత్తమునకును ఎంతమాత్రము సంబంధము లేదని కైన్సు ఇందు దీర్ఘముగ చర్చించి చూపెను. దీనితో ఆర్థికసౌభాగ్యమునకు వడ్డీయే మూలకందమనుకొనిన ప్రాచీన అర్థశాస్త్రజ్ఞులమూఢభావము మొదలంటకూలెను. ఆర్థికపు పెరుగుదిగుడులను తగ్గించుటకు మార్గము వడ్డీరేటు తగ్గించుట కాని హెచ్చించుట కాదని కైన్సు ఇందు రుజువు పరచెను. అర్థశాస్త్రజ్ఞు లిప్పుడు కండ్లు తెరచినారు. వడ్డీ సర్వ ఆర్థిక అరిష్టములకు మూలమని ఇప్పుడు వారికి బోధపడినది.

ఇటీవల అమెరికాలో కొందరు ప్రముఖులు "మ్యూచుఅలిజమ్ (Mutualsim)" అను ఒక క్రొత్త ఆర్థికసిద్ధాంతమును కనిపెట్టి దానిప్రచారము చేయుచున్నారు. ఈ సిద్ధాంతము ననుసరించి వడ్డీ నిర్మూలమైనగాని ఆర్థికన్యాయము సాధ్యము కాదు. వడ్డీ ఎంత అన్యాయమైనదో చూపుటకు ప్రముఖ మ్యూచుఅలిస్టయిన క్లారెన్స్ స్వార్ట్జ్ ఈ క్రింది ఉదాహరణ మిచ్చుచున్నాడు :

"1612 లో జాన్ ఎల్డర్ తన పొరుగువాడైన స్టాండిష్‌నుండి 100 డాలర్లు నూటికి 5 చొప్పున కాంపౌండు వడ్డీకి అప్పు తీసికొని యుండినయెడల 1926 నాటికి

ఎల్డన్ వంశము స్టాండిష్‌వంశమునకు 10 కోట్ల డాలర్లు బాకీపడి యుండును."*

ఈ లెక్కలో ఎక్కడను లోపము లేదు. వడ్డీ ఎంత అరిష్టదాయకమో తెల్పుటకు ఈ ఉదాహరణ మెంతయు తగియున్నది.

ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయపు పరిఖ్యాత భౌతికశాస్త్రాచార్యుడగు ప్రొఫెసర్ ఫ్రెడరిక్ సాడీయును, సమాన ప్రసిద్ధిగల థామస్ ఆల్వా ఎడిసన్‌యును ఇటీవల వడ్డీ పద్ధతిని నిర్మూలింపజేయవలెనని చెప్పి, లోకమున కాశ్చర్యము కలిగించిరని క్లారెన్సు స్వార్ట్జ్ వ్రాయుచున్నాడు. § ఫ్రెడరిక్ సాడీ రచించిన "కార్టీసియన్ ఎకనా

---

* "If John Alden, of Pilgrim Father fame, back in 1626, had lent the equivalent of $ 100 in coin to Miles Standish, at 5% per annum, to be compounded annually, principal and interest to be paid to his heirs after 300 years, the heirs of Miles Standish would now have to pay John Alden's heirs the sum of a little more than $ 100,000,000 for 300 years. The computation is mathematically correct and serves to demonstrate the anti-social nature of the exaction of interest." Clarence L. Swartz, *What is Mutualism?* P. 64.

§ Prof. Frederick Soddy, one of the most distinguished and certainly one of the bravest of British Scientists, lately astonished the scientific world by advocating *the absolute abolition of interest* as the only alternative to the destruction of civilization.

Several years ago, after a visit to Muscle Sho ls where, in the company of Henry Ford, he talked over the farmers problem, Thomas A. Edison, the greatest inventive genius of modern times, drafted a plan by which the Government could lend money to the farmer for a period of one year without interest charge, to be secured by farm products. The plan was to operate as a sort of auxiliary to the Federal Reserve System.

The fact that two such great minds, in different countries and with different environments, but at almost the same time, reach the epoch-making conclusion that *the necessity exists for the abolition*

మిక్సు", "వెల్త్, వర్చ్యుయల్ వెల్త్ అండ్ డెట్" అను పుస్తకములు ఈ సందర్భమున చదువదగినవి.

ఈ సిద్ధాంతవాదుల మ్యూచుఅల్ బ్యాంకింగుపద్ధతిని ప్రతిపాదించిరి. ఈ బ్యాంకింగులో పరస్పరసహాయమే కేంద్రభావము. ఇందు వడ్డీ లేదు: బ్యాంకుయొక్క సమస్త వ్యవహారములు సల్పుటకు బ్యాంకుచేయు వ్యాపారములో సాలుకు నూటికి అర్ధకంటె ఎక్కువ ఖర్చు కాదు. మ్యూచుఅల్ బ్యాంకింగుపద్ధతిలో ఒక బ్యాంకుయొక్క సభ్యులు ఈ ఖర్చును భరించుకొందురు. ఈ పద్ధతి కర్నల్ విలియమ్ గ్రీన్ గారి "మ్యూచుఅల్ బ్యాంకింగు" అన్న గ్రంథములో వివరింపబడినది.

వడ్డీ నిర్మూలమునకు సంబంధించిన పెక్కు సందేహములు బెంజమిన్ టక్కర్ గారి 'ఇండివిజ్యుఅల్ లిబర్టీ' (పుటలు 102 - 106) లో చూడుడు. ఈ గ్రంథము 1926 లో వ్యాన్ గార్డు ప్రెస్సువారు న్యూయార్కు నుండి ప్రచురించిరి.

వడ్డీని గూర్చి ప్రాచీన భావములు, ప్రాచీన మతములు, వివిధ ఆర్థిక నీతుల నాడరించు అర్థశాస్త్రజ్ఞులు ఏమనిరో, ఇన్నాళ్ళ అనుభవము, భావన, అర్థశాస్త్రజ్ఞులను ఏఫలితార్థము వంకకు తీసుకొని వెళ్ళినవో వెనుక స్పష్టముగ వివరించితిని. వెనుకటి మతములు వడ్డీని నిషేధించెను. తరువాత ఆ యా మతముల పండితులు వడ్డీని ధర్మ్య మొనర్చిరి. కాని ఇస్లామ్ ఈ విషయమున పొందిన జాగ్రత్తను గమనింపుడు. సర్వమతములును వడ్డీ తీసుకొనుటను మాత్రము నిషేధించినవి. వడ్డీవృత్తిని ఖండించినవి. ఇస్లామ్ అంతటితో ఆగలేదు. వడ్డీ తీసికొనుటయే కాదు. వడ్డీ ఇచ్చుటయు, వడ్డీ పత్రమును వ్రాయు

---

of interest must produce a profoun l impression on all thinking people." C. L. Swarty, *Ibid*, P. 64.

Prof. Frederick Soddy destroys the pretense that interest is necessary in his pamphlet *Cartesian Economics* (London, *Henderson s*) and in his book, *Wealth, Virtual Wealth, and Debt* (New York: E. P. Dutton & Co.)

ఈ విషయమున ఈ క్రింది పుస్తకములు చదువదగినవి:

Benjamin R. Tucker	:	Individual Liberty
Charles P. Issac	:	The menace of Money Power
Hugo Bilgram	:	The Cause of Business Depression
Col. William B. Green	:	Mutual Banking
J. B. Robinson	:	The Economics of Liberty
Josiah Warran	:	True Civilization

టయు, అందు సాక్షులై యుండుటయు, మొత్తమునకు వడ్డీకి సంబంధించిన సమ కార్యములను ఇస్లామ్ నిషేధించినది. (బుఖారీ 34 : 24) "వడ్డీ తీసికొనుట భగవంతుని పైనను భగవంతుని ప్రవక్తపైనను యుద్ధముచేయుట వంటిది." (2:279) అని ఖుర్ ఆన్ స్పష్టముగ ఆదేశించినది. అందుచేతనే వడ్డీ నిషేధమను భావము ముస్లిం హృదయములలో చెదరక నిలిచియున్నది. ప్రతి సంవత్సరము పెక్కు లక్షలరూపాయలు ముస్లిములు వడ్డీక్రింద పోస్టల్ సేవింగ్సు బాంకునుండి తీసికొనకుండా ఉన్నారని సెంట్రల్ బాంకింగు ఎంక్వైరీ కమిటీవారు వ్రాయుచున్నారు.

యూదులు (Jews) వడ్డీ వ్యాపారమున ప్రసిద్ధికెక్కినవారు. మొన్న మొన్నటి వరకు యూరప్ ఖండములో వడ్డీవ్యాపారమంతయు వీరిచేతులలోనే యుండెను. యూదుల మతగ్రంథమగు పాతనిబంధన వడ్డీని యూదులమధ్య నిషేధించినది. కాని ఇతరులతో వడ్డీ వ్యాపారము ధర్మ్యమొనర్చినది. అందుచే యూదులు క్రైస్తవులతో నిరాటంకముగ వడ్డీ వ్యాపారము చేయుచుండిరి. కాని యూదులీ వృత్తి నీచమైనదని ఇప్పుడు గ్రహించినారు. ఇప్పుడు వడ్డీవృత్తి గౌరవ ప్రదమగు వృత్తిగా భావింపబడుచుండుట లేదు. J. Abelson వడ్డీయెడ యూదుల ప్రస్తుత వైఖరినిగూర్చి Encyclopeadia of Religions and Ethics లో వ్రాయుచు ఇట్లనుచున్నాడు:

"The trade of usury is looked upon with shame, and the usurer is stigmatised as a reproach to his people. In some Jewish Communities to day the money-lender is forbidden to have any voice in the affairs of the synagogue and is socially tabued by the better classes among his co-religionists"

"వడ్డీవ్యాపారము నీచముగ చూడబడుచున్నది. వడ్డీ వ్యాపారస్థుడు కులమునకు కళంకముగా బరిగణింపబడుచున్నాడు. నేడు యూదులలో వడ్డీ వ్యాపారికి సినగాగుల పరిపాలనమున స్థానములేదు; అతనిని సాంఘికముగ బహిష్కరించుచున్నారు.)

*　　*　　*　　*

౫౭. వడ్డీ తీసుకొనుట దానమునకు విరుద్ధముగ ఇందు చెప్పబడినది. "కృతఘ్నుడగు పాపిని భగవంతుడు ప్రేమింపడు" అన్న ఈ సూక్తమునందలి వచనములు గమనింపదగినవి. వడ్డీ తీసుకొనుటయు, దానము చేయకుండుటయు కృతఘ్నుని కార్యములని దీని భావము. సంపద భగవంతునిచే ప్రసాదింపబడినది. దానిని భగవన్మార్గమున ఖర్చుపెట్టుటయే దానియొక్క సరియైన వ్యయము. అట్లుచేయక లోభియై, అంతటితో ఆగక, తన ధన బలముచే దరిద్రుల దారిద్ర్యము నూతగాగొని వారి ధనమును వడ్డీరూపమున పిండుట భగవంతు డిచ్చినదానికి కృతఘ్నత చూపుటకాక మరేమి?

దాతనని గర్వమున నిక్కు ధనమదాంధ!
నమ్ము నీయీవి నిర్యాతనమ్మె సుమ్మి;
సాది యని నీవు నిక్కు ధనమ్ము నీదె?
సర్వధన సంప్రదాత ఈశ్వరుడు లేడె?

*　　*　　*　　*

౫౮. 'జకాత్' లేక 'విహితదానము' ఖుర్ ఆన్ లో 27 చోట్ల ప్రార్థనము (నమాజ్) తో పాటు పేర్కొన బడినది. దీనినిబట్టి ఖుర్ ఆన్ గ్రంథము జకాతున కెంత ప్రాముఖ్యత నిచ్చుచున్నదో తెలియగలదు. "ధనికులకడనుండి గ్రహించి పేదల కివ్వబడు" ధనము జకాత్ అని శ్రీ ప్రవక్త ఉపదేశము. (బుఖారీ 24 : 1). ఆర్థిక సమానత్వమును నెలకొల్పుటకును, దారిద్ర్యమును నిర్మూలించుటకును, భిక్షుకావృత్తి లేకుండ చేయుటకును ఇంతకంటె మంచి ఉపాయము వేరొకటిలేదు.

*　　*　　*

౫౯. ఋణము చేయుట తప్పనిసరి యైన ఒక దురభ్యాసమని ఇస్లామ్ చెప్పుచున్నది. సాధ్యమైనంతవరకు అప్పుచేయక ఉన్నదానితోనే తన అవసరములను తీర్చుకొనుట మేలని ప్రవక్త ఉపదేశము. "ప్రభూ ! నన్ను తప్పులనుండియు, అప్పులనుండియు తప్పింపుము" అని శ్రీప్రవక్త సాధారణముగ ప్రార్థించుచుండిరి. ఒకడు శ్రీ ప్రవక్తనుద్దేశించి "ఓ ప్రవక్తా ! తా మెప్పుడును అప్పులనుండి నన్ను తప్పింపుమని ప్రార్థింతురే" అనెను. దానికి శ్రీప్రవక్త ఇట్లు ప్రత్యుత్తర మొసగిరి : 'అవును. అప్పులలోనున్నవాడు అబద్ధములు చెప్పును. వాగ్దానములుచేసి వానిని చెల్లింపడు.' (బు. 43:10.)

కాని అప్పుచేయుట ఒకొక్కప్పుడు తప్పనిసరి యగును. అట్టియెడ ఋణదాత ఋణస్థునియెడ దయతో ప్రవర్తించవలెనని శ్రీ ప్రవక్త ఉపదేశించుచున్నారు. ఈ విషయమున ప్రవక్త ఉపదేశములను కొన్నిటి నీ క్రింద ఉదహరించుచున్నాను :

"అమ్మినప్పుడు, కొనునప్పుడు, అప్పడిగినప్పుడు ఔదార్యముతో ప్రవర్తించు వానిని భగవంతుడు కరుణించును." (బు. 34 : 16.)

" ఋణస్థుడు కష్టపరిస్థితులలో ఉన్నప్పుడు అతనికి గడువిచ్చినను లేక అతని ఋణమును విడిచివేసినను భగవంతు డట్టివారికి తనకడ ఆశ్రయమిచ్చును." (మస్నద్, I. పుట 73.)

"కష్టపరిస్థితులలో ఉన్న ఋణగ్రస్తునకు కడు విచ్చినవానిని లేక అతని ఋణమును విడిచివేసినవానిని నరకాగ్ని అంటకుండ నేను చేతును. " (మస్నద్, I, పు. 327)

"అప్పును విడిచిపెట్టి వేయు వానికి నేను సంరక్షకుడ నగుదును." (బు.65 ; 1)

ఋణము చేసినవాని ధర్మముకూడ కఠినముగ శాసింపబడినది. "తన అప్పులను సరిగా ఎవడు తీర్చునో మీలో అతడే ఉత్తముడు" అని శ్రీ ప్రవక్త వచనము. ధనికులైనవారు తమఋణములను తీర్చివేయుటలో ఆలస్యము చేయుట దౌర్జన్యమని మహా శ్రీ ప్రవక్త ఉపదేశించుచున్నారు. (బు. 38 ; 1, 2.)

తీర్చనను ఉద్దేశముతో అప్పు తీసినవాడు ధిక్కృతుడని ప్రవక్త వచన మొకటి కలదు. (మస్నద్ II, పుట 417). అప్పులను తీర్చినతర్వాతయే దానాదులు చేయవలె ననియు, అప్పులు తీర్చగా మిగిలిన ఆస్తిని వారసులు పంచుకొనవలె ననియు శ్రీప్రవక్త ఉపదేశించుచున్నాడు. (మస్నద్ I, పుట 79).

*   *   *

౬౦ దీనిపైనను దీనితర్వాత సూక్తముపైనను ఒడంబడికలకును సాక్ష్యమునకును సంబంధించిన 'ఇస్లామీయ లా' ఆధారపడి యున్నది.

بسم الله الرحمن الرحيم

వ్యాఖ్యానము

మూడవ అధ్యాయము

ఇమ్రాన్ వంశము

ఈ అధ్యాయము మదీనాయందు ప్రోక్తమైనది. ఇందు 200 సూక్తములు కలవు. కొందరు 3, 4 సూక్తములు కలిపి చివి 190 సూక్తములే గణించిరి. నేను ఈజిప్టు రాయల్ ఎడిషనును అనుసరించితిని. మన దేశములో అంజుమనె హిమాయతె ఇస్లామ్‌వారు కూడ ఇదే పద్ధతి ననుసరించిరి.

ఇందులో మూసా తండ్రియగు ఇమ్రాన్ లేక అమ్రాన్ పేర్కొనబడుటచే ఈసూరాకు ఈ పేరు వచ్చినది. ఇందులో మొదటి 83 సూక్తములలో క్రైస్తవమత చర్చ చేయబడినది.

శ్రీ ప్రవక్త మదీనాకు వెళ్లిన తర్వాత నజ్రాన్ పట్టణమునుండి 60 మంది క్రైస్తవ పండితులు అబ్దుల్ మసీహ్ అనువాని నాయకత్వము క్రింద ప్రవక్తతో చర్చించుటకు మదీనా నగరమునకు వచ్చిరి. నజ్రాన్ మదీనాకు సమీపమున ఉన్న ఒక క్రైస్తవపట్టణము. అరేబియాచర్చికి ప్రధాన పీఠాధిపతి ఆ కాలములో నజ్రాన్ పట్టణమున ఉండువాడు. ఇందలి మొదటి 83 సూక్తములు ఆ సందర్భమున ప్రోక్తమైనవి.

*   *   *   *

౬౧. "తౌరాత్" మూసాప్రవక్త (Moses) కివ్వబడిన భగవద్గ్రంథముగ ఖుర్ఆన్‌లో పెక్కుచోట్ల చెప్పబడినది. తౌరాతు అన నేమియో స్పష్టముగ తెలిసికొనుట అవసరము. 'ది-లా' అనబడు పాతనిబంధనము (Old Testament) యొక్క భాగమునకు 'తోరా' అందురు. * ఇప్పుడు ఇంగ్లీషు పాత నిబంధనములో ఉన్న మొదటి ఐదు పుస్తకములు (అనగా జెనెసిస్, ఎక్సోడస్, లెవెటికస్, నంబర్స్, డ్యుటెరనోమి)

* పాత నిబంధనము మూడు విభాగములలో విభజింపబడినది: లా, ప్రాఫెట్స్, సామ్స్.

మూసాకు ప్రోక్తమైన 'లా' లేక ధర్మగ్రంథమని ఇటీవలివరకు అనుకొనుచుండిరి. కాని బైబిల్ పరిశోధకులు ఈ మధ్య ఇప్పుడు పాతనిబంధనమున మూసా మున్నగు ప్రవక్తలకు ప్రోక్తమైనవిగా ఇంగ్లీషు బైబిలులో ప్రచురింపబడిన గ్రంథములలో ఎక్కువభాగము ప్రక్షిప్తమనియు, అసలుగ్రంథములు ఎప్పుడో పోయినవనియు కనిపెట్టిరి. పాత నిబంధనముయొక్క కూర్పునుగూర్చి ఒక ప్రాచీన చరిత్రకారుడిట్లనుచున్నాడు:—

"In like manner also Judas (Maccabeus) brought together in addition to all the things *that were lost by reason of the war we had*, and they remain with us."†

ఈ విధముగ యుద్ధకారణముచే నశించిన మూలగ్రంథముల స్థానమున సాట్రి మతాచార్యులు కొత్తగ్రంథములను రచించి యుందురు.

ఇప్పుడు 'తోరా' అనబడుచున్న పాతనిబంధన గ్రంథములు మూసాచే వ్రాయబడలేదను విషయము నిర్వివాదమైనది. అంతేకాదు. అని మూసాకు సమీప కాలముల నైతము వ్రాయబడి యుండలేదు. క్రీ. పూ. 536 లో యూదులు బాబిలోనియానుండి మరలివచ్చిన పిదప వారి ధర్మగ్రంథముల కూర్పు ప్రారంభమాయెను. కొన్ని గ్రంథములీ కాలము తర్వాత వ్రాయబడెను. ఈ ప్రాచీన గ్రంథములు పరిష్కరించి కూర్చిన వారు అసంఖ్యాకములగు పొరపాట్లు కావించిరి. మూల గ్రంథములను ప్రక్షిప్తములనుండి వేరుపరుపజాలకపోయిరి. అందుచే తర్వాత ఎన్నో చిక్కులు సంభవించెను. ఉదాహరణమునకు ఎపాక్రిఫాలోని పెక్కు గ్రంథములిప్పుడు ఇంగ్లీషు బైబిలులో లేవు. అవి ప్రక్షిప్తములని ఇంగ్లీషు బైబిల్ పరిష్కర్తలు నిరాకరించిరి. కాని క్రీ. శ. 1546లో జరిగిన కౌన్సిల్ ఆఫ్ ట్రెంట్ (Council of Trent) లో రోమన్ క్యాథొలిక్ చర్చివారు దీనిని పూర్తిగా గ్రహించి ఈ విధముగ శాసించిరి:

"He is also to be anathema, who does not receive these entire books, with all their parts, as they have been accustomed to be read in the Catholic church, and are found in the ancient editions of the Latin Vulgate, as sacred and Canonical."

(లాటిన్ బైబిలు ప్రతులలో ముద్రించబడిన మొత్తముగ్రంథమును ఏమార్పుయు లేకుండా, ఒక ముక్కయైనా విడిచిపెట్టకుండా నమ్మనివాడు బహిష్కరించబడవలెను.)

† I Maccabeus ii, 14. quoted in Matthew Arnold, *God and the Bible*, P. 106

ఈ అభిప్రాయమును విమర్శించుచు బైబిల్ విద్వాంసులలో మేటియని ప్రసిద్ధికెక్కిన డాక్టర్ చార్లెస్ గారిట్లనుచున్నారు:

"The weight the scholars in general will attach to this decree cannot but be influenced by the fact, that the Prelates who formed this Council none came from Germany or Switzerland or from any of the northern countries; none knew Hebrew, only a few had some knowledge of Greek, and there were some whose knowledge of Latin was of a doubtful character.*

(ఈ పండితులు ఈ వాదానికిచ్చిన ప్రాముఖ్యత ఈ క్రింది కారణాలవల్ల తగ్గక మానదు. ఈ సభకు వెళ్ళిన వారిలో ఎవ్వరూకూడా జర్మనీ నుండిగాని స్విట్జర్లాండు నుండిగాని మరి యే ఉత్తరదేశముల నుండిగాని వచ్చినవారు కారు. వీరిలో ఎవ్వరికీ హెబ్రూభాష తెలియదు. చాలా కొద్దిమందికి మాత్రమే గ్రీకుభాష తెలియును. కొంతమందికి లాటిన్ భాషకూడా తెలియదని చెప్పవచ్చును.)

ప్రొటెస్టెంట్ చర్చివారు హెబ్రూగ్రంథములనే ఒప్పుకొందురు. "అసలు ఈ గ్రంథముల మూలభాష ఏదో, ఏకాలమున ఇవి వ్రాయబడినవో, ఏ ప్రాంతమున వ్రాయబడెనో మున్నగు విషయము లింకను నిర్ధారణ కాలేదు.

('Scholars are far from unanimous as to the original language, date and place of compilation of some of these books....'—Charles, P. 186.)

మూసా ప్రవక్త ధర్మ గ్రంథము దగ్ధము కావింపబడెననియు, తర్వాత క్రీ. పూ. 458-57 ప్రాంతములో 'ఎజ్రా' ఒక ధర్మగ్రంథము రచించెననియు రెండవ ఎస్డ్రాస్ లో చెప్పబడినది. యుద్ధమున మూలధర్మగ్రంథము నశించెనని మెక్కాబీస్‌లో కల వచనముతో ఇది కలిపి చదివిన యెడల ఇది నిజమైయుండునని తోచుచున్నది.

తోరాయొక్క మూలము ప్రాచీన హెబ్రూభాషలో ఉండియుండవలెను. ఇప్పుడు లభించిన పాత నిబంధనముయొక్క అత్యంత ప్రాచీన ప్రతి క్రీ. శ. 916 నాటిది. యూదులు బాబిలోనియాకు వెళ్ళగొట్టబడిన తర్వాత క్రమముగా వారు హెబ్రూభాషను మరచి గ్రీకు భాషను స్వీకరించిరి. అందుచే వారు తమ ధర్మగ్రంథ

* Charles, *Religious Development between Old & New Testaments*, P. 186.

మును కొంతకాలము తర్వాత గ్రీకు భాషలోనికి పరివర్తించుకొనిరి. ఇప్పుడు మూల గ్రంథములుగా భావింపబడుచున్న గ్రంథములు రెండు: (1) గ్రీకుభాషయందలి సెప్ట్యూజింట్ (Septuagint); లాటిన్ భాషయందలి వల్గేట్ (Vulgate). గ్రీకు గ్రంథము వివిధకాలములలో 70 మంది పండితులు వేరువేరుగా వివిధకాలములలో, వివిధప్రాంతములలో కూర్చినది. ఈ పని క్రీ. పూ. 284 లో ప్రారంభమాయెను. ల్యాటిన్ భాషలోనున్న వల్గేట్ క్రీ. శ. 5-వ శతాబ్దములో సెంట్ జెరోమి అనువదించినది. ఈ రెండు కూర్పులును పరస్పర భిన్నములుగ నున్నవి. వల్గేట్‌లో కూడ పెక్కు వివాదాస్పదమైన భాగము లుండిపోయెను. తుదకు పోప్ క్లెమెంటు VIII 1592-1605 సంవత్సరములలో వల్గేటును పరిష్కరించి ప్రచురించెను. ఇప్పుడు రోమన్ క్యాథలిక్కులలో ప్రచారముననున్న గ్రంథమిదే.

పై చర్చవల్ల తేలినదేమనగా పాత నిబంధనకు యొక్క హెబ్రూ మూలగ్రంథము ఇప్పుడు లేదు. ఇప్పుడున్న హెబ్రూ ప్రతులు పరస్పర విరుద్ధముగ నున్నవి. క్రైస్తవులలో రోమన్ కాథలిక్కు లంగీకరించిన వల్గేటునకును, యూదు లంగీకరించిన గ్రీకు గ్రంథమునకు ఎంతయో భేదముకలదు. క్రైస్తవులలో ప్రాటెస్టెంటు శాఖవారు యూదుల గ్రీకు గ్రంథమునే ప్రమాణముగ గ్రహింతురు. ఈ విధముగ మూసాప్రవక్తకు ప్రోక్తమైన తౌరీతు గ్రంథమును, తర్వాతి ప్రవక్తలకు ప్రోక్తమైన ఇతర గ్రంథములును మూలములు నశించి, మూలభాషలో కాక ల్యాటిన్ గ్రీకు భాషలలో ఆ ప్రవక్తల పేర వ్రాయబడియున్నవి. ఇవి అసలు గ్రంథములు కావనియు, అసలు గ్రంథములు పోగా పండితులు రచించిన గ్రంథములనియు, వాటినిప్పుడు యూదులును క్రైస్తవులును పొరపాటున భగవత్ప్రోక్తమగు గ్రంథములుగ భావించుచున్నారనియు దీనివల్ల తేలినది.

ఇంజీల్: ఇప్పుడు ప్రచారములోఉన్న పాత నిబంధన మందలి గ్రంథము లెట్లు ప్రక్షిప్తములో, అదేవిధముగ ఇప్పుడు క్రొత్త నిబంధనము లేక New Testament అనబడుచున్న బైబిల్ భాగము ఏసుక్రీస్తుకు ప్రోక్తమైన భగవద్గ్రంథము కాదు. పాత నిబంధనము వలెనే క్రొత్త నిబంధన మనబడు బైబిల్ భాగము కూడ వివిధకాలములందు, వివిధభాషలందు, వివిధ క్రైస్తవ మతాచార్యులచే ఏసుక్రీస్తు మరణానంతరము దాదాపు ఒక శతాబ్ద ప్రాంతములో వ్రాయబడినది. అవి సైతము మొదట వ్రాయబడిన రూపములో ఇప్పుడులేవు. అసలు ఏసుక్రీస్తు భాషలో ఆయన ఉపదేశములు లేనేలేవు. అనువాదములు, ఆ అనువాదముల కనువాదములు, తిరిగి వాటి అనువాదములు ఈ విధముగ ఈ బైబిల్ గ్రంథములు అసంఖ్యాకమగు మార్పులు పొంది ఈ రూపమును తాల్చినవి.

మ్యాథ్యూ ఆర్నాల్డు *Literature and Dogma* అను తన ఉద్గ్రంథమున క్రొత్త నిబంధనమును గూర్చి దీర్ఘముగ చర్చించి తేల్చిన సారాంశమిది:

"In short, to know accurately the history of our documents is impossible; and even if it were possible we should not yet know accurately what Jesus said and did; for his reporters incapable of rendering it, he was so much above them. As to the character of the documents, however.......it must be remembered that none of the recorders we have, probably, the very original record. The record when we first get it, has passed through at least half a century, or more, of oral tradition, and through more than one written account."*

"(సారాంశ మేమనగా మన గ్రంథముల సరియైన చరిత్ర తెలిసికొనుట అసాధ్యము. ఒకసారి అది సాధ్యమే యైనను ఏసుక్రీస్తు చెప్పిన మాటలుగాని, చేసిన పనులుగాని సరిగా తెలిసికొనుటకు వీలులేదు. వారి మాటలను ప్రపంచమునకు చాటిన వారిందుల కసమర్థులు. ఎందుకనగ ఏసుక్రీస్తు వారికెన్నోరెట్లు మించిన మహామహుడు. ఇంక ఈ బైబిల్ గ్రంథములా — వీటిని రచించిన వారెవ్వరికడను మూల గ్రంథము లేకుండెడిదనియే చెప్పవచ్చును. ఈ విషయములు మొదటిసారి మనకు తెలియనప్పటికే అవి శతాబ్దమువరకు ముఖతః ఉండి, ఒకటికంటె ఎక్కువ రచనా రూపముల వెలువడినవై యుండవలెను.)"

క్రొత్త నిబంధనముయొక్క రచయితలు, వారి కాలములు, వారి రచనల మూలములు, తద్రచనములు ఎవ్వడు ప్రమాణ గ్రంథములుగ స్వీకరింపబడినవి మున్నగు విషయములు క్లుప్తముగ మాథ్యూ ఆర్నాల్డు ఈ విధముగ చెప్పుచున్నాడు:

"But when did the New Testament, in that form in which we possess it, come to be recognised as Scripture like the Old Testament? Clearly the documents composing it appeared at different times, and were not first published to the world as one authorised whole called the New Testament. Clearly there was a time when they had not acquired the authority they possessed afterwards; when people preferred, for instance, to any written narrative, the oral relations of eye-witnesses."

* Matthew Arnold, *God and the Bible* P. 93 - 97.

(ఇప్పుడు మనకున్న రూపములో క్రొత్త నిబంధనము పాత నిబంధనమువలె ఎప్పుడు పవిత్రగ్రంథముగ అంగీకరింపబడినది? దానిలోని వివిధగ్రంథములు వివిధకాలము లందు వెలసినవను విషయము స్పష్టము. ఇవన్నియు ఒకేసారి క్రొత్త నిబంధన గ్రంథముగా ప్రకటింపబడలేదు. అందులోని కొన్నిభాగములు ఒకప్పుడు ప్రమాణముగ స్వీకరింపబడ లేదనుటయు స్పష్టము. వ్రాత ప్రమాణముకంటె నోటిమాటయే యెక్కువ విలువగల కాలమది.)†

క్రీ. శ. 145 లో పేపియాస్ (Papias of Hierapolis) అను ఒక గొప్ప క్రైస్తవ పండితుడు క్రీ. శ. 135 లో జెరూసెలమునందు ఏసుక్రీస్తు శిష్య పరంపర యందలి వారును, పండితులు మున్నగు పెద్దలు నశించిన పిదప ఏసుక్రీస్తు పేర ప్రచారము లోనికి వచ్చిన అబద్ధోపదేశములను నివారించుటకై "ఏసుక్రీస్తు ఉపదేశసారము" (An Exposition of the Sayings of the Lord) అను ఒక పుస్తకమును వ్రాసి ప్రచురించెను. * అతని కాలములో ఇప్పుడున్న క్రొత్తనిబంధనము వంటి గ్రంథము కాని, ప్రమాణభూతమగు మరేగ్రంథము గానిలేదు. అట్టి గ్రంథముండిన ఎడల తప్పక తన గ్రంథమున పేపియాసు పేర్కొని యుండెడివాడే. మొట్టమొదట క్రీ.శ. 180 లో ఐరేనియస్ (Irenaeus) అను ఒక గొప్ప క్రైస్తవాచార్యుడు నాల్గు సువార్తలను పేర్కొనెను. అంతకు పూర్వముండిన ఇగ్నేషియస్ (Ignatius) గాని, పాలికార్ప (Polycarp) గాని, జస్టిన్ మార్టిర్ (Justin Martyr) గాని, క్లెమెంటు (Clement of Rome) గాని నాల్గు సువార్తల (Four Gospels) ప్రసంగ మెక్కడను చేయరైరి.§

క్రీ. శ. 397 లో ఒకటియు, క్రీ. శ. 419 లో ఒకటియు ఈ విధముగ కార్తేజిలో రెండు ధర్మ సభలు (Synods) జరిగెను. ఈ సభలలో మొదటిసారి క్రొత్త నిబంధనము నిర్ణయింపబడెను. క్రీ. శ. 383 లో సెంట్ జెరోమి అను ఒక గొప్ప క్రైస్తవాచార్యుడు పోప్ ఆజ్ఞను సారము నాల్గుసువార్తల లాటిన్ పరిష్కృత అనువాదమును ప్రకటించెను. సెంట్ జెరోమి పండితుడు కార్తేజిలో జరిగిన ధర్మ

† Ibid, P. 113

* Benjamin W. Bacon, *The Making of the New Testament*, P. 131.

§ "But we look in vain in Justin Martyr, or Polycarp or Ignatius or Clement of Rome, either for an express recognition of the four Canonical Gospels, such as we have given from Churchmen who lived later, or for a distinct mention of any one of them."

సభల వారు సంకలిత పరచిన క్రొత్త నిబంధనముపై చేసిన విమర్శనము గమనించ దగినది. ఇప్పుడు బైబిల్‌లోని 19 వ పుస్తకమును (To the Hebrews) లాటిన్ క్రైస్తవులు ప్రమాణ గ్రంథముగ స్వీకరించరనియు, జాన్‌సువార్తను గ్రీకు చర్చివా రంగీకరించుట లేదనియు, 22 వ పుస్తకమును (II Peter) పల్వురు అంగీకరించరనియు, 22వ పుస్తక మగు ఎపిజిల్ ఆఫ్ జేమ్సును ఒక ప్రక్షిప్త గ్రంథముగ భావించుచున్నారనియు, 26-వ పుస్తకమును (Jude) అత్యధిక సంఖ్యాకులు స్వీకరించుట లేదనియు, సెంట్ జాన్ వని చెప్పబడుచున్న మూడుపుస్తకములలో (24, 25 27, నంబర్లు) తరువాతి రెండును సెంట్ జాన్ వ్రాయలేదనియు, జాన్ ది ఎల్డర్ అనువానిచే అవి వ్రాయబడినవనియు ఆయన వ్రాసెను. *ఈ విధముగ క్రొత్త నిబంధన మందలి 27 పుస్తకములలో 7 పుస్తకములు 5-వ శతాబ్ద ప్రారంభములో ప్రమాణ గ్రంథములుగ స్వీకరింపబడలేదని దీనివల్ల స్పష్టమగుచున్నది. ఐనను చర్చివారు వీటిని ప్రమాణములుగ స్వీకరించవలెనని శాసించిరి. చర్చి ఏది చెప్పినను వేదవాక్యముగనే పరిగణింపబడుచు వచ్చినది. ఒక్క 'జెరోమి' యేకాదు, యూసెబియాస్ (Eusebius), ఆరిజెన్ (Origen) వంటి క్రైస్తవాచార్యులు సైతము ఇప్పుడు క్రొత్త నిబంధనములలోనున్న పెక్కు గ్రంథములు తమ కాలములో ప్రమాణ గ్రంథములుగ స్వీకరింపబడుచుండెడివి కావని వ్రాసిరి.

ఇంక మొదటి నాల్గు సువార్తలను గూర్చి వినుడు. పేపియాస్ (క్రీ. శ. 145) కాలములో సెంట్ మాథ్యూ, సెంట్ మార్కు మాత్రమే బహుశః ప్రమాణ గ్రంథములుగ స్వీకరించబడి యుండవచ్చును. క్రీ శ. 100 లో మాథ్యూయొక్క మూలము ప్యాలెస్టయినులో నిరాకరింప బడిన గ్రంథముగ నుండెను. దీని తర్వాత దీని మూడు అనువాదములు—రెండు గ్రీకు భాషయందును, ఒకటి ఆర్మెయిక్ భాషలోను—వచ్చెను. ఇంతకంటె ఎక్కువ అనువాదములు ఉండి యుండవచ్చును. ఇవన్నియు మాథ్యూ నామముతోడనే ప్రచారములో నుండెను. కాని ఇందులో ఎక్కువ భాగము మార్కు సువార్తనుండి గ్రహించి క్రొత్తగా వ్రాయబడినది. మార్కు రోము నగరమున తన సువార్తను వ్రాసెను. సెంట్‌మార్కు ఏసుక్రీస్తు శిష్యుడు కాడు. ఆయన సెంట్ పీటర్ తనకు చెప్పిన ఏసుక్రీస్తు జీవితాంశములను ఉపదేశములను ఒక సువార్తరూపమున వ్రాసెను. అదికూడ పీటర్ చనిపోయిన తర్వాత వ్రాయబడెను. పీటర్ చెప్పిన విషయములు ఒక సువార్త రచించు ఉద్దేశముతో చెప్పినవి కావు. తానప్పుడప్పుడు సందర్భానుసారముగ మార్కుతో చెప్పిన విష

* Matthew Arnold, *Ibid*, P. 115.

యములను మార్కు కొంతకాలము తర్వాత ఒక పుస్తక రూపమున వ్రాసెను. సెంట్ లూక్ కూడ ఎక్కువగ మార్కు సువార్తనుండి విషయములను గ్రహించి తన సువార్తను రచించెను. ఈ ముగ్గురు సువార్త రచయితలును తమకు పూర్వముండిన ఏసుక్రీస్తు ఉపదేశ గ్రంథములనుండి గ్రహించిరనుట నిర్వివాదము.

ఐతే మ్యాథ్యూ మొదట వ్రాసిన పుస్తకము సైతము నశించి దానిస్థానే పెక్కు అనువాదములు వచ్చుటకు కారణ మేమైయుండునో తెలిసికొనుట అవసరము. ఇది కేవల భాషాభేదములవల్ల కల్గిన చిక్కు కాదు. కేవలము అనువాదములలో జరిగిన మార్పుకూడ కాదు. ఈ గ్రంథములు వెలువడు నప్పటికి "ఏసుక్రీస్తు సందేశము" యొక్క ప్రాముఖ్యత సన్నగిల్లి తుదకు "ఏసుక్రీస్తును గూర్చిన సందేశము" యొక్క ప్రాముఖ్యత హెచ్చెను. *

అసలు ఏసుక్రీస్తు ఉపదేశములు కల గ్రంథము ఇప్పుడు మనకడ లేనేలేదు. అప్పుడుండిన గ్రంథములలో ఎక్కడను ఏసుక్రీస్తు సిలువపై ఎక్కిన విషయముకాని పునరుత్థాన విషయముగాని లేకుండెనని పండితులందరంగీకరించిన విషయమే. అందుచే ఏసుక్రీస్తు ఉపదేశములు కేవలము ఉపదేశముగనే కాక ఆయన జీవిత చరిత్రతో చేర్చి వ్రాయవలసిన అవసరము కలిగెను. అందుచే మ్యాథ్యూయును, లూకాయు కూడ మార్కుయొక్క చారిత్రక భావమును గ్రహించిరి. ఇతరపుస్తకములందెక్కడను ఏసుక్రీస్తు చరిత్రాంశములు లేకుండెను.

(There is outside of Mark *no* considerable amount of historical material, Canonical or uncanonical, for the story of Jesus—Bacon. P. 139.)

ఈ ఉన్న చరిత్రాంశములు కూడ ఒక వరుసలో లేవు. ఇది మార్కు చరిత్రాంశములను గ్రహించిన మ్యాథ్యూ లూకులకు తెలిసియు గత్యంతరము లేక వారావరుసను యథాతథముగనే యుంచిరి.

(In short, inco rect as they know the order of Mark to be, it was the best that could be had in the

* "It was impossible to be blind to the conquests made by the Gospel *about* Jesus. Enclosed in it. as part of its substance the Gospel *of* Jesus found its final resting-place, much as the mother church itself was later taken up and incorporated in a Catholic Christendom" (Benjamin W. Bacon, *The Making of the New Testament*, P. 137.)

days when evangelists began to go beyond Syntagus (Collections of Jesus' teachings), and to write "*Gospels*" as we understand them, or, in their own language, "the things which Jesus began *both* to do and to teach."—B. Bacon. P. 140.)

క్రీ. శ. 45_50 సంవత్సరములలో రోముచర్చిని స్థాపించు ప్రయత్నములు జరుగుచుండిన కాలములో మాథ్యూ ఏసుక్రీస్తు ఉపదేశములను చేర్చికూర్చు ప్రయత్నము చేసెను. కాని ఇప్పుడు 'మత్తయిసువార్త' అని మనము చదువుచున్న సువార్త ఆగ్రంథముకాదు. అథమము దాని అనువాదమును కాదు. అట్లనుటకు మూడుకారణములను బేకన్ పండితుడు చూపుచున్నాడు: (1) మొట్టమొదట మ్యాథ్యూ రచించిన గ్రంథము ఉపదేశమాలగాని మార్కుసువార్త వలె ఏసుక్రీస్తు కథకాదు. (2) మ్యాథ్యూ అసలు ఆర్మేయిక్ భాషలో వ్రాసియుండును. ఇప్పుడు మనకున్న మత్తయి సువార్త మూలము గ్రీకు భాషయందున్నది. (3) మొదట వ్రాయబడిన పుస్తకము రచయిత ఏసుక్రీస్తు శిష్యుడు. కాని మన మత్తయి సువార్తకర్త తుదివరకు మార్కుపై ఆధారపడి సువార్తను రచించెను. ఏసుక్రీస్తుతో స్వయముగ పరిచయము కలిగి, ఆయన ఉపదేశాదులను స్వయముగ విన్న ఆయన శిష్యుడు మార్కునేల అనుసరించును? మార్కు ఏసుక్రీస్తు శిష్యుడైనను కాడాయెను. ఈ విధముగ మనము చదువుచున్న సువార్త మత్తయి వ్రాసినదికూడ కాదు. ఇది ఇంతటితో సైత మాగలేదు. మత్తయి సువార్తలో తర్వాత ఎన్నో ప్రక్షిప్తములు చేర్చబడెను:—

("Over and over again special additions are made in Matthew to emphasise a warnig against the workers of 'lawlessness.' "—Bacon, P. 149)

తక్కిన సువార్తలను గూర్చికూడ అట్లే చెప్పవచ్చును. మార్కు సువార్తనుగూర్చి బేకన్ గారు ఇట్లు వ్రాయుచున్నారు:

"The Gospel of Mark is no exception to the rule that church writings of this type inevitably undergo recasting and supplementation until the advancing process of canonization at last fixes their text with unalterable rigidity. Whether we recognise 'sources' or earlier 'forms' or only earlier 'ed tions' of Mark, it is certain that appendices could still be attached long after the appearance of Luke, and probable that in the early period of its purely local currency at

Rome the fund of Petrine anecdote had received more than one adaptation of form before it was carried to Syria and embodied substantially as we now have it in the composite Gospels of Matthew & Luke."

(Ibid, P. 170)

ఈ విధముగ ఒక్కొక్క విషయమును గూర్చి ఎంతేని వ్రాయవచ్చును. క్రొత్త నిబంధనమందలి నాల్గు పుస్తకముల రచనా కాలములను గూర్చి వివిధ బైబిల్ పండితుల అభిప్రాయములను ఈ ప్రక్క క్రోడీకరించుచున్నాను :—*

సువార్త పేరు	కాలనిర్ణయము చేసిన పండితుని పేరు.	కాలము
1. సెంట్ మ్యాథ్యూ	బాఉర్ (Baur)	క్రీ. శ. 105 - 10
	సి. ఆర్. కాస్ట్లిన్ (C. R. Costlin)	ప్రస్తుతరూపములో క్రీ. శ. 90 నుండి 100 మధ్యవరకు. అసలు మూలగ్రంథము క్రీ. శ. 70 మొ. 80 వరకు.
	హిల్గెన్ ఫెల్డ్ (Hilgenfeld)	క్రీ. శ. 80
2. సెంట్ మార్క్	సి. ఆర్. కాస్ట్లిన్ (C. R. Costlin)	క్రీ. శ. 100
	కియెమ్ (Kiem)	క్రీ. శ. 100
	హిల్గెన్ ఫెల్డ్ (Hilgenfeld)	క్రీ. శ. 100
3. సెంట్ లూక్	బాఉర్ (Baur)	క్రీ. శ. 150
	జెల్లర్ (Zeller)	క్రీ. శ. 130
	హిల్గెన్ ఫెల్డ్ (Hilgenfeld)	క్రీ. శ. 120
4. సెంట్ జాన్	బాఉర్ (Baur)	క్రీ. శ. 160
	కియెమ్ (Kiem)	క్రీ. శ. 110 - 117

ఈ విధముగ ఏసు క్రీస్తు మరణానంతరము నూరేండ్లకు పైగా వ్రాయబడిన ఈ గ్రంథములు భగవత్ప్రోక్త మెట్లగును ? వివిధ రచయితలు, వివిధ కాలములలో, వివిధ దేశములలో, వివిధ భాషలలో, వివిధమగు ఉద్దేశములతో రచించిన వివిధ గ్రంథముల కూర్పే ఇప్పుడు ప్రచారములో నున్న బైబిల్ గ్రంథము. ఇది ఏసుక్రీస్తుకు ప్రవచింపబడిన గ్రంథము కాదనియు, ఏసుక్రీస్తుకు ప్రవచింప

* Christlieb పండితుని "*Modern Doubt and Christian Belief*" అను గ్రంథమునుండి సంగ్రహించి కూర్చిన విషయము లివి.

బడినదిగా చెప్పబడిన బైబిల్ గ్రంథము ఎన్నడో నశించినదనియు, దానిస్థానే వివిధ గ్రంథములు వ్రాయబడి బైబిల్ అను నామమున ప్రచారములో నున్నదనియు చెప్పుటకే ఇంత దీర్ఘముగ వ్రాసితిని. ఈ విషయమునుగూర్చి ఇంకను వివరములు తెలుసుకొన గోరువారు ఈ క్రింది గ్రంథములను చూడవలెను :

New Testament

R. W. Mackay	:	Rise and Progress of Christianity. ✓
G. R. S. Mead	:	The Gospel and the Gospels.
B. W. Bacon	:	Making of the New Testament. ✓
R. Hone	:	The Apocryphal New Testament. ✓
E. Reuss	:	History of the New Testament. 2 Vols.
P. Wernle	:	The beginnings of Christianity. 2 Vols
O. Pfeiderer	:	Christian Origin. 4 Vols. ✓
W. Wrede	:	The origin of the New Testament. ✓ (An admirable Primer)
Matthew Arnold	:	Literature and Dogma.
,,	:	God and the Bible.

Old Testament

G. F. Moore	:	Literature of the Old Testament. ✓
G. E. Hammond	:	Outlines of Textual criticisms. ✓
Matthew Arnold	:	Literature and Dogma. ✓
,, ,,	:	God and the Bible. ✓
R. H. Charles	:	Religious Development between the Old and New Testaments. ✓

* * * *

౬౨. ఖుర్ ఆన్ లో రెండు విధములైన సూక్తములు కలవనియు అవి "(1) మహకమాత్ (2) ముత్ షాబిహాత్" అనబడుననియు ఈ సూక్తమున చెప్పబడినది. 'మహకమాత్' సూక్తములు మూలసిద్ధాంతములను ప్రతిపాదించునవి. అవి స్పష్టముగ నున్నవి. వాటిలో అపార్థములకుగాని, అర్థాంతములకుగాని స్థానము లేదు. ఇవి సర్వ మతగ్రంథములందును మూలసిద్ధాంతములై యుండునవని 'సయీద్ బిన్ జుబైర్' అనుచున్నారు. ఇవి సర్వమతస్థులును అంగీకరించు మూలసిద్ధాంతము అని హజరత్ ముఖాతిల్ అభిప్రాయము. * ముతషాబిహాత్ సూక్తములు పైమూలసిద్ధాంతములను వివరించుట కివ్వబడిన ఉదాహరణములు, ఉపమానములు, ఉపాఖ్యానములు మున్నగునవి కలసూక్తములు.

వివిధార్థములకు తావిచ్చుట మానవభాషలో గల లోపము. వ్యాఖ్యాత తన

* ఈ అభిప్రాయములు తఫ్సీరె ఇబ్నెకసీర్ లో ఉద్ధృతమైనవి.

ఇష్టము ననుసరించి ఒక వాక్యము యొక్క అర్థమును చెప్పగలుగుచున్నాడు; ఒక్కొక్కప్పుడు పొరపాటుపడుచున్నాడు; ఒక్కొక్కప్పుడు చేయవలెనని చేయుచున్నాడు. అసలు మతములు పోయి తర్వాత పండితుల మతము లిట్లే స్థాపితమైనవి. ప్రస్థానత్రయమునకు శంకర రామానుజ మధ్వాచార్యులు వివిధభాష్యములొనర్చి అద్వైత విశిష్టాద్వైత ద్వైత మతములను స్థాపించినారు. అదే విధముగ ఆనాటి ఆచారముననుసరించి ఏసుక్రీస్తు భగవంతుని 'నాతండ్రీ!' అని పిలిచినంతమాత్రమున క్రైస్తవాచార్యులు ఏసుక్రీస్తు భగవంతుని కుమారు డనినారు.* శబ్దప్రమాణముపై తగవులాడుకొని మతాచార్యులు వివిధమత భేదములలో చిక్కుకొనినారు. అందుచే ఖుర్ఆన్ ఈ విషయమును స్పష్టముగ చెప్పివైచినది. మూలసిద్ధాంతములను ప్రతిపాదించు సూక్తములలో అర్థాంతరములకుగాని, అపార్థములకుగాని తావు లేదు. ఉపమానములును, ఉపాఖ్యానములును, ఉదాహరణములును కల సూక్తములు వ్యాఖ్యానించునప్పుడు ఆ వ్యాఖ్యానము మూలసిద్ధాంతములకు వ్యతిరేకముగ నుండకూడదనియు, ఆ సూక్తముల వ్యాఖ్యానములలో పడి తగవులాడుకొనుచు మూలసిద్ధాంతములను దృష్టినుండి తొలగించవలదనియు శ్రీ ప్రవక్త ఈ సందర్భమున ఉపదేశించుచున్నారు. ప్రవక్త వాక్యములు గమనింపుడు : "ముతషాబిహాత్ సూక్తములనుగూర్చి తగవులాడుకొనువారిని విడిచిపెట్టుము." (బు) ముతషాబిహాత్ సూక్తములనుగూర్చి తగవులాడుకొనియే మతముల నన్నిటిని పండితులు మార్చివైచిరి. ఇస్లామున కట్టి విపత్తు సంభవించకుండ ఖుర్ఆన్ హెచ్చరించుచున్నది.

*   *   *   *

౭౩. ఇందు బదర్ యుద్ధరంగమును గూర్చి చెప్పబడినది. ఆ యుద్ధమున ముసల్మానుల సంఖ్య 313. అవిశ్వాసుల సంఖ్య 900 మొదలు 1000 వరకు ఉండెను. ఐనను ఆ యుద్ధమున ముసల్మానులకే విజయము కలిగెను. భగవత్సహాయమున కిదొక ఉదాహరణము.

---

* 'Jesus made use of the figurative language familiar to the theocratic mind' (Schenkel, *Sketch of the character of Christ*, P. 145)

"Christ applies to himself the designation of the 'Son of God' in no other sense than that in which the People of Israel or the theocratic King might be so called." (*Ibid*, P. 177)

ముసల్మానుల సంఖ్య అవిశ్వాసుల సంఖ్యలో మూడవవంతు యుండినను, అవిశ్వాసులకు ముసల్మానులు తమకంటె రెండింతలు కన్పించుచుండి రనియు ఇక్కడ అర్థము చెప్పవచ్చును.

మక్కావాసుల దౌర్జన్యమును సహింపలేక శ్రీ మొహమ్మద్ ప్రవక్త మదీనాకు రహస్యముగ వెళ్ళిపోయిరి. కాని మక్కావాసులగు ఖురైషులు శ్రీప్రవక్తను మదీనాలో కూడ శాంతితో జీవితము గడపనివ్వరైరి. శ్రీ ప్రవక్త మదీనాకు పలాయితులైన రెండవయేడే ఖురైషులు ఒక గొప్ప సైన్యమును తయారుచేసి మదీనాపై కెత్తివచ్చిరి. ముసల్మానులు నగరములో 313 గురు మాత్ర ముండిరి. ఆయుధములా లేవు ; యుద్ధను చేయుటయం దనుభవమా సున్న ; శత్రుపక్షమున వెయ్యిమంది యుద్ధకళయం దారితేరిన యోధులు. ఐనను ముసల్మానులకే విజయము లభించెను. అవిశ్వాసులకు సంపూర్ణమగు అపజయము కల్గెను.

*   *   *

౭౪. భార్యాపుత్రాదులు, ధన ధాన్యములు మున్నగు ఐహికవాంఛలు మానవునకు ప్రియములే కాని నిజమైన విలువ వీటిలో లేదు. పారలౌకిక సుఖములే వాంఛింపదగినవని ఖుర్ఆన్ ప్రబోధించుచున్నది.

*   *   *   *

౭౫. ఖుర్ఆన్ తాను బోధించిన మతమును 'ఇస్లామ్' అని పిలుచుచున్నది. ప్రపంచ మహామతములలో దేనికిని ఒక పేరు లేదు. ఏసుక్రీస్తు మతమునకు క్రైస్తవమత మనియు, గౌతమబుద్ధుని మతమునకు బౌద్ధమత మనియు అదే విధముగ మతకర్తల నామములతో ఆయామతములు ప్రసిద్ధికెక్కినవి. *

---

* "ఇస్లామ్"ను మొహమ్మదీయ మతమని ఐరోపీయులు వ్రాసిరి. కాని ఇది ముసల్మాను సంప్రదాయము కాదు. ఖుర్ఆన్‌లోగాని, ఇస్లామ్‌మతమునకును చరిత్రకును సంబంధించిన మరే గ్రంథమునగాని "మొహమ్మదీ"అను పేరు ముస్లిమ్‌లకు వాడబడలేదు. ఖుర్ఆన్ బోధించిన మతమునకు "ఇస్లామ్" అనియు, ఆ మతము ననుసరించువారిని ముసల్మాను లనియే వాడిరి. ఈ విషయమునుగూర్చి ఒక క్రైస్తవ పండితుడు ఏమనుచున్నాడో చూడుము :

"The habitual want of comprehension of the ordinary representatives of either religion with regard to the other extends to almost insignificant details, such as for instance the term 'Mohomadan'

ఖుర్ఆన్ ఇచ్చిన "ఇస్లామ్" అను నామము శ్రీ మొహమ్మద్ ప్రవక్త బోధించిన మతమునకే కాదు, భగవంతునిచే వివిధకాలములందు వివిధ దేశములందు వివిధప్రవక్తలకు ప్రోక్తమైన మూలమతమునకు "ఇస్లామ్" అను నామమును ఖుర్ఆన్ ప్రతిపాదించుచున్నది.

ఇబ్రాహీమ్ ప్రవక్త తన పుత్రులను, యాకూబు (Jacob) తన పుత్రులకును "మీరు ముస్లిమ్లైగాని మరణింపకుడు." అని ఉపదేశించినట్లు ఖుర్ఆన్ వక్కాణించుచున్నది. (2 : 131 - 133)

'ఇస్లామ్' అనగా 'శాంతిని ప్రవేశించుట' లేక 'శాంతి వహించుట' అని అర్థము. "ఇస్లామ్" 'సలమ్' అను ధాతువునుండి వచ్చినది. 'సలమ్' అనగా 'శాంతి.' ఆత్మశాంతిని పొందినవాడు ముస్లిమ్. భగవదిచ్ఛకు సమస్తమును సమర్పించినప్పుడే ఆత్మశాంతి లభించును. ఖుర్ఆన్‌లో 'అస్లమ్' అను క్రియ 'భగవదిచ్ఛకు సమస్తమును సమర్పించుట' అను అర్థములో పెక్కుచోట్ల వాడబడినది. భగవదైక్యము, మానవైక్యత—ఈరెండు సిద్ధాంతములును మానవుని ఆత్మశాంతికి మూలాధారములుగ ఖుర్ఆన్ పేర్కొనుచున్నది. ఏకైకుడగు భగవంతుని తప్ప మరెవ్వరిని ఆరాధింపకుండుటయు, ఏకైకుడగు ఆ భగవంతునితప్ప మరెవ్వరికడను సహాయమపేక్షింపకుండుటయు, ఏకైకుడగు భగవంతుని ముందు తప్ప మరెవ్వరిముందును తన శిరస్సును వంచకుండుటయు, ఇవి మానవునియందు వ్యక్తిత్వమును, ఆత్మవిశ్వాసమును, ఔన్నత్యమును కల్గించుచున్నవి. అతని శాంతిదాంతులకదే మూలాధారమగుచున్నది. ఇది ఆధ్యాత్మిక శాంతి. ఇంక మానసికమగు శాంతి కల్గుటకు మానవై-

applied to Musalmans. This expression is an improper transposition of the term 'Christian' which is perfectly applicable to the adherents of religion based on Christ, whose presence is perpetuated in the Eucharist and in the mystic body, whereas Islam is not based directly on the prophet but on the conception of Allah, and does not consist in a perpetuation of Muhammad but in ritual and legislative conformity of Man and Society to the Supreme Unity."

(*Frithjof Schuon in an article entitled 'Christianity and Islam' in Triveni*, Vol. VIII, No. I, 1935).

క్యత అవసరము. మానవు లందరును ఒకరికొకరు సమానులని అనుకొనినప్పుడే పరస్పరసంఘర్షణము నశించును. జాతి, కుల, వర్ణ, దేశ, ధన, భేదములు కారణముగా ఇప్పుడు ప్రపంచమున జరుగుచున్న సంఘర్షణము మానవైక్యతా సిద్ధాంతమును ఇంతవరకు ప్రపంచ మంగీకరించక పోవుటచేతనే కలుగుతున్నది. ఇస్లామ్ ఈ భేదముల నన్నిటిని రూపుమాపి మానవైక్యతను స్థాపించినది. శాంతికి రెండు మూలాధారములలో మానవైక్యతను రెండవదిగ ప్రతిపాదించినది.

ఈ సూక్తములో మతమునకు 'దీన్' అను శబ్దము ఖుర్ఆన్ ఉపయోగించుచున్నది. 'దీన్' అనగా మూలమతము లేక మూలధర్మము. 'మిల్లత్' అను మరియొక శబ్దము మతమునకు పర్యాయపదముగా ఉపయోగింపబడినది. కాని ఈ రెండు శబ్దములలో కల భేద మిది: 'దీన్' అనగా మూలమతము; 'మిల్లత్' అనగా ఆ మూలమతముతోపాటు ఒక ప్రవక్త తన దేశకాలపాత్రానుసారముగా ప్రతిపాదించు ధర్మము.

ఈ మూలధర్మమే ఇక్కడ పేర్కొనబడుచున్నది. దీనినే ఖుర్ఆన్ మానవుని ప్రకృతి సిద్ధమైన ధర్మముగ కూడ చెప్పుచున్నది.

"నిశ్చయముగ భగవంతునికడ నిజమైన మతము ఇస్లామ్" అని ఖుర్ఆన్ ఇక్కడ వక్కాణించుచున్నది. ఖుర్ఆన్ ప్రతిపాదించిన ఈ మతమునకును ఇతరమతములకును గల వైధర్మ్య మేది యన్న ప్రశ్న వచ్చును. మూలధర్మమునకు ఆధారములుగ పైన పేర్కొనబడిన రెండు ధర్మములు-భగవదైక్యత, మానవైక్యత-మరే మతమునను నిజమైన అర్థములో లేవు. మతము లన్నియు భగవంతు డొక్కడే అని అంగీకరించినవి. కాని బహుదైవతారాధనమును ధర్మ్య మొనర్చినవి. ఏకైకుడగు భగవంతుడే ఈ మతములలో విభాజ్యుడైనాడు. క్రైస్తవమతములో తండ్రిగను, కుమారునిగను, పరిశుద్ధాత్మగను విభజింపబడినాడు. హిందూమతములో భగవంతుడు అవతారములు దాల్చి వేలకొలది ఆరాధ్యదైవతములుగను, భార్యలు, పుత్రులు, సేవకులు ఇత్యాది సిబ్బందితో కోట్లకొలది ఆరాధ్యదైవతములకు మూలమైనాడు. అదేవిధముగ ఇతర మతములలో కూడ ఏకేశ్వరుడు ఏదో ఒక విధముగ బహుదైవతములుగ మారినాడు. ఇంక మానవైక్యతకు ఇతర మతములలో స్థానమే లేకుండపోయినది. భారతదేశమున జాతి, కుల, దేశ, వర్ణ భేదములపై నిర్మింపబడిన హెచ్చు తగ్గులు అసంఖ్యాకముగనున్నవి. క్రైస్తవులలో వర్ణభేదములను పాశ్చాత్యశాస్త్రజ్ఞానముకూడ మార్చలేకపోయినది. ఈ మతస్థుల మతగ్రంథములు కూడ ఇదే బోధించుచున్నవి.

(X)

ఇంక ఖుర్ ఆన్ బోధించుచున్న ధర్మము చూడుడు. క్రైస్తవులు ఏసుక్రీస్తునే నమ్మెదరు. మరొక ప్రవక్తను వారు స్వీకరింపరు. అదేవిధముగ వారు బైబిల్ గ్రంథము నొక్కదానినే భగవద్గ్రంథముగ స్వీకరింతురు. ఇతర మతగ్రంథములను గౌరవింపరు. అదేవిధముగ భారతదేశమునందు వర్ధిల్లిన ఋషులను మాత్రమే హిందువులు సత్యప్రవక్తలుగ నంగీకరింతురు. అట్లే వేదములు; తత్సంబంధమగు గ్రంథములను మాత్రమే ప్రమాణ గ్రంథములుగ అంగీకరింతురు. కాని ఖుర్ఆన్ సర్వకాలములందు సర్వ దేశములందు వర్ధిల్లిన ప్రవక్తలను, వారి గ్రంథములను విశ్వసింపుడని బోధించుచున్నది. ఖుర్ఆన్ మాటలను వినుడు:

"ఓ విశ్వాసవంతులారా! ఇట్లనుడు: 'మేము భగవంతుని యందును, మాకు ప్రోక్తమైన (ఖుర్ఆన్) గ్రంథమునందును, ఇబ్రాహీం, ఇస్మాయీల్, ఇస్హాక్ ప్రవక్తలకును, యాకూబు సంతతివారికిని ప్రోక్తమైన గ్రంథములందును, మూసాకును ఈసాకును, ప్రోక్తమైన గ్రంథములందును, (అంతేకాదు) ప్రపంచమున నుద్భవించిన సమస్తప్రవక్తలకు ప్రోక్తమైన ఉపదేశములందును విశ్వసింతుము. ఈ ప్రవక్తలలో ఎవ్వరియెడను మేము భేదభావమును చూపము. ఏకేశ్వరునకే వినతులమగుదుము. (2:136)

"భగవత్ప్రవక్త తనకు ప్రోక్తమైన ఈ వచనములను విశ్వసించుచున్నాడు. విశ్వాసవంతులుకూడ అట్లే విశ్వసించుచున్నారు. వారందరు అల్లాను, అతని దేవదూతలను, అతని (చే ప్రోక్తమైన) గ్రంథములను, అతని ప్రవక్తలను అట్లే విశ్వసించుచున్నారు. (వారిట్లందురు:) 'ఏ ప్రవక్త యెడను మేము భేదభావమును చూపము(1:285)

''ప్రవక్త నెలయని జాతి లేదు.' (35 : 24)

"ప్రతిజాతికి ఒక ప్రవక్త కలడు." (10: 47)

"నేను పంపిన ప్రవక్తలపేర్లను ఇంతకుపూర్వము వాకుచ్చితిని. (పెక్కురు) ప్రవక్తల పేర్లు నీకు చెప్పలేదు." (4 : 164)

ఖుర్ఆన్‌లో ఇరువదైదుగురు ప్రవక్తలపేర్లు మాత్రము పేర్కొనబడినవి. 124,000 మంది ప్రవక్త లుద్భవించిరని శ్రీప్రవక్తవచనము.

మూలమతము (దీన్) ఒక్కటే యనియు, అదే మానవుని ప్రకృతియందు స్థగితమై యున్నదనియు, వివిధ ప్రవక్తలు తమ దేశకాలపాత్రానుసారముగ ఈ మూలమతము (దీన్) తోపాటు ఒకజీవితవిధానమును (మిల్లత్) బోధించి రనియు ఖుర్ఆన్ చెప్పుచున్నది. ఖుర్ఆన్ దృష్టిలో సత్యము సనాతనమైనది. అంతేకాదు అది ఒక్కటి. దేశ కాల పాత్రముల ననుసరించి అందు మార్పుండదు. జీవిత విధానము

నకు సంబంధించిన ధర్మము (మిల్లత్) లో మార్పులుండుట సహజము. కాని మూల మతము (దీన్) లో మార్పుకు తావులేదు. ఈ విధముగ ఖుర్ఆన్ ఒకే భగవంతుడు, ఒకే సత్యము, ఒకే మానవజాతిని ప్రతిపాదించుచున్నది. ఈ మతమునే ఖుర్ఆన్ ఇస్లామ్ అని పిలుచుచున్నది. ఇదే మానవుని మతమని నిర్ధారణచేయుచున్నది. ''నిశ్చయముగ భగవంతునికడ నిజమైన మతము ఇస్లామ్'' అను ఈ సూక్తమునకర్థ మిదే. భగవదైక్యము, మూలమతైక్యము, మానవ జాత్యైక్యము ఇస్లామ్ మతమునకు మూల సూత్రములు.

ఈ సూత్రములను తెలిసియుండియు పెక్కు మతస్థులు వీనిని స్వీకరింపకుండ నున్నారని ఖుర్ఆన్ చెప్పుచున్నది. చూడుడు: అన్ని మతములును భగవంతు డొక్కడే యని ఒప్పుకొనుచున్నవి. కాని ఏకేశ్వరారాధనము ఏ మతమునను లేదు. ఏసుక్రీస్తును భగవదవతార మనియు, భగవంతుని కుమారు డనియు, భగవంతుడే యనియు క్రైస్తవాచార్యులు త్రిత్వమును ప్రతిపాదించిరి. అదేవిధముగ వందలకొలది దైవములు హిందూమతమున ఆరాధనీయులైరి. భగవదైక్య సిద్ధాంతము భగ్నమైన పిదప మానవైక్య సిద్ధాంతము, కొన్ని మతములలో నామమాత్రముగ నిలిచిపోయెను. కొన్ని మతములలో స్పష్టముగ నిరాకరింపబడెను. మతైక్య సిద్ధాంతము కేవలము క్రొత్తది. ఇది ఇప్పుడున్న ధర్మగ్రంథములలో ఖుర్ఆన్ ఒక్కటే బోధించుచున్నది. మూలమత మొకటే యనియు ప్రపంచమందలి సర్వదేశములందును భగవంతుని ప్రవక్తలు వచ్చిరనియు, వారికి ప్రోక్తమైన, ధర్మములను విశ్వసింపవలెననియు మరే మతము బోధించలేదు. ఖుర్ఆన్ ఒక్కటే అట్లు బోధించినది.

ఈ విధముగ భగవదైక్యాది సిద్ధాంతములు తెలిసియుండియు వివిధమతములు ఆ సిద్ధాంతములను మరచి, వాటికి వ్యతిరేకమగు సిద్ధాంతములను ప్రతిపాదించిన వని ఖుర్ ఆన్ చెప్పుచున్నది.

* * * *

౬౬. ఇది యుద్ధసమయపు ఆజ్ఞ. ఖుర్ ఆన్ లో మరొకసూక్తమున (60 : 8,9) ఈ విషయము స్పష్టపరుపబడినది:

"మీరీ మత మవలంబించినందుకై మీతో యుద్ధము చేయక, మిమ్ములను మీ ఇండ్లనుండి వెళ్ళగొట్టక (మీతో సఖ్యమునకున్న అవిశ్వాసులతో) మీరు సౌహార్ద్రముతోడను, న్యాయముతోడను ప్రవర్తింపుడు. నిశ్చయముగ భగవంతుడు న్యాయప్రవర్తనులను ప్రేమించును.

"మీరీ మత మవలంబించినందుకై మీతో యుద్ధము చేయువారితోడను, మిమ్ములను మీ ఇండ్లనుండి వెళ్ళగొట్టువారితోడను, మిమ్ములను వెళ్లగొట్టుటయందు (మీ

శత్రువులకు) సాయపడువారితోడను(మాత్రమే) సఖ్యము చేయుటను భగవంతుడు నిషే ధించుచున్నాడు. వారితో స్నేహము చేయువారు అధర్మపరులు."

*　　　*　　　*

౬౭. ఏసుక్రీస్తు సిలువపై మరణించెనని క్రైస్తవులు నమ్ముచున్నారు. ఏసు ప్రవక్త అట్లు సిలువపై మరణించలేదనియు, ఆయన సహజమగు మరణమునే పొందె ననియు ఇక్కడ ఖుర్ ఆన్ చెప్పుచున్నది. 4 వ అధ్యాయము 157 వ సూక్తములో ఈ విషయము మరియు స్పష్టముగ నిట్లు చెప్పబడినది :

"వాస్తవమేమనగా వారతనిని (ఏసుక్రీస్తును) చంపనూలేదు, సిలువపై ప్రాణ ముల తీయనూలేదు. వారికా విషయము సందేహాస్పదము కావింపబడెను. ఈ విషయ మున వివాదపడినవారు సందేహములలో మునిగియున్నారు. వానినిగూర్చి వారికడ నిశ్చయజ్ఞానము లేదు వారి కున్నది ఊహామాత్రజ్ఞానమే. వారు అతనిని చంపలేదనుట నిశ్చయము."

ఏసుక్రీస్తు సిలువపై మరణించెననియు, తరువాత సమాధిలో పాతిపెట్టబడె ననియు, అట్లు పాతిపెట్టబడిన మూడవ దినమునాడు జీవితుడై లేచెననియు క్రైస్తవుల విశ్వాసము. ఏసుక్రీస్తు సిలువపై మరణించలేదనియు, సిలువపై మూర్ఛపోయెననియు సిలువపైనుండి దించిన మూడవ దినమునాడు మూర్ఛ తేరుకొని తన శిష్యులకు దర్శన మిచ్చెననియూ పెక్కురు పాశ్చాత్యపండితుల అభిప్రాయము.* బాసిలైడెస్ అను పండితుడు ఏసుక్రీస్తు అసలు సిలువపైననే ఎక్కింపబడలేదనియు, ఏసుక్రీస్తు బదులు సైమన్ అనువాతడు సిలువపై ఎక్కింప బడెననియు బోధించెనని స్ట్రాఉస్ పండితు డనుచున్నాడు. ఆ పండితునిమాట లివి :

"Basildes the Gnostc is said to have taught that Simon was crucified in the place of Jesus."

(Strauss, *A New Life of Christ, Vol. II, P. 867.*)

* "On the one hand, the reality of Christ's *death* was denied and reduced to a mere *trance*, so that the resurrection would be perfectly natural *recovery from a deep swoon.* On the other hand; the reality of our Saviour's death was confessed, but the *resurrection* as an *outward* fact denied, and the origin of the belief in it attributed to visions experienced by the disciples.

—Christliebe, *Modern Doubt and Christian Belief,* P. 4. 55

ష్లీయర్ మాషర్ (Schleiermacher) పండితుడు తన Life of Christ (క్రీస్తు జీవితచరిత్రము) అన్న ఉద్గ్రంథములో ఈ విషయమును దీర్ఘముగ చర్చించినాడు. ఈ పండితుని పూర్వమును, తర్వాతను కూడ పల్వురీవిధముగ తామభిప్రాయపడుట కిచ్చిన ఆధారముల నీక్రింద క్రోడీకరించుచున్నాను :

1. ఏసుక్రీస్తు కొన్ని గంటలు మాత్రమే సిలువపైనుండెను.

ఏసుక్రీస్తు సిలువపై సుమారు ఆరుగంటల కాల ముండినట్లు తెలియుచున్నది.* సిలువపై ఎక్కించిన వారు అంత త్వరగా చచ్చువారు కారు. రెండు మూడు దినముల వరకు వారు బ్రతికియుండుట కలదనుటకు ఆధారము లెన్నియో కలవు.§ అందుచే ఏసు క్రీస్తుకు మరణము సంభవించలేదు. ఆయన మూర్ఛపోయి యుండును.

2 ఏసుక్రీస్తుతో సిలువపై ఎక్కించిన మరి ఇద్దరు సిలువపై క్రిందకు దింపబడి నప్పుడు చావలేదు.

3. ఆయనతో సిలువపై ఎక్కించబడిన దొంగ లిద్దరియొక్క కాళ్ళు విరగగొట్ట బడెను. ఏసుక్రీస్తు నట్లు చేయరైరి.

4. ఏసుక్రీస్తు ప్రక్కను పొడిచినప్పుడు రక్తము వచ్చెను. ఆయన బ్రతికియుండె ననుట కిదొక తార్కాణము.

5. ఇంత త్వరలో చచ్చిపోయెనని పైలేటుకూడ నమ్మలేదు. (మార్కు 15:44)

6. తక్కిన ఇద్దరివలె ఏసుక్రీస్తు పాతిపెట్టబడలేదు. ధనికుడగు ఒక శిష్యున కొప్పజెప్పబడెను. ఆశిష్యుడాయనను ఒక కొండలో తొలచబడిన విశాలమైన గదిలో ఉంచి సర్వోపచారము లొనర్చెను. †

* Dean Farrar, *Life of Christ,* P. 449; Neander, *Life of Jesus Christ,* P. 472.

§ "The crucified person suffered a lingering and very painful death, sometimes surviving till the third day, and even longer."

Rev. Barrows, *Biblical Geography and Antiquities,* P. 462.

"The crucified often lived for many hours—nay, even for two days." Farrar, *Life of Christ,* P. 452.

† "Having obtained the sought-for permission, Joseph provided himself with a winding sheet of fine linen and the necessary bandages, and set out for the place of the skull."

Pappini Giovani, *The Story of Christ* P. 408.

(y)

7. మూడవనాడు గుహాముఖమున నున్న రాయి తొలగింపబడి యుండెను.

8. తరువాత ఆయనను చూచిన మేరీ మాగ్దలీను ఆయనను తోటమాలియని భ్రమించెను. (జాన్, 20 : 15.) ఏసుక్రీస్తు ఆ గుహనుండి అన్యులకు తెలియకుండుటకై తోటమాలి వేషము వేసుకొని వెళ్ళినట్లు దీనివల్ల స్పష్టమగుచున్నది. ఏసుక్రీస్తు నిజముగా మరణించి తిరిగి లేచియుండినచో ఈ ప్రచ్ఛన్న వేషమేల? మేరీ మాగ్దలీను ప్రచ్ఛన్న వేషధారియగు ఏసుక్రీస్తు పాదములు మ్రొక్కినప్పుడు ఆయన పాదములందు మేకులు కొట్టిన గాయములు స్పష్టముగ ఉండెను. * దివ్యశరీరముతో ప్రత్యక్షమైనప్పుడు గాయములుకూడ ఉండునా? శిష్యులకు దర్శన మిచ్చినప్పుడు సైతము గాయములన్నియు యథాతథముగనే యుండెను. ఏసుక్రీస్తు అదే శరీరముతో ఉండెను.

9. ఏసుక్రీస్తుకు ఆకలివేసి తన శిష్యులతో భోజనము చేసెను. (లూకు 24 : 39_43)

10. ఏసుక్రీస్తు ఇద్దరు శిష్యులతో కలిసి గాలీలీకి ప్రయాణము చేసెను.

11. ఏసుక్రీస్తు ప్రచ్ఛన్నముగనే సంచరించెనని స్పష్టముగ కన్పించుచున్నది.

12. తాను పట్టుబడుటకు పూర్వము ఏసుక్రీస్తు రాత్రియంతయు తనకు అవమానకరమగు చావునుండి తప్పించవలసినదని భగవంతుని ప్రార్థించెను. ఈ ఘట్టమును డీన్ ఫారర్ గారు ఎట్లు వర్ణించిరో చూడుడు :

"A grief beyond utterance, a struggle beyond endurance, a horror of great darkness, a giddiness and stupefaction of soul overmastered Him; as with the sinking swoon of an anticipated death. It was a tumult of emotion which none must see. 'My Soul,' he said, 'is full of anguish even unto death, stay here and keep watch.' Reluctantly he tore Himself away from their sustaining tenderness and devotion, and retired yet farther, perhaps out of the moonlight into the shadow. And there until slumber overpowered them, they were conscious of how dreadful was that paroxism of prayer and suffering through which He passed. They saw Him sometimes on His knees, sometimes outstretched in prostrate supplication upon the damp ground; they heard snatches of sounds

---

* "Falling on her knees in the wet grass, she laid her loving hands upon those bare feet that still showed the red prints of the nails."

Pappini Giovani, *Ibid* P. 417.

of murmured anguish in which His humanity pleaded with the divine will of His Father. The actual words might vary, but the substance was the same throughout. 'Abba, Father, all things are possible unto Thee; take away this cup from me; nevertheless, not what I will, but what Thou wilt."

(*The Life of Christ*, P. 394)

సిలువమీద ఎక్కినతర్వాతకూడ ఏసుక్రీస్తు "నాతండ్రీ! నాతండ్రీ! నన్నేల విడిచిపెట్టితివి?" అని వాపోయెను. తన ప్రవక్త ప్రార్థనను భగవంతుడు నిరాకరించునా? ఏసుక్రీస్తు సిలువపై మరణించియుండరనుటకు ఈయొక్క నిదర్శనమే చాలును.

* * *

౧౯. ఏసుక్రీస్తు అసలు సృష్టింపబడనేలేదనియు,* ఆయన భగవంతునివలె ఆదిమధ్యాంతరహితుడనియు, ఆయన మానవజన్మము ఒక అవతారము మాత్రమనియు ఒక విశ్వాసము క్రైస్తవులలో కలదు. ఏసుక్రీస్తు క్రైస్తవులు పూజించు త్రిమూర్తులలో రెండవ పురుషునిగ భావింపబడుచుండుట సుప్రసిద్ధము. ఏసుక్రీస్తు సృష్టికర్తయనియు, భగవంతునకును మానవునకును మధ్యగల సంబంధములను ఆయన వ్యవహర్తయై తీర్చు ననియు క్రైస్తవుల మతము. § ఏసుక్రీస్తు కేవలము మానవు డనియు, అందరు మానవులవలె అతడుకూడ సృష్టింపబడినాడనియు ఇక్కడ ఖుర్ఆన్ చెప్పుచున్నది.

కాని "భగవంతునికడ ఈసాకు తార్కాణము ఆదమ్. (భగవంతుడు) ఆదమును మట్టితో సృష్టించి "అగుము" అనిమాత్రమనెను. అంతట నతడాయెను."

"* The Sonship of Christ is increate and unbeginning, the presupposition of all time and history." Mackintosh, *The Person of Jesus Christ*, (P. 103.)

"Jesus as the son is eventually to share in the omnipotence and absoluteness of God himself."

Ibid, P. 106.

§ "On the one hand, the Godhead of Christ is explicitly asserted. The son acts as Creator, and the relations of created things to God are mediated by Him."

(Mackintosh, *The Person of Jesus Christ*, P. 84)

అని ఇంత డొంకతిరుగుడుగ ఈ విషయ మేల చెప్పబడిన దను ప్రశ్న రావచ్చును. దీనికి కారణము కలదు. క్రైస్తవులు ఏసుక్రీస్తును మొదటి మానవుడైన ఆదముతో పోల్చి, ఆదమ్ మంటితో చేయబడి భూమికి సంబంధించినవాడనియు, ఏసుక్రీస్తు స్వర్గమునుండి దిగవచ్చిన ప్రభువనియు, ఆదమ్ సజీవ మగు ఒక ఆత్మగా చేయబడెననియు. ఏసుక్రీస్తు జీవము నిచ్చు ఆత్మ యనియు చెప్పిరి.* దానికి జవాబుగా ఖుర్ఆన్ పై మాటలలో ఆదముయును ఈసాయు ఒకే విధముగ సృష్టింపబడిన మానవు లనియు, వారిలో ఎట్టి భేదము లే దనియు చెప్పుచున్నది.

ఏసుక్రీస్తు మానవమాత్రుడు కాడనియు, ఆయన సాక్షాత్తు పరమేశ్వరుడనియు మొదలుగాగల అభిప్రాయములు సెంట్ పాల్ వ్యాప్తిలోనికి తెచ్చినవి. అందుచేత క్రైస్తవమత సంస్థాపకుడు అసలు సెంట్ పాల్ యేనని చెప్పుదురు.* మొదటి మూడు సువార్తలయందును ఏసుక్రీస్తు ప్రవక్త యని మాత్రము చెప్పబడెను. సువార్తలయందలి ఈ క్రిందిమాటలు చూడుడు :

"And the multitude said, This is Jesus *the prophet of Nazereth of Galilee.*" (Mathew, XXI, 11)

"And there came a fear on all : and they glorified God, saying, That *a great prophet* is risen up among us ; and, That God hath visited His people." (Luke, VII, 16)

"And he said unto them, what things ? And they said unto him, concerning Jesus of Nazareth, *which was a prophet* mighty in word and deed before God and all the people." (Luke, XXIV, 19)

"Then those men, when they had seen the miracle that Jesus did, said, This is of a truth *that prophet* that should come into the world." (John, VI. 14)

"The woman sayeth unto him, Sir, I perceive that thou art a *prophet*." (John, IV. 19)

They say unto the blind man again, what sayest thou of him, that he hath opened thine eyes ? He said, He is *a prophet*. (John, IX. 17)

ఈవిధముగ సువార్తలలో ఏసుక్రీస్తు ప్రవక్త యనియే పెక్కుచోట్ల చెప్పబడెను. ఆయన భగవంతు డనియు, భగవంతుని కుమారుడనియు, సృష్టికర్త యనియు చెప్పబడలేదు. ఆయన తాను సామాన్య మానవుడనని ఎన్నోచోట్ల చెప్పుకొనెను. మ్యాథ్యూ, మార్కు, లూకు, సువార్తలలో దాదాపు 70 సార్లు

---

* And so it is written, The first man Adam was made a living soul ; the last Adam was made a quickening spirit.

"Howbeit that was not first which is spiritual, but that which is natural; and afterward that which is spiritual.

"The first man is of the earth, earthly: the second man is the Lord from heaven."

(*I. Corinthians* XV. 45-7)
(*Also Romans* V. 14)

(ఆదమ్ అను మొదటి మనుష్యుడు జీవించు ప్రాణి యాయె నని వ్రాయబడియున్నది కడపటి ఆదమ్ జీవింపజేయు ఆత్మ యాయెను........మొదటి మనుష్యుడు భూసంబంధియై మంటినుండి పుట్టినవాడు; రెండవ మనుష్యుడు పరలోకమునుండి వచ్చిన ప్రభువు.)

మాకిన్టాష్ పండితుడు ఈ వాక్యములను వ్యాఖ్యానించుచు ఇట్లనుచున్నాడు :

"Adam was earthly, Jesus heavenly ; Adam a transgressor, Jesus obedient; Adam only a living soul, Jesus a quickening spirit, a Being above nature, who had life and was capable of giving it."

(*Ibid*, P. 61)

---

* "The Christ of the Pauline Epistles has no relation at all to the historic Jesus. We need scarcely hesitate in regarding St. Paul, indeed, as the real founder of our religion." (Mackintosh, *Ibid* P. 51

"Without the Pauline gospel *about* Jesus Christianity could never have become more than a sect of reformed Judaism."

—B. W. Bacon, *Making of New Testament*, P. 61.

40 సందర్భములలో ఏసుక్రీస్తు తాను 'Son of man' (మనుష్యుని కుమారుడు) లేక మానవుడు అని చెప్పుకొనెను. §

ఏసుక్రీస్తు దేవుని కుమారుడని బైబిలులో ఉన్నంతమాత్రమున నిజముగ దేవుని కుమారుడనియే క్రైస్తవులు భావించుచున్నారు. భగవంతుని తండ్రి యని పిలుచుట ఆ కాలములో పరిపాటియై యుండెను. ఆ వాడుక ననుసరించి ఏసుక్రీస్తు భగవంతుని 'నాతండ్రి' యని పిలుచుచుండెను. అందరివలె తానుకూడ పరమపిత కుమారుడనని చెప్పికొనెను. ధనవంతుని మనము లక్ష్మీపుత్రుడు అందుము. అన్నంత మాత్రమున ఆ కోమటిబిడ్డ లక్ష్మి కడుపునపుట్టిన బిడ్డడగునా? అట్లే క్రైస్తవులు అలంకారికముగ ఆ కాలములో వాడబడు 'పరమపిత' 'దేవపుత్రుడు' మున్నగు మాటలను యథాతథముగ అర్థము చేసికొని ఏసుక్రీస్తును దేవుని కుమారునిగ భావించి పూజించ సాగినారు.

'దేవుని కుమారుడు' అను పదము వివిధార్థములలో, వివిధ సందర్భములలో, వివిధ వ్యక్తులచేత పాత నిబంధన మందును, క్రొత్త నిబంధన మందును వాడబడినది. సువార్తలలో ఈ పదము 'మసీః' లేక 'ప్రవక్త' అను అర్థములో వాడబడినదని క్రైస్తవ పండితుల అభిప్రాయము. † పాత నిబంధనములో దేవదూతలు, రాజులు, ప్రవక్త మున్నగు అర్థములలో ఈ పదము వాడబడినది. ‡

ఇట్లు ఏసుక్రీస్తు 'దేవుని కుమారుడు' కాడనియు, కేవలము మానవుడే యనియు, ఆయన భగవంతుని ప్రవక్తలలో ఒకడనియు బైబిలులో కలదు. అదే విషయమును ఖుర్ ఆన్ స్పష్టముగ చెప్పుచున్నది. ఏసుక్రీస్తుకూడ ఆదమువంటి మానవుడేనని ఖుర్ ఆన్ నొక్కి చెప్పుచున్నది.

* * *

క్రీ. హి. శ. 10 వ సంవత్సరములో 'నజ్రాన్' పట్టణమునుండి వచ్చిన క్రైస్తవాచార్యులతో జరిగిన వాగ్వాదములో ఏసుక్రీస్తు భగవంతుడు కాడనియు, మానవ మాత్రుడగు ఒక ప్రవక్తయే యనియు ఎంత నచ్చజెప్పినను క్రైస్తవులు తమ విశ్వాస

§ "*Son of man* is only used by Jesus in the Synoptics, virtually always as a self-designation." (*Mackintosh Ibid*, P. 20)

"In Mathew, Mark and Luke the title (Son of man) is found on Jesus, lips about seventy times, representiug forty occasions more or less" —*Ibid*, P. 20.

† "But in the majority of cases belonging to this class, our wisest course is to regard 'Son of God' as a synonym of Messiah." (*Mackintosh, Ibid*, P. 25)

‡ *Mackintosh, Ibid*, P. 25.

మును మార్చుకోరైరి. అప్పుడు ప్రవక్త ఎవరి వాదము సత్యమో నిర్ణయించుటకు భగవంతుని ప్రార్థింతమని చెప్పిన విషయ మిక్కడ నుద్దేశింపబడినది. "ఎవరబద్ధములు పలుకుచున్నారో వారు శాపహతు లగుదురు గాక!" అని ప్రవక్త ప్రతిపాదనము. క్రైస్తవపండితులు దీని కొప్పుకొనక ప్రవక్తతో సంధిచేసికొని పోయిరి.

* * * *

౨౦. రోమ్ చక్రవర్తి యగు హెరాక్లియస్‌కు ప్రవక్త పంపిన లేఖలో ఈ సూక్తము కలదు. హిజరీ శకము 6 వ సంవత్సరములో ప్రవక్త రోమ్ చక్రవర్తికిని, అబిసీనియా చక్రవర్తికిని, పారసీక చక్రవర్తికిని, ఈజిప్టు ప్రభువునకును, సిరియా రాజునకును ఇస్లామ్ స్వీకరించవలసినదని ఉత్తరములు వ్రాసిరి. హెరాక్లియస్ క్రైస్తవుడగుటచే ప్రవక్త తన లేఖలో ఈ సూక్తము నుద్ధరించిరి.

ఈ సూక్తమున పేర్కొనబడిన మూలసిద్ధాంతములు మూడు : 1. ఏకేశ్వరునే ఆరాధించుట ; 2. భగవంతునకు సమానులను కల్పించకుండుట ; 3. మానవులకు భగవద్దత్తమగు గౌరవప్రపత్తులనిచ్చి పూజింపకుండుట.

క్రైస్తవులు ఏకేశ్వరునే ఆరాధించుచున్నామని చెప్పుచుండియు ఏసుక్రీస్తును దేవుని కుమారునిగను, అందుచే భగవంతునకు సమానునిగను భావించి పూజించుచున్నారు. 'పరిశుద్ధాత్మ'ను త్రిమూర్తులలో ఒకనిగా భావించి పూజించుచున్నారు. భగవంతు డొక్కడే యని ఊరక చెప్పిన లాభము లేదు. భగవంతు డొక్కడేయని ఒప్పుకొనినప్పుడు 'పరిశుద్ధాత్మ'ను భగవంతునకు సమానునిగను, మానవుడును ప్రవక్తయునగు ఏసుక్రీస్తుని భగవంతుని కుమారునిగను భగవంతునిగను పూజించకూడదని ఇక్కడ ఖుర్ ఆన్ బోధించుచున్నది.

"మీకును మాకును సాదృశ్యమగు" మూలసిద్ధాంతముల వైపునకు ఖుర్ ఆన్ పిలుచుచున్నది. ఆ సిద్ధాంత మేది? అదే ఏకేశ్వరత్వ సిద్ధాంతము. ప్రపంచమునందలి మతము లన్నియు ఏకేశ్వరత్వమును ఒప్పుకొనుచున్నవి. కాని ఆయా మతస్థులు ఆచరణములో మాత్రము దానికి విరుద్ధముగ ప్రవర్తించుచున్నారు. ఖుర్ ఆన్ అందుచేతనే ఏకేశ్వరత్వముయొక్క పూర్తి యర్థమును వివరించుచు దానిని స్వీకరించవలెనని ఆహ్వానించుచున్నది. ఈ సందర్భమున క్రైస్తవ మతమునుగూర్చి ఫ్రిత్ జాఫ్ షాన్ (Frithjof Schnon) పండితుడు చెప్పిన మాటలను గమనింపుడు :

"Christians cannot lay claim to the idea of Unity with the same right as the Muslims; the idea of Redemption is not necessarily linked to the conception of Divine Unity; it might in fact be the outcome

of a polytheistic doctrine. As for Divine Unity, although theoretically admitted by Christians, it never appears as a dynamic element."*

క్రైస్తవ మతమునకును ఇస్లామ్‌నకును గల భేద మిందే యున్నదని పల్వురు ప్రఖ్యాత క్రైస్తవ పండితుల అభిప్రాయము. జాన్ విలియమ్ డ్రేపర్ తన 'History of the Conflict between Religion and Science' అను ఉద్గ్రంథములో ఇట్లు వ్రాయుచున్నాడు (పుట 72):

"Sir William James, following Locke, regards the main point in the divergence of Mohammadanism from Christianity to consist 'in denying vehemently the character of our Saviour as the son, and his equality as God with the Father.' This opinion has been largely entertained in Italy."

* * * *

౨౦. ఇస్లామ్ విశ్వ విశాల భావమును వెల్లడించు మరొక సూక్తమిది. 'ఇబ్రాహీం యూదుడును కాడు; క్రైస్తవుడును కాడు. కాని అతడు సత్యమార్గ ప్రవర్తకుడు; భగవదిచ్ఛకు శిరస్సును వంచిన వాడు; అతడు బహు దైవతారాధకుడు కాడు." అను ఈసూక్తములో సన్మార్గ ప్రవర్తకుడై యుండుటయు, బహు దైవతారాధకుడు కాకుండుటయు మాత్రమే ఇస్లామ్‌యొక్క ముఖ్య షరతులుగా చెప్పబడినది. "భగవదిచ్ఛకు శిరస్సును వంచుట" లేక "భగవదిచ్ఛకు సమస్తమును సమర్పించుట" లేక ఇక్కడ ఖుర్ఆన్ ఉపయోగించిన శబ్దములలో "ముస్లిమ్ అగుట" అనగా ఏకేశ్వరుని యందు విశ్వాసముంచి సన్మార్గ ప్రవర్తకు డగుట. ఒక ప్రవక్తను బట్టిగాని, ఒక జాతిని బట్టిగాని, ఒక దేశమునుబట్టిగాని మతములకు పేర్లిచ్చుటను ఖుర్ఆన్ అంగీకరింపదు. వివిధ ప్రవక్తలు వివిధమగు మతములను బోధించిరనియు ఖుర్ఆన్ ఒప్పుకొనదు. ఎవరు, ఏ కాలమున, ఏ దేశమున బోధించినను ఒకే మతమును బోధించిరనియు, ఎందుకన, మతము లేక సత్యమగు ధర్మము ఒక్కటే యనియు ఖుర్ఆన్ చెప్పుచున్నది. ఆ ధర్మము భగవత్ప్రతిపాదితము; ప్రవక్తచే బోధింపబడినది. ఏకేశ్వరారాధనము, సన్మార్గ ప్రవర్తనము—ఇవి రెండును ఈ సత్యమునకు ప్రధానాంగములు. మాటిమాటికి ఖుర్ఆన్ ఈ సత్యమునే బోధించుచున్నది. (259—263 పుటలలో 65 వ నోటును కూడ చూడుడు.)

* * *

* Christianity and Islam, *By Frithjof Schnon in Triveni, Vol. VIII*, NO. 1, 1935.

౨౧. క్రైస్తవులు కానివారు ఎంతటి సత్ప్రవర్తకులైనను వారికి స్వర్గమోక్షములు లభించవని క్రైస్తవులును, యూదులు కానివారెవ్వరికిని స్వర్గమోక్షములు లభించవని యూదులును అనుచున్నారు. ఈ విషయమున క్రైస్తవమత సిద్ధాంతములను గూర్చి L. T. Hobhouse తన Morals in Evolution అను ఉద్గ్రంథములో ఇట్లనుచున్నాడు:

"Without faith (in Christ) no virtue can save, and though they had no means of knowing the Gospel the best of the heathen are irrevocably lost. This may be said to have been common ground to the churches down to the modern period. But further than this, faith not merely in Christ, but in the Church's own scheme of salvation is too often a necessity, and no virtue no sanctity, not even the utmost plenitude of the time spirit of religion, could avail to make good this flaw."‡

ఏసుక్రీస్తుయందు నమ్మకము లేకపోయినచో ఎంతటి శీలవంతుడైనను భ్రష్టుడు కావలసినదే. బైబిల్ తెలుసుకొను అవకాశము లేకపోయినను క్రైస్తవుడుకాని ఎంతటి ఉత్తముడైనను అధఃపతితుడే. ఇటీవలివరకు అన్ని చర్చీల యొక్కయు అభిప్రాయమిదే. అంతకుమించి, ఏసుక్రీస్తునందేకాక చర్చియొక్క మోక్షవిధానమునందు నమ్మకముకూడ ఆవశ్యకమాయెను. ఎంతటి శీలవంతుడైనను, ఎంతటి పవిత్ర చరిత్రుడైనను, ఎంతటి ధర్మపరుడైనను క్రైస్తవ చర్చితో ఏకీభవించనియెడల భ్రష్టుడగును.)

దీనికి ప్రోద్బలముగ Hobhouse ఈ క్రిందివాక్యములను ఉద్ధరించుచున్నాడు:

"For any man who does not hold the unity of the Catholic church neither Baptism nor alms however profuse, nor death met in the name of Christ, can be of benefit for his salvation."†

(క్యాథలిక్కు చర్చియొక్క ఐక్యమునందు నమ్మకము లేనివాడు క్రైస్తవుడయ్యు, ఎక్కువ దానతత్పరుడయ్యు, ఏసుక్రీస్తుకొఱకు ప్రాణములను ధారపోసినవాడయ్యు మోక్షమును పొందజాలడు.)

Hobhuse మరియు నిట్లనుచున్నాడు:

‡ Vol. ii, P. 140.

† Quoted from Fulgentius in the Decr. Greg. Corpus Juris P. 778. ఈ గ్రంథమున ఇది ఆగస్టిన్ చెప్పినట్లుగా ఉన్నది.

"Augustine suggests that good works may mitigate damnation when they cannot procure salvation."

(సత్కృతులు నరకమునుండి తప్పించవచ్చునుగాని మోక్షము నిప్పించజాలవు అని ఆగస్టిన్ అభిప్రాయపడెను.)

(ప్రొటెస్టెంటు మత నాయకులైన లూథర్, కాల్విన్ ఇత్యాది ప్రముఖుల అభిప్రాయములను చర్చించుచు హబ్‌హౌస్ ఇట్లు వ్రాయుచున్నాడు:

"Calvin even detracts from the merits of the heathen:—The good works of the heathen are distinguished from bad and rewarded in this life, but Augustine is right in saying "That all who are strangers to the religion of the one true God, however they may be esteemed worthy of admiration for their reputed virtue, not only merit no reward, but are rather deserving of punishment because they contaminate the pure gifts of God with the polution of their own hearts." They are restrained from evil not by a sincere attachment to virtue, but by ambition, self-love, or some other irregular disposition. The end of what is right is always to serve God, and as they regard not this end, any externally good act performed by them becomes sin.

Luther, though of more tolerant disposition, is equally clear that outside Christendom there is no forgiveness and can be no holiness. (*Primary Works, ed. Wace and Buchheim, P. 104.*) The Anglican Article XIII. denies that "works done before the grace of Christ" are pleasant to God—"Yea rather, for that they are not done as God hath willed and commanded them to be done, we doubt not but they have the nature of sin." (*Corpus Juris, P. 14*).

(కాల్విన్ క్రైస్తవుడుకానివాని మంచితనముసైతము మంచితనము కాదనుచున్నాడు:—క్రైస్తవుడు కానివాడు చేయు సత్కృతులకు ఫలము ఈ లోకముననే లభించును. 'క్రైస్తవ మతము తెలియనివారు సత్పురుషులని ఎంతటి ప్రశంసలకు పాత్రులైనవారైనను దాని ఫలమును పొందకపోవుటయేకాక వారు శిక్షకు పాత్రులు-ఎందుకన వారు భగవంతుని అనుగ్రహములను తమ హృదయముల అంటుచే కళంకిత మొన

ర్తురు-' అని ఆగస్టిన్ చెప్పిన మాటలందు సత్యముకలదు. వారు దౌష్ట్యమునుండి దూరముగ ఉండునది వారికి సద్వృత్తియందు కల ప్రేమచేకాదు—ఆశ, స్వాతిశయమున్న భావములే దానికి కారణము- ఏ సత్కృతి యొక్కయు ఫలితార్థము భగవత్సంసేవనమే. వారే ఫలితార్థమును అభిలషించరు కనుక వారు పైకిచేయు ఏ మంచిపనియైనను పాపమే యగును.

ఇంతకంటెను ఇంచుక ఎక్కువ విశాలహృదయము గల లూథర్ కూడ క్రైస్తవ మతము బయట ఎక్కడను పావిత్ర్యము లేదనియు, క్రైస్తవేతరు లెప్పుడును క్షమింపబడరనియు అభిప్రాయపడెను. (ప్రైమరీ వర్క్స్, పేజి 104.) యాంగ్లికన్ ఆర్టికల్ XIII లో క్రైస్తవమతములో ప్రవేశించకపూర్వము చేసిన సత్కార్యములు వ్యర్థములనియే చెప్పబడినది.-(భగవంతుడు ఇచ్ఛించకయు, ఆజ్ఞాపించకయు చేసిన పను లగుటచే అవి పాపకార్యములే అనుటకు సందేహము లేదు.)

(కార్పస్ జ్యూరిస్, పుట 14.)

ఇంక ఖుర్ఆన్ బోధించిన మతము చూడుడు. క్రైస్తవులలోను, యూదులలోను, ఇతరులయందును గల సత్ప్రవర్తకులను ఖుర్ఆన్ పొగడుచున్నది. సత్ప్రవర్తకులైనవారిని భగవంతుడు ప్రేమించు ననుచున్నది. భగవంతుని ప్రేమకు పాత్రు లగుటకంటె మరి కావలసిన దేమున్నది? ఈవిధముగ ఇస్లామ్ ఒక విశ్వవిశాలమగు భావము ప్రకటించుచున్నది.

* * *

23. ఒక్కొక్కరితో ఒక్కొక్కవిధమగు ప్రవర్తనము క్రైస్తవులయందును, యూదులయందును, ఆర్యమతములయందునుకూడ కాననగును. క్రైస్తవుడు కాని వారెంతటి సత్ప్రవర్తకులైనను అది సత్ప్రవర్తనముగ భావింపరాదని క్రైస్తవాచార్యులేవిధముగ ననిరో వెనుకటి నోటులో చూపితిని.

యూదుల ధర్మగ్రంథములను చూడుడు. అవి వడ్డీని తీసికొనుటను నిషేధించుచున్నవి. కాని "Unto a stranger thou mayest lend upon usury; but unto thy brother thou shalt not lend upon usury" (Deut. 23: 70) అని బైబిల్ యూదుడు కాని వానికడ వడ్డీ తీసికొనుట పాపము కాదనుచున్నది. అట్లే ఆర్య ధర్మ గ్రంథములు బ్రాహ్మణునికడ తక్కువ వడ్డీయు, బ్రాహ్మణేతరులకడ ఎక్కువ వడ్డీయు తీసికొనుట న్యాయమని చెప్పుచున్నవి. అట్లే బ్రాహ్మణులకు ఏది విధివిహితమో అది శూద్రాదులకు నిషేధ మొనర్చినవి. ఖుర్ఆన్ ఇట్టి భేదభావమును ఖండించుచున్నది. "విశ్వాస

హీనులతో వ్యవహరించునప్పుడు ధర్మయుతముగ ప్రవర్తించుట మాకు విధివిహితము కాదు"అని క్రైస్తవులును యూదులును అందురని చెప్పుచు ఖుర్ఆన్ దీనిని అబద్ధమని ఖండించుచున్నది. అది 'భగవంతునియెడ అపవాద' మనుచున్నది.

ఇట్లు భేదభావమును చూపుడని భగవంతు డనునా? వ్యవహారము చేయునప్పుడు ఎవరితోనైనను సరే వారితో ధర్మయుతముగ ప్రవర్తించవలెను. అదే భగవద్ధర్మము అని ఖుర్ఆన్ హెచ్చరించుచున్నది.

*　　　*　　　*

౭౮. మాట ఇచ్చి దానిని పాలించుటకు ఖుర్ఆన్ ఎంత ప్రాముఖ్యత నిచ్చుచున్నదో చూడుడు. వాగ్భంగ మొనర్చినవారిని దయాదృష్టితో చూడనని భగవంతుడు చెప్పుచున్నాడు. వారి పాపములను ఇతరుల పాపములనువలె తుదకు క్షమించననుచున్నాడు.

*　　　*　　　*　　　*

౭౯. యూదులగ్రంథమగు బైబిల్ పాతనిబంధనమందును, క్రైస్తవులు పవిత్ర గ్రంథముగ భావించుచున్న బైబిల్ క్రొత్త నిబంధనమందును ఆ యా మతముల పండితులు చేసిన మార్పులు, వారు ఆ యా గ్రంథములను తారుమారొనర్చిన విధమును గూర్చి 61వ నోటు (249–258 పుటలు) లో సంక్షిప్తముగ చర్చింపబడినది. అదే విషయమును ఇక్కడే మరొకసారి ఖుర్ఆన్ స్పష్టముగ చెప్పుచున్నది.

క్రైస్తవ పండితులు తమ ఇచ్చవచ్చినట్లు ఏసుక్రీస్తు బోధనలను మార్చివేసిరని ఖుర్ఆన్ చెప్పు మాటలు ఎంత సత్యమైనవో నేటి క్రైస్తవపండితుల వ్రాతలవల్లనే తెలియగలరు. ఉదాహరణమునకు బెంజమిన్ బేకన్ గారి ఈ క్రింది వాక్యములను చూడుడు :

"Mercion's 'Gospel' consisted of our Luke, expurgated according to his own ideas. His 'Apostle' contained the Epistles of Paul minus the pastoral Epistles and a series of passages cancelled out from the rest as Jewish interpolations. This was the first Christian Bible distinct from the 'Scriptures' of the synagogue." (P. 23.)

(మార్కియోన్ ప్రచురించిన 'సువార్త'లో ఇప్పటి మన లూక్ సువార్త యుండెను. అది అతని భావముల ననుసరించి మార్చివేయబడినది. అతని'అపోస్తలులు'లో పాల్ యొక్క ఎపిజిల్సు ఉండెను. తక్కినవాటినుండి అనేక వాక్యములు యూదులు చేసిన ప్రక్షిప్తములని తీసివేయబడెను. ఇదే మొదటి క్రైస్తవ బైబిల్.)

"Clement attaches to his own epistle, written in behalf of the Church at Rome, the same superhuman authority claimed in Acts XV. 28 for the letter sent by the Church at Jerusalem." (P. 20.)

(తాను రోము చర్చి పక్షమున వ్రాసిన ఎపిజిల్ భగవత్ప్రోక్తమని క్లెమెంటు చెప్పెను.)

"His message, Ignatius declares with emphasis, was revealed to him, together with the occasion for it, directly from heaven. It was 'the voice of God and not only of a man' when he cried out among the Philadelphians" (P. 21)

(తన సందేశము భగవంతునికడనుండి తిన్నగా వచ్చినదే నని ఇగ్నేషియస్ నొక్కి చెప్పెను. తాను ఫిలడల్ఫియన్సును పిల్చినప్పుడు వినిపించిన ధ్వని కేవలము మనుష్యునిదే కాదనియు భగవంతునిదికూడ ననియు అతడు చెప్పెను.)

"Hermas, a 'Prophet' of the same Roman Church, as Clement, though a generation later, is still so conscious of the superhuman character of his 'Visions', 'Parables', and 'Mandates' that he gives them out for circulation as inspired messages of the spirit; and this not for Rome alone."

(క్లెమెంటు తరువాతి తరమువాడగు హెర్మాస్ రోమన్‌చర్చియొక్క 'ప్రవక్త.' అతడు తాను భగవదాదేశమును పొందినవాడ నని చెప్పికొనుచు తన సందేశములను భగవత్సందేశములుగ రోమునందే కాక బయటకూడ ప్రచురించుచుండెను.)

"None of the early canons (i. e. list of writings permitted to be read in churches) coincides exactly, it is true, with the New Testament current among ourselves." (P. 30)

(చర్చీలలో చదువుటకు అనుజ్ఞ బడసిన తొలి పవిత్ర గ్రంథములలో ఏదియు ఇప్పుడు మనలో ప్రచారమునందున్న క్రొత్తనిబంధనమునకు సరిపోదు.)

"The lists of Origen (A. D. 251) and Eusabius (A. D. 325) vary as respects both exclusion and inclusion. All early authorities express a doubtful judgment regarding the outer fringes of minor writings such as James, Jude, 2nd Peter 2nd and

3rd John. Even those of larger content, such as Hebrews and Revelations, remained subject of dispute............ (A party) under the lead of Gaius had denied the authenticity of all the writings attributed to John, include the Gospel itself." (P. 31)

(క్రీ॥శ॥ 251 లో అరిజెన్ ఇచ్చిన పవిత్రగ్రంథముల పట్టికకును క్రీ॥శ॥ 325లో యూసేబియస్ ఇచ్చిన పట్టికకును ఎంతో భేదము కలదు. ఇందున్నవి అందులేవు; అందున్నవి ఇందులేవు. జేమ్సు, జూడ్, 2వ పీటరు, 2వ 3వ జాన్ మున్నగు చిల్లరగ్రంథముల విషయమునను, హెబ్రూస్, రెవలేషన్సు మున్నగు పెద్దగ్రంథముల విషయముననుకూడ వివాద ముండెను. గేయస్ నాయకత్వముక్రింద ఒక పార్టీవారు జాన్ చే వ్రాయబడినవని చలామణీలో ఉన్నట్టి గ్రంథములను, జాన్ సువార్తను సైతము ప్రక్షిప్తమని నిరాకరించిరి.)

" The Gospel of Mark is no exception to the rule that church writings of this type inevitably undergo recasting and supplementation until the advancing process of canonization at last fixes their text with unalterable rigidity." (P. 170.)

(ఈ విధమైన చర్చివ్రాతలు మారుచుండుటయు, హెచ్చింపబడుచుండుటయు తప్పనిసరిగా జరుగును. మార్కు సువార్తకూడ అట్లే మార్పులు పొందినది. క్రమ క్రమముగ ఇది ఘనీభవించి మార్పు చెందని గ్రంథమాయెను.)

ఈ విధముగ ఎన్నెని వాక్యము లుదహరించవచ్చును. ఈ చివరవాక్యము ఖుర్ ఆన్ సూక్తమును సంపూర్ణముగ నిరూపించుచున్నది. సువార్తలు మొదలైనవన్నియు చర్చి వ్రాతలనియు, ఇవి తప్పనిసరిగ అనేకసార్లు మార్పుచెందుచుండుననియు, హెచ్చుతగ్గులందులో జరుగుట సహజమనియు ఇప్పుడు క్రైస్తవ పండితు లొప్పుకొనినారు. పై వాక్యము లన్నియు Benjamen, W. Bacon, D. D. చే రచింపబడిన The making of the New Testament నుండి ఉదహరింపబడినవి. బేకన్ యేల్ విశ్వవిద్యాలయములో ప్రొఫెసర్ ఆఫ్ న్యూ టెస్టమెంట్ క్రిటిసిజమ్ గా ఉన్నాడు. పై అభిప్రాయము లన్నియు ఈ విధముగ క్రైస్తవపండితులవి. క్రైస్తవమత మసత్యమని నమ్ము స్ట్రాఉస్, రినాన్ మున్నగు పాశ్చాత్యభావుకుల అభిప్రాయములు ఇంకను తీవ్రముగా ఉండును. వాని నుదహరించుట భావ్యము కాదని క్రైస్తవ పండితులనే ఇట ఉదహరించితిని.

* * *

౭౬. ఖుర్ ఆన్ క్రూరుడగు భగవంతుని ప్రతిపాదించెనని క్రైస్తవ మిషనరీలు అబద్ధప్రచారమును చేయుచున్నారు. 1928 లో జరిగిన జెరూసెలం అంతర్జాతీయ క్రైస్తవ మిషనరీ కౌన్సిలు సమావేశములో మాట్లాడుచు కానన్ గైర్డ్నర్ ఇస్లామ్ లో పశ్చాత్తాపమునకును పాపపరిహారమునకును స్థానమే లేదని ఉపన్యసించినాడు. § 89 వ సూక్తమున ఖుర్ ఆన్ వాక్యము లీ అబద్ధమును ఎంత స్పష్టముగ ఖండించుచున్నవో చూడుడు: "ఎంతటి మహాపాతక మొనర్చియు మానవుడు నిజముగా పశ్చాత్తాపపడి, తన దోషమును సవరించుకొనునో వానిని భగవంతుడు క్షమించును. ఎందుకన భగవంతుడు కరుణానిధి" అని ఖుర్ ఆన్ వ్రాక్రుచ్చినది. ఖుర్ ఆన్ లో భగవంతుడు కరుణానిధి యనియు, మహాక్షమి యనియు వందలకొలది సూక్తములలో కలదు. కాని ఖుర్ ఆన్ మాటలలో వీరు " తెలిసి యుండియు భగవంతునిపై అబద్ధములు చెప్పు" వారు. ఇట్టి అబద్ధ ప్రచారము చేయుట పుణ్యకార్యమని వీరు భ్రమించుచున్నారేమో!

* * * *

నాల్గవ భాగము

౭౭. 113, 114, 115 సూక్తములలో వెనుక 72వ నోటులో చర్చించిన విశ్వవిశాలభావము మరింత స్పష్టముగ ప్రవచింపబడినది. మతములో ఇస్లామ్ జూపిన ఇట్టి విశ్వవిశాలభావమును మానవచరిత్రలో మందెన్నడును చూపబడలేదు. అందుచేతనే మతపరిణామచరిత్రలో ఖుర్ ఆన్ ప్రతిపాదించిన మతము తుదిమెట్టని ఖుర్ ఆనే చెప్పుచున్నది. "నేడు మీ మతమును సర్వవిధముల సంపూర్ణ మొనర్చితి" నని ఖుర్ ఆన్ మానవప్రపంచమును సంబోధించి ఘోషించుచున్నది.

* * * *

౭౮. 118 మొదలు 120వ సూక్తాంతము వరకు అవిశ్వాసులతోడను వంచకులతోడను ఎట్టి సంబంధములు కలిగియుండవలెనో వివరింపబడినది. అవిశ్వాసులు రెండు విధములు: 1. అవిశ్వాసులైయుండి విశ్వాసవంతులతో ప్రత్యేక ద్వేషము లేక స్నేహభావముతో మెలగువారు; 2. విశ్వాసవంతులతో ద్వేషమును బూని వారిని, వారి మతమును నశింపజేయ గోరువారు.

ఖుర్ ఆన్ మొదటివిధము అవిశ్వాసులతో స్నేహభావమున మెలగవలసినదనియే విశ్వాసవంతుల నుపదేశించుచున్నది. (ఖుర్ ఆన్ 60: 8, 9) రెండవవిధము అవిశ్వాసు

§ Report of the Jerusalem Meeting, Vol. 1, P. 238.

లతో "ఎక్కువ గాఢమైత్రి సలుపకుడు." అని విశ్వాసవంతులను ప్రబోధించుచు దానికి కారణములు వివరించుచున్నది :

1. అవిశ్వాసవంతులు "మిమ్ములను చెడగొట్టుట కెంతమాత్రము వెనుదీయరు;"
2. వారు "మీ వినాశమునే కోరుదురు;"
3. వారు బహిరంగముగను రహస్యముగను మిమ్ములను ద్వేషింతురు;
4. మీరు వారి నెంత ప్రేమించినను వారు మిమ్ములను ప్రేమింపరు;
5. మీ శ్రేయశ్శుభములు వారికి కన్నుకుట్టుగా నుండును.

మరి ఖుర్ఆన్ ఇట్టి బద్ధశత్రువులగు వీరితో ఎట్లు ప్రవర్తించు మనుచున్నది? "ఓర్పు వహించి సత్ప్రవర్తకులై యుండుడు." అనుచున్నది.

అట్లున్నచో "వారి కుతంత్రములు మిమ్ములను రవ్వంతయు బాధింపవు" అనుచున్నది.

తా మోర్పువహించి సత్ప్రవర్తకులై యుండుటయూ బద్ధశత్రువులగు వారి కుట్రలకు జవాబు!

వారి చెడుగునకు జవాబు చెడుగు కాదు. వారి దుష్ప్రవర్తనమునకు మన సత్ప్రవర్తనము జవాబు.

* * *

౭౫. 13 వ ఖండము నందును తరువాతి ఖండములందును శ్రీ మొహమ్మద్ ప్రవక్త అవిశ్వాసులతో తప్పనిసరిగ పోరాడవలసివచ్చిన యుద్ధముల ప్రశంస కలదు. మక్కావాసులగు ఖురైషులు శ్రీ ప్రవక్తను ఆయన శిష్యులను నానా విధముల హింసించిరి. తుదకు ముసల్మానులకు మక్కాలో జీవితము దుర్భరమాయెను. శ్రీ ప్రవక్త తమ మతమును బోధించసాగిన మూడేండ్ల కాలములో దాదాపు ఏబదిమంది మాత్రము ముసల్మానులైరి. మక్కావాసుల దుర్భర బాధలను సహించలేక వీరిలో 19 గురు అబిసీనియా దేశమునకు వలసపోయిరి. ఈ పరిస్థితులలో కూడ ముసల్మానుల సంఖ్య దినదిన ప్రవర్ధమాన మగుచుండెను. అబిసీనియాకు పారిపోయిన ముసల్మానులకు నజాషీ చక్రవర్తి ఆశ్రయమిచ్చుటయేకాక వారి నెంతో గౌరవించెనని అక్కడినుండి వార్తలు రాసాగెను. ముసల్మానుల మరొక నూర్గురజట్టు మక్కా విడిచి అబిసీనియాకు వలసపోయెను. అబిసీనియాలో పల్వురు క్రైస్తవులు ఇస్లామును స్వీకరించిరి. అబిసీనియా చక్రవర్తియగు నజాషీ ఆస్థానములో ముసల్మానుల పలుకుబడి హెచ్చసాగెను. ఖురైషుల కిది కన్నుకుట్టుగా నుండెను. వారు నజాషీచక్రవర్తికడకు రాయబారముల నంపిరి. నజాషీ ముసల్మానులను పంపివేయ నిరాకరించెను. ఖురైషుల ఆగ్రహజ్వాలలు

మరింత ప్రజ్వరిల్లెను. వారు ముసల్మానులను వెలివేసిరి. ప్రవక్త మతబోధ ప్రారంభించిన 7వ సంవత్సరమున ప్రారంభమైన సంఘ బహిష్కారము మూడేండ్లవరకు సాగెను. ఈ కాలమున ముసల్మానులు సహించిన హింసలకు మేరయే లేదు. వారు మక్కా పట్టణమునకు బైట 'షా అబె అబూ తాలిబ్' అను కొండ కొమ్ముపై యుండవలసివచ్చెను. ఇది ముసల్మానులకు ఖైదువలె నుండెను. మూడేండ్ల తర్వాత ఖురైషు తెగ నాయకులలో కొందరు ముసల్మానుల బాధలను చూడలేక వారిని కారాగారమునుండి విడిపించిరి. ఇస్లాంమత వ్యాప్తి సాగుచునే యుండెను. పదవయేట మదీనానగరవాసులు యాత్రార్థమై మక్కాకు వచ్చి ప్రవక్తను దర్శించిరి. వారిలో ఆరేడుగురు వెంటనే ముసల్మానులై మదీనాకు మరలిరి. మరుసటి సంవత్సరము మరి పన్నెండుగురు మదీనావాసులు ప్రవక్తను దర్శింప మక్కాకు వచ్చి ముసల్మానులైరి. తరువాతి సంవత్సరము 70 మంది ఇస్లామును స్వీకరింపవచ్చిరి. దానితో ఇస్లామ్ సందేశము మదీనాలో ఇంటింట వ్యాపింపసాగెను. మక్కావాసులగు ముసల్మానులు కూడ మదీనాకు తమ కుటుంబములతో వెళ్ళిపోసాగిరి. పల్వురు ముసల్మానులు తప్పనిసరిగ మక్కాలోనే ఉండిపోవలసివచ్చెను. ముసల్మానులు పడిన బాధలు ఖుర్ఆన్లో పెక్కుచోట్ల సూచింపబడినవి. (16 : 43, 44 ; 2 : 215; 3 : 194 ; 22 : 57; 4 : 97, 99-100; 60 : 8-9)

శ్రీ ప్రవక్త కాబాయొక్క పురోహితుల వంశమునకు చెందినవారు. ఖురైషులు శ్రీ ప్రవక్తను సైతము గౌరవింపరైరి. ప్రవక్త నానావిధములగు అవమానములకును హింసలకును గురికావలసివచ్చెను. ప్రవక్త పినతండ్రియగు అబూతాలిబ్ బ్రతికియున్నంతకాలము వారి ప్రాణమునకు భంగము లేకపోయెను. అబూతాలిబ్ మరణానంతరము ప్రవక్తను చంపుటకు ఖురైషులు పూనుకొని కుట్రలు పన్నసాగిరి. తుద కొకనాడు రాత్రి ప్రవక్తను వధించుటకు ఖురైషులు నిశ్చయించిరి. ప్రవక్త కిది తెలిసి ఆ రాత్రి అబూబకర్ అను ఒక శిష్యునితో రహస్యముగ మక్కానగరమును విడిచి మదీనాకు పయనమైరి.

ప్రవక్తయు, ముసల్మానులును తమ పట్టణమును విడిచి, ఇండ్లు వాకిళ్ళువిడిచి దేశాంతరములకు పలాయితులై పోయినను ఖురైషులు వారిని విడిచిపెట్టరైరి. ప్రవక్త మదీనాకు వెళ్ళిపోయిన సంవత్సరముననే మదీనావాసుల పశువుల నన్నిటిని ఒక మైదానములో మేయుచుండగా ఖురైషులు తోలుకొనిపోయిరి. ఐనను మదీనావాసులు కత్తి కట్టరైరి. తుట్టతుదకు వారికి కత్తి కట్టక తప్పినదికాదు. మక్కావాసులు దాదాపు

వెయ్యిమంది సైన్యముతో మదీనాపై దండునెడలిరి. వారికడ 700 ఒంటెలు, 100 గుఱ్ఱములు ఉండెను. శ్రీ ప్రవక్త తొందరగా 305 గురు ముసల్మానులను ఒక చిన్న సైన్యముగ సమకూర్చుకొని మక్కా సైన్యము నెదుర్కొనుటకు సిద్ధపడవలసివచ్చెను. మదీనా పట్టణము ప్రవక్త కాతిథ్యమిచ్చెను. ఇప్పుడు ప్రవక్త మూలమున ఆ పట్టణమునకు విపత్తు సంభవింపనుండెను. అందుచే ఆ పట్టణమును సంరక్షించు భారము ముసల్మానులపై పడెను. ముసల్మాను సైన్యములో పల్లువు రింకను బాలురు. ముసల్మానులకడ కేవలము 2 గుఱ్ఱము లుండెను. ఖురైషీ సైనికు లాపాదమస్తకము కవచములను ధరించియుండిరి. ముసల్మానులకు ఆయుధము లైనను సరిగ లేకుండెను. ఐనను ఒక పక్షమున ధర్మము, మరొక పక్షమున అధర్మము పోరాడుచుండెను. ధర్మమునకు అధర్మమునకును మధ్య పోరాటములో ధర్మమునకు కాక అధర్మమునకు విజయము ప్రాప్తమగునా? బదర్ యుద్ధమున ముసల్మానులకు గొప్ప విజయము కలిగెను. ఖురైషులలో 700 మంది ప్రముఖులు మరణించిరి. ముసల్మానులలో కేవలము 14 గురు మాత్రము భగవన్మార్గమున మరణించిరి.

ఈ యుద్ధమునందు కల్గిన పరాజయము ఖురైషుల పగను మరింత హెచ్చించెను. పగతీర్చుకొనుటకై ఈసారి ఖురైషులు ఒక గొప్ప సైన్యమును తయారుచేయ సాగిరి. ఈసారి సైన్యములో స్త్రీలుసైతము ప్రవేశించిరి. గత యుద్ధములో మరణించిన యోధుల బందుగురాండ్రైన స్త్రీలు. మూడు వేలకు పైగా ఖురైషుల సైన్యము-సుమారు 700 మంది ముసల్మానులు. ఒహద్ అను ఒక కొండక్రింద యుద్ధముజరిగెను. ఖురైషు స్త్రీలు ఈ క్రింది అర్థముగల పాటను పాడుచు సైనికులను ప్రోత్సహించుచుండిరి:

"మే మాకసమందు వెలుగుచున్న తారకాపుత్రికలము
మేము మెత్తని తివాసీలపై అడుగిడువారము
మీరు శౌర్యముతో యుద్ధ మొనర్చిననే మిమ్ముల నాలింగన మొనర్తుము
మీరు వెనుజూపిరా మిమ్ములను దగ్గరకు రానీయము."

శ్రీ ప్రవక్త సైనికుల వీపులు కొండవైపున నుండెను. కొండవైపునుండి శత్రువు పోటుచేయు భయముండెను. అందుచే ప్రవక్త కొండవైపు ఏబదిమంది విలుకాండ్రనుంచిరి. యుద్ధమున గెలుపైనను సరే ఆ స్థలమునుండి కాలు కదపవద్దని ప్రవక్త ఆజ్ఞాపించిరి. యుద్ధము ప్రారంభమాయెను. యుద్ధము ముసల్మానులకే అనుకూలముగా ఉండెను. శత్రుసైన్యములు చెల్లాచెదరాయెను. ఇంతలో ముసల్మానులు శత్రువుల ఆహార సామగ్రిని దోచుకొనసాగిరి. ఇది చూచి కొండపై నియమితులైన విలుకాండ్రును

దోపిడి కొరగిరి. వారి నాయకుడగు అబ్దుల్లా బిన్ జుబైర్ వారి నెంతయు వారించెను. వారు వినరైరి. ఖురైషు నాయకుడగు ఖాలిద్ విలుకాండ్రు చెల్లాచెదరగుటను చూచి వెనుకనుండి పోటు సల్పెను. శ్రీప్రవక్తను శత్రువులు చుట్టుముట్టిరి. బాణముల వర్షము కురియుచుండెను. కత్తుల ఝణత్కారము నలువైపుల మ్రోగుచుండెను. శ్రీప్రవక్త అట్లు చుట్టుకొనబడినను ఆయన నోట,

"ప్రభూ!, ఈ జాతిని క్షమింపుము
వారు చేయుచున్నదానిని వా రెరుగరు."

అను మాటలు వెడలుచుండెను. శ్రీప్రవక్త కొండశిఖరముపై నెక్కిరి. శత్రువులు వెన్నాడజాలకపోయిరి. ఈ యుద్ధమున మొత్తముపై ముసల్మానులకే అపజయము కలిగెను. ఇది హిజరీ 3 వ సంవత్సరములో జరిగెను. ఈ యుద్ధవృత్తాంతమే ఈ అధ్యాయమున వివరింపబడెను.

రెండేండ్ల తర్వాత ఖురైషులు తిరిగి మదీనాపై దండువెడలి వచ్చిరి. ఈసారి పదివేల సైన్యముతో వచ్చి మదీనా పట్టణమునకు ముట్టడి వేసిరి. శ్రీ ప్రవక్త ఒక కందకము త్రవ్వించి, మదీనా సైన్యముల నందు నిల్పిరి. ఖురైషు సైన్యములు పెక్కుమార్లు మదీనాసైన్యములపై పోటు సల్పెను. కాని ప్రయత్నములన్నియు విఫలమయ్యెను. ఇంతలో వాతావరణపరిస్థితులు మక్కాసైన్యములకు అనుకూలముగ మారెను. మక్కా సైన్యములు ముట్టడిని మానుకొని వెనుకకు మరలెను. దీనినే 'కందకయుద్ధ' మందురు.

శ్రీ ప్రవక్త స్వసంరక్షణార్థము కావించిన మూడు యుద్ధముల వృత్తాంతమును క్లుప్తముగ ఇక్కడ వివరించుటకు కారణము కలదు. ప్రవక్త చేసిన ఈ యుద్ధములు మతసంస్థాపనమున కను ఒక అపోహ కలదు. ఈ అపోహ నెక్కువగా క్రైస్తవ మిషనరీలు వ్యాపింపజేసినవి. ఏసుక్రీస్తు ఒక చెంపపై కొట్టిన రెండవచెంప ఇవ్వవలెనని బోధించెననియు, శ్రీ మొహమ్మద్ ప్రవక్త అట్లుకాక యుద్ధములొనర్చెననియు క్రైస్తవ మిషనరీల ప్రచారము. ఏసుక్రీస్తుకూడ ఒక ప్రవక్తయే యని ఖుర్ఆన్ బోధించుచున్నది. అంతేకాదు. ప్రవక్తలలో భేదభావమును చూపవలదని ఆజ్ఞాపించుచున్నది. అందుచే మే మిక్కడ ఏసుక్రీస్తు బోధనలను విమర్శించములేము. క్రైస్తవచర్చి ఏసుక్రీస్తుపేర ప్రకటించిన ఈ సూత్రమును మాత్రమే ఇందుకై విమర్శించవలసి యున్నది.

ఇస్లామ్ ఒక సంపూర్ణమతమని ఖుర్ఆన్ అనుచున్నది. అంతేకాదు. ఖుర్ఆన్ ఒక కవియొక్క భావగీతి కాదు; మానవజీవిత మందలి సర్వాంశములను శాసించు ఒక సంపూర్ణ శాసనము. అన్ని పరిస్థితులయందును, అన్ని కాలములయందును, అన్ని దేశ

ములయందును, సమస్త నాగరకతావస్థలయందును అమలులో పెట్టగల ఒక సంపూర్ణ శాసనము ఖుర్ఆన్. అట్టి శాసనము మానవప్రకృతికి అనుగుణముగ నుండవలెను. ఆచరణసాధ్యమై యుండవలెను. మానవచరిత్రతో దానికి సంబంధ ముండవలెను. అప్పుడే అదొక సంపూర్ణధర్మమై యుండగలదు.

ఆదర్శమునకును ఆచరణమునకును గల భేదమును గమనించకుండుట వలన కలిగిన చిక్కిది. సంపూర్ణమగు అహింస ఒక గొప్ప ఆదర్శమే. కాని అది ఆచరణ సాధ్యమా ? అట్లే ఏసుక్రీస్తుయు, ఆధునికయుగములో టాల్‌స్టాయియు, గాంధీమహాత్ముడును బోధించిన సత్యాగ్రహమును ఆదర్శముగ గొప్పదేగాని ఆచరణసాధ్యమా ? తానొక్కడే సత్యాగ్రహి నని గాంధీజీ ఒప్పుకొనలేదా ?

ఖుర్ఆన్ మానవాదర్శములను బోధించుచు ఆచరణమార్గమును కూడ చూపినది. "నీ చెంపపై ఎవరైన ఒక దెబ్బ కొట్టినచో నీవుకూడ వానిచెంపపై ఒకదెబ్బ కొట్టవచ్చును. కాని వానిని క్షమించుట నీకొరకుత్తమ మైనది." ఇస్లామ్ కావించిన బోధ ఇది. నీ వొకరిచెంపపై కొట్టరాదు. కాని ఇతరు డెవ్వడైన నీచెంపపై కొట్టినా నీవు కూడ అతనిచెంపపై కొట్టవచ్చును. ఐతే ఒక దెబ్బతిని రెండుదెబ్బలు కొట్టరాదు. ఒకే దెబ్బ కొట్టవలెను. "అది న్యాయము." ఇదియు కేవలము అనుజ్ఞమాత్రము; ఆజ్ఞ కాదు. అంతకంటె ఉత్తమమార్గము క్షమించుట; అపకారిని క్షమించుట ఆదర్శము. ఒహద్ యుద్ధరంగమున శత్రువులు ప్రవక్తపై విరిగి పడినప్పుడు ప్రవక్త ఏమి చెప్పుచుండెనో మరొకసారి వినుడు: "ప్రభూ! యీ జాతిని క్షమింపుము. వా రేమి చేయుచున్నారో వారికి తెలియదు." ఇది ఆదర్శము. ప్రవక్తకు వారిపై ద్వేషము లేదు; వారిపై ఆగ్రహము లేదు; వారి అజ్ఞానమునకు జాలి, కరుణ మాత్రమే ఆయన హృదయమును కలచుచుండెను. ఇస్లామ్ ధర్మరహస్య మిదే.

బౌద్ధ క్రైస్తవ నీతినిగూర్చి ఆధునిక నీతిశాస్త్రజ్ఞులలో మేటియగు L. T. Hobhouse ఏమి చెప్పుచున్నాడో చూడుడు:

"In Buddhism and Christianity the spiritual order formed for itself a new sphere detached from the more elementary morals of the ordinary good citizens. In this detachment, however, were seeds of trouble. We have already seen that the Buddhist life could hardly be lived in its perfection by the

ordinary householder. The spiritual and the human had already fallen apart. In Christianity the fissure is in some respects deeper." క్రైస్తవమతములో ప్రకృతి పాపభూయిష్టము. అందుచేత ఈ ప్రపంచ మంతయు పాపపంకిలము. "The great institutions of humanity, marriage, fatherhood, citizenship, are things of this world. The Christian must make his account with them, but they are not of Christian origin ....Christ's true kingdom is not of this world........ ...The detachment of what was best in Christianity from the world's affairs made a Christian body unfit to rule the world's affairs." ఇస్లామ్ ప్రపంచవిశాలమగు మానవసంఘమునకు కావలసిన ఒకశాసనము నిచ్చుచున్నది. కాని "Christianity has, in fact, no theory of society by which to guide itself. Its doctrine is personal. The common life that it contemplates is a life of brotherly love, a community of saints, where all things are in common and lawsuits are not, nor any other mode of maintaining order by the strong arm. *Hence, amid all the wonderful descriptions of charity, of life, of self-surrender, we hear very little of justice.*

"The code of the Sermon on the mount appears to contemplate what in modern phrase we should call a voluntaryist or Anarchist community. Non-resistance is its central feature, There is to be no fighting; no revenge, ...no self-defence, no insistence on private property,no excessive provision for the future. If there is to be any marrying or giving in marriage, there is to be no divorcing of wives 'save for the cause of fornication.'............Altogether a life that might be lived *for a while by a picked*

body of perfect men and women. How were these rules to be made applicable to a world in which men and women are so far from perfect ?"

ఈ సిద్ధాంతమును యుద్ధవిషయమున అమలులో పెట్టుటనుగూర్చి వ్రాయుచు హాబ్‌హౌస్ "On this side also the maintenance of the pure teaching of the Gospel has been left to small and isolated sects........The doctrine of non-resistance was frankly abandoned by the majority of the churches............It is accepted in the canons as a part of the divine law, but as abrogated by the positive law of the empire .... The pure teaching of the Gospel was left to a few condemned sectaries to preserve, and was put aside by respectability as being merely that which *certain Anabaptists do falsely boust.*"

ప్రకృతికి అతీతమైన క్రైస్తవనీతిని ఖండించుచు హాబ్‌హౌస్ ఇట్లనుచున్నాడు: "Supernatural ethics fail in that they do not recognise *the ideal element in the performance of natural duty.*" †

ఇంక ఖుర్‌ఆన్ యుద్ధమున కెట్టి పరిస్థితులలో అనుజ్ఞ ఇచ్చినదో చూడుడు:—

"ఏ ముసల్మానులతో (కాఫరులు) యుద్ధము చేయుచున్నారో, ఇప్పుడు వారికి కూడ యుద్ధము చేయు అనుజ్ఞ ఇవ్వబడుచున్నది. ఎందు కనగా వారిపై దౌర్జన్యము చేయబడినది. నిస్సందేహముగ భగవంతుడు వారికి సాయపడును." (22 : 39)

"అల్లాః మా ప్రభువు అన్నంతమాత్రమున వారు అన్యాయముగ తమ ఇండ్లనుండి వెడలగొట్టబడిరి. భగవంతుడు ఒకరి నింకొకరిద్వారా రక్షించి యుండక పోయినచో భగవన్నామస్మరణము ఎక్కువగా చేయబడు (క్రైస్తవుల) మఠములును, చర్చిలును (యూదుల) ప్రార్థనాలయములును, (ముసల్మానుల) మస్జిదులును నిస్సంశయముగ విధ్వంస మొనర్పబడియే యుండును. ఎవరు భగవంతునకు తోడ్పడుదురో వారికి భగవంతుడు తోడ్పడును. నిస్సందేహముగ భగవంతుడు సర్వబలసంపన్నుడు ; సర్వశక్తిమంతుడు. (22 : 49.)

† L. T. Hobhouse, *Morals in Evolution*, Vol. ii. PP. 150 – 159.

"మీతో యుద్ధము చేయుచున్నవారితో మీరుకూడ భగవన్మార్గమున యుద్ధము చేయుడు. కాని మితిమీరకుడు. హద్దుల నతిక్రమించిన వారిని భగవంతుడు ప్రేమింపడు." (2 : 190.)

"(రక్తపాతము మంచిది కాకపోయినను) దౌర్జన్యము స్థిరపడుట (తాత్కాలికమగు) రక్తపాతము కంటె చెడ్డది." (2 : 191)

"ఒకసారి వారు యుద్ధము మానుకొనినచో భగవంతుడు క్షమించువాడు; కృపానిధి." (2 : 192.)

"వారి దౌర్జన్య మణగువరకు వారితో యుద్ధము చేయుడు. మతము భగవంతునకు సంబంధించినది. ఒకసారి వారు యుద్ధము మానుకొనినచో మీరుకూడ యుద్ధమును మానుకొనుడు. దౌర్జన్యము చేయువారితోడనే పోరాడవలెను." (2 : 193)

"........అన్యాయముగ కయ్యమునకు కాలు ద్రవ్వి మీ కెవరైనను హింస యొనర్చుచో దానికి సమానమైన హింసను మీరును చేయుడు. భగవంతునకు(మాత్రమే) భయపడుడు. ధర్మపరులకు భగవంతుడు తోడుండు నన్నమాట మరువకుడు. (2 : 194)

"........మానవుని భగవన్మార్గమున నిరోధించుట, కాబాలోనికి వెళ్లకుండ అడ్డుపడుట, ముక్కావాసులను వారి నివాసములనుండి వెడలగొట్టుట—ఇవి భగవంతుని దృష్టిలో అంతకంటెను చెడ్డవి. విద్వేషములను రగుల్కొల్పుటయు, కష్టపెట్టుటయు సంహారముకంటెను దుష్టమైన పనులు. (2 : 217)

"(ఓ విశ్వాసవంతులారా !) నిస్సహాయులగు ఇంతమంది పురుషులు, స్త్రీలు, పిల్లలు (దుర్మార్గుల హింసలకు తాళలేక) 'ప్రభూ ! మమ్ములను ఇంతగా బాధపెట్టుచున్న హింసలకు వీరి పట్టణమునుండి మాకు ముక్తి నిమ్ము. నీవు మాకొరకు ఒక పోషకుని, ఒక సహాయ్యుని ప్రసాదింపుము.' అని మొఱ పెట్టుకొనుచుండగా (వారిని రక్షించుటకు) మీరు భగవన్మార్గమున యుద్ధము చేయుటకు వెనుదీయుచున్నారా ?" (4 : 75)

"తమ వాగ్దానములను భంగ మొనర్చి, ప్రవక్తను వెడలగొట్ట నిశ్చయించి, మీతో (యుద్ధమును) వారే ప్రారంభించినప్పుడు వారితో మీ రేల యుద్ధము చేయరాదు ? మీరు వారికి భయపడుచున్నారా ఏమి ? మీరు విశ్వాసవంతులే యైనచో భగవంతునకే భయపడుడు." (9 : 13)

ఈ విధముగ స్వసంరక్షణార్థము యుద్ధము చేయుటకు ఖుర్‌ఆన్ అనుమతి నిచ్చుచున్నది. ప్రపంచమునందలి సర్వధర్మములును దీని కనుమతించుచున్నవి. అహింసావాదు

లగు ఆర్యఋషులుకూడ స్వసంరక్షణార్థమును, దుష్టశిక్షణార్థమును కత్తికట్టుట ధర్మమనియే శాసించిరి. మనువు "దండం ధర్మం విదుర్బుధాః" అని దండమే ధర్మహేతువనియు, కనుక అది ధర్మమని పెద్దలు చెప్పిరనియు చెప్పుచున్నాడు. దండమే నిషేధమను సిద్ధాంతమును ఆర్యఋషు లెచ్చటను చెప్పలేదు. కాని దండమును ప్రయోగించు రాజు సత్యవాదియు, ప్రాజ్ఞుడును, ధర్మకామార్థకోవిదుడునై యుండవలెనని భారతఋషు లనిరి. మనువు (VII : 27) దుర్మార్గుని చేతిలో దండము హింసాకారణమగునని చెప్పుచున్నాడు. ఒక సత్ప్రవర్తకుని చేతిలో అదే హింసానిరోధక మగును.

మను వనినట్లు

సర్వో దండజితో లోకో దుర్లభో హి శుచి ర్నరః
దండస్య హి భయాత్సర్వం జగద్భోగాయ కల్పతే. (VII : 22)

(ఈ లోక మంతయు దండముచేతనే నియమింపబడినదై సన్మార్గమునం దున్నది. లోకమునందు దండము లేక స్వాభావికముగ పరిశుద్ధుడైన మానవు డుండుట అరుదు. దండభయమువలననే ఈ జగమంతయు భోజనాది కార్యములు జరుపుకొనగల్గియున్నది.)

* * * *

౭౯. ఒహద్ యుద్ధమునుగూర్చి వెనుకటి నోటులో చెప్పబడినది. ఈ యుద్ధకథ ఒక గుణపాఠముగ ఖుర్ఆన్ జ్ఞప్తికి తెచ్చుచున్నది. క్రమశిక్షణము లేకపోవుట, ఆత్మవిశ్వాసము లేకపోవుట, భగవంతునియందు నమ్మక ముంచకుండుటవలన పతనము తప్పదని ఖుర్ఆన్ ఉపదేశించుచున్నది.

* * *

౮౦. ఒహుద్ యుద్ధరంగమున ప్రవక్త పన్నొకటి విరిగెను. ప్రవక్త అప్పుడు "తమ్ము సన్మార్గమువైపునకు పిల్చు ఒక ప్రవక్తను ఈ విధముగ హింసించుచున్న ఈ జాతికి మోక్ష మెట్లు కల్గును?" అని ఆగ్రహముతో చెప్పగా (ఈ సూక్తము ప్రోక్తమైనదని భాష్యకర్తల అభిప్రాయము.) అట్లు శపించవలదని భగవంతుడు ప్రవక్తను హెచ్చరించుచున్నాడు. నేటి శత్రువులు రేపటి మిత్రులు కావచ్చును. నేటి అవిశ్వాసులు రేపటి విశ్వాసవంతులు కావచ్చును. తొందరపడి శత్రువులనైనను దూషించుట భావ్యము కాదని ఖుర్ఆన్ బోధించుచున్నది. ఖుర్ఆన్ గరపిన క్షమాపాఠము నిరుపమాన మైనది.

* * *

౮౧. ఇక్కడ మూ డుపదేశములు చేయబడుచున్నవి : దానతత్పరత, కోపము ఆపుకొనుట, పరుల తప్పులను క్షమించుట.

దానమునకు ఇస్లామ్‌లో ఎంత ప్రముఖస్థాన మున్నదో వెనుక చర్చించితిమి.

ఇక్కడ కోపము నాపుకొనుటను గూర్చి శ్రీ ప్రవక్త ఉపదేశములను కొన్నిటి నుదహరింతును. ఎందుకనగ ప్రవక్త ఉపదేశములు అసలు ఖుర్ఆన్ సూక్తులకు వ్యాఖ్యానములు.

"మల్లయుద్ధమున తన ప్రతిపక్షిని చిత్తుచేయువాడు నిజమైన బలవంతుడుకాడు కోపము వచ్చినప్పుడు దానిని అరికట్టువాడే బలవంతుడు." (అహమద్)

"హారిసా అను ఒక శిష్యుడు నాకు క్లుప్తముగ నుండు ఉపదేశము చేయుడు అని శ్రీ ప్రవక్తను కోరెను. "ఆగ్రహింపకుము" అని ప్రవక్త సెలవిచ్చిరి. ఆయన తిరిగి ప్రశ్నించెను. తిరిగి ప్రవక్త అదే జవాబు నిచ్చిరి. ఇట్లే పలుమార్లు ఇదే జవాబు నిచ్చిరి." (మస్నదె అహమద్)

"ఒకాయన ప్రవక్త కడకు వచ్చి నా కేదేని ఉపదేశింపుడని కోరెను. "కోపము మానుము" అని ప్రవక్త సెలవిచ్చిరి. నే నాలోచించి చూడగా కోపము చెడుగు లన్నిటికిని మూలమని తెలిసెను అని అతడు చెప్పెను." (మస్నదె అహమద్)

"ప్రవక్త శిష్యులలో ఒకరగు 'అబూజర్' అను నాయనకు ఒకసారి కోపము వచ్చెను. ఆయన వెంటనే అక్కడ కూర్చొనిపోయెను. కొంతసేపటికి పండుకొనెను. ఇట్లేల చేయుచున్నారని ఆయన నడుగగా 'ఇది ప్రవక్త ఉపదేశము. శ్రీవారు ఇట్లు సెలవిచ్చిరని వింటిని: నిలువబడి యున్నప్పుడు కోపమువచ్చినచో కూర్చొనవలెను. అంతటితో కోపము పోనిచో పండుకొనవలెను." (మస్నదె అహమద్)

"కోపము వచ్చినప్పుడు వుజూ (నమాజు చేయబోయినప్పుడు చేయు ప్రక్షాళన విధి) చేయుడు. మీ కోపము చల్లారును." (ఇబ్నెకసీర్‌లో ఉద్ధృతము)

"ఎవరు తమ కోపమును తీర్చుకొనగలిగియు కోపము నణచివేయుదురో వారి హృదయములను భగవంతుడు శాంతిప్రపూర్ణ మొనర్చును." (అబూదావూద్)

ఇంక పరుల దోషములను క్షమించుటనుగూర్చి శ్రీ ప్రవక్త కావించిన కొన్ని ఉపదేశములను వినుడు :

"మీరు ఇతరులయెడ దయచూపుడు; భగవంతుడు మీయెడ దయచూపును. మీరు ఇతరులను క్షమింపుడు; భగవంతుడు మీ పాపములను క్షమించును." (మస్నదె అహమద్)

"ఎవరు ఇతరుల తప్పిదములను క్షమింతురో వారి గౌరవము హెచ్చును."

„నమ్రుడై ఇతరుల తప్పిదములను క్షమించువాడు భగవంతునికడ ఉన్నతస్థానము పొందును.”

„ఎవరు ఉన్నతస్థానమును పొందగోరుదురో వారు దుర్మార్గులను సైతము క్షమించవలెను.”

„ఇతరుల పాపములను క్షమించువారు స్వర్గమును ప్రవేశింతురు.”

పై ఉపదేశ రత్నములు ఇబ్నెకసీర్ భాష్యమునుండి సంగ్రహింపబడినవి.

దానమునుగూర్చిన ఈ క్రింది వాక్యములను ఇబ్నెకసీర్ ఈ మాక్తు భాష్యములో ఉదహరించెను ;

“ శ్రీప్రవక్త తన శిష్యుల నిట్లడిగిరి ; ‘ దరిద్రు డనగా ఎవడో మీకు తెలియునా?’ శిష్యు లిట్లు జవా బిచ్చిరి : “నిర్ధనుడు దరిద్రుడు.” దానికి ప్రవక్త : “కాదు; ఎవడు ధన ముండియు భగవన్మార్గమున దానము చేయడో వాడే దరిద్రుడు.”

(మస్నద్ అహమద్)

“ ఒకసారి శ్రీ ప్రవక్త తమ శిష్యుల నుద్దేశించి : ‘ తమ ధనముకంటె తమ వారసుల ధనముయెడ ఎక్కువ ప్రీతి గలవారు మీలో ఎవరున్నారు ?’ అని ప్రశ్నించిరి. ‘ ఎవరును లేరు.’ అని శిష్యులు జవాబు చెప్పిరి. ‘ మీరు దాన ధర్మాదులలో ఖర్చుచేయు సొత్తే మీది, మీరు విడిచిపెట్టి వెళ్ళునది మీది కాదు; అది మీ వారసులది. మీరు దాన ధర్మములు తక్కువగ చేసి ధనము కూడబెట్టినచో మీరు మీధనముకంటె మీ వారసుల ధనమును ఎక్కుడు ప్రీతితో చూచుచున్నా రన్నమాట.”

(బుఖారీ : ముస్లిమ్)

* * *

౨౨. చరిత్రతో కార్య కారణ సంబంధమును మొట్టమొదట నిరూపించిన మతము ఇస్లామ్. ప్రపంచ మంతటను ఒక యూనిట్ గా భావించి ప్రపంచచరిత్రను గుణపాఠముగ ఖుర్ ఆన్ గ్రహింపు డనుచున్నది. అంతటితో ఆగక దేశాటనము చేయు డనుచున్నది. భగవంతుని నియమములు ఉల్లంఘించి హద్దుల నతిక్రమించినప్పుడు జాతులకు పతనము తప్పదు. వివిధ నాగరికతలు ప్రపంచములో ఎట్లు విధ్వంస మైనవో తిరిగి చూడుడని ఖుర్ ఆన్ ప్రబోధించుచున్నది. అందుచేతనే ముస్లిములు కేవలము శాస్త్రాభివృద్ధిని భావనపై విడిచిపెట్టలేదు. వారు నూటిగా ప్రకృతినుండి అభ్యాస సిద్ధజ్ఞానమును బడసిరి. డాక్టరు డ్రేపర్ ఈ విషయమున నిట్లనుచున్నాడు :

“They (the Arabs) perceived that it (Science) can never advance by mere speculation ; its only

sure progress is by the practical interrogation of the nature.” §

ప్రకృతిశాస్త్రపరిశోధనమునకు అనుకూల మనస్సంస్థితిని కలిగించు దృక్పథమును ఖుర్ ఆన్ కలిగించినది. అందుచేతనే ముస్లిమ్‌లు అజ్ఞానాంధకార బంధుర మైన నాటి ప్రపంచములో విజ్ఞానజ్యోతిని జాజ్వల్యమానముగ వెలిగింపగలిగినది. ఈ విషయమును చర్చించుచు డాక్టర్ డ్రేపర్ గారు తన History of the Conflict between Religion and Science (P. 91.) అను ఉద్గ్రంథములో ఇట్లనుచున్నాడు :

“To the Christian the progress of the world was an exhibition of disconnected impulses, of sudden surprises. To the Mohammaden that progress presented a very different aspect. Every corporeal motion was due to some preceding motion; every thought to some preceding thought ; every historical event was the offspring of some preceding event; every human action was the result of some foregone and accomplished action. In the long annals of our race nothing has ever been abruptly introduced. There has been an orderly, an inevitable sequence from event to event.”

* * * *

౨౩. యుద్ధమునందు జయాపజయములును, అట్లే జీవితమందలి ప్రతిసాఫల్య వైఫల్యమునుకూడ మన ప్రవర్తనముపై ఆధారపడి యుండును. కాని ఇష్టము వచ్చినట్లు కలుగవు. ప్రపంచములో ప్రతిదానికిని కార్య కారణ సంబంధమున్నది. ఐతే భగవంతుడు దయాపరిపూర్ణుడుకదా ఇంత కఠినమగు నియమము ఏల యేర్పరచెను ? అను ప్రశ్న రావచ్చును. మనకు కలుగు వైఫల్యము, కష్టనష్టములు, బాధ — మున్నగు నవన్నియు మనకు గుణపాఠములుగా ఉండి మనలో సంస్కారమును కలిగించును. స్వయముగ అనుభవము లేక ఇతరులు చెప్పినదానికంటె అనుభవము పొంది నేర్చుకొనిన గుణపాఠము హృదయమున అచ్చొత్తుకొనిపోవును.

పెక్కు చోట్ల ప్రపంచమునందలి దురవస్థ (Evil) ను గూర్చి ఖుర్ ఆన్ చర్చించుచున్నది. “మనకు ఏ మంచి కలిగినను భగవత్కృప యనియు, మనకే దురవస్థ సంభవించినను అది మన చేతులతో చేసికొన్నదాని ఫలిత మనియు ఖుర్ ఆన్

§ History of the Conflict between Religion and Science, By *John William Draper*, M. D., LL. D., (*Watts & Co., London*) P. 94.

చెప్పుచున్నది. అట్లు సంభవించిన దురవస్థ మనకు గుణపాఠమై సంస్కారమును కల్గించునదై యుండవలెను. మన కది క్రమశిక్షణమును కల్గించునదై యుండవలెను. భౌతికమగు ఈ దురవస్థయే మానవుని సర్వ ప్రగతికిని మూలకారణమని ఒక పాశ్చాత్య భావుకుడు చెప్పినది సత్యదూరము కాదు. †

* * * *

౪౪. ఒహొద్ యుద్ధరంగమున ప్రవక్త మరణించెనని శత్రువులు కొందరు ఒక వదంతిని వ్యాపింపజేసిరి. దానితో ముస్లిం సైనికుల ధైర్యము సడలెను. వారిలో కొందరు వెనుజూపిరి. ఆ సందర్భమున ఈ సూక్తము ప్రోక్తమాయెనని వ్యాఖ్యాతల అభిప్రాయము.

ముస్లిమ్ సైన్యములు ఒక సత్యమును నిలబెట్టుటకై ధర్మవిధ్వంసకులగు శత్రువులతో పోరాడుచుండిరి. ఆ సత్యమును ప్రవచించిన ప్రవక్తకంటె సత్యము ముఖ్యమైనది. అందుచే సత్యసంస్థాపనము ప్రవక్త బ్రతికియుండుటపై ఆధారపడి లేదనియు, ఆయన మరణించినను ఆపని సాగుచునే యుండవలెననియు ఖుర్ ఆన్ బోధించుచున్నది. ఇతర మతములలో మత ప్రవక్తలకు ఎక్కువ ప్రాముఖ్యము నిచ్చి క్రమక్రమముగ ఆ ప్రవక్తలనే దైవతములుగ కొలువసాగినారు. వారు బోధించిన సత్యముకంటె వారి వ్యక్తిత్వముపై ఎక్కువ మక్కువ కలిగించుకొని అసలు మతమును విడిచి ఈ ప్రవక్తలను పూజించుటే మతమొనర్చినైచినారు. శ్రీకృష్ణుడు, ఏసుక్రీస్తు, బుద్ధుడు మున్నగు మతప్రవక్తల సందేశము సంగతి ఎట్లున్నను, ఈ మహాత్ములు మాత్రము దేవుళ్ళయి వేలకొలది దేవాలయములలో అధిష్ఠించియున్నారు. ఖుర్ ఆన్ ఇట్టి ప్రమాదమునకు తావే ఇచ్చినది కాదు. "మొహమ్మద్ కేవలము మానవమాత్రుడు; అందరి ప్రవక్తలవలె ఒక ప్రవక్త. ఆయనకూడ జననమరణాది భగవన్నియమములకు బద్ధుడై మరణింపగలడు. అని ప్రవక్తకు ఏవిధమైన దైవత్వమును ఎవ్వరును ఎక్కడను ఆపాదింపకుండ ఖుర్ ఆన్ కట్టుదిట్టములు చేసినది.

* * *

౭౯. అతీంద్రియములగు విషయములు అంతర్దృష్టికి గోచరించునవియే గాని మానవ భాషలో అనువదింప దగినవికావు. ఒకసారి చెప్పినను ఏదేని సాంకేతిక మగు భాషయందు చెప్పబడవలసినదే. ఇట్టి భాష ప్రమాదజనితమై పరిణమించినది. అందుచే

† "Physical evil has been the good which has impelled man to most of those achievements which make the history of man so wonderful. Hardship is the stern but fecund parent of invention."

సాధ్యమైనంతవరకు ఖుర్ ఆన్ అతీంద్రియ విషయములు అట్టి భాషలో చెప్పలేదు. అతీంద్రియ విషయజ్ఞానము ప్రవక్తలకు మాత్రమే ప్రసాదింపబడిన దనియు, సామాన్యులెల్లరకును అది చెప్పబడదగినది కాదనియు ఖుర్ ఆన్ ఇక్కడ చెప్పుచున్నది.

* * *

౮౦. "భగవంతుడు తన అనుగ్రహముచే ప్రసాదించిన దానిని దానముచేయునెడ లోభము చూపువారు" అను వాక్యాంశమును నేను "భగవంతుడు తన అనుగ్రహముచే ప్రసాదించిన (ధన ధాన్య విద్యా) సంపదలను దానము చేయునెడ లోభము చూపువారు"

అని వివరణానువాద మొనర్చితిని.

భగవంతుడు ప్రసాదించిన ఎట్టి సంపదనైనను దానముచేయుటయందు లోభింపవలదని ఇక్కడ ఖుర్ ఆన్ ఆదేశము. ఇబ్నె అబ్బాస్ గారు ఈ సూక్తమునకు భాష్యమును వ్రాయుచు క్రైస్తవ పండితులును, యూదుల పండితులును ధర్మవిజ్ఞానమును రహస్యముగ నుంచి విద్యాదానము చేయుటలో చూపు లోభమునుగూర్చి ఇందు చెప్పబడినదని వ్రాయుచున్నారు. (ఇబ్నెకసీర్, సం. 4, పుట 48). విద్య మున్నగునవికూడ భగవంతు డిచ్చిన సంపదలలో చేరునని ఇబ్నెకసీర్ అభిప్రాయము.

"ఎవడైన ఒకడు తన యజమాని కడకు వెళ్ళి తన అవసరము నిమిత్త మర్థింపగా తన కడ ధన ముండియు ఇవ్వని యజమాని తుదిదినమునాడు శిక్షింపబడును." అని శ్రీ ప్రవక్త వచనము. (తబరీ.)

"ఎవడైన ఒక బీదవాడు ధనికుడైన తన బంధువునికడకు వెళ్ళి తన అవసరము నిమిత్త మేదేని యర్థింపగా, తనకడ ఉంచుకొనియు లేదని చెప్పినవానిధనము తుదిదినమునాడు వాని కంఠమున సర్పమై చుట్టుకొనును" అని శ్రీ ప్రవక్త వచనము మరొకటి కలదు. (ఇబ్నె జరీర్)

* * *

౮౨. "మీ రింతకుముందు మీచేతులతో చేసికొనిన దాని ఫలమిది. అంతేకాని భగవంతుడు తన సేవకులను హింసింపడు."

ఒక వ్యక్తికి గాని, ఒక జాతికి గాని సంభవించు "దురవస్థ"కు కారణ మేమి? దీనికి కారకుడు భగవంతుడా? లేక అది ఆ యా వ్యక్తులుగాని, జాతులుగాని చేయు అపరాధముల లేక పాపముల ఫలితమా? అన్న ప్రశ్నలకు ఇది జవాబు: భగవంతుడు

కరుణామయుడు. అట్టి భగవంతుడు మానవులను హింసించునా? మన కే చెడుగు సంభవించినను మనమో లేక మన ముండు సంఘమో చేసినదాని ఫలితమే.

'దురవస్థ' రెండువిధము లైనది: వ్యక్తిగతమైన దొకటి; జాతికి ప్రాప్తించి, దానిమూలమున ఆ జాతియొక్కగాని, సంఘముయొక్కగాని వ్యక్తులకు సంక్రమించున దొకటి. ఒకటి మనముచేయు చెడువలన సంభవించునది. ఇతరుల చేతలవలన మనకు ప్రాప్తించున దొకటి.

ఈ రెండువిధము లైన 'దురవస్థ'లకును భగవంతుడు కర్త కాడని ఖుర్ఆన్ చెప్పుచున్నది. భగవంతుడు మంచినే చేయును. మనకు మంచినే కలిగించును. తన సేవకుల మగు మనకు బాధ కలిగించి హింసింపడు. మనకు కలుగు బాధా దుఃఖములు స్వయంకృతాపరాధములకు లభించిన శిక్షయే కాని వేరొండు కాదు. ఖుర్ఆన్ తుది రెండు అధ్యాయముల వ్యాఖ్యానములో ఈ విషయమును దీర్ఘముగ చర్చింతును.

* * *

౮౫. భగవంతుని మరచి, ఈ ప్రపంచమునం దనుభవించునదే సర్వస్వము, చచ్చిన తర్వాత ఏమియు కాదని అనుకొని ఇష్టము వచ్చినట్లు ప్రవర్తించువారికి ఇది చెప్పబడుచున్నది. ఈ లోకపుజీవితము విషయవాంఛలతో కూడుకొన్నది. ఐహిక జీవిత మందలి విషయవాంఛలయందే తగుల్కొని, ధర్మబుద్ధిని వదలి ప్రవర్తించువాడు పతితు డగును. అందుచే ప్రపంచమునందలి చెడుగునుండి తప్పించుకొని తిరుగవలసినదనియు, ఈ జీవితమే సమస్తమును అనుకొనవల దనియు, పరలోకమును మరువవలదనియు ఖుర్ఆన్ హెచ్చరించుచున్నది.

* * * *

౯౫. స్త్రీ పురుషులు సమానులనియు, ఇద్దరకును ఒకే విధమైన కర్మఫలము లభించుననియు ఖుర్ఆన్ ఇక్కడ స్పష్టముగ చెప్పుచున్నది. స్త్రీలకు ఆత్మసైతము లే దనియు, స్త్రీలకు స్వర్గ నరకములు వారి భర్తలపై ఆధారపడియున్న వనియు, స్త్రీలకు పుణ్యకార్యములు చేసికొను స్వతంత్రాధికారమే లే దనియు వెనుకటి మతములలో ఉండెను. ఖుర్ఆన్ స్త్రీలకు పురుషులతో సమానమగు కర్మఫలము కలదని వక్కాణించుచున్నది.

ప్రపంచములో ఇతరమతములు స్త్రీకి ఇహమునను పరమునను కూడ ఎట్టి స్థానము నిచ్చినవో తరువాతి అధ్యాయ పీఠికయం దిచ్చితిని.

* * *

بسم الله الرحمن الرحيم

వ్యా ఖ్యా న ము

నాల్గవ అధ్యాయము

స్త్రీలు

పీఠిక

ఈ అధ్యాయమునందు స్త్రీల హక్కుల విషయకమైన ఆదేశము లుండుటచే దీనికి "స్త్రీలు" అని నామకరణము చేయబడినది.

మానవహక్కుల విషయములో ఇస్లామ్ ప్రతిపాదించిన వైప్లవికసిద్ధాంతములలో స్త్రీ స్వాతంత్ర్య మొకటి. ధన, జాతి, వర్ణ, కుల, లింగభేదముల నాధారముగా ప్రపంచమునందు ప్రబలిన దౌర్జన్య పిశాచమును మొదలంట నశింపజేసి మానవజాతికి, అందలి ప్రతి వ్యక్తికిని ఒక విశిష్టమైన స్థానమును ప్రసాదించినది ఇస్లామ్. ధనబలమును, జాతి వర్ణ కులభేదములను ఊతగాగొని ఒకరిపై నొకరు దౌర్జన్యమునకు గడగుటను ఖుర్ఆన్ ఏ విధముగా నిషేధించినదో, అట్టి దౌర్జన్యమునకు అవకాశము లేకుండ భ్రాతృత్వ సమానత్వ సిద్ధాంతములు పునాదిగాగల సంఘము నే తీరున ప్రతిపాదించినదో వెనుకటి అధ్యాయములందు వివరింపబడినది. ఇప్పుడు లింగభేదము నాధారముగా మానవసంఘమున ప్రబలిన దౌర్జన్యమును నిషేధించుచు ఖుర్ఆన్ కొన్ని నియమముల నిచ్చుచున్నది.

ప్రతిదేశమునందును మొన్న మొన్నటివరకు స్త్రీ పురుషునిబానిసగ భావింపబడుచుండెడిది. ఆమెకు పుట్టింటియందుగాని, భర్త ఇంటియందుగాని ఎన్నదగిన హక్కులేవియు లేవు: గృహిణి యగుటచేతను, భర్త ప్రేమకు పాత్రురా లగుటచేతను ఆమెకు భర్త బ్రతికియుండగా కొంత పలుకుబడియు, పెత్తనమును ఉండుట సహజము. ధీ సంపన్న లగు కొందరు స్త్రీలు పురుషులకంటె ఒక్కొక్కప్పుడు ఆధిక్యతను సంపాదించుటయు కలదు. కాని సాధారణముగ స్త్రీ ప్రతిదేశమునందును పురుషుని ఆటవస్తువుగను

బానిసగను ఉండెడిది. ఆమెకు స్వాతంత్ర్యార్హత లేదు. ♦ ఆమె ఇంటియందు సైతము స్వతంత్రముగ ఎట్టి పనియు చేయరాదు.* ఆమెకు ఆస్తి లేదు. § భర్త చనిపోయిన తర్వాత కూడ ఆమెకు భర్త ఆస్తియం దెట్టి హక్కును లేదు. ఆమె కష్టపడి గడించు ద్రవ్యముపై సైతము ఆమెకు హక్కు లేదు; వేయేల? ఆమెకు ఒక ప్రత్యేక వ్యక్తిత్వమే లేదు. † భర్త తనభార్యను చంపినను అది నేరము కాదు. ‡ భర్తతర్వాత భార్యకు బ్రతికియుండు హక్కే లేకపోయెను. భర్తతోపాటు చితాగ్నియందు పడి చావవలసినదే. ఒకవేళ సహగమనబాధ తప్పినను తల గొరిగించుకొని వికారరూపము దాల్చి యావజ్జీవము అందరిచే అసహ్యించుకొనబడుచు ఊడిగము చేసి బ్రతుకవలసినదే. స్త్రీకి ఆధ్యాత్మికముగ శూద్రనిస్థాన మివ్వబడెను. ఆమెకు వేదపఠనార్హత లేదు. వివాహమే ఆమెకు సంస్కారము. భర్తృశుశ్రూషయే ఆమెకు స్వర్గము. భర్త అను

♦ "పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే।
రక్షంతి స్థావిరే పుత్రా న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి॥" (మను : 9, 3)

ఇంకను మనువు (5: 148), బౌధాయన ధర్మసూత్రములు II : 2, 3, 44-45, వాసిష్ఠ ధర్మసూత్రములు V, 2 కూడ చూడుడు.

"She was (under Roman law) in perpetual ward, subject, in short, to the Chinese rule of three obediences." (Hobhouse Vol. I, P. 219.)

* "బాలయా వా యువత్యా వా వృద్ధయా వాపి యోషితా।
న స్వాతంత్ర్యేణ కర్తవ్యం కించిత్కార్యం గృహేష్వపి॥"
(మను. 5 : 147)

§ మను. IX. 194. 1882 వ సంవత్సరమువరకు ఇంగ్లాండులో స్త్రీకి ఆస్తి హక్కు లేదు. 1870 వరకు స్త్రీకి ఆమె గడించినదానిపైకూడ హక్కు లేకుండెను. ఇతర ఐరోపీయదేశములలోకూడ ఇటీవలివరకు స్త్రీ నిర్ధనగానే ఉండెను.

† "In the English law of Blackstone's day, for example, a married woman can scarcely be said to have any personality, so great is the number of her disqualifications as to the holding of property, as to capacity to give evidence, as to the custody of her children, even as to her legal responsibility for crimes; and many of these disqualifications lasted on down to the present generation." (Hobhouse, Ibid, Vol. I, P. 36.)

‡ "Down to the ninth century the husband was possibly within his rights in killing his wife for a 'good' reason." (Hobhouse Vol. I, P. 223).

మతి లేక ఆమెకు వ్రతముగాని ఉపవాసముగాని లేదు పురుషుడు తనభార్యను బానిసగ కూడ అమ్మివేయుట ధర్మ్యమే యై యుండెను. §

వెనుకటి మతములందును, సంఘములందును స్త్రీ కివ్వబడిన స్థాన మిది. దీనికి కారణముల నరయుదము.

ఆర్షమతమున స్త్రీల కివ్వబడిన ఈ నికృష్ట స్థానమునకు కారణము పురుషులకు స్త్రీలయెడల కల ద్వేషభావము కాదు. పురుషుడైనవానికి స్త్రీయెడ ద్వేషభావ ముండుట అసహజము. పురుషుని తల్లి, అక్కచెల్లెండ్రు, భార్య, కూతుండ్రు వీరందరు స్త్రీలే కదా! ఏ పురుషుడు తన తల్లిని ద్వేషించును? ఏ పురుషుడు తన అక్కచెల్లెండ్రను అసహ్యించుకొనును? ఏ పురుషుడు తన భార్యను ప్రేమింపడు? ఏ పురుషుడు తన కూతుండ్రను మక్కువతో గారవింపడు? "ఏ కులమున అతివలు గౌరవింపబడుదురో ఆ కులమువారిపై వేల్పులు దయ కలిగియుందురు. ఏ కులమున వీరికి మన్ననలు లేవో ఆ కులమువారు చేయుక్రియ లన్నియు నిష్ఫలములు. ఏ కులమున తోబుట్టువులు, భార్యలు, కోడండ్రు పూజితలు కారో ఆ కులము శీఘ్రముగ నశించును. ఏ కులమున వీరు పూజాదులచే వగపులేక యుందురో ఆ కులము సర్వదా వృద్ధినొందుచుండును." † అని మనువు చెప్పుచున్నాడు.

ఇట్లయ్యు స్త్రీల కీ నికృష్టస్థాన మేల కల్పింపబడినది? వారికి శూద్రత్వ మేల ఇవ్వబడినది?

ఆర్యధర్మకారులకు స్త్రీ ప్రకృతియందే విశ్వాసము లేదు. స్త్రీ స్వభావమే దుష్టమైనదని వారి అభిప్రాయము.

ఆడుది స్వభావముచే పాపశీల యనుట నమ్మదగినది కావనియు, అట్లయినచో భార్యాసహితుడై మాత్రమే యజ్ఞాదులొనర్పవలెనని వేదము లేట్లు శాసించుననియు యుధిష్ఠిరుడు జిజ్ఞాసుడై భీష్ము నడిగెను. దానికి భీష్ముడు ఒక ఉపాఖ్యానమును వివరించుచు స్త్రీ అన్ని చెడుగులకును మూలస్థానమని సహేతుకముగ నిరూపించును. ♦

§ "The sale of a wife appears in the eleventh century in Cologne, and in the same century Cnut had to forbid the sale of a woman to a man whom she disliked." (Hobhouse, Vol. I, P. 224.)

† మను. 3 : 56-57.

♦ మహాభారతము XIII 73-8.

ఋగ్వేదమునను, ♦ బ్రాహ్మణములందును, * మనుస్మృత్యాది § ధర్మశాస్త్ర గ్రంథములందును స్త్రీ దుష్ట యనియు, చపలస్వభావ యనియు, అశాస్యచిత్త యనియు, అందుచే ఆమెకు మంత్రవత్సంస్కారమునకును, వేదాభ్యాసమునకును, ధర్మజ్ఞతకును అధికారము లేదనియు చెప్పబడినది.

ఆర్య ధర్మగ్రంథము లన్నియు ఇదే భావముపై స్త్రీలకు సంబంధించిన సమస్త నియమములను నిర్మరచినవి.

ఇది ఒక్క ఆర్యమతగ్రంథములందే కాదు ; క్రైస్తవమతమునను స్త్రీకి ఇంత కంటె ఎక్కువ ఉన్నతస్థాన మివ్వబడలేదు. ఎక్కువగా క్రైస్తవమత ప్రాబల్యముగల యూరప్ ఖండములో మొన్నటివరకు స్త్రీలు అధమాధమస్థితియం దుండినట్లు చరిత్ర సాక్ష్య మిచ్చుచున్నది. బైబిల్‌లో స్త్రీలనుగూర్చి ఏ మున్నదో చూడుడు :

"It is good for a man not to touch a woman; nevertheless to avoid fornication let every man have his own wife...." (1 Cor. VII-1.)

(స్త్రీని ముట్టకుండుట మానవునకు మేలే. కాని వ్యభిచారమునుండి తప్పించుకొనుటకు ప్రతిపురుషుడు ఒక భార్యను పరిగ్రహించుగాక !)

టెర్‌టూలియన్ అను ఒక గొప్ప క్రైస్తవాచార్యుడు ఇట్లనుచున్నాడు :

"Woman is the gate of hell, mother of all ills. She should blush with shame at the thought of her womanhood and live in perpetual penance for the sins of Eve."

(స్త్రీ నరకమునకు ద్వారము. అన్ని చెడుగులకును తల్లి. తాను స్త్రీ యైనందులకామె సిగ్గుపడవలెను. అధవా చేసినపాపమునకు ఆమె నిత్యతపశ్చర్య గావించనగును.)

పదునొకండవశతాబ్దపు బిషప్ మార్బత్ అను ఒక క్రైస్తవాచార్యుడు ఇట్లనుచున్నాడు :

"Of the numberless snares that the crafty enemy spreads for us over all the hills and fields of the world, the worst and the one which one cannot avoid is woman ; sad stem, evil root, vicious fount. Who persuaded our first parent to taste the forbidden

♦ ఋగ్వేదము X 95, 15; IV 33, 17.

* శతపథబ్రాహ్మణము III 2, 3, 6.

§ మను. XI 14-18.

fruit? A woman. Who forced the father to defile his daughter? A woman." *

(సైతాను ప్రపంచములో మనకై ఒడ్డు ఉరు లన్నిటికంటె చెడ్డది స్త్రీ. అది తప్పించుకోజాలనిది. ఇది దుఃఖములకు కాండము; చెడుగులకు మూలము; స్త్రీయే మన ప్రథమపితను నిషిద్ధఫలమును తినిపించినది. తన కూతురిని చెడగొట్టుటకు పురికొల్పిన దేది ? స్త్రీ.)

క్రీ॥ శ॥ 585 లో మేకన్ (Macon) లో జరిగిన సైనాడులో (Synod) అక్కడ సమావేశమైన బిషప్పులు 'స్త్రీలు అసలు మానవజాతికి చెందినవారా కారా?' అన్న విషయమును దీర్ఘముగ చర్చించి తుదకు స్త్రీలుకూడ మానవజాతికి చెందినవారే నని పరిష్కరించిరి.§

మధ్యయుగములో ఇంగ్లాండుదేశమునందు కూడ స్త్రీ బానిసస్థితియందుండెను. ముల్లర్ లయ్యర్ † గారి ఈ క్రింది వాక్యములను గమనింపుడు :—

"The English common law made the married woman almost a nullity. All her rights devolved on her husband. She could not make a will, or be party to a contract, or appear on court. Her personal property and earnings were his. Even after separation or divorce no account could be demanded from him.

"Neither the romantic service of the knight to his lady in certain phases of chivalry, nor the culte of Virgin Mother, nor the many learned ladies and remarkable feminine personalities of the Renaissance helped women out of their lamentable civic and legal status. The medieval inquisitors and legalists saw only the uncanny, the degraded and the malignant aspects of the beings whose ancestress and archetype, Eve, had brought sin into the world; they saw only the chosen and appropriate instrument of

* ఈ విషయములు *J. L. Davies* కృతమైన *"A Short History of Woman"* (1927) అను గ్రంథమందలి నాల్గవప్రకరణమునుండి సంగ్రహించినవి.

§ Muller-Lyer, *The Family*, P. 228.

† Muller-Lyer, *The Family*, P. 236. Also Pollock & Maitland, *History of English Law*, Vol. II, Hobhouse, *Morals in Evolution*, Vol. I. P. 224; Ellis, *Sex in Society*, P. 401.

Satan. The number of women burnt to death as witches in Germany alone is estimated by the social historian, Johan Scherr, as not less than one hundred thousand.

Even after most of the concepts and customs of the Middle Ages had been profoundly changed by economic forces, the domain of the family was still largely under the shadow of the Canon Law, e. g. in the 18th and 19th centuries."

అంతదూరము పోనేల? ఫ్రాన్సులో సమానత్వ స్వాతంత్ర్యముల పేర జరిగిన మహావిప్లవము స్త్రీలకు సమానత్వ మిచ్చినది కాదు. ఫ్రెంచి నేషనల్ ఎసెంబ్లీవారు స్త్రీల దరఖాస్తులను చదువుటకు సైతము నిరాకరించిరి. §

1840 లో లండన్ నగరమున జరిగిన బానిసత్వ నిరోధక మహాసభలో (Anti-Slave Congress) పాల్గొనుటకు అమెరికానుండి వచ్చిన స్త్రీ ప్రతినిధురాండ్రను సభ యందు పాల్గొననివ్వలేదు. కాంగ్రెసులో స్త్రీలు పాల్గొనుట భగవదాదేశమునకు వ్యతిరేకమని బ్రిటిషు ప్రతినిధులు తలచుటయే దీనికి కారణము. క్రీ. శ. 1888 వరకు ఇంగ్లాండులో స్త్రీలకు వైద్యవిద్య నభ్యసించుటకు అనుజ్ఞ ఇవ్వలేదు. ఇంగ్లాండులో అన్నిటి కంటె గొప్ప విశ్వవిద్యాలయమగు ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయము 1920 వరకు స్త్రీలకు డిగ్రీల నియ్య నిరాకరించెను. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయములో నేటికిని స్త్రీలకు వోటింగు హక్కు లేదు.

ఈజిప్టు, గ్రీకు, రోమన్, బౌద్ధ నాగరికతలను గూర్చి ఇక్కడ ప్రసంగించ నైతిని. అవి మృత నాగరికతలు. వానినిగూర్చి ముచ్చటించుట గ్రంథవిస్తరమే గాని వేరొండు కాదు. ఆ నాగరికతలలోను స్త్రీలస్థితి పైన వర్ణించినట్లే యుండేనని చెప్పుట చాలును.

ఈ విధముగ స్త్రీలకు అన్ని దేశములందును, అన్ని మతములందును, అన్ని కాలములందును కూడ సమానత్వముగాని, స్వాతంత్ర్యముగాని ఇవ్వబడలేదు. ఆమె కొక వ్యక్తిత్వము గలదని కూడ మతములుగాని విజ్ఞానులుగాని అంగీకరింప లేదు.

ఇస్లామ్ ఇట్లు పతితయైన స్త్రీ నుద్ధరించెను. ఆమె కొక వ్యక్తిత్వమును ప్రసాదించెను. ఆమెకు స్వాతంత్ర్యము ఇప్పించెను. ఆమెకు విద్యార్హతను, మోక్షార్హతను కల్పించెను. ఆమెకు తండ్రి ఆస్తియందును, భర్త ఆస్తియందును హక్కిప్పించెను. ఆమెకు ఆమె ఆస్తిపై, ఆమె ధనముపై పెత్తన మిప్పించెను. ఆమె వ్యక్తురాలై తన సమ్మతితో వివాహమాడవచ్చును. దాంపత్య మనుకూలముగ లేక దుర్భరమైనచో ఆమె వివాహచ్ఛేద మొనర్చుకొని అనుకూలుడగు మరొక భర్తను పెండ్లియాడవచ్చును. ఆమె నిర్ధన

§ George, *The Story of Woman*, P. 186.

కాదు. వివాహసమయమున ఆమెభర్త ఆమె కిచ్చినట్టిగాని, ఈయ వాగ్దానము చేసినట్టిగాని మహర్ ధనమునకు ఆమె స్వామిని. ఆమె భర్త ఆమెను హింసింపజాలడు. అట్లు హింసించినయెడల ఆమె అతనిని విడిచి వేరొక అనుకూలపతిని బడయవచ్చును. భర్త మరణించినచో విధవయై కురూపియై, బానిసయై, సర్వవిధముల ఇతరుల పెట్టుపోతలపై ఆధారపడి చచ్చిన కుక్కవలె పడియుండనక్కరలేదు. ఆమె కోరినచో మరొక పురుషుని పెండ్లాడవచ్చును. లేదా తన పిల్లలతో తన భర్త ఆస్తి ననుభవించుచు హాయిగా కాలము గడపవచ్చును. పురుషులవలె ఆమెకూడ సమస్త విద్యలను అభ్యసింపవచ్చును. పురుషులవలెనే ఆమెకూడ సమస్త కార్యములందు పాల్గొనవచ్చును. పురుషునకు సమానమైన మతవిధులు, సమానమైన మంత్రములు ఆమెకు కలవు. ఈ విధముగ ఇస్లామ్ స్త్రీల కిచ్చిన హక్కులు ప్రపంచమున ఏ మతమైనను నేటికిని అంగీకరించియుండలేదు. స్త్రీ పునర్వివాహము, ప్రౌఢావివాహము, స్త్రీలకు ఆస్తియందు హక్కు, స్త్రీలకు వేదాది గ్రంథపఠనార్హత ఈమధ్య నవీన పాశ్చాత్య నాగరికతా సంపర్కముచే రాజకీయ శాసనములద్వారా ప్రవేశపెట్టబడుచున్నవేగాని ఆయా మతము లొప్పుకొనునవి కావా విషయములు.

దీనినిబట్టి ఇస్లామ్ ప్రతిపాదించిన ధర్మ మెంతపరిపూర్ణమైనదో తెలియగలదు.

అధ్యాయము మధ్య వచ్చిన స్త్రీ సమస్యలనుగూర్చిన వివిధ విషయములను సందర్భానుసారముగ వేరుగ ఆయా సూక్తములపై వ్రాసిన నోటులం దుండును.

*   *   *

౫౦. ఇందులో రెండు విషయము లుగ్గడింపబడినవి. (1) తామొక ఉత్తమజాతికి చెందినవారమనియు, స్త్రీలు అధమజాతికి చెందినవారనియు, పురుషులకు గల అహంభావమును రద్దుపరచుచు స్త్రీ పురుషు లొకే ప్రాణినుండి ఉద్భవమైనవారనియు, ఒకేజాతికి చెందినవారనియు, సైజముగ వారిలో ఉత్తమాధమత్వములు లేవనియు, అందుచే స్త్రీపురుషులు సమానులనియు ఖుర్ ఆన్ చెప్పుచున్నది. (2) స్త్రీ పురుషుల పరస్పర సంబంధము, ప్రత్యేకముగ భార్యాభర్తృసంబంధము, స్త్రీపై పురుషునకు కొంత పెత్తనమునకు అవకాశము నిచ్చుచున్నది. దానివలన లాభమును పొంది పురుషుడు స్త్రీపై అధికార దుర్వినియోగము చేయరాదనియు, భగవంతుడు మానవులకర్మల నన్నిటిని చూచుచునే యున్నాడనియు, అతడు సర్వసాక్షి యనియు, భగవంతుని సర్వసాక్షిగా నెంచి పురుషుడు స్త్రీయొక్కయు, స్త్రీ పురుషునియొక్కయు హక్కు

లను కాపాడవలెననియు, తాత్కాలికముగ ఒకరిపై నొకరికి లభించిన అవకాశమువలన లాభమును పొందవద్దనియు ఖుర్ ఆన్ హెచ్చరించుచున్నది.

*　　*　　*　　*

౯౧. అనాథబాలికల హక్కులనుగూర్చి ఖుర్ ఆన్ పెక్కుచోట్ల ఆదేశించుచున్నది. తల్లిదండ్రులులేని పిల్లల ఆస్తిని ధనమును పలుకుబడిగల బంధువులు స్వాధీనము చేసికొనుట సర్వసాధారణముగ జరుగుచుండును. స్త్రీలు, అనాథబాలికలు, శ్వేద వాండ్రు—వీరియెడ సంఘమునకు ప్రత్యేక బాధ్యత కలదు. ఆర్య ధర్మగ్రంథములలో తల్లిదండ్రులులేని పిల్లలయెడ కల ఈ బాధ్యతకు సంబంధించిన నియమము లున్నట్లు కన్పించదు. దీని కొక కారణము కలదు. ఆర్యకుటుంబము సమిష్టికుటుంబము, తల్లిదండ్రులు లేని పిల్లలు సమిష్టికుటుంబముల పోషణముక్రింద నుండ తటస్థించుటచే అట్టి నియమముల అవసరము లేకపోయి యుండవచ్చును. ఇప్పుడు సమిష్టికుటుంబము క్రమక్రమముగా మాయ మగుచున్నది. అందుచే ఇప్పు డీ ఆదేశముయొక్క అవసరము కలుగుచున్నది.

*　　*　　*

౯౨. ఈ సూక్తమున బహు భార్యాత్వము కొన్ని షరతులపై ధర్మయుక్తమే యని చెప్పబడినది. క్రైస్తవమతము బహుభార్యాత్వమును నిషేధించుచున్న దనియు, అందుచే ఈ విషయమున క్రైస్తవమతము ఇస్లామ్ మతముకంటె ఆదర్శప్రాయమైన వివాహమును ఆదేశించుచున్నదనియు మిషనరీలు బోధించుట కలదు. ఆర్యధర్మగ్రంథములలో బహుభార్యాత్వము నిషేధము కాదు. ప్రఖ్యాతపురాణపురుషులలో ఒక్క శ్రీరాముడే ఏకపత్నీవ్రతు డని ప్రసిద్ధి. ఈమధ్య శ్రీరాముడు కూడ ఏకపత్నీవ్రతుడు కాడనియు, బహుభార్యాయుతుడే ననియు కొందరు వ్రాయుచున్నారు. మన కా వాద మప్రస్తుతము. ఆర్యధర్మకారులు ఏకాలమునందును బహుభార్యాత్వమును నిషేధింపలే దన్న విషయమే మనకు కావలసినది. బ్రాహ్మణుడు ఒక్కొక్కవర్ణమునుండి ఒక్కొక్క భార్యను ఈ విధముగ నల్గురు భార్యలను, క్షత్రియుడు ముగ్గురుభార్యలను, వైశ్యు డిద్దరిని, శూద్రు డొక్కతెను వివాహ మాడవచ్చునని విష్ణుధర్మసూత్రకారు డనుచున్నాడు. (XXIV. 1—4.)

కాని పురాణములలో పెక్కురు ప్రసిద్ధపురుషులకు ఇంతకంటె ఎక్కువమంది భార్య లున్నట్లు ప్రసిద్ధి. శ్రీకృష్ణునకు ఎనమండుగురు భార్యలుండుటయు, దశరథునకు ముగ్గురు క్షత్రియభార్య లుండుటయు, కార్తవీర్యార్జునునకు వెయ్యిమంది భార్య లుండుటయు అట్లే అర్జునాదులకును పెక్కెండ్రు భార్య లుండుటయు సుప్రసిద్ధము. ఋషులు సైతము బహుభార్యాయుతులైన ఉదాహరణములు కలవు.

క్రైస్తవ మతమున పెక్కితరవిషయములందువలె స్పష్టమైన వివాహనియమములు బైబిల్ గ్రంథమున ఇవ్వబడ లేదు. క్రైస్తవ చర్చి అప్పుడప్పుడు ఆయా కాలపరిస్థితులను బట్టి వివాహ నియమముల నేర్పరచుకొనెను అదియు వివిధ శాఖల చర్చీల నియమములు వివిధముగ నున్నవి. మార్మనువులను ఒక చర్చివారు బహు భార్యాత్వము ధర్మ్యమే యని చెప్పుచున్నారు. అట్లే ప్రొటెస్టెంటు మతస్థాపకుడగు లూథర్ బహుభార్యాత్వము ధర్మ్యమని చెప్పుచున్నాడు. † ఫ్రాంకులలో బహుభార్యాత్వ ముండెననియు, డాగోబర్టు చక్రవర్తికి ముగ్గురు భార్య లుండిరనియు హాబ్‌హౌస్ వ్రాయుచున్నాడు. (Vol. 1, P. 220.) క్రైస్తవ చర్చి బహుభార్యాత్వమునే కాదు అసలు వివాహమే గర్హ్యమైనదను మనస్తత్త్వము కలది. పాపమునకు మూలకారణము స్త్రీ యనియు, అందుచే స్త్రీ సైతానుయొక్క పరికరమై మానవుని పతితు నొనర్చు ననియు చర్చి అభిప్రాయము. కాని కామేచ్ఛ మానవునకు సహజమగుటచే స్త్రీ సంగమమును తప్పనిసరిగ ధర్మ్య మొనర్చినది. § వివాహమే తప్పనిసరిగ ఒప్పుకొనిన చర్చి బహుభార్యాత్వము నెట్లొప్పుకొనును? కాని ఇస్లామ్ మతముయొక్కయు, ఆర్య ధర్మముయొక్కయు మూలతత్త్వము వేరు. ఆర్యధర్మమున వివాహము పురుషార్థములలో ఒకటి. గృహస్థాశ్రమము ఆశ్రమము లన్నిటికంటె శ్రేష్ఠమైనది.

ప్రాణవాయువు నాశ్రయించి జంతువులెల్ల జీవించునట్లు, గృహస్థు నాశ్రయించి తక్కిన యాశ్రమస్థులు జీవింతురనియు, అందుచే గృహస్థు డన్ని యాశ్రమముల వారిలో శ్రేష్ఠుడనియు మనుస్మృతికారు డనుచున్నాడు. (III : 27, 28) అట్లే ఇస్లాం వివాహమున కెంతో ప్రాముఖ్యత నిచ్చుచున్నది. “వివాహమాడుట సగము మతవిధులను నెరవేర్చుటతో సమానము” అని శ్రీ ప్రవక్త వచనము. వివాహము మానవుని పెక్కు పాపములనుండి కాపాడు ననియు, మానవ సంఘమునకు పునాదియైన కుటుంబమును సాధ్య మొనర్చున దదియే ననియు ఇస్లామ్ అభిప్రాయము.

ఇంక బహుభార్యాత్వము విషయములో ఒకటి జ్ఞాపక ముంచుకొనవలెను. ఇస్లామ్ బహుభార్యాత్వమునకు అనుజ్ఞమాత్రము ఇచ్చుచున్నది. అదియు పెక్కుషరతులతో. భార్యలనందరను సమానముగ చూడగలిగిన మనోదార్ఢ్యమును, శరీరపటుత్వమును, ఆర్థికసంపత్తియు, న్యాయబుద్ధియు నున్నప్పుడే బహుభార్యాత్వమున కనుజ్ఞ

† L. T. Hobhouse, *Morals in Evolution*, Vol. I, P. 228.

§ "The church regarded marriage as a concession to the weakness of the flesh. It is of the nature of a hindrance in spiritual duties. It is incompatible with the performance of sacraments, and thus continence is enjoined on priests." —L. T. Hobhouse, *op. cit.* I, 218.

కలదు. లేనిచో ఒకే భార్యతో మాత్రమే కాపురము చేయవలెనని ఖుర్ ఆన్ ఆజ్ఞాపించుచున్నది.

ఖుర్ ఆన్ ఒక దేశమునకుగాని ఒక జాతికిగాని ఒక కాలమునకుగాని మాత్రమే అన్వయించు ధర్మగ్రంథము కాదు. అది పూర్తి మానవసంఘమునకు సర్వకాల సర్వావస్థలయందు కావలయు ధర్మసూత్రములను ప్రతిపాదించుచున్నది. ఒక్కొక్క కాలమున, కొన్ని పరిస్థితులలో బహుభార్యాత్వము తప్పనిసరియగును. అట్టి పరిస్థితులలో మొదటిభార్యను విడిచిపెట్టివేసి గాని, లేక రహస్యముగ తాను కోరిన రెండవకాంతతో వ్యభిచరించిగాని, పతితు డగుటకంటె తాను కోరిన రెండవస్త్రీని ధర్మయుతముగ పెండ్లాడి ఇద్దరు భార్యలను న్యాయబుద్ధితో సమానదృష్టితో చూచుచు వారితో కాపురము చేయుట మేలుకాదా? * పెద్దపెద్ద యుద్ధములు జరిగినప్పుడు లక్షలాది పురుషులు మరణింతురు. అప్పుడు పురుషుల సంఖ్యకంటె స్త్రీల సంఖ్య ఎక్కువైపోవును. అట్టి పరిస్థితులలో పెక్కండ్రు స్త్రీలు భర్తలను పొందలేక వ్యభిచారమునకు దిగి తమకే కాక జాతియంతటికిని కళంకమై యుందురు. అట్టిచో బహుభార్యాత్వము వాంఛనీయముకదా? గత ఐరోపా మహాయుద్ధానంతరము యూరప్ఖండములో స్త్రీల సంఖ్య హెచ్చగుటవలన సంభవించిన అవినీతిరోగము నేటికిని యూరప్ఖండ వాసులకు తలవంపైయున్నది. ఇట్టి ప్రత్యేక పరిస్థితులయందు ఖుర్ ఆన్ బహుభార్యాత్వమునకు అనుజ్ఞ నొసగుచున్నది.

* * *

౯౩. ఇస్లామ్‌లో వివాహము ఒక స్త్రీకిని ఒక పురుషునకును మధ్యజరుగు ఒక ఒడంబడిక. స్త్రీపురుషులు స్వేచ్ఛతో సాక్షులముందు తాము భార్యాభర్తలై యుండుట కంగీకరించి చేసికొను ఒడంబడికయే వివాహము. ఈ అంగీకారమునకు ఇస్లామీయ ధర్మశాస్త్రములో "ఈజాబ్ వ ఖుబూల్" అందురు. ఇది వివాహవిధి యందలి మొదటి ముఖ్యాంశము. ఈ సమయమున 'ఖుత్బా' లేక 'హితోపన్యాసము' నొకటి ఇచ్చుట శ్రీప్రవక్త నెలకొల్పిన సంప్రదాయము.

* గార్హస్థ్యధర్మములను నెరవేర్చుచు పుత్రవతి యగు భార్య యున్నప్పుడు మరొక స్త్రీని పెండ్లాడరాదనియు, భార్య పుత్రవతి కానిపక్షమునను, తనతో గార్హస్థ్య ధర్మములను నెరవేర్ప నిచ్ఛగించకయు నెరవేర్పజాలకయు నున్నపక్షమునను మరొక భార్యను పెండ్లాడవలెనని మను (IX 80, 81) యాజ్ఞవల్క్య (1-73) ఆపస్తంబులు (II 5, 11, 13—14) ను, విష్ణుధర్మసూత్రకారుడును అనుచున్నారు.

మహర్ యొక్క నిర్ణయము రెండవ ముఖ్యాంశము. మహర్ అనగా 'శుల్కద్రవ్యము' అని నేను బ్రాకెట్లలో వ్రాసితిని. వధువునకు వివాహకాలమున వరుడిచ్చు ధనమునకు 'మహర్' అందురు. ఈ ధనము వరుడు వధువు తండ్రికిగాని, ఆమె సంరక్షకునకుగాని ఇచ్చు ధనముకాదు. మహర్ ధనము పూర్తిగా వధువుది. అది వరుడు తన నూతన వధువున కిచ్చు బహుమానము.

ఖుర్ ఆన్ లో 'మహర్' కు పర్యాయపదములుగా ఈ క్రింది శబ్దములు వాడబడినవి:—

(1) 'అజ్ర్' అనగా 'బహుమానము' లేక 'వధువున కివ్వబడు బహుమతి'; 'కేవలము లాభముతోకూడి కించిత్తైనను నష్టములేని బహుమతి' అని రాగిబ్ అను నిఘంటుకారుడు.

(౨) 'సదుఖా' అనగా 'సత్యసంధతతో లేక ధర్మనిర్వహణార్థము చేయబడినది లేక ఇవ్వబడినది.' ఈ సూక్తమున ఇదే శబ్దము వాడబడినది. ఇదే ధాతువునుండి ఉత్పన్నమైన 'సదుఖాత్' అను శబ్దముకూడ వాడబడినది.

(3) 'ఫరీజా' లేక విధివిహితమైనది.

మహర్ అన్న శబ్దము ప్రవక్త ఉపదేశగ్రంథములలో (హదీస్) మాత్రము వాడబడి ఇప్పుడు పారిభాషికపద మైనది. ఖుర్ ఆన్ మహరునకై వాడిన పర్యాయపదములే మహర్ యొక్క అర్థము వివరించుచున్నవి. ఎంత చిన్నమొత్తమైనను సరే మహర్ తప్పక ఇవ్వవలెనని ప్రవక్త ఆదేశము.

'మహర్' ఎంత ఇవ్వవలెను? అన్న విషయమును గూర్చి ఖుర్ ఆన్ సూచించిన గురి ఇది: "కలిగియున్నవాడు తన శక్త్యనుసార మీయవలెను. బీదవాడు తనస్థితి ననుసరించి ఇవ్వవలెను. సుకృత మొనర్చువారి కిది విధి విహితము." (2 : 236.)

వధువుయొక్క హోదానుబట్టి మహర్ ద్రవ్యము నిర్ణయించుట సంప్రదాయము. వధువుయొక్క అక్కలయొక్క గాని, ఆమె తండ్రి అక్కచెల్లెండ్రయొక్క గాని, పినతండ్రి కూతుండ్రయొక్కగాని మహర్ ధనమునుబట్టి ఆమె మహర్ నిర్ణయింపవలెనని ముస్లిమ్ ధర్మశాస్త్రకారులు. ♦ అనగా తండ్రియొక్క వంశమువారి ఆర్థికహోదా ననుసరించి మహర్ధనము ఉండవలెను.

♦ హిదాయా, సం. I పుట 304.

వివాహసమయముననే మహర్ ధన మిచ్చివేయుట ఉత్తమపక్షము. ఒకవేళ అట్లివ్వలేకపోయినచో వరుడు వాగ్దానముచేసిన మొత్తమునకతడు శాశ్వతముగ ఆమెకు ఋణపడి యుండును. ఆమె ఎప్పు డడిగిన అప్పుడు వరు డామె కా ధనమును ఇవ్వవలసియుండును. అతని మరణానంతరముకూడ అతనిఆస్తి పంపకము సమయమున మహర్ ధనము అతని ఆస్తినుండి తీసి భార్యకీయవలెను.

మహర్ హిందూలాలో హిందూస్త్రీల 'స్త్రీధనము' కాదు. ముస్లిమ్ భార్యకు 'స్త్రీధనము', 'మహర్' ధనము, భర్త ఆస్తియందు భాగము, తండ్రి ఆస్తియందు భాగము, పుత్రుని ఆస్తియందు భాగము—ఈ విధముగ ఆర్థిక స్వాతంత్ర్యమునకు వలయు సమస్త అవకాశములును కల్పింపబడినవి.

'మహర్' ముస్లిమ్ వనితలకు ఇన్స్యూరెన్సు వంటిది.

* * *

౫౮. స్త్రీలకు ఆస్తియందు భాగము ఇస్లాముకు పూర్వము ఏమతమును ఇవ్వలేదు. పురుషునితో స్త్రీకి సమానత్వమిచ్చి, దానితో ఆమెకు స్వాతంత్ర్యమును ప్రతిపాదించి, ఆ స్వాతంత్ర్యమును సమానత్వమును నిలబెట్టుకొనుటకై కావలసిన ఆర్థిక స్వాతంత్ర్యమును ఖుర్ ఆన్ స్త్రీ కిచ్చినది. ఇంగ్లీషు 'లా' లో వారసత్వపు పద్ధతి లేనేలేదు. హిందూ ధర్మశాస్త్రకారులు కుమార్తెకు తండ్రి ఆస్తియందు భాగమివ్వనే లేదు. అవివాహితయగు బాలికల వివాహవ్యయమునకై మాత్రము అన్నదమ్ములు తమ ఆస్తులనుండి కొంతభాగమును ఖర్చుపెట్టవలెనని ధర్మశాస్త్రకారులు శాసించినారు.§

§ మనుస్మృతి 9 వ అధ్యాయము 118 వ శ్లోకమున "బాలికలకు అన్నదమ్ములు తమ భాగములనుండి చెరి నాల్గవభాగము నివ్వవలెను." అను మాటలను వ్యాఖ్యానించుచు దాయాభాగకారుడు ఆభాగము వారసత్వముక్రిందకు వచ్చునది కాదనియు, అవివాహితలగు బాలికలకు అన్నదమ్ములు వివాహవ్యయమును భరించుట న్యాయమని మాత్రమే దీని అర్థమనియు చెప్పుచున్నాడు. అన్నదమ్ముల ఆస్తి పెద్దదైనచో నాల్గవ భాగ మివ్వనక్కరలేదనియు, వివాహవ్యయమునకు సరిపోయినంత ఇచ్చిన చాలుననియు కూడ దాయాభాగకారు డనుచున్నాడు. ఆస్తి చాల చిన్నదైనచో నాల్గవ భాగము సైత మివ్వనక్కరలేదని మేధాతిథి యనుచున్నాడు.

కె. టి. భాష్యం అయ్యంగార్ గారు, గాంధీజీకి ఈ విషయమున వ్రాసిన ఒక ఉత్తరమందలి ఈ క్రింది వాక్యములను చూడుడు:

"The principles of Hindu Law as at present administered are antiquated and opposed to our sence of equity and justice. I shall give a few instances: 1. Near and dear relations like the sisters, daughters, daughter-in-law, the brother's widow, and the step-mother altogether denied the right of incheritance etc. etc."—(Young India dated 13-10-1927)

ఇది మిక్కిలి అన్యాయమని కొందరు ఆర్యధర్మ శాస్త్రకారులు ప్రతిఘటించిరి. వారిలో బృహస్పతి ముఖ్యుడు. కూతురుకూడ కొడుకువలె ప్రత్యంగసంభూత యనియు, అట్టిచో కూతురు బ్రతికియుండగా మరొక పరాయివాడు ఆమెతండ్రి ఆస్తి కేవిధముగ వారసుడు కాగలడని బృహస్పతి ప్రశ్నించుచున్నాడు (XXV 56). కాని బృహస్పతివంటి సంస్కర్తల మాటలు బధిర శంఖారావములే యాయెను.

యూదులలోకూడ కొడుకు లున్నప్పుడు కూతుళ్లకు వారసత్వపుహక్కు లేదు. కొడుకులు లేనప్పుడు మాత్రము కూతుళ్ళు వారసు లగుదురు.

ఇప్పుడిప్పుడు ప్రపంచమంతయు స్త్రీలకు ఆస్తి నిప్పించు సంస్కరణమునకై నోరార్చుకొనుచున్నది. అట్టి సంస్కరణమును ఖుర్ఆన్ ఇప్పటికి 14 వందల ఏండ్ల క్రిందటనే శాసించినది. ఇక్కడ ఒక విషయమును గమనించదగినది. ఆధునిక నాగరికత, శాస్త్రవిజ్ఞానము ఇంతగా ప్రబలిన ఈ కాలములో ఇట్టి సంస్కరణముయొక్క అవసరము గుర్తింపబడుట భావ్యమే. కాని ఏదేశమున స్త్రీ బానిసకంటెను అధమముగ పరిగణింపబడుచుండెడిదో, ఏదేశమున స్త్రీ శిశువు పుట్టగనే చంపివేయబడుచుండెడిదో, ఏదేశమున స్త్రీలు కేవలము చరాస్తిగా భావింపబడి వారసులకు సంక్రమించుచుండిరో అట్టి దేశములో, ఆ అంధకారయుగములో ఇట్టి శాసనములు కావించిన ఖుర్ఆన్ మహత్తు విజ్ఞులు గ్రహింపవలెను.

* * *

౫౯. "పురుషుడు ఇద్దరు స్త్రీలకు సమానమైన భాగమున కర్హుడు." అని ఖుర్ఆన్ శాసించుచున్నది. అనగా కుమారుని భాగమునకు సగము కుమార్తెకు వచ్చును. ఇక్కడ ఒక విషయము జ్ఞాపకముంచుకొనవలెను. ఇక్కడ "కూతురు" వివాహితయైనను వివాహిత కాకపోయినను ఆమెకు ఒకేవిధమైన హక్కు కలదు.

స్త్రీ పురుషసంతతిలో ఇట్టిభేదమేల కల్పింపబడినదని ప్రశ్న రావచ్చును. పురుషుడు ఒకే వంశమునకు చెందినవాడై యుండును. స్త్రీ అట్లు కాక రెండు వంశములకు చెందినదగును. ఆమె పుట్టింటి ఆస్తియందును, భర్త ఇంటి ఆస్తియందును భాగస్తురాలగును. అంతేకాదు. వివాహమైన వెంటనే ఆమెకు భర్త ఇచ్చు మహర్ ధనమొకటి వచ్చును. పురుషసంతతికి ఒక్క తమవంశపుఆస్తియే సంక్రమించును. ఈ కారణములచే స్త్రీ సంతతి భాగము పురుషసంతతి భాగముకంటె తక్కువగ ఉంచబడినది. ఉదాహరణమునకు 1930 లో మైసూరు ప్రభుత్వమువారు నియమించిన హిందూ లా రిఫార్మ్ కమిటీవారు ప్రతిపాదించిన చిత్తుశాసనములో సోదరికి సోదరుని భాగమునకు నాల్గవ

వంతుమాత్రమే ఇవ్వబడవలెనని శిఫార్సు చేసిరి. అదికూడ సోదరి అవివాహిత యైననే. ఆమె వివాహవ్యయము ఆమె భాగమునుండియే చేయవలెనని సూచించిరి. †

ఈ సూక్తములో 'పురుషుడు' అనగా "పురుష సంతతి" అనియు, "స్త్రీలు" అనగా "స్త్రీసంతతి" అనియు అర్థము.

పురుషసంతతి లేక స్త్రీసంతతి యున్నయెడల వారికి మూడింట రెండు భాగముల ఆస్తిలో సమానభాగములు వచ్చును.

మరణశాసనము: ఆస్తిలో మూడవభాగముపై మాత్రమే మరణశాసనము చెల్లును. మరణశాసనములో వారసులకు జోక్యము లేదు. వారిభాగములు మరణశాసనము క్రిందికి రావు. సాధారణముగ మరణశాసనము వారసత్వపుహక్కులేని బంధుమిత్రుల యెడలను, దానధర్మములయెడలను మాత్రమే చెల్లును. వారసుల ఇష్టముపై వారి భాగములను విభజించికూడ విల్లు వ్రాయవచ్చును.

ఇస్లామ్ ఈ విషయమున చేసిన ఏర్పాటు విజ్ఞుల కాశ్చర్యము గొల్పకపోదు. ఇది ఇప్పుడిప్పుడు ప్రపంచము కనిపెట్టిన ఆర్థికసూత్రముల కెంతయు అనుగుణముగ ఉన్నది.

ఇంగ్లీషు వారసత్వపు పద్ధతిలో ఆస్తియంతయు మరణశాసనము ననుసరించియే విభజింపబడును. ప్రతివ్యక్తియు తన ఇష్టమువచ్చినరీతిని తన ఆస్తినంతటిని విభజించి మరణశాసనము వ్రాయవచ్చును. ఈ పద్ధతిని గూర్చి Josiah Wedgwood గారు ఇట్లనుచున్నారు:

"Judged by its effects on distribution, our system of inheritance is clearly indefensible on economic grounds." §

ఇస్లామ్ వారసత్వపు పద్ధతితోపాటు, ఆస్తి కలవానికి వాని ఆస్తిపై కొంత స్వాతంత్ర్యమును కూడ ఇచ్చినది. ఇప్పుడు ఫ్రాన్సు, డెన్మార్క్, బెల్జియమ్ దేశములలో కూడ ఆస్తిపరుడు తన ఆస్తిలో మూడవభాగమును తన ఇష్టము వచ్చినట్లు విల్లు

† "In the case of every unmarried daughter of sister, one-fourth of the share of a brother...... provided that the share to which a daughter or sister is entitled under this section shall be inclusive of, and not in addition to, the legitimate expenses of her marriage including a reasonable dowry or marriage portion." *Report on Women's Rights under the Hindu Law presided overby Dewan Bahadur K. S. Chandrasekhara Ayer*, P. 215.

§ Josiah Wedgwood, *Economics of Inheritance*, P. 201.

మూలముగ ఇచ్చివేయవచ్చును. ఈపద్ధతే ప్రశస్తమయినదని ఇప్పుడు అర్థశాస్త్రజ్ఞులు ఒప్పుకొనినారు. అట్టిపద్ధతిని ప్రవేశపెట్టవలెనని ఇంగ్లాండులో ఆర్థిక సంస్కారవాదులు కోరుచున్నారు.

* * * *

౯౬. స్త్రీ మానవతి. అంతేకాదు. కుటుంబగౌరవము చాలవరకు ఆమె ప్రవర్తనముపై ఆధారపడియుండును. ఆమె దుష్ప్రవర్తకురాలైనచో ఆ అగౌరవము ఆమెకే కాదు వంశమంతటికిని అప్రతిష్ఠ తెచ్చును. అందుకే స్త్రీల శీలమును కాపాడుటలో అప్రమత్తులై యుండవలెనని సర్వధర్మములును శాసించినవి.

అన్నిదేశములందును, అన్నికాలములందును వ్యభిచారమునకు కఠినమగు శిక్షలు విధింపబడినవి. ఆర్యధర్మకారులు వ్యభిచారమునకు విధించిన శిక్షకు ఒక ఉదాహరణమును చూడుడు:

"వ్యభిచరించిన స్త్రీ ముక్కు, పెదవులు, చెవులు కోసివేసి, వీధులలో త్రిప్పి నీటిలో పడద్రోయవలెను. లేదా నలుగురుకూడు ఒక బహిరంగ ప్రదేశములో ఆమె ముక్కలు ముక్కలుగా కుక్కలచే చీల్చివేయబడవలెను."

(బృహస్పతి. XXII 16.)♦

"వివాహితయగు స్త్రీ వ్యభిచారము చేసినచో ఆమె వెంట్రుకలు గొరిగివేయవలెను. ఆమెకు అధశ్శయనము నియమించవలెను. ఆమెకు చెడ్డఆహారము, చెడ్డవస్త్రములు మాత్రమే ఇవ్వవలెను. విస్తళ్ళుఎత్తి, ఎంగిలి శుభ్రపరచుపని ఆమె కివ్వవలెను."

(నారదుడు XII 90—91)*

వ్యభిచరించిన భార్యను చంపివేయు అధికారము ధర్మశాస్త్రకారులు భర్త కిచ్చిరి. చైనాలోను ప్రాచీనరోములోను భర్త కట్టి అధికారము కలదు. † యూదులలో వ్యభిచారముచేసిన స్త్రీని బ్రతికియుండగనే కాల్చివేయు ఆచారముండెడిది. ‡ క్రైస్తవాచార్యులు కూడ వ్యభిచారమునకు మరణశిక్షను విధించిరి. §

ఈవిధముగ ప్రపంచమందెల్లెడలను వ్యభిచారమునకు అత్యంత కఠినమగుశిక్షలు

♦ అట్లే మనువు viii 371. గౌతమ ధర్మసూత్రములు xxiii 14-15.

* అట్లే యాజ్ఞవల్క్యుడు 1. 70.

† L. T. Hobhouse, *Morals in Evolution*, Vol. I, P. 198 and P. 214.

‡ L. T. Hobhouse, *Morals in Evolution*, Vol. I. P. 203.

§ "The early reformers considered death as appropriate penalty for adultery." *Hobhouse, Ibid*, P. 228.

విధింపబడినవి. ఖుర్ ఆన్ ఈ విషయమున ఎంత సున్నితమగు శిక్షను విధించుచున్నదో చూడుడు.

ప్రప్రథమమున ఒక స్త్రీ వ్యభిచారము చేసినదని నిర్ధారణ కావలెను. కేవలము అనుమానము సాధారము గాగొని ఆమెను శిక్షింపరాదు. తమవారిలో అనగా తమ వంశమునకు చెందిన వారిలో నలుగురు సాక్ష్యము ఇచ్చినప్పుడే ఆమెదోషము నిర్ధారణమగును. తరువాత అట్టి స్త్రీని బయటకు వెల్లకుండా ఇంట నిర్బంధించి యుంచవలెను.

సూక్తపు చివరిమాటలు చూడుడు: "భగవంతుడు వారికేదైన మంచిమార్గము చూపించువఱకు (వారినట్లుంచుడు.)"

ఖుర్ ఆన్ లో శిక్షయొక్క ఉద్దేశము సంస్కారము. కాని కసితీర్చుకొనుట కాదు. అట్లు శిక్షపొందిన స్త్రీ సత్ప్రవర్తకురాలైనచో ఆమెకు తిరిగి స్వాతంత్ర్యమివ్వవలెనని ఖుర్ ఆన్ ఉపదేశించుచున్నది.

ఇక్కడ ఒకవిషయము గమనించవలసి యున్నది. సాధారణముగ స్త్రీలు వ్యభిచరించుటకు కారణములు:

1. అనుకూలపతి లభింపకుండుట:

   దీనికి బాల్యవివాహములు, వధువు సమ్మతిలేకుండ తల్లిదండ్రులు వివాహమొనర్చుట కారణములు.

2. విధవావివాహ నిషేధము:

3. విడాకులు తీసికొను హక్కు భార్యకు లేకపోవుట:

   ఏదేని కారణముచే భార్యాభర్తలయందు మనస్పర్థలు కలిగిగాని, భర్త దుర్మార్గుడై తన్ను హింసించుచుండినగాని, లేక నపుంసకుడైనగాని, మరేయితర దుర్భర కారణములచేగాని భార్య తన భర్తనుండి విడాకులు పొంది అనుకూలపతి నింకొకని బడయు హక్కు ఆమెకు లేకపోవుట.

4. స్త్రీకి ఆర్థికస్వాతంత్ర్యము లేకపోవుట:

వ్యభిచారమునకు సాధారణముగ ఇవే కారణములు. ఖుర్ ఆన్ రజస్వలానంతర వివాహములను శాసించియు, వివాహమునకు వధువుయొక్క సమ్మతిని ఆవశ్యక మొనర్చియు, విధవావివాహములకు గౌరవప్రద మొనర్చియు, స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యము నిచ్చియు స్త్రీల నైతిక నైర్మల్యమునకు తోడ్పడినది.

ముస్లిం దేశములలో వ్యభిచారము మిక్కిలి అరుదని ఆ దేశములలో నుండిన పాశ్చాత్య విజ్ఞానులు వ్రాయుచున్నారు.

*　　*　　*

౧౬. ఇక్కడ 'ఇద్దరు పురుషులు కామాసక్తులై ప్రవర్తించినయెడల' అని కొందరును † 'ఇద్దరు స్త్రీపురుషులు' అని కొందరును § అభిప్రాయపడిరి.

అసహజమైన కామ దురభ్యాసములలో పురుషులు పురుషులతో ప్రవర్తించుటొకటి. ఈ దురభ్యాసము పారశీక దేశమున ఎక్కువగ వ్యాపించియున్నది. పూర్వ కాలమునుండియు మనదేశమునకూడ కొంత యుండినట్లు వాత్స్యాయన కామసూత్రములలో ఇది పేర్కొనబడుటనుబట్టి గ్రహించవచ్చును.

మనదేశమున ఈ దురభ్యాసము పర్షియాదేశమునుండి దిగుమతియై యుండవచ్చును. ఖుర్ ఆన్ కఠినముగ ఈ దురభ్యాసమును నిషేధించుచున్నను ముస్లిం దేశమగు పర్షియాయందును, పారశీక నాగరికత నెక్కువగ అవలంబించిన ఉత్తరహిందూస్థానమునందును ఇది వ్యాప్తమై యుండుట మిక్కిలి శోచనీయము. ఏ నాగరిక జాతియు లజ్జింపవలసిన విషయమిది.

*　　*　　*　　*

౧౯. ఈ సూక్తము తుదిభాగమున కావింపబడిన ఆదేశము ఖుర్ ఆన్ ప్రతిపాదించిన స్త్రీపురుష సంబంధ ధర్మమునకు మూలసూత్రమై యున్నది. చూడుడు ఇక్కడ ఖుర్ ఆన్ ఏమనుచున్నదో:

"స్త్రీలతో వ్యవహరించునప్పుడు దయాదాక్షిణ్యములతోడను, న్యాయముతోడను ప్రవర్తింపుడు. ఒకసారి వారనిన మీకు (ఏ కారణముచేనైనను) అయిష్టముగనున్నచో (హద్దుల నతిక్రమించకుడు.) మీకు వారిలో ఒక్క విషయము అయిష్టముగనుండిన నుండవచ్చును. కాని భగవంతుడు దానియందే మీకెంతో శ్రేయస్సు సమకూర్చవచ్చును."

స్త్రీలయెడ సాధారణముగ ఎట్లు ప్రవర్తించవలెనో మొదటివాక్యమున చెప్పి తర్వాత వచ్చు ప్రశ్నకు ఖుర్ ఆన్ జవాబిచ్చుచున్నది.

దయాదాక్షిణ్యములతో ప్రవర్తించుడని చెప్పుచున్నారుకదా, భార్యయందు నాకసహ్యాకరమగు ఒక దోషముగాని, ఒక లోపముగాని ఉండినచో వెంటనే నేనామెను విడిచిపెట్టుట కభ్యంతర మేమున్నది?' అను ప్రశ్న రావచ్చును. ప్రతిజీవి

---

† జలాలుద్దీన్ సుయూతీ.

§ జిమఖ్షరీ; బైదవీ.

యందును ఏదో ఒక దోషము, ఏదో ఒక లోపము ఉండుట సహజము. తరువాత మన మొకరిలో జూచు దోషము నిజముగా దోషము కాకపోవచ్చును. మనము ఒకరిలో ఉన్న దనుకొనుచున్న లోపము మనకు తుదకు ఉపకారకరమై పరిణమించవచ్చును అని ఖుర్ ఆన్ జవాబిచ్చుచున్నది.

ఒక్కొక్కప్పుడు ఇతరులయందు మన మేవి దోషము లనుకొందుమో, ఏవి లోపములని భావింతుమో అవి దోషములు కాకపోవచ్చును; ఆ లోపములే గుణములై పరిణమించవచ్చును. అందుచే తొందరపడి స్త్రీలను విడిచిపెట్టిగాని, వారిని బాధించిగాని, వారిని దూషించిగాని హింసించుటకంటె వారిని దయాసౌహార్ద్రములతో చూచి వారి లోపములను, దోషములను సహనదృష్టితో చూడవలసినదని ఖుర్ ఆన్ ఆదేశము.

* * * *

౯౯. ఇక్కడ తిరిగి ఖుర్ ఆన్ స్త్రీల హక్కులనుగూర్చి మరొకసారి నొక్కి వక్కాణించుచున్నది. స్త్రీల కొకసారి ఇచ్చిన ధన కనక వస్తు వాహనములను తిరిగి పరిగ్రహింపరాదని చెప్పుచున్నది. కొందరు వివాహసమయమున ఆభరణాదులను ఇచ్చి తరువాత తీసికొందురు. వివాహసమయమున మహరు ఇంత ఇత్తుమని చెప్పి తర్వాత కొంత తగ్గింపించుకొందురు. వివాహసమయమున చేసిన ఒడంబడికలను తర్వాత చెల్లింపరు. ఖుర్ ఆన్ ఇట్టి చెడునడతను ఖండించుచు స్త్రీలకు కావించిన ఎట్టి వాగ్దానము నైనను చెల్లించవలెననియు, వారి కిచ్చిన ఏ ఆస్తియైనను తిరిగి పరిగ్రహింప వలదనియు ఆదేశించుచున్నది.

* * *

౧౦౦. తండ్రిల భార్యలను పుత్రులు తక్కిన ఆస్తితోపాటు బడయు దురాచారము ఒక్క అరేబియాలోనే కాక పెక్కితర దేశములందును ఉండెడిది. హాబ్ హౌస్ పండితుడు ఇట్లనుచున్నాడు :

"In many cases a son inherits his father's wives; with the exception of his own mother, along with the rest of the family property." †

(పెక్కు సందర్భములలో కుమారుడు తన తల్లితప్ప తనతండ్రి తక్కిన భార్యలను ఇతర కుటుంబ ఆస్తితోపాటు గ్రహించును.)

ఖుర్ ఆన్ ఈ దురాచారమును కఠినముగ నిషేధించుచున్నది.

* * * *

† Morals in Evolution, Vol. I, P. 146.

౧౦౧. ఈ అధ్యాయము మొదటి 30 సూక్తములయందును నిషేధింపబడినవి మహాపాతకము లని అతినింద్యమగు ఈ మహాపాతకములనుండి "మీరు తప్పించుకొనినచో, మీయందలి తక్కిన చెడుగుల నన్నిటిని తొలగించివైతును" అని భగవంతుడు ఈ సూక్తమున చెప్పుచున్నాడని కొందరు వ్యాఖ్యాతలు. ♦

సాధారణముగ మహాపాతకములు 'ఏడని శ్రీప్రవక్త యొక్క పెక్కుపదేశములలో కానవచ్చుచున్నది. ఇబ్నెకసీర్ అను వ్యాఖ్యాత దీనికి సంబంధించిన ప్రవక్త వచనము లన్నియు సంకలితపరచెను. ఇందు పేర్కొనబడిన పాపములు ఈ క్రింద ఇవ్వబడుచున్నవి :

బహుదైవతారాధనము ; హత్య ; వడ్డీ తీసికొనుట ; చేతబడి మున్నగు మంత్రతంత్రములు ; తల్లిదండ్రులు లేని పిల్లల ద్రవ్యమును హరించుట ; ధర్మయుద్ధమున వెనుజూపుట ; పవిత్రయగు స్త్రీకి వ్యభిచారదోష మాపాదించుట ; తల్లిదండ్రులను హింసించుట ; మద్యపానము ; వ్యభిచారము ; చౌర్యము ; దోపిడి ; ఒరుల ఆత్మగౌరవమును భంగపరచుట ; అసత్యము పల్కుట ; అబద్ధసాక్ష్యము నిచ్చుట.

పై పాపములు మహాపాతకము లనబడునని శ్రీప్రవక్త ప్రవచనములవల్ల గ్రహింపనగును. ఈ పాపములను భగవంతుడు క్షమింపడని ఖుర్ ఆన్ చెప్పుచున్నది.

* * *

౧౦౨. బుద్ధిప్రతిభలయందును, శారీరకముగను స్త్రీ పురుషులలో కల హెచ్చుతగ్గులవల్ల పురుషునకు సహజముగ స్త్రీపై ఆధిక్యత కల్గినది. పురుషునకు కల బుద్ధిప్రతిభలు స్త్రీకి లేకపోవుటను ఇప్పుడు పాశ్చాత్యశాస్త్రజ్ఞానము నిరూపించినది. అంతేకాదు. పురుషుడు శారీరకముగ స్త్రీ కంటె ఎక్కువ అనుకూలపరిస్థితులలో ఉన్నాడు. స్త్రీ నెలకు మూడుదినములు ఋతుస్రావముచే మైలపడి యుండును. గర్భవతియై అధమము రెండునెలలు పనిచేయ నశక్తురాలై యుండును. పురుషునివలె స్త్రీ బరువైన పని చెయ్యజాలదు. అందుచే సహజముగ ఆడకూలీలకు ప్రపంచమం దెల్లెడలను కూలి తక్కువయే. స్త్రీకి శిశుపోషణ యొక విధాయకకృత్యముగ నుండుటచే సాధారణముగ ఆమె కుటుంబపోషణమునకు ధనసంపాదనము చేయగలుగు స్థితియందుండదు. అందుచే పురుషుడు కుటుంబపోషకుడుగ నుండ తటస్థించినది. తనయొక్కయు తన పిల్లలయొక్కయు

♦ తఫ్సీరె ఇబ్నెజరీర్‌లో హజరత్ ఇబ్నెమసఊద్ గారు చెప్పినట్లు కలదు.

పోషణమునకు స్త్రీ పురుషునిపై ఆధారపడవలసి వచ్చినది ; ఈ కారణములచే పురుషునకు స్త్రీపై ఆధిక్యత కలిగినది. ఇది సహజము ; నైసర్గికము.

ఇప్పుడు స్త్రీలు పురుషులతో పోటీ చేసి మొగరాయళ్లగుటకు ప్రయత్నించుచున్నారు. పురుషులకు మనపై ఆధిక్య మేల యుండవలెనని వాదించుచున్నారు. ఇట్లు పోటీపడుట కూడదనియు, పురుషుని ఆధిక్యతయెడ ఈర్ష్య వహించకూడదనియు ఖుర్ ఆన్ చెప్పుచున్నది.

ఒకరి ధన ధాన్య విద్యాసంపత్తిని చూచి యొకరు ఈర్ష్య వహించకూడదనియు, ఈ సూక్తము కేవలము స్త్రీ పురుషసంబంధములను గూర్చి మాత్రమే చెప్పినదికాదనియు కొందరు వ్యాఖ్యాతలు. ♦

* * * *

౧౦౩. స్త్రీకంటె పురుషు డధికుడని ఇక్కడ స్పష్టముగ చెప్పబడినది. ఇట్లనుట ఖుర్ ఆన్ ప్రతిపాదించిన స్త్రీ స్వాతంత్ర్యసిద్ధాంతమునకు వ్యతిరేకము కాదు. స్త్రీస్వాతంత్ర్యము ఒక నైతికవిధి ; స్త్రీ పురుషభేదము ఒక భౌతికధర్మము. నైసర్గికముగ స్త్రీ పురుషునికంటె శారీరకముగ అబల ; బుద్ధిప్రతిభలయందుకూడ ఆమె పురుషునికంటె తక్కువయే. పై నోటులో వివరించిన కారణములచే పురుషుడు కుటుంబపోషకుడుగను, సంరక్షకుడుగను ఇట్లు స్త్రీకి అన్నివిధముల భర్తగను అయినాడు. అందుచే స్త్రీ తన భర్తకు విధేయురాలై యుండుట అవసర మాయెను.

* * * *

౧౦౪. భార్య అనుకూలవతియై లేనప్పుడు భర్త ఆమెయెడ ఎట్లు ప్రవర్తించవలెనో ఖుర్ ఆన్ ఇక్కడ చెప్పుచున్నది. ఇందులో ఎంత సున్నితమగు మనస్తత్వము కన్పించుచున్నదో చూడుడు : (1) మొట్టమొదట అనునయించి బుద్ధిచెప్పుట. (2) తర్వాత ఆమెను తన పరుపునుండి వేరుచేయుట. (3) పిమ్మట మెల్లగా కొట్టుట. సామాన్యమగు తగవు లింతటితో తీరిపోవును.

ఈ పరిస్థితులలో ఆర్యధర్మ శాస్త్రకారు లేమనుచున్నారో చూడుడు :

"భర్తయెడ యెల్లప్పుడు ఈర్ష్య కనబరచుచు, పరుషవాక్కుల నాడుచు, భర్త రాకపూర్వమే తాను భుజించుచు ఉండు స్త్రీని భర్త ఇంటినుండి వెంటనే వెడలగొట్టవలెను."

"గొడ్రాలగు భార్యను భర్త ప్రేమించరాదు. అట్లే ఎల్లప్పుడు ఆడపిల్లలనే

♦ ఇబ్నె అబ్బాస్ గారి అభిప్రాయ మైనట్లు ఇబ్నెకసీర్, సం. 5, పుట 17.

కనునట్టియు, దుష్ప్రవర్తన కలదియు, భర్తకు ఎదురాడునదియు నగు స్త్రీలో సంగమించిన భర్త స్వయముగ భ్రష్టుడగును."

అని నారదుడు (XII 93—94) చెప్పుచున్నాడు.

మనువు (IX 80, 81), యాజ్ఞవల్క్యుడు (I. 73) కూడ ఇట్టి పరుషప్రవర్తనమునే శాసించుచున్నారు. §

యూరపులోకూడ ఇటీవలివరకు భర్తకు భార్యపై అపరిమితమైన అధికారముండెను. ఈ విషయముపై L. T. Hobhouse గారి ఈ క్రింది వాక్యములను గమనించుడు.

"In Normandy, in the XIII century, it is held that a man could not be prosecuted for beating his wife. It is the same in other parts of France though in Flanders the magistrates condemned a husband for beating his wife till the blood flowed." (Vol. I, P. 224)

(పదమూడవ శతాబ్దములో నార్మండీయందు భార్యను కొట్టినందుకు భర్తపై అభియోగము చెల్లకుండెను. ఫ్రాన్సుదేశమందలి ఇతరభాగములందు కూడ ఇంతే. ఫ్లాండర్సులో ఒకభర్త తనభార్యను రక్తము వచ్చునంతవరకు కొట్టెనని న్యాయాధికారి ఖండించెను.)

* * *

౧౦౫. భార్య అనుకూలవతిగ లేనప్పుడు భర్త అవలంబించవలసిన మూడుపద్ధతులు వెనుకటి సూక్తమున వివరింపబడినవి. ఈ సూక్తమున నాల్గవపద్ధతి చెప్పబడుచున్నది.

అనునయించి బుద్ధి గరపినను వినక, తన పక్కపై రానీయకపోయినను భయపడక, కొట్టినను బుద్ధి తెచ్చుకొనక వెనుకటివలెనే ప్రవర్తించు భార్యకు హితవుగరపుటకు భర్త తనపక్షమువాని నొకని, తన భార్యపక్షమువాని నొకని, ఇట్లు ఇద్దరు మధ్యవర్తులను నియమించి ఆమెకు బుద్ధి చెప్పించవలెనని ఖుర్ ఆన్ బోధించుచున్నది. ఆ మధ్యవర్తులు సాధ్యమైనంతవరకు భార్యాభర్తలలో ఐకమత్యము కల్గించుటకు యత్నించవలెను. ఈ విధముగ తిరిగి ఐకమత్యము కలిగినచో భర్త తనభార్యతో ఎప్పటియట్ల దయతో ప్రవర్తించవలెను. ఆమెయందు దోసగులు వెతుకు ప్రయత్నము చేయరాదు.

* * *

§ Colebrook's Digest, IV. 1, 63 కూడ చూడుడు.

౧౦౩. ఇక్కడ 49, 50 సంఖ్యగల సూక్తములలో కులతత్త్వమును ఖుర్ ఆన్ మరొకసారి ఖండించుచున్నది. ప్రతిదేశమునందును ఏదో ఒక కులమువారు తాము ఆజన్మపవిత్రుల మని చెప్పికొని తక్కిన జాతులను బానిసజాతులుగ గణించుట కలదు. యూదులు తమకంటె ఉన్నతమగు జాతి ప్రపంచములో లేదనియు, భగవంతుడు తమ్ము ప్రత్యేకముగ ఎన్నుకొనె ననియు చెప్పుదురు. అట్లే మనదేశమున బ్రాహ్మణులు తాము ఆజన్మపవిత్రుల మని చెప్పుదురు. బ్రాహ్మణుడు వివేకియైనను అవివేకియైనను దైవమే నని మనువు (9. 317) చెప్పుచున్నాడు. ♦

ఆధునిక యుగములోకూడ పాశ్చాత్య దేశములలో సైతము తెలుపు నలుపు, ఎరుపు తెలుపు భేదములపై ఏర్పడిన హెచ్చుతగ్గులు ఎంతో అంతర్జాతీయ విద్వేషమునకు కారణమగుచున్నది. ఆఫ్రికాలో నల్లజాతులును, అమెరికాలో నీగ్రోలును, మనదేశములో అబ్రాహ్మణజాతులును తమకంటె అధికు లనుకొనుచుండిన తెల్లజాతులయొక్కయు, బ్రాహ్మణాది జాతులయొక్కయు బాధలను ఇంకను అనుభవించుచున్నారు. తెల్లవారి పేటలలో నీగ్రోలుండరాదు. తెల్లవారికిచ్చు కూలి నల్లవారికివ్వరు. తెల్లవారి పాఠశాలలలోగాని, చర్చిలయందుగాని నల్లవారు రాకూడదు. తెల్లవారి హోటళ్లలో నల్లవారికి ప్రవేశము లేదు. తెల్లవారి చదువు వేరు నల్లవారి చదువు వేరు. మన దేశములోను బ్రాహ్మణాబ్రాహ్మణులలో ఇట్టి భేదములే యున్నవి. ఇప్పుడు దక్షిణాఫ్రికాలో నల్లవారిపై జరుగుచున్న దౌర్జన్యములకు మన మెంతయో ఆందోళనము చేయుచున్నాము. మనము మనదేశములో మనవారికి సమానత్వ స్వాతంత్ర్యముల నివ్వకయే ఇతరులను ఖండించుచున్నాము. ఇతరులు మనలను నీచముగ జూచినప్పుడు మనకెట్లు బాధ కలుగునో తెలిసినప్పుడే మనముకూడ మన తోడిజాతులయెడ ఉచితముగ ప్రవర్తింతుమేమో.

ఈ మనస్తత్త్వ మంతటికిని మూలము ఒకజాతి సహజముగ పవిత్రమైనదనియు, మరొకజాతి సహజముగ నీచమైనదనియు యెంచుటయే. ఇట్టిభావము మన కుల తత్త్వమునకు మూలమై యున్నదని అందరకు తెలిసినవిషయమే కాబట్టి ఇక్కడ వివరముగ తెలుపనైతిని. పాశ్చాత్య ఖండములందు కూడ ఇట్టిభావమే దీనికి మూలమనుటకు డాక్టర్ వూఫ్టర్ గారి ఈ వాక్యమును చూడుడు:

"White people assumed that subordination was natural or divinely decreed status of the Negro, and Negroes had a traditional subordination to live down." †

అందుకోసమే పాశ్చాత్య దేశములలో తెల్లవారు నల్లజాతులకు మతములోకూడ సమానత్వ మిచ్చినారుకారు. తెల్లజాతుల చర్చివేరు. నల్లజాతుల చర్చివేరు. అంతేకాదు. నల్లవారి పాఠశాలలువేరు. తెల్లవారి పాఠశాలలువేరు. వారిపేటలు వేరు; వీరిపేటలువేరు. తెల్లవాండ్ర పార్కులలో, హోటళ్లలో, నాటకశాలలలో నల్లవారికి ప్రవేశము లేదు. అన్నిటికంటె ఆశ్చర్యకరమైన విషయమేమనగా రైల్వే స్టేషనులలో రెండుజాతులకును వేరువేరు గేట్లు కలవు. ట్రాములలోను, బస్సులలోను నల్లవారి సీట్లువేరు. §

♦ మహాభారత ఆనుశాసనికపర్వమున భీష్ముని ధర్మజుడు

'బ్రాహ్మణ్య మవులజాతుల మాటన్
జనియించినవానికి దొర
కొనునొకో యతివిమలకర్మగుణయోగమునన్?'

అని అడుగును. దానికి భీష్ముడు "బ్రాహ్మణత్వంబు గడు దుర్లభము" అని ఇంద్రమతంగసంవాద మను ఉపాఖ్యానమును చెప్పును. అందు ఇంద్రుడు పరమ తపస్వియైన మతంగునితో "ఇత్తెఱంగు తపంబునకుఁ బది మడుంగులు సేసి చండాలుండు శూద్రుం డగు. నూఱు మడుంగు లనుష్ఠించి శూద్రుండు వైశ్యుండగు. వేయిమడుంగు లాచరించి వైశ్యుండు క్షత్త్రియుండగు. అప్పుణ్యాచరణంబునఁ బదివేలు మడుంగులు నిర్వర్తించి క్షత్త్రియుండు దుర్బ్రాహ్మణుండగు" నని చెప్పును. ఈ విధముగ జన్మచేతనే బ్రాహ్మణుడు దైవసమానుడని ఆర్యధర్మ శాస్త్రకారుల మతము.

† Dr. T. J. Woofter, Jr. Ph. D., "*Agencies for Inter racial Co-operation in the United States*" in "*Christian Mission in the Light of Race Conflict.*" P. 25.

§ In the South (States of North America) Statutes prescribe separation on common carriers, in schools and in public places......... As the Negroes have increased, some Northern cities have tried to set up separate schools and some owners of theatres and restaurants employ subtle means to exclude Negroes...... at one place they (Negroes) enter the railway station through the same gate with white people but at another they use a different gate; at one place they are seated at the front of the street car and at another at the rear." *Ibid.* P. 28.

"At Post office, bank, railway station and all public buildings he (the South Africa native) must seek separate counters and often finds proper and more ungracious service."

Rev. J. Dextor Taylor, *Relations between the Black and White races in South Africa* P. 113.

మానవ మనస్తత్వము భారతదేశమునందున్నను పాశ్చాత్యదేశములందున్నను, ప్రాచీనకాలమందున్నను, ఆధునిక యుగమునందున్నను ఒకటే. ఈ జాత్యుత్కృష్ట భావము అప్పుడూ, ఇప్పుడూ, ప్రాగ్దేశములలోను, పాశ్చాత్యదేశములందును కూడ ఉండినటుల స్పష్టమైనది. ఈ దృష్టితో చూచిన యెడల ఇస్లామ్ మానవ మనస్తత్వములో కావించిన అపూర్వ విప్లవముయొక్క విలువ తెలియగలదు.

జెరూసెలెమ్‌లో జరిగిన అంతర్జాతీయ మిషనరీ కౌన్సిలులో మాట్లాడుచు ప్రొఫెసర్ జబావూగారు చెప్పిన మాటలు గమనింపుడు :

"One of the great difficulties in the way of black people in South Africa building up their own Church is the feeling that *even under Christian missions there is no equality in Church or State. Islam is gaining more African adherents because of the attitude on this question* .... The Government enacts all sorts of laws against bla k races, just because of their colour........There is land segregation ....and social segregation........In Pretoria I cannot ride in a train." †

ఒక్క ఆఫ్రికా ఖండమునందే కాదు. ప్రపంచమందెల్లెడలను అణగద్రొక్కబడిన జాతులన్నియు ఇస్లామ్ మతముయొక్క ఒడియందే ఆశ్రయమును పొందెను.

ఒక సుప్రసిద్ధ క్రైస్తవ మిషనరీ ఏమనుచున్నాడో చూడుడు :

"A visitor to a mosque enquired what place was reserved for the Nawab during divine service. "What ?" exclaimed his guide, 'A place for the Nawab in the House of God? the Nawab and the beggar stand side by side.' He spoke the simple truth. In the House of God distinctions of class or race count for nothing. Unless the Christian

† Missions and Race Conflict, Proceedings of the Jerusalam Meeting, Vol. IV. P. 223. ప్రొఫెసర్ జబావూగారూ బహుశా దక్షిణాఫ్రికాదేశపు నల్లజాతి విద్వాంసుడై యుండవలెను. ఈయన ఇస్లామ్ మత మిచ్చిన సర్వజాతి సమానత్వమును గూర్చి చెప్పినమాటలను మిషనరీ కౌన్సిలువారు తమ రిపోర్టులో తీసివైచి చుక్కలు పెట్టిరి.

Church can exhibit a brotherhood as real as that of Islam, we cannot be surprised if the latter is more successful in winning the allegiance of Pagan peoples."   —J. H. Oldham, Christianity and the Race Problem, P. 263.

ఇక్కడ శ్రీ మొహమ్మద్ ప్రవక్త జీవితచరిత్రమునుండి ఒకఅంశ ముల్లేఖించుట అప్రస్తుతము కాదు. ఒకనాడు శ్రీవారికడకు ఒక అబిసీనియాదేశపు నీగ్రో వచ్చి "ఒక సందేహము కలదు" అనెను.

శ్రీ ప్రవక్త : నిర్భయముగ జెప్పి సందేహనివృత్తి గావించుకొనుము.

నీగ్రో : ఓ భగవత్ప్రవక్తా! మీరు విశ్వసించుచున్న సత్యములయందే నేనును శ్రద్ధాభక్తులు కలిగియుండి, మీ రనుసరించుచున్న విధులనే నేనును అనుసరించినచో స్వర్గములో మీకు సమానమైన స్థానము నాకు లభించునా?"

శ్రీ ప్రవక్త : "తప్పక లభించును." ♦

*   *   *   *

౧౦౭. "మీపై అధికారము వహించి యున్నవారికి విధేయులై యుండుడు." అని ఖుర్ ఆన్ ఈ సూక్తమున ఉపదేశించుచున్నది. అనగా మనపై అధికారము వహించియున్న ప్రభుత్వమునకు విధేయులై యుండుడని దీని భావము.

ఐతే మనపై అధికారము వహించియున్న ప్రభుత్వము ధర్మముతో ప్రవర్తించక, నిరంకుశమై యున్నప్పుడు కూడ విధేయులై యుండవలెనా? అన్న ప్రశ్న దీనిపై రాకమానదు.

ఈ ప్రశ్నకు జవాబు మనకు శ్రీ ప్రవక్త ఉపదేశములలో లభించగలదు. శ్రీ ప్రవక్త అధికారవర్గమునకు విధేయతను శాసించుచు, అట్టి అధికారవర్గముకాని, పరిపాలకుడుకాని న్యాయబద్ధమును, ధర్మబద్ధమును అగు ఆజ్ఞల నిచ్చినప్పుడే విధేయులై యుండవలెననియు, అట్లుకాక న్యాయబద్ధము కానట్టియు, దౌర్జన్యపూరిత మైనట్టియు ఆజ్ఞలను ధిక్కరించవచ్చుననియు శ్రీ ప్రవక్త కావించిన ఉపదేశములవల్ల స్పష్టమగుచున్నది. చూడుడు విధేయతను శాసించుచు శ్రీ ప్రవక్త కావించిన ఉపదేశములు :

"మీపై ఒక నీగ్రో బానిస పరిపాలకునిగా నియమింపబడినను వానికి విధేయులై యుండుడు." (బుఖారీ.)

♦ తఫ్సీరె ఇబ్నెకసీర్ సం. 5, పుట 56.

* "వికలాంగుడైన ఒక నీగ్రో బానిసయైనను మీపై పరిపాలకుడుగా నియమింపబడి భగవద్గ్రంథము ననుసరించి మిమ్ములను పరిపాలించుచుండినచో వానిమాట వినుడు. దాని ప్రకారము చేయుడు." (ముస్లిం)

ఐనను ఇట్టి విధేయత సత్పరిపాలకులయెడల, న్యాయబద్ధమైన ఆజ్ఞలు వారిచ్చినప్పుడు మాత్రమే చూపవలె ననుటకు ఈ క్రింది ఉపదేశములను చూడుడు :

"ఒకప్పుడు ప్రవక్త ఒక చిన్న సైన్యమును ఒక అన్సారీ ఆధిపత్యముక్రింద పంపెను. ఒకనాడేదో సందర్భమున ఆ దళాధిపతి మిక్కిలి ఆగ్రహపరవశుడై సైనికుల నుద్దేశించి, 'నాకు విధేయులై యుండుడని శ్రీ ప్రవక్త మీ కాజ్ఞాపించి యుండలేదా?' అని ప్రశ్నించెను. 'అవును' అని అందరు జవాబు చెప్పిరి. 'అట్లయిన కట్టెలను ప్రోగుచేయుడు' అని అతడు ఆజ్ఞాపించెను. సైనికులందరును కట్టెలు పోగుచేసిరి. వానికతడు నిప్పు ముట్టించి 'మీరందరు ఈ నిప్పులో దూకుడు' అని వారి నాజ్ఞాపించెను. అప్పుడు ఒక యువకుడు లేచి 'సోదరులారా! అగ్ని ♦ నుండి రక్షింపబడుటకు మీరు శ్రీ ప్రవక్త నాశ్రయించిరి. శ్రీ ప్రవక్త ఆజ్ఞ వినువరకు మీరు తొందరపడకుడు. వారి ఆజ్ఞయైన మనము తప్పక నిప్పులో దూకుదము' అని వారిని వారించెను. సైన్యము మరలి వచ్చి శ్రీ ప్రవక్తను దర్శించెను. జరిగినదంతయు శ్రీవారికి వినిపించిరి. అంతయు విని శ్రీ ప్రవక్త : "నిప్పులో దూకియుండినచో మీరు నిత్యము అగ్నియందే ఉండియుందురు. వినుడు ! విధేయత మంచి ఆజ్ఞలకే!" (బుఖారీ)

"ధర్మబద్ధమగు ఒక మాటకు వ్యతిరేకముగ నడుచుట కిచ్చిన ఆజ్ఞను విననక్కరలేదు." (అబూదావూద్)

ఈ విధముగ ధర్మబద్ధమగు ఆజ్ఞలకే విధేయులై యుండవలెననియు, అన్యాయమును, అధర్మమును అగు ఆజ్ఞల నుల్లంఘించవలెననియు శ్రీ ప్రవక్త ఉపదేశము.

అధర్మమగు ఆజ్ఞ ఎట్టిది? అని దీనిపై ప్రశ్నవచ్చును. ఖుర్ ఆన్ యొక్కయు శ్రీ ప్రవక్త యొక్కయు ఉపదేశములకు వ్యతిరేకముగ నున్న ఆజ్ఞలన్నియు అధర్మమైనవే. ఉదాహరణమునకు ఒక ప్రభుత్వము దైవప్రార్థనమును నిషేధించినచో అట్టి ఆజ్ఞను ఉల్లంఘించవచ్చును. మరొక ఉదాహరణము ఒక ప్రభుత్వము ఒక ముస్లిమ్

♦ 'నరకాగ్ని' అని భావము.

సైనిక దళమును మరొక ముస్లిమ్ సైనికదళముతో యుద్ధము చేయవలసినదని ఆజ్ఞాపించినచో అట్టి ఆజ్ఞయు ఉల్లంఘింపదగినదే. ఎందుకన ఇది ఖుర్ ఆన్ ఉపదేశములకు విరుద్ధము.

* * * *

౮౨. "ఏమి! వీరు ఖుర్ ఆన్ (యొక్క ఉపదేశముల) ను గూర్చి శ్రద్ధతో యోచింపరా? ఇది అల్లాః కడనుండి కాక మరెవ్వరి కడనుండియైన వచ్చియుండినచో ఇందులో ఎన్నోచోట్ల స్వవచన వ్యాఘాతము లుండియుండును."

ఈ సూక్తములో ఖుర్ ఆన్ భగవద్వాక్యమనుటకు రెండు నిదర్శనములు చూపబడినవి :

(i) "వీరు (అనగా అవిశ్వాసులు) ఖుర్ ఆన్ యొక్క ఉపదేశముల గూర్చి శ్రద్ధతో యోచింపరా?" అని ఖుర్ ఆన్ ప్రశ్నించుచున్నది. ఖుర్ ఆన్ యొక్క ఉపదేశములు సామాన్య మానవబుద్ధికి సాధ్యమా? అట్టి గొప్ప ఉపదేశములు కావించిన ఖుర్ ఆన్ భగవద్వాక్యమనుటలో సందేహమేమి? అని ఖుర్ ఆన్ ప్రశ్నించుచున్నది. వెనుక నోటులలో పలుచోట్ల సూచించినట్లు ఖుర్ ఆన్ సాంఘిక, ఆర్థిక, రాజకీయ, ఆధ్యాత్మిక విషయములనుగూర్చి కావించిన శాసనములు ఎంత సార్వజనీనికములును, ఎంత సార్వకాలికములును, ఎంతటి సంపూర్ణములును ఐ ఉన్నవో సూచించితిని. ఇప్పుడిప్పుడు భౌతిక, మానసిక శాస్త్రవిజ్ఞానము కనిపెట్టుచున్న గొప్ప సత్యములు ఎన్నడో ఖుర్ ఆన్ ప్రతిపాదించినది. ప్రపంచచరిత్రములో ఏ ధర్మగ్రంథమును కూడ ఇంత సంపూర్ణమైన ధర్మము నిచ్చియుండలేదనిన అతిశయోక్తి కాదు. బైబిల్ లో సాంఘిక, ఆర్థిక, రాజకీయ జీవితమునకు సంబంధించిన ఎట్టి ఆదేశమును లేదు. అదేవిధముగ వేదమును, ఉపనిషత్తులును సంపూర్ణమగు ధర్మమును శాసించియుండలేదు. తరువాత వెలువడిన ధర్మశాస్త్ర గ్రంథములు పరస్పర భిన్నముగను, ఇప్పటికాలమునకు సరిపడునట్లును ఉన్నవి. తక్కిన మతగ్రంథములను గూర్చి కూడ ఇట్లే చెప్పవచ్చును.

ఖుర్ ఆన్ అట్లుకాదు. ఖుర్ ఆన్ అన్నివిషయములందును మనకు మార్గదర్శకముగ నున్నది. భౌతికశాస్త్ర విజ్ఞానమునకు విరుద్ధముగ లేదు. ఆధునిక సాంఘిక శాస్త్రములకును (Social sciences) మానసిక, నైతిక శాస్త్రము

లకును (Mental and Moral sciences) విరుద్ధముగ లేదు. అంతేకాదు, ఈ శాస్త్రవిజ్ఞానమునకు, శాస్త్ర జిజ్ఞాసకును దోహదమిచ్చినది ఖుర్ ఆన్.

ఇప్పుడు ప్రపంచములో శ్రుతులని ఆయా మతస్థులచే అంగీకరింపబడుచున్న గ్రంథములన్నియు పరస్పర విరుద్ధముగను, ప్రక్షిప్త భాగములతోడను, ఖిలకాండములతోడను నిండియున్న వనుట సుప్రసిద్ధము. ♦ భగవంతునిచే ప్రోక్తమైన దానిలో పరస్పర విరుద్ధములగు వచనములుండుట అసంభవముకదా? ఖుర్ ఆన్ భగవత్ప్రోక్తమనుటకు ఇదొక నిదర్శనముగా ఇక్కడ చెప్పబడినది.

* * * *

౧౦౯. ఎట్టివారితో యుద్ధము చేయవచ్చునో, ఎట్టివారితో యుద్ధము చేయరాదో ఇక్కడ చెప్పబడినది. వైరులైయుండియు తటస్థులైనచో వారితో యుద్ధము చేయరాదు. పైబడి యుద్ధమునకు వచ్చునారితోడనే యుద్ధము చేయవలెనని ఖుర్ ఆన్

♦ ఆర్ష శ్రుతులను గూర్చి రాధాకృష్ణ పండితుని అభిప్రాయమును గమనింపుడు

"Everywhere we had contradictory notions. In religion there was Vedic polytheism and sacrifices tempered by Upanishad monism and spiritual life. ......In eschatology, there was the conception of rebirth mixed up with ideas of hell, But the true was overwhelmed by the false, and the chaos of the Brahmanical religion, with all its conflicting theories, soon reached a climax in the post-Upanishad or the pre-Buddhistic Period"

Sir, S. Radhakrishnan, Indian Philosophy, Vol. I, 265.

మరియొకచో ఉపనిషత్తులను గూర్చి వ్రాయుచు శ్రీ రాధాకృష్ణ పండితు లిట్లనుచున్నారు:

"Not being systematic philosophy, or the product of the same age, they contain much that is inconsistent and unconscious." *Ibid*, P. 138.

"So numerous are their suggestions of truth, so various are their guesses at God, that almost anybody may seek in them what he wants and find what he seeks, and every school of dogmatics may congratulate itself on finding its own doctrine in the sayings of the Upanishads."

—*Ibid P.* 140.

బైబిల్‌నుగూర్చి విన్సెన్ ఫిలిప్స్ పండితుడు ఏమనుచున్నాడో చూడుడు:

"Some of their (the Gospels') statements of facf are quite erroneous, and the data are *often in direct contradiction to one another.*"

—*Churches and Modern Thought, P.* 62.

"Gospel accounts (of Resurrection) exhibit *contradictions of the most glaring kind.*"

—*Prof. Schmiedel in Encyclopaedia Biblica, art Resurrection.*

ఇక్కడ చెప్పుచున్నది. అవిశ్వాసు లందరితోడను యుద్ధము చేయవలసినదని ఖుర్ ఆన్ బోధించుచున్నదను మిషనరీల ప్రచారము ఎంత సత్యదూరమో దీనివల్ల తెలియగలదు. ఇట్టి ఆజ్ఞ ఇచ్చినది ఖుర్ ఆన్ కాదు. క్రైస్తవ మతాచార్యులే. యూరోఫ్‌లో క్రైస్తవేతరులకు యూదులను శతాబ్దముల తరబడి క్రైస్తవ ప్రభువులును క్రైస్తవ ప్రజలును ఎంత హింసించిరో చరిత్రప్రసిద్ధము. క్రైస్తవ చర్చి చరిత్రకారులు ఈ విషయమున ఏమి వ్రాసిరో చూడుడు. రాచెస్టర్ యొక్క ఆర్చ్‌డీకన్ ఐ యుండిన డాక్టర్ చీతామ్‌గారి మాటలివి:

"In the year 353 he (Constantius) forbade heathenish ceremonies *under pain of death and confiscation of goods.* Prefects who did not enforce the law were to be liable to the same punishments." §

"When Theodosius I, one of the greatest rulers of the declining empire, became sole ruler of the empire, he forbade in the most emphatic terms all sorts and conditions of men to offer sacrifice to senseless idols, or even to practise private worship before the domestic shrines. To pour a libation of wine to the tutelary genius or to hang a garland before the penates was made criminal, though heathen worship still lingered in Rome and Alexandria. But the zeal of the Christian mobs had outrun the legislation of the emperors .... Hypatia, a distinguished teacher of Neo-platonistic school at Alexandria........was seized one day by a rabble of Christians and dragged from her carriage into a neighbouring church, where she was killed with potshreds and her body torn limb from limb, carried out and burnt."*

---

§ S. Cheetham, *A History of the Christian Church P. 201*

పై వాక్యములలోని కాన్స్టాంటియస్ క్రీ. శ. 337 నుండి 361 వరకు పరిపాలించిన క్రైస్తవ రోమన్ చక్రవర్తి.

* Cheetham, *Ibid*, PP. 207—208.

"The Roman Catholics have not only the right, but it is their duty to kill heretics."

—Pastor Chiniquy, *Fifty years in the Church of Rome*, P. 94.

("క్రీ. శ. 353 లో కాన్స్టాంటియసు క్రైస్తవేతర మతవిధులను నిషేధించుచు, వాని నవలంబించినవారికి మరణశిక్ష విధించెను. వారి ఆస్తులను జప్తుచేసికొనెను. ఈ లాను కఠినముగ అమలులో పెట్టని ఉద్యోగులకు కూడ ఇట్టి శిక్షయే లభించుచుండెను.

మొదటి థియోడోసిస్ చక్రవర్తి యైనవెంటనే విగ్రహారాధనము, విగ్రహములకు బలులు మొదలైనవన్నియు కఠినముగ నిషేధించెను. గృహదేవతల ఆరాధనమును కూడ నిషేధించెను. సమాధులపై పూలమాలలను వేయుటకూడ నేరమైయై యుండెను. క్రైస్తవుల మూఢభక్తి చక్రవర్తి శాసనములకు మించియుండెను. హైపేషియా అను ప్రఖ్యాత విదుషీమణి క్రైస్తవి కానంతమాత్రమున ఆమెనొక క్రైస్తవులమంద వీధిలోనికీడ్చి ఒక చర్చిలోనికి తీసికొనిపోయి చిత్రవధ గావింపబడెను.")

ఖుర్ ఆన్ గాని, ప్రవక్త గాని, ఆయనతర్వాత వచ్చిన ఖలీఫాలు, ముస్లిమ్‌చక్రవర్తులు, రాజులుగాని ఏకాలమునందును ఇట్టి పద్ధతులను అవలంబించలేదని చరిత్ర చదివినవారెల్లరికిని విదితమే. క్రైస్తవ మతాచార్యులును, క్రైస్తవ పరిపాలకులును తమ మతమును విశ్వసించనివారిని పెట్టిన బాధలు, వారి వ్యతిరేకముగ ఏర్పరచిన నియమములు మున్నగు విషయములు ఇక్కడ దీర్ఘముగ చర్చించుట కవకాశములేదు. వీనిని గూర్చి ఎక్కువగ తెలిసికొనగోరువారు డాక్టర్ ఎ౯. డి. నోక్స్‌గారు వ్రాసిన A History of the Crime of Blasphemy అను గ్రంథమును, చార్లస్ బ్రాడ్లాగారు వ్రాసిన The Laws Relating to Blasphemy and Heresy అను గ్రంథమును, సర్ జేమ్స్ స్టీఫెన్‌గారు వ్రాసిన The History of Criminal Law అను గ్రంథమును, బ్రాడ్లా బోనర్‌గారు వ్రాసిన Penalties upon Opinion అను గ్రంథమును చూడవచ్చును.

* * *

౧౧౦. పదునారవ ఖండమున 105 మొదలు 112 వ సూక్తమువరకు నేరముచేసి యింకొకరిపై ఆ నేరమును మోపుట మిక్కిలి దుష్కార్యమని చెప్పబడినది. ఈ సూక్తములు ప్రోక్తమైన సందర్భమును భాష్యకర్తలీ క్రిందివిధముగ చెప్పుచున్నారు.

బనూఉబైరిఖ్ అను ఒక తెగవారు తాము దొంగతనముచేసి ఆ నేరమును మరియొకరిపై మోపిరి. ప్రవక్త ముందు దొంగతనముచేసిన వారి మాటనమ్మి ఏమియు నెఱుగని ఖతాదాగారిని మందలించిరి. ఆ సందర్భమున ప్రోక్తమైన సూక్తములివి. ♦

♦ తిర్మిజీ, కితాబుత్తఫ్సీర్. తిర్మిజీలో మిక్కిలి దీర్ఘముగ వివరము లీవ్వబడినవి. నేను సంక్షిప్తముగ ఇక్కడ ఆ విషయము నుల్లేఖించితిని.

ఏదేని వివాదములో తీర్పుచెప్పుట మిక్కిలి బాధ్యతతో కూడుకున్న విషయము. ఏపక్షమున సాక్ష్యము బలముగానున్న ఆ పక్షమున కనుకూలముగ తీర్పు చెప్పుట మానవసహజము. మానవుడు సర్వజ్ఞుడుకాడు. అతని తీర్పులో పొరపాటుండవచ్చును. అందుచే బలవత్తరమైన సాక్ష్యమును తెచ్చినవారి కనుకూలముగ తీర్పు లభించుట వలన న్యాయాధీశుని మోసగించితిమని ఆ పక్షము తలచవచ్చును. కాని వారు తమను తామే మోసగించుకొనుచున్నారనియు, దానివలన వారికే నష్టమనియు ఇక్కడ ఖుర్ ఆ౯ చెప్పుచున్నది.

ఈ సందర్భమున శ్రీ ప్రవక్త జీవితచరిత్రమునుండి ఒకటి రెండంశముల నుల్లేఖించుట అప్రస్తుతము కాదనుకొందును.

ఒకనాడు శ్రీ ప్రవక్త తమ ఇంటిబైట ఎవరో ఘర్షణపడుచున్న ధ్వనులు విని వీధిలోనికి వచ్చిరి. పోరాడుచున్నవారు శ్రీ ప్రవక్తను తీర్పు చెప్పగోరిరి. దానికి ప్రవక్త: "చూడుడు. నేను మానవమాత్రుడను. నేను విన్నదానినిబట్టి తీర్పు చెప్పుదును. వాది ప్రతివాదులలో ఒకడు వాదకుశలుడై వాచాలుడై యుండుట సాధ్యము. అప్పుడు నేను వానిమాటలే నిజమని నమ్మి వాని కనుకూలముగ తీర్పు చెప్పవచ్చును. ఒకసారి వాస్తవముగ రెండవపక్షమే న్యాయసమ్మతమై యుండవచ్చును. అట్టితరి అన్యాయముగ హక్కును పొందినవాడు నరకమునకు పాల్పడును." అని చెప్పి "ఇక మీ యిష్టము." అని సెలవిచ్చిరి. (బుఖారీ-ముస్లిమ్ రెంటియందును ఈ వృత్తాంతము కలదు.)

ఒక ఆస్తి విషయములో ఇద్దరు క్రైస్తవులకు తగువు సంభవించెను. వారు శ్రీ ప్రవక్త కడకు తమ తగవును తీర్చుడని నివేదించుకొనిరి. శ్రీ ప్రవక్త తీర్పు చెప్పి ఇట్లు సెలవిచ్చిరి: "నా ఈ తీర్పు ఆధారముపై మీకు వాస్తవముగ హక్కులేని ఆస్తిని ఆక్రమించుకొనకుడు. అది నరకయాతనయై మీ మెడలకు వేలాడగలదు." ఈ మాటలు విని ఆ క్రైస్తవులు కన్నుల నీరు పెట్టుకొని "నా భాగమునుకూడ నా సోదరుని కిచ్చివేయుడు" నని ఇద్దరును చెప్పిరి. "అట్లయినచో మీరు పరస్పరము సమాధానపడి ఆస్తిని మీమీ హక్కుల ననుసరించి పంచుకొనుడు" అని శ్రీ ప్రవక్త సెలవిచ్చిరి. ఆ ఇద్దరుసోదరులు సమాధానపడి సుహృద్భావముతో ఆస్తిని పంచుకొనిరి.

(మన్నదె అహమద్)

* * * *

౧౧౧. ఏకేశ్వరత్వము ఖుర్ ఆన్ ప్రతిపాదించు ధర్మమునకు పునాది. ఖుర్ ఆన్ గ్రంథమున కాత్మ. అందుచే అన్నివిధముల అసమానుడగు భగవంతునకు సమానులను కల్పించి వారి నారాధించుటకంటె గొప్ప పాతకము ఖుర్ ఆన్ దృష్టిలో మరొకటి లేదు.

ఏకేశ్వరత్వమును నిరాకరించినవాడు ప్రకృతిధర్మము (Natural Law) ను విశ్వసింపడు. మూఢభావములకును తత్ఫలితముగ దురాచారములకును పాల్పడును. ♦ అందుచేతనే ఖుర్ ఆన్ దీనితర్వాతి సూక్తములో విగ్రహారాధనము దుష్టుడగు సైతాను పూజయేనని చెప్పుచున్నది. "అనేకమగు ఈశ్వరులుండజాలరు. అది ఆస్తికతకు వ్యతిరేకము......ఆస్తికతకు మూలసూత్రమైన భగవంతునకు మానవుని స్వయం సమర్పణము ఏకేశ్వరుని తోడనే సాధ్యము."

("ఈశ్వరునియొక్క నిజమైన భావనకు ఏకేశ్వరత్వము అనివార్యము. ఈశ్వరుడొక్కడే కాగలడు. అనంతగుణముగల ఇద్దరు కాజాలరు.")

("ప్రకృతి ధర్మమునందు విశ్వాసమన్న ఏకేశ్వరునియందు విశ్వాసమన్నమాట. ఈభావ మెంతగట్టిపడిన మూఢభావము లంతగ నశించును. ప్రకృతి క్రమపద్ధతి నున్నదనినచో మహాత్మ్యముల కందు తావుండదు. అవి యున్నయెడలనే అస్తవ్యస్తమైన భావములు, మూఢవిశ్వాసములు మొలకెత్తును. అవి బహుదైవతారాధన చిహ్నములను తెచ్చును.") తర్వాత సైతాను ఎట్టివాడో చెప్పుచున్నది :

"వారిని (మానవులను) నేను దారితప్పించి వారిలో తుచ్ఛమగు కోరికలను రేకెత్తింతును. వారిలో మూఢవిశ్వాసములను కల్గించి..............వారు భగవత్సృష్టిని

♦ ఈ సందర్భమున సర్. ఎస్. రాధాకృష్ణ పండితుని వాక్యములు గమనింపుడు :

"We cannot have plurality of Gods, for religious consciousness is against it......Self-surrender of man to God, the central fact of religious experience, is possible only with one God ?"

—*Dr. Sir, S. Radhakrishnan, Indian Philosophy*, Vol. I, P. 91.

"Monotheism is inevitable with any true conception of God. The Supreme can only be one. We cannot have two supreme and unlimited beings."

"Trust in natural law means faith in one God. The advance of this conception implies the paralysis of superstition. An orderly system of nature has no room for miraculous interferences in which alone superstition and confused thought find the signs of polytheism." *Ibid*, P. 90.

మార్చునట్లు చేయుదును." అని సైతాను శపథము. బహుదైవతారాధనమును, విగ్రహారాధనమును చేయుట అట్టి సైతానును ఆరాధించుట వంటిదని ఖుర్ ఆన్ చెప్పుచున్నది. §

* * *

౧౧౨. ఇక్కడ విగ్రహారాధనము, బహుదైవతారాధనముల వల్ల కలుగు నష్టములకు స్త్రీ విగ్రహముల పూజ ఉదాహరణముగ సూచింపబడుచున్నది. మన దేశములో శక్తిపూజ ఎంతటి ఘోరమును అవాచ్యమును అగు దురాచారములను వ్యవహారములోనికి తెచ్చినదో వామాచారము, శాక్తేయమతము మున్నగు మతములనుగూర్చి తెలిసినవారికి విదితమే. ఉదాహరణమునకు హానరబుల్ రావుబహద్దర్ గోపాలహరి దేశముఖ్ గారిచే పరిష్కృతమైన "ఆగమప్రకాశ"మను గ్రంథమునుండి ఈక్రింది శ్లోకార్థమును సంగ్రహింతును :—

"భయంకరమగు తెరచిననోరు కలిగి విరియబోసికొనిన జుత్తుగల కాళిని మద్య పదార్థములతో పూజింపవలెను. ఆమెకు నాల్గు చేతులును, రాక్షసుల శిరస్సులతో చేయబడిన అద్భుతమగు హారము కలవు. ఆ రాక్షసుల నామె సంహరించెను. వారి రక్తమును ఆమె త్రాగెను. ఆమెచేతిలో ఖడ్గము కలదు...... మేఘమువంటి నల్లనిరంగు. ఆమె నగ్న.........ఆమె మెడలో కపాలములహార మొకటి కలదు. ఆమె కంఠము రక్తప్లావితము...... ఆమె రెండుచేతులలో రెండు కళేబరములు కలవు...... ఆమె శ్మశానములలో వసించును. ఆమె భర్తయగు మహాదేవుని వక్షస్థలముపై నిలువబడి యుండును."

ఇట్టి భయంకరమగు విగ్రహమును ఇంతకంటెను భయంకరమును, అవాచ్యమును అగు పద్ధతులతో పూజింతురు. శాక్తేయులు కానివారుసైతము కాళిని తాంత్రికుల పద్ధతిపై కాకపోయినను ఇట్టి భయంకరరూపమునే పూజింతురు. భగవంతుని విడిచి కాష్ఠ లోష్ఠములతో చేయబడిన దేవతావిగ్రహములను పూజించి మానవు డెంత అధఃపతితుడగునో యుక్తాయుక్త విచక్షణపరులు గ్రహింపగలరు.

* * *

§ విగ్రహారాధనము వలనను, బహుదైవతారాధనము వలనను మన దేశములో వ్యాపించిన దురాచారములు రావుబహద్దర్ కందుకూరి వీరేశలింగము పంతులుగారి రచనలలో వర్ణింపబడినవి. అట్లే హిందూమత సంస్కారవాదులగు దయానందసరస్వతి మున్నగువారి రచనలలోను వర్ణితములు. వాటి నిక్కడ గ్రంథవిస్తరభీతిచే నుల్లేఖింపనైతిని.

౧౧౩. ఇక్కడ మూఢవిశ్వాసములకు ఒక ఉదాహరణ మివ్వబడినది. జంతువుల చెవులను చీల్పు మూఢవిశ్వాసము, ఇట్టి పెక్కుతర మూఢవిశ్వాసములకు ఇది ఒక ఉదాహరణము. మన దేశములో ఇట్టి మూఢవిశ్వాసములకు అంతులేదు. శకునములు, ముహూర్తములు, మొక్కుబడులు, చేతబడులు, మశూచికము మున్నగు అంటువ్యాధులు క్షుద్ర దేవతలవలన కలిగినవని జాతరలు చేసి బలులిచ్చుట, దేవతలకు తలవెంట్రుకలు సమర్పించుట ఇత్యాది మూఢాచారములు ఏకేశ్వరత్వమునందు గురి లేకపోవుటవలననే కలుగునని ఖుర్ఆన్ భావము. ఈశ్వరుడొక డేననియు, ఈశ్వరునాజ్ఞ లేనిది ఏదియు సంభవించదనియు, సమస్తమును ఒక నిర్ణీత మగునట్టియు, భగవన్నిర్మిత మైనట్టియు ఒక ప్రకృతి ధర్మమునకు లోబడి యున్నదనియు విశ్వాసమున్న యెడల ఈ మూఢవిశ్వాసములు మొదలంట కూలును. ఖుర్ఆన్ అందుచేతనే ఏకేశ్వరత్వమును గ్రహింపుడని ఉద్ఘోషించుచున్నది.

* * * *

౧౧౪. స్త్రీకి మోక్షార్హత లేదనియే వెనుకటి మతము లన్నియు అభిప్రాయపడినవి. ఖుర్ఆన్ ఇక్కడను ఇంకను పెక్కుతరచోట్లను స్త్రీలకు పురుషులకువలెనే స్వర్గప్రాప్తి కలుగునని చెప్పుచున్నది.

* * * *

౧౧౫. భగవంతునకు ఆత్మ సర్వస్వము నర్పించుటయే నిజమైన మతమందలి కేంద్రసూత్రము. అట్లు సమర్పించినవానికి భగవన్మార్గమే ఏకైకమార్గము. ఇబ్రాహీమ్ ప్రవక్త బహుదైవతారాధకులలో పుట్టి పెరిగి, బహుదైవతారాధనమునందలి అవివేకమును మోసమును కనిపెట్టి ఏకేశ్వరారాధకు డయ్యెను. అందుచేతనే ఆయన ఉదాహరణ మిక్కడ ఇవ్వబడినది.

* * *

౧౧౬. భార్యాభర్తలలో గృహకలహములు సంభవించుట సహజము. భర్త తన భార్యయం దనురక్తుడు కాక ఆమెను నిరాదరించవచ్చును. అంతమాత్రమున వైరములు పెంచుకొని వివాహబంధములను త్రెంచుకొనరాదు. భార్యాభర్తలు ఒకరినొకరు పీడించుకొనుట పాపకార్యము. వారు పరస్పరము సమాధానపడి ఒకరినొకరు ప్రేమగౌరవములతో చూచుకొనినచో తాత్కాలిక కలహములవలన కలిగిన పాపము తుడుచుకొనిపోవును. ఒకరియెడ ఒకరు ఉపకారబుద్ధితో ప్రవర్తింపవలయునని ఖుర్ఆన్ ఆదేశించుచున్నది.

"భగవంతుడు మీ సమస్త కర్మలను గమనించుచునే యున్నాడు" అని ఇట్టిపట్ల ఖుర్ఆన్ మాటిమాటికి అనుచున్నది. మన మేపని చేసినను భగవత్సాక్షిగ చేయవలెనని ఖుర్ఆన్ భావము. అట్లు చేసినచో మానవు డధర్మమార్గమునకు ఒరగడు.

* * *

౧౧౭. ఒకవేళ తప్పనిసరిగా భార్యాభర్తలు వేరైపోవలసి వచ్చినచో భగవంతుడు సర్వసంపోషకు డగుటచే భర్తృవిహీనలగు స్త్రీలనుకూడ పోషించునని చెప్పుచున్నది. అట్లే భర్తలకు అనుకూలపత్నులనుకూడ సమకూర్చునని ఇక్కడ భావము.

క్రైస్తవ మతములో విడువబడిన స్త్రీని వివాహమాడుట పాపముగా పరిగణింపబడుచున్నది. ఈ విషయమున బైబిల్ ఏ మనుచున్నదో చూడుడు:

"But I say unto you, that whosoever shall put away his wife, saving for the cause of fornication, causeth her to commit adultery: and whosoever shall marry her that is divorced commiteth adultery."
(*St. Matthew*, Vol. 32, Also XVI. 18)

భగవంతుడు కరుణామయుడు. అందుచేతనే భార్యాభర్తలు పరస్పరానురాగము లేక మార్జాల దాంపత్యమును నెరపుటకంటె వేరై, అనుకూల దాంపత్యమును పొందుటను ఖుర్ఆన్ అనుమతించుచున్నది.

వెనుకటి దినములలో బైబిల్ యొక్క ఈ నిషేధము అనుసరింపబడు చుండినను ఆధునిక యుగములో ఇది అన్యాయమగు నిషేధమని ఖుర్ఆన్ చూపిన మార్గమునే ప్రపంచ మనుసరించుచున్నది. ఈ విషయమున మొన్న మొన్నటివరకు ప్రాచీన సంప్రదాయముల ననుసరించిన మన దేశములోకూడ విడాకులు కావలెనని స్త్రీలు పురుషులు కూడ ఆందోళనము చేయుచున్నారు. భర్తలచే విడువబడిన స్త్రీలకొరకు అనాథ శరణాలయములు, మహిళా శరణాలయములు ప్రతి పట్టణమునను వెలసినవి. ఖుర్ఆన్ ప్రతిపాదించిన ధర్మమును ప్రపంచము క్రమక్రమముగ అనుసరించుచున్నదనుటకు ఇదొక చిన్న ఉదాహరణము.

* * *

౧౧౮. బహుదైవతారాధకులు ఒక్కొక్క విధమగు కోరికను ఒక్కొక్క విధమగు దేవతను పూజింతురు. ఆ దేవతలను వారు ఆధ్యాత్మిక లాభమునకై పూజింపరు. మన దేశములో ధనాశతో లక్ష్మీపూజను, విద్యార్జనమునకై సరస్వతీపూజను, మంత్రబలమును చేతబడి, కట్టుబడి మున్నగు దుష్టశక్తులను సంపాదించుటకై కాళీపూజను,

బలమునకై హనుమత్పూజను, విఘ్నములు కలుగకుండుటకై విఘ్నేశ్వరపూజను ఈ విధముగ ఒక్కొక్క కోరికకై ఒక్కొక్క దేవతను పూజించుచున్నారు. ఈ విధముగ దేవతలసంఖ్య అగణ్యముగ నున్నది. ఇక్కడ ఖుర్ ఆన్ ఇట్టిపద్ధతినిగూర్చి చెప్పుచు సమస్త ఐహికలాభములను సైతము ప్రసాదించువాడు భగవంతుడేననియు, సమస్తమును భగవంతునే ప్రార్థించి పొందవలెననియు చెప్పుచున్నది.

* * * *

౧౯౯. అబద్ధసాక్ష్యమును చెప్పుట మహాపాతకమని ఇక్కడ చెప్పబడుచున్నది నిజము చెప్పుటవలన తనకుగాని, తన తల్లిదండ్రులకుగాని, సన్నిహిత బంధువులకుగాని, ఎవరికైనను సరే నష్టము కలుగునన్నను నిజమే చెప్పవలెను అని ఖుర్ ఆన్ చెప్పుచున్నది.

ఈ సత్యము సర్వమతములు ఒప్పుకొన్నదే అని భావింపరాదు. ఉదాహరణమునకు క్రైస్తవమతాచార్యులు ఈ విషయమునుగూర్చి ఏమిచెప్పిరో చూడుడు:

"Liguori, in his treatise on oaths, Question 4, asks if it is allowable to use ambiguity, or equivocal words, to deceive the judge when under oath, and at No. 151 he answers: It is a certain and a common opinion amongst all divines that for a just cause it is lawful to use equivocation in the ways laid down, and to confirm it with an oath; and by a just cause we mean all that can do any good to the body or the soul."

"When a crime is well concealed, the witness, and even the criminal, may and even must swear that the crime has not been committed."*

ఇట్టివే పెక్కుదాహరణములను ఈ గ్రంథకర్త చూపినాడు. పైన పేర్కొనబడిన ఆయన గ్రంథములో 13 వ అధ్యాయమును చూడుడు.

ఈ విధముగ ఈ ధర్మము సర్వమతాంగీకారమును పొందినదికాదు. ఖుర్ ఆన్ ఈ విషయమునుగూర్చి ఎంత గట్టిగ నొక్కి చెప్పినదో చూడుడు.

* * * *

౨౦౦. "సమస్త గౌరవప్రధానమును భగవంతుని వశమందే యున్నది" అని తెలిసినవాడు గౌరవమునకై ప్రాకులాడి అధర్మప్రవర్తనుల ఇచ్చకములాడి వారిని

* Pastor Chiniquy, *Fifty years in the Church of Rome*, PP. 91—92.

సంతోషపెట్టజూడడు. 'ఐహికాముష్మికముల రెంటను శ్రేయశ్శుభములు కల్గించువాడు భగవంతుడే' నని తెలియనివాడు ఏవిధముగ ఐహిక వాంఛలను తీర్చుకొను ఉద్దేశముతో దేవతావిగ్రహములను సేవించునో, అట్లే ధనికుడును బలవంతుడును అగు ఒక వ్యక్తినిగాని, బలముకల ఒక సంఘమునుగాని ప్రాపంచిక గౌరవమును బడయుటకై సేవించుట భగవంతుని మరచుట యన్నమాట.

ఏకేశ్వరత్వమునందు విశ్వాసము కలవాడు ప్రాపంచిక లాభమునకైగాని, గౌరవమునకుగాని ఒరుల నాశ్రయించి వారికి దాసోహమని లొంగియుండడు. వానికి ఆత్మస్వాతంత్ర్యము, ఆత్మగౌరవము, ఆత్మవిశ్వాసము కలుగును. ఒక్క భగవంతుని శక్తినే నమ్మినవానికి ఒరులశక్తి ఎట్లు చలింపజేయును? ఒక్క భగవంతుని దయనే అభిలషించువాడు ఇతరుల దయాదాక్షిణ్యములకై ఏల ప్రాకులాడును? ఒక్క భగవంతుని సహాయమునే వేడువాడు ఒరులముందేల చేయి చాచును? ఒక్క భగవంతుని ముందే తన శిరస్సును వంచువాడు ఒరులముందేల సాష్టాంగపడును?

ఏకేశ్వరత్వమునందలి విశ్వాసము మన మనస్తత్వముపై ఎట్టి ప్రభావమును వేయునో దీనినిబట్టి తెలియగలదు.

* * *

౨౦౧. కొందరు కేవలము లోకమునకు చూపుటకై మతవిధులను నెరవేర్తురు. తాము మిక్కిలి ధర్మబుద్ధులని లోకు లనుకొనవలెనని వారి ఉద్దేశము. లోకమునిట్లు మోసగించుటకై మతము నవలంబించు వంచకులను ఖుర్ ఆన్ ఇక్కడ ఉద్దేశించుచున్నది.

మతము పేరు చెప్పి రాజకీయలాభమును పొందువారుకూడ ఇందు చేరుదురు.

* * *

౨౦౨. ప్రతి చిన్నవిషయమునకును నరకమును విధించువారి సూక్తమును గమనించవలెను. వివిధమత పండితులు—ఇస్లామ్‌మత పండితులు కూడ—భగవంతుని యొక తలారివానిగ చిత్రించినారు. ప్రతి చిన్న పొరపాటునకు ఏదో ఒక విధమైన నరకశిక్షను వీరు విధించినారు. ఖుర్ ఆన్ ఏమనుచున్నదో చూడుడు:

భగవంతుడు మిమ్ముల నేల శిక్షించును? అనగా చీటికి మాటికి శిక్షించుటకు భగవంతుడు క్రూరుడా? కాడు. భగవంతుడు దయామయుడు; పాపములను క్షమించువాడు; పోషకుడు.

కృతజ్ఞులై యుండి విశ్వాసవంతులై యుండు వారందరును భగవంతుని క్షమా కారుణ్యములకు పాత్రులు.

కృతజ్ఞులై యుండుట అన నేమి?

భగవంతుడు మనకు ప్రాణము నిచ్చినాడు. పాలుపోసి కంటికి రెప్పవలె కాచి పెంచు తల్లిదండ్రుల నిచ్చినాడు. సమస్త విశ్వమును మనకు ఉపయోగమునకై ఏర్పర చినాడు. భగవంతుడు మనకు ప్రసాదించిన వరములను గణింపగలమా? అట్టి భగవంతునకు కృతజ్ఞులై యుండుట మన ధర్మము కాదా? ఎవరైన మన కెప్పుడైన ఏదేని కించిదుపకార మొనర్చినంతమాత్రమున మనము వారికి యావజ్జీవము కృతజ్ఞులమై యుందుము కదా. అట్టిచో భగవంతునియెడ మన మెంత కృతజ్ఞులమై యుండవలెను?

భగవంతునియెడ మన మెట్లు కృతజ్ఞతను ప్రకటించగలము? భగవన్నామమును స్మరించియు, భగవంతుడే సర్వశక్తిమంతుడు, సర్వేశ్వరుడు, సర్వము నిచ్చువాడు అని గ్రహించి ఆ ఏకేశ్వరునే ఆరాధించుట, భగవద్ధర్మము ననుసరించుట, ఇదే భగవంతుని యెడ కృతజ్ఞతను తెలుపు విధము.

'క్షేమముగ నున్నారా?' అని ఎవరైన అడిగినప్పుడు "భగవదనుగ్రహమువల్ల సుఖముగ నున్నాము. భగవంతునకు కృతజ్ఞులము" అనియు, భోజనము చేసి "ఈశ్వరా! నీకు కృతజ్ఞతలు" అని చెప్పుటయు ముస్లిముల విధి. 'ఎవరు ఒక కబళ మన్నము తిని, ఒక గుక్కెడు నీళ్ళు త్రాగి భగవంతునకు కృతజ్ఞతలను సమర్పింతురో వారికి భగవంతు డితోధికముగ ఆహార మొసగును" అని శ్రీ ప్రవక్త వచనము. ♦

* * *

౧౭౩. ఈ సూక్తమునకును దాని తర్వాతి సూక్తమునకును భాష్యమును వ్రాసిన వారు శ్రీ ప్రవక్త యొక్క ఈ క్రింది ఉపదేశముల నుల్లేఖించిరి.

"ఒక ముస్లిమ్ మరొక ముస్లిమును శపించరాదు. ఎవరైన దౌర్జన్య మొనర్చినచో శపించుట కనుజ్ఞ కలదు. కాని ఓర్పువహించి క్షమించుట ఉత్తమము."

(ఇబ్నె అబ్బాస్)

ఒకసారి హజరత్ ఆయెషాగారి ఒక వస్తువు పోయెను. ఆమె ఆ వస్తువును దొంగిలించినవారిని తిట్టెను. శ్రీ ప్రవక్త నామె నుద్దేశించి: "అట్లు తిట్టరాదు. 'భగవంతుడా! నా వస్తువును దొంగిలించిన దొంగనుండి నా హక్కును ఇప్పించుము' అని ప్రార్థించవలెను." అని సెలవిచ్చిరి. (అబూదావూద్)

"మీ కపకారము చేసినవారిని క్షమించినయెడల భగవంతుడు మిమ్ము బహుమానించును. భగవంతుడు మిక్కిలిగ క్షమించువాడు. మానవులలో కూడ క్షమాగుణము భగవంతునకు ప్రియము." (అబూదావూద్)

♦ షావలీఉల్లాగారి 'హుజ్జతుల్లాహిల్ బాలిగా', పుట 578.'

"ఇతరుల తప్పిదములను క్షమించి, అపకారములను మరచిపోవువారికి భగవంతుడు గౌరవము నిచ్చును." (ఇబ్నెకసీర్‌లో ఉద్ధృతము)

* * *

౧౭౪. సర్వదేశములందును, సర్వకాలములందును, సకల జాతులకును భగవంతుడు మానవుల ఉపదేశమునకై ప్రవక్తలను పంపెనని ఖుర్ ఆన్ బోధించుచున్నది. ఈ ప్రవక్త లందరి యెడలను విశ్వసించుట విధి యొనర్చినది. ఎందుకనగా ఏ దేశమందైనను, ఏ కాలమందైనను, ఏజాతికైనను ప్రవక్తలు బోధించిన సత్యమొక్కటే. ఏకేశ్వరత్వము, సత్ప్రవర్తనము—ఇవి రెండును సర్వప్రవక్తలును బోధించిన సత్యము నందలి ముఖ్యమైన అంశములు. ఈ విధముగ ప్రవక్త లందరియెడలను విశ్వాసము లేనివాడు అవిశ్వాసియే నని ఖుర్ ఆన్ చెప్పుచున్నది.

* * *

౧౭౫. ఒక పద్ధతికిగాని ఆచారమునకుగాని అలవడినవారు అది తప్పని తెలిసి యుండికూడ దానిని మానలేరు. అది పరంపరాగతమైన సంప్రదాయమై వారిలో గడ్డకట్టుకొనిపోవును. సత్యము వారికి తెల్లమైనను వారు దానిని గ్రహింపరు. తమ ఆచరణమునే సమర్థించుటకు వాదములను పన్నుదురు. అట్టివారి హృదయములు ముద్రాబద్ధము లైనవని ఖుర్ ఆన్ చెప్పుచున్నది. రెండవ అధ్యాయమున కూడ ఇదే విషయమును గూర్చిన ఖుర్ ఆన్ సూక్త మిది:

"కాని ఎవరు నిశ్చలముగ ఆస్తిక్యబుద్ధిని విడనాడి తిరస్కారమును చూపిరో వారిని నీవు భయపెట్టినను భయపెట్టకపోయినను ఒకటే. వారింక విశ్వసింపరు.

వారి హృదయములును చెవులును ముద్రాబద్ధములు కావింపబడినవి. వారి కండ్లు పొరలు గ్రమ్మినవి. వారు ఘోరశిక్షకు పాత్రులగుదురు."

* * * *

౧౭౬. ౩ వ అధ్యాయమున 55 వ సూక్తమునందు కూడ ఈ విషయము సూచింపబడినది. ఏసుక్రీస్తు సిలువపై ఎక్కింపబడిన తర్వాత: "భగవంతుడా! నన్నేల విడిచిపెట్టినైచితివి?" అని దీనముగ ప్రార్థించినట్లు బైబిల్‌లో కలదు. ఆ ప్రార్థనమునకు ప్రత్యుత్తరముగ భగవంతుడాయనకు ప్రకృతిసహజమైన మరణమునే ఇత్తునని వాగ్దానమిచ్చెను. ఏసుక్రీస్తు సిలువపై మూర్ఛపోయెను. తరువాత ఆయనను సిలువపైనుండి దించివైచి ఆయన ప్రియశిష్యు నొకనికి ఆయనను ఒప్పజెప్పిరి.

ఇంతవరకు అభిప్రాయభేదము లేదు. ఏసుక్రీస్తు సిలువపై మరణించెనా లేక మూర్ఛపోయి తరువాత తేరుకొనెనా యన్న విషయమునుగూర్చి వివాదము కలదు. ఏసుక్రీస్తు కేవలము మూర్ఛపోయెనని కొందరి మతము. సిలువపై మరణించి మూడవ దినము బ్రతికి లేచెనని కొందరి మతము.

ఈ విషయమునుగూర్చి 67 వ నోటు (పుటలు 264_67) లో కొంత చర్చించితిని.

ప్రొఫెసర్ J. Warschaner గారి *The Historical Life of Jesus* అను ఉద్గ్రంథము (పుటలు 338_342) లో ఈ విషయము యుక్తియుక్తముగ చర్చింపబడినది. 341 వ పుటలో ఈవిషయమై బైబిల్‌లోగల సూచనలను గూర్చి ఈ పండితుడు ఇట్లను చున్నాడు:

"It should uot surprise us to find the Gospel narratives of what happened after the death of Jesus in a state of bewildering confusion, disjointedness and mental contradiction." *

ఖుర్ ఆన్ ఇదే విషయము నిక్కడ చెప్పుచున్నది: "ఈ విషయమున వివాద పడినవారు సందేహములలో మునిగియున్నారు."

ఈ సూక్తము నందలి చివరిభాగము "వమాఖతలూహుయఖీనా" ను నేను "వారు అతనిని చంపలేదనుట నిశ్చయము" అని అనువదించితిని. "సిలువపై చంపబడెనను విషయములో వారికి నిశ్చయజ్ఞానము లేదు." అని రాగిబ్ అనువాదము. "వారికి నిశ్చయముగ తెలియదు" అనియు కొందర నువదించిరి.

*   *   *   *

౧౨౭. యూదులు తాము ఏసుక్రీస్తును చంపితిమనియు సిలువపై చంపబడినవాడు భగవత్ప్రవక్త కాజాలడనియు డంబములు పల్కుచుండిరి. "ఉరితీయ బడినవాడు భగవంతుని శాపముచే హతుడైనవాడు" అని బైబిల్ పాతనిబంధనము (Deut 21:23) లో కలదు. ఏసుక్రీస్తుకూడ అదేవిధముగ భగవచ్ఛపితుడని యూదులు చెప్పుచుండిరి. ఖుర్ ఆన్ దానికి జవాబిచ్చుచున్నది: "ఏసుక్రీస్తు మీ రనుకొనుచున్నట్లు సిలువపై బలవన్మరణము పొందలేదు. ఆయన సహజ మరణమునే పొందెను. మీ రనుకొనుచుండినట్లు ఆయన భగవచ్ఛపితుడు కాడు. భగవంతుడాయనకు ఉన్నత స్థానమును గౌరవమును ప్రసాదించెను" అని ఖుర్ ఆన్ చెప్పుచున్నది.

* (జీసస్ మరణానంతర మేమి జరిగినదో వివరించిన సువార్తల వ్రాతలు అసంబద్ధముగను, పరస్పర విరుద్ధముగను, అవక తవకగను ఉన్నవి.)

*   *   *   *

౧౨౮. వెనుక 56 వ నోటులో 236_237 పుటలలో చూపబడినట్లు యూదుల మతగ్రంథమగు పాత నిబంధనము వడ్డీని నిషేధించినది. ఐనను యూదులు వడ్డీ వ్యాపారము చేయుజాతి యయ్యెను. వడ్డీ తీసికొని పరుల ఆస్తిని ధనమును దోచుకొనుచున్నారనియు వీరికి భగవంతుడు కఠినమగు శిక్ష విధించుననియు ఖుర్ ఆన్ చెప్పుచున్నది. క్రైస్తవులకు కూడ వడ్డీ నిషేధింపబడినను యూరప్ అమెరికా ఖండములు వడ్డీవ్యాపారమును ప్రధానవృత్తిగా గ్రహించినవి. ఈ మాటలు వారికికూడ చెల్లును.

*   *   *

౧౨౯. క్రైస్తవులు సాధారణముగ (యూనిటేరియనులు, సొసీనియనులు తప్ప) అందరును ఏసుక్రీస్తు భగవంతుడనియు, భగవంతుని కుమారుడనియు, త్రిమూర్తులలో ఒకడనియు, త్రిమూర్తులలోని పురుషత్రయములో ప్రతిపురుషుడు కూడ శాశ్వత పరబ్రహ్మమే ననియు నమ్ముచున్నారు. క్రైస్తవుల త్రిత్వముయొక్క తత్త్వము ఎంత చిత్రముగ నున్నదో చూడుడు:

"The persons are different, the substance one. Each of these divine persons is uncreate, each is eternal, each almight etc; and not three Gods or three Lords, but one Lord an l one G) l. The Father is uncreate and unbegotten; the Son uncreate, but begotten of the Father; the Holy Ghost uncreate, but proceeding from the Father and the Son. And in this Trinity of divine Persons there is none before and none after, none higher and none less, but all three co-equal." *

(పురుషులు వేర్వేరుగా ఉన్నను, తత్త్వమొక్కటే. ఈ దివ్యపురుషులలో ఏ పురుషుడును సృష్టింపబడినవాడు కాడు; ప్రతి పురుషుడును ఆదిమధ్యాంత రహితుడు; సర్వ శక్తిమంతుడు. ఐనప్పటికి ముగ్గురు దేవులుగాని ముగ్గురు ప్రభువులుగాని లేరు; ఒకే దేవుడు; ఒకే ప్రభువు. పరమపిత (Father) సృష్టింపబడినవాడు కాడు; జన్మ రహితుడు. కుమారుడు (Son) కూడ సృష్టింపబడినవాడు కాడు; కాని పరమపితకు పుట్టినవాడు; అట్లే పరిశుద్ధాత్మ సృష్టింపబడినవాడు కాడు. కాని పరమపిత నుండియు, కుమారునినుండియు వెల్వడినవాడు. ఈ పరమపురుషుల త్రిమూర్తిత్వములో ఒకడు

* Theodore Christlieb, *Modern Doubt and Christian Belief*, P. 243.

ముందు ఒకడు తరువాత ఉండినవారు కారు; ఒకరు ఎక్కువయు ఒకరు తక్కువయు కాదు; అందరూ సమానులు)

'దీనిభావమేమి తిరుమలేశ?' అన్నట్లు దీనిభావము మనకు కాదుకదా క్రైస్తవ పండితులకు సైతము చాల అవకతవకగ నున్నటులు తోచెను. ఈ తత్త్వమునందలి చమత్కారము కట్టుకథవలె తలా తోక లేకయున్నది. క్రైస్తవమతముపై ఆధునికులు గావించిన విమర్శనములకు జవాబిచ్చి క్రైస్తవ మతసిద్ధాంతములను సమర్థించుటకై వ్రాసిన Modern Doubt and Christian Belief అను తన గ్రంథములో (పుట 242) థియోడోర్ క్రైస్ట్లియబ్ గారు దీనినిగూర్చి వ్రాయుచు :

"The Athanasion Creed is evidently too stiffly arithmetical in some of its definitions and antitheses, without attempt to reconcile their obvious contradictions. Thus each divine person is said to be eternel, each uncreate etc., and yet there are not three uncreate and three Eternels, but one uncreate and one Eternel etc. To these statements the objection is obvious, that they destroy the Unity for the sake of Trinity, are the Trinity in the interests of the Unity ; nor is it quite easy with the doctrine so stated to rebut the charge alleged, not by Jews and Mohomedans only, but also by many Christians, that *Trinitarianism contradicts the fundamental article of all true religion, that there is one living and true God.*"

(స్పష్టముగ నున్న పరస్పర విరుద్ధ వచనములను సమన్వయించుటకు సైతము ప్రయత్నించని ఎథనేసియన్ సూత్రము పెక్కు నిర్వచనములలో గణితమువలె నున్నది. ఉదాహరణమునకు ప్రతి దివ్యపురుషుడును శాశ్వతుడనియు, సృష్టింప బడనివాడనియు చెప్పి, తిరిగి సృష్టింపబడనట్టియు శాశ్వతులు నైన ముగ్గురు లేరనియు, అజుడును శాశ్వతుడును అగు ఒకే ఈశ్వరు డున్నాడనియు చెప్పుట. ఇట్టి నిర్వచనలపై వచ్చు విమర్శ సులభము. త్రిత్వముకొరకై ఏకత్వమును నశింపజేయును లేక ఏకత్వమునకై త్రిత్వమును నశింపజేయును. ఈ విధముగ త్రిత్వసిద్ధాంతమును నిర్వచించిన యెడల ఈశ్వరుడొక్కడే యను సర్వ మతాంగీకారము వడసిన మూలసూత్రమునకు త్రిత్వము

విరుద్ధముగ నున్నదని యూదులు మసల్మానులే కాక పల్వురు క్రైస్తవులు తము చేయు విమర్శనను ఎదుర్కొనుట సులభముకాదు.)

ఇక్కడ కొన్ని విషయములు ఆలోచింపవలసి యున్నది. ఈ త్రిమూర్తి సిద్ధాంతము బైబిల్‌లో ప్రతిపాదింప బడినదా? కానిచో ఎవరు ఏ కాలమున ఈ సిద్ధాంతమును ప్రతిపాదించిరి?

ఈ ప్రశ్నల కుత్తరమిచ్చుటకు ముందు కొన్ని విషయములు తెలిసికొనుట అవసరము. అసలు ఏసుక్రీస్తు ధర్మబోధ చేసినకాలము చాల తక్కువ. అది ఒక ఏడని కొందరు మూడేండ్లని కొందరు చెప్పుచున్నారు. ఈ కాలములో ఏసుక్రీస్తు చుట్టు చేరిన శిష్యులు పండ్రెండుగురు. వీరిలో చదువగలిగిన వారును వ్రాయగలిగినవా రొక్కరును లేరు. క్రీస్తు చెప్పినమాటలు వారెవ్వరును వ్రాసి యుంచుకొనరైరి. ఇప్పుడు క్రొత్త నిబంధన మనబడుచున్న బైబిల్ గ్రంథములో ఏ సువార్తయు క్రీస్తు శిష్యులచే రచింప బడినది కాదు. ఇవి ఏసుక్రీస్తు మరణానంతరము 80 మొదలు 130 ఏండ్లవరకు గల కాలములో వివిధభాషలలో, వివిధప్రాంతములలో రచింపబడినవి. ఈచర్చ వెనుక ఒక నోటులో చేసియుంటిని. ఇప్పుడు క్రైస్తవమతమని ప్రచారములో నున్న మతము భగవత్ప్రవక్తయగు ఏసుక్రీస్తుగాని, ఆయన శిష్యులుగాని బోధించినది కాదని ఇప్పుడు సామాన్యముగ అందరును ఒప్పుకొనిన విషయమే. ఇప్పుడు ప్రచారములో నున్న క్రైస్తవమతము సెంట్ పాల్ అనునతడు స్థాపించినది. ఇప్పుడు చర్చివారు చిత్రించుచున్న ఏసుక్రీస్తు చరిత్ర ప్రసిద్ధుడగు ఏసుప్రవక్త కాడు. సెంట్ పాల్ సృష్టించిన ఒక పురాణపురుషుడు.* సెంట్ పాల్ బోధించిన మతము ఏసుక్రీస్తు బోధనలతో ప్రారంభముకాదు. ఏసుక్రీస్తు మరణముతో ప్రారంభమగును. పాల్ ఎన్నడును ఏసుక్రీస్తును చూచియుండలేదు. ఐనను తన అంతర్దృష్టికి గోచరమై ఏసుక్రీస్తు తనకు చెప్పిన విషయములు తాను బోధించుచున్నానని పాల్ ప్రకటించెను. ఈ విధముగ క్రైస్తవమత

* "The Christ of the Pauline Epistles, therefore, has no relation at all to the historic Jesus. We need scarcely hesitate to regard St. Paul, indeed, as the real founder of our religion."

—H. R. Mackintosh, *The Doctrine of the Person of Jesus Christ*, P, 51.

"Paul is not the second after Jesus, but the first in Christ," అన్నాడు డైస్మన్ అను ఒక గొప్ప క్రైస్తవ పండితుడు.

నిర్మాత పాల్. ఇతడు ఏసుక్రీస్తు భగవంతుడని నమ్మి ఆ సిద్ధాంతము పునాదిగా చర్చి యను ఒక మహత్సంస్థను స్థాపించెను.

క్రైస్తవ బైబిల్ గ్రంథమందలి మొదటినాల్గు సువార్తలలో ఎక్కడను ఈ త్రిత్వసిద్ధాంతము ప్రతిపాదింపబడ లేదనియు, జాన్ సువార్తయందు ఈ సిద్ధాంతమును సూచించు (I. V. 7) వాక్యము తరువాత వారు వ్రాసి అందు చొన్పిన దనియు, అసలు త్రిమూర్తులు, త్రిత్వము, పురుషుడు (Person) ఇత్యాది శబ్దములు సైతము బైబిల్‌లో లేవనియు డాక్టర్ క్రైస్టు లియబ్ అనుచున్నాడు.* క్రొత్త నిబంధన మందేకాదు; పాతనిబంధనమందు సైతము ఈ త్రిత్వ సిద్ధాంతముయొక్క జాడలేదు. రెండవ శతాబ్దములో ఏర్పడిన ఈ సిద్ధాంతమునుగూర్చి శతాబ్దముల తరబడి వాదోప వాదములు జరిగెను. నేటివరకు ఈ చర్చ తెగలేదు.

స్కెంకెల్, స్ట్రాస్, బాఉర్, రినాన్ మున్నగు సుప్రసిద్ధ ఐరోపీయ బైబిల్ పండితులెల్లరును ఏసుక్రీస్తు కేవలము మానవుడనియే క్రొత్తనిబంధన సువార్తలనుచున్నవనియు, త్రిత్వసిద్ధాంతము మిక్కిలి అసంబద్ధముగ నున్నదనియు, అది ఆనాటి విగ్రహారాధక మతముల ప్రోద్బలముచే నిర్మింపబడిన సిద్ధాంతమనియు అభిప్రాయపడిరి. † మతప్రవక్తలు, మహాపురుషులు వారి మరణానంతరము అవతార పురుషులుగను, దేవులుగను భావింపబడుట అన్ని దేశములందును, అన్ని కాలములందును కలదు. మన దేశమున శ్రీరామ, శ్రీకృష్ణ, బుద్ధాది మహాత్ములెల్లరును అవతార పురుషులుగ భావింపబడుచుండుట సుప్రసిద్ధమే. వారు తమ జీవితకాలములో తామవతార పురుషులమనియు, దేవులమనియు చెప్పుకొనినట్లు రామాయణ భారతాది మూలగ్రంథములలో

* But now to come to the doctrine itself, and its basis in Holy Scripture. You are all aware that no such sentence as God is a triuine God is to be found in the Bible. The well-known text. (I John, V. 7.) 'There are three that bear record in heaven, the Father, the Word and the Holy Ghost, and these three are one,' is now *universal recognised as an interpolation.* The terms trinity, triunity, threefold personality, and even the word person itself, are not derived immediately from scripture."
—T. Christlieb, *Modern Doubt and Christian Belief*, P. 243.

† Schenkel : "Sketch of character of Jesus."
Strauss : "Life of Christ."
Renan : "Life of Christ."

లేకపోయినను తరువాతివారు పెక్కు కథలనల్లి ఆయా గ్రంథములందు చేర్చి, లేనిపోని మాహాత్మ్యములను కల్పించి ఆ మహాత్ముల చరిత్రములు మనకు సరిగా గోచరింపకుండ సైతము చేసిరి. ఇష్టమువచ్చినట్లు పురాణములను కథలను అల్లి మహర్షులు వాటిని చెప్పినట్లుగా అబద్ధములు చెప్పుట మన దేశములో పరిపాటి ఐపోయినది. ఇది అందరకును తెలిసినవిషయమే. క్రైస్తవ మతములోకూడ నంతే. ఎవరో గ్రంథములను రచించి ఏసుక్రీస్తు శిష్యుల పేరుంచుటయో లేక తాము స్వయముగ ఆ విషయములను భగవత్ప్రేరణముచే వ్రాసితిమని చెప్పుకొనుటయో కలదు. ఈ విధముగనే బహుదైవతారాధనము వ్యాపించినది.

ఇందొక్క విషయము గమనించవలసి యున్నది. బహుదైవతారాధకులలో ఎవరును భగవంతులు అనేకులు అని చెప్పరు. భగవంతుడొకడనియే అందురు. అట్లు చెప్పుచునే అనేక దేవతలను పూజింతురు. దీనికి కారణము కలదు. బహుదైవత్వము సత్యమునకు దూరము. అది మానవబుద్ధికి వ్యతిరేకము. ఆస్తికతయే నిజమైనయెడల ఏకేశ్వరత్వ మొక్కటే ఆలంబనీయము. బైబిల్‌నందు సైతము ఆధారములేని ఈ త్రిత్వ సిద్ధాంతములను క్రైస్తవు లెట్లు నమ్ముచున్నారో అర్థముకాదు. సత్యముకంటె మూఢవిశ్వాసములే ఆకర్షణీయముగ నుండుట మన యోచనాజ్ఞానముల లోపము. ఇప్పుడు మతమును వ్యాజిక్కుగా భావించుకాలము పోయినది. మతము మానవుని హృదయమునేకాక బుద్ధినికూడ సంతృప్తి పరచవలెను. మూఢవిశ్వాసములను బుద్ధి అంగీకరింపదు. ఆధునిక భౌతిక మానసిక శాస్త్రముల దాడికి ఆగవలెనన్నచో మతము మానవుని బుద్ధినికూడ సంతృప్తి పరచవలెను. లేనిచో మతమునకు మానవసంఘమున తావుండజాలదు.

బుద్ధికిని హృదయమునకును సమాన సంతృప్తి గలిగించు మతమే నిజమైన మతమని ఖుర్ ఆన్ బోధించుచున్నది. ఏకేశ్వరత్వము పునాదిగా ఉండినప్పుడే సత్యమగు మతమేర్పడును.

*   *   *

౧౩౦. ఏసుక్రీస్తు సైతము భగవంతుని ప్రార్థించెను, దీనముగ భగవంతుని వేడుకొనెను కదా, అట్టిచో ఏసుక్రీస్తు భగవంతుడెట్లగును? అని ఖుర్ ఆన్ ప్రశ్నించుచున్నది. అదేవిధముగ దేవతలు సైతము భగవంతుని ప్రార్థింతురుకదా. మరి మీరు వారినేల పూజించుచున్నారని ఖుర్ ఆన్ ప్రశ్నించుచున్నది.

ఏసుక్రీస్తు భగవంతుని దీనముగ ప్రార్థించిన పెక్కు సందర్భములు బైబిల్ లో వర్ణితమైనవి. ఈ క్రిందివి కొన్ని ఉదాహరణములు మాత్రము :—

"And he went a little farther, and fell on his face, and prayed, saying, O my Father, if it be possible, let this cup pass from me : nevertheless not as I will, but as thou wilt.

"And he cometh unto the disciples, and findeth them asleep, and saith unto Peter, What, could ye not watch with me one hour ?

"*Watch and pray*, that ye enter not into temptation : *the spirit indeed is willing, but the flesh is weak.*

"He went away again the second time, and prayed, saying, O my Father, if this cup may not pass away from me, except I drink it, *thy will be done.*

"And he came and found them asleep again : for their eyes were heavy.

"And he left them, and went away again, *and prayed the third time*, saying the same words. †

—Matthew, XXVI, 39-44.

"And saith unto them, My soul is exceeding sorrowful unto death : tarry ye here, and watch.

"And he went forward a little, and *fell on the ground*, *and prayed* that, if it were possible, the hour might pass from him." —Mark, XIV. 34, 35.

† మత్తయి సువార్త, 26 వ అధ్యాయము 39 మొదలు 44 వ సూక్తము వరకు.

మ్యాథ్యూలోవలె ఇక్కడకూడ ఏసుక్రీస్తు సాష్టాంగపడి మూడుసార్లు భగవంతుని ప్రార్థించినట్లు కలదు. అదేవిధముగ జాన్ సువార్తలో (V. 30; VI. 38) ను కలదు. లూక్ సువార్తలో ఈ ఘట్టము ఈ విధముగ వర్ణింపబడినది.

"And being in an agony he prayed more earnestly : and his sweat was as it were great drops of blood falling down to the ground."

—Luke, XXII, 44.

ఏసుక్రీస్తు సిలువపై ఎక్కింపబడిన తర్వాత భగవంతుని ప్రార్థించిన విధమును మ్యాథ్యూయును మార్కుయు ఈ విధముగ వర్ణించుచున్నారు :

"And about the ninth hour Jesus cried with a loud voice, saing, Eli, Eli, lama sabachthani ? that is to say, My God, My God, why hast thou forsaken me ? " —Matthew, XXVII, 46. Also Luke, XV. 34.

ఈ విధముగ ఏసుక్రీస్తు స్వయముగ భగవంతుని ప్రార్థించినటులును, దీనముగ వేడికొనినట్లును ఎన్నో ఘట్టములు బైబిల్ నుండి చూపించవచ్చును. ఈ విధముగ ఏసుక్రీస్తు మానవమాత్రుడేనని స్పష్టపడలేదా? ఐనను భగవంతుని విడిచి భగవద్భక్తుడగు ఏసుక్రీస్తును భగవంతుని స్థానమున నుంచి పూజించుట అకార్యమని ఖుర్ ఆన్ చెప్పుచున్నది.

بسم الله الرحمن الرحيم

వ్యా ఖ్యా న ము

ఐదవ అధ్యాయము

అల్ మాయిద

ఉపక్రమణిక :

అల్ మాయిద అనగా ఆహార మమర్చబడిన మేజాబల్ల; ఫలితార్థము 'ఆహారము' ఈ అధ్యాయము 112 వ సూక్తములో ఈ ప్రవక్త శిష్యులు ఆకాశమునుండి ఆహారము దిగునట్లు చేయుమని కోరిరి. ఆ వృంత్తాంత మాధారముగా ఈ అధ్యాయమున కీపేరు వచ్చినది.

ఇందులోని మూడవసూక్తము ఖుర్ ఆన్ లో ప్రోక్తమైన తుది సూక్తము. ప్రవక్త తుది కాబాయాత్ర సందర్భమున ప్రోక్తమైనదీ సూక్తము. అప్పటికి అరేబియా ద్వీపకల్పమంతయు ఇస్లామ్‌ను స్వీకరించెను. ప్రవక్త వచ్చినకార్యము సఫలమయ్యెను. అరఫాత్ మైదానములో వేలకొలది ముస్లిముల సమావేశములో ప్రవక్త ఈ సూక్తమును చదివి వినిపించిరి.

ఈ అధ్యాయము హిజిరీ ఐదవ సంవత్సరము మొదలు పదవ సంవత్సరము వరకు గల మధ్యకాలములో అవతరించినది.

*   *   *

౧౩౧. "ఉఖూద్" అను ఇక్కడి మూలమునకు 'ఒడంబడికలు, సంధిపత్రములు, వాగ్దానములు, పరిష్కారములు'—ఈ విధముగ రెండ పక్షములుగాని, ఇద్దరు వ్యక్తులుగాని చేసికొను ఒడంబడికలని అర్థము.

*   *   *   *

౧౩౨. తనంతటతాను చచ్చినజంతువు అభక్ష్యము. ఆర్ష ధర్మములో అట్టిజంతువు భక్ష్యమే. "యే భక్ష్యా ఉక్తాస్తేన కేవలం స్వయంమృతా అన్యహతా వా భక్ష్యాః" అని గౌతమ ధర్మసూత్ర వ్యాఖ్యాయగు మితాక్షరలో హరదత్తాచార్యుడు.

ఆర్ష ధర్మమునందును పంది మిక్కిలి అపరిశుద్ధమైన జంతువుగ పరిగణింపబడు చున్నది. పంది వాసనచూచుటచేత సమస్తపదార్థము లపరిశుద్ధమగునని మనువు

(III. 241). మనువు మరొకచోట పందిమాంసము తినుటవలన బ్రాహ్మణుడు పతితుడగు ననుచున్నాడు. (V. I9)

ఈ సూత్రములో ఖుర్ ఆన్ అడవిమృగముచే చీల్చి చంపబడినజంతువు అభక్ష్యమనుచున్నది. ఆర్ష ధర్మకారు లట్టిమాంసమును భక్ష్యమనిరి. గౌతమ ధర్మసూత్రముల లోని ఈ క్రిందిసూత్రమును చూడుడు :

"వాళహతాదృష్ట తోషవాక్రవశస్తా నభ్యుక్షోపయుం జీతోపయుంజీత."

(సింహాది మృగములచే చంపబడిన మృగములు భోజ్యములేయని పెద్దలు చెప్పిరి. ఇత్యాది.)

*   *   *

౧౩౩. ఇది ప్రవక్తకు ప్రోక్తమైన చివరిసూక్తము. ఇది ప్రోక్తమైన 82 వ దినమునాటికి శ్రీ మొహమ్మద్ ప్రవక్త దివంగతులైరని చారిత్రకులు.

'ఇస్లామ్' శబ్దమున కర్థము వెనుక పెక్కుచోట్ల వివరింపబడినది.

*   *   *

౧౩౪. ఇది ఆపద్ధర్మము. ఆర్ష ధర్మమునను సర్వ ధర్మములందును ఆపద్ధర్మము లుపదేశింపబడినవి.

వామదేవమహర్షి ఆకలికాగలేక కుక్కమాంసమును తినియు, అట్లే విశ్వామిత్రుడు మాలవానికడ కుక్కమాంసమును తినియు ఆపద్ధర్మమగుటంజేసి పతితులు కారైరని మనువు. (X. 106—109)

*   *   *   *

౧౩౫. మనుధర్మ శాస్త్రకారుడుకూడ వేటజంతువులు తెచ్చిఇచ్చిన జంతువులు భోజ్యములే యనుచున్నాడు. చూడుడు :

"శ్వభిర్హతస్య యన్మాంసం శుచితన్మను రబ్రవీత్
క్రవ్యాద్భిశ్చ హతస్యాన్యైశ్చండాలా ద్యైశ్చదస్యుభిః" (V. 131)

(వేటాడు కుక్కలచే చంపబడిన మృగములమాంసము పరిశుద్ధమని మనువు చెప్పెను. పచ్చిమాంసము తిను పెద్దపులి మున్నగు జంతువులచేత చంపబడిన మృగమాంసము.........పరిశుద్ధమని మనువు చెప్పెను.)

*   *   *

౧౩౬. "భగవద్దత్తమగు జ్ఞానగ్రంథములు పొందినవారు" అనుటకు ఇస్లామ్ పరిభాషలో 'అహలె కితాబ్' అందురు. క్రైస్తవులకును యూదులకును ఈ పరిభాషా పదము వర్తించునని ప్రాచీన భాష్యకర్త లందరియొక్క అభిప్రాయము. కాని సమస్త దేశములకును, సమస్త జాతులకును ప్రవక్తలు పంపబడిరను ఖుర్ ఆన్ సిద్ధాంతము

ననుసరించి ఏ నాగరిక జాతితోను ఇస్లామ్ మతానుయాయులకు పంక్తి నిషేధము లేదని చెప్పవచ్చును. కాని దీనికి రెండు షరతులు: మొదటిది, ఈశ్వరేతరుల కా యన్నము నివేదింప బడనిదై యుండవలెను; రెండవది, తన్ను అపాంక్తేయునిగ భావించక తనతో తనఇంట తిన్నవాని యన్నమే తినవచ్చును. తన్ను అపాంక్తేయు డనుకొని, తన అన్నము తిననివాని యన్నము ముసల్మానులు తినరాదని ఖుర్ ఆన్ శాసించుచున్నది.

*   *   *

౧౩౭. మట్టితో పరిశుభ్రపరచుకొనుట ఆర్యధర్మ సమ్మతముకూడ. ఆర్షధర్మ గ్రంథములలో నీటితోపాటు మట్టికూడ పరిశుద్ధికై అనేకచోట్ల చెప్పబడినది.

*   *   *   *

౧౩౮. ఖుర్ ఆన్ ఉపదేశించిన నీతి ఎంత ఉన్నతమైనదో చూపుట కిదొక ఉదాహరణము. ఒక జాతితో మనకు విరోధమున్నను ఆ జాతియెడ న్యాయముతోడనే ప్రవర్తింపవలెనుకాని, ఆ విరోధమును పురస్కరించుకొని అన్యాయమునకు దిగరాదని ఖుర్ ఆన్ చెప్పుచున్నది. విరోధియైనను న్యాయపక్షమున నున్నచో నిష్పక్షపాతమైన సాక్ష్యము నివ్వవలసినదని ఖుర్ ఆన్ ఉపదేశించుచున్నది.

*   *   *   *

౧౩౯. యూదులు తమకివ్వబడిన ధర్మగ్రంథమును మార్చివైచి దుర్మార్గులై ప్రవర్తించుచుండిరి. వారిని క్షమించుమని ఖుర్ ఆన్ ప్రవక్త కుపదేశించుచున్నది. ఇట్టి క్షమాపాఠము ప్రపంచములో ఏ మతధర్మమును ఇవ్వలేదని నిస్సందేహముగ చెప్పవచ్చును. ఆర్యధర్మము ననుసరించనట్టియు, ఆర్యధర్మమును నిరాకరించినట్టియు, ఆర్య జాతికి చెందనట్టియు నగువారిని ఆర్యధర్మకారులు ఏఏ విధముగ బాహ్యుల నొనర్చిరో సర్వవిదితము:

"పాషండినో వికర్మస్థాన్ బైడాలవ్రతికాన్ శఠాన్
హైతుకాన్ బకవృత్తీంశ్చ వాఙ్మాత్రేణాపి నార్చయేత్"

అను మనుస్మృతి శ్లోకమును వ్యాఖ్యానించుచు కలూక భట్టాచార్యు డిట్లు వ్రాయుచున్నాడు:

"పాషండిన ఇతి. పాషండినో వేదబాహ్యవ్రత లింగధారిణః శాక్యభిక్షుకక్షపణకాదయః వికర్మస్థాః ప్రతిషిద్ధజీవినః బైడాలవ్రతికాన్ బకవృత్తీ వక్ష్యమాణలక్షణే, శఠా వేదేష్వ శ్రద్ధధానాః హైతుకా వేదవిరోధ తర్కవ్యవహారిణః ఏతానతిథి కాలోపస్థితాన్ వాఙ్మాత్రేణాపి నపూజయేత్"

(అతిథికాలమున వచ్చినను వేదబాహ్యవ్రత లింగధారులను, శాక్యభిక్షుక గాణక్యాదులను, శాస్త్ర విరుద్ధక్రియల నొనర్చువారిని, పిల్లి కొంగల వేషముల దాల్చిన

వారిని, వేదముల నమ్మనివారిని, వేదవిరుద్ధ తర్కవాదము చేయువారిని, అతిథేయ సత్కారము చేయకపోవుట యటుండ పెచ్చరింపను రాదు.)

*   *   *   *

౧౪౦. ఇస్లామ్ ప్రతిపాదించిన ధర్మమునకు మూలసూత్రములు రెండు: అగోచరుడును, జన్మరహితుడును, సర్వసాక్షియు, సర్వశక్తిమంతుడును, సర్వ స్తుతిపాత్రుడును, ఏకైకుడును, అవిభాజ్యుడును అగు ఏకేశ్వరునియందు విశ్వసించుట; సజ్జనులై యుండి సత్కార్యము లాచరించుట. తక్కిన ఆచార వ్యవహారములు, వేషభాషలు ముఖ్యమైనవి కావు. అవి దేశకాల పాత్రానుసారముగ, శీతోష్ణాది పరిస్థితుల ననుసరించి యుండును.

ఒక్క విషయము మాత్రము ఈ సందర్భములో గమనించవలెను. ఇస్లామ్ కొన్ని ఆచారములు ఏకేశ్వరత్వమను పునాదులపై నిర్మింపబడినవి. అందుచే ఏ ఆచారమైనను ఏకేశ్వరత్వమునకు వ్యతిరేకము కానిదై యుండిన చాలును. ప్రతి దేశములోను ముస్లిములు ఆయా దేశముల ఆచార వ్యవహారముల ననుసరించియు, నైసర్గిక పరిస్థితుల ననుసరించియు కొన్ని ఆచార వ్యవహారములను మర్యాదలను అలవరచుకొనిరి. ఉదాహరణమునకు ఈజిప్టుదేశపు ముస్లిముల వేషభాషలకును మనదేశపు ముస్లిముల వేషభాషలకును ఎంతో భేదముకలదు. ఐనను ఆధ్యాత్మికముగను, సాంఘికముగను ఏజాతికి చెందిన ముస్లిములైనను అందరకును సామాన్యమగు సంస్కృతి కలదనుట నిర్వివాదము. ఆ సంస్కృతి ఖుర్ ఆన్ లో విధింపబడి నిర్వచింపబడిన మూలధర్మము ననుసరించి యున్నది.

*   *   *

౧౪౧. బైబిల్ లో జెనిసిస్ 4 : 3_12 లో ఈ ఉపాఖ్యానము వివరింపబడినది. ఖుర్ ఆన్ లో ఈ ఉపాఖ్యానము లన్నియు దృష్టాంతరములుగ చెప్పబడినవి. ఇందులో ఇద్దరు ఆదమ్ కుమారుల ఉపాఖ్యానము కలదు. వీరిలో ఒకడు దుష్టుడు. మరొకడు సజ్జనుడు. ఒకడు వధించుట కుద్యమించెను. మరొకడు తాను ముందు చెయ్యెత్తుటకు నిరాకరించెను. కాని ధర్మపరుడు దుర్జనుని దౌర్జన్యమునకు బలియయ్యెను. అందుచేతనే సంఘము, దానిపాలన, కట్టుబాట్లు, శిక్షలు విధింపబడవలసిన అవసరము వచ్చెను. శిక్షయొక్క ఉద్దేశము ధర్మపరుల రక్షయు, అధర్మపరులను భయపెట్టుటయు, ఈ విషయములే ఖండమున సూచింపబడినవి. హత్య కావించినవానికి శిక్ష విధించుచు ఆజ్ఞాపించుటకు ఆదమ్ కుమారులకథ ఇందుచేతనే చెప్పబడినది. మానవుడు ఎట్టి సంఘనిర్మాణమును

లేక పరిపాలనా విధానము లేక యుండినప్పుడు, బలవంతుడు బలహీనుని దుర్జనుడు సజ్జనుని ఈ విధముగ ఒకరినొకరు చంపుకొనుట పరిపాటియై యుండెను. తర్వాత సంఘ మేర్పడెను. దానితోపాటు సమస్తమైన కట్టుబాటులు వచ్చెను. ఈ ఖండములో సంఘ నిర్మాణ తత్త్వమును, ధర్మముయొక్క అవసరమును ఖుర్ ఆన్ సూచించుచున్నది.

* * *

౧౪౨. ఇక్కడ "దేశమునుండి వెళ్ళగొట్టవలెను" "యున్ఫౌ మినల్ అర్దా" అన్న మూలమునకు అనువాదము. "భూమినుండి వెళ్లగొట్టవలెను" అని దీని ప్రతిపదార్థము. "కారాగారములో పెట్టవలెను" అని దీని యర్థమని అబూహనీఫా, రాజీ, లిసానుల్ అరబ్ కారుడు వ్రాసిరి.

* * *

౧౪౩. ఖుర్ ఆన్ కొన్ని నేరములకు కఠినమగుశిక్ష విధించుచున్నది. ఆధునిక క్రిమినల్ కోడ్డులో శిక్షలింత కఠినముగ లేవు. అందుచే ఆధునికులకిది విడ్డూరముగ కన్పించవచ్చును. శిక్షలత్యంత కఠినముగ ఉండుటబట్టియే ఆయా దేశములలో నేరములు చాల తక్కువగ నున్నవి. ఉదాహరణమునకు అరేబియాలో దొంగతనము, వ్యభిచారము మిక్కిలి తక్కువయని ఆదేశములు చూచివచ్చినవా రందరును వ్రాసిరి. మక్కాలో ప్రార్థనకై పిలుపు వినిపించిన వెంటనే వర్తకులు ఎవరిదుకాణములు వారట్లే విడిచి ప్రార్థనమునకు వెళ్ళిపోవుట సామాన్యదృశ్యము. లక్షలాది యాత్రికులు దేశదేశముల నుండి యాత్రార్థమై మక్కాకు పోవుదురు. వీరందరి సామానులు పెట్టుకొనుటకు అక్కడ అన్నిఇండ్లు తాళము వేసికొనుటకు వీలుండదుకదా? పాకలలోను, గుడారములలోను ఎక్కడిసామానులు అక్కడ విడిచిపెట్టి అందరును యాత్రావిధులను నెరవేర్చుకొనుటకు పోదురు. ఐనను దొంగతనములు జరుగవు. దీనికి కారణము అక్కడ ఖుర్ ఆన్ లో విధింపబడిన శిక్షాస్మృతి ఆచరణలో నుండుటయే.

పూర్వకాలపు సమస్త ధర్మశాస్త్రములందును ఇట్టిశిక్షలే విధింపబడినవి. దొంగతనమునకు మనువు విధించిన శిక్షను గమనింపుడు :

యేనయేన యథాంగేన స్తేనో నృషు విచేష్టతే
తత్తదేవ హరేత్తస్య ప్రత్యాదేశాయ పార్థివః (మనుస్మృతి VIII. 334)

(చేతులు కాళ్లు మున్నగు నేయే యంగములతో నే ప్రకారము దొంగ ధనాపహరణాదులను చేయునో, వానికి నిక అటుల చేయకుండుటకై ధనస్వామ్యుత్కర్షాపకర్షములనుబట్టి యా యంగమును నరికింపవలెను.)

"ధాన్యం దశభ్యః కుంభేభ్యోహరతోఽభ్యధికం వధః
శేషేఽప్యేకాదశ గుణం దాప్యస్తస్య చతద్ధనమ్" (మనుస్మృతి VIII 320)

(పది కుంభములకంటె ఎక్కువధాన్యము దొంగిలించినవానికి వధయే దండము. దొంగిలించువాని యొక్కయు సొంతగాని యొక్కయు గుణముల తారతమ్యములనుబట్టి దెబ్బలుకొట్టుట, అంగములు నరకుట, చంపుట చేయనగును. ఇత్యాది)

"పంచాశతస్త్వభ్యధికే హస్తచ్ఛేదన మిష్యతే"
"రత్నానాం హరణే వధ మర్హతి"
"నిరోధేన బంధేన వివిధేన వధేన చ"

అని హస్తచ్ఛేదనము, రత్నాదులు దొంగిలించినప్పుడు వధము, చెఱలో ఉంచుట, సంకెలలు వేయుట, కాలుసేతులు నరికించుట, మరణశిక్ష మున్నగునవి శిక్షలుగా మనువు విధించుచున్నాడు. ఇట్లే ఇతర ఆర్షధర్మశాస్త్రములు.

* * *

౧౪౪. ఒక్క భగవంతునికే భయపడినవాడు ప్రపంచములో మరెవ్వరికిని భయపడడు. ఈశ్వరేతరులకు భయపడనివానికే నైతికధైర్య ముండును. అతడు సమస్త పాపములనుండియు ముక్తుడగును. ఉదాహరణమున కట్టివాడు అబద్ధము చెప్పడు. అబద్ధము భయమునుండియేకదా ఉత్పన్నమగును. ధైర్యస్థైర్యములు, నైతికధైర్యము, పవిత్రత, నిర్భయత్వము, ఈశ్వరభయమువల్ల కలుగును. బహుదైవతారాధనము భగవద్భీతి లేకపోవుటవల్లనే కలిగినది. మానవుడు తనకు ఏకొద్దినష్టము కల్గించగల దానికైనను భయపడి, అట్టినష్టము కల్గించవలదని దానిని పూజింపసాగినాడు. ప్రతినష్టమును, ప్రతి చెడుగును ప్రేరేపించువారు కొందరుకలరని యూహించి వారిని పూజింప సాగినాడు. ఋగ్వేదమందలి ఒక ఇంద్రస్తుతిని చూడుడు :

"మానోవధీరింద్ర మాపరాదా మానః ప్రియా భోజనాని ప్రమోషీః
ఆణ్డామానో మఘవఞ్ఛక్ర నిర్భేన్మానః పాత్రా భేత్సహజానుషాణి"

(ఋగ్వే. మం. ౧ అను. ౧౫ సూ. ౧౦౪ : ౮)

(ఇంద్రా! మమ్ము హింసింపకుము. విడిచిపెట్టకుము. మాకిష్టమైన భోగములను అపహరించకుము. ధనముగల ఇంద్రా! మా గర్భమందున్న సంతానమును చెరపకుము. మాతోకూడ పుట్టిన యజ్ఞపాత్రలను బోగొట్టకుము.)

మనదేశములో పెక్కు రోగములను సైతము మారెమ్మ మున్నగు పేర్లిచ్చి పూజించుట కలదు. మశూచికము వచ్చిన అమ్మవారు వచ్చినదని పూజింతురు. ఏకైక భగవద్భీతి లేకపోవుటవల్లనే తుచ్ఛదేవతలు, మూఢాచారములు, మూఢభావములు,

మన దేశములో ఇంతగా పెచ్చు పెరిగినవి. అందుచేతనే ఖుర్ ఆన్ మాటిమాటికి ఏకైక భగవద్భీతి నలవరచుకొనుడని ప్రబోధించుచున్నది.

* * * *

౧౮౫. వారి పండితులు, గురువులు వారిని అసత్యములను పలుకకుండగను, అన్యాయార్జితమగు విత్తమును తినకుండగను ఏల చేయరు?" అని ఖుర్ ఆన్ యూదులను క్రైస్తవులను, ఇతరమతస్థులను సంబోధించుచున్నది. ఒక్క ఉదాహరణము చూడుడు: యూదమతము, క్రైస్తవమతము, ఆర్షమతము - అన్నియు ఏకగ్రీవముగ వడ్డీని నిషేధించుచున్నవి. ఇప్పుడు యూదులకును, క్రైస్తవులకును, మన దేశమునను వడ్డీ సమస్త ఆర్థికనిర్మాణమునకు పునాది యై పోయినది. ఇల్లుకట్టిన ఎంతవడ్డీ కిట్టును? అనియే లెక్క వేసికొనుచున్నారు. క్రైస్తవ మిషనరీలు, ఆర్యసమాజ మిషనరీలు, రామకృష్ణ మతాది సమస్త సంస్థలు, గురువులు వడ్డీ తీసికొనవలదని ఏల నిషేధింపరు? 'విష్టావార్ధుషికస్యాన్నం' అని ధర్మశాస్త్రములు ఘోషించుచున్నను మన గురువులందరును ధనికులగు మార్వాడీలు, ఇతర వర్తకప్రముఖులకడనే పూజ లందుచున్నారు. మిషనరీలకు వచ్చు డబ్బంతయు వడ్డీడబ్బే కదా! ఖుర్ ఆన్ ఇదే విషయమును అడుగుచున్నది. వడ్డీ తీసికొనుట తప్పనికూడ గత నూరేండ్లలో ఒక మత సంస్కర్త గాని, ఒక సంఘ సంస్కర్త గాని, వందలాది మతగురువులలో ఒకడుగాని బోధించినట్లు నాకు తెలియదు.

* * *

౧౮౬. యూదులు తౌరాతును, క్రైస్తవులు తమ ధర్మగ్రంథమగు ఇన్జీలును అనుసరించినను వారి కది శ్రేయస్కరముగ నుండెడిదని ఖుర్ ఆన్ బోధించుచున్నది. ఖుర్ ఆన్ దృష్టి ఎంత విశాలమైనదో చూడుడు. ఎవరి ధర్మగ్రంథమును వారు అనుసరించినను చాలు ననుచున్నది. ఖుర్ ఆన్ నే, అరబీభాషయందే, మొహమ్మద్ ప్రవక్త నే ఏల అనుసరించుటలేదని అడుగుటలేదు. కారణ మేమనగా సత్యము సనాతనము. మొదటి మానవుడగు ఆదమ్‌నుండి శ్రీ మొహమ్మద్ ప్రవక్తవరకుగల సమస్త ప్రవక్తలద్వారా భగవంతుడు మానవుని మార్గదర్శిత్వమునకై బోధించిన ధర్మ మొక్కటే. అది ఏకేశ్వరుని యందు విశ్వాసము, సత్కార్యాచరణము. సనాతనమగు ఆ ధర్మము లుప్తమై ప్రక్షిప్తమై, కొందరి దుర్మార్గమువల్లను, ఆత్మలాభపరాయణత్వమువల్లను మార్చబడి భ్రంశమగుటచే ఖుర్ ఆన్ ఆ ధర్మము నుద్ధరించెను, శ్రీ మొహమ్మద్ ప్రవక్త ధర్మోద్ధారకులు; ఇస్లామ్‌ధర్మముయొక్క క్రోడీకరణము.

* * * *

౧౮౭. ఏసుక్రీస్తు చెప్పినమాటలు ఇప్పటిబైబిల్‌లో సైత మిట్లున్నవి:

"ఓ ఇస్రాయీలీయులారా! అన్నిటికంటె మొదటియాజ్ఞను వినుడు. మన దేవుడైన ప్రభువు ఒక్కడే ప్రభువు." (మార్కు 12 : 2, 9)

"మీ దేవుడైన ప్రభువునే మీ రారాధింతురుగాక! ఆ ప్రభువునే మీరు కొలుతురుగాక! (మత్తయి 4 : 10)

"నన్నేల ఉత్తముడని పిలుతురు? ఒకడుతక్క మరెవ్వరును ఉత్తములు లేరు. అతడే భగవంతుడు." (మత్తయి 19 : 16, 17)

"నేను స్వయముగ నేమియు చేయను." (జాన్. 8 : 28)

"భూమిలో ఎవరిని మీ తండ్రియని పిలువకుడు ఎందుకన మీతండ్రి యొక్కడే. అతడు స్వర్గములో నున్నాడు." (మత్తయి. 2 : 39)

"ఈశ్వరా! ఈశ్వరా! నన్నేల విడిచిపెట్టితివి?" (మత్తయి. 27 : 46)

అని ఏసుక్రీస్తు సిలువపై తన్ను ఎక్కించినప్పుడు భగవంతుని ప్రార్థించెను. మరి క్రైస్తవులు చెప్పుచున్నట్లు ఏసుక్రీస్తే ప్రభువెట్లగును?

* * *

౧౮౮. భగవంతుడు త్రిమూర్త్యాత్మకుడనియు, ఏసుక్రీస్తు త్రిమూర్తులలో ఒకడనియు క్రైస్తవుల నమ్మకము. ఈ నమ్మకమును ప్రవర్తింపజేసినవాడు సెంట్ పాల్. దీనినిగూర్చి మూడవ అధ్యాయమునకు వ్రాసిన వ్యాఖ్యానభాగమును (పుటలు 267_272) చూడుడు.

* * *

౧౮౯. ఇస్లామ్‌యొక్క పరమత సహనమును చూడుడు: ఇతరులలో ఉన్న మంచిని గుర్తించుటలో ఇస్లామ్ వెనుదీయలేదు. ప్రపంచములో ఏ మతగ్రంథమును తనకు కేవలము విరుద్ధమైన మరొక మతమునుగూర్చి చెప్పియుండలేదని నా అభిప్రాయము. మతవిషయములో ఏ చిన్నవిషయమున అభిప్రాయభేదమున్నను వారిని మన దేశములో సంఘమునుండి సంపూర్తిగ బహిష్కరించుట పరిపాటి. పంక్తినిషేధము, వివాహనిషేధము అటుంచి ఒకరిభాష యొకరు మాట్లాడుకొనుట (ఉదా. నవదేద్యాయనీం భాషాం ప్రాణైః కంఠగతైరపి.) చివరకు ఒకరిముఖము నొకరు చూచుకొనుటకూడ నిషేధించిరి. ఒకరితో కూర్చొని ఇంకొకరు భోజనము చేయకపోవుట అటుండగా ఒకరు భోజనము చేయుచుండగా ఇంకొకరు చూచినచో మైలపడు నందురు. శైవ వైష్ణవులలోనే కాక ఒక్క వైష్ణవులలోనే వివిధశాఖలలో ఒకరికొక రిట్టి పట్టింపులు కలవు. ఇవి ఉదాహరణార్థము మాత్రము చూపితిని. పరమతసహనము ఇస్లామును లేదను ఒక

ప్రతీతి మన దేశములో వ్యాప్తమైయున్నది. ఈ అభిప్రాయము కొన్ని చారిత్రక అపోహలవల్ల కలిగినది. ఇస్లామ్‌మతమే పరమత సహనమునకు పునాది వేసినదందురు. క్రైస్తవ మతములో చూడుడు. మొన్న మొన్నటివరకు ఇంగ్లాండులో రోమన్ క్యాథలిక్కులకును యూదులకును ఎట్టి ప్రభుత్వోద్యోగ మివ్వరాదను నిషేధముండెను. యూరప్ ఖండ చరిత్ర చదివినవారెల్లరకును ఈ విషయములు తెలిసినవే. ముస్లిమ్ చక్రవర్తులును, రాజులును ప్రతి దేశమునందును యూదులకు, క్రైస్తవులకు, హిందువులకు గొప్పగొప్ప ప్రభుత్వోద్యోగము లిచ్చిరనుట చరిత్రప్రసిద్ధము. ముస్లిమేతరులు మంత్రులుగను, అంతరంగిక కార్యదర్శులుగను, సేనానాయకులుగను సైతముండిరి. మన దేశములో మొగలు చక్రవర్తుల కడనేకాక లోడీరాజుల సర్వసైన్యాధ్యక్షుడు హిందువేకదా! మొగలాయీ సామ్రాజ్యములో హిందువులు మంత్రులుగను, రాష్ట్రపాలకులుగను, సేనానాయకులుగను, అంతరంగికులుగను ఉండుట సుప్రసిద్ధము. దక్కన్ దేశచరిత్రలో ముస్లింరాజుల ప్రధానులు ఎంతమంది హిందువులు లేరు? హైదరాబాదులో అక్కన్న మాదన్నలు, చందూలాల్, కిషన్‌ప్రసాద్ ప్రధానులై యుండిరనుట సుప్రసిద్ధముకదా!

*　　　*　　　*

౧౫౦. ఈ మూఢాచారములు మన దేశమునందును ప్రబలియున్నవి. ఈ మూఢాచారములు నెలకొల్పినది భగవంతుడు కాడనియు, అట్లు చెప్పువారు భగవంతున కబద్ధమాపాదించుచున్నారనియు ఖుర్ ఆన్ చెప్పుచున్నది. అచ్చువేసి ఆబోతులను విడుచుట ఇత్యాది మన దేశములోకల అనేక మూఢాచారములకు ప్రమాణ మేమున్నది? ఇవి వేదాదులలోను, శాస్త్రాదులలోను విధింపబడినవా? అట్టియెడ మన పెద్దలు ఈ మూఢాచారముల నేలమాన్పింపరు? ఇట్లు చేయుట మూఢత్వమని ఏల చెప్పరు?

*　　　*　　　*　　　*

౧౫౧. ఏసుక్రీస్తు భగవదాజ్ఞచే చేసి చూపిన కొన్ని మహాత్మ్యము లిందుదహరింపబడినవి. బైబిల్‌లో వీనిప్రశంస కలదు.

بسم الله الرحمن الرحيم

వ్యా ఖ్యా న ము

ఆరవ అధ్యాయము

జంతుసంతతి

౧౫౨. జంతువులనుగూర్చిన కొన్ని మూఢవిశ్వాసముల యొక్కయు, మూఢాచారముల యొక్కయు ప్రశంస ఇందుండుటచే ఈ అధ్యాయమునకీ పేరువచ్చినది. మూఢవిశ్వాసములు, మూఢాచారములు నశించిననేగాని ఏకేశ్వరత్వము స్థిరపడదు. ఏకేశ్వరత్వము కేవల మొక సిద్ధాంతమే కాదు. అది జీవితమునకు పునాది. అనుదిన జీవితమునకు ఏకేశ్వరత్వము పునాదిగావించుట ఖుర్ ఆన్ అభిమతము.

*　　　*　　　*　　　*

౧౫౩. ఖుర్ ఆన్ సమస్త శాస్త్ర పరిశోధనమునకును మూలమైయున్నది. † ఈ సూక్తము ఆర్కియాలజీ లేక పురాతత్త్వ పరిశోధనమును విధించుచున్నది.

*　　　*　　　*

౧౫౪. శ్రీ ప్రవక్త చిన్ననాటినుండియు "అల అమీన్" సత్యవ్రతుడు అను బిరుదనామముతో మక్కాపట్టణమున పిలువబడుచుండెడివారు. ఆయన సత్యవ్రతమున కెన్నడును లోటురాలేదు. ప్రవక్త అబద్ధము చెప్పుచున్నారనిగాని, కల్పించి చెప్పుచున్నారనిగాని ఆయన శత్రువులెవరును చెప్పరైరి. ఎందుకన ఏవిషయమునను ఎప్పుడును అబద్ధము చెప్పని ఒకమనిషి ధర్మవిషయమున ఎట్లబద్ధములు పల్కును?

*　　　*　　　*

† "We must not be surprised to find the Qnran regarded as the fountain-head of all the science. Every subject connected with heaven or earth, human life, commerce and various trades are occasionally touched upon, and this gave rise to the produc ion of numerous monographs forming commentaries on parts of the Holy Book. In this way the Quran was responsible for great discussions, and to it was also indirectly due the marvellous developmen t of all branches of science in the Muslim world. This again not only affected the Arabs but also induced jewish philosophers to treat metaphysical and religious questions after Arab methods."
—Hirschfeld, New Researches, P. 9.

౧౫౫. మొన్న మొన్నటివరకు సమస్త జంతుశాస్త్రజ్ఞులు ఇప్పటికిని కొందరు జంతువులు నిరంతరము పరస్పరము పోరాడుకొనుచు, దేనిజీవితమదే విడివిడిగ గడుపుకొనుచున్నవని నమ్ముచుండిరి. జంతువులట్లుకాక తెగలుగ సంఘములుగ జాతులుగ సమిష్టిజీవితమును గడుపుచున్నవనియు, ఆ సంఘములకు కొన్ని నియమాలు, ఆ నియమ పాలనము కలదనియు, పరస్పరయుద్ధము ప్రకృతిధర్మము కాదనియు, పరస్పర సహాయ సానుభూతులు ప్రకృతి ధర్మమనియు ఖుర్ ఆన్ బోధించుచున్నది.

డార్విన్ సిద్ధాంతముపై సమస్త ఆధునిక ఇంపీరియలిస్టు కాపిటలిస్టు సంఘమాధారపడి యున్నది. వ్యక్తికి వ్యక్తికి, సంఘమునకు సంఘమునకు, జాతికి జాతికి, తరగతికి తరగతికి, స్త్రీకి పురుషునకు నిరంతరయుద్ధము, నిరంతరాంతఃకలహము డార్విన్ సిద్ధాంతము ననుసరించి సహజము, అవసరము అనికూడ ఆధునిక ప్రపంచము భావించుచున్నది. మన ఆర్థిక రాజకీయ క్షేత్రములలో ఈ భావమే పునాదియై యున్నది. దీనికి వ్యతిరేకముగ ఖుర్ ఆన్ ప్రకృతిలో ఒక సంఘనిర్మాణము కలదనియు, అది పరస్పర సహాయ సానుభూతు లను పునాదులపై నిర్మింపబడినదనియు చెప్పుచున్నది. ఇప్పుడు క్రమముగా శాస్త్రజ్ఞులు దీని నంగీకరించుచున్నారు.

వెనుకటి సైంటిస్టులమతము ప్రిన్స్ క్రొపోట్కిన్ ఒక వాక్యములో నిట్లు చక్కగ క్రోడీకరించినాడు :

"They (the scientista) came to conceive the animal world as a world of perpetual struggle emong half-starved individuals, thirsting for one another's blood." *

ప్రిన్స్ క్రొపోట్కిన్ Mutual Aid అన్న తన ఉద్గ్రంథములో పక్షులయందును, జంతుప్రపంచము నందును కల సంఘజీవితమును దీర్ఘముగ చర్చించినాడు. ఆయన తెల్పిన సారాంశమిది :

"All these mammals live in societies and nations sometimes numbering hundreds and thousands of individuals ...." §

మరొకచో ఇటుల వ్రాయుచున్నాడు :

"....life in societies is no exception in the animal world it is the rule, the law of Nature, and it reaches its fullest development with the higher vertebrates" ‡

పక్షులనుగూర్చికూడ ఇప్పుడిదే తేలినది. చిలుకలనుగూర్చి వ్రాయుచు A. Brehm తన Life of Animals లో ఇట్లనుచున్నాడు :

"Except in the pairing season, they live in very num-rous societies or bands."

మరొకరకము పక్షినిగూర్చి వ్రాయుచు Mox Perly ఇట్లనుచున్నాడు :

"In South America they gather in blocks of from forty to fifty thousand individuals, Part of which enjoy sleep while the others keep watch, and others go again fishing." †

పశుపక్షులు కేవలము యంత్రములవంటివని వాటికి బుద్ధి, కర్మస్వాతంత్ర్యము, సుఖదుఃఖాద్యనుభవములు లేవను అభిప్రాయమొకటి ఇటీవలివరకు శాస్త్రజ్ఞులలో నుండెడిది. ఖుర్ ఆన్ ఈ అభిప్రాయమునకు వ్యతిరేకముగ పశుపక్షులకుకూడ సమస్త సుఖదుఃఖాద్యనుభవములు కలవనియు, అవికూడ సద్గుణ దుర్గుణములు కలిగియుండుననియు, అవికూడ తీర్పునకై భగవంతునిముందు సమావేశమగుననియు ఖుర్ ఆన్ చెప్పుచున్నది. ఇప్పుడు శాస్త్రజ్ఞులు క్రమముగ ఈ సత్యమును గ్రహించుచున్నారు. జూలియన్ హక్స్లే An Essay on Bipd-Mind అను తన వ్యాసములో ఈ విషయమును చక్కగ చర్చించినాడు. జిజ్ఞాసువులు ఆ వ్యాసమును చదువుదురుగాక. §

*　　　*　　　*

౧౫౬. (పుట 286. సూ. 52.)

శ్రీ మొహమ్మద్ ప్రవక్త శిష్యులలో నిరుపేదలు, బానిసలు, అబిసీనియన్ నీగ్రోలు పలువురుండిరి. సంఘములో వీరికిపూర్వ మెట్టిస్థానమును ఉండెడిదికాదు. ప్రవక్త శిష్యులైన తర్వాత వీరు ప్రవక్త సమక్షమున ఎప్పుడును ఉండువారు. ధనికులు, ఉన్నతవంశ సంజాతులునైన కొందరుశిష్యులు నిరుపేదలును, బానిసలు మున్నగు నికృష్టస్థితియందున్నవారితో సమానముగ ప్రవక్త సమక్షమున కూర్చొనుట చిన్నతనముగ భావించుచుండిరి. వారు ప్రవక్తతో ఈ విషయమును విన్నవించుకొనిరి. నిరుపేదలతో కూర్చొనుట తమకు గౌరవభంగమని చెప్పిరి. నీగ్రోబానిసలతో సహాసనమున కూర్చొ

* Prince Pater *Kropotkin, Mutual* P. 23.

§ *Ibid*, P. 48.

‡ *Ibid*, P. 57.

† Quoted by Kropotkin, P. 37.

§ Julian Huxley, Essays of a Biologist, PP. 93-99.

నుట తమకవమానమని నివేదించిరి. అందుచే తాము వచ్చినప్పుడు వారిని సభనుండి పొమ్మని సెలవివ్వవలసినదని ప్రార్థించిరి. ధనము, కులము, జాతి, పుట్టుక, గౌరవా గౌరవములకు, న్యూనతా ఔన్నత్యములకు, ఉత్కర్షాపకర్షలకు గీటురాయియైన సంఘములో ఇట్టికోరిక అసహజమైనదికాదు. ఖుర్ ఆన్ హెచ్చుతగ్గుల ఈ గీటురాయిని పడగొట్టినది. జాతి, కులము, వంశము, రంగు, దేశము—ఇవి ఉత్కర్షాపకర్షలకు, పెద్ద చిన్నతనములకు, నీచోన్నతములకు గీటురాళ్లు కావని ఖుర్ ఆన్ చాటినది. మంచితనము, సౌజన్యము, భగవద్భక్తి ఇవే హెచ్చుతగ్గులకు ప్రమాణములని నిర్ణయించినది. ఎవడు ఎక్కువ భగవద్భక్తిపరుడో, ఎవడు ఎక్కువ సౌజన్యము కలవాడో అతడే గొప్పవాడు; అతడే హెచ్చుకులమువాడు; అతడే గౌరవనీయుడు. ఖుర్ ఆన్ ఈసత్యమునే ఇచట చాటినది. నిరుపేదలును, పలుకుబడి లేనివారును, నీగ్రోజాతియందు దుద్భవించినవారును, నల్లటిముఖములు కలవారును అగువారు ధనికులైనట్టియు, పలుకుబడి కలట్టియు, ఉన్నత వంశజులును ఐనవారితో సమానులని ఖుర్ ఆన్ ప్రవక్తను ఈ సూక్తమునందును తర్వాతి సూక్తమునందును హెచ్చరించుచున్నది.

ప్రవక్త వచనము చూడుడు: భగవంతుడు మీరంగులను మీ ముఖములను చూడడు; మీ హృదయములను మీ చేతలను చూచును.

ఇట్టి సమానత్వము ప్రపంచములో ఏ మతధర్మముకాని, ఏ సాంఘికధర్మముకాని ఇంతవరకు ఇట్లుద్ఘాటించి యుండలేదు. మనదేశములో కులములనుబట్టి గౌరవాగౌరవములు ఏర్పడినవి. బ్రాహ్మణునితో సహాసనము నిచ్చించువాని పిరుదలు కోసివేయవలెనని మనువు శాసించుచున్నాడు. శూద్రుడు ఎంత మంచివాడైనను దుష్టుడగు ఒక బ్రాహ్మణుని సైతము పోలడని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి. వెనుక రెండుమూడు చోట్ల దీనికి సంబంధించిన శాస్త్రభాగముల నుదాహరించితిని. పూర్వధర్మము లిట్లుండగా ఆధునిక ప్రజాస్వత్వ యుగములో సమానత్వము, స్వాతంత్ర్యము, సౌభ్రాతృత్వము అని ఇన్ని కేకలు పెట్టిన యూరప్ అమెరికా ఖండములలో సమానత్వము ఆచరణలో లేకపోవుట యటుంచి సిద్ధాంతముగ నైనను ఒప్పుకొనబడలేదు. 1941 లో ప్రకటింపబడిన "Who are the Americans? అను గ్రంథములో విలియమ్ డ్వైట్ విట్నె (William Dwihgt Whitney) గారు:

"We may leave the thought of Fraternity with merely a note that *it seems never to be referred to as an idea in either England or America.* What of liberty and equality? Until the English revolution

that Commenced in 1941 - 42, the Englishman rerely paid lip-service or other service to the principle of equality." §

అన్నాడు. అనగా, సౌభ్రాతృత్వ సిద్ధాంతము ఒక ఆదర్శముగనైనను ఇంగ్లాండు దేశమునందును, అమెరికా ఖండమునందును ప్రశంసకు రాలేదు. ఇక సమానత్వ సిద్ధాంతమును 1941_42 సంవత్సరమువరకు ఆంగ్లేయులు నోటిమాటలతోనైన చెప్పరైరి.

అమెరికాలోకూడ అంతే. అమెరికన్ సివిల్ యుద్ధమున ఫలితముగ నీగ్రోబానిసత్వ మంతమొందింపబడెను. కాని నీగ్రోలస్థితి బానిసలకంటె అధమాధమముగ నేటికిని కలదు. వారిదుస్థితికి సామ్యమే లేదు. నార్డిక్ జాతి (జర్మన్ జాతి) అన్నిటికంటె ఉన్నతమైనదని జర్మనీలోను, తెల్లజాతులు నల్లజాతులకంటె ఉత్కృష్టమైనవని యూరప్ అమెరికా ఖండములలోను, జపానుజాతి సూర్యపుత్రులను నమ్మకము జపానులోను, ఉత్తమోత్తమమైన నాగరికతకు తాము వారసులమను నమ్మకము చైనీయులకును, బ్రహ్మముఖమునుండి పుట్టితిమను నమ్మకము మన దేశపు బ్రాహ్మణులందును నేటికిని దృఢముగ పాతుకొనియున్నది. గిడ్డింగ్సువంటి ఆధునిక పండితులు కొందరు మానవులందరు సమానులను భావము సంపూర్ణముగ అంగీకరింపబడినచో మానవజాతికి పతనము సంభవించునని వ్రాయుచున్నారు. (F. H. Giddings, Studies in the Theory of Human Society.) 1919 లో జరిగిన వర్సైల్ కాన్ఫరెన్సులో అన్నిజాతులును సమానమని ప్రకటింపవలసినదిగా జపాన్ ప్రభుత్వ ప్రతినిధి కోరగా అమెరికా సంయుక్తరాష్ట్రాధ్యక్షుడు విల్సన్ నిరాకరించెను.* పూర్వకాలమున మనదేశములో సంఘమునందు శూద్రులకుండిన స్థానము ఇప్పుడు అమెరికాలోను, ఆఫ్రికాలోను నీగ్రోల కున్నది. పూర్వకాల మున్నతకులస్థు లార్యులు; ఇప్పుడు తెల్లజాతివారు. అమెరికాలో రైలుబండ్లయందును, మోటారుబస్సులలోను, ట్రాములలోను కూడ నీగ్రోలలకు ప్రత్యేకస్థలములు కూర్చొనుటకు ఏర్పాటుచేయబడి యున్నవి. అనేక హోటళ్లలో నౌకరులుగాతప్ప మరే ఇతరవిధమునను నీగ్రోలు ప్రవేశింపరాదు. తెల్లవారి స్కూళ్లలో నల్లవారికి ప్రవేశము లేదు. నల్లవాండ్రకై కాలేజీలుసైతము వేరుగ ఉన్నవి. రెండుజాతులకు చర్చిలు వేరు. న్యాయస్థానములలో శిక్షలు వేరు. లేబర్ యూనియన్లలో నీగ్రోలకు సభ్యత్వము లేదు. పోస్టాఫీసులలో నీగ్రోలు వ్యవహారము

§ In a chapter entitled "Liberty versus Equality," P. 24.

* C. E. Oldham, Christianity and Race Problem, P. 63

నల్ల కిటికీలు వేరు. నీగ్రోలకు "మిస్టర్" ఇత్యాది గౌరవసూచకమగు శబ్దములు వాడరు. అనేక వృత్తులు నీగ్రోలకు నిషేధము. §

దీని నంతటిని పూర్వరంగముగ నుంచి ఇస్లామ్ ప్రతిపాదించిన ధర్మమును గమనింపుడు. ఇస్లామ్ సంపూర్ణ సమానత్వమును ప్రతిపాదించుచున్నది. ప్రతి ముస్లిమ్ మరొక ముస్లిమ్‌నకు సోదరుడని చెప్పుటతో ఆగక సమస్త మానవులును ఒకే ప్రాణినుండి ఉద్భవ మైనవారని ఆదేశించుచున్నది. ధనిక నిర్ధన భేదమును, ఉన్నత హీనవంశములను, కృతక భేదమును, తెలుపు నలుపు వివక్షతను, ఈజాతి ఆజాతి అను విచక్షణమును నిర్మూలించినది. సమానత్వ సిద్ధాంతమును ముస్లిమ్‌సంఘములో దృఢముగ పాదుకొల్పినది. ఇస్లామ్‌మత శత్రువులై ముస్లిమ్‌ప్రజలలో క్రైస్తవమత ప్రచారము చేయుటకు పూనుకొనిన క్రైస్తవమిషనరీలలో ప్రముఖుడగు స్పోక్ హుర్ గ్రోంజి ముస్లిమ్‌సంఘమునుగూర్చి ఇట్లనుచున్నాడు :

"The Koran teaches the descent of man from Adam and Eve, implying the equality of all men, notwithstanding the variety of characteristics of individuals and groups. The actual multiplicity of languages and colours is described in the Koran, next to the creation of Heaven and earth, as one of the magnificent signs of Allah's wisdom. The prophet of Arabia...................enforced the universal recognition of the principle of equality.... ..."†

ఇట్టి వెన్నియైనను చూపవచ్చును. E. E. Long గారు ప్యారిస్‌లో జరిగిన అంతర్జాతీయ దివ్యజ్ఞానసమాజ సమావేశములో ఉపన్యసించుచు

"A Christain convert is not regarded as a social equal, but the Muslim brotherhood is a reality."

అని వ్రాక్రుచ్చినాడు.

ఇస్లామ్ ప్రతిపాదించిన ఈ ధర్మము భావి నాగరికతా సౌధమునకు పునాది కాగలదు. ఏనాడీ ధర్మము మనోవాక్కాయముల మానవసంఘ మాచరింపదో నాడు నాగరికత కూలును. J. H. Oldham ఈ విషయము చక్కగా చెప్పినాడు :

§ *Ibid*, PP. 164 - 175.

† In a volume entitled "The Muslim World of To-day" edited by Gohn R. Mott, Chairman, International Missionary Council. P. 82.

"An unfaltering and unquenchable faith in equality is the hope of peace and harmony the spring of progress and the soul of civilisation" Ibid. P. 93

(సమానత్వమునందు అచంచలమైనట్టియు, నిర్నిద్రమైనట్టియు విశ్వాసమున్నప్పుడే ప్రపంచములో శాంతి సామరస్యములు అభివృద్ధికలుగును. అది సమస్త నాగరికతకును ఆత్మప్రాయమైనది.)

* * *

౧౫౬. (అ. 6. సూ. 59) "జ్ఞానకోశము" అను నా అనువాదమునకు మూలము "కితాబిమ్ముబీన్" దీనికి ప్రతిపదార్థము "స్పష్టమైన పుస్తకము." భగవంతునిగ్రంథము అనగా భగవంతుని జ్ఞానకోశము, భగవంతుని ప్రకృతిప్రణాళిక, భగవంతుని భూత భవిష్యద్వర్తమాన జ్ఞానము. భూతభవిష్య ద్వర్తమానములు భగవంతునకు ఒకేక్షణమందు ప్రత్యక్షము. భగవంతుడేర్పరచిన నియమములే ప్రకృతియందు మనము చూచుచున్న నియమములు. అవియే భగవదాజ్ఞలు. భగవంతుని ఆజ్ఞలనే శాస్త్రజ్ఞులు ప్రకృతిధర్మము లేక లా ఆఫ్ నేచర్ అనుచున్నారు. భగవత్సృష్టిలో ఒక క్రమముకలదు. సృష్టికూడ భగవదాజ్ఞయే. భగవదాజ్ఞ లేక ఒక ఆకైనను కదలదు. ఏక్షణము భగవదాజ్ఞ విరామమగునో ఆక్షణము సృష్టి లయమైపోవును. భగవదాజ్ఞ లేకపోయిన సృష్టి శూన్యమగును. భగవంతుని ఈ "జ్ఞానకోశము" విస్పష్టమైనది. విస్పష్టమని చెప్పుటలో విశేషమేమున్నది? దేనియందు క్రమముండునో అదే విస్పష్టముగ నుండును. క్రమహీనమైనది స్పష్టముగ నుండదు. సర్ జేమ్స్ జీన్సు అన్నట్లు సృష్టికార్యము విశ్వమును సృజించుటయేకాక విశ్వముయొక్క సమస్త భావిచరిత్రమును రచించినది. §

* * *

౧౫౭. (అ. 6. సూ. 76) ఇబ్రాహీము అనగా 'పిత' అనియు, 'పితామహ' అనియు అర్థము. హెబ్రూలకీయన పితామహుడు. బహుశా క్రీ. పూ. 4000 మొదలు 3000 వరకుగల మధ్యకాలములో అప్పుడు 'ఆరామ' మని పిలువబడుచుండిన సిరియా (ఇప్పటి ప్యాలెస్టయిను అప్పటి సిరియాలో ఒకభాగము) లో పుట్టెను. ఈయనపుట్టిన జాతియొక్క మతము బహుదైవతారాధనము, విగ్రహారాధనము నై యుండెను. ఇబ్రాహీమ్ యోచనాపరుడు; వివేచనాధురీణుడు; యుక్తాయుక్త విచక్షణజ్ఞానము కలవాడు;

§ "In brief, the act of creation had created not only the universe but its whole future history." Sir James Jeans, The Mysterious Universe, P. 27.

కవితాహృదయుడు. ఆయన తనచుట్టునున్న ప్రకృతిని పరిశీలించినాడు. ఒక సైంటిస్టు వలెకాదు; భయముతో, ఆశ్చర్యముతో, ఆనందముతో. సూర్యుని మహత్కాంతి ఎవరికి భయముకొల్పదు? ఎవరికాశ్చర్య ముత్పాదింపదు? ఎవరియం దానందము పూరింపదు? అట్లే చంద్రుడెవరి కాహ్లాదము కల్గింపదు?

"ఘృణి స్సూర్య ఆదిత్యో నప్రభావాత్యక్షరమ్।
మధుక్షరంతి తద్రసమ్। సత్యంవై తద్రస మాపో జ్యోతి రసోఽ మృతం
బ్రహ్మ భూర్భువస్సువరోమ్॥"

అన్న వేదర్షి వలె ఇబ్రాహీమ్ సూర్యుని భగవంతునిగా భావించెను. అంతకు పూర్వము నక్షత్రరాజిని, చంద్రుని ఇట్లే భావించెను. అన్నియు అస్తమించెను. అన్నియు ఏదో ఒకనియమము ననుసరించి, ఏదో ఒక నియమమునకు బద్ధమై నడచుచున్నవని ఆయనకు స్పష్టముగ కన్పించెను. వెంటనే ఇబ్రాహీమ్

"యేన ద్యౌరుగ్రా పృథివీచ దృఢేయేన సువస్తభితం యేన నాకః
యో అన్తరిక్షే రజసో విమానః కస్మై దేవాయ హవిషా విధేమః"

(ఏ పరమాత్మచేత క్రూరమైన భూమ్యాకాశములు దృఢములుగా చేయబడినవో, ఏ పరమాత్మచేత ఆదిత్యమండలము నిరాధారముగ స్థాపింపబడినదో, ఏ పరమాత్మచేత స్వర్గము నిర్మింపబడినదో, ఏ పరమాత్మ అంతరిక్షమునందు జలమును నిర్మించునో అట్టి పరమాత్మను వదలి మరేదేవుని మేము పూజింతుము?) అని నాటి దేవతాదుల నర్చించు మతముయెడ ఎదురుతిరిగిన ఋషిసత్తములవలెనే ఇబ్రాహీము "భూమ్యాకాశములను సృష్టించిన భగవంతునే నే నాశ్రయించుచున్నాను" అని ఘోషించెను. కాని అది ఆయనజాతి ఆమోదమును బడయలేదు. ఆయనజాతి ఆయనను దేవతా దూషకుడని నిందించెను. ఇబ్రాహీము దేశభ్రష్టుడై నానాదేశములు తిరిగి ఏకేశ్వరత్వ సందేశమును చాటెను. ఆ మతమునే తర్వాతి సమస్త ప్రవక్తలును పునరుద్ధరించినది.

ఆర్షమతము తొలుదొల్త అనేకదేవతల ఆరాధనముతో ప్రారంభమై తుదకు ఏకేశ్వరత్వమున పరిణితిగాంచినది. కాని రాధాకృష్ణ పండితుడన్నట్లు పరిణితిదశ ప్రజాజీవితములో ఒకభాగము కాజాలకపోయినది. అది అటుండగా వేదమతమేపోయి ఒక క్రొత్తమతము, క్రొత్త దేవతలు, క్రొత్త ఆరాధనపద్ధతులు, క్రొత్త సంప్రదాయములు ఆర్యసంఘమును జయించి ఆక్రమించుకొన్నవి. ఇప్పుడార్యసంఘములో పురాణము ప్రతికల్పాది గ్రంథములే—ఇంకను క్లుప్తముగ, స్పష్టముగ చెప్పవలెనన్న—

ఆచారము ప్రమాణమైపోయినది. వేదర్షుల సత్యసందర్శనము వలన ఆర్యసంఘము లాభము పొందలేకపోయెను. (ఈ విషయమున ౧౨ వ నోటు పేజీలు 82_83 చూడుడు.)

*   *   *   *

౧౫౯. (అ. 6. సూ. 87) ఇబ్రాహీము బోధించిన ఏకేశ్వరతత్త్వము ఆయనతోనే అంతరింపలేదు. ఆయన వంశములో పల్వురు ప్రవక్తలదే ధర్మమును తమతమ కాలపు ప్రజలకు బోధించిరి. ఎవరు ఏకాలమున ఏదేశమును ఏజాతికి బోధించినను అదే సత్యము. ఇక్కడ పేర్కొనబడిన ప్రవక్తలలో నోహ (Noah), దావూద్ (David) మూసా (Moses), ఈసా (Jesus), సుప్రసిద్ధులు.

*   *   *

౧౬౦. (అధ్యా. 6. సూ. 145) ప్రతి ధర్మమునందును మూలధర్మము కంటె, పురోహిత ప్రోక్తమైన ఆచారము బలమెక్కి మతమునవిల్చి క్రమముగ దాని స్థానమది ఆక్రమించినది. పురోహితవృత్తి చేసికొనువారు తమవృత్తికి అనుకూలముగను, లాభకరముగను నుండునట్లు ఆచారములను పెంచి, కథలుకల్పించి, పురాణములల్లి ఆ ఆచారముల కాధారములు కల్పించి, వారిసహాయము లేనిదే మానవుని ఆధ్యాత్మికజీవితము సాధ్యముకాదను భ్రమ కల్పించి పొట్టపోసికొనుట లోకసామాన్యము. భక్ష్యాభక్ష్య వస్తువుల నిర్ణయించు సందర్భమున కూడ పురోహితవర్గ మిట్లే ఇష్టమువచ్చినట్లు శాసించెను. ఇట్లుచేసి ఇవన్నియు భగవదాజ్ఞలనియే ప్రకటించుచు వచ్చిరి. ఇది భగవంతుని కబద్ధమారోపించుట కాదాయని ఖుర్ ఆన్ ప్రశ్నించుచున్నది

*   *   *   *

౧౬౧. (అ. 6. సూ. 147) పంచనఖములుగల మృగములను తినరాదను నిషేధ మార్ష ధర్మమునకు కలదు. (మనువు V. 17.)

*   *   *   *

بسم الله الرحمن الرحيم

వ్యా ఖ్యా న ము

ఏడవ అధ్యాయము

ఉన్నత స్థానములు

౧౬౨. (అ. 7. సూ. 175) 'ఉమ్మీ' అను ఇక్కడి అరబీమూలమును 'నిరక్షరాస్యుడు' అని అనువదించితిని. 'వ్రాయుటయు చదువుటయు నెరుగనివాడు' అని దీని పూర్తి యర్థము. శ్రీ మొహమ్మద్ ప్రవక్తకు వ్రాయుటయు చదువుటయు వచ్చెడిది కాదు. అసలు అరబుజాతియే నాడు విజ్ఞానవిషయమున బీడువోయి యుండెను. అట్టి విద్యాగ్రంథములేని జాతియందు, ఆ యెడారిలో, నాగరికతకు దూరముగ, విజ్ఞానమున కందుబాటులో లేని ఆ ఇసుక దేశములో పుట్టి, స్వయముగ నిరక్షరకుక్షియై ఇంతటి మహాధర్మము నుపదేశించి, ఒక ప్రపంచ నాగరికతకు, ఒక ప్రపంచ సంస్కృతికి పునాదులువైచిన శ్రీ ప్రవక్త మహానుభావము భగవత్ప్రసాదితము కాని మానవసాధ్యమా? ఖుర్ ఆన్ భగవత్ప్రేరిత మనుటకు ఇదొక సాక్ష్యముచాలదా? భగవత్సందేశమును మానవలోకమునకు వినిపించుటకై వచ్చిన పవిత్ర శ్రీ మొహమ్మద్ అని దీనివల్ల తెలియుటలేదా ?

ఇప్పుడున్న పాత నిబంధనమునందును, క్రొత్త నిబంధనమునందును గూడ శ్రీ మొహమ్మద్ పవిత్ర ఆగమనమునుగూర్చి జోస్యము చెప్పబడినది. డ్యూటోర్నమీ 18 : 15-18, 33 : 2: మత్తయి 13 : 31; 21 : 34-40; మార్కు 12 : 1, ల్యూక్ 20 : 9; జాన్ 1 : 22; 14 : 6; 14 : 26 మున్నగు అనేక చోట్ల ఈ జోస్యము కలదు.

* * *

౧౬౩. (అ. 7. సూ. 158) ఖుర్ ఆన్ సందేశము ఎంత సరళమో, ఎంతస్పష్టమో చూడుడు. భూమ్యాకాశముల సమస్త సామ్రాజ్యమునకు అధినేతయై జీవన్మరణములకు ప్రభువైన ఏకేశ్వరునే విశ్వసించుడు - అని ఖుర్ ఆన్ ఎన్నివిధముల బోధించుచున్నదో చూడుడు.

* * * *

౧౬౪. (అ. 7. సూ. 167) ఈ జోస్యము ననుసరించి నేటివరకు యూదులు అధోగతిపాలై ఉన్నారు. వారి కొక స్వతంత్ర దేశము లేదు. ప్రతి దేశమునందును వారేదో ఒకజాతి చెప్పుచేతలక్రింద ఉన్నారు. "వారిని నీచులుగ చేసియుంచు జాతులకు వారిపై అధికారము నిత్తును" అన్న భగవద్వాక్కు ఇప్పుడు జర్మనీలో యూదుల స్థితినిగూర్చియేమో అనిపించును.

* * *

వ్యా ఖ్యా న ము

ఎనిమిదవ అధ్యాయము

లా భ ము లు

౧౬౫. ఆత్మ సంరక్షణము మానవుని ధర్మము. ఆత్మ సంరక్షణముతోపాటు ధర్మరక్షణము అనాథరక్షణమునకై కత్తి ఎత్తుట ఉత్తమధర్మము. ఖుర్ ఆన్ ఈ ధర్మమునే విధించుచున్నది. ఎవరు అధర్మపరులై, భగవద్భీతివిహీనులై నిరంకుశముగ ప్రవర్తించుచు లోకపీడనమునకు పాల్పడుదురో వారితో యుద్ధమొనర్చి నిర్జించవలెనని ఇక్కడ ఖుర్ ఆన్ ఉపదేశించుచున్నది.

* * *

౧౬౬. అట్టి దుష్టులను చంపుచున్నది మీరుకాదు నేననుచున్నాడు భగవంతుడు. మానవుడు తాను హింస చేయుచున్నానే యని భీతిల్లనక్కరలేదని బోధించుచున్నాడు. అట్టి దుష్టులను వాస్తవముగ చంపుచున్నది భగవంతుడే.

* * *

౧౬౭. (సూ. 29) భగవద్భీతి కలవానికి ఉచితానుచితజ్ఞానము దానికదే ఏర్పడును. ఏదిచెడ్డదో ఏదిమంచిదో అతనికి సహజముగ అవబోధమగును. చెడుగునుండి అతని ప్రకృతియే దూరముగపోవును. మంచి అతని నాకర్షించును. అతడు మంచి నాకర్షించును. అథవా ఎక్కడైన పొరపాటు జరిగినను భగవంతుడు క్షమించునని ఖుర్ ఆన్ వాగ్దానము చేయుచున్నది.

* * *

౧౬౮. (సూ. 35) విగ్రహారాధకులగు అరబ్బులు తమ దేవాలయములలో చప్పట్లు చరచుచు, ఈలలువేయుచు, వెర్రిగంతులువేయుచు తమ దేవతలభజన చేయుచుండిరి. విగ్రహారాధనమున్న యన్నియెడలను బాజాలతో, బజంత్రీలతో, మేళతాళములతో భజనలు మున్నగునవి చేయుట పరిపాటియే. ఖుర్ ఆన్ విధించిన ప్రార్థన నిశ్శబ్దముగ శాంతముతో, నమ్రతతో, ఏకైకధ్యాన నిష్ఠాపరత్వముతో చేయదగినది.

* * *

౧౬౯. (సూ. 41) యుద్ధములో వచ్చిన జితధనము వెనుకటికాలములో కేవలము రాజులకును, యోధులకును మాత్రమే చెందుచుండెను. ఖుర్ ఆన్ ఆధనములో ఎన్నివంతులు వేసినదో చూడుడు: భగవంతునకు అనగా భగవత్కార్యములకు, తల్లిదండ్రులులేని పిల్లలకు, నిరుపేదలకు బాటసారులకు; మిగిలినది యుద్ధభటులకు.

* * * *

వ్యాఖ్యానము

తొమ్మిదవ అధ్యాయము

పశ్చాత్తాపము

౧౭౦. (సూ. 25) విజయము పొందినప్పుడు గర్వము పొందరాదు. గర్వము ధర్మపక్షమునందు సైతము దూష్యమే. నమ్రతలేని బలము, దానములేని ధనము, వినయములేని విద్య వ్యర్థము. ఈ పాఠమునే ఖుర్ ఆన్ ఇక్కడ బోధించుచున్నది.

* * * *

౧౭౧. (సూ. 26) మీ సహాయమునకై "అదృశ్యమైన బలగమును పంపెను" అని ఇక్కడ ఖుర్ ఆన్ చెప్పుచున్నది. భగవంతుని సహాయము మనకు తెలియనిది. అది మనకు తెలియకుండగనే మనకు తోడ్పడవచ్చును. భగవదనుగ్రహము నట్టిదే. లేకపోయిన మనమిది సాధ్యమా అనుకొన్నది ఎట్లు సాధ్యమగుచుండును? ప్రవక్త చరిత్రను చూడుడు. ఏకమాత్రుడగు ఆయన లేచి "భగవంతుడొకడు. విగ్రహములు మీరు పెట్టుకొన్నవి. వాటిపూజ మానుడు." అని ఘోషించెను. ఆయననెవ్వరు విశ్వసింపలేదు. నగరమంతయు ఆయనకు శత్రువాయెను. ఆయన బంధువులు సైతము నమ్మలేదు. ఇట్టి పరిస్థితులలో ప్రవక్త సందేశము విశ్వసనీయమగుననియు, ఆయనను నిరాకరించిన అరబ్బుజాతి ప్రపంచమెల్ల ప్రాకుననీ, ఆయనచాటిన ధర్మము 30 కోట్లమందికి అవలంబనీయ మగునని ఎవ్వరైన ననుకొనిరా? అది అప్పుడు సాధ్యమనిపించెనా? ఇక్కడనే భగవత్సహాయము వచ్చునది. భగవత్సహాయము లేకపోయిన ఇదెట్లు సాధ్యమైనది?

* * *

౧౭౨. (సూ. 29) ఈ సూక్తమున 'జజియా' అనుశబ్దము వాడబడినది. 'జజియా' ముస్లిమ్ రాజ్యములో నివసించు ముస్లిమేతరులనుండి మిలిటరీ సేవకు బదులుగా గ్రహించు ఒక పన్ను. అనగా ముస్లిమ్ రాజ్యములో ప్రతి ముస్లిమునకు యుద్ధసేవ నిర్బంధముగ నుండెను. ఇప్పుడు సైతము అనేక స్వతంత్ర రాష్ట్రములలో మిలిటరీ సేవ నిర్బంధముగ ఉన్నది. కాని ముస్లిమ్ పాలకులీ నిర్బంధమును ముస్లిమేతర ప్రజలపై విధించలేదు. దానికిబదులీ పన్ను విధించిరి. సైనిక సేవకు సిద్ధపడువారికీ పన్ను లేదు. యమన్ దేశమందలి నజరాన్ నుండి క్రైస్తవుల రాయబారము వచ్చినప్పుడు వారు శ్రీ ప్రవక్తకు

మాపై 'జజియా విధింపుడు' అని చెప్పిరి. ఇస్లామ్ మతచరిత్రలో మొట్టమొదటి కీ పన్ను వీరే ఇచ్చిరి.

మనదేశములో ఈ పన్నునుగూర్చి అనేక అపోహలు పెరిగినవి. కారణమేదో తెలియదు. ముస్లిమ్ రాజ్యాంగవిధాన మర్థముకాకపోవుట ఒకటే కారణమని మనమూహింపవచ్చును. దీనికి జుత్తుపన్ను అని పాడుకవచ్చినది. మొత్తమునకు మనదేశములో అదొక క్రొత్తవిధమగు పన్ను. ప్రతి క్రొత్త సుంకము ప్రజల అయిష్టమునకు కారణమగుట ప్రసిద్ధము. అదేకారణముచే ఈ సుంకము మనదేశమున ప్రజాద్వేషమునకు గురియయ్యెను. వాస్తవమునకది మిలిటరీ సేవకు బదులుగా విధింపబడిన సుంకము.

* * *

౧౭౩. (సూ. 30) 'ఉజైర్' ను ఇంగ్లీషులో ఎజ్రా (Ezra) అందురు. ఈయన గొప్ప యూదపండితుడు. జెరూసలమ్ ధ్వంసమైనప్పుడు 'తోరాతు' గ్రంథము యొక్క సమస్త ప్రతులు నశించగా ఎజ్రాపండితుడు తనకు జ్ఞాపకమున్నంత మట్టుకు ఇప్పుడు పాతనిబంధనములో ఉన్న పెక్కుభాగములను వ్రాసెను. బాబిలోనియాలో కారాగారశిక్ష ననుభవించి అక్కడినుండి వచ్చినతర్వాత యూదుల చరిత్రలో ఈమహానుభావుడు ఒక క్రొత్తశకము నారంభించెను. అందుచే మూసా ప్రవక్త తర్వాత ఎజ్రా అంతటి మహాపురుషుడు పుట్టలేదని యూదుల విశ్వాసము. ఈ విశ్వాసము తుదకు ఆయన 'భగవంతుని కుమారుడు' అనునంతవరకు వచ్చినది. ఇప్పుడు యూదులీ విశ్వాసము విడిచిపెట్టుకొనిరి.

* * *

౧౭౪. (సూ. 31) బహుదైవతారాధనమున కలవడిన మనస్తత్త్వము ప్రతి ప్రతిభావంతుని దేవుడనుటకు వెనుదీయదు. గురువులను దేవులుగా భావించుట వారికి మిక్కిలి సహజముగనే కన్పించును. నేడుకూడ రామకృష్ణ పరమహంస, హరసాధబాబా మున్నగు గురువులను విద్యావంతులుసైతము దైవతములుగ కొల్చుట కలదు. ఇది ఆధ్యాత్మిక పతనముకాక మరేమి? అట్టివారు 'భగవత్తేజమును నోటితో ఊది ఆర్పగోరుచున్నారు.' అని ఖుర్ ఆన్ చెప్పుచున్నది. అన్నిటికంటె ఆశ్చర్యకరమగు విషయమేమన ఈ గురువులే తమకుతాము దేవులమనుకొని పూజలనందుచు కపటవేషములు వేసికొని ఇదొకవృత్తిగ చేసికొనుట స్పష్టముగ కన్పించుచున్నను విద్యాధికులు సైతము వారివెంబడి పడుచున్నారు. ఓం మండలి మున్నగు గురుకూటముల సంగతి ఇప్పుడు సంపూర్ణముగ బైటపడినదికదా! ఐనను మూఢవిశ్వాసమునకు ఒకదారి తెన్ను లేదు; యుక్తాయుక్త విచక్షణ ముండదు. భగవంతుడు వీరికి సన్మార్గము చూపుగాక!

* * * *

౧౭౫. (సూ. **34**) ఈ విషయమునే ఖుర్ ఆన్ ఈ సూక్తమున వక్కాణించుచున్నది. మనదేశములో మఠాధిపతులును, యూరప్ అమెరికా ఖండములలో క్రైస్తవ మఠాధిపులు మతగురువులు అనుభవించుచున్న భోగభాగ్యములకు మేరకలదా? లక్షలకొలది ఆదాయములువచ్చు జాగీరులు ఆస్తులు ఈ మఠముల కున్నవి. మఠాధిపులా యాస్తిని దిగమ్రింగి భోగలాలసులై, మఠములను సమస్త దౌష్ట్యములకు నివాసములొనర్చిరనియే మనదేశమున ప్రభుత్వమువారు ఇప్పుడు ధర్మాదాయముల చట్టము నమలులో పెట్టి అనేక నిర్బంధములను విధించిరి.

*   *   *   *

౧౭౬. (సూ. 40) ఇది 'హిజరత్' లేక పలాయన సందర్భములో జరిగిన ఒక సంఘటనము. శ్రీ ప్రవక్తను వధించుటకు పూనుకొని మక్కా పురవాసులు వారి ఇల్లు చుట్టుకొనగా శ్రీవారు తన మిత్రులగు అబూబకర్‌తో రహస్యముగ ఇలువిడిచి మదీనాపురమునకు పయనమైరి. మక్కాపట్టణము విడిచి మొట్టమొదట జబలెసూర్ అను కొండయందలి గుహలో మూడుదినములు దాగియుండిరి. ఈ గుహ మక్కాకు మూడుమైళ్ళ దూరమున ఉన్నది. శ్రీ ప్రవక్త రహస్యముగ రాత్రి పలాయితులైన సంగతి తెలియగనే శత్రువులు నలుదిక్కుల వెతుకసాగిరి. తుదను గుహకు దగ్గరగా వెతుకుచూ తిరుగుచుండిన చప్పుడువచ్చెను. అబూబకర్ భయపడిరి. శత్రువులు గుహాముఖమున ఉన్నారు. ఇంక పట్టుబడినచో గతియేమి? ఉన్నది ఇద్దరేకదా! శ్రీ ప్రవక్త చిరునవ్వునవ్వి "అబూకర్! మనమిద్దరము కాము. భగవంతుడు మనతో ఉన్నాడు. భయపడకుము" అనిరి. దానితో అబూబకర్ చింతవదిలెను.

గుహాముఖమున రెండు పావురములు గుడ్లుపెట్టి పొదగసాగెను. ఒక సాలీడు గుహాముఖమును పూర్తిగ తన వలతో కప్పెను. ఒకపొద దట్టముగ పెరిగి వారిద్దరిని ప్రచ్ఛన్న మొనర్చెను. శత్రువులకందు మనుష్యులజాడ పొడగట్టలేదు. వారు వెళ్ళిపోయిరి. ఇది భగవత్సహాయము. విశ్వాసహీనులు ప్రవక్తను పట్టి చంపుదుమని ప్రతిజ్ఞ పట్టిరి. భగవంతుడా ప్రతిజ్ఞ వమ్మొనర్చెను.

*   *   *   *

౧౭౭. (సూ. **177**) ఖుర్ ఆన్ నేర్పిన క్షమాపాఠ మెంత ఘనమైనదో చూడుడు. పశ్చాత్తాప పడువారికి ఎంత అవకాశ మిచ్చుచున్నదో! ఇంతకు, ప్రవక్త వారిని కోరుచున్న దేమి? ఆధ్యాత్మిక సంపదనిచ్చి సంపన్నులు కండనియేకదా వారిని కోరుచున్నది? మరి దానిని వారేల నిరాకరించుచున్నారని ఖుర్ ఆన్ ప్రశ్నించుచున్నది.